# మతతత్వంపై

## బాలగోపాల్



# మతతత్వంపై బాలగోపాల్

హైదరాబాద్ బుక్ ట్రస్టు

ధర : రూ. 150/-
తొలి ముద్రణ : అక్టోబర్, 2010
కవర్ డిజైన్, అట్టమీద
అక్షరాలు : అఖిల శేషసాయి
ప్రతులకు, వివరాలకు : హైదరాబాద్ బుక్ ట్రస్ట్,
ప్లాట్ నెం. 85, బాలాజీ నగర్
గుడిమల్కాపూర్, హైదరాబాద్ - 500 067
ఫోన్ : 23521849
www.hyderabadbooktrust.blogspot.com

---

ముద్రణ : అనుపమ ప్రింటర్స్, గ్రీన్ వ్యూ, 126 శాంతినగర్,
హైదరాబాద్ - 28 ఫోన్ : 23391364, 23304194
Email: anupamaprinters@yahoo.co.in

# ప్రచురణకర్తల మాట

మతతత్వంపై, ప్రత్యేకించి హిందూత్వంపై డా.కె.బాలగోపాల్ రాసిన వ్యాసాలను హైదరాబాద్ బుక్ ట్రస్ట్ ఈ పుస్తకం ద్వారా మీ ముందుంచుతోంది. 1983 నుండి 2009 దాకా 27 ఏళ్ళపాటు పత్రికలకు వ్యాసాలుగా, పుస్తకాలకు ముందుమాటలుగా, సభలలో ఉపన్యాసాలుగా, కరపత్రాలుగా చేసిన రచనలు ఇవి. వివిధ సందర్భాల కోసం రాసినవి కావడంవల్ల కొంత పునరుక్తి ఉండవచ్చు. హిందూత్వం మైనారిటీ ప్రజలకే కాక దళితులు, ఆదివాసులు, స్త్రీలకు కూడా ప్రమాదకరమని, మొత్తం భారతదేశ ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని బాలగోపాల్ తొలినాటి నుండి ఎంత గాఢంగా విశ్వసిస్తూ, ఎంత గట్టిగా దాన్ని ప్రతిఘటిస్తూ వచ్చారో మీకు ఈ వ్యాసాలలో కనబడుతుంది. మన జీవితాలపై హిందూత్వ ప్రభావం తాలూకు విభిన్న అంశాలను తడిమే ఈ వ్యాసాలను మూడు విభాగాలుగా విభజించాం.

మొదటి భాగం **హిందూ ధర్మం – ప్రజాస్వామ్యం**లో దేశభక్తి, హిందూమతం, వర్ణవ్యవస్థ, ప్రజాస్వామ్యం నుంచి వర్ణవ్యవస్థను వేరు చేయాల్సిన అవసరం వంటి అంశాలపై రాసిన వ్యాసాలున్నాయి.

రెండవ భాగం **హిందూత్వం – విద్య**లో విద్యారంగ కాషాయీకరణ గురించి రాసిన వ్యాసాలున్నాయి. వీటిలో భారతదేశానికీ, దాని పరిపాలకులకూ సంబంధించిన చారిత్రక వాస్తవాలు ఏమాత్రం వక్రీకరించకుండా విద్యార్థులకు లౌకికత విలువలను బోధించాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు.

మూడో భాగం **మైనారిటీలు – సంఘ్ పరివార్**లో ముస్లిం, క్రైస్తవ తదితర మైనారిటీ మతస్థులపై జరిగే దాడులకూ, అణచివేతకూ హిందూత్వ సిద్ధాంతం ఎలా దోహదం చేస్తోందో చెప్పారు. బాబ్రీ మసీదు కూల్చివేత, గుజరాత్ మారణకాండ, క్రైస్తవులపై పెరుగుతున్న దాడులు ఈ భాగంలో చర్చించబడ్డాయి.

ఆయా చారిత్రక సంఘటనలను ఒక క్రమపద్ధతిలో అర్థం చేసుకునేందుకు వీలుగా వుంటుందన్న ఉద్దేశంతో ఈ మూడు భాగాలలోని వ్యాసాలన్నింటినీ తేదీల క్రమంలో పొందుపరచడం జరిగింది.

ఈ వ్యాసాలను సేకరించి యిచ్చిన వేమన వసంతలక్ష్మి , వి.ఎస్. కృష్ణ, మన్నెం బ్రహ్మయ్య తదితరులకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియ జేసుకుంటున్నాం.

**– హైదరాబాద్ బుక్ ట్రస్ట్**

# విషయసూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | | vi - xiv |
| **హిందూ ధర్మం - ప్రజాస్వామ్యం** | | 1 |
| 1. | దేశభక్తి | 3 |
| 2. | శ్రామికుడిని శ్రమదోపిడీకి లోనయ్యేలా చూడటం మతం కర్తవ్యం | 22 |
| 3. | హిందూ మతరాజ్యం | 35 |
| 4. | బ్రాహ్మణ ధర్మంలో ప్రజాస్వామ్యం | 45 |
| 5. | పర్సనల్ చట్టాలు : ఏకీకరణ కాదు, ప్రజాస్వామీకరణ జరగాలి | 121 |
| 6. | నిచ్చెనమెట్ల వర్ణధర్మం ప్రస్తావన ఎందుకుండదు? | 125 |
| **హిందూత్వం - విద్య** | | 131 |
| 7. | చదువును గురించి మాట్లాడటమూ కుట్ర అవుతుందా? | 133 |
| 8. | చరిత్ర పాఠాలపై కాషాయం నీడ | 138 |
| 9. | విద్య, విజ్ఞానం : హిందూత్వవాదుల దాడిని ఎదుర్కొవడానికి మనం సిద్ధమేనా? | 160 |
| 10. | విద్య–భావజాలం | 167 |
| 11. | పాఠ్యాంశాలలో హిందూత్వవాదుల జోక్యాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? | 173 |
| 12. | లౌకిక ప్రజాస్వామిక విలువలు | 177 |
| **మైనారిటీలు - సంఘ్ పరివార్** | | 185 |
| 13. | హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం ! | 187 |
| 14. | క్రైస్తవం పైన దాడులను వ్యతిరేకిద్దాం | 201 |
| 15. | ముంబయిలో ఆ రోజు | 206 |

16. సంఘ్ పరివార్‌పై అవగాహనాలోపం ఎవరికీ లేదు 210
17. 'కమల' వికసనంలో ఎవరి చేయి ఎంత? 215
18. పోప్‌ను ఏమడుగుతారు?ఏం చెప్తాడు? 220
19. జాతి ఆకాంక్ష కాదు మానవతకు అవమానం 224
20. హిందూత్వవాదుల లక్ష్యమేమిటి? 228
21. ముల్లా మహమ్మద్ ఉమర్‌కు సలాములు 232
22. అయోధ్యలో ఏ కరసేవా జరగనక్కరలేదు... జరగనివ్వొద్దు 236
23. సంఘ్ పరివార్‌ను గట్టిగా ఎదుర్కోవడం అవసరం 240
24. హిందూత్వవాదుల ద్వేషం ఎవరి మీద? 244
25. ఏది పాకిస్తాన్ కుట్ర? 249
26. ఇంకెక్కడా మరొక గుజరాత్ కాకుండ చూడడం
ప్రజాతంత్ర ఉద్యమాల కర్తవ్యం 252
27. అశోక్ గెహలాట్‌కు అభినందనలు 257
28. గుజరాత్‌లో అన్నికేసులూ బెస్ట్ బేకరీ కేసులే కాబోతాయా? 261
29. సంఘ్ పరివార్ పైన పోరు 265
30. దేశాన్ని 'వెలిగించ'డానికి తగలబెట్టడమూ ఒక మార్గమే 268
31. భాజపా 'విజన్' – మతోన్మాద ఫాసిజానికి ముసుగు 273
32. ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరితీయాలి? 278
33. తిరుమలలో మతరాజ్యం కావాలా ? 284
34. హిందుత్వ అజెండాలో ఆదివాసులు 288
35. సంఘ్‌పరివార్ హింసాకాండను వ్యతిరేకిద్దాం రండి 293
36. ఆదివాసీ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను తిరస్కరిద్దాం 299

# కష్టమైనా ఇదొక్కటే దారి

ఉత్తర భారతదేశంలో 1980ల చివర పెల్లుబికిన హిందూమతతత్వం, ఆ తర్వాతి రెండు దశాబ్దాలలో మరింత క్రూరత్వం సంతరించుకుని దక్షిణాది రాష్ట్రాలలోని మారుమూల ప్రాంతాలకు సైతం విస్తరించింది. సహజంగానే దీనికి కారణాలు వెతికేందుకు, ఈ ధోరణిని విశ్లేషించేందుకు అనేకమంది సిద్ధాంత వేత్తలు, సామాజిక కార్యకర్తలు ప్రయత్నించారు. అయితే ఎక్కువ భాగం విశ్లేషణలు హిందూత్వ లక్షణాలు, పని పద్ధతులకు సంబంధించే జరిగాయి. అంటే హిందూత్వం రూపురేఖలేమిటి, దానికి బలాన్నిచ్చే ప్రధాన భావనలేమిటి, హిందూత్వ శక్తులు ఒక కొత్త రంగంలోకి ప్రవేశించి ఆధిపత్యాన్ని నెలకొల్పుకునే మార్గాలేమిటి మొదలైన ప్రశ్నలకు జవాబులు వెతికే ప్రయత్నాలే ప్రధానంగా జరిగాయి. ఇవి ముఖ్యమైన ప్రశ్నలే. వీటికొచ్చిన జవాబుల బలంతోనే వామపక్ష లౌకిక శక్తులు హిందూత్వంతో తొలిదశలో తలపడగలిగాయి కూడా. ఒక సిద్ధాంతంగా హిందూత్వాన్ని ఎదుర్కొనడానికి – అంటే దానిలోని అసంగతాలను సవాలు చేయడానికి, దాని అబద్ధపు పునాదులను ఎండగట్టడానికి, ఆ రకమైన భావజాలం వల్ల ప్రపంచానికి రాగల ప్రమాదాన్ని గురించి హెచ్చరించడానికి వామపక్ష లౌకిక శక్తులకు ఆనాడు ఈ జవాబులే ఉపయోగపడ్డాయి.

అయితే ఈ విధమైన విశ్లేషణకు నోచుకోని మరికొన్ని ప్రశ్నలున్నాయి. 'హిందూత్వం అంటే ఏమిటి?', 'అది ఎలా పనిచేస్తుంది?' లాంటి ప్రాథమిక ప్రశ్నలు కాకుండా 'హిందూత్వం ఎందుకు?' 'అది ఏ పరిస్థితుల్లో విస్తరిస్తోంది?' లాంటి సంక్లిష్ట ప్రశ్నలకు సవివరమైన సమాధానాలు ఇంకా రావాల్సి ఉంది. 1980 దశకం మధ్యభాగంలో హిందూత్వం ఉన్నట్టుండి ఒక ఉప్పెనలా ఎందుకొచ్చింది? దీనికీ, ఇదే కాలంలో ముందుకొచ్చిన నయా ఉదారవాదానికీ (neo liberalism) మధ్య ఏమైనా సంబంధం ఉందా? ఉంటే ఎలాంటి సంబంధం? అంత ఉవ్వెత్తున వచ్చి కూడా అది కొన్నిచోట్ల ఎందుకు ప్రాబల్యం సంతరించుకోలేక పోయింది? ఉదాహరణకు గుజరాత్‌లో విస్తరించినట్లు బీహార్‌లో ఎందుకు

విస్తరించలేకపోయింది? ఉత్తర భారతంలో అల్లుకుపోయినట్లు దక్షిణ భారతదేశంలో ఎందుకు అల్లుకుపోలేక పోయింది? – ఇవన్నీ ఆ రెండో కోవలోకి వచ్చే ప్రశ్నలు.

ఈ ప్రశ్నలు ఎవరూ వేయలేదని నేను అనడం లేదు. వేసిన సందర్భాలున్నా తక్షణ రాజకీయాల స్థాయిలో మాత్రమే వాటి పరిశీలన జరిగిందని నా అభిప్రాయం. అంటే జర్నలిజం స్థాయిలో. హిందూత్వం కొన్నిచోట్ల ఎందుకు విజయవంతమైందీ, కొన్నిచోట్ల ఎందుకు విఫలమైందీ వివరించే పత్రికా కథనాలు మనం ఎన్నో చదివాం. మండల్ అమలును నీరుకార్చేందుకు మందిర్ రాజకీయాలను తెరపైకి తెచ్చారని కూడా పత్రికలు రాశాయి. అది నిజం కూడా. గుజరాత్‌లో 1990 దశకం ఆరంభంలో కాంగ్రెస్ పార్టీ క్షత్రియ, హరిజన, ఆదివాసీ, ముస్లిం కూటమి (KHAM) ద్వారా హిందూత్వ విస్తరణను కొంతకాలం ఆపగలిగిందనీ పత్రికలు రాశాయి. ఉత్తరప్రదేశ్, బీహార్ ఎన్నికలలో హిందూత్వం గెలుపోటములకు ఆయా రాష్ట్రాల కుల ఓటు బ్యాంకులలో వచ్చిన మార్పులు, చీలికలే కారణమనీ పత్రికల్లో కథనాలు వచ్చాయి. ఇవన్నీ సహేతుకమైన వివరణలు, విశ్లేషణలే. కాని హిందూత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఇవి సరిపోవు. నిచ్చెనమెట్ల కులవ్యవస్థ హిందూత్వాన్ని ఎలా ఆమోదించగలిగింది? నయా ఉదారవాద పెట్టుబడిదారీ విధానం కులాన్ని తనలో ఇముడ్చుకోగలిగిందంటే ఏ పద్ధతులలో అది ఆ పని చేయగలిగింది? అలాగే భారతదేశంపై నయా ఉదారవాదం ఉవ్వెత్తున విరుచుకు పడుతున్న సమయంలోనే హిందూత్వం విజృంభించడానికి ఏ శక్తులు దోహద పడ్డాయి వంటి ప్రశ్నలకు పత్రికలు చేసే స్థూల పరిశీలనలు సరిపోవు.

ఈ ప్రశ్నలన్నిటికీ ఒక క్రమబద్ధమైన చట్రంలో సమాధానాలు వెతుక్కోవాలంటే ఒక భిన్న పరిశోధనా పద్ధతిని అవలంబించడం అవసరం. ఆ పనిచేసే పరిశోధకులకు ప్రపంచ పరిణామాలను అర్థం చేసుకోగల చారిత్రక దృక్పథం, దానితోపాటు దేశీయ ప్రాంతీయ స్థానిక పరిస్థితులను లోతుగా అర్థంచేసుకోగల నిశిత దృక్పథం రెండూ ఉండడం చాలా అవసరం.

ఈ రెండూ ఉన్న అరుదైన వ్యక్తులలో కె. బాలగోపాల్ ఒకరు. చారిత్రక పరిశీలనా పద్ధతిపట్ల నిబద్ధతతోపాటు పోరాట కార్యక్షేత్రాలతో నిత్య సజీవ సంబంధం ఉండడం వల్ల ఆయన ఒక మొత్తం తరానికంతటికీ సిద్ధాంత మార్గదర్శి కాగలిగారు. సామాజిక పరివర్తనకుండే చారిత్రక స్వభావంపై ఆయనకు ఎంత

క్షుణ్ణమైన అవగాహన ఉందో స్థానిక వాస్తవికతలోని లోతుపాతుల గురించి కూడా అంతే ఎరుక ఉంది. ఆయనకున్న ఈ రెండు రకాల సామర్థ్యాన్నీ ప్రతిఫలిస్తుంది ఈ సంకలనం. పోరాటాలలోని సామాన్య జనం తమ సమస్యలను ఎలా పరిష్కరించుకున్నారో జాగ్రత్తగా గమనించడం ద్వారా ఆయన సైద్ధాంతిక రంగం లోని సందిగ్ధతలకు జవాబు వెతుక్కున్నారు. ఈ గుణమే ఆయన రచనలకు ఒక విలక్షణ క్రియాశీలతను కల్పించింది. ఆయన ఈ వ్యాసాలు రాసిన 1983–2009 మధ్య కాలం హిందూత్వం పెనుమార్పులకు లోనైన కాలం కూడా కాబట్టి ఆ మార్పులపట్ల ఆయన అవగాహనంతా ఇందులో ప్రతిఫలిస్తుంది. అయితే 1990 దశకం మొదట్లో రాసిన వ్యాసాలలో దేశ రాజకీయార్థిక వ్యవస్థలో రాగల మార్పుల గురించి ఎక్కువ ఆందోళన కనిపిస్తుంది. నయా ఉదార వాదం హిందూత్వాన్ని కలుపుకుని భారతదేశాన్ని సంపూర్ణ పెట్టుబడిదారీ వ్యవస్థగా మార్చేయగలదన్న ఆందోళన అది. ఇక్కడ ఒక విషయం చెప్పాలి. అప్పటిదాకా అమలవుతున్న అభివృద్ధి రాజ్య విధానం (Developmentalist State) విఫలమవడంతో ఆ వైఫల్యాన్ని కప్పి పుచ్చడానికే పాలకవర్గాలు హిందూత్వాన్ని ఆశ్రయించారనే బాలగోపాల్ వాదనతో కొందరు విభేదించవచ్చు. కాని అది కొట్టిపారేయదగ్గ వాదనయితే కాదు. ఆయన ఇందులోని తొలి వ్యాసాలు రాసేనాటికి నయా ఉదారవాదం, హిందూత్వం రెండూ అప్పుడప్పుడే విస్తరిస్తున్నాయి. అయినా అభివృద్ధి రాజ్య విధానం వైఫల్యాన్నే కాక అప్పుడే కొత్తగా ప్రవేశించిన నయా ఉదారవాద పోకడలను, ఈ మార్పులో హిందూత్వం పోషించబోయే పాత్రను కూడా ఆయన అప్పటికే పరిశీలించడం ఆరంభించారు.

దీనంత ప్రస్ఫుటంగా లేకపోయినా ఆయన తన తొలి వ్యాసాలలో దృష్టి పెట్టిన అంశం మరొకటి ఉంది. అది బ్రాహ్మణత్వం; హిందూత్వ సిద్ధాంతానికి పునాదిగా ఉన్న బ్రాహ్మణ ధర్మవ్యవస్థ. ఆనాడు అది ప్రస్ఫుటంగా కనిపించక పోవడానికి, భారత సామాజిక రాజకీయ వ్యవస్థలలో కులానికున్న కేంద్రస్థానం గురించి ఆయన తర్వాతి రచనలలో ఎక్కువగా కనిపించడానికి మధ్య మేధావిగా బాలగోపాల్ ఎదిగిన క్రమం ఉంది. వ్యవసాయ శూద్రకులాలకు హిందూత్వంతో, నయా ఉదారవాదంతో ఉండగల సంబంధాన్ని, మార్గాలను అర్థం చేసుకోవడానికి ఆయన చేసిన ప్రయత్నం కూడా ఈ తొలివ్యాసాలలో మనకు కనిపిస్తుంది. భారత

దేశంలో విస్తరించబోయే పెట్టుబడిదారీ వ్యవస్థకు – నానాటికీ తీవ్రరూపం ధరించబోయే కులవైరుధ్యాలు ఎలా ఆలంబన కానున్నాయో ఆయన అప్పటికే వివరించే ప్రయత్నం చేశారు. హిందూమతతత్వానికి కారణాలు వెతికే క్రమంలో బాలగోపాల్ చేసిన ఈ సిద్ధాంత ప్రతిపాదన నా దృష్టిలో ఆయన ప్రతిపాదనల్లో కెల్లా మౌలికమైనది.

తొలి రచనల్లో నయా ఉదారవాద దృక్పథం ప్రధానంగానూ, కుల వ్యవస్థ విశ్లేషణ అంతర్లీనంగాను ఉంటే మలి రచనల్లో ఇది తిరగబడినట్టు కనిపిస్తుంది. 'చరిత్ర పాఠాలపై కాషాయం నీడ' వ్యాసంలో ఆయన చారిత్రక ఆధారాల్తో దక్షిణ ఆసియా సాంస్కృతిక వైవిధ్యతకు హిందూత్వం ఎట్లా గొడ్డలిపెట్టు వంటిదో వివరిస్తారు. బ్రాహ్మణత్వం ఏ రకంగా సమకాలీన హిందూత్వాన్ని రూపొందించ డానికి దోహదపడిందో చారిత్రకంగా తెలియజేస్తారు. ఈ వివరణలు చాలావరకు 'హిందూత్వం ఏమిట'న్న మన మొదటి ప్రశ్నకు జవాబనిపించేలా ఉన్నా ఇక్కడ కూడా 'విద్యారంగంపట్ల హిందూత్వానికి ఎందుకింత శ్రద్ధ?' అనే ఆలోచనాత్మక ప్రశ్నను లేవదీస్తారాయన. 'రాజ్యాధికారం సాధించిన వెంటనే హిందూత్వశక్తులు విద్యను, దాని బోధనాంశాలను సమూలంగా మార్చివేయాలని ఎందుకు భావించారు?' అని అడిగి దానికి జవాబుగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ఎంతో మౌలికమైన 'వ్యక్తి' అనే భావన భారతదేశ పెట్టుబడిదారీ వ్యవస్థకొచ్చేసరికి ఇంకా అనిర్దిష్టంగానే ఉండి పోయిందని చాలా కీలకమైన సూచన చేస్తారు. ఈ దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థకు కులంతో ఉండబోయే సంబంధాన్ని ఆయన స్పష్టంగా చూశారు. అలాగే విద్య విషయంలో హిందూత్వ శక్తుల ఆసక్తికి, మన అంతరాల సమాజంలో స్వేచ్ఛా విపణికి సానుకూలురైన 'వ్యక్తుల' రూపకల్పనకు ఎక్కడ లంకె ఉందో కూడా బాలగోపాల్ అర్థం చేసుకున్నారు. భావ సంపన్నమైన ఈ రచనలను అర్థం చేసుకోవడం కొంచెం కష్టమే కాని నా అభిప్రాయంలో ఈ విషయాలను అర్థం చేసుకోగల మరో మార్గమేదీ లేదు. బాలగోపాల్ సూచించినట్లుగా కులమూ, నయా ఉదారవాదమూ కలిసిపోయిన చట్రంలో నుంచే హిందూమతతత్వం పెరగడానికి సైద్ధాంతిక కారణాలను మనం వెతికి పట్టుకోవాల్సి ఉంటుంది.

మతతత్వంపై బాలగోపాల్ రాసిన వ్యాసాలలో నేను చదివిన మొదటిది 'డిసెంబర్ 6, 1992 ఎందుకు జరిగింది?' అనే ఆంగ్ల వ్యాసం (అది ఇందులో

లేదనుకోండి). బాబ్రీ మసీదు కూల్చేసిన నాలుగైదు నెలలలోపే ఆయన ఈ వ్యాసం రాశారు. కులమూ, నయా ఉదారవాదమూ మిలాఖతయిన నేపథ్యంలోనే హిందూమతతత్వం పెరగడం ప్రారంభించిందని ఆయన అందులో చేసిన సైద్ధాంతిక విశ్లేషణకు నేను చాలా ఆకర్షింపబడ్డాను. ఆయన వాదనలతో నేను అన్నిసార్లూ ఏకీభవించకపోయినా హిందూమతతత్వాన్ని గట్టిగా ఎదుర్కోగల పరిస్థితి అంటూ ఎప్పటికైనా వస్తే అందుకు ఆయన చూపెడుతున్న మార్గం చాలా కీలకమైనదని నాకు అర్థమైంది. నేనున్న ప్రదేశం (అమెరికా) కారణంగా హిందూత్వాన్ని అర్థం చేసుకోవడం నాకు మరింత అవసరమైంది. అమెరికా నుంచి, అమెరికాలోను కూడా నేను హిందూత్వంపై పోరాడుతున్నందువల్ల బ్రాహ్మణత్వానికి, హిందూత్వానికి మధ్యనున్న స్పష్టమైన లంకె నాకు బోధపడింది. ఎందుకంటే అమెరికాలో ఉన్న ప్రవాస భారతీయు లందరూ దాదాపుగా అగ్రవర్ణ, పట్టణ మధ్యతరగతి జనమే.

ఒక సంవత్సరం పోయాక 1994లో ఒక విశ్వహిందూ పరిషత్ ప్రచారక్ ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో మాట్లాడిన ఒక సభకు నేను వెళ్ళాను. అది హిందూ విద్యార్థి మండలి ఏర్పాటు చేసిన సభ. వచ్చినవాళ్ళంతా అగ్రవర్ణ హిందూ అమెరికన్లలోని రెండవ తరం మనుషులు. అమెరికన్ షేర్ మార్కెట్ (వాల్ స్ట్రీట్)లో లాభార్జనకు భగవద్గీత ఎలా దోహదపడుతుందో బోధించాడు ఆయన వాళ్ళకు! బాలగోపాల్ చేసిన విశ్లేషణ గురించి ఆలోచిస్తూ ఆ సభ నుండి బయటకు రావడం గుర్తుంది నాకు. ఆ విశ్లేషణ విలువైందని నాకు తెలుసు కాని ఎలా అనేది నాకప్పటికి పూర్తిగా తెలియదు. బాలగోపాల్ ఈ విశ్లేషణ చేసి దాదాపు రెండు దశాబ్దాలు గడిచిపోయినా ఇన్నేళ్ళలో దాన్ని ముందుకు తీసికెళ్ళే ప్రయత్నాలు చేసినవాళ్ళు చాలా తక్కువమందే కనిపిస్తున్నారు. ఈ విశ్లేషణా చట్రాన్ని మరింత విపులీకరించే సమయం బాలగోపాల్‌కు ఉండుంటే బాగుండేదని మాత్రమే నేను ఇవ్వాళ అనుకోగలను. ఆయన చూపిన మార్గంలో ఈ సైద్ధాంతిక కృషిని పూర్తిచేయవలసిన బాధ్యత ఉమ్మడిగా మనందరి మీదా ఉంది. ఆయనపట్ల మనం నెరవేర్చవలసిన బాధ్యత కూడా అది. ఇది కనక మనం చేయగలిగితే హిందూత్వంపై జరిగే పోరాటానికి ఎంతో బలం ఇచ్చినవాళ్ళమవుతాం. బాలగోపాల్ విశ్లేషణను ముందుకు తీసికెళ్ళగల ఒక మార్గం ఏమిటంటే ఏ అభివృద్ధి రాజ్య (Developmentalist

State) వైఫల్యం హిందూత్వం పెరగడానికి దారితీసిందని ఆయన సోదాహరణగా చూపించే ప్రయత్నం చేశారో వాటి గురించి మనం మరింత సీరియస్‌గా ఆలోచించడం మొదలుపెట్టాలి.

అభివృద్ధి రాజ్య ఆధిపత్యాన్ని ధ్వంసం చేయడం నయా ఉదారవాదం అజెండాలో ఒక భాగం. అది దాని తొలిదశ అజెండా. అంటే 1990 నుండి 2000 దశకం మధ్య దాకా సాగిన కాలం. అయితే అభివృద్ధి రాజ్యం అనేక దశాబ్దాలపాటు పెంచి పోషించిన మరో ఆధిపత్య భావన అలాగే ఉంది. అది అఖిల భారతీయతా భావన (Pan Indian identity). నయా ఉదార వాదానికి, దానిలో భాగమై వస్తు వ్యామోహ పరుడుగా, స్వార్థపరుడుగా మారిన మనిషికి ఈ అఖిల భారతీయతా భావన అడ్డంకిగా మారింది. అవి ప్రాబల్య స్థానానికి రావాలంటే ఈ అఖిల భారతీయతను ఛిన్నా భిన్నం చేయాలి. అతి తక్కువ వ్యవధిలో వందలాది అస్తిత్వ ఉద్యమాలు ఆ దశలో రావడాన్ని మనం ఈ నేపథ్యంలో అర్థం చేసుకోవాలి.

ఇలా అంటున్నానంటే నేను అఖిల భారతీయతా భావనను సమర్థిస్తున్నానని భావించకండి. జరిగిన పరిణామాన్ని వివరిస్తున్నానంతే.

ఈ భావన ఒక శిష్ట (elite) వర్గానికి మూడు దశాబ్దాలకు పైబడి బాగానే ఉపయోగపడింది. ఆ వర్గంలో ఎవరున్నారంటే జాతీయోద్యమ చివరి దశలో, స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ఏర్పడ్డ వాణిజ్య వ్యాపార సంస్థలు, 1950లు 1960లలో అత్యంత సంపన్నులుగా మారిన భూస్వాములు (సోషియాలజిస్టులు వీరినే కులక్‌లని పిలిచారు) ఉన్నారు. అంత ప్రయోజనం పొందినా వారు కూడా ఈ భావనను వదులుకోవడానికి సిద్ధపడ్డారు. ఎందుకంటే ప్రపంచీకరణ తర్వాత దాన్ని వదులుకోవడంవల్లే లాభపడతామనే నమ్మకం వాళ్ళకు వచ్చేసింది. ఇంకోవైపు నాలుగు దశాబ్దాల అభివృద్ధి రాజ్య విధానం నుంచి ఏమీ పొందని అనేకానేక సమూహాలు ఈ అఖిల భారతీయతా భావనను కూలదోయడానికి అప్పటికే సంసిద్ధంగా ఉన్నాయి. అభివృద్ధి రాజ్యవ్యవస్థను ఉపయోగించుకుని కొన్ని శూద్ర కులాలు మాత్రమే పైకి రాగలవనేది వాళ్ళకు అప్పటికి అర్థమైంది. (డొనేషన్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీల ఏర్పాటులో, ప్రభుత్వ యంత్రాంగంలోని ఉన్నత పదవులలో వారే కనిపించడం ఇందుకు కొన్ని ఉదాహరణలు). ఫలితంగా

నగరాలకు వలసపోయిన కొద్దిమంది మధ్యతరగతి ఆంగ్ల విద్యాధికులు మినహా మిగతా అందరూ బలమైన కేంద్రం అనే భావన నుంచి దూరంగా జరిగిపోయినట్లే కనిపించారు. కొందరైతే ఈ రెండు పరిణామాలనూ – అంటే అఖిల భారతీయతా భావన, అభివృద్ధి రాజ్య భావన బలహీనపడటాన్ని – ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసే వాంఛనీయ పరిణామంగా కూడా చూశారు.

ఏమైతేనేం ఒకే కేంద్రబిందువు నుంచి భారతీయులందరి ఉమ్మడి ప్రయోజనాలు నెరవేరతాయనే భావనను వదులుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. నానాటికీ పెరుగుతున్న ప్రాంతీయ, కుల, మత, అస్తిత్వ ఉద్యమాలు పెట్టుబడిదారీ వ్యవస్థ కుట్ర ఫలితమన్న భావనను కూడా విడనాడాల్సిన స్థితి వచ్చింది. ఒక పోలిక చెపితే ఈ విషయం బాగా అర్థమవుతుందేమో. అఖిల భారతీయతా భావనతో కూడిన అభివృద్ధి రాజ్యం జాతీయోద్యమ కాలం నుండి స్వాతంత్ర్యానంతర కాలం దాకా ఒక బ్రహ్మాండమైన భవంతిని కట్టిందని అనుకుంటే – పెట్టుబడిదారీ వ్యవస్థ ఆ భవంతికి కవచంగా ఉన్న సిమెంట్‌ను ఊడదీయడానికి ప్రయత్నించింది. దాంతో రకరకాల అస్థిత్వాలు మనకు కనిపించసాగాయి. కాపిటలిజం ఆ భవంతి పెచ్చులూడదీసే కొద్దీ అవి ఒక్కొక్కటిగా బయటపడి తమ తమ జాగా కోసం పోటీ పడసాగాయి. ఈ దృష్టితో చూసినప్పుడు బాబ్రీ మసీదు కూల్చివేత ప్రతీకాత్మకంగా కనిపిస్తుంది. అది హిందూత్వం కూల్చిన తొలికట్టడం కావొచ్చు కాని అనేక కూల్చివేతలకు అది ఆరంభం. అనేక విభిన్న గుర్తింపులు మళ్ళీ బయటకు వచ్చేట్టు చేసిన చర్య.

ఆరంభంలో నయా ఉదారవాదం ఎక్కడయినా సరే ఒక బ్రహ్మాండమైన కల్లోలాన్ని సృష్టిస్తుంది. మన దేశం విషయానికొస్తే హిందూత్వంతో సహా అనేక ప్రాంతీయ, కుల వాదాల పుట్టుకకు అది సారవంతమైన నేలగా ఉపయోగపడింది. కొన్ని ఉదాహరణలు చెప్పాలంటే – కులం ప్రాంతీయ, భాషా ముసుగులు ధరించి రావొచ్చు (తెలుగుదేశంలా) సోషలిజం ముసుగు ధరించి రావొచ్చు (ములాయం సింగ్ యాదవ్, లాలూ ప్రసాద్ యాదవ్‌లలా). 1990ల నుంచి ఇప్పటిదాకా ఈ విధంగా ముందుకొచ్చిన అన్ని గుర్తింపుల్లోకీ ఎన్నో హెచ్చుతగ్గులున్నప్పటికీ హిందూత్వమే ఎక్కువ వేగంగా విస్తరించిన మాట నిజం.

హిందూత్వం ఇంత వేగంగా విస్తరించడానికి ఎనిమిది దశాబ్దాల పైగా హిందూమత సంస్థగా ఆర్.ఎస్.ఎస్. ఇచ్చిన మద్దతు ఒక ముఖ్య కారణం. మిగతా

కారణాల్లో విదేశాల నుంచి వచ్చిపడే కోట్లాది రూపాయలు కూడా ముఖ్యమైనదే. కాని హిందూత్వం ఇంత వెలుగు వెలగడానికి అసలు కారణం మాత్రం శిథిలమైన అఖిల భారతీయతా భావనే. ఈ శిథిలాలు ఎన్ని ఆధిపత్య గుర్తింపులకు అవకాశం కల్పించాయో భవిష్యత్‌లో తెలుస్తుంది కాని హిందూత్వానికి సంబంధించినంత వరకు అఖిల హిందూ భావనే అఖిల భారతీయతా భావంగా చెలామణీ అయ్యే ప్రమాదం ఉంది. అయితే హిందూత్వం విఫలమయ్యే అవకాశాలు కూడా అందులోనే ఇమిడి ఉన్నాయి. ఎందుకంటే అభివృద్ధి రాజ్య వైఫల్యంలో నుంచి పుట్టిన ఇతర అస్థిత్వాలన్నిటితోనూ అది తలపడవలసి ఉంటుంది కాబట్టి. ఇక్కడ మరో విషయం చెప్పుకోవాలి. హిందూ=భారతీయుడు అనే గుర్తింపును నిర్మించడం మాత్రమే తన పని అని హిందూత్వం ఎప్పుడూ అనుకోలేదు. అటు నయా ఉదారవాదానికి ఇటు బ్రాహ్మణత్వానికి కూడా ఉపయోగపడే నూతన ఆధిపత్య భారతీయతా గుర్తింపును తీసుకురావడమే దాని లక్ష్యం. 'ఇండియా షైనింగ్' నినాదం, అణుశక్తి దేశంగా పొందిన కీర్తి – ఈ రెండూ కలిసి కొంతకాలం దానికి అటువంటి గుర్తింపునే తెచ్చిపెట్టాయి. కాని 'ఇండియా షైనింగ్' నినాదం విఫలమైంది. ఆ వైఫల్యానికి ఒక కారణం నయా ఉదారవాదం తన వెంట తీసుకొచ్చిన దుర్భర దారిద్ర్యం. రెండో కారణం అభివృద్ధి రాజ్య శిథిలాలలోనే పురుడుపోసుకున్న ఇతర కుల, ప్రాంతీయ గుర్తింపు ఉద్యమాలు. అవి హిందూత్వంలో భాగం కావడానికి ఏమాత్రం ఇష్టపడలేదు.

ఈ కల్లోలం ఇంకా ముగిసిపోలేదు. మిగిలిన అభివృద్ధి రాజ్య నిర్మాణాలను కూడా కూల్చేందుకు నయా ఉదారవాదం తన ప్రయత్నాలు తాను సాగిస్తూనే ఉంది. ఈలోగా నయా ఉదారవాదం గత 20 ఏళ్ళలో కొత్త శిథిలాలను సృష్టిస్తూ వస్తోంది. అది  ఒకవైపు ఎంత ఆర్థికాభివృద్ధిని చూపిస్తోందో, అంత పేదరికాన్ని అసమానతలను మరోవైపు పెంచుకుంటూ పోతోంది. ఈ వాతావరణం కొత్త అఖిల భారతీయతా భావన నిర్మాణానికి ఆస్కారం కల్పిస్తోంది. రాబోయే కాలంలో నయా ఉదారవాదం మరెన్నోసార్లు సంక్షోభంలో పడడం ఖాయం కనుక ఈ ఖాళీని సొంతం చేసుకోవడానికి అటు వామపక్షాలు, ఇటు మితవాద పార్టీలు కూడా ప్రయత్నిస్తాయి. అయితే ప్రతి సందర్భంలోను హిందూత్వం కొత్త ఆధిపత్య రూపాన్ని సిద్ధం చేసుకుని మిగతా గుర్తింపులను తరిమేసి తాను ముందుకు రావాలని ప్రయత్నిస్తుంది. దీనిని ఎదుర్కొంటూ అనేక గుర్తింపులను తనలో

ఇముడ్చుకోవడానికి ప్రయత్నించే ఒక మధ్యేవాద (Centrist) భారతీయతా భావన కూడా బహుశా ముందుకు వస్తుంది.

వామపక్ష లౌకిక కార్యకర్తలుగా, ఆలోచనాపరులుగా మనం ఈ కొత్త భారతీయత కోసం జరిగే సంఘర్షణను అర్థం చేసుకోవడానికి, విశ్లేషించడానికి ఇదివరకటి కంటే ఎక్కువ సిద్ధంగా ఉండాలి. అందుకోసం బాలగోపాల్ మొదలుపెట్టిన సైద్ధాంతిక విశ్లేషణను మరింత విస్తరించి, మెరుగుపరచి, విమర్శనాత్మకంగా పునర్వ్యక్తీకరించాల్సిన అవసరం ఉంది. అప్పుడే హిందూత్వాన్ని నేటి సందర్భం దృష్టిలో సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతాం. అటువంటి పనిలో భాగం కావడానికి ఈ వ్యాసాలు మనకెంతో తోడ్పడతాయి.

**-బిజు మాథ్యూ**

*తెలుగు అనువాదం :* **హారతీ వాగీశన్, వేమన వసంతలక్ష్మి**

(ఈ ముందుమాట రాయడానికి బాలగోపాల్ తెలుగు వ్యాసాలను నాతో కూచుని చదివిన నా మిత్రుడు వకుళాభరణం వంశీచరణ్‌కు కృతజ్ఞుడిని. ఈ వ్యాసం మలిభాగంలోని ఆలోచనలు ఆయనవీ, నావీ కూడా).

**బిజు మాథ్యూ,** *భారతదేశంలో మతమౌఢ్యవాదాన్ని ఎదుర్కోవడానికి గట్టి కృషి చేస్తున్న వారిలో బిజు ఒకరు. 'స్టాప్ ఫండింగ్ హేట్' పేరుతో ఆయన అమెరికా నుండి ఇండియాకు మతవిద్వేషాలను రెచ్చగొట్టడానికి వస్తున్న నిధులను అడ్డుకునే పెద్ద కార్యక్రమం చేపట్టారు. ఆర్ఎస్ఎస్‌కు మిలియన్ల డాలర్లు ఎలా అందుతున్నాయో ఆయన తన పరిశోధన ద్వారా బయటపెట్టారు. 'ది ప్రోటీన్ ఫార్మ్స్ ఆఫ్ యాంకీ హిందూత్వ' (అమెరికా హిందూత్వపు పౌష్టిక రూపాలు) పుస్తకానికి సహ రచయిత. 'టాక్సీ క్యాబ్స్ అండ్ కాపిటలిజం ఇన్ న్యూయార్క్' (కార్నెల్ యూనివర్సిటీ ప్రచురణ 2008) పుస్తక రచయిత. ఆయన ఈ ముందుమాటకు పెట్టిన శీర్షిక* Theory in a moment of Flux : Hindutva, Capitalism, Caste *(కల్లోల సందర్భంలో సిద్ధాంత నిర్మాణం : హిందూత్వం, పెట్టుబడిదారీ వ్యవస్థ, కులం).*

# హిందూ ధర్మం - ప్రజాస్వామ్యం

# 2

# దేశభక్తి

'దేశభక్తి' అనేది కమ్యూనిస్టులకు సులభంగా మింగుడుపడని మాట. శ్రామికవర్గ అంతర్జాతీయత ప్రాతిపదికగాగల దృక్పథానికి దేశభక్తి సహజంగానే సంకుచితంగా కనిపిస్తుంది. దేశం అనేది అవిభక్తమయిన ఏకశిలా నిర్మాణం (monolith) అనే ఆలోచన 'దేశభక్తి' అనే భావనలో అంతర్లీనంగా వుంది కాబట్టి శ్రామికవర్గ పక్షపాతం ఉన్నవాళ్ళకు అది సహజంగానే దోపిడీ వర్గాల కుట్రగా అనిపిస్తుంది. పైగా 'భక్తి' అనే ఫ్యూడల్ మాట అంతే సహజంగా శాస్త్రీయ దృక్పథం ఉన్న వారెవ్వరికైనా కంపరం పుట్టిస్తుంది. 'భక్తి' అనగానే గుడ్డి విశ్వాసం, మూఢ ఆరాధన స్ఫురిస్తాయి.

కాని కమ్యూనిస్టులకు ఇష్టం ఉన్నా లేకున్నా, వాళ్ళు ఈ మాటను తరచు ఎదుర్కోక తప్పదు. వలస, అర్ధవలస దేశాలలో జాతీయతత్వం బలంగా వుంటుంది. కాబట్టి ఫలానా వారికి 'దేశభక్తి' లేదనే ఆరోపణ చాలా తీవ్రమయినది. మూడవ ప్రపంచ దేశాలలో తిరోగామి శక్తులు కమ్యూనిస్టులమీద, ఇతర ఆధునిక భావాల ప్రతినిధుల మీద (ఉదాహరణకు విజ్ఞానశాస్త్రం) ఈ ఆరోపణవేసి ప్రజలలోని జాతీయతత్వాన్ని తమ ప్రయోజనాల కోసం వాడుకోవడం సర్వసాధారణంగా జరుగుతూన్న విషయం. ఇండోనేషియాలో సుకర్ణో నుండి ఇరాన్‌లో ఖొమైనీ వరకు ఎవ్వరూ దీనికి మినహాయింపు కాదు. అట్లాగని వీళ్ళు మనస్ఫూర్తిగా కమ్యూనిస్టులను దేశద్రోహులుగా నమ్ముతారా అంటే అదీ లేదు. తమ ప్రయోజనాల కోసం కమ్యూనిస్టులతో కావలసినంతకాలం సఖ్యంగా వుండి ఆ అవసరం తీరిన తరువాతే వీళ్ళలో ఎవ్వరికైనా కమ్యూనిస్టులలో దేశభక్తి రాహిత్యం కనబడింది. ఇందిరాగాంధీకి 1968లో కాంగ్రెస్‌ను చీల్చిన నాటినుండి 1971లో అత్యధిక మెజారిటీతో గెలిచేదాకా సిపిఐ, సిపిఐ(ఎం)ల మద్దతు పార్లమెంటులో తన మనుగడ కోసం అవసరమయింది. 1973 తరువాత గుజరాత్ బీహార్‌లలో చెలరేగిన తిరుగుబాట్లను 'ఫాసిస్టు' మూకల దాడులుగా చిత్రీకరించడానికి సిపిఐ

---

ఎన్.కె. రామారావు దీర్ఘ కవిత 'లాల్ బనో గులామీ ఛోడో బోలో వందేమాతరం'కు రాసిన ముందుమాట, జనవరి, 1983, సృజన ప్రచురణలు

మహామేధావుల సిద్ధాంతచాతుర్యం అవసరమయింది. ఈ అవసరాలన్నీ తీరిన తరువాతే ఆమెకు కమ్యూనిస్టులు-ఇవ్వాళేకాదు, 1942 నుండి గూడ దేశద్రోహులేనని గుర్తుకొచ్చింది.

ఇట్లాంటి వాతావరణంలో 'కమ్యూనిస్టులకు దేశభక్తి లేదు' అనే ఆరోపణను కమ్యూనిస్టులు ఎదుర్కోక తప్పడంలేదు. ఎందుకంటే అది తమ రాజకీయ మనుగడకు సంబంధించిన విషయం. ఏనాడో రాజకీయాలు కోల్పోయిన సిపిఐకి, ఇందిరాగాంధీ 'దేశద్రోహ' నేరం ఆపాదించిన తరువాత, బేవార్సుగా దొరికే నాలుగువోట్లు మాత్రమే పోయాయిగానీ, ఇండోనేషియాలో కమ్యూనిస్టుపార్టీ 30 వేలమంది కేడర్‌ల ప్రాణాలను కోల్పోయింది. ఇరాన్‌లో ఇవ్వాళ కమ్యూనిస్టులే కాదు, పెటీ బూర్జువా సోషలిస్టులయిన 'ముజాహిదీన్'లు గూడ ఈ నేరానికే వేల సంఖ్యలో చెండాడబడుతున్నారు.

ఎదుర్కోక తప్పదని గుర్తించి 'దేశభక్తి' లేదనే ఆరోపణను కమ్యూనిస్టులు ఎదుర్కుంటూనే వున్నారుగాని, మామూలుగా అందుకు సమాధానంగా చెప్పే మాటలు సంతృప్తికరమయినవి కావు. దేశమంటే మట్టికాదు, అక్సాయ్‌చిన్‌లోని బండరాళ్ళు కావు, దేశమంటే గురజాడ చెప్పిన వర్గరహితులయిన మనుషులు గూడ కాదు, దేశమంటే పీడిత ప్రజలు, కాబట్టి దేశభక్తి అంటే పీడిత ప్రజా పక్షపాతం అనేది తరచుగా వినబడే సమాధానం. ఇది వేదికల మీది నుండి ఇచ్చే ఉపన్యాసాల పరిమితులకు లోబడి పుట్టిన వాదన. 'భక్తి' అనే ఫ్యూడల్ మాటకు వర్గపక్షపాతం అనే అర్థం ఇవ్వడం ఎంత తప్పో, 'నిజమైన దేశం' అంటే పీడిత ప్రజలు మాత్రమేననే భాష్యం అంతే సంశయాస్పదం. నిజానికి, మనిషన్నవాడికి దేశభక్తి ఉండాలనే ఆలోచనను వదులుకోలేక, శ్రామికవర్గ పక్షపాతాన్ని శాస్త్రీయవర్గ దృక్పథాన్ని కూడా కాదనలేక, రెంటికీ ఎలాగయినా సమన్వయం సాధించాలనే పెటీ బూర్జువా రాడికలిజం నుండి పుట్టిన వాదన ఇది. దేశం వలసగానో అర్థవలసగానో ఉన్నంతకాలం, పెటీ బూర్జువా వర్గానికి కొంత విప్లవకర లక్షణం ఉన్నంత కాలం, ఈ ప్రయత్నం కొనసాగుతూనే వుంటుంది. దాన్ని కాదనవలసిన అవసరం లేదు గాని, విషయాన్ని శాస్త్రీయంగా (అంటే దాని చారిత్రక నేపథ్యంలో) అర్థం చేసుకోవడం అవసరం.

## బూర్జువా జాతీయవాదం

'దేశభక్తి' అనేది జాతీయతత్వపు అతి తీవ్రరూపం. ఇష్టముంటే అత్యున్నత రూపం అనొచ్చు. ఇష్టం లేకుంటే అతివాదరూపం అనొచ్చు. జాతులు చరిత్రలో చాలా ప్రాచీనమయినవి గాని, జాతీయతత్వం యూరప్‌లోని బూర్జువా విప్లవాలతో పుట్టింది. పెట్టుబడిదార్లకు సురక్షితమయిన మార్కెట్లు కావాలి. వీలయితే ప్రపంచవ్యాప్తంగా కావాలి. కాని, అది సామ్రాజ్యవాదయుగం వచ్చేదాకా వీలుకాదు కాబట్టి, అంతవరకు కనీసం ఒక జాతి నివసించే ప్రాంతంలోనయినా కావాలి. అంటే ఆ జాతి ఒక దేశంగా ఏర్పడి ఒకే రాజ్యం (State) కింద వుంటూ, దేశవ్యాప్తమయిన ఒకే చట్టానికి లోబడి వుండాలి. ఆ చట్టంగూడ 'దైవదత్తం'కాక మనుష్యులు ఏర్పరచుకునేది, మనుష్యులు మార్చుకోగలిగేది కావాలి. అంటే లౌకికం (secular) కావాలి. లేకుంటే నిరంతరం మారే పెట్టుబడిదార్ల అవసరాలకు అనుగుణంగా దాన్ని మార్చడం సాధ్యంకాదు.

ఈ అవసరం ఒక్కొక్క పాశ్చాత్య దేశంలోనూ ఒక్కొక్క రూపం తీసుకుంది. అందుకే అన్ని పాశ్చాత్య దేశాలలోనూ జాతీయతత్వం ఒకేలాగ లేదు, ఆయా దేశాల చారిత్రక పరిస్థితులను బట్టి మారుతుంది. ముఖ్యంగా రెండు రకాలు కనిపిస్తాయి:

ఒక జాతి లేక దేశం ఒక లౌకికం అయిన చట్టం కింద జీవించాలంటే ప్రదేశాంతర (extra-territorial) మతాధికారం కాని, అభిమానంగాని కూడదు. అటువంటి అధికారం వుంటే బూర్జువావర్గం తన అవసరాల్ని అనుసరించి చట్టాన్నీ, పరిపాలనా పద్ధతులనూ, ముఖ్యంగా విదేశాంగ నీతినీ మార్చుకోలేదు. మతాధికారం కేవలం 'ఆధ్యాత్మిక' రంగానికే పరిమితం కావాలి. మిగిలిన రంగాలను బూర్జువా వర్గానికి వదిలేయాలి. అంటే లౌకికం కావాలి. అందుకే మొట్టమొదటి పెట్టుబడిదారీ దేశమయిన ఇంగ్లండులో జాతీయతత్వం కాథలిక్ మతాన్ని వ్యతిరేకించి ఆంగ్లజాతికి పరిమితమయిన ఆంగ్లికన్ చర్చి (Anglican Church) రూపం తీసుకుంది. కాథలిక్ మతం అంతర్జాతీయంగా ఒకే మత కేంద్రాన్నీ ఒకే మతాధికారినీ గుర్తిస్తుంది. పైగా మతం మనిషి 'ఆధ్యాత్మిక' వ్యవహారాలకు సంబంధించిన విషయం మాత్రమేననే బూర్జువా లౌకికవాదాన్ని ఆమోదించదు. మతం జీవితంలో అన్ని రంగాలకూ వర్తిస్తుందనే ఫ్యూడల్‌తత్వం

దానిది. ఆ అధికారాన్ని పురస్కరించుకొని క్రిస్టియన్ దేశాల ఆంతరంగిక వ్యవహారాలలోనూ వాటి మధ్య జరిగే తగువుల లోనూ మతాధికారులు తరచుగా తలదూర్చేవారు. ఈ జోక్యం బూర్జువావర్గం అవసరాల దృష్ట్యా అభ్యంతరకరమయినది. ఎందుకంటే ఆంతరంగిక వ్యవహారాలలో మతాధికారులు ఫ్యూడల్ ప్రభువుల పక్షం వహించేవారు. విదేశీ వ్యవహారాలలో బూర్జువా విదేశాంగనీతికి ప్రాతిపదిక అయిన పోటీకి ఈ జోక్యంవల్ల ఇబ్బంది కలిగేది. అందుకే ఎనిమిదవ హెన్రీ రాజు కాలం నుండి బ్రిటిష్ బూర్జువావర్గం కాథలిక్ మతానికి వ్యతిరేకంగా పోరాడి తమ దేశంలోని కాంటర్బరీ చర్చి కేంద్రంగా గల ఆంగ్లికన్ శాఖను ఏర్పరచుకున్నారు. తరువాతి కాలంలో ఇదే రకమయిన పరిణామం ఫ్రాన్స్, జర్మనీ, తదితర యూరప్ దేశాలలో జరిగి వివిధ ప్రొటెస్టంట్ శాఖలు ఏర్పడ్డాయి. చివరికి, సిద్ధాంతం ఎలాగున్నా, వాస్తవంలో తన ప్రదేశాంతర అధికార స్వభావాన్నీ, లౌకిక వ్యతిరేకతనూ కాథలిక్ మతం చాలా మేరకు తగ్గించుకున్న తరువాతే ఈ వెల్లువ ఆగిపోయి, ఆలస్యంగా బూర్జువా విప్లవాలు జరిగిన స్పెయిన్, ఇటలీ, పోలండ్ వంటి వెనుకబడ్డ దేశాలలో మిగిలిపోయింది.

అయితే దేశవ్యాప్తంగా వర్తించే ఒకే చట్టం వుండాలంటే ప్రదేశాంతర అధికార కేంద్రాలను దెబ్బతీస్తే చాలదు, అంతర్గతమయిన స్థానిక అధికార కేంద్రాలను గూడ దెబ్బతీయాలి. ఫ్యూడల్ సమాజం 'భగవంతుడి ఆదేశాలకు' ఎంతగా లోబడి వుంటుందో, ప్రతీ గ్రామంలోనూ ఇలాఖాలోనూ ప్రాదేశికమయిన దొరల అధికారానికి అంతగా లోబడి వుంటుంది. అది బైబిల్ భాషలో – 'యెహోవా సామ్రాజ్యం' మాత్రమే కాదు, ప్రతీ చిల్లరదేవుడి సామ్రాజ్యం గూడ. ఈ రెండింటిని గూడ దెబ్బతీస్తుంది బూర్జువా జాతీయతత్వం. ఒకవైపు తనకు అందుబాటులో వున్న ప్రాంతాన్ని తక్కిన ప్రపంచం నుండి వేరు చేసి ఒక సర్వసత్తాక (sovereign) రాజ్యాన్ని ఏర్పరుస్తుంది; అదే సమయంలో ఆ ప్రాంతానికి అంతర్గతమయిన సంస్థానాలన్నింటినీ గూడ పడగొట్టి ఒకే ఒక దేశవ్యాప్తమయిన శాసన కేంద్రాన్ని ఏర్పరుస్తుంది. లేకపోతే, ప్రతీ జాగీర్దారూ ఈనాందారూ తన ఇష్టంవచ్చిన ఆంక్షలు పెడుతూ తన ఇష్టం వచ్చినట్టు పన్నులు విధించడం, సుంకాలు సేకరించడం మొదలుపెడితే వ్యాపారం నడవదు. శాసన వికేంద్రీకరణను బూర్జువాతత్వం ఎన్నడూ సహించదు.

ఈ రెండవ అవసరం నుండి పుట్టింది రెండవరకం జాతీయతత్వం. ఇది మనకు ఇటలీలోనూ, జర్మనీలోనూ కనబడుతుంది. 19వ శతాబ్దపు మొదటి భాగంలో ఈ రెండు దేశాలూ 30–40 సంస్థానాల కలయికగా వుండేవి. ఇటలీ గురించి అయితే 'అది ఒక దేశం కాదు, భౌగోళిక అభివ్యక్తి మాత్రమే' (Italy is not a nation, but a geographical expression) అనే వేళాకోళం వుండేది. అటువంటి ఫ్యూడల్ సంస్థానాలను జర్మనీ, ఇటలీ దేశాలుగా మలచి, శాసన వికేంద్రీకరణను పోగొట్టి, ఒకే రాజ్యాంగాన్ని రూపొందించిన విప్లవాలు అక్కడి బూర్జువా విప్లవాలు. ఇటువంటి విప్లవాలలో 'జాతీయ ఐక్యత' (national integration) అనే భావన బలంగా ముందుకొస్తుంది.

ఈ రెండవది – అంతర్గతమయిన కేంద్రాలను వ్యతిరేకించే 'జాతీయ ఐక్యత' అనే భావన – మన దేశ బూర్జువా వర్గానికి చాలా ప్రధానమయినదిగా కనబడింది. ఇటలీలోనూ జర్మనీలోనూ ఉన్న సంస్థానాల కంటే ఏ పదిరెట్లో ఎక్కువ మన దేశంలో ఉండేవి. అంతకంటే ముఖ్యంగా, భిన్నజాతులూ భాషలూ మతాలూ ఉండేవి, ఉన్నాయి. వాటన్నింటినీ ఐక్యపరిచే కర్తవ్యాన్ని భారత బడా బూర్జువా వర్గం చాలా ప్రధానంగా తీసుకుంది. అందుకే గాంధీకి యూరప్‌లోని సకల జాతీయ నాయకులలోకీ ఇటలీ నాయకులయిన గారిబాల్డీ, మాజినీలు నచ్చారు గాని, ఎనిమిదవ హెన్రీ కాదు. ఈ 'జాతీయ ఐక్యత' ప్రాతిపదికగా గల జాతీయతత్వానికి చాలా బలమయిన వ్యక్తీకరణ రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్ (ఆర్.ఎస్.ఎస్.). అందుకే ఆర్.ఎస్.ఎస్. మొదటినుండీ గూడ పాకిస్తాన్ ఏర్పాటునే కాదు, భాషా రాష్ట్రాలనూ, ప్రాంతీయ భాషలలో విద్యాబోధననూ, ఫెడరల్ రాజ్యాంగాన్నీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చింది. ఫెడరలిజాన్ని గోల్వాల్కర్ 'విషబీజం' (poisonous seed) అన్నాడు. ఆర్.ఎస్.ఎస్. మన్ననలు పొందిన ఏకైక ప్రాంతీయ ఉద్యమం అస్సాం ఉద్యమం. దానికి కారణం ఆ సంస్థ తన చారిత్రక పాత్రను వదులుకుందని కాదు. అస్సాం ఉద్యమాన్ని ముస్లిం వ్యతిరేక ఉద్యమంగా మలచి, బహుశా 1947లో కోల్పోయిన 'జాతీయ ఐక్యత'ను మళ్ళీ పునరుద్ధరించవచ్చుననే దురాశ మాత్రమే. వేరే ఎక్కడా (కాశ్మీర్ నుండి నాగాలాండ్ వరకు) ప్రాంతీయ ఉద్యమాలు – ఎంత న్యాయమయినవి గూడా – ఆర్.ఎస్.ఎస్. మద్దతు పొందలేదు.

## ఆర్.ఎస్.ఎస్.

ఈ మేరకు ఆర్.ఎస్.ఎస్.కూ కాంగ్రెస్‌కూ పెద్దగా తేడాలేదు గాని, ఆర్.ఎస్.ఎస్.కు ఉన్న ప్రత్యేకత ఏమిటంటే, వెనుకబడ్డ దేశాల బూర్జువా వర్గాలకు కేవలం శాసన సంబంధమయిన జాతీయ ఐక్యత చాలదని గుర్తించడం. జాతీయతా భావం ప్రజల నరనరాల్లోనూ జీర్ణించుకుపోయి 'విశుద్ధ జాతీయతత్వం' (ఇది 'నవ భారతి' పరిభాష', నాది కాదు) అధికార తత్వమయితేనే రెండు శతాబ్దాలు ఆలస్యంగా అధికారంలోకి వచ్చిన టాటా బిర్లాలు రాక్ ఫెల్లర్, ఫోర్డులతో పోటీ పడగలరు. పెట్టుబడిదార్ల పోటీలో ముందున్నవాడు కొంత ఉదారంగా వుండగలడు. కార్మికులు 'జాతి' శ్రేయస్సును మరిచిపోయి తమ వర్గ శ్రేయస్సు కోసం సమ్మెచేస్తే ఒకసారి కాకుంటే ఒకసారి సహించగలడు. కాని వెనుకబడ్డ బూర్జువా వర్గానికి ఈ ఔదార్యం సాధ్యంకాదు. 'జాతి' పేరిట ప్రజల అవసరాల్ని తన అవసరాలకు లోబరచుకుంటే తప్ప తనకంటె ముందున్న పెట్టుబడిదార్లతో తాను పోటీపడలేనని గుర్తిస్తుంది. దానినే ఫాసిజం అంటాము. మొదటి ప్రపంచ యుద్ధంలో ఘోరంగా పరాజయం పొందిన జర్మనీ బూర్జువా వర్గం మళ్ళీ బలం పుంజుకోవాలంటే ముందు కార్మికులను అణచాలని గుర్తించి హిట్లర్ 'జర్మన్ జాతి' పేరిట సోషలిస్టులనూ కమ్యూనిస్టులనూ కార్మికవర్గ కార్యకర్తలనూ ఫాసిస్టుదాడికి గురిచేశాడు. ఫాసిజం ఎప్పుడు గూడ 'జాతి' పేరిట బూర్జువా వర్గం అవసరాలను సంరక్షిస్తుంది. ఈ దృష్టితో ఆర్.ఎస్.ఎస్. సిద్ధాంతకర్త గోల్వాల్కర్ ఆలోచనలను పరిశీలిస్తే ఆ సంస్థ స్వభావమేమిటో స్పష్టమవుతుంది. ఆర్.ఎస్.ఎస్. వ్యవస్థాపకుడు హెడ్గెవార్ గురించి చెప్తూ గోల్వాల్కర్ ఈ విధంగా అంటాడు.

"డాక్టర్ హెడ్గెవార్ చిన్నతనం నుండి గూడా దేశసేవకు అంకితమయి, మాతృభూమి విముక్తి కోసం అప్పట్లో నడుస్తూ వుండిన వివిధ ఉద్యమాలలో పాల్గొన్నాడు. కొంతకాలం విప్లవ ఉద్యమం*లో పాల్గొని తరువాత కాంగ్రెస్ పార్టీ ఉద్యమాలలోకి, నిర్మాణ కార్యక్రమాలలోకి దిగాడు.

---

* ఇక్కడ విప్లవ ఉద్యమం అంటే బెంగాల్‌లో జరిగిన 'టెర్రరిస్టు' ఉద్యమంలాంటి సాయుధ తిరుగుబాటని అర్థం.

అయితే, ఈ ఉద్యమాలన్నీ గూడ కేవలం బ్రిటిష్ వాళ్ళను తరిమివేయడం తమ లక్ష్యంగా పెట్టుకున్నాయనీ, దానినే జాతీయతా భావంతో సమంగా పరిగణిస్తున్నాయనీ గుర్తించాడు. అప్పటి నాయకులు చాలామంది దృష్టిలో 'బ్రిటిష్ వ్యతిరేకత', 'జాతీయతా భావం' సమభావాలు. ఇటువంటి పైపై ఆలోచన మన వ్యవస్థాపకుడికి అసంతృప్తి కలిగించింది. 'జాతి' అన్నది అనుకూల (positive) భావన అనీ, ఒకరిని వ్యతిరేకించడంపైన ఆధారపడ్డది కాదనీ మన జాతి చరిత్రతో ఆయనకున్న లోతయిన పరిచయంవల్ల ఆయన తెలుసుకున్నాడు. అంతేకాకుండ మన జాతి లక్ష్యంగా ఆది నుండి భావించబడుతూన్న దానిని ఏమాత్రం సడలించినా ఉపద్రవానికి దారితీస్తుందని గూడ ఆయనకు తెలుసు."

ఇందులో చివరి వాక్యం చాలా ముఖ్యమయినది. అందులో పేర్కొనే ఉపద్రవాన్ని వారించే ప్రయత్నం నిర్వచనాల నుండి నిర్మాణందాకా సాగుతుంది. గోల్వాల్కర్ దృష్టిలో ఒక జాతికి చెందడం అంటే కేవలం ఒకే ప్రాంతంలో నివసించడమో, ఒకే భాష మాట్లాడడమో కాదు. ప్రాదేశిక జాతీయవాదాన్ని (territorial nationalism) ఆయన నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తాడు. ఒకే ప్రాంతంలో నివసిస్తే చాలదు, ఒకే దృక్పథాన్ని ఆమోదించాలి, ఒకే 'జీవితాశయం, సంస్కృతి, భావాలు, నమ్మకాలు, సంప్రదాయాలు' కలిగి వుండాలి. అందరికీ ఒకే మిత్రభావం, శత్రుభావం, ఒకే సంప్రదాయం, జీవితాశయం ఉండి, అందరి ఆశలూ అవసరాలూ ఒకే అవిభాజ్యమయిన మొత్తంగా రూపొందివుంటే, అప్పుడు అది ఒక 'జాతి' అవుతుంది. అటువంటి జాతి హిందూజాతి. అదే గోల్వాల్కర్ దృష్టిలో భారత జాతి. ఆ భారత జాతికి ముస్లింలూ క్రిస్టియన్లూ చెందదల్చుకుంటే వాళ్ళు ఇక్కడి నివాసులయితే చాలదు. వాళ్ళ పూర్వీకులు ఆది నుండి గూడ ఇక్కడి నివాసులయి వుండినా చాలదు, వాళ్ళు హిందూ సంప్రదాయాలనూ దృక్పథాన్నీ ఆశయాలనూ అంగీకరించాలి. రాముడినీ, కృష్ణుడినీ, వేదాంతాన్నీ ఆమోదించాలి. హిందువులందరి జీవితాశయంగా వేదాంతులు (ఏకపక్షంగానే కానివ్వండి) తీర్మానించిన మోక్షాన్ని, లేక బ్రహ్మజ్ఞానాన్ని తమ జీవితాశయంగా అంగీకరించాలి. వాళ్ళు అల్లానూ మరియమ్మనూ ఆరాధిస్తే పరవాలేదు–శివుడికీ విష్ణువుకూ పోచమ్మకూ మైసమ్మకూ

సరసన మరొక ఇద్దరు దేవతలుగా–కాని తమది వేరే మతం అనీ వేరే ప్రాపంచిక దృక్పథమనీ అనడానికి వీలు లేదు.

ఇదంతా ఎందుకోసం? తమ వ్యక్తిగతమయిన అవసరాలనన్నింటినీ జాతి అవసరం అనే పగుళ్ళులేని భువనగిరి గుట్టగా పోగేసి, జాతి హీరోలనే భజిస్తూ (తిండి లేకుంటే ఆ భజనలనే భుజిస్తూ) అందరూ గూడ జాతి లక్ష్యమయిన బ్రహ్మజ్ఞానాన్ని సాధించడం కోసం ఎందుకు పాటుపడాలి? సమాధానం విచిత్ర మయినది – ఒక బలమయిన జాతిగా రూపొందడానికి ! బలహీనులను ఈ ప్రపంచంలో ఎవ్వరూ గౌరవించరు, బలవంతులనే గౌరవిస్తారు. 'అప్రతిహతమయిన జాతీయశక్తి' (invincible national strength) జాతి జీవితానికి పునాది కావాలి. వేదాంతులు చెప్పిన బ్రహ్మజ్ఞానమే నిజంగా జాతిలక్ష్యమయితే ఇంత గట్టిపునాది అనవసరం కాబట్టి ఆ అప్రతిహతమయిన జాతీయశక్తే అసలు లక్ష్యమనుకోవాలి. మరొకలాగ చెప్పాలంటే, చరిత్రలోకి రెండువందల సంవత్సరాలు ఆలస్యంగా వచ్చిన భారత బూర్జువావర్గం తమకంటే కొన్నివందల రెట్లు బలంగావున్న అమెరికా గుత్తపెట్టుబడిదార్లతో సమానంగా నిలవడం అసలు లక్ష్యమనుకోవాలి. ఇది గోల్వాల్కర్ ఉద్దేశ్యపూర్వకంగా కాంక్షించినదని నమ్మనవసరం లేదు. హెగెల్ అన్నట్టు మనుష్యులు తమ ఆచరణ ద్వారా తాము కలలో గూడ ఉద్దేశించని ఫలితాలను సాధిస్తారు–సమాజాన్ని గురించి శాస్త్రీయ దృక్పథం లేకపోతే (ఈ సవరణ హెగల్‌ది కాదు, మార్క్సిజానిది). వెనకబడ్డ బూర్జువా వర్గాలకు ఫాసిజం అవసరం. ఆ ఫాసిస్టు సిద్ధాంతాలను రూపొందించే వాళ్ళు వాటిని మతోన్మాదంతో చేయవచ్చు లేక మూర్ఖత్వంతో చేయవచ్చు. అంటే ఆర్.ఎస్.ఎస్. రూపమాత్రంగానే మతోన్మాద సంస్థ, సారాంశంలో ఫాసిజం దాని తత్వం.

అయితే జాతి యావత్తూ ఒకే లక్ష్యంతో నడవాలని ప్రకటించి ఊరుకోలేదు గోల్వాల్కర్. ఊరుకుంటే ఆయనకూ ఇందిరాగాంధీకీ తేడా లేకపోవు. ఆమెగూడ 'జాతి శ్రేయస్సు' పేరిటే గదా జాతీయ భద్రతా చట్టాన్ని జారీచేసి దానికింద కార్మిక నాయకులను అరెస్టు చేయించింది. గోల్వాల్కర్ అక్కడితో ఆగిపోకుండ ఒక సమగ్రమయిన భావజాలాన్ని రూపొందించాడు. ఆ భావజాలానికి ఆయువుపట్టు 'హిందూధర్మం'. ధర్మం అనే భావన హిందువులలో చాలా

ప్రాచీనమైనదేగాని, గోల్వాల్కర్ ప్రయోగించిన అర్థంలో అది ఫ్యూడల్ యుగానికి చెందినది. అంటే భగవద్గీతలోను, మనుధర్మశాస్త్రంలోను చెప్పబడ్డది. దాన్ని ఆధునిక భాషలో గోల్వాల్కర్ వంటి పిదపకాలపు బ్రాహ్మణులు వివరించే తీరు ఇదీ–

ప్రతీ వ్యక్తికీ తన పూర్వజన్మ కర్మలననుసరించి సమాజంలో ఒక స్థానం వుంటుంది. ఆ స్థానాన్నే శ్రీకృష్ణపరమాత్మా, మనువూ వర్ణం అన్నారు. తరువాతి కాలంలో కులం అన్నారు. ఆ మాటలు గట్టిగా అనే ధైర్యం గోల్వాల్కర్‌కు లేదుగాని భావం అదే. ఆ స్థానానికి ప్రాతిపదిక ఆయా వ్యక్తుల ప్రావీణ్యం, లేక ప్రజ్ఞ. ఈ ప్రావీణ్యాన్ని జన్మజన్మల కర్మలు నిర్ణయిస్తాయి. కొందరికి భూస్వామ్యంలో ప్రావీణ్యం వుంటుంది. కొందరికి జీతముండటంలో వుంటుంది. కొందరికి హౌసింగ్ సొసైటీల పేరిట ఇళ్ళస్థలాల వ్యాపారం చేయటంలో ప్రజ్ఞ వుంటుంది. కొందరి కర్మ వాళ్ళకు ఇళ్ళు కట్టడంలో తట్టలుమోసే ప్రజ్ఞను మాత్రమే ఇస్తుంది. ఆ ప్రావీణ్యాన్ని అనుసరించి ఆ వ్యక్తికి సమాజంలో స్థానం కల్పించబడుతుంది. భూస్వామ్యంలో ప్రావీణ్యం ఉన్నవాడికి భూమి ఇవ్వబడుతుంది. రిక్షా తొక్కడంలో ప్రావీణ్యం వున్నవాడికి రిక్షా తొక్కే అనుమతి యివ్వబడుతుంది. భూమి సంక్రమించిన తరువాతే భూస్వామ్యంలో ప్రావీణ్యం లభిస్తుందనీ, రిక్షా తొక్కడం తప్ప గత్యంతరం లేకపోతే చచ్చినట్టు రిక్షా తొక్కడంలో ప్రావీణ్యం వస్తుందనీ మనబోటి వాళ్ళకు అనిపించవచ్చు. పదార్థం నుండి చైతన్యం పుడుతుందని నమ్మేవాళ్ళకు అట్లాంటి అనుమానాలు రావడం సహజం. కాని ఆ విచికిత్స అనవసరం. ఎందుచేతనంటే ఇందులో హెచ్చుతగ్గుల ప్రసక్తి లేదు. అందరూ గూడ జాతి అనే 'విరాట్ పురుషుడి' శరీరంలో భాగాలు మాత్రమే. శరీర భాగాలలో ఒకటి ఎక్కువా ఒకటి తక్కువా కాదు. ఆ విరాట్ పురుషుడిలో ఒక అంగంగానే ప్రతీ ఒక్కడూ తన జన్మజన్మల సహజ పరిణామాన్ని సాధిస్తాడు. మన ధర్మం కమ్యూనిస్టులు చెప్పే సమానత్వం (equality) కాదు, సామరస్యం (harmony). ప్రతివాడూ తన స్వధర్మాన్ని (అది తట్టలు మోయడంగానీ కారులో షికార్లు కొట్టడంగానీ) నిర్వహిస్తూపోతే అంతా ప్రశాంతంగా సామరస్యంగా వుంటుంది. ఈ స్వధర్మ నిర్వహణే బ్రహ్మజ్ఞానానికి మార్గమని శ్రీకృష్ణపరమాత్మ భగవద్గీతలో

చెప్పాడు. నా స్వధర్మం నాకు అన్యాయంగా కనిపిస్తోందని మొరాయించిన అర్జునుడితో "కౌంతేయా, సహజకర్మ దోషసహితమయినా త్యజించకూడదు" అంటాడు. గోల్వాల్కర్ మాటలలో : "బ్రాహ్మణుడు విద్య ఇవ్వడం ద్వారా గొప్పవాడయితే, క్షత్రియుడు శత్రువులను నాశనం చేసినందుకు కొనియాడబడ్డాడు. వ్యవసాయంద్వారా, వ్యాపారంద్వారా సమాజాన్ని పోషించిన వైశ్యులుగాని, తమ వృత్తిపనుల ద్వారా సమాజానికి సేవచేసిన శూద్రులుగానీ బ్రాహ్మణ క్షత్రియులకంటే తక్కువేమీ కాదు". కాని బ్రాహ్మణులు విద్య ఇచ్చింది రెండు అగ్రవర్ణాలకు మాత్రమే; ఆ విద్య గూడ తమకు ఉన్నత స్థానాన్ని ఇచ్చిన వర్ణధర్మాన్ని సమర్థించడం కోసమే. క్షత్రియులు 'శత్రువును' నాశనం చేసింది తమ ఖజానాలు నింపుకోవడం కోసం, తమ రాజ్యాలు విస్తరించుకోవడం కోసం మాత్రమే. శ్రామిక వర్గా(ర్ణా)లది ఆ యుద్ధాలలో మందుగుండు పాత్రే. వ్యవసాయం, వృత్తిపనులు చేసిన వారు మాత్రమే తమ కోసమే కాక ఇతరుల కోసం గూడ శ్రమించారు. దోచుకోవడమూ దోచుకోబడడమూ రెండూ గూడ – వారి వారి స్వధర్మాన్ని అనుసరించి భగవంతుడిని ఆరాధించడానికి రెండు భిన్నరూపాలేనని ప్రకటిస్తే అందులోని అంతరార్థం స్పష్టమే. ఆ జాతి చరిత్రలో 'ధర్మం' అనే మాటకు అర్థమేమిటో, ఆ 'భగవంతుడి' పాత్ర ఏమిటో గూడ స్పష్టమే.

అయితే హిందూ ధర్మం గోల్వాల్కర్ సిద్ధాంతాలకు ఆయువుపట్టు మాత్రమే. మనువు చేతిలోనూ శ్రీకృష్ణుడి చేతిలోనూ 'హిందూ ధర్మం' భూస్వామ్య (ఫ్యూడల్) దోపిడీని సమర్థించడానికి ఉపయోగపడింది. భూస్వామ్య భావజాలంలో పార లౌకికత కీలకపాత్ర నిర్వహిస్తుంది. అందుకే ధర్మశాస్త్రాలలోను భగవద్గీతలోను ధర్మవర్తనకు ప్రతిఫలం బ్రహ్మజ్ఞానం, లేక మోక్షం. ఆ మరణానంతర ప్రతిఫలాన్ని మాటమాత్రంగా ఎరచూపుతూనే గోల్వాల్కర్ దాని స్థానంలో వేరే లక్ష్యాన్ని ప్రవేశపెడతాడు. అది 'అప్రతిహతయిన జాతీయశక్తి'. ఎందుకంటే గోల్వాల్కర్ చేస్తున్నది భూస్వామ్య భావజాలమయిన హిందూధర్మాన్ని ఉన్నదున్నట్టుగా పునరుద్ధరించడం కాదు. దాన్ని బూర్జువా ప్రయోజనాల కోసం పునరుద్ధరించడం. నిజానికి ఒక్క గోల్వాల్కర్ మాత్రమే కాదు, భారత బూర్జువావర్గ నాయకులంతా – గాంధీ గాని తిలక్‌గాని రాధాకృష్ణన్ గాని – చేసింది ఇదే: భగవద్గీతను బూర్జువా

వర్గ అవసరాలకు అనుగుణంగా వ్యాఖ్యానించడం. గాంధీ చేతిలోనయితే ఆ ప్రయత్నం చాలా వింతరూపం తీసుకుంది. రణరంగం మధ్య నిలబడి, యుద్ధం చేయడానికి వెనకాడుతున్న అర్జునుడిని యుద్ధం చేయమనీ, శత్రు సంహారం క్షత్రియుడిగా తన ధర్మమనీ కృష్ణుడు చేసే బోధ భగవద్గీత. అందులో గాంధీకి అహింసాతత్వం కనబడిందంటే విడ్డూరమేనని కోశాంబి అంటారు.

గోల్వాల్కర్ ఏమంటాడో విందాం. వర్ణధర్మాన్ని గురించి మాట్లాడుతూ, "ధర్మం అంటే సమాజంలో ప్రతీవ్యక్తీ మిగిలిన అందరు వ్యక్తులతోనూ ఏకత్వాన్ని సాధించి, ఇతరుల భౌతిక జీవితాన్ని సుసంపన్నం చేయడానికి అవసరమయిన త్యాగగుణం కలిగివుండడం" అంటాడు. ఇది చాలా నిర్మొహమాటమయిన ప్రకటన. భూస్వామ్య బూర్జువా వర్గాలు ఒకరి  కోసం త్యాగం చేసేది ఏమీ ఉండదు కాబట్టి, శ్రామిక జనం దోపిడీ వర్గాల భౌతిక జీవితాన్ని సుసంపన్నం చేయడం కోసం తమ శ్రమను త్యాగం చేయడమే 'ధర్మం' అని దీని అర్థం. చేస్తే ఏం వస్తుందంటే బహుశా రాబోయే జన్మలో భూస్వాములయి పుడతారో లేకపోతే బ్రహ్మజ్ఞానం సాధించి పరమాత్మలో లీనమవుతారో – తెలీదు. వాస్తవానికి ఈ 'ఆధ్యాత్మిక' ప్రయోజనాలు గోల్వాల్కర్ పోజు మాత్రమే. ఆయన సిద్ధాంతం 'ఆధ్యాత్మికం' కావచ్చును గాని, లక్ష్యం చాలా లౌకికం. ఆ లౌకిక ప్రయోజన మేమిటంటే, "మనందరి తల్లిగా మనం పరిగణించే ఈ సమాజం చాలా గొప్పదిగానూ శక్తివంతంగానూ తయారయ్యేలాగ చూడడం". ఇది మనందరి 'ధర్మం' అన్న సరికొత్త ఆలోచనను గూడ ప్రవేశపెడతాడు. అది మనుధర్మ శాస్త్రంలోగానీ భగవద్గీతలోగానీ లేదు. ఉండడానికి ఆస్కారం లేదు. బ్రహ్మజ్ఞానం సంపాదించడానికి జాతీయశక్తి అప్రతిహతం కావలసిన అవసరం లేదు. అసలు జాతీయశక్తి అన్న ఆలోచనే ధర్మశాస్త్రాలు పుట్టిన భూస్వామ్య సమాజానికి చెందదు. అది ఆధునిక బూర్జువా జాతీయవాదంలోనే పుట్టింది. అది అప్రతిహతం కావడం అంటే భారత పాలక వర్గాలు ప్రపంచ దోపిడీ వర్గాల అగ్రశ్రేణిలో చేరడం అని అర్థం. దానికోసం అందరూ తమ సహజకర్మను అనుసరించి గొడ్డుచాకిరీ చేయాలి. గోల్వాల్కర్ చేతిలో హిందూ ధర్మం తీసుకున్న బూర్జువా రూపం ఇది. ఏ ధర్మాన్నయితే శ్రీకృష్ణుడూ, మనువూ 'మోక్షాన్ని' ఎరగా చూపి భూస్వామ్య

సమాజంలో వర్గ సామరస్యాన్ని సాధించడానికి ఉపయోగించారో ఆ ధర్మాన్నే ఆ పాత ఎరల సరసనే 'జాతి ఉన్నతి' అనే కొత్త ఎరను చేరుస్తూ పెట్టుబడిదారీ వర్గానికి అవసరమయిన వర్గసామరస్యాన్ని సాధించడానికి గోల్వాల్కర్ ఉపయోగించాడు. ఆ ప్రయత్నాన్ని క్లుప్తీకరించి ఈ మధ్య ఇందిరా గాంధీ ఇస్తూన్న నినాదం : "శ్రమయేవ జయతే". శ్రామికులు శ్రమిస్తే, శ్రమించడం తప్ప వేరే ఆలోచన లేకుండ జీవిస్తే, అంత మేరకు బూర్జువా వర్గానికి అంతర్జాతీయంగా తన ఘనతను నిలుపుకునే ప్రయత్నంలో విజయం లభిస్తుంది. నమ్మకం కుదరకపోతే 'జాతి'కి చాలా ఘనతను సంపాదించిపెట్టిన ఏసియాడ్ కోసం కట్టుబానిసలుగా శ్రమించిన బీహార్, ఒరిస్సా కూలీలనడిగితే చెప్తారు.

ఈ మాటలంటేనే ఇందిరా గాంధీకి గోల్వాల్కర్‌కు గూడ మంట పుడుతుంది. వర్గ సిద్ధాంతం భారతీయం కాదంటారు. కాకపోతే ఏం అని సమాధానం చెబితే అసలు వర్గాలు లేనేలేవంటారు. ఒక 'నవభారతి' ప్రచురణ నుండి వుటంకించాలంటే, ఉన్న వాళ్ళు, లేనివాళ్ళు అనేది స్థితి మాత్రమే, వర్గంకాదు. సోషలిజం, మార్క్సిజం గూడ ఉన్న వాళ్ళు, లేనివాళ్ళు అనేవి వర్గాలనడం లేదు. శ్రమచేసేవాళ్ళు, ఆ శ్రమను దోచుకునేవాళ్ళు అనేవే ప్రధాన వర్గాలు. శ్రమచేసే వాళ్ళు సాధారణంగా లేనివాళ్ళు, శ్రమను దోచుకునే వాళ్ళు అనివార్యంగా ఉన్నవాళ్ళు కావచ్చు. అయినా ఉన్నవాళ్ళు, లేని వాళ్ళు అనేది శాస్త్రీయమయిన విభజన కాదు, ఎందుకంటే అది వర్గ విభజన యొక్క మూలాన్ని తాకదు.

శాస్త్రీయమో అశాస్త్రీయమో – అసలు ఏ రకమయిన వర్గవిభజననూ ఆర్.ఎస్.ఎస్. తత్వం సహించదు. ప్రపంచంలో ఉన్నవి కేవలం జాతులే. ప్రతీజాతికీ తన సంప్రదాయాలు వగైరా వుంటాయి. జాతిలోపల ఏ రకమయిన వర్గపోరాటాన్నీ సహించనట్టే జాతులమధ్య ఏ రకమయిన సామరస్యాన్నీ గోల్వాల్కర్ సహించడు. హిందూ సంస్కృతే అన్నిటికన్నా ఉన్నతమయినది. ఆ సంస్కృతిని ప్రపంచానికంతా పంచిపెట్టడం (అంటే ప్రపంచాన్ని జయించి తనకు లోబరచుకోవడం) హిందూజాతి 'పవిత్ర కర్తవ్యం'. దేశం లోపల ధర్మం రాజ్యం చేస్తేనే, అంటే అందరూ గూడ కిమ్మనకుండ తమ సహజ కర్మలు

నిర్వహించుకుంటూ పోతేనే, ఈ 'పవిత్ర కర్తవ్యాన్ని' దేశపాలక వర్గాలు నిర్వహించగలుగుతాయి.

గోల్వాల్కర్ చాలా స్థూలంగా వివరించిన ఈ సిద్ధాంతాన్ని వివిధ రంగాలకు అన్వయించి నిర్దిష్టరూపం ఇచ్చారు ఆయనగారి అనుచరులు. శ్రమచేయడం శ్రామికుల స్వధర్మం కాబట్టి సమ్మెల వంటివి ధర్మవిరుద్ధం. అయితే అసలే సమ్మెలు వద్దంటే వినేవాళ్ళు ఉండరు కాబట్టి దత్తోపంతో ఠేంగ్డే[1] గారు సమ్మె వజ్రాయుధం లాంటిదంటే మరొకరు పాశుపతాస్త్రం లాంటిదన్నారు. శివుడి మూడవకంటి లాంటిదని ఇంకెవరయినా అంటే ఆశ్చర్యం లేదు. వజ్రాయుధాన్నీ పాశుపతాస్త్రాన్నీ చీటికీ మాటికీ ప్రయోగించలేదుగా, అట్లాగే సమ్మెలు గూడ చీటికీ మాటికీ చేయకూడదు. బుడుగు[2] భాషలో చెప్పాలంటే ఎప్పుడయినా ఒకసారి చెయ్యాలన్న మాట. వజ్రాయుధంలాంటి ఆయుధాల్ని ప్రయోగించేముందు చిన్నపాటి జపం చేయడం సినిమాల్లో చూస్తూంటాం. బహుశా సమ్మె చేసేముందు గూడా సమ్మెదేవుడిని ఒకసారి జపించి చేయాలేమో, నాకు తెలీదు. ఈ విషయాన్ని మరింత విపులీకరించిన మరొక 'నవ భారతి' రచయిత వర్క్–టు–రూల్ సరేగానీ గో–స్లో కూడదనీ, ధర్నా పరవాలేదుగానీ ఘెరావ్ చేయకూడదనీ పంచాంగం పంతుళ్ళు బల్లి శకునాలూ పిల్లిశకునాలూ చెప్పినట్టు చెపుతాడు. మరొక రచయిత యువకులకు నిర్మాణాత్మకమయిన కార్యక్రమాలే తప్ప రాజకీయాలు వద్దంటాడు. మరి ఆర్.ఎస్.ఎస్. ప్రజాసంఘాలయిన భారతీయ మజ్దూర్ సంఘంగానీ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌గానీ ఈ నీతి సూత్రావళిని ఎన్నడయినా అనుసరించాయా అంటే లేదు. అందులో ఆశ్చర్యమూ లేదు. ఫాసిజానికీ ప్రజా సంఘాలకూ చుక్కెదురు. అవసరంపడి ఫాసిజం ప్రజాసంఘాల్ని పెట్టుకోవలసివస్తే తమ సిద్ధాంతానికి నీళ్ళు వదులుకోక తప్పదు. సమాజంలో సామరస్యమే తప్ప వైరుధ్యాలు లేవని గోల్వాల్కర్ తన బ్రాహ్మణ పూర్వీకుల ధర్మశాస్త్రాలను పునరుజ్జీవింపజేసి ప్రవచించవచ్చునుగాని, భారతీయ మజ్దూర్ సంఘం దాన్ని పాటిస్తే ఒక్క రోజు గూడ కార్మిక రంగంలో నిలవదు. శ్రమచేయడం

1. భారతీయ మజ్దూర్ సంఘ్ వ్యవస్థాపకుడు
2. ముళ్ళపూడి వెంకటరమణగారి 'బుడుగు' వ్యంగ్యాస్త్రాలలో ఇది ఒకటి.

శ్రామికుల స్వధర్మం అని భగవద్గీతలోనూ ధర్మశాస్త్రాలలోనూ చాలా తెలివిగా సిద్ధాంతం చేసారుగాని దాన్ని ఎన్నడయినా శ్రామికులలో ఎంతమంది ఆమోదించారో అనుమానమే. ఫ్యూడల్ కాలంలో ఎట్లాగున్నా, ఇవ్వాళ గ్రామాలలో గూడ నమ్మడం లేదు, ఇక పట్టణాల కార్మికుల సంగతి చెప్పనవసరం లేదు.

అయినా ఆర్.ఎస్.ఎస్. ప్రజాసంఘాలున్నది తమ వర్గ సామరస్య సిద్ధాంతాలను ప్రచారం చేసుకోవడానికి కాదు, తాము ఆశించే 'జాతి ఐక్యత'కు ప్రధాన శత్రువులుగా కనబడే ముస్లింలనూ కమ్యూనిస్టులనూ అణగదొక్కడం కోసం. ఆర్.ఎస్.ఎస్. కేవలం మతోన్మాద సంస్థగా రివిజనిస్టులు ప్రచారం చేయడంవల్ల దాని ముస్లిం వ్యతిరేకత ప్రాచుర్యం పొందిందిగాని, దానిది ఫ్యూడల్ హిందూతత్వం కాదు; ఫాసిస్టు హిందూ జాతీయవాదం అని గుర్తిస్తే, అది అన్యమతస్తులయిన ముస్లింలకు ఎంతటి శత్రువో, అంతర్జాతీయతావాదులు, అంతకంటే ముఖ్యంగా వర్గపోరాట సిద్ధాంతాన్ని ఆమోదించేవాళ్ళు అయిన కమ్యూనిస్టులకు గూడ అంతే శత్రువని అర్థమవుతుంది. ముస్లింల గురించి ఆర్.ఎస్.ఎస్. అభిప్రాయాలను కొత్తగా వివరించనక్కరలేదు. జాతీయోద్యమంలో ముస్లింలపాత్రను చర్చిస్తూ గోల్వాల్కర్ ఈ విధంగా అంటాడు. "వాళ్ళు ఈ దేశం మీదికి దండెత్తి వచ్చారు. గత 1200 సంవత్సరాలుగా తమ్ము తాము విజేతలగాను పాలకులగాను పరిగణించుకుంటున్నారు. ఆ భావన వాళ్ళ ఆలోచనలలో ఇంకా చెరిగిపోలేదు... హిందువులపట్ల వాళ్ళ వ్యతిరేకత ఎంత లోతయినదంటే – మనం దేన్ని విశ్వసిస్తే ముస్లింలు దాన్ని సంపూర్ణంగా ద్వేషిస్తారు. మనం గుడిలో ఆరాధిస్తే వాళ్ళు ఆ గుడిని అపవిత్రం చేస్తారు. మనం భజనలు చేసినా, రథోత్సవాలు నిర్వహించినా వాళ్ళకు అసహనం కలుగుతుంది. మనం గోవును పూజిస్తే వాళ్ళకు దానిని తినాలని కోరిక పుడుతుంది. మనం స్త్రీని పవిత్రమయిన మాతృత్వానికి సంకేతంగా ఆరాధిస్తే వాళ్ళకు ఆమెను చెరచాలని కోరిక పుడుతుంది". చివరికి ఎంత దూరం పోతాడంటే, దేశంలోని ముస్లింలు తమ తాత ముత్తాతల కాలం నుండి ఇక్కడే ఉంటున్నా వాళ్ళను భారతీయులుగా పరిగణించగూడదని చెబుతూ ఒక కథ చెపుతాడు. ఒక జర్మన్ కుటుంబం ఇంగ్లండుకు వలసపోయి 19వ శతాబ్దం మొదట్లో స్థిరపడ్డారట. మూడు తరాల తరువాత ఆ వంశానికి

చెందిన ఒక వ్యక్తి బ్రిటిష్ అధికారిగా భారతదేశంలో పనిచేయడానికి వచ్చాడు. ఇంతలో ఇంగ్లండుకూ జర్మనీకీ మధ్య మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభమయింది. బ్రిటిష్ ప్రభుత్వం వెంటనే ఆ ఉద్యోగిని తొలగించి యుద్ధం అయిపోయేదాకా ఖైదు చేసింది. 100 సంవత్సరాలుగా బ్రిటన్‌లో జీవిస్తున్నప్పటికీ గూడ జర్మనీతో యుద్ధం రాగానే జర్మనీకి గూఢచారిగా పనిచేస్తాడేమోనన్న అనుమానంతో అతన్ని ఖైదు చేసిన బ్రిటిష్ ప్రభుత్వాన్ని అనాగరికమని అసహ్యించుకోవడానికి బదులు మెచ్చుకుంటూ, "వాళ్ళకు అర్థమయింది, అసలు జాతీయవాదమంటే ఏమిటో" అంటాడు. దీని తాత్పర్యం ఏమిటంటే, పాకిస్తాన్‌తో యుద్ధంవస్తే దేశంలోని కోట్లాది ముస్లింలను జైళ్ళలో వేయాలని.

ఈ ముస్లిం ద్వేషంతో సమంగా, నిస్సిగ్గుగా ప్రదర్శించుకున్నది సోషలిస్టు ద్వేషం. చివరికి వినోబాభావే నడిపిన 'భూదాన్' ఉద్యమం అనబడే ఫార్సును గూడ 'దున్నేవాడికే భూమి' అనే కమ్యూనిస్టు నినాదాన్ని ప్రచారం చేస్తోందని గోల్వాల్కర్ వ్యతిరేకిస్తాడు. "సోషలిజం ఈ గడ్డన పుట్టింది కాదు, అది మన రక్తంలోగాని మన సంప్రదాయంలోగాని లేదు... ఇక్కడున్న కోట్లాది ప్రజల ఆలోచనలకు అది పూర్తిగా భిన్నమయినది. కాబట్టి మన హృదయాలను కదిలించే శక్తిగాని, నిమగ్నతతో పనిచేసే ఉత్తేజాన్ని ఇచ్చే శక్తిగాని దానికి లేవు". కావలసింది సోషలిజం కాదు, శ్రమను గౌరవప్రదంగా భావించడం (dignity of labour). శ్రమచేయడం తక్కువ అని భావిస్తేనేగదా... చేయనివాళ్ళను చూసి ఈర్ష్యపడడం గాని ద్వేషించడం గాని జరిగేది? శ్రమను గౌరవించడం నేర్చుకుంటే, కూర్చుని తినడమే కాదు, శ్రమించడం గూడ (వారి వారి స్వధర్మాలను అనుసరించి) భగవంతుడిని భిన్న రూపాలలో ఆరాధించడమేనని గుర్తిస్తే, ఇక సోషలిజం దేనికి? dignity of labour అనే మాటకు ఇంత వక్ర అర్థం ఇవ్వడం చాలా ఘనమయిన విషయం. కనీసం అందుకయినా గోల్వాల్కర్‌కు జోహార్లు చెప్పాలి !

గోల్వాల్కర్ ఏమనుకున్నా, ఈ దేశంలో ప్రజలు మాత్రం శ్రమచేయడం తమ ధర్మమనీ, తమ శ్రమను దోచుకోవడం ఇతరుల ధర్మమనీ అనుకోవడంలేదు. అది గుర్తించే, సోషలిజం మన రక్తంలో లేదని ప్రకటించిన గోల్వాల్కర్ శిష్యులు ఇవ్వాళ 'గాంధియన్ సోషలిజం' గురించి మాట్లాడుతున్నారు. సమ్మెను పాశు

పతాస్త్రంగా పరిగణిస్తే భారతీయ మజ్దూర్ సంఘానికి మనుగడ లేనట్టే, సోషలిజం ఈ దేశ ప్రజల ఆలోచనకు చాలా దూరమని అనుకుంటే అటల్ బిహారీ వాజ్‌పేయికి కూడా ఈ దేశ రాజకీయాలలో మనుగడ వుండదు. అందుకే ఆర్.ఎస్.ఎస్. చెప్పేది ఒకటీ, ఆర్.ఎస్.ఎస్. అనుచరులు చేసేది మరొకటీనూ.

## విప్లవ జాతీయవాదం

బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన జాతీయోద్యమంలో బూర్జువా జాతీయవాదమే కాకుండ విప్లవ జాతీయవాదం గూడ వుంది. బ్రిటిష్ సామ్రాజ్యవాదపు ప్రత్యక్షపాలనను తొలగించి బడా బూర్జువా వర్గం చేతిలో పాలనను పెట్టడం బూర్జువా జాతీయవాదమయితే, స్థానిక దోపిడీకి వ్యతిరేకంగా కదలిన ప్రజలే సామ్రాజ్యవాదాన్ని సహితం తొలగించగలరన్నది విప్లవ జాతీయవాదం. 'దేశభక్తి' పేరిట వర్గ విభేదాలనూ వైషమ్యాన్నీ మరుగుపరచి బలవంతపు 'జాతీయ ఐక్యత'ను సాధించడం బూర్జువా జాతీయ వాదమయితే, జాతిలో శ్రమదోపిడీ అంతమయిన తరువాతే జాతీయ ఐక్యత గానీ దేశభక్తి గానీ సాధ్యమన్నది విప్లవ జాతీయవాదం. భూస్వాములూ మన సజాతీయులే కాబట్టి వాళ్ళను వ్యతిరేకించవద్దన్నది బూర్జువా జాతీయవాదమయితే, భూస్వామ్య వ్యతిరేక పోరాటం చేయనిదే ఈ జాతికి బానిస సంకెళ్ళు విడవని గుర్తించింది విప్లవ జాతీయవాదం. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం శ్రమ దోపిడీని అంతంచేసే పోరాటంలో ఒక భాగం మాత్రమే. ఇది విప్లవ జాతీయవాదపు సారాంశం. తద్విరుద్ధంగా, విదేశీపాలనను అంతం చేసి నల్లదొరలను పీఠం ఎక్కించేది బూర్జువా జాతీయవాదం.

బూర్జువా జాతీయవాదానికి కాంగ్రెస్ నుండి ఆర్.ఎస్.ఎస్. వరకు అన్ని సంస్థలూ ప్రాతినిధ్యం వహించాయి. ఇందులో కాంగ్రెస్‌కూ ఆర్.ఎస్.ఎస్.కూ తేడా స్వల్పం. 1946లో నావికా సిబ్బంది బొంబాయిలో తిరుగుబాటు చేసినప్పుడు కాంగ్రెస్ నాయకుడు మౌలానా ఆజాద్, "ఇది సమ్మెలకూ తిరుగుబాట్లకూ సమయం కాదు" అన్నాడు. అప్పటికే అధికారం కొంత చేతికివచ్చి ఇంకా ఎక్కువ త్వరలో రాబోతున్న భారత బూర్జువా వర్గానికి అది సమ్మెలకూ తిరుగుబాట్లకూ సమయం కాదు, 'దేశభక్తి'కి మాత్రమే సమయం. బ్రిటిష్ ప్రభుత్వం విధించిన పన్ను కట్టవద్దని

అడపాదడపా కాంగ్రెస్ పార్టీ రైతులకు నినాదం ఇచ్చిందిగానీ భూస్వాములకు కౌలు చెల్లించవద్దనో వారికి వెట్టిచాకిరీ చేయవద్దనో ఎన్నడూ పిలుపునివ్వలేదు, 1936 వరకు కాంగ్రెస్ పార్టీ తన తీర్మానాలలో కౌలు తగ్గింపు గురించి గూడ ఎన్నడూ మాట్లాడలేదు. బ్రిటిష్ ప్రాంతం కాక 'భారతీయ' రాజ్యాలలోవున్న ప్రజలలో రాజకీయ చైతన్యాన్ని కలిగించడంలో కాంగ్రెస్ పార్టీ చాలా ఉదాసీనంగా వుంది – ఎందుకంటే మైసూర్ మహారాజూ భోపాల్ నవాబూ 'మనవాళ్ళే' కాబట్టి.

విప్లవ జాతీయవాదానికి ఎవరు ప్రాతినిధ్యం వహించారంటే చెప్పడం కష్టం. కమ్యూనిస్టులు ప్రాతినిధ్యం వహించారని చెప్పడం రెండు రకాలుగా చరిత్రను వక్రీకరించడం అవుతుంది. కమ్యూనిస్టుపార్టీ ప్రణాళికలలోనూ తీర్మానాలలోనూ నాయకుల ఉపన్యాసాలలోనూ విప్లవ జాతీయవాదం మెండుగా లేకపోలేదుగాని, ఆచరణలో ఒక బెంగాలులోనో ఒక తెలంగాణలోనో ఒక వర్లీలోనో ఒక కాసరగోడ్‌లోనో తప్ప దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ వ్యూహంలో అది ఛాయామాత్రంగానే కనబడుతుంది. అంతకంటే ముఖ్యంగా, భారతదేశంలో విప్లవ జాతీయవాదానికి బీజాలు కమ్యూనిస్టు పార్టీ పుట్టుకకు ఏడెనిమిది దశాబ్దాలు పూర్వమే ప్రజాపోరాటాలలో పడ్డాయి. నీలిమందు ఎస్టేట్ యజమాన్లమీద తిరగబడ్డ తూర్పు బెంగాల్ ముస్లిం రైతాంగం, రంగ్‌మహల్ కొండలోయల్లో జమీందారు మీద తిరగబడ్డ సంథాల్ గిరిజనులు, బ్రిటిష్ ప్రభుత్వ అధికారాన్నే ఎదిరించిన ఔధ్ రాజ్యపు కామందులూ, బ్రిటిష్ రెవెన్యూ పద్ధతి ప్రవేశపెట్టిన దోపిడీపై తిరగబడ్డ రంపప్రాంతపు గిరిజనులూ – వీళ్ళందరి ఆచరణలోనూ విప్లవ జాతీయవాదానికి (ఎంత అస్పష్టంగానయినా కానివ్వండి) బీజాలు ఏర్పడ్డాయి.

తూర్పు బెంగాల్‌లో 1831లో 'వహాబీ' తిరుగుబాటులో పాల్గొన్న ముస్లిం రైతాంగం జమీందార్లకూ, బ్రిటిష్ ప్రభుత్వానికీ తేడా చూపలేదు. జమీందార్లు 'భారతీయులే' గదా అని వదిలిపెట్టలేదు. అలాగని ఆ జమీందార్ల మనుగడకూ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికీ ఉన్న సంబంధాన్నీ విస్మరించలేదు, విపరీతమయిన శిస్తు వసూలు చేయడమే కాకుండ హిందూ పండుగలకు ముస్లిం రైతుల నుండి బలవంతపు కానుకలు వసూలు చేయడం అలవర్చుకున్న జమీందార్లపై తిరగబడి, ఆ తిరుగుబాటుకు కొనసాగింపుగా కొందరు బ్రిటిష్ నీలిమందు ఎస్టేట్

యజమానుల కార్ఖానాలను ఆక్రమించుకోవడమే కాకుండ, నార్కేల్ బారియా కేంద్రంగా ఒక విముక్తి ప్రాంతాన్ని ఏర్పరచి (చాలా తాత్కాలికంగానే కానివ్వండి) బ్రిటిష్ పాలన ఇక చెల్లదనీ, ఏ ముస్లింల నుండయితే బ్రిటిష్‌వాళ్ళు పరిపాలనను చేజిక్కించుకున్నారో ఆ ముస్లింల పాలన తిరిగి నెలకొల్పబడాలనీ ప్రకటించారు. ఇది కొంతమేరకు తిరోగామి ఆలోచనే, కాని విప్లవ జాతీయవాదం నుండి పుట్టింది. దోపిడీని వ్యతిరేకించే పోరాటమూ జాతివిముక్తి కోసం జరిగే పోరాటమూ విడదీయరానివన్నది విప్లవ జాతీయవాదానికి పునాది. ఆ అర్థంలో వహాబీ తిరుగుబాటు భారతదేశపు విప్లవ జాతీయోద్యమంలో మొదటిమెట్టు లాంటిదనవచ్చు. ఆ తరువాత జరిగిన రైతాంగ, గిరిజన, కార్మిక ఉద్యమాలన్నింటిలోను ఈ వైఖరి ఎంతో కొంత మేరకు కనిపిస్తుంది.

జాతి విముక్తినీ, శ్రమదోపిడీ నుండి విముక్తినీ విడదీయ నిరాకరించే విప్లవ జాతీయవాదాన్ని, శ్రమదోపిడీని సంరక్షించడం తన ముఖ్య కర్తవ్యంగాగల బూర్జువా జాతీయవాదం సహించలేదు. ఆశ్చర్యకరమయిన విషయమేమిటంటే, విప్లవ జాతీయవాదంపై, సోషలిజంపై ఉన్న ఆ అసహనాన్ని అన్ని దేశాలలోని బూర్జువా జాతీయవాదమూ 'దేశద్రోహం' అనే దూషించింది. గోల్వాల్కర్‌కూ అయొతుల్లా ఖొమైనీకీ వేరే ఏ విషయంలోనూ పొసగదు గానీ, ఇద్దరూ గూడ తమ దేశాలలోని వామపక్ష భావాలుగల వాళ్ళను విదేశీ తొత్తులనీ, దేశద్రోహులనీ; వామపక్ష భావాలను 'విజాతీయ' భావాలనీ, 'విదేశీయుల కుట్ర' అనీ దూషించారు. అమెరికాలో గూడ లెఫ్టిస్టు కార్యకలాపాలను అమెరికనేతర కార్యకలాపాల (un-American activities) కిందే నిషేధించారు. భారతదేశం నుండి ఇరాన్ దాకా, ఇరాన్ నుండి అమెరికా దాకా, మరొకరకంగా చెప్పాలంటే బ్రాహ్మణ గోల్వాల్కర్ నుండి షియా మతాధికారి ఖొమైనీదాకా, మతాధికారి ఖొమైనీ నుండి 'ప్రజాస్వామిక'వాది మెకార్థీదాకా, అందరికీ వామపక్ష భావాలు 'లాల్‌గులామీ'గానే కనబడ్డాయంటే అది కాకతాళీయం కాదు. బూర్జువా జాతీయవాదానికి విప్లవ జాతీయవాదాన్నీ, సోషలిజాన్నీ వ్యతిరేకించడానికి ఇంతకు మించిన ఆయుధం లేదు.

ఆ ఆరోపణకు విప్లవ జాతీయవాదం ఇచ్చే సమాధానం ఎన్.కె. కవిత. ఇందులో శ్రామిక అంతర్జాతీయత లేదా అంటే ఉంది. కాని అది afterthought గా కాకున్నా second thought గా వచ్చి చేరింది. ఎన్.కె. కవితకు నిజమయిన ప్రేరణ విప్లవ జాతీయ వాదం నుండే వచ్చింది. లేకుంటే 'వందేమాతరం' అన్న మాట ప్రయోగించేవాడే కాదు.

తన తల్లిగా తాను భావించే భారతదేశాన్ని తాను ప్రేమించడం సహజం. కాని జాతిని రెండుగా చీల్చినవాళ్ళు ఆ ప్రేమను అసాధ్యం చేస్తున్నారు. తన తల్లి రత్నగర్భ అనీ సస్యశ్యామల అనీ మలయజశీతలయనీ నమ్మడం తనకు సహజం. కాని ఆ గర్భాన్ని రత్నాల కోసం చీల్చి ఆ రత్నాలను ఎగుమతిచేసి ఆ తల్లి అంగాంగాన్నీ తాకట్టుపెట్టిన వాళ్ళు ఆ నమ్మకాన్ని అసాధ్యం చేస్తున్నారు. ఇక్కడ న్యాయం రాజ్యం చేస్తుందనీ, అదేదో హిందీ సినిమా 'దేశభక్తి' పాటలో చెప్పినట్టు ఇక్కడ మనస్సులలో స్వచ్ఛత, పెదవులపై సత్యం రహిస్తాయనీ విశ్వసించడం, గర్వించడం తనకు సహజం. కానీ తమ స్వార్థంతో ఈ దేశ సంస్కృతిని కలుషితం చేసినవాళ్ళు తనను విశ్వసించనీయడం లేదు, గర్వించనీయడం లేదు. ఇక్కడ – గోల్వాల్కర్ చెప్పినట్టు – స్త్రీని మాతృమూర్తిగా ఆరాధిస్తారని నమ్మడం తనకు సహజం. కాని మనిషి మాంసాన్ని సహితం వ్యాపారంచేసే పెట్టుబడిదారీ మార్కెట్‌లో చిక్కుకున్న కమల* వంటి స్త్రీలు తనను నమ్మనీయడం లేదు. తాను తిరిగి ఈ దేశాన్ని ప్రేమించాలంటే, ఈ అక్రమాలు జరిగినప్పుడు 'దేశభక్తులు' అడగని ప్రశ్నలకు సమాధానం లభించాలనీ, అప్పుడే మన గులామీ పోయి తాను 'వందేమాతరం' అనగలుగుతాననీ ఎన్.కె. విశ్వాసం. ఆ విశ్వాసం ఫాసిస్టు జాతీయవాదానికి ఇంకా ఏమేమి సమాధానాలు ఇస్తుందో నేను వివరించనక్కర లేదు, మీరే చదువుకోండి.

---

* కమల

# శ్రామికుడిని శ్రమదోపిడీకి లోనయ్యేలా చూడటం మతం కర్తవ్యం

చిలీ దక్షిణ అమెరికాలో ఒక దేశం. సెప్టెంబరు 1970లో ఆ దేశంలో ఎన్నికలు జరిగి, ఒక సంస్కరణవాద సోషలిస్టు ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. విస్తృతంగా భూసంస్కరణలు అమలు చేసింది. అమెరికా సామ్రాజ్యవాదపు కంపెనీలను జాతీయం చేసింది. సరిగ్గా 3 సంవత్సరాలకు ఆ ప్రభుత్వం కూలిపోయి, అమెరికా సామ్రాజ్యవాదానికి అనుకూలమయిన సైనికపాలన చిలీలో నెలకొల్పబడింది. ఈ ఓటమికి ఆ ప్రభుత్వపు సంస్కరణవాదం ఎంతవరకు కారణమన్నది ఇప్పటికి అప్రస్తుతం. ఇప్పటికి ప్రస్తుతం ఏమిటంటే, చిలీదేశపు భూస్వాములూ, ట్రక్కు కంపెనీల యజమానులూ, కాంట్రాక్టర్లూ, దళారీలూ, ఒక్కమాటలో దోపిడీ వర్గాలు యావత్తూ ఈ సోషలిస్టు ప్రభుత్వాన్ని కూలదోయ డానికి తగిలించుకున్న ముసుగు ఏమిటన్నది. ఆ ముసుగు పేరు జాతీయవాదం లేక దేశభక్తి, వాళ్ళు పెట్టుకున్న పార్టీల పేర్లు జాతీయ పార్టీ (Nationalist Party), పితృభూమి స్వేచ్ఛ (Fatherland and Liberty). జాతిని గూర్చి, పితృభూమిని గూర్చి మాట్లాడేవాళ్ళు దేనిని వ్యతిరేకించాలి? జాతి ద్రోహాన్ని, దేశద్రోహాన్ని వ్యతిరేకించాలి. మరి వీళ్ళు వ్యతిరేకించింది దేన్ని? భూసంస్కరణలనూ, అమెరికా కంపెనీల జాతీయకరణనూ! ఇందులో విడ్డూరం లేదు. ఇవ్వాళ మన దేశంలో మాత్రం 'విదేశీ తొత్తులు'గా పిలవబడుతున్న దెవరు? దున్నేవాడిదే భూమి కావాలని, అన్ని రకాల సామ్రాజ్యవాదుల, వాళ్ళ దళారీల ఆస్తులను ప్రజలపరం చేయాలని డిమాండు చేస్తున్న వాళ్ళు.

హిట్లర్‌ను, ఖొమైనీని ఒకసారి పరామర్శిద్దాం. హిట్లరు పార్టీ పేరు నేషనల్ సోషలిస్టు పార్టీ (దీన్నే నాజీపార్టీ అంటారు). అంటే జాతీయ సోషలిస్టు పార్టీ అని అర్థం. జర్మన్ పితృభూమి గౌరవాన్ని గురించి ప్రపంచం దద్దరిల్లేలాగ

---

'అమరుడు కామ్రేడ్ శేషయ్యకు లాల్ సలాం' పుస్తకానికి ముందుమాట, 1983

ఉపన్యాసాలిచ్చాడు హిట్లర్. పితృభూమి పేరు చెప్పి, పితృభూమి కీర్తిని దిగంతాలకు వ్యాపింపజేస్తానని చెప్పి, అతడు మొట్టమొదట చేసిందేమిటి? జర్మన్ కార్మికవర్గ పార్టీలైన సోషల్ డెమోక్రాటిక్ పార్టీ మీద, కమ్యూనిస్టు పార్టీ మీద దాడిచేసి అణచివేశాడు. ఇందులో గూడ విడ్డూరం లేదు. ఆర్.ఎస్.ఎస్. గూడ "భారతమాతను ప్రపంచ సంస్కృతికి మార్గదర్శినిగా నిలబెట్టడం మన ఆదర్శం" అని ప్రకటించుకుంది. "ఒకనాటి కీర్తి ప్రతిష్ఠలను పునరుజ్జీవింపజేసి ధగద్ధగాయమానంగా ఈ జాతిని మలచడం" తన ఆదర్శమని ప్రకటించుకుంది. కాని వాస్తవంలో చేస్తున్నదేమిటి? సోషలిజం "మన రక్తంలోను సంస్కృతిలోను లేనేలేద"ని సిద్ధాంతీకరించడం; కమ్యూనిస్టులమీద దాడి చేయడం; చైనాలో "రాజులను, భూస్వాములను, జమీందార్లను, పరిశ్రమాధిపతులను మట్టుబెట్టార"నీ, అటువంటిది భారతదేశంలో జరగకుండా చూడాలనీ రోదించడం (ఉటంకించిన మాటలన్నీ 'గురూజీ' గోల్వాల్కర్‌వి).

ఇరాన్‌లో ఖొమైనీ వున్నాడు. ఇరాన్ రాజయిన షా సహాయంతో ఆ దేశాన్ని 1953 నుండి అమెరికా సామ్రాజ్యవాదం తన నయావలసగా ఏలుకుంది. ఇరాన్‌లో పుష్కలంగా దొరికే చమురు మీద గుత్తాధిపత్యాన్ని సంపాదించి కోట్ల డాలర్ల లాభం ఇంటికి తరలించింది. చవగ్గా దొరికిన చమురు పుణ్యాన అగ్రగామి పారిశ్రామిక దేశంగా తన్ను తాను మలచుకోగలిగింది. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ఇరాన్‌లో ప్రజ్వరిల్లిన సామ్రాజ్యవాద వ్యతిరేక వెల్లువమీద కొట్టుకొచ్చి ఖొమైనీ ఇప్పుడు ఆ దేశాన్ని పరిపాలిస్తున్నాడు. నిజానికి ఆ పోరాటం నడిచినప్పుడు దేశంలో వుండి నాయకత్వం వహించింది ఖొమైనీ కాదు. ఖొమైనీ సుఖంగా ప్యారిస్‌లో తలదాచుకున్నాడు. పోరాటాన్ని నడిపిన వారిలో ముజాహిదీన్, ఫిదాయీన్ వంటి సోషలిస్టు పార్టీలను చెప్పుకోవాలి. అయితే ఆ పార్టీలు విప్లవాన్ని ఆసాంతం కొనసాగించాలనీ, అమెరికా సామ్రాజ్యవాదాన్ని మాత్రమేకాదు దేశంలోని వివిధ దోపిడీ వర్గాలను కూడా కూలదోసి ప్రజారాజ్యం ఏర్పరచాలనీ డిమాండు చేసినందుకు వాళ్ళను దేశద్రోహులనీ, అమెరికా ఏజంట్లనీ (మన దేశంలోని హిందూ ఖొమైనీల పరిభాషలో విదేశీ తొత్తులనీ) నిందిస్తూ వేలసంఖ్యలో (స్త్రీలను, పసిపిల్లలను గూడ) ఊచకోతకోసి చంపుతున్నాడు ఖొమైనీ.

## మతతత్వంపై బాలగోపాల్

మనది విప్లవాల యుగం. 1917 అక్టోబరులో ప్రారంభమయి ప్రపంచంలోని దేశదేశాల్లో రైతులూ, కూలీలూ, కార్మికులూ తమ శ్రమను తరతరాలుగా దోపిడీ చేస్తున్న వారికి వ్యతిరేకంగా తిరగబడి శ్రామిక రాజ్యాలు ఏర్పరచుకుంటున్న యుగం. ఈ యుగంలో బూర్జువా భూస్వామ్య వర్గాలు శ్రామిక వర్గానికి వ్యతిరేకంగా చిక్కిన ఆయుధాలన్నిటినీ ప్రయోగిస్తాయి. తుపాకీలు, బయొనెట్లు, జైళ్ళు ఒక స్థాయిలో ఉపయోగపడతాయి. అయితే తుపాకీలతో అన్నీ సాధ్యం కావు. ముఖ్యంగా, దోపిడీ వర్గాలకూ శ్రామిక వర్గాలకీ మధ్య ఊగిసలాడే మధ్యతరగతిని ఆకర్షించుకోవడం శ్రామిక వర్గానికి ఎంత అవసరమో దోపిడీ వర్గానికి కూడా అంతే అవసరం. దీనికి మతం, సంస్కృతి, దేశం, దేశభక్తి చక్కటి ఉపకరణాలు. టాటా, బిర్లాల ఆస్తులు పోతాయంటే మధ్యతరగతి బాధపడదు కాని ప్రాచీన ధర్మాన్ని నాశనం చేస్తున్నారంటే నిరసిస్తుంది. భూస్వాముల భూములు పోతాయంటే కన్నీళ్ళు కార్చదు గాని, అదంతా మన మాతృదేశాన్ని రష్యాకో, చైనాకో కట్టబెట్టడానికి జరుగుతున్న కుట్ర అంటే వ్యతిరేకిస్తుంది. ఫాసిజం మతాన్నీ దేశభక్తినీ కలగలిపి ప్రజలను, ప్రజా రాజకీయాలను అణచాలని చూస్తుంది. యూరప్‌లో క్రైస్తవ మతాభిమానాన్ని మాతృభూమి పట్ల ప్రేమతో సమంగా ప్రకటించుకున్నారు. ఖొమైనీ సంగతి చెప్పనవసరం లేదు. ఇస్లాంలో అవతారాలకు తావులేదుగాని, వుంటే ఆయన తన్ను తాను మహమ్మదు అవతారంగా ప్రకటించుకునేవాడే. దక్షిణ అమెరికాలో కమ్యూనిస్టులను రష్యా ఏజంట్లని ఎంత నీచంగా నిందించారో, అంత బలంగాను కాథలిక్ చర్చి వాళ్ళను క్రైస్తవమత ద్రోహులుగా చిత్రించి సంఘ బహిష్కృతులను చేయాలని ప్రయత్నించింది. ఆధునిక ఫాసిజానికి బయొనెట్లు, బుల్లెట్లు భౌతిక ఆయుధాలయితే మతం, దేశభక్తి ఆధ్యాత్మిక ఆయుధాలు. ఈ రెండు రకాల ఆయుధాలూ కలిసి భూస్వాముల భూములకూ షాహుకార్ల పెట్టుబడికీ కవచంగా పనిచేశాయి. ఇదే వాస్తవం కాకపోతే హిందూ ధర్మం విశిష్టతను గూర్చి వ్రాస్తూ అదే సమయంలో సోషలిజం మన రక్తంలో లేదనీ, భూసంస్కరణలు ప్రవేశపెట్టడం భారతదేశాన్ని చైనా నమూనాలో మార్చే కుట్ర అనీ గోల్వాల్కర్ ఎందుకు రోదించాలి?

*శ్రామికుడిని శ్రమదోపిడీకి లోనయ్యేలా చూడటం మతం కర్తవ్యం*

**హిందూ ధర్మం :**

మన ధర్మం పరమగంగ

పరధర్మం ఎండమావి

అని గోడలమీద విశ్వహిందూ పరిషత్, ఆర్.ఎస్.ఎస్. తదితర సంస్థలు రాస్తూంటాయి. ఈ 'మన ధర్మం' ఏమిటో మనం తెలుసుకోవాలి.

వర్గసమాజంలో దోపిడీ వర్గాలకు ఎప్పుడూ ఒక సమస్య ఎదురవుతూంటుంది. అదేమిటంటే శ్రామికవర్గం చేత అదనపు ఉత్పత్తి ఎలా చేయించాలి అన్నది. శ్రామికులు తమ పొట్టపోసుకోవడం కోసం శ్రమించి ఊరుకోక, అదనంగా పనిచేసి దోపిడీ వర్గాల జీవితాలకూ విలాసాలకూ అవసరమయిన ఉత్పత్తి చేయాలి. అంటే శ్రమ దోపిడీకి లోను కావాలి. ఎవరయినా స్వచ్ఛందంగా దోపిడీకి ఎందుకు లోనవుతారు? కారు. కాబట్టి వాళ్ళను దోపిడీకి లోబరిచే శక్తి ఒకటి కావాలి. హింస అటువంటి ఒక శక్తి. శ్రామికులను బానిసలుగా మార్చి, అవసరమయితే గొలుసులతో బంధించి, కొట్టి తిట్టి పని చేయించవచ్చు. ఈ పద్ధతిని బానిస వ్యవస్థ అవలంబిస్తుంది. అయితే దీనికి పరిమితులున్నాయన్నది స్పష్టమే. హింసాత్మకంగా అదనపు ఉత్పత్తి చేయించడం అన్నది చాలా వ్యయంతోను శ్రమతోను కూడుకున్న పని. విశ్వాసం చేయించినంత పని భయం చేయించలేదు. దొర 'దొడ్డ మనిషి' అని నమ్మితే చేసినంత నిరభ్యంతరంగా అతనికి భయపడి పనిచేయరు.

ఈ కారణంగానే, నాగరికత కొద్దిగా అభివృద్ధి చెందిన దశలో అంటే భూస్వామ్య వ్యవస్థలో బానిస యజమాన్ల కొరడాల స్థానంలో మతం అదనపు ఉత్పత్తిని చేయించే సాధనంగా ముందుకొస్తుంది.

ఆదిమకాలంలో మానవుడికి ఎన్నో మూఢ నమ్మకాలు ఉండేవి. మనలో ఒక 'జీవి' ఉన్నట్లే నదుల్లో, చెట్లలో, గాలిలో – కదలిక వున్న సమస్త ప్రకృతిలో 'జీవులు' ఉన్నాయనుకునేవాడు. వాయుదేవుడు, గంగమ్మ, అగ్నిదేవుడు, తదితర దేవతలు ఈ రకంగా పుట్టినవారే. అప్పటికి ఇంకా 'మతం' లేదు. కేవలం అజ్ఞానభయ జనితాలయిన మూఢనమ్మకాలు మాత్రమే ఉన్నాయి. ఈ మూఢ నమ్మకాలు దోపిడీకి సాధనంగా వాటంతటవి పనికిరావు. ఉదాహరణకు

గిరిజనులలో ఎందరో చిల్లర దేవతలమీద నమ్మకాలుంటాయి. కాని గిరిజనుల సామాజిక వ్యవస్థలో దోపిడీకి స్థానంలేదు. ఈ చిల్లర దేవతలందరినీ ఒకే ఒక సృష్టికర్తకు (పరబ్రహ్మ, యెహోవా, అల్లా) లోబరచి, పాపపుణ్యాలు, స్వర్గనరకాలు, కర్మ పునర్జన్మలు వగైరా సిద్ధాంతాలను జోడించి, ఒక ప్రాపంచిక దృక్పథం రూపొందించినప్పుడే 'మతం' పుడుతుంది. మూఢనమ్మకాలు ఆదిమకాలం నుండి ఉంటాయిగాని మతం మాత్రం వర్గ సమాజంలోనే పుడుతుంది. భూస్వామ్య వ్యవస్థలో దాని స్వభావం అత్యంత సంపూర్ణతను, స్పష్టతను సంతరించుకుంటుంది. పుట్టుకలో భిన్న మతాలలో ఎన్నో తేడాలుంటాయి. బౌద్ధం, ఇస్లాం లాంటి మతాలలో కొంత అభ్యుదయ స్వభావం పుట్టుకలో కనిపిస్తుంది. కాని క్రమంగా అవన్నీ వాటి స్వభావాన్ని తమ చారిత్రక పాత్ర అయిన దోపిడీ భావజాలానికి అనుగుణంగా మార్చుకుంటాయి.

'సమస్త ప్రకృతీ నా యందు లీనమయి వున్నది' అని నారాయణుడు భగవద్గీతలో అంటాడు. 'నేనే స్వర్గము' అని ఏసుక్రీస్తు అన్నాడు. 'అల్లా తప్ప వేరే దేవుడు లేడు' అని ఖురాన్ అంటుంది. ఈ ప్రకృతంతటికీ అతీతంగా ఉండి, దాన్ని నియంత్రించే శక్తిగా, శాసించే సృష్టి స్థితి లయకర్తగా మతం ఒక పరమాత్మను శ్రామికవర్గం ముందు నిలబెడుతుంది. భయం గొలిపించే ఒక విశ్వవ్యాప్తమయిన మూర్తిని స్ఫురింపజేస్తుంది. వాడు అంతటా వుంటాడు, అన్నిటా ఉంటాడు. వాడికి పుట్టుక లేదు, నాశనం కాదు, అన్నిటినీ చూస్తాడు, అన్నిటినీ నడిపిస్తాడు. వాడొక పరమ సి.ఐ.డి. వాడి కళ్ళుగప్పి ఎవరూ ఏ పనీ చేయలేరు. ఇంత భయం గొలిపించే దేవుడిని సృష్టించిన తరువాత వాడిచేత ఏ మాటలు చెప్పించినా శ్రామిక జనం వాటిని విశ్వసిస్తారు. మతాలకు సాధారణంగా ప్రవక్తలుంటారు. వాళ్ళచేత మత భావాలు చెప్పబడతాయి. అయితే ఈ ప్రవక్తలు మతభావాల దళార్లు మాత్రమే. వాళ్ళు చెప్పేవి వాళ్ళ స్వంత మాటలు కావు. దేవుడు వాళ్ళచేత చెప్పిస్తాడు. అవి దేవుడి మాటలయితేనే వాటికి విలువ ఉంటుంది. ఖురాన్‌లో వున్నది మహమ్మదు అభిప్రాయాలు కావు – మహమ్మదుచేత అల్లా పలికించిన అభిప్రాయాలు. బైబిల్‌లో ప్రవక్తల స్థానం ఇంకా తక్కువ. ఏసుక్రీస్తు తానే ఒక పాత్రగా ఉండి తన మతాన్ని చెబుతాడు. ప్రవక్తలు రిపోర్టర్లు

మాత్రమే. హిందువులలోనయితే ప్రవక్తలమీద నమ్మకంలేక కాబోలు, నారాయణుడు స్వయంగా అవతారమెత్తి తన భగవద్గీత తానే చెప్పుకున్నాడు.

ఏ రూపంలో చెప్పినా, ఎన్ని తేడాలున్నా, అంతిమంగా ఈ మతాలన్నిటి సారాంశం ఒక్కటే. తాను పండించే పంట సగంపైగా దోపిడీ వర్గాల గోదాములలోకి పోతుంది. అయినా రైతు శ్రమ చేయాలి. తాను నేసే బట్ట, కట్టే యిల్లు, చెక్కే శిల్పం ఇంకొకడికి అలంకరణ, ఇంకొకడికి ఆడంబరం, తనకు మాత్రం పూరి గుడిసే దక్కేది. అయినా కూలివాడు కూలిచేయాలి. ఈ శ్రమ దోపిడీని అతను నిరసించకుండ అంగీకరించేలా చూడటం మతం యొక్క ముఖ్య కర్తవ్యం. మతాన్ని పూజారులు తమ స్వార్థం కోసం సృష్టించారన్న వాదాన్ని హేతువాదులూ నాస్తికవాదులూ ప్రచారం చేస్తుంటారు. పూజలూ, పెళ్ళిళ్ళూ, తద్దినాలూ బ్రాహ్మలకు ఎంత సంపాదన సమకూర్చిపెడతాయో లెక్కగట్టి, అదే మతంయొక్క 'భౌతిక పునాది' అనుకుంటారు. ఇది చాలా అశాస్త్రీయమయిన అవగాహన. శ్రామికుడిని శ్రమదోపిడీకి లోనయ్యేలా చూడడం మతం కర్తవ్యం. దీనికి ఒక సాధనంగా పనిచేసే పూజారులు పనిలో పనిగా తమ స్వార్థం కూడా చూసుకుంటారు. ఆత్మ నిత్యం అనే సిద్ధాంతాన్ని తీసుకుందాం. ఈ శరీరం అనిత్యమనీ, తుచ్ఛమనీ, మనం బట్టలు మార్చుకున్నట్టు ఆత్మ శరీరాలను మారుస్తుందనీ (భగవద్గీతలో అన్నట్టు) ప్రచారం చేయడంలోగల ఉద్దేశ్యమేమిటంటే, ఈ శరీరం అనిత్యమయినదీ అల్పమయినదీ కాబట్టి ఇది చేసే శ్రమగాని, ఆ శ్రమయొక్క దోపిడీగాని పెద్ద విషయంగా పట్టించుకోకుండా నిత్యమయిన ఆత్మకు మోక్షాన్ని సాధించడానికి కావలసిన జాగ్రత్తలో నిమగ్నం కమ్మని శ్రామిక జనానికి చెప్పడం. ఈ సిద్ధాంతంలో భాగంగానే చనిపోయినవారికి 'పిండం' పెట్టే తద్దినాలు వగైరా పుట్టాయి. ఇది వాటి మౌలికమయిన చారిత్రక ప్రాధాన్యత. అయితే తదుపరి ఆ తద్దినాలు పెట్టించే బ్రాహ్మలు సవాలక్ష రూల్సు సృష్టించి ఒకడి చావు తమకు పండగగా మార్చు కున్నారు. తద్దినం ఎంత వైభవంగా పెడితే చనిపోయినవాడి ఆత్మకు అంతటి సుఖ సంతోషాలు లభిస్తాయని నమ్మించి తమ జీవనాన్ని పకడ్బందీ చేసుకున్నారు. మంత్రతంత్రాలూ పూజాపునస్కారాలూ కూడ ఇట్లాంటివే. వాటి ఉద్దేశ్యం పూజారుల బొక్కసాలు నింపడం కాదు. సామాన్య మానవుడిని (అంటే శ్రామికుడిని)

సమాజం ముందు, ప్రకృతి ముందు అశక్తుడిగా నిలబెట్టాలి. తనకేమీ తెలీదు. ఈ ప్రపంచం, అందులోని కష్టనష్టాలు, వాటికిగల కారణాలు తనకు అర్థంకావు. ఇహంకోసమో పరంకోసమో దేవుడిని అడగాలన్నా అది గూడ తనకు చేతకాదు. అందుకోసం ఒక తంతు నిర్ణయించబడి వుంటుంది. అది పూజారులకు మాత్రమే తెలుస్తుంది. జీవితం సజావుగా సాగాలంటే గూడ పెళ్ళి పుట్టుక చావు వీటన్నిటికీ తంతులుంటాయి. అవి గూడా పూజార్లకే తెలుస్తాయి. వీటన్నిటి ఉద్దేశ్యం శ్రామికుడికి ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునే అర్హతగాని శక్తిగాని లేదని నమ్మకం కలిగించి, ఎంతటి దోపిడీ దౌర్జన్యాలు అతనిమీద రుద్దినా ఇదే ప్రకృతి ధర్మం కాబోలుననుకొని, తనది ముదనష్టపు బ్రతుకని నిర్ణయించుకొని ఆ దౌర్జన్యానికి లొంగిపోయేలా చేయడం. పూజారులకే తప్ప శ్రామికులకు విద్య లేకుండా చేయడంలోగల ఉద్దేశ్యంగూడ ఇదే. ఈ క్రమంలో పనిలోపనిగా పూజారులయిన వాళ్ళు 'ప్రపంచ జ్ఞానం' మీద తమకున్న గుత్తాధిపత్యాన్ని ఆసరాచేసుకొని తమ పబ్బం గడుపుకుంటారు. అంతేగాని, వాళ్ళ కడుపు నింపడం కోసమే మతం ఉందనీ, వాళ్ళు పూజాపునస్కారాల ద్వారా కూడబెట్టేదే దోపిడీ అనీ హేతువాదులు చేసే సిద్ధాంతాలు అర్థరహితమయినవి. హేతువాదులకు అర్థంకాని ఈ విషయం గత కాలంలోని రాచరిక భూస్వామ్య వర్గాలకు మాత్రం స్పష్టంగానే అర్థమయింది. బ్రాహ్మలు తమ కడుపులు నింపుకోవడం కోసం లేరనీ, భూస్వామ్య దోపిడీ నిలబెట్టడం కోసం ఉన్నారనీ గుర్తించి బ్రాహ్మలకు కానుకగా అగ్రహారాలూ/ ఈనాములూ ఇచ్చి వాళ్ళనూ భూస్వాములను చేశారు. అట్లాగే గుళ్ళకూ బౌద్ధ ఆరామాలకూ ముస్లింల మసీదులకూ క్రిస్టియన్ చర్చిలకూ వాటి పోషకార్థం ఈనాంలు ఇచ్చి మత వ్యవస్థను భూస్వామ్యవర్గంలోకి మరింత సన్నిహితంగా చేర్చుకున్నారు.

ఏ మతాన్నయినా నిశితంగా విశ్లేషిస్తే ఇది స్పష్టంగా బోధపడుతుంది. 'మను ధర్మం' అని పిలవబడే హిందూ వర్ణాశ్రమ ధర్మాన్నే తీసుకుందాం. మొదట్లో చెప్పినట్టు, శ్రమ చేసే వర్గంచేత తన పొట్టకోసమే కాకుండ ఇతరుల పొట్టకోసమూ వినోద విలాసాల కోసమూ శ్రమ చేయించేలా చూడడం వర్గసమాజాల ప్రధాన సమస్య. ఆయా సమాజాలు ఈ సమస్యను ఏ పరిస్థితులలో ఎదుర్కొన్నాయి, ఏ

విధంగా పరిష్కరించుకున్నాయి అన్న విశ్లేషణతో మొదలుపెడితేనే మనకు సాహిత్యమయినా మతమయినా రాజ్యమయినా చట్టమయినా అర్థమవుతాయి. హైందవ సమాజంలో వర్ణ వ్యవస్థే ఈ పరిష్కారం. బ్రాహ్మలు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రులు అని నాలుగు వర్ణాలుంటాయి. వీరు కాకుండ హైందవ సమాజానికి వెలుపల (సాంఘికంగా మాత్రమే, ఆర్థికంగా కాదు) పంచములు (అంటరానివాళ్ళు) ఉంటారు. శూద్రులు, పంచములు (ఒకప్పుడయితే వైశ్యులు గూడ) శ్రమ చేస్తారు. పొలం దున్నుతారు. కమ్మరిపనీ, కుమ్మరిపనీ, వడ్రంగంపనీ చేస్తారు. సంపదను సృష్టిస్తారు. ఈ సంపదలో వాళ్ళకు దక్కేది మాత్రం వాళ్ళ మనుగడకు సరిపడేంత మాత్రమే. మిగిలినది అగ్రవర్ణాలకు చెందిన దోపిడీ వర్గాలకు చెందుతుంది. వాళ్ళలో భూస్వాములయిన వాళ్ళు వస్తురూపంలో, కౌలురూపంలో, వెట్టిరూపంలో దోచుకుంటారు. రాజులు శిస్తురూపంలో దోచుకుంటారు. వ్యాపారస్తులు తక్కువకు కొని ఎక్కువకు అమ్మి దోచుకుంటారు. పూజారులు అగ్రహారీకులయితే ఇతర భూస్వాములలాగే తామూ ప్రత్యక్షంగా దోచుకుంటారు. లేకుంటే రాచరిక భూస్వామ్య వర్గాలను ఆశ్రయించి వాళ్ళ దోపిడీలో భాగం పంచుకుంటారు. అదనంగా పూజాపునస్కారాలకు లభించే ముడుపులు ఉండనే వుంటాయి.

మరి ఈ దోపిడీకి శూద్రులూ, పంచములూ లొంగేది ఎట్లా ? వర్ణవ్యవస్థను వాళ్ళు ఎందుకు అంగీకరిస్తారు? స్వతహాగానయితే లొంగరు, అంగీకరించరు. అస్వాభావికమయిన ఈ లొంగుబాటును సాధించడం కోసం మతం, ధర్మశాస్త్రాలు ఉన్నాయి. సర్వసృష్టికర్త, సర్వవ్యాపితుడు, ఆద్యంతరహితుడు అయిన భయం గొలిపించే దేవుడిని సృష్టించి వాడిచేత 'చతుర్వర్ణ వ్యవస్థను నేనే సృష్టించాను' అని భగవద్గీతలో అనిపించారు. రకరకాల రంగులను సృష్టించినట్టు ఉబుసుపోకకు రకరకాల కులాలను సృష్టించాడేమోననుకునే అవకాశం లేకుండ, భగవద్గీత కంటే చాలాకాలం పూర్వమే, రుగ్వేదంలోని పురుషసూక్తంలో, దేవుడి ముఖంనుండి బ్రాహ్మలూ, భుజాల నుండి క్షత్రియులూ, తొడల నుండి వైశ్యులూ, కాళ్ళనుండి శూద్రులూ పుట్టారని చెప్పారు. దీన్ని విశదీకరిస్తూ మను ధర్మశాస్త్రంలో మనువు అసలు విషయానికొచ్చాడు. నాలుగు వర్ణాలను సృష్టించిన బ్రహ్మ ఆయా వర్ణాలకు

నిర్దేశించిన ధర్మాలు ఏమిటంటే - యజ్ఞాలు చేయడం, చేయించడం, చదువుకోవడం చదువు నేర్పడం బ్రాహ్మణుల ధర్మాలు. పరిపాలన, యజ్ఞాలు చేయించడం క్షత్రియ ధర్మాలు. వ్యాపారం, దానధర్మాలు వైశ్యుల ధర్మాలు. పై మూడు వర్ణాలకూ కిమ్మనకుండ శుశ్రూష చేయడం శూద్రుల ధర్మం. వీటిని ఆయా వర్ణాల 'స్వధర్మాలు' అంటారు. 'ధర్మవర్తన' అంటే అర్థం ఏ వర్ణానికి చెందినవారు ఆ వర్ణధర్మాన్ని నిర్వర్తించడం. అగ్రవర్ణాల వారి స్వధర్మాలు ఇబ్బందికరమయినవి కావు కాబట్టి, ఒక సమాజంలో ధర్మం నాలుగు కాళ్ళమీద నడుస్తోందంటే అర్థం-శూద్రులు, పంచములు కిమ్మనకుండ తమ శ్రమను ఇతరులకు దోచిపెడుతున్నారని. ఒక రాజు ధర్మరక్షకుడంటే అర్థం అతను నీతిగా నిజాయితీగా పరిపాలిస్తాడని కాదు - శూద్రులు తమ స్వధర్మాన్ని ఆచరించేలా చూస్తున్నాడని. వర్ణాశ్రమ ధర్మాలను ప్రజలంతా ఆచరించేలా చూడగల రాజే స్వర్గానికి పోతాడనీ, రాజుకే కాదు, ఎవరికయినాసరే స్వధర్మ నిర్వహణే మోక్షమార్గమనీ కౌటిల్యుడు అన్నాడు. దీనితో శూద్ర పంచముల మెడలకు మూడు గుదిబండలు తగులుకున్నాయి. ఒకటి, నారాయణుడే స్వయంగా చతుర్వర్ణ వ్యవస్థను తానే సృష్టించాననీ, శూద్రులను సేవచేయడం కోసమే సృష్టించాననీ చెప్పాడు. రెండు, 'ధర్మరక్షణ' స్వధర్మంగా గల రాజు శూద్రులు శ్రమచేసేలా చూస్తాడు. లేకపోతే తనకు ఇహమూ పరమూ గూడ లేకుండపోతాయి. మూడు, తమ స్వధర్మాన్ని నోరు మెదపకుండా ఆచరించడమే శూద్రులకు గూడ మోక్షప్రాప్తిని కలిగిస్తుంది. స్వధర్మాన్ని తప్పిస్తే నరకం తథ్యం. భగవద్గీతలో కృష్ణుడన్నట్టు స్వధర్మం ఎప్పటికీ శ్రేయస్కరమయినది, పరధర్మాన్ని అనుసరించడం భయంకరమైన పరిణామాలకు దారితీస్తుంది. నువ్వు గొల్లవాడివైతే గొర్రెలూ, బర్రెలూ కాచుకో. చదువుకుంటాననీ, యజ్ఞాలు చేస్తాననీ, రాజునవుతాననీ అన్నావో నరకానికి పోతావ్ ఖబడ్దార్ అని నారాయణుడు స్వయంగా బెదిరించాడు.

అప్పటికీ శ్రామికవర్గం దోపిడీకి లొంగిపడి వుంటుందన్న నమ్మకం మన ధర్మ శాస్త్రకారులకు కలగలేదు. అందుకోసం మరొకటి అవసరమయింది. పాపపుణ్యాల పేరుచెప్పి, స్వర్గనరకాల పేరుచెప్పి ఎంత బెదిరించినా ఆత్మగౌరవం ఉన్నంతకాలం శ్రమదోపిడీకి ఎవడూ సులభంగా లొంగిరాడు. తనది నీచపు

*శ్రామికుడిని శ్రమదోపిడీకి లోనయ్యేలా చూడటం మతం కర్తవ్యం*

బ్రతుకన్న నమ్మకం శ్రామికుడిలో కలిగించకపోతే తన పంటంతా ఇంకొకరు దోచుకుపోతుంటే చూస్తూ ఊరుకోడు. ఇంకొకడి పెంటను తాను శుభ్రం చేయడు. శ్రామికులలో ఆత్మగౌరవం నాశనం చేయాలని గుర్తించి ఆ పనిని అత్యంత సమర్థవంతంగా హిందూ ధర్మం నిర్వహించింది. వేరే ఏ మతమూ ఈ విషయంలో ఇంతటి సామర్థ్యాన్ని ప్రదర్శించలేదు.

శూద్రులు బ్రహ్మదేవుడి కాళ్ళ నుండి పుట్టారనీ, వాళ్ళు కుక్కతోను కాకితోను సమానమయిన నీచపు జంతువులనీ వేద సాహిత్యంలో అన్నారు. శూద్రుడు వేదం చదివితే పాపమని, అతని నాలుక కోసేయాలని, వేదం వింటే చెవిలో సీసం పోయాలని ధర్మ శాస్త్రాలన్నాయి. శూద్రుడు పండితుడయితే ఆ పాండిత్యం కుక్క ఎంగిలిచేసిన పాలలాంటి దన్నారు. చివరికి నేరానికి శిక్షను గూడ వర్ణాన్నిబట్టి నిర్ణయించారు. ఒకే నేరానికి బ్రాహ్మణుడికి గుండు గీయించడం శిక్ష అయితే శూద్రుడికి మరణదండన శిక్ష. కౌటిల్యుడితో మొదలుపెట్టి శాస్త్రకారులంతా ఇటువంటి వర్ణ పక్షపాతంతో కూడిన శిక్షాస్మృతినే ప్రతిపాదించారు. ఇదీ హిందూధర్మం. ఇదే విశ్వహిందూ పరిషత్ తదితర సంస్థలు 'పరమగంగ'గా కీర్తించే 'మన ధర్మం'.

## ఇప్పటి పాత్ర

హిందూధర్మాన్ని పునరుద్ధరించాలని ఇప్పుడు కొత్తగా జరుగుతున్న ప్రయత్నం ఉద్దేశ్యమేమిటి? మళ్ళీ వర్ణధర్మాన్ని ఉన్నదున్నట్టుగా నిలబెట్టి 'కులకట్టు'ను నెలకొల్పడం వాళ్ళ ఆశ అయితే కావచ్చుగాని, అది వారికి సాధ్యంకాదు. 'ధర్మం' అన్న భావనను పునరుజ్జీవింపజేసి 'స్వధర్మ' ఉల్లంఘనం శిక్షార్హం అన్న పాత ఆలోచనను మళ్ళీ బ్రతికించడం వాళ్ళ లక్ష్యం. ఈ 'స్వధర్మం' పుట్టుకతోనే వస్తుందని ఒకప్పటిలాగ బహిరంగంగా ప్రకటించే దమ్ములు ఆధునిక సనాతనులకు లేవు. అయితే పుట్టుకతో వచ్చినా రాకున్నా, ఒక వృత్తిలోకి ప్రవేశించిన తరువాత అది తన స్వధర్మం అయిపోతుంది. దాన్ని విశ్వాసంతో ఆచరించాలేగాని పరధర్మం కోసం ఆశించకూడదు. ఇందులో బీద గొప్ప తేడాలు లేవు. పనిచేయడం కార్మికుడి ధర్మం. అతను పనిచేయాలేగాని, తానే ఉత్పత్తి సాధనాలకు యజమానినయి పోదామని సమ్మెలు వగైరా చేసి పని బంద్ పెట్టడం ధర్మ విరుద్ధం. జీతగాడు

పొలం దున్నాలి, భూస్వామి కోసం అడ్డమైన చాకిరీ చేయాలి. అది అతని ధర్మం. దాన్ని వదిలిపెట్టి తానే భూమికి యజమానినయిపోవాలని కోరడం పర ధర్మాన్ని కోరడం. అది భగవద్గీతలో చెప్పినట్టు 'భయావహం'. కాబట్టి దున్నేవాడిదే భూమి అనే నినాదం ధర్మ విరుద్ధం. తాము కులాలను, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తున్నామని ప్రకటించుకొని, దొడ్డిదారి గుండ ఈ 'ధర్మవర్తన'ను మళ్ళీ ప్రవేశపెట్టడం వాళ్ళ ఉద్దేశ్యం. వాళ్ళ మాటల్లో చెప్పాలంటే, శరీరంలో వివిధ భాగాలున్నట్టే సమాజంలో వివిధ వృత్తులుంటాయి. (భూస్వామ్యమూ, షాహుకారీ గూడ 'వృత్తు'లే) ఇందులో ఎక్కువ తక్కువల ప్రసక్తి లేదు. చేయి కాలికంటే గొప్పది కాదు, కాలు కంటికంటె గొప్పది కాదు. అట్లాగే సమాజంలో భిన్న వృత్తులు గూడ. శరీర భాగాల లాగ అందరూ సామరస్యంగా బ్రతకాలి. అయితే చిక్కెక్కడొస్తోందంటే, శరీర భాగాలు ఒకదానినొకటి దోచుకోవు. సమాజంలో ఒక వర్గం వేరొక వర్గాన్ని దోచుకుంటుంది. అటువంటప్పుడు సామరస్యాన్ని బోధించడం అంటే దోపిడీని సంరక్షించడం మాత్రమే.

ఈ వర్గ సామరస్యం ఎందుకోసం అందరూ పాటించాలి? ఒకప్పుడయితే అదే మోక్షానికి మార్గమనీ, ధర్మం తప్పితే నరకానికి పోతారనీ బెదిరించారు. ఇవ్వాళ ఆ బెదిరింపు నడవదు కాబట్టి దాని స్థానంలో 'దేశభక్తి'ని ప్రవేశపెట్టారు. కార్మికులు సమ్మెచేస్తే ఉత్పత్తి పడిపోతుంది అది 'దేశానికి' నష్టం. రైతులు పనులు బంద్ పెడితే పొలాలు బీడుపడతాయి. పంట నష్టమవుతుంది. 'దేశం' పేదదవుతుంది. అంటే ఒకప్పుడు పాపంగా పరిగణింపబడ్డ ధర్మ ఉల్లంఘనం ఇప్పుడు దేశద్రోహమయింది. ఒకప్పుడు శూద్రుడు శ్రమదోపిడీని వ్యతిరేకిస్తే అతనికి నరకం ప్రాప్తిస్తుందని బెదిరించిన దోపిడీ వర్గం, ఇవ్వాళ 'దేశానికి' కొన్ని వేలకోట్ల రూపాయల 'నష్టం' కలిగించిన బొంబాయి జౌళిమిల్లు కార్మికుల సమ్మెలో పాల్గొన్నవారిని జాతీయభద్రతా చట్టం క్రింద అరెస్టు చేసింది. 'దినం దినం మన కణం కణం దేశమాతకే సమర్పణం' వంటి వీరావేశం కలిగించే దేశభక్తి నినాదాలు మధ్యతరగతిలోకి చొప్పిస్తున్నారు. తమ బ్రతుకులు బాగుపరచుకోవడం కోసం పోరాటాలు చేసి సమాజంలో సామరస్యాన్ని, కృత్రిమశాంతిని చెడగొట్టే కార్మిక కర్షక వర్గాలపట్ల మధ్యతరగతిలో వ్యతిరేకత కలిగిస్తున్నారు.

కల్లోలం చెలరేగితే దేశమనుగడకే ముప్పని బెదిరిస్తున్నారు. ('విప్లవ నినాదం వెనుక విదేశీ దాడి దాగుంది' అనే నినాదాన్ని గుర్తుతెచ్చుకోవాలి). భూస్వాములకు, పెట్టుబడిదార్లకు నష్టం కలిగించే పోరాటాల్ని దేశానికి నష్టదాయకమయిన కల్లోలంగా చిత్రీకరించి మధ్యతరగతికి సహజమయిన జాతీయభావాన్ని తమ ఆస్తులు కాపాడుకోవడం కోసం వాడుకుంటున్నారు. దీని గురించి ఎవరికి అనుమానం ఉన్నా దోపిడీ వర్గాలకు మాత్రం లేదు. తెలంగాణ జిల్లాలలో ఎ.బి.వి.పి. సభ్యులలో అత్యధిక భాగం హిందూధర్మం చేత భూసురులగా పరిగణింపబడ్డ బ్రాహ్మణులు కారు. భూస్వామ్య ధనికరైతు కుటుంబాలలో పుట్టిన రెడ్డి, వెలమ తదితర శూద్ర కులస్తులు. హిందూధర్మం ఈ కులాలను కుక్కలు కాకులు అనింది. బ్రాహ్మణులకు సేవచేయడానికే వీళ్ళను బ్రహ్మదేవుడు సృష్టించాడనింది. వీళ్ళు చదువుకుంటే నాలుక కోసేయమంది. చెవిలో సీసం పొయ్యమంది. తిరగబడితే చంపమంది. కాని ఇవ్వాళ భూస్వాములయిన వీరిలో కొందరు 'హిందూ ధర్మాన్ని' సంరక్షించడానికి ముందుకు వస్తున్నారంటే అది కేవలం తమ భూములను, ఆస్తులను, గ్రామాలలో బీటలు వారుతున్న తమ పెత్తనాన్ని కాపాడుకోవడం కోసం మాత్రమే.

వీళ్ళు 'విప్లవం విదేశీ భావాల నుండి రాద'ంటారు. కాని తమ వేష భాషలు, తాము తిరిగే స్కూటర్లు, కార్లు, తమ పొలాల్లో జీతగాళ్ళచేత పుష్కలంగా పండించే పంటలకు ఎరువులు, మందులు అన్నీ విదేశీ భావాల నుండే వస్తాయి. ఈ అర్ధవలస దేశపు సకల వినోదాలూ విలాసాలూ విదేశీయమే. అయినా ఈ విదేశీభక్తులకు అభ్యంతరం లేదు. శ్రామిక వర్గానికి విముక్తి నివ్వగల రాజకీయం మాత్రమే విదేశాల నుండి వస్తే దాన్ని దేశద్రోహంగా చిత్రించి జాతీయ దురభిమానాన్ని రెచ్చగొడతారు. 30 వేల కోట్ల రూపాయలు అప్పుచేసి, సంవత్సరానికి రెండు వేలకోట్లు అప్పుకింద చెల్లించుకుంటూ, అన్ని పారిశ్రామిక రంగాలనూ అమెరికా రష్యా సామ్రాజ్యవాదులకు ముడిబెట్టినప్పుడు ఈ 'దేశభక్తులు' నోరుమెదపలేదు. అది దేశద్రోహం కాలేదు. శ్రమచేసేవాడికి న్యాయం జరిగే వ్యవస్థ రావాలంటే అది దేశద్రోహమయింది.

హిందూ ధర్మాన్ని వర్గ సామరస్యం కోసం, 'దేశభక్తి'ని మధ్యతరగతిని రెచ్చగొట్టడం కోసం వాడుకొని ఈ బూర్జువా భూస్వామ్య దోపిడీ వ్యవస్థను సంరక్షించడం ఆర్.ఎస్.ఎస్. చేస్తున్న పని. ఇంతకాలం ఈ పని ప్రచారస్థాయిలో జరిగింది. ఇప్పుడు భూస్వాముల ముద్దుబిడ్డలు (వీళ్ళనే 'భరతమాత ముద్దుబిడ్డలు' అంటారు) ఎ.బి.వి.పి.లో స్వయంగా చేరి, ఇతర విద్యార్థులలో జాతీయ దురభిమానాన్ని రెచ్చగొట్టి విప్లవ ప్రజానీకం పక్షాన నిలబడే రాడికల్ విద్యార్థి యువజనులమీద దాడులు, హత్యలు సహితం చేస్తున్నారు. వాళ్ళకు పోలీసుల మద్దతు సంపూర్ణంగా వుంది. వాళ్ళెన్ని దాడులుచేసినా అవి నేరాలు కావు. కేసులు కావు. గ్రామాల్లో పోలీసులు భూస్వాముల ఇళ్ళల్లో క్యాంపులు పెట్టినట్టు పట్టణాల్లో భూస్వాముల బిడ్డలు పోలీసుల జేబుల్లో కాపురం చేస్తున్నారు. ఇది ఇవ్వాళ కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాలలో కళ్ళున్న వాళ్ళందరికీ కనిపించే నగ్నసత్యం. ఈ నగ్నసత్యానికి బలయిన వాడు కా॥ శేషయ్య.

# హిందూ మత రాజ్యం

భారతదేశంలో మత రాజ్యం ఎప్పటికయినా వస్తుందంటే ఒకప్పుడు ఎవ్వరూ నమ్మేవారు కాదు. అది పాకిస్తాన్‌లో, సౌదీ అరేబియాలో జరగవచ్చును కానీ భారతదేశంలోనా అనేవారు. హిందూ సంప్రదాయమే లౌకిక సంప్రదాయమని కొందరు వాదించేవారు. హిందూమతం ఒక జీవన విధానమే తప్ప క్రైస్తవం, బౌద్ధం, ఇస్లాంలలాగ వ్యవస్థీకృత మతం కాదని కొందరు వాదించేవారు. హిందువులలో వున్న కులవ్యవస్థ కారణంగా మత రాజ్యాన్ని ఏర్పరచడానికి కావలసినంత ఐక్యత హిందువులలో సాధ్యంకాదని కొందరు భావించేవారు. ఈ దేశంలో ప్రజాతంత్ర విప్లవం చాలా దూరం పోయిందనీ ఇంతటి ప్రజాతంత్ర చైతన్యం గల ప్రజలు మత రాజ్యాన్ని సహించరనీ కొందరు ధైర్యం చెప్పేవారు.

ఈ వాదనలలోని మంచి చెడ్డలు ఎట్లాగున్నా హిందూ మతతత్వం ఈ దేశంలో రాజ్యం చేయడం అసంభవమని ఇంక ఇప్పుడెవ్వరూ అనుకోవడం లేదు. కులాలు ఏమయ్యాయో, 'జీవన విధానం' ఏమయిందో, ప్రజాతంత్ర సంప్రదాయం ఏమయిందో కానీ మతరాజ్యం ఛాయలు-మసక మసగ్గానే కానీ - కనబడడం మొదలుపెట్టాయి.

చర్చను మతంతో మొదలుపెడితే సమాధానం ఎప్పటికీ దొరకదు. ప్రతీ మనిషికీ అల్లా దృష్టిలో సమాన గౌరవం ఇవ్వడంలో ఇస్లాం తనకు తానే సాటి. ఆ మతస్తులు ఆ విషయాన్ని సగర్వంగా చెప్పుకుంటారు కూడ. అయినా ఇస్లాం పేరుమీద కరుడుగట్టిన భూస్వామ్య రాజ్యాలు అనేకం నడుస్తున్నాయి. దీనికి కారణాన్ని ఇస్లాంలో వెతికి ప్రయోజనం లేదు. దేవుని సన్నిధి పేదలకే చెందుతుందనీ ధనవంతుడు దేవుని దగ్గరికి చేరడం కంటే సూది కంట్లో నుండి ఒంటె దూరడం సులభమనీ చెప్పే క్రైస్తవమూ, అహింసనూ అష్టసూత్ర సత్ప్రవర్తనా నియమావళినీ సన్మార్గాలుగా బోధించే బౌద్ధమూ ఇస్లాంలాగే నిరంకుశ ప్రభుత్వాల మతాలుగా పనిచేసాయి. తమిళులను శ్రీలంకలో నిర్దయగా ఊచకోత కోస్తూవున్న

---

ఉషా ఎస్. డానీ తీసుకొచ్చిన ఫెడరల్ ఇండియా పబ్లికేషన్-1, మే 1991, విజయవాడ

సింహళ జాతీయవాదం బౌద్ధాన్నే తన జాతీయమతంగా చెప్పుకుంటుంది. అదేమంటే బౌద్ధం చెప్పే అహింస బౌద్ధులకు మట్టుకే వర్తిస్తుందని ఒక సింహళ భిక్షువు సమర్థించుకున్నాడంట ! ఇక హైందవంలో నిజంగానే ఏవో ప్రత్యేకతలున్నా అది మట్టుకు నిరంకుశ రాజ్యాధికారానికి సిద్ధాంతమెందుకు కాజాలదు? నిజానికి సమాన గౌరవాన్ని గురించి కానీ, పేదల కష్టాలను గురించి కానీ, సామాజిక సమానత్వాన్ని గురించి కానీ ఎన్నడూ మాట్లాడని హైందవానికి ఇతర మతాలకంటే ఈ కర్తవ్యం సులభమే కావాలి.

మతరాజ్యం అంటే మత స్వభావంగల రాజ్యం అని అర్థం చేసుకుంటే ఈ గందరగోళమంతా వస్తుంది. కానీ మతరాజ్యాన్ని మతాన్ని భావజాలంగా ఉపయోగించే లౌకిక రాజ్యంగా అర్థం చేసుకుంటే ఏ గందరగోళమూ లేకుండ విషయం అర్థం అవుతుంది. బౌద్ధం పేరుమీద యుద్ధాలు ఎట్లా చేయగలరో, క్రైస్తవం పేరుమీద పెట్టుబడిదారీ కోటీశ్వరులను ఎట్లా సమర్థించగలరో, ఇస్లాం పేరుమీద ఒక మనిషి మరొక మనిషికి బానిసగా బ్రతికే దోపిడీ వ్యవస్థను ఎట్లా నిలబెట్టగలరో, 'ఇందుగలడందు లేడని సందేహము వల'దని దేవుడిని ప్రస్తుతించే హిందూమతం పేరుమీద రాముడు ఫలాన మసీదున్న చోటనే పుట్టాడని ఎట్లా అనగలరో అప్పుడర్థం అవుతుంది.

ఏ రాజ్యానికయినా ఒక భావజాలం అవసరం. రాజ్యానికి భావజాలమే అనవసరమయిన నాడు అసలు రాజ్యమే అనవసరం. అత్యంత అభ్యుదయ స్వభావంగల రాజ్యం శాస్త్రీయ సిద్ధాంతాన్నీ వాస్తవికమయిన ఆదర్శాలనూ తన భావజాలంగా ఎంచుకోగలదుగానీ దోపిడీ వ్యవస్థల భావజాలంలో మార్మికతే ప్రధాన అంశంగా ఉండక తప్పదు. అన్యాయమయిన వ్యవస్థను నిలబెట్టడానికి మార్మిక సిద్ధాంతం అవసరం. ఆ సిద్ధాంతం పట్ల ప్రజలలో విశ్వాసం కలిగించడం అవసరం. వ్యవస్థ ఎంత అన్యాయంగా ఉంటే అంత బలమయిన మార్మికత అవసరమవుతుంది. గాంధీయిజం, సోషలిజం మార్మిక భావజాలంగా పనిచేయగలవు. 40 ఏళ్ళుగా మన దేశంలో పనిచేస్తున్నాయి కూడ. అయితే ఇవి ప్రజలలో బాగా బలంగా నాటుకున్న భావాలు కావు కాబట్టి, పైగా వీటిని ఆదర్శాలుగా ప్రకటించుకున్న వ్యవస్థ ఏదో ఒక మేరకు అహింసనూ సామరస్యాన్నీ

సమానత్వాన్నీ ఆచరించక తప్పదు కాబట్టి, సామాజిక సంక్షోభం పెరిగి పరిస్థితి విషమిస్తే వీటిని వదిలి పెట్టి, మతాన్ని ఆశ్రయించవలసి రావచ్చు. ఆ పరిణామాన్ని ఇవ్వాళ మన కళ్ళ ముందు చూస్తున్నాం.

సద్దాం హుస్సేన్ నాయకుడుగా ఉన్న బాత్ పార్టీ సిద్ధాంతంలో ఇస్లాం ప్రసక్తి లేదు. లౌకికవాదం, అరబ్బు జాతీయవాదం బాత్ ఉద్యమ సిద్ధాంతాలు. ఆ ఉద్యమం ఒక్క ఇరాక్‌కే పరిమితమయింది కాదు. ఆధునిక కాలంలో అన్ని అరబ్బు దేశాలలోనూ ఒక రాజకీయ శక్తిగా ముందుకొచ్చింది. అయితే సద్దాం హుస్సేన్ తాను గెలవలేని యుద్ధాన్ని మీదికి తెచ్చుకునేటప్పటికి లౌకికవాదాన్ని పక్కకుపెట్టి ఇస్లాంపేరిట జిహాద్ ప్రకటించవలసి వచ్చింది. అమెరికా ప్రభువుల ఆంతరంగిక పాలనకు బూర్జువా ప్రజాస్వామ్యపు మార్మికత సరిపోతుంది. కాని వాళ్ళు బయటదేశాల మీద అన్యాయమయిన యుద్ధాలు చేసేటప్పుడు మట్టుకు అది చాలక, అంతర్జాతీయ ఠాణేదార్‌గా చరిత్ర అమెరికా మీద పెట్టిన బందోబస్తు కర్తవ్యం అనే మార్మిక స్వాతిశయాన్ని ఆశ్రయిస్తారు. సోవియట్ రష్యా పాలకులు సోషలిస్టు ఆదర్శాలను పక్కకుపెట్టి పెట్టుబడిదారీ పునరుద్ధరణను చేపట్టిన తరువాత చాలాకాలం దాకా సోషలిజాన్ని మార్మిక భావజాలంగా వాడుతూ వచ్చారు. అయితే ఆ వైరుధ్యం అవధులు దాటి సాంకేతిక పురోగమనానికి ఆటంకం అయి కూర్చునే సరికి సోషలిజం అనే మార్మికతను సహితం వదిలిపెట్టేసారు. దాని స్థానంలో పెరిస్త్రోయికా గ్లాస్‌నాస్త్‌లు మార్మిక భావజాలాలుగా ఎదగడం సాధ్యపడదు కాబట్టి క్రమంగా ఆ స్థానాన్ని జాతీయవాదం – రష్యన్ జాతీయవాదం, జార్జియన్ జాతీయవాదం, ఆర్మేనియన్ జాతీయవాదం, అజర్బైజానీ జాతీయవాదం, లాట్వియన్ జాతీయవాదం, మొదలయినవి – ఆక్రమించుకుంటున్నాయి.

శాస్త్రీయ సిద్ధాంతం కానిదల్లా మార్మిక భావజాలమేననేటప్పుడు ఏ భావజాల మయితేనేం అని అచారిత్రకంగా అనుకునే ప్రమాదం వుంది. కానీ ఒక్కొక్క భావజాలానికీ ఒక్కొక్క చారిత్రక మూలం, ఒక్కొక్క చారిత్రక పాత్ర ఉంటాయి. ఆ చారిత్రక దశలో ప్రగతికీ ప్రజాస్వామ్యానికీ ఉండే అవకాశాన్ని బట్టి, పాలకవర్గాల మీద ప్రజలు పెట్టే ఒత్తిడినిబట్టీ పాలకవర్గాలు ఎంచుకునే భావజాలం నిర్ణయించబడుతుంది. ఈ నిర్ణయం ఒక సంక్లిష్టమయిన పోరాటం ఫలితంగా జరుగుతుంది. పశ్చిమ ఆసియా దేశాలలో అరబ్బు జాతీయవాదం పాలక

భావజాలంగా ఉన్న దేశాలలో కొంతమేరకు సామాజిక రాజకీయ ప్రజాస్వామీ కరణ జరిగింది. సాంస్కృతిక ఆధునీకరణ జరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత ఆ ప్రాంతంలో బలంగా వున్న రాజకీయ పరిస్థితులు, ఆధునీకరణ కోసం, ప్రజాస్వామీకరణ కోసం నడిచిన ప్రజా ఉద్యమాలు అరబ్బు జాతీయవాదానికి నేపథ్యం. ఇప్పుడు ప్రజాస్వామీకరణను సహించలేని సంక్షుభిత దశకు ఆ ప్రాంత పాలక వర్గాలు దిగజారి, ఇస్లామిక్ మతతత్వం పాలక భావజాలం అయ్యే ప్రమాదం ఉంది. అప్పుడు ఇన్నాళ్ళూ సాధించిన సామాజిక ప్రగతి దెబ్బ తింటుంది. మన దేశ పాలకవర్గాలు ఆశ్రయించిన గాంధీయిజం– సోషలిజం– సామాజిక న్యాయం అనే మార్మికత వెనుక అనేక దశాబ్దాల ప్రజాపోరాటాల విజయాలు, అవి పాలకవర్గాల మీద పెట్టిన ఒత్తిడి వున్నాయి. ఇప్పుడు ఆ మాత్రం ఆదర్శాలను సహించే స్థితిలో పాలకవర్గాలు లేని కారణంగా మతతత్వం పాలక మార్మికత స్థానాన్ని ఆక్రమించుకునే ప్రమాదం ఉంది. హిందూ మత రాజ్యానికి మూలం అక్కడే వుంది. ప్రజోపయోగ పాలనకు ఇంకా అవకాశం ఉండి ఉంటే, అద్వానీ రథయాత్ర – వోట్ల కోసం తీసిందే అయినా – సామాజిక న్యాయం పేరుమీద నడవగలిగి ఉండేది. భూములు పంచాలనీ ఉద్యోగాలు కల్పించాలనీ సామాజిక అణచివేతను అంతం చేయాలనీ అద్వానీయో మరొకడో రథయాత్ర తీసి ఉండవచ్చును. కాని సామాజిక న్యాయాన్ని తట్టుకునే స్థితిలో వ్యవస్థలేదు కాబట్టి సామాజిక న్యాయం పేరు మీద పాలకవర్గ రాజకీయం నడవడం ఇంక సాధ్యపడదనీ, మతం పేరు మీదనో దేశభద్రత పేరు మీదునో నడవడం శ్రేయస్కరమనీ పాలకులు నిర్ణయించుకున్నారు.

అందుకే మతతత్వం మీద జరిగే చర్చ మొత్తం భారతీయ జనతాపార్టీని దూషించడంతో ముగియడానికి వీలులేదు. 'బిజెపి వోట్ల రథయాత్ర చేపట్టింది' అని అందరూ అంటున్నారు. అది నిజమే కానీ విశ్లేషణ అక్కడితో ఆగిపోతే సరిపోదు. 'వ్యవస్థ తన మనుగడ కోసం హిందూ మతతత్వ భావజాలాన్ని ఆశ్రయిస్తోంది' అనే అవగాహనకు ఎదగడం అవసరం. అది బిజెపి రాజకీయాలలో స్పష్టమయిన రూపం తీసుకోవచ్చు. అయితే బిజెపి రాజకీయాలే దాని సంపూర్ణ అర్థం కాదు. ఇవాళ బిజెపి రథయాత్రతో అంకురించిన హిందూ

మతతత్వ రాజకీయం చివరికి కాం(గ్రెస్ ద్వారానే గద్దె నెక్కవచ్చు ! లేదా సైనిక పాలన ద్వారా గద్దె నెక్కవచ్చు. పాకిస్తాన్‌లో ఇస్లామిక్ మతరాజ్యాన్ని నడిపింది సైనికాధికారుల లౌకిక బలమే తప్ప జమాతే ఇస్లామీ మత చాదస్తం కాదు కదా !

మన సామాజిక వ్యవస్థలో భూస్వామ్య సంబంధాలూ సంప్రదాయాలూ ఒక వైపు కొనసాగుతుండగా ఇంకొక వైపు వికృతమయిన పెట్టుబడి వ్యాప్తి జరుగుతూ వుంది. ప్రజాతంత్ర విప్లవం పరిపూర్తి కాకుండ సామ్రాజ్యవాద పెట్టుబడి భూస్వామ్యపు పొరలలోకి ప్రవేశించి అందిన మేరకు వ్యాపించి ఒక కురూపి వ్యవస్థను తయారుచేసింది. ఇదంతా సామాజిక న్యాయం, సోషలిజం, ప్రగతి అనే మార్మికత చాటునే జరిగింది. మొదటి రెండు దశాబ్దాలలో చేపట్టిన ఉత్పత్తి శక్తుల ఆధునీకరణ వల్ల 'ప్రగతి' అనే మార్మికతకు కొంత బలం చేకూరింది. దానిని జాతి ప్రగతిగా, దేశ పురోభివృద్ధిగా నమ్మించగలిగారు. దానిని నమ్మిన జనం భూసంస్కరణ చట్టాలలో సామాజిక న్యాయం ఉందనీ నమ్మగలిగారు. ఆ ప్రగతి నిజస్వరూపం ఏమిటో ఇప్పుడర్థం అవుతూవుంది. స్థానిక ధనిక వర్గాల భౌతిక జీవితాన్ని ఆధునిక సాంకేతిక ప్రాతిపదిక మీద నిలబెట్టి మరింత ఆస్తి సంపాదించుకోవడానికి అవకాశం కల్పించడం, అదే సమయంలో సామ్రాజ్య వాదానికి ఈ దేశంలో ఒక మార్కెట్‌నూ దళారీ వ్యవస్థనూ ఏర్పాటు చేయడం ఈ 'ప్రగతి'కి అర్థం అని బోధపడుతూ వుంది. ఇప్పుడిక 'ప్రగతి' అనే లక్ష్యానికి మార్మిక భావజాలంగా పనిచేసే సామర్థ్యం పోయింది. 'ప్రగతి' జరగడం లేదని కాదు. జరుగుతూనే వుంది. కొత్తరకం ఐస్‌క్రీంల నుండి కొత్తరకం ఎలక్ట్రానిక్ ఆటవస్తువుల దాకా బజార్లో రోజూ కొత్తదనం కనబడుతూనే వుంది. నిజానికి గతంలో కంటే వేగంగా కొత్తదనం మార్కెట్‌లలోకి వస్తూ వుంది. అయితే ప్రజలు దానిని దేశప్రగతిగా, జాతి పురోభివృద్ధిగా భావించగల దశ పోయింది. దానిని ప్రజలు తమ ప్రగతిగా భావించి దానితో మమేకం కాగల స్థితి పోయింది. దేశంలో 'దేశభక్తి'కి కరువొచ్చింది.

ఆర్థిక ప్రగతి ఆస్తిపరులలో అందరి ఆకాంక్షలనూ సామరస్యంగా తీరుస్తూ, ప్రజలకు కూడ కొంత ఇవ్వగలిగిననాడే రాజకీయాలలో శాంతి, ప్రజాస్వామ్యం

ఎంతో కొంత సాధ్యమవుతాయి. కానీ బలహీనమయిన పరాధీన పెట్టుబడికి అంతటి వ్యాప్తిని సాధించే సామర్థ్యం లేదు. ప్రజలకు ఏమయినా ఇవ్వగల దశ దాటిపోయింది. పోను పోను ఈ సంక్షోభం తీవ్రమవుతుంది. ఇప్పటికే ధరల పెరుగుదల 10 శాతం చేరుకుంది. ఆర్థిక వనరులలో క్షామం తీవ్రమయింది. ద్రవ్యవ్యవస్థ పతనావస్థను చేరుకుంది. ప్రపంచ బ్యాంకు నుండీ ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నుండీ అంతర్జాతీయ ద్రవ్యనిధి నుండీ అప్పులు తీసుకోనిదే రోజువారీ అభివృద్ధి కార్యక్రమాలు కూడ సాగడం లేదు. కొత్త ప్రాజెక్టులకే కాదు, మెయింటెనెన్స్‌కు కూడ అప్పులు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితులలో పాలకవర్గాల మధ్య తగవు చాలా తీవ్రరూపం తీసుకుంటూ వుంది. ప్రజలలో విశ్వాసం కలిగించి వోట్లు సంపాదించుకోవడానికీ, న్యాయమయిన అంచనాలతో టెండర్లు ఇచ్చి కాంట్రాక్టు పొందడానికీ, నాణ్యమయిన ప్రయత్నం ద్వారా మార్కెట్‌లో పట్టు సంపాదించుకోవడానికీ ఎవ్వరికీ ఓపికలేదు. హత్యలు చేసీ గుండాయిజం చేసీ లంచాలు మేపీ కుట్రలు చేసీ బెదిరించీ భయపెట్టీ అధికారమూ ఆస్తులూ సంపాదించుకోవాలని చూస్తున్నారు. సంపాదించుకుంటున్నారు. ఇన్ని అక్రమ సాధనాలలో మతతత్వం ఒకటి. వోట్లు సంపాదించుకోవడానికి సారాయి పొట్లాలు ఉపయోగపడ్డట్టే మతతత్వమూ ఉపయోగపడుతోంది.

అయితే వోట్లు సంపాదించుకునే సాధనంగా మతతత్వాన్ని అర్థం చేసుకుంటే సరిపోదు. నిజానికి కాంగ్రెస్(ఐ) నుండి జనతాదళ్ దాకా సకల పాలక పార్టీల నాయకులూ బిజెపి వోట్ల కోసం మతాన్ని వాడుకుంటూ వుందని దూషించడం మొదలుపెట్టినప్పుడే, మతతత్వానికి ఇంతకంటే ముఖ్యమయిన రాజకీయ ప్రయోజనం ఉందేమో, దానిని కప్పిపెట్టడానికి అందరూ బిజెపిని పట్టుకు తిడుతున్నారేమో అని మనకు అనుమానం రావాలి.

వ్యవస్థ పట్ల ప్రజలలో విశ్వాసం ('దేశభక్తి') కలిగించనిదే ఏ వ్యవస్థా నిలవదు. విశ్వాసం కలిగించడానికి నిజమయిన ఆదర్శాలూ నిజమయిన సామాజిక న్యాయమూ, సార్వజనీన ప్రగతీ కొరవడినప్పుడు మతతత్వాన్నీ జాతీయతత్వాన్నీ పాలకులు ఆశ్రయిస్తారు. కాంగ్రెస్(ఐ) 'గరీబీ హఠావో' నినాదాన్ని వదిలిపెట్టి దేశసమగ్రత సమైక్యతల గురించి మాట్లాడుతుంది. బిజెపి 'ఒకే జాతి, ఒకే ప్రజ,

ఒకే చట్టం' అంటుంది. ఈ జాతీయతా భావమూ చాలకపోతే పచ్చిగా ముస్లింలపట్ల, సిక్కులపట్ల వ్యతిరేకత రెచ్చగొడతారు. 'మనమంతా హిందువులం, గంగ సింధు బిందువులం' అంటారు. సామాజిక న్యాయం సాధిస్తామనే, సోషలిజాన్ని నిర్మిస్తామనే మాటలు నమ్మి ఈ దేశాన్ని ప్రజలు ప్రేమించగల దశ పోయింది కాబట్టి హిందువులుగా ప్రేమించమంటున్నారు. హైందవంలో ప్రేమించదగ్గ లక్షణాలు మృగ్యం కాబట్టి ముస్లింలపట్ల ద్వేషాన్ని రెచ్చగొట్టి హిందూత్వ భావాన్ని పెంపొందిస్తున్నారు. నిజానికి ఈ విషయంలో హైందవం చాలా ప్రమాదకరమయిన మతం. ముస్లింలకూ క్రైస్తవులకూ బౌద్ధులకూ సిక్కులకూ తమ మత సంప్రదాయాలలో గర్వించదగ్గ విషయాలేవో కనబడతాయి. అందుకోసం వారు తమ మతాలను ప్రేమించగలరు. ఆ మతాలు చరిత్రలో విప్లవాత్మక పరిణామాల నేపథ్యంలో భవిష్యత్తు పక్షాన పుట్టాయి. పశ్చిమాసియాలో బాగా పతనమయి అస్తవ్యస్తంగా తయారయిన గణవ్యవస్థ మీద తిరుగుబాటు జరిగి నాగరిక వర్గవ్యవస్థకు నాంది పలికిన చారిత్రక పరిణామంలో భాగంగా ఇస్లాం పుట్టింది. బౌద్ధం మన దేశంలోని నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో అటువంటి పాత్రనే అంతకు వెయ్యేళ్ళ పూర్వం నిర్వహించింది. యూరప్‌లో బానిస వ్యవస్థమీద జరిగిన తిరుగుబాట్లలో భాగంగా క్రైస్తవం పుట్టింది. మన దేశంలో మధ్యయుగాల చివరి దశలో పలు ప్రాంతాలలో ప్రజ్వరిల్లిన ప్రజాస్వామిక వెల్లువలో భాగంగా సిక్కుమతం పుట్టింది. ఈ మతాలన్నీ పోను పోను భూస్వామ్య రాచరికాలకు ఆలంబనగా నిలిచాయి. నిరంకుశ ప్రభుత్వాల భావజాలంగా పనిచేశాయి. భూస్వామ్య వ్యవస్థ మీద యూరప్‌లో జరిగిన తిరుగుబాట్లతో పుట్టిన క్రైస్తవ ప్రొటెస్టెంట్ శాఖలు పెట్టుబడిదారీ దోపిడీకి భావజాలం కాగలిగాయి. అయినప్పటికీ ఆదిలో ఈ మతాలు నిర్వహించిన విప్లవాత్మక పాత్రవల్ల ఈ మతాలలో గర్వించదగ్గ అంశాలు దొరుకుతాయి. ఆ అంశాలకు ఇవ్వాళ చారిత్రక ప్రాముఖ్యం తప్ప వేరే ఏమీ లేకున్నా ఏదో ఉందని భ్రమింపజేయడం సాధ్యం.

హైందవం ఏ రోజు ఏ రకమయిన విప్లవ పాత్రనూ నిర్వహించలేదు. అది ఆది నుండీ కూడ పాలక వర్గాల మతమే. వ్యవస్థలో మార్పులు వచ్చినప్పుడు కొత్త పరిస్థితులకు అనుగుణ్యమయిన మార్పులను అంతర్గతంగా సాధించుకొని

కొత్తరంగులు పులుముకొని ముందుకొచ్చింది. ఆ మార్పు సందర్భంగా హైందవ సంప్రదాయం పట్లనే తిరుగుబాట్లు వస్తే వాటిని రకరకాలుగా అణచివేసి తనలో కలిపేసుకొని, తాను మౌలికంగా దెబ్బతినకుండా జాగ్రత్త పడింది. హైందవం గర్వంగా ప్రకటించుకునే విప్లవ సంప్రదాయమేమీ లేదు. అందువల్ల 'హిందుత్వం' పరమత ద్వేషం మీద మాత్రమే మనగలదు.

ప్రగతినీ ప్రజాస్వామ్యాన్నీ వదిలిపెట్టి మతతత్వ మార్మికతను పాలక వర్గాలు ఆశ్రయిస్తే దాని ఫలితంగా – భవిష్యత్తు సంగతి ఎట్లాగున్నా – ఇప్పటిదాకా సాధించిన సామాజిక ప్రగతి దెబ్బతినే ప్రమాదం ఉంది. నిజానికి ఇప్పటిదాకా సాధించిన సామాజిక ప్రగతి వల్ల దెబ్బతిన్న వర్గాలు సమాజంలో ఉండబట్టే మతతత్వ భావజాలానికి సామాజిక పునాది దొరుకుతుంది. భూసంస్కరణలు, కనీస వేతనాలు, దళితుల ఆత్మగౌరవం, స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, కార్మికుల హక్కులు, మతసహనం మొదలయిన అనేక ప్రగతిశీలక అంశాలకు దేశ రాజకీయాలలో ఇన్నాళ్ళూ వ్యక్తీకరణ దొరికింది. ఇవన్నీ ఈ దేశ ప్రజలు అనేక పోరాటాలు చేసి సాధించుకున్న హక్కులు, విలువలు. ఇవ్వాళ వీటిని గౌరవించడం పాలకులకు సాధ్యంకాక వెనుతిరగదలచుకుంటే దానికి కావలసిన ఆలంబన ఈ హక్కులవల్ల దెబ్బతిన్న వాళ్ళలో దొరుకుతుంది. పెద్ద భూస్వాములూ పెద్ద పెట్టుబడిదార్లే కాక సమాజంలో అనేక రూపాలలో పెత్తనాన్నీ ఆధిపత్యాన్నీ అనుభవిస్తూన్న వాళ్ళంతా వీటివల్ల దెబ్బతిన్నారు. వాళ్ళంతా ఇవ్వాళ 'దేశ సమగ్రత' అనే రాజకీయం వైపు, హైందవ మతతత్వ రాజకీయం వైపు మొగ్గు చూపుతున్నారు. వాళ్ళు ఈ తిరోగమన రాజకీయాలకు పునాది కల్పిస్తున్నారు. ఇక సామాన్య జనాన్ని ఆకట్టుకోవడానికి వినాయకుడి పూజలు, రాముడి గుడి పనికొస్తున్నాయి.

ఈజిప్టులోనూ ఇరాక్‌లోనూ లౌకిక అరబ్బు జాతీయవాదం స్థానంలో ఇస్లామిక్ మతతత్వం రాజ్యభావజాలమయితే ఇన్నాళ్ళూ ఎంతో కొంత నిలబెట్టుకున్న స్త్రీల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మొట్టమొదట దెబ్బతింటాయి. హైందవం మాటకొస్తే ఈ మతంలో 'ధర్మం' చాలా కీలకమయిన భావన. మన పూర్వ కర్మలను బట్టి మన పుట్టుక నిర్ణయమవుతుంది. ఈ కులంలోనో ఆ కులంలోనో పుడతాము. స్త్రీలగానో పురుషులగానో పుడతాము. పుట్టుకను బట్టి మన జీవిత

'ధర్మం' నిర్ణయమవుతుంది. ఈ 'ధర్మం' ఎంత అసహ్యంగా, ఎంత దుర్భరంగా, ఎంత అస్వతంత్రంగా అనిపించినా దానిని తప్పక ఆచరించాలి. అదే ధర్మవర్తన. ధర్మవర్తన కలవారు మోక్షాన్ని పొందుతారు. పొందకపోయినా వచ్చే జన్మలో ఇంకొంచెం మెరుగయిన పుట్టుక పుడతారు. ఇదీ భగవద్గీత సారాంశం. ఇదీ 'హిందూమతం' అని పిలవబడే ఆచార సంప్రదాయ గందరగోళం వెనకవున్న కచ్చితమయిన సామాజిక సిద్ధాంతం. వ్యవస్థను చెక్కుచెదరకుండ ఉంచడానికి ఇంతకంటే గొప్ప సిద్ధాంతాన్ని ఊహించడం కష్టం. హిందూమత రాజ్యం – బిజెపి పరిభాషలో రామరాజ్యం – ఏర్పడడం అంటే ఈ హిందుత్వ సిద్ధాంతం రాజ్యమేలడం అని అర్థం. ఇందులో సమానత్వానికీ సామాజిక గౌరవానికీ చోటు లేకపోవడమే కాదు, వాటిని కోరుకోవడం అధర్మం. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంగనాథ్‌మిశ్రాగారు అన్నట్టు భగవంతుడే మనుషులను అసమానంగా సృష్టించి ఎవరి ధర్మాన్ని వారికి – పాకీ పని నుండి పరిపాలనాధి కారం దాకా, వంటపని నుండి వకాలత్ దాకా – ఏర్పరచినప్పుడు సమానత్వం కాంక్షించడానికి మనం ఎవరం? ఈ మాటలంటూ ఆయనగారు 'జడ్జిగా నా కర్తవ్యాన్నీ రాజ్యాంగం చెప్పిన హక్కులనూ పక్కకు పెట్టి మనిషిగా మాట్లాడుతున్నాను' అన్నాడంట. అట్లా అనక తప్పదు. జడ్జిగా ఆయనకున్న కర్తవ్యం వెనక, రాజ్యాంగంలోని హక్కుల వెనక, అనేక శతాబ్దాల ప్రజాతంత్ర పోరాటాల విజయాలున్నాయి. ఆ విజయాలను పక్కకు పెట్టనిదే ఆయన ఈ హైందవ తత్వాన్ని బోధించలేరు. ఆ విజయాలను తిరస్కరించడమే హైందవ మత రాజ్యమంటే, 'రామరాజ్య' మంటే.

ప్రజాతంత్ర పోరాట విజయాలన్నిటినీ పక్కకుపెట్టి చాతుర్వర్ణ ధర్మాన్ని తిరిగి ప్రతిష్ఠిస్తారని జనాన్ని భయపెట్టడం అతిశయోక్తి అంటారేమో. అదీ నిజమే. ఇస్లామిక్ మత రాజ్యాన్ని నెలకొల్పినా కూడ బంగ్లాదేశ్‌లో స్త్రీలకు బురఖాలు తొడగలేకపోయారు. నేరాలకు కొరడా దెబ్బల శిక్షలు వేయించలేకపోయారు. బంగ్లాదేశ్ కంటే ప్రజాతంత్ర పోరాట సంప్రదాయం చాలా బలహీనంగా వున్న పాకిస్తాన్‌లో కూడా ఈ తిరోగమనాన్ని పూర్తిగా సాధించలేకపోయారు. చరిత్రను వెనక్కి తీసుకుపోవాలనే ప్రయత్నానికి ప్రతిఘటన ఎప్పుడూ ఉంటుంది. కొందరు

ఆ ప్రయత్నాన్నే ప్రతిఘటిస్తే కొందరు మధ్యయుగాల మత సంప్రదాయంలోనే ఈ తిరోగమనవాదులు చెప్పేదానికంటే మెరుగయిన విలువలున్నాయంటూ అటునుండి నరుక్కొస్తారు. మన దేశంలోనూ ఆ ప్రతిఘటన తప్పక వస్తుంది. అయితే చట్టాల సంగతీ రాజ్యాంగం సంగతీ ఎట్లాగున్నా సామాజిక చైతన్యంలోనికి 'హిందూత్వాన్ని' బలంగా ప్రవేశపెట్టే ప్రయత్నం మట్టుకు–ఇప్పటికే మొదలయింది – రామరాజ్యం పేరిట గట్టిగా జరుగుతుంది. బిజెపి అధికారంలోకి రాకుండానే, రాజ్యాంగం ఎట్లున్నదట్లే ఉండగానే, ఈ ప్రయత్నం మన చుట్టూ ముమ్మరంగా సాగుతూ వుంది. దానిని అన్ని రంగాలలోనూ బలంగా ప్రతిఘటించకుంటే ఇన్ని శతాబ్దాల పోరాట విజయాలకు ద్రోహం చేసిన వాళ్ళమవుతాము. సమసమాజ ఆశయాన్ని మరింత దూరం చేసిన వాళ్ళమవుతాము.

26–3–1991

# బ్రాహ్మణ ధర్మంలో ప్రజాస్వామ్యం

మన దేశంలో నడిచే ఏ ఉద్యమమయినా తన ఆలోచనలనూ అవగాహననూ ఈ దేశ చరిత్రతో అనుసంధానం చేసుకోవలసిన అవసరం ఉంది. ఈ పని పౌరహక్కుల ఉద్యమం ఇప్పటికింకా సమగ్రంగా చేయలేదు.

పాశ్చాత్య దేశాలలో ప్రజాతంత్ర విప్లవంలో భాగంగా ముందుకొచ్చిన హక్కుల భావన, ప్రజాస్వామ్య భావన, వాటిపైన అవే దేశాలలో పుట్టిన వామపక్ష కార్మిక ఉద్యమాలు పెట్టిన విమర్శ మన దేశంలో పౌరహక్కుల ఉద్యమ అవగాహనకు ఇప్పటివరకు ప్రాతిపదికగా ఉన్నాయి. ఆ దేశాలలోనే పై రెండు దృక్కోణాలపైన స్త్రీవాదులు పెట్టిన విమర్శ, నల్లజాతీయుల సివిల్‌రైట్స్ ఉద్యమం పెట్టిన విమర్శ, మన దేశంలో హక్కుల భావన గురించి అంబేద్కర్ చేసిన వాదన కూడా కొంతమేరకు హక్కుల అవగాహనలో భాగం అయ్యాయి.

వాటిని 'పాశ్చాత్య' భావనలు అంటున్నామంటే అవి మనకు పనికిరావని కాదు. చాలా పనికొస్తాయి. పాశ్చాత్య దేశాలలో తొలుత ఆవిర్భవించిన ఆధునిక రాజ్యాంగయంత్రం, పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ, దానికి వ్యతిరేకంగా వచ్చిన సోషలిస్టు తదితర ఉద్యమాలు ఇప్పుడు ప్రపంచమంతటా వ్యాపించాయి. కాబట్టి వాటిలోని విలువలు, మంచిచెడులు, వాటికి సంబంధించిన చర్చ ఈ రోజు కేవలం 'పాశ్చాత్య' విషయాలు కావు.

అయినప్పటికీ హక్కుల ఆలోచన ఆ సంప్రదాయం నుండి పుట్టిన భావాలతో సంతృప్తి చెందితే సరిపోదు. ఇక్కడి చరిత్రతో, ఆ చరిత్ర నిర్వచించిన హక్కులు, బాధ్యతలు, అధికారం, ధర్మం మొదలైన భావనలతో తన ఆలోచనలను అనుసంధానం చేయవలసిన అవసరం ఉంది.

బుద్ధుడి కాలం నుండి – బహుశా అంతకంటే ముందు నుండి కూడ – మన దేశంలో హక్కుల పరిభాష ఉంది. అయితే అది ఈనాటి నుడికారంలో ఉండదు. అయినప్పటికీ అందులో హక్కుల అంశాన్ని స్పష్టంగానే గుర్తించగలం.

---

'స్వేచ్ఛ' పత్రికలో సీరియల్‌గా వచ్చి తర్వాత ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం ప్రచురణగా పుస్తక రూపంలో వచ్చింది, ఏప్రిల్ 1998

అది తన విమర్శను ఎక్కుపెట్టింది బ్రాహ్మణీయ వర్ణధర్మ భావన మీద. మనిషి సామాజిక హోదానూ గుర్తింపునూ గౌరవాన్నీ పుట్టిన వర్ణాన్ని బట్టి నిర్ణయించడం, అందులో అనుల్లంఘనీయమైన హెచ్చుతగ్గులను నిర్దేశించడం, దానిని అతిక్రమించి పైకి పోదామన్న ప్రయత్నం నేరమనీ పాపమనీ బెదిరించడం బ్రాహ్మణీయ ధర్మంలోని ఆక్షేపణీయమైన విషయం. ఆనాడు రాజ్యాన్నీ సమాజాన్నీ ఈ 'ధర్మ' భావనే శాసించింది. పౌరులుగా సమాన హక్కులుండటం అటుంచి, ఇందులో మనుషులుగా సమాన ప్రతిపత్తి – అంబేద్కర్ భాషలో ప్రతి మనిషికీ ఒకే విలువ – సహితం లేదు. బ్రాహ్మణులు భూసురులు, భూమిమీద వెలసిన దేవతలు. అక్కడి నుండి కిందికి దిగితే, శూద్రులు నిండయిన మనుషులు కూడా కాదు. స్త్రీల మాటకొస్తే, వారు ఏ కులంలో పుట్టినా శూద్రులతోనే సమానం.

ఈ 'ధర్మం' ధర్మశాస్త్రాలు ఆదేశించినంత సంపూర్ణంగా సామాజిక సంబంధాలనూ స్థితిగతులనూ శాసించినా శాసించకున్నా, సమాజంలో మనుషుల ఆలోచనలకూ ఆచారాలకూ తప్పొప్పుల ప్రమాణాన్ని బలంగా నిర్దేశించింది. దానిని అతిక్రమించిన వారిపైన ఎప్పటికప్పుడు కేసులు పెట్టి రాజుగారి కోర్టులో శిక్షించారో లేదో గానీ వారు అనేక రూపాలలో ఇబ్బందులకూ హింసకూ వెలివేతకూ గురి అయ్యారు.

బ్రాహ్మణీయ రాజ్యాంగ యంత్రానికి సంబంధించిన నియమాలూ సంస్థలూ కూడా ఈ చట్రంలోనే రూపొందాయి. అందులో పరిపాలనకు, సామాజిక వ్యవహారాల నిర్వహణకు సంబంధించిన హేతుబద్ధమైన నియమాలూ, ఉపయోగకరమైన సూత్రాలూ ఏవీ లేనే లేవని కాదు. ఇతర దేశాలలాగ మన దేశంలో కూడ పాలనా వ్యవహారాల నిర్వహణకు సంబంధించిన నియమాలలో కాలక్రమంలో కొంత సాధారణ ప్రగతి కనిపిస్తుంది. కానీ అది అడుగడుగున వర్ణధర్మ వివక్ష చేత కలుషితం అయింది.

రాజ్యాంగ యంత్రంలోనూ పాలనా వ్యవహారాలలోనూ ప్రజాస్వామ్యాన్ని గురించి ఆందోళన చేసే పౌరహక్కుల ఉద్యమం ఈ చరిత్రను తెలుసుకోవలసి ఉంది. ఇప్పుడు మనకున్న రాజ్యాంగం మనుధర్మశాస్త్రం కాదు. ఇది హక్కులలోనూ అణచివేతలోనూ ఆధునిక స్వభావం ఉన్న రాజ్యాంగం. వర్ణ వివక్షను ఈ

రాజ్యాంగం నిషేధించింది. చట్టం కళ్ళలో (సామాజిక ఆర్థిక సంబంధాలలో కాకున్నా) అందరికీ సమాన ప్రతిపత్తి కల్పించింది. ప్రామాణికమైన పౌర రాజకీయ హక్కులను (కొన్ని మినహాయింపులతోనే అయినప్పటికీ) కల్పించింది.

అయితే ఈ హక్కులనూ చట్టాలనూ మనం వ్యాఖ్యానించుకునేటప్పుడు, అమలు చేసుకునేటప్పుడు వివిధ ప్రజాసమూహాల అర్హతల గురించి, వారి సామాజిక స్థానాన్ని గురించి మనకున్న అభిప్రాయాల ప్రభావం బలంగా పనిచేస్తుంది. సాధారణ పౌరులనే కాదు, చట్టాన్ని అమలుచేసే అధికారులను – న్యాయమూర్తులతో సహా – కూడ ఇది ప్రభావితం చేస్తుంది. ఈనాటికీ ఈ అభిప్రాయాలను బ్రాహ్మణీయ 'ధర్మం' అనే భావన ఎక్కువగా నిర్దేశిస్తుందనేది నిస్సందేహమైన విషయం. అంతేకాక, చట్టానికి వెలుపల జరిగే న్యాయాన్యాయాల నిర్ణయం (కుటుంబం నాలుగు గోడల మధ్య కావచ్చు. ఊరి రచ్చబండ దగ్గర కావచ్చు) సంప్రదాయక బ్రాహ్మణీయ భావజాలం చేతనే ఎక్కువగా ప్రభావితమవుతుందనేది కూడ నిస్సందేహమైన విషయమే. అందువల్ల బ్రాహ్మణీయ ధర్మంలో హక్కులు, ప్రజాస్వామ్యం మొదలయిన విషయాలకున్న స్థానం తెలుసుకోవడం కేవలం చారిత్రక కుతూహలానికి సంబంధించిన విషయం కాదు. అది ఈనాటి సామాజిక అవసరం కూడ.

ఈ దృష్టితో మా సంస్థ (ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం) మాసపత్రిక 'స్వేచ్ఛ'లో గతంలో కొన్ని వ్యాసాలు ప్రచురించాము. మనుధర్మ శాస్త్రంలో నేరం, నేరవిచారణ, శిక్ష అనే విషయాల గురించి ఉన్న సూత్రాలను వివరించే మూడు వ్యాసాలు మొదట ప్రచురించాము. ఆ తరువాత ఒక్క నేరస్మృతినే కాక మొత్తంగా రాజ్యాంగ యంత్రం స్వభావాన్ని విషయంగా ఎంచుకొని, ఒక్క మనుధర్మ శాస్త్రాన్నే కాక అన్ని బ్రాహ్మణ ధర్మశాస్త్రాలనూ సమీక్షించి బ్రాహ్మణ ధర్మశాస్త్రాలలో రాజ్యాంగ యంత్రాన్ని గురించి ఉన్న అన్ని సూత్రాలనూ నియమాలనూ వివరించే నాలుగు వ్యాసాలు ప్రచురించాము.

ఆ వ్యాసాలన్నిటినీ కలిపి ఇప్పుడు ఒక పుస్తకంగా అచ్చువేస్తున్నాము.

ఈ విశ్లేషణతో అంతా అర్థమయినట్టు కాదు. మన దేశ సామాజిక జీవితంలో బ్రాహ్మణీయ సంస్కృతిదే ఆధిపత్య స్థానమంటే అర్థం దానికి ప్రతిఘటన

లేదని కాదు, వేరే ఏ సంస్కృతీ లేదనీ కాదు. బ్రాహ్మణీయ 'ధర్మం' అనే భావన ప్రభావం అన్ని సామాజిక శ్రేణులపైనా ఆనాడూ ఈనాడూ ఉన్నప్పటికీ (అందువల్ల తమ ఆలోచనలపై దానికున్న ప్రభావం గురించి అప్రమత్తంగా ఉండవలసిన అవసరం అన్ని సామాజిక శ్రేణులకూ ఉన్నప్పటికీ) బ్రాహ్మణేతర కులాల ప్రజల జీవన సంస్కృతిలో భిన్నత్వం ఉంది. ఆ భిన్నత్వంలో కొన్ని ప్రజాతంత్ర విలువలున్నాయి. అంతేకాక, చైతన్యవంతంగా బ్రాహ్మణీయ సంస్కృతిని ప్రతిఘటించి, లేక వ్యతిరేకించి, అందులోని ఆధిపత్య సంస్కృతిని తిరస్కరించి ప్రజాతంత్ర విలువలను ముందుకు తెచ్చిన ప్రజాశ్రేణులూ ఉన్నారు. ఆ చరిత్రను కూడ అధ్యయనం చేసి, ప్రజాతంత్ర భావనకు భారతదేశ చరిత్రలోని బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలలోనూ, బ్రాహ్మణేతర ప్రజల జీవిత సంస్కృతిలోనూ ఉన్న మూలాలను గ్రహించవలసిన అవసరం ప్రజాతంత్ర ఉద్యమాలకు – ముఖ్యంగా పౌరహక్కుల ఉద్యమానికి – ఉంది. ఆ కృషి ఇంకా సమగ్రంగా జరగలేదని అర్థంచేసుకొని, అది లేకుండ ప్రస్తుత వ్యాసాలు ఇచ్చే చిత్రం పాక్షికమైనది మాత్రమేనని గుర్తించి ఆ పరిమితిలోనే వీటిని చదువుతారని ఆశిస్తాం.

★ ★ ★

## I మనువు నేరస్మృతి - పౌరహక్కులు

ఒక సమాజంలో ఏమాత్రం ప్రజాస్వామ్యం ఉందనేది ఆ సమాజంలో అమలులో ఉన్న నేరస్మృతిలోను, నేర విచారణ వ్యవస్థలోను కనపడుతుంది. నేరానికి సంబంధించిన నిర్వచనాన్నీ, వర్గీకరణనూ, నేరవిచారణ వ్యవస్థ అనుసరించే పద్ధతులనూ, శిక్షలకు సంబంధించిన ప్రమాణాలనూ సామాజిక చరిత్ర నుండి వేరు చేయలేము. నేరస్మృతిని, నేరవిచారణ వ్యవస్థను సామాజిక చరిత్రకు ఒక దర్పణంగా భావించవచ్చు.

ఈ దర్పణంలో చూసినప్పుడు రెండు విషయాలు పరస్పరం పెనవేసుకొని కనిపిస్తాయి. ఒకటి, నేర నిరోధక వ్యవస్థ నిర్మాణ సూత్రాలలో ఆ సమాజం సాధించిన సాధారణ ప్రగతి. రెండవది, ఆయా చారిత్రక దశలలో ఆ నేర నిరోధక వ్యవస్థ కాపాడే సామాజిక ప్రయోజనాల వల్ల ఉత్పన్నమయ్యే ప్రత్యేక లక్షణాలు. ప్రజాస్వామ్యం ఏ మాత్రం ఉందనే ప్రశ్నకు ఇవి రెండూ ప్రమాణాలే.

*బ్రాహ్మణ ధర్మంలో ప్రజాస్వామ్యం*

ప్రాచీన భారతదేశంలో సామాజిక సంబంధాలను బ్రాహ్మణీయ వర్ణధర్మం వ్యవస్థీకరించింది. నేరస్మృతి, నేరవిచారణ వ్యవస్థ ఆ ప్రాతిపదిక మీదనే రూపం తీసుకున్నాయి. నేరానికీ శిక్షకూ సంబంధించిన ఆలోచనను హైందవ సమాజం ఈ చట్రంలోనే చేసింది. నేరవిచారణ వ్యవస్థలోనూ, నేరస్మృతి సాధారణ నియమాలలోనూ పాశ్చాత్య దేశాలలాగే హైందవ సమాజం కూడా క్రమానుగతమైన ప్రగతిని సాధించింది. ఈనాటి ప్రజాతంత్ర దృక్పథానికి నాగరికంగా కనిపించే సూత్రాలు, చాలా అమానుషంగా కనిపించే లక్షణాలు రెండూ పాశ్చాత్య దేశాలతో సమానంగానే హైందవ నేరస్మృతిలోనూ కనిపిస్తాయి. అంత ప్రాచీన కాలంలోనూ కనిపిస్తాయి. అయితే మొత్తమంతా బ్రాహ్మణీయ వర్ణధర్మం పరిధిలోనే ఉండడం వల్ల ఆ ధర్మానికి ఉండే మౌలికమైన అమానుష లక్షణాలన్నీ హైందవ నేరస్మృతిని ఆద్యంతం అంటిపెట్టుకొని ఉన్నాయి. మనిషిని మనిషిగా చూడక స్త్రీ – పురుషులు, ద్విజులు–శూద్రులు అన్న తేడాను ప్రతీ చిన్న విషయంలోనూ పాటించే ప్రత్యేకమైన అమానుషత్వం బ్రాహ్మణీయ సంస్కృతి ప్రధాన లక్షణం. ఆ సంస్కృతిలో అద్ది ఆరేసిన హైందవ నేరస్మృతిలో ఆపాదమస్తకం ఆ వివక్ష కనిపిస్తుంది. నేరవిచారణ పద్ధతులలో, శిక్షా ప్రమాణాలలో, నేరానికి సంబంధించిన భావనలలో హైందవ సమాజం సాధించిన ప్రగతి యావత్తు ఈ చట్రంలోనే జరిగింది.

భారతదేశంలో ఈ రోజు ఉన్న నేరస్మృతి మనువు నేరస్మృతి కాదు. బూర్జువా ప్రజాతంత్ర ప్రమాణాలను అనుసరించి భారతదేశ నేరస్మృతి బ్రిటిష్ కాలంలోనే తిరగ రాయబడింది. దీనిలో ఉన్న లోపాలను పరిష్కరించుకొని ముందుకు తీసుకుపోవడం ప్రజాతంత్ర, పౌరహక్కుల ఉద్యమాల ముందున్న కర్తవ్యాలలో ఒకటి. అయితే సంప్రదాయక హైందవ నేరస్మృతి గురించి తెలుసుకోవడం చాలా అవసరం. అది ఈ రోజు కోర్టులలో అమలు కాకున్నా, కోర్టులతో సమానంగా (కొన్ని చోట్ల అంతకంటె ఎక్కువగా) ప్రజలకు న్యాయమో అన్యాయమో నిత్యం అందిస్తున్న 'పెద్దమనుషుల' పంచాయతులలో ఈ నేరస్మృతి అవశేషాలు చాలా కనిపిస్తాయి. అంతకంటె ముఖ్యంగా మన నిత్య జీవిత సంస్కృతిలో తప్పొప్పులకు, నీతి అవినీతులకూ ప్రమాణం హైందవ నేరస్మృతికి ప్రాతిపదిక అయిన బ్రాహ్మణ

నీతి సూత్రాల నుండే వస్తుంది. అది నేరాన్ని గురించి, శిక్షను గురించి మనకుండే ఆలోచనలను బలంగా ప్రభావితం చేస్తుంది. దాని గురించి అప్రమత్తంగా ఉండడం, అందుకోసం అవసరమైన విమర్శనాత్మక పరిజ్ఞానాన్ని సంపాదించుకోవడం ఒక ముఖ్యమైన ప్రజాతంత్ర కర్తవ్యం.

ఆ కర్తవ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మను ధర్మశాస్త్రంలోని నేరస్మృతిని పరిచయం చేసుకుందాం. దీనికి 'మనువు నేరస్మృతి' అని పేరు పెట్టాము కానీ మనువు అనే మనిషి నిజంగా ఎప్పుడయినా ఉన్నాడా అనేది అనుమానమే. మనుధర్మశాస్త్రం మరీ ప్రాచీన గ్రంథం కాదు. దాని రచనాకాలం (లేక ఆ సూత్రాలను క్రోడీకరించిన కాలం) క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. 200 మధ్యకాలం అని చాలామంది చరిత్రకారులు భావిస్తారు. మనుధర్మశాస్త్రం కంటే ముందే గౌతమ, బౌధాయన, ఆపస్తంబ, వశిష్ఠ ధర్మసూత్రాలు లిఖించబడ్డాయి. అయితే ఆ ధర్మ సూత్రాలలో కూడా 'మనువు' అనే ధర్మశాస్త్రకారుడిని ప్రస్తుతించారు. ఈ మనువు ధర్మశాస్త్రాలకు ఆద్యుడనేది అతి ప్రాచీనమైన భావన. అతను చెప్పిందే ధర్మం అనేది హైందవ సంస్కృతికి సంబంధించిన ప్రాచీన విశ్వాసం. అయితే ఇతని పేరుమీద ఉన్న ధర్మశాస్త్రం ఏమంత ప్రాచీనమయినది కాదు. బౌద్ధమతం దెబ్బనుండి బ్రాహ్మణమతం కోలుకొని తిరిగి బలం పుంజుకొని స్థిరపడుతున్న దశకు చెందినది మనుధర్మశాస్త్రం.

బహుశా ఆ చారిత్రక సందర్భమే ఆ గ్రంథానికి ఆ పేరుపెట్టడానికి కారణం కావచ్చు. ఎప్పటికప్పుడు ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రూపొందించిన ఆలోచనలకు ప్రాచీన 'రుషులను' కర్తలుగా చూపించి ప్రజల మెదళ్ళపైన బలమైన ప్రభావం వేసే లక్షణం బ్రాహ్మణీయ తాత్విక సంస్కృతికి సంబంధించిన ఒక ముఖ్యమైన గుణం. బౌద్ధమతాన్ని వెనక్కినెట్టి సమాజంమీద తన ఆధిపత్యాన్ని తిరిగి నెలకొల్పుతున్న దశలో బ్రాహ్మణమతం తనకు అవసరమైన సామాజిక నీతిని నియమాలను క్రోడీకరించి 'ధర్మానికి' పర్యాయపదంగా భావించబడే మనువు పేరిట ప్రకటించిందని భావించవలసి ఉంటుంది. అది ఇంకా అప్పుడప్పుడే పుంజుకుంటున్న ఆధిపత్యం కావడంవల్లనేమో అన్ని ధర్మశాస్త్రాలలోనికీ అతి కర్కోటకమైనది మనుధర్మశాస్త్రం. అయితే తరువాతి

కాలంలో వచ్చిన విష్ణు, నారద, పరాశర, యాజ్ఞవల్క్య స్మృతులు, ఇతర వ్యాఖ్యానాలు కొన్ని విషయాలలో కొంత ఔదార్యాన్ని ప్రదర్శించినా నాటికీ నేటికీ బ్రాహ్మణ సంస్కృతిలో ధర్మానికి ప్రామాణికం మనుధర్మశాస్త్రమే.

అందుకే మనుధర్మశాస్త్రంలోని నేరస్మృతి గురించి తెలుసుకోవడం అవసరం. 'మనువు' అనే వాడు ఆ ధర్మశాస్త్రం కర్త అయినా కాకున్నా సౌలభ్యం కోసం అతనిని దాని కర్తగానే ప్రస్తావిస్తాము.

## 1. నేరం - శిక్ష

రాజ్యాంగ యంత్రం నేరాలను ఎందుకు అదుపు చేయాలి? ఈ ప్రశ్నకు ఒక శాస్త్రకారుడు ఏం సమాధానం చెప్పాడో పరిశీలిస్తే, అతను దేనిని 'నేరంగా' భావిస్తున్నాడో, భద్రత, శాంతి వంటి మాటలకు ఏ అర్థం చెప్పుకుంటున్నాడో అర్థం అవుతుంది. మనువు ఈ ప్రశ్నకు స్పష్టంగానే సమాధానం చెప్తాడు. 'శిక్షించవలసిన వాళ్ళను రాజు తగురీతిలో శిక్షించకపోతే, సమాజంలో బలవంతులు బలహీనులను చేపలలాగ కాల్చుకుని తింటారు. క్రతువులలో దేవతలకు అర్పించే పిండాన్ని కుక్కలు, కాకులు తినిపోతాయి. దేనిమీదా యాజమాన్యం హక్కు మిగలదు. క్రిందివాళ్ళు పై వాళ్ళ స్థానాలను ఆక్రమించేస్తారు' అంటాడు. అభద్రత లేక అశాంతి అనేదానికి ఇక్కడ నాలుగు లక్షణాలు నిర్వచించబడ్డాయి. ఒకటి బలవంతుల నుండి బలహీనులకు రక్షణ లేకపోవడం. ఇది నిజానికి అభద్రతకు ఉండగల ఒకే ఒక న్యాయసమ్మతమైన నిర్వచనం. అయితే దీనికి మనువు మరి మూడు చేర్చాడు. బ్రాహ్మణుల యజ్ఞకాండకు రక్షణ లేకపోవడం రెండవది. కుక్కలు, కాకులు పిండాన్ని తినిపోతాయి అంటే అర్థం బ్రాహ్మణులు కుక్కలనూ కాకులనూ పోలీసుల అండలేకుండ తరిమివేయలేరని కాదు. యజ్ఞకర్మకాండకు రక్షణ కరువయితే సమాజంలో అభద్రత నెలకొన్నట్టేనన్న భావానికి కవితాత్మకమైన వ్యక్తీకరణగా దీనిని అర్థం చేసుకోవాలి. దేనిమీదా యాజమాన్యం హక్కు మిగలదు అంటే అర్థం స్వంత ఆస్తికి భరోసా ఉండదని. స్వంత ఆస్తిమీద ఆధారపడ్డ అన్ని సమాజాలలోనూ (అంటే అన్ని నాగరిక సమాజాలలోనూ) అభద్రతకూ అశాంతికీ ఇది ఒక ముఖ్య నిర్వచనం. క్రింది వాళ్ళు మీది వాళ్ళ స్థానాన్ని ఆక్రమించి వాళ్ళను తొలగించి వేస్తారనేది చివరి లక్షణం. వర్ణవ్యవస్థకు దీనికి మించిన అశాంతి, అభద్రత వేరే ఉండవు.

అంటే రాజ్యాంగ యంత్రం నేరాలను అదుపు చేయడం ద్వారా బలవంతులు బలహీనులను చేపలలాగా కాల్చుకు తినకుండ కాపాడడం అనే ప్రజాతంత్ర కర్తవ్యాన్ని నిర్వహించడంతో పాటు బ్రాహ్మణుల వైదికకాండను కాపాడుతుంది. స్వంత ఆస్తిని కాపాడుతుంది. వర్ణ వ్యవస్థను కాపాడుతుంది.

చట్టం, శాంతి భద్రత అనేవి ఈ రోజు మనం ఉపయోగిస్తున్న మాటలు. ఆనాడు ఉపయోగించిన మాట ధర్మం. ధర్మాన్ని కాపాడడం రాజు ముఖ్య బాధ్యత. నేరం చేసిన వాళ్ళను శిక్షించకుండ వదిలిపెడితే ఆ నేరం రాజుకు అంటుకుంటుంది. దండనాధికారాన్ని సక్రమంగా ప్రయోగించి నేరగాళ్ళను శిక్షించి ధర్మవర్తనగల వాళ్ళను కాపాడితే రాజుకు యజ్ఞం చేసినంత పుణ్యం లభిస్తుంది. ఒక నేరస్తుడిని వదిలిపెట్టినా ఫరవాలేదు కానీ నిర్దోషిని మాత్రం శిక్షించకూడదని ఆధునిక ప్రజాతంత్ర నేరస్మృతి అంటుంది. మనువు అభిప్రాయం అది కాదు. నిర్దోషిని శిక్షించడం, నేరస్తుడిని వదిలిపెట్టడం రెండూ సమానమయిన పాపకార్యాలే. అవి ఆ రాజునూ రాజవంశాన్నీ రాజ్యాన్నీ నాశనం చేస్తాయి.

ఏ సమాజం మనుగడకయినా రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి, ఆ సమాజం విధించే నియమాలను ప్రజలు ఇష్టపూర్వకంగా పాటించడం, రెండు నియమాలను అతిక్రమించిన వారిని శిక్షించడం ద్వారా రాజ్యాంగ యంత్రం సమాజంలో నియమబద్ధ ప్రవర్తనను నెలకొల్పడం. ఇష్టపూర్వకంగా ప్రజలు సామాజిక నియమాలను పాటించాలంటే అది హేతుబద్ధమైన ఆమోదంవల్లనైనా జరగాలి. లేదా మతం, దేవుడు మొదలయిన నమ్మకాల నుండి పుట్టే విశ్వాసాల వల్లనయినా జరగాలి.

నిజానికి ఏ సామాజిక వ్యవస్థ అయినా కొంతమేరకు ప్రజల ఆమోదంతో కొంతమేరకు దండనాధికారంతో తన మనుగడ సాగించుకుంటుంది. కేవలం ప్రజామోదంతో, అందులోను గుడ్డి విశ్వాసం లేక మూఢనమ్మకాల నుండి జనించిన ఆమోదం కాక హేతుబద్ధమైన ఆమోదంతో ఒక సామాజిక వ్యవస్థ నిలవగలిగితేనే అది సంపూర్ణమైన ప్రజాస్వామ్యం అవుతుంది. చరిత్రలో ఇప్పటివరకు అన్ని వ్యవస్థలూ సాంస్కృతిక సంస్థలద్వారా ప్రజామోదాన్ని ఒకవైపు రూపొందించుకుంటూ మరొక వైపు బలప్రయోగం ద్వారా తమ నియమాలు అమలుచేస్తూ శాంతినీ భద్రతనూ నెలకొల్పాయి.

*బ్రాహ్మణ ధర్మంలో ప్రజాస్వామ్యం*

మనువుకు మాత్రం బలప్రయోగం మీద మాత్రమే నమ్మకం ఉంది. బ్రాహ్మణీయ ధర్మం ప్రజామోదాన్ని పొందడం సాధ్యం కాదనీ కేవలం దండంతోనే దాన్ని నిలబెట్టాలనీ గుర్తించాడేమో తెలీదు. దండానికి మాత్రం అతను విపరీతమైన ప్రాముఖ్యం ఇచ్చాడు. దండమే అసలు రాజు అనీ, రాజు అని పిలవబడేవాడు దానిని అమలుచేసే ఒక సాధనం మాత్రమేననీ అంటాడు. నల్లటి శరీరం, ఎర్రటి కళ్ళు గల ఒక 'బూచివాడి'గా దండాన్ని మనువు వర్ణిస్తాడు. ఈ బూచివాడి భయం లేకపోతే చతుర్వర్ణాలూ ధర్మాన్ని గౌరవించవంటాడు. బ్రహ్మదేవుడు రాజును చేసినప్పుడే దండాన్ని కూడ తన శరీరం నుండి రూపొందించి రాజు చేతిలో పెట్టి ధర్మాన్ని కాపాడమని పురమాయించాడంటాడు. రాజు నిద్రపోతున్నప్పుడు కూడ దండం మేలుకొని ఉండి సమాజాన్ని పాపుల నుండి కాపాడుతుందంటాడు.

సామాజిక నియమాలను మనుషులు గౌరవించి తదనుగుణంగా నడచుకోవాలంటే దండనాధికారాన్ని నిస్సంకోచంగా ఉపయోగించడమే ఏకైక మార్గం అని మనువు సిద్ధాంతం. మనుషుల విశ్వాసాన్ని పొందడం ద్వారా నియమబద్ధమైన సామాజిక వ్యవస్థను నెలకొల్పాలని భావించే ప్రజాతంత్ర ఆలోచనకు ఇది పూర్తిగా విరుద్ధం. అయితే పుట్టుకతోనే మనుషులను ఉచ్ఛనీచాలుగా విభజించే హైందవ సామాజిక నీతిని అమలు చేయడానికి దండమే ప్రధాన సాధనం కాగలదని మనువు నమ్మడంలో పెద్దగా ఆశ్చర్యపోవలసిందేమీ లేదు.

దండంతో రాజు విధించే శిక్ష కూడ నేరస్తులను సంస్కరించడానికి ఉద్దేశించింది కాదు. సంస్కరణకు మనుధర్మశాస్త్రంలో స్థానం లేదు. శిక్షించడానికి వేరే లక్ష్యాలున్నాయి. ఇతరులను భయపెట్టి, వాళ్ళు నేరాలు చేయకుండా చూడడం ఒక లక్ష్యం. అందువల్ల కాళ్ళు చేతులు నరికేసిన నేరగాళ్ళను బహిరంగ స్థలంలో ప్రదర్శించమని మనువు రాజుకు హితవు చెప్పాడు. వాళ్ళ అవస్థ చూసిన ఇతర ప్రజలు నేరాలు చేయకుండా ఉంటారని.

నేరస్తుడు మళ్ళీ ఆ నేరం చేయకుండ ఉండడం రెండవ లక్ష్యం. దీని కోసం ఏం చెప్తాడంటే, ఏ శారీరక అంగంతో ఆ నేరం చేసాడో ఆ అంగాన్ని తొలగించమని అంటాడు. అప్పుడు నేరస్తుడు మళ్ళీ ఆ నేరం చేయలేడు.

ఉదాహరణకు దొంగతనం చేస్తే చేయి నరికేయాలి. జేబు దొంగతనానికి వేళ్ళు నరికేయాలి. ఈ రకమైన శిక్షలు వేయడం హైందవ ధర్మంలోనే కాదు, మనువు కంటే చాలా తరువాతి కాలంలోనూ, ఇతర దేశాలలోనూ కూడా వాడుకలో ఉండింది. అయితే మనువు ఈ రకమైన శిక్షలను వర్ణధర్మ అతిక్రమణకు కూడా విధిస్తాడు. ఉదాహరణకు ఒక శూద్రుడు అగ్రకుల స్త్రీతో లైంగిక సంబంధం పెట్టుకున్నా, పెట్టుకోవాలని కోరుకున్నా (బలాత్కారంగా కాదు, ఆమె సమ్మతితోనే అయినా) అతని పురుషాంగాన్ని కోసివేయడం మనువు సూచించే శిక్ష. ఒక వ్యక్తి తనకంటే పై కులానికి చెందిన వ్యక్తిని కొట్టడం, దూషించడం ఇత్యాది చర్యలు మనుధర్మం ప్రకారం నేరాలు. ఉదాహరణకు కింది కులానికి చెందిన వ్యక్తి అగ్రకులానికి చెందిన వ్యక్తిని కాలితో తన్నితే ఆ కాలు తెగగోసేయాలి. చేతితో కొడితే చేయి నరికివేయాలి. తిడితే నాలుక కోసివేయాలి. ఉమ్మివేస్తే రెండు పెదవులు నరికివేయాలి. ఒకే ఆసనం మీద కూర్చుంటే పిర్రలు నరికివేయాలి. మూత్ర విసర్జనం చేస్తే పురుషాంగం కోసేయాలి. ఇవీ మనువు నియమాలు.

శిక్షకు మూడవ లక్షణం, నేరానికి గురి అయిన వారికి మానసిక సంతృప్తిని కలిగించడం. అంటే వాళ్ళ ప్రతీకార వాంఛను తీర్చడం. బాధితుడు స్వయంగా ప్రతీకారం తీర్చుకోవడం నాగరిక సమాజం ఒప్పుకోదు కాబట్టి, ఆ కోరికను రాజ్యాంగ యంత్రం తీర్చాలి. శిక్షను ఈ దృష్టితో చూసినపుడు నేరస్తుడిని సంస్కరించడం అనే ఆలోచనకు తావు ఉండదు.

సమాజానికి నేరస్తుల పీడ లేకుండా చేయడం నాలుగవ లక్ష్యం. ఒక నేరస్తుడికి మరణదండన వేసినా, దీర్ఘకాలం ఖైదు చేసినా, దేశ బహిష్కరణ విధించినా సమాజానికి అతని పీడ లేకుండ పోతుంది. దేశ బహిష్కరణ ఎటువంటి వారికి విధించాలని మనువు ఆదేశించాడో చూడండి. జూదరులు, సారాయి అమ్మేవాళ్ళు, క్రూరమైన మనుషులు, నాస్తికులు, ఇతరుల వృత్తులను ఆచరించే వాళ్ళు దేశ బహిష్కరణకు అర్హులు అని మనువు అంటాడు. అంటే జూదరుల వంటి హానికరమయిన మనుషులతోపాటు కులవ్యవస్థను తిరస్కరించే వాళ్ళను, బ్రాహ్మణ మతాన్ని తిరస్కరించే వాళ్ళను కూడా దేశాంతరం పంపించివేసి సమాజాన్ని కాపాడాలని మనువు సంకల్పం.

అయిదవ లక్ష్యం నేరస్తుడిని ప్రక్షాళన చేసి పాపం నుండి విముక్తి చేయడం. నేరానికి తగిన శిక్ష అనుభవించకపోతే నేరం చేసిన పాపం పోదు. నేర విచారణ వ్యవస్థను ప్రజలు ప్రశ్నించకుండా చేయడానికి ఈ బెదిరింపు బాగా పనిచేస్తుంది. పైగా, నేరస్తుడికి తగిన శిక్షవేయకపోతే ఆ పాపం రాజుకు చుట్టుకుంటుందని మనువు రాజును బెదిరించాడు. అమాయకులను శిక్షించడం ఎంతటి పాపకార్యమో దోషులను విడిచిపెట్టడం కూడా అంతటి పాపకార్యమేనన్నాడు.

కులవ్యవస్థకు ఉండే ప్రత్యేకమైన అవలక్షణాలను పక్కనపెడితే, క్రూరత్వంలో ఏ దేశ నేరస్మృతీ మనుధర్మానికి తీసిపోదు. కులధర్మం ఈ క్రూరత్వాన్ని ఏవిధంగా మరింత వక్రీకరించిందనేది గమనించాలి. ఇంగ్లండ్‌లో 19వ శతాబ్దందాకా కేవలం హత్యవంటి నేరాలకే కాక దొంగతనం వంటి అతి చిన్న నేరాలకు కూడ ఉరిశిక్ష వేసేవారు. దాదాపు 200 చిన్నాచితక నేరాలకు ఇంగ్లండ్‌లో ఉరిశిక్ష ఉండేది. అటువంటప్పుడు మనువు కూడా అనేక నేరాలకు మరణదండననే శిక్షగా భావించాడంటే ఆశ్చర్యంలేదు. కానీ అవి ఏయే నేరాలో గమనిస్తే, బ్రాహ్మణీయ వర్ణధర్మాన్నీ పితృస్వామ్యాన్నీ నేరస్మృతి ద్వారా నిలబెట్టే ప్రయత్నం ఎంతగా జరిగిందో అర్థం అవుతుంది.

మరణ దండనలో అనేక రకాలుంటాయి. శిరచ్ఛేదం (ఒక్క దెబ్బతో తలనరికేయడం) అన్నిటికంటే దయగల మరణదండన. ఇంకా అనేక రూపాల మరణశిక్షను కూడా మనువు గుర్తిస్తాడు. ఇవి శిరచ్ఛేదం కంటే క్రూరమైన మరణశిక్షలు. చిన్న కత్తితో ముక్కలు ముక్కలుగా నరకడం, ఏదో ఒక శరీర అంగాన్ని నరికి రక్తస్రావంవల్ల చనిపోనివ్వడం, చేతులు రెండూ తెగనరికి శరీరాన్ని కత్తితో లేక ఈటెతో పొడిచి గోడకు గుచ్చి ఉంచడం, నీటిలో బలవంతంగా ముంచి చంపడం, సజీవంగా దహనం చేయడం, సజీవంగా కుక్కలకు వేయడం, కాగుతున్న నూనె నోట్లో చెవులలో పోయడం, ఎర్రగా కాలిన ఇనప కడ్డీని నోట్లోపెట్టి గొంతుకాల్చి చంపడం, ఏనుగు చేత తొక్కించడం మొదలయినవి ఆయన సూచించిన మరణదండన రూపాలు. నేరం తీవ్రతను బట్టి శిరచ్ఛేదం బదులు కఠినమైన మరణదండనను శిక్షగా విధించాలని మనువు ప్రతిపాదిస్తాడు. కొన్ని విషయాలలో నేరతీవ్రతకు మనువు సూచించే ప్రమాణం హేతుబద్ధంగానే ఉంటుంది (దానికి మరణదండన విధించడం హేతుబద్ధం కాకపోయినప్పటికీ).

ఉదాహరణకు రహస్యంగా సంచరించే దొంగలకు ఆశ్రయం ఇచ్చేవారికి శిరచ్ఛేదం శిక్షకాగా, రాత్రిపూట దొంగతనాలు చేసేవారికి శిక్ష చేతులు నరికేసి ఈటెతో గోడకు గుచ్చి చంపడం. అంటే నేరంచేసే వారికంటే వారికి ఆశ్రయం ఇచ్చేవారికి తక్కువ తీవ్రతరమైన శిక్ష వేయాలని గుర్తించాడు. అదేవిధంగా కొన్ని సందర్భాలలో ప్రజా ప్రయోజనాలను బట్టి శిక్ష తీవ్రత నిర్ణయం అవుతుంది. ఉదాహరణకు చెరువుకట్టను తెంపేవారికి శిక్ష కేవలం సాధారణ మరణదండన కాదు. నీటిలో ముంచి చంపడం. ఈ శిక్షలలోని క్రూరత్వాన్ని ఈ రోజు మనం ఆమోదించము. అయినప్పటికీ తీవ్రతకు ప్రజా ప్రయోజనాలను ప్రమాణంగా పెట్టుకోవడం హర్షించదగ్గ లక్షణం.

అయితే ఈ సాధారణ ప్రజాప్రయోజనాలతో వర్ణధర్మ పితృస్వామ్య వ్యవస్థ ప్రయోజనాలు కూడా కలగలసిపోయి ఉంటాయి. బ్రాహ్మణుడిని అప్రతిష్ఠపాలు చేసే శూద్రుడికి శిరచ్ఛేదమే శిక్ష. కేవలం అప్రతిష్ఠపాలు చేయడంతో ఆగిపోకుండా శూద్రుడు బ్రాహ్మణుడిని దూషిస్తే అప్పుడు నేరం తీవ్రత పెరుగుతుంది. ఎర్రగా కాల్చిన ఇనపకడ్డీని నోట్లో దూర్చి కాల్చి చంపడం దానికి శిక్ష. శూద్రుడు బ్రాహ్మణులకు వాళ్ళ విధులేమిటో చెప్పే అహంకారానికి పాల్పడితే అతని చెవిలో, ముక్కులో కాగుతున్న నూనెపోసి చంపాలి.

తాను గొప్పదనీ, తనవాళ్ళు గొప్పవాళ్ళనీ భావించి భర్తపట్ల తాను నిర్వర్తించవలసిన విధులను నిర్లక్ష్యం చేసే స్త్రీని అందరూ చూసే చోట సజీవంగా కుక్కలకు వేసి చంపాలని మనువు అంటాడు. ఆమెకు మామూలు మరణదండన సరిపోదు.

నేరస్మృతికి సంబంధించిన సాధారణ నియమాలలోను, వర్గీకరణ సూత్రాలలోను ఇతర దేశాల నేరస్మృతితో పోల్చదగ్గ ప్రగతిని హైందవ నేరస్మృతి కూడా సాధించిందని చెప్పాము. దీనికి ఒక ఉదాహరణ నేరం నిర్వచనంలో సంకల్పానికి వుండే ప్రాముఖ్యత. నేరం చేయాలన్న సంకల్పం లేకుండ నేరం జరిగితే అది నేరమే కాదని నాగరిక నేరస్మృతి భావిస్తుంది. ఉద్దేశ్యపూర్వకమైన సంకల్పమైనా ఉండాలి, లేదా కనీసం తెలిసీ అజాగ్రత్తగా ప్రవర్తించి ఉండాలి. ఇందులో రెండవది మొదటి దానికన్న తక్కువ తీవ్రతరమైన నేరం. అయినప్పటికీ

అదీ ఒక నేరమే. కానీ అజాగ్రత్తవల్ల గానీ, సంకల్పం లేకుండా గానీ నేరం జరిగితే అది నేరం కాదు. ఆధునిక నేరస్మృతులు గుర్తించే ఈ సూత్రాన్ని మనుధర్మశాస్త్రం కూడా గుర్తించింది. అదేవిధంగా, నేరాన్ని విచారించేటప్పుడు, శిక్ష నిర్ణయించేటప్పుడు దేశ కాల పరిస్థితులను, నేరస్తుడి సామాజిక ఆర్థిక స్థితిగతులను దృష్టిలో పెట్టుకోవాలని మనుధర్మశాస్త్రం అంటుంది. నేరం తీవ్రతను బట్టి శిక్ష తీవ్రత ఉండాలి గానీ నేరం తీవ్రతతో సంబంధంలేని తీవ్రమైన శిక్షలు వేయకూడదంటుంది.

ఈ సాధారణ సూత్రాలు నాగరికమైనవే. అయితే వాటికి నిర్దిష్టంగా అర్థం చెప్పుకునేటప్పుడు వర్ణధర్మ సంస్కృతి, పితృస్వామ్య సంస్కృతి మనువు అవగాహనను నిర్ణయిస్తాయి. తీవ్రత, సామాజిక స్థితిగతులు, పరిస్థితులు అనే మాటల నిర్వచనం బ్రాహ్మణీయ సంస్క ృతి నుండి వస్తుంది. ఉదాహరణకు వర్ణధర్మాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే అది నేరం అవుతుంది. దానికి మనువు చాలా కఠినమైన శిక్ష నిర్దేశిస్తాడు. ఈ విషయంలో శూద్రులకూ స్త్రీలకూ మనువు ఎటువంటి మినహాయింపులూ ఇవ్వలేదు. కానీ బ్రాహ్మణులకు మాత్రం ఇచ్చాడు. బ్రాహ్మణులు తక్కువ కులం వాళ్ళ దగ్గర దానం తీసుకోవడం ధర్మ విరుద్ధం. తక్కువ కులం వాళ్ళకు విద్య నేర్పడం ధర్మ విరుద్ధం. కానీ తిండికి గడవని బ్రాహ్మణులు ఈ రెండు పనులు చేయవచ్చుననీ అది ఆపద్ధర్మ నిర్ణయం కింద చెల్లుబాటవుతుందనీ మనువు అంటాడు. అయితే ఎంతటి విపత్కర పరిస్థితిలోనయినా కులకట్టడిని తప్పి ప్రవర్తించే ఆపద్ధర్మ సదుపాయం శూద్రులకు లేదు. అదేవిధంగా, దొంగతనం మనువు దృష్టిలో తీవ్రమైన నేరం. కాని యజ్ఞకర్మకాండకు సామగ్రి తక్కువ పడిన బ్రాహ్మణుడు పొలంలోని ధాన్యాన్ని, తోటలలోని ఫలాలను యజమాని అనుమతి లేకుండా తీసుకోవచ్చు. అది దొంగతనం కాదు.

శిక్ష తీవ్రత నేరాన్ని బట్టి ఉండాలి అన్న న్యాయసమ్మతమయిన సూత్రం కూడా ఒక మేరకు హేతుబద్ధమైన నియమంగాను, ఒక మేరకు వర్ణవివక్షను బలోపేతం చేసే నియమంగాను పనిచేస్తుంది. అన్ని దేశాలలాగ భారతదేశంలో కూడా రకరకాల శిక్షలుండేవి. అభిశంసనం అన్నిటికంటె మృదువయిన శిక్ష.

దీనిలో మళ్ళీ మనువు రెండు రకాలను గుర్తిస్తాడు. మెత్తగా అభిశంసించడం (వాగ్దండం), గట్టిగా హెచ్చరించడం (ధిగ్దండం). రెండవ శిక్ష జుర్మానా. దీనిలో మూడు మోతాదులను మనువు గుర్తిస్తాడు. ప్రథమ మోతాదులో జుర్మానా 250 పణముల దాకా ఉంటుంది. మధ్యమ మోతాదు 500 పణములు, ఉత్తమ మోతాదు 1000 పణములు. అయితే మరీ తీవ్రమయిన నేరమయితే నేరస్తుడి ఆస్తి మొత్తం జప్తు చేయవచ్చు. ఈ రకంగా రాజు సేకరించిన జుర్మానా రాజుకు చెందకూడదనీ, రాజ్యానికే చెందాలనీ మనువు అంటాడు. అది రాజుకే చెందేటట్టయితే రాజులు కక్కుర్తిపడి చీటికీ మాటికీ పెద్దఎత్తున జుర్మానాలు వసూలు చేసే ప్రమాదం ఉందని మనువు హేతుబద్ధంగానే గుర్తించి ఈ నియమం పెట్టాడు. అయితే అందులో కూడా బ్రాహ్మణుల స్వంత లాభం చూసుకున్నాడు. శిక్షలు వేయడం ద్వారా రాజు సేకరించిన జుర్మానాల మొత్తం ఖజానాలోనయినా జమ కావాలి, లేదా దానిని సద్బ్రాహ్మణులకైనా పంచిపెట్టాలి అంటాడు.

నాలుగవ శిక్ష కారాగార నిర్బంధం. అయిదవది భౌతిక దండనం. ఆరవది రాజ్య బహిష్కరణ. ఇందులో భౌతిక దండనం చాలా క్రూరంగా ఉండగలదని చూశాం. ఏ అంగంతో నేరం చేస్తే ఆ అంగాన్ని తెగనరకాలి అనేది భౌతిక దండనకు సంబంధించిన ప్రాథమిక సూత్రం. అంతేకాకుండా బహిరంగంగా అవమానపరచడం కోసం నేరానికి సంబంధించిన చిహ్నాన్ని నుదిటిమీద ముద్రించడం, గుండు గొరిగి గాడిద మీద ఊరేగించడం కూడా జరిగేది. చిహ్నాలు నుదిటిమీద ముద్రించే పద్ధతి యూరప్‌లో కూడా చాలాకాలం ఉండింది. (పంజాబ్ పోలీసులు ఈ మనునీతిని వెలికితీసి కొందరు స్త్రీలపైన ఈ మధ్య ప్రయోగించారు).

సుతిమెత్తని అభిశంసనం నుండి అతిక్రూరమైన మరణదండన దాకా శిక్షలను ఇంత వివరంగా వర్గీకరించడం పరిణతి చెందిన శిక్షాస్మృతి లక్షణం. అయితే ఈ పరిణతి మొత్తం బ్రాహ్మణీయ వర్ణ ధర్మ పరిధిలో జరిగింది. అందువల్ల ఇంత మెలకువగా వర్గీకరించిన ఈ శిక్షాస్మృతిలోని ఏ శిక్షను ఏ పరిస్థితిలో ఏ నేరానికి వర్తింపజేసారని పరిశీలిస్తే అడుగడుగునా వర్ణధర్మం, పితృస్వామ్య నీతి కొట్టొచ్చినట్టు కనిపిస్తాయి. ఇన్ని రకాల శిక్షలలో అభిశంసనం, జుర్మానా, దేశబహిష్కరణ మాత్రమే బ్రాహ్మణులకు వర్తిస్తాయి. బ్రాహ్మణులకు భౌతిక దండనం

ఎట్టి పరిస్థితిలోనూ విధించరాదు. మహా అయితే గుండు గొరిగించవచ్చు. ఇతరులకు మరణదండన విధించే నేరాలకు సహితం బ్రాహ్మణులకు రెండు కొరడా దెబ్బలు కూడా వేయకూడదు. గుండు గొరిగించి అతనిని తన ఆస్తితో సహా రాజ్యం నుండి బయటికి పంపించివేయాలి. అదే శూద్రుల దగ్గరికి వచ్చేసరికి కేవలం హత్యకేగాక అనేక నేరాలకు మరణశిక్ష విధించాలని మనువు అంటాడు. ఆ నేరం దొంగతనం కావచ్చు, మోసం కావచ్చు, స్త్రీపైన అత్యాచారం కావచ్చు, మామూలు ఘర్షణ కావచ్చు లేదా వర్ణధర్మాన్నీ వర్ణ నియమాలనూ అతిక్రమించే చర్య అయినా కావచ్చు.

సాధారణ ప్రజాప్రయోజనాలకు భంగం కలిగించే అనేక నేరాలకు రాజ్య బహిష్కరణ మనువు నిర్దేశించే శిక్ష. నగర ద్వారాన్ని విరగ్గొట్టడం, నగర ప్రాకారాన్ని ధ్వంసం చేయడం, అగడ్తలను పాడుచేయడం, న్యాయస్థానాలలో తప్పుడు సాక్ష్యం ఇవ్వడం, వర్తక లేక వృత్తికారుల సంఘంతో చేసుకొన్న ఒప్పందాన్ని అతిక్రమించడం ఇత్యాది సాంఘిక నేరాలకు సైతం రాజ్య బహిష్కరణే శిక్ష. అయితే మనువు పితృస్వామ్య కుటుంబ నియమాలనూ కుల నియమాలనూ ఈ సాంఘిక ప్రయోజనాలతో సమానంగా చూస్తాడు కాబట్టి వాటిని అతిక్రమించినా అదే శిక్ష. వివాహేతర లైంగిక సంబంధం పెట్టుకున్నా, తన కుల వృత్తి కాని వృత్తిని ఆచరించినా లేక వైదిక మతాన్ని తిరస్కరించినా రాజ్య బహిష్కరణే మనువు నిర్దేశించే శిక్ష.

ఎంతటి నేరానికయినా బ్రాహ్మణుడికి భౌతిక దండనం వేయరాదని మనువు ఆదేశించాడని చెప్పాము. కాని స్త్రీలు, చిన్న పిల్లలు, మతిస్థిమితంలేని వ్యక్తులు, అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తులు న్యాయస్థానాలు విధించే జుర్మానా చెల్లించుకోలేక పోయినా, కారాగార శిక్ష భరించలేరనుకున్నా వాళ్ళను మాత్రం ఊరికే వదిలిపెట్టకూడదన్నాడు. వాళ్ళకు 10 కొరడా దెబ్బలు వేయాలని మనువు అంటాడు. హత్యానేరానికి బ్రాహ్మణునికి గుండు గొరిగించి పంపిస్తే చాలన్న మనువు అభిప్రాయాన్ని చూశాం. ఒక స్త్రీ బహిష్ఠు సమయంలో దూరం ఉండకుండా ఇతర స్త్రీలను మైలపరిస్తే ఆమెకు కూడా అదే శిక్ష. గుండు గొరిగించి అవమానపరచాలి !

ఈ నేరస్మృతి వాస్తవంగా ఎంతమేరకు అమలు అయింది అనేది వివాదాస్పదమైన ప్రశ్న. హైందవ రాజులు మనుధర్మ శాస్త్రాన్ని తమ రాజ్యాంగంగా స్వీకరించి అమలు చేశారని అంబేద్కర్ వంటివారు అంటుండగా, ఈ ధర్మశాస్త్రాలు కేవలం బ్రాహ్మణుల కోరికను వ్యక్తంచేస్తాయని హెన్రీ మెయిన్ వంటివారు అంటారు. ఆధునిక నేరస్మ ృతిలాగ ప్రతి నేరానికీ కేసుకట్టి మనునీతి ప్రకారం శిక్షించకపోయి ఉండవచ్చును. ఆ అర్థంలో మనునీతిని ఆధునిక రాజ్యాంగంతోనూ నేర చట్టాలతోనూ పోల్చడం తప్పు. అయితే అది కేవలం బ్రాహ్మణుల ఆకాంక్షను ప్రకటించే పత్రం మాత్రమే కాదు. ఆకాంక్షను ప్రకటించి ఊరుకోవలసిన అగత్యం బ్రాహ్మణులకు లేదు. వాళ్ళు సమాజంలో ఆధిపత్య స్థానంలో ఉన్నారు. ప్రతి కేసూ ఈనాటి పోలీస్‌స్టేషన్లలోలాగా నమోదయినా కాకున్నా, ప్రతి కేసునూ మనుధర్మ ప్రమాణాల ప్రకారం విచారించి శిక్షించినా శిక్షించకున్నా, నేర విచారణకు సంబంధించిన ఒక ఆచరణాత్మకమైన ప్రమాణంగా మనునీతి పనిచేసిందనేది వాస్తవం. నేరం, శిక్ష, నీతి, ధర్మం, విధి, అధికారం మొదలయిన భావాలకు మనునీతి అధికారిక నిర్వచనాన్ని ఇచ్చి ఒక ఆధిపత్య సంస్కృతిని రూపొందించిందనేది కూడా వాస్తవం. రాజుగారి న్యాయస్థానాలలోనేకాక, గ్రామ పెత్తందార్ల కచేరీలలోనూ, కులపెద్దల పంచాయితీలలోను, కుటుంబం లోపల నిత్యం జరిగే న్యాయ నిర్ణయంలోనూ ఈ ప్రమాణాలు నిర్ణయాత్మక పాత్ర నిర్వహించాయి.

## 2. భౌతిక హింస, దూషణ

ఆస్తికి నష్టం కలిగించే నేరాలు (offences against property), వ్యక్తికి భౌతిక హాని కలిగించే నేరాలు (offences against person) అనే విభజన నేరస్మృతిలో మౌలికమయినది. ఇందులో రెండవ కోవకు సంబంధించిన నేరాలను మనుస్మృతి ఏ విధంగా నిర్వచించింది, ఏ విధంగా వర్గీకరించింది, ఏ రకమైన శిక్షలు నిర్దేశించింది అనే విషయాలు చూద్దాము.

నేరాల నిర్వచనంలో, వర్గీకరణలో, శిక్షల పరిమాణంలో, వీటికి సంబంధించిన సూత్రీకరణల్లో చెప్పుకోదగ్గ సాధారణ ప్రగతి; అయితే ఈ

మొత్తమంతా వర్ణధర్మం చట్రంలో ఉండడంవల్ల ఆ భావన నుండి పుట్టిన అనాగరిక వివక్ష; అనే రెండు లక్షణాలు హైందవ నేరస్మృతిలో ఆద్యంతం ఉన్నాయని గత అధ్యాయంలో చూశాము. అదే విషయం ఇక్కడ కూడ గమనించవచ్చు.

**హత్య :** ఉదాహరణకు హత్యానేరాన్ని తీసుకొందాం. ఒక మనిషి మరణాన్ని మరొకరు కలిగించడం హత్యానేరం అనుకుంటే, అన్నిరకాల హత్యలనూ ఒకటిగా చూడడం నాగరిక నేరస్మృతుల లక్షణం కాదు. ఏ దేశంలోనయినా నేరస్మృతి అభివృద్ధి చెందే క్రమంలో హత్యలను శిక్షార్హమయినవి (culpable), శిక్షార్హం కానివి అని వర్గీకరించడం నేర్చుకుంటుంది. శిక్షార్హమయిన హత్యలన్నీ మళ్ళీ ఒకే కోవకు చెందినవి కావు. సంకల్పాన్ని బట్టి, పరిస్థితులను బట్టి హత్యల మధ్య తేడా చూడడం, భిన్నమైన శిక్షా ప్రమాణాలు నిర్దేశించడం ప్రతీ నేరస్మృతీ కాలక్రమంలో నేర్చుకుంటుంది.

మనుస్మృతి ఇందుకు మినహాయింపు కాదు. మనువు హత్యలను నాలుగు రకాలుగా విభజిస్తాడు. శిక్షార్హం కాని హత్యలలో రెండు రకాలు, శిక్షార్హం అయిన హత్యలలో మళ్ళీ రెండు రకాలు. శిక్షార్హం కాని హత్యలలో కొన్ని సమర్థనీయం కావు గానీ క్షమించదగినవి. శిక్షార్హం అయిన హత్యలలో సంకల్పరహితమయినవి, సంకల్ప పూర్వకమైనవి అనేవి రెండు రకాలు.

ఈ వర్గీకరణకు ఆధునిక లక్షణాలు ఉండడమే కాక, ఇందులో సమర్థనీయత, క్షమార్హత, సంకల్పం అనే మాటలకు మనువు ఇచ్చే నిర్వచనం కూడా ఒక మేరకుహేతుబద్ధంగా ఉంటుంది. కాని దాని సరసనే వర్ణధర్మ భావం వచ్చి కూచుంటుంది. ఉదాహరణకు రోడ్లో బండినడుపుతూ ఒక మనిషిని గానీ జంతువునుగానీ ఢీకొంటే అది కొన్ని సందర్భాలలో క్షమార్హమయిన నేరం అవుతుందనీ, కొన్ని సందర్భాలలో క్షమార్హం కాకపోయినా అసంకల్పిత హత్యగా తక్కువ శిక్షకు అర్హమవుతుందనీ మనుస్మృతి అంటుంది. క్షమార్హం ఎప్పుడవుతుందంటే రథసారథి ప్రమేయం లేకుండ బండి ఇరుసు విరిగిపోవడం, గుర్రం ముక్కుతాడు తెగిపోవడం మొదలయిన కారణాలవల్ల ప్రమాదం జరిగినప్పుడు, లేదా 'పక్కకు తప్పుకోండి' అని బండి చోదకుడు అరిచినా జనం వినకుండ ఉన్నప్పుడు. ఇటువంటి క్షమార్హమయిన కారణాలవల్ల కాక ఇతర

కారణాలవల్ల (అంటే రథ చోదకుని పొరబాటు వల్ల) ప్రమాదం జరిగితే అది క్షమార్హం కాదు. శిక్షార్హం అవుతుంది. అయితే అది సంకల్పపూర్వకమైన హత్య కాదు కాబట్టి దానికి శిక్ష కేవలం జుర్మానా మాత్రమే – ఉరిశిక్ష కాదు.

ఇది ఆధునిక ప్రజాతంత్ర శాసనాలను పోలిన వర్గీకరణ. అయితే దీని సరసనే కులతత్వపు వాసన కూడ ఉంటుంది. ఉదాహరణకు సమర్థనీయమయిన నేరాలను వర్గీకరించేటపుడు – ఒక హత్యను లేక తీవ్రమైన నేరాన్ని నివారించడానికి ఒకరి ప్రాణాన్ని తీసినా, లేక ఒక స్త్రీ తనపైన లైంగిక అత్యాచారం జరపబోతున్న వ్యక్తిని చంపివేసినా అవి సమర్థనీయమయిన నేరాలని మనువు అంటాడు. ఆధునిక నేరస్మృతులు కూడ నేరాన్ని నిరోధించడానికి ఎదురుదాడికి పాల్పడే హక్కును ఒక చట్టపరమయిన హక్కుగా గుర్తిస్తాయి. అయితే మనుస్మృతి సమర్థించే హత్యలు ఇవి మాత్రమే కావు. బ్రాహ్మణుల యజ్ఞకాండకు అడ్డం వచ్చిన వారిని హతమార్చడం సమర్థనీయం. యజ్ఞకాండకు సంబంధించిన పవిత్ర వస్తువులను సంరక్షించడానికీ, యజ్ఞం నిర్వహించినందుకు బ్రాహ్మణులకు లభించే దక్షిణను కాపాడడానికీ హత్యకు పాల్పడితే అది సమర్థనీయం. విదేశీ దాడుల సమయంలోగానీ ఇతర జాతీయ సంక్షోభాల సమయంలోగానీ ద్విజ వర్ణాలలో సాంకర్యం జరిగే ప్రమాదం ఏర్పడినప్పుడు దానిని నివారించడానికి హత్యకు పాల్పడితే అది సమర్థనీయం. ఇటువంటి సందర్భాలలో నిస్సంకోచంగా హత్యగావించవచ్చుననీ, హత్యచేసేది తన గురువునే అయినా, ముసలివాడినయినా, పసిబాలురయినా, చివరికి వేదకోవిదుడయిన బ్రాహ్మణుడినే అయినా ఏం నేరం అంటదనీ మనువు అంటాడు. ఆయుధంతో అయినా మంత్రతంత్రాలతో అయినా హత్య చేయవచ్చునని పర్మిషన్ ఇస్తాడు. (దేశ విభజన సమయంలో – అంటే 1947 ఆగస్ట్–సెప్టెంబర్ నెలలలో సరిహద్దు ప్రాంతానికి చెందిన అనేక కుటుంబాలలో మగవాళ్ళు తమ స్వంత కూతుర్లనూ చెల్లెళ్ళనూ 'పరాయి మతస్తుల బారిన పడకుండా' వుండడానికి హతమార్చారు. ఈ హత్యాకాండ పెద్దఎత్తున జరిగిందని ఈ మధ్యనే వెల్లడైంది. ఈ క్రూరత్వానికి మూలాలు మన సంస్కృతిలో చాలా లోతుగా వున్నాయని మనువు అభిప్రాయం తెలియచేస్తుంది).

సంకల్ప పూర్వకంగా చేసే శిక్షార్హమయిన హత్యలను చాలా కఠినంగా శిక్షించాలని మనుస్మృతి అంటుంది. ఇది కేవలం రాజు లౌకిక బాధ్యత కాదు. దానిని లౌకిక బాధ్యతగా వదిలేస్తే దయకూ సానుభూతికీ సంస్కరణ దృక్పథానికీ తావు ఉంటుంది. కానీ వ్యవస్థాగతమయిన 'ఆర్డర్' (భద్రత)ను నిలబెట్టడంలో ఎటువంటి మానవీయమయిన దయాదాక్షిణ్యాలకూ మనుస్మృతి తావు ఇవ్వదు. అందువల్లనే నేరగాళ్ళను శిక్షించే ప్రభుత్వ బాధ్యతను పాలకుడయిన రాజుగారి పారలౌకిక భవిష్యత్తుతో మనుస్మృతి ముడిపెడుతుంది. రాజు దేవేంద్రుడి స్థానం పొందాలన్నా శాశ్వతకీర్తి పొందాలన్నా మోక్షం పొందాలన్నా నేరగాళ్ళను నిర్దాక్షిణ్యంగా శిక్షించాలని మనుస్మృతి అంటుంది. ఆ పనిచేయని రాజు 'నాశనం' అవుతాడని అంటుంది. సామాజిక భద్రతను నిలబెట్టడం కోసం రాజ్యం పాల్పడే హింస విషయంలో ఎటువంటి సంకోచానికీ తావు లేకుండా చాలా కట్టుదిట్టం చేస్తుంది మనుస్మృతి. (ఈ రోజు నిర్బంధ చట్టాలనూ చట్టబాహ్యమైన రాజ్యహింసనూ ఎట్టి పరిస్థితిలోను విడనాడకూడదని ఆర్.ఎస్.ఎస్. వంటి హైందవ సంస్థలు పట్టుబట్టడానికి గల తాత్విక మూలం మనువు వైఖరిలోనే ఉంది. ఈనాటి సామాజిక రాజకీయ సందర్భం వేరే కావచ్చు).

సంకల్ప పూర్వకమైన హత్యకు మరణదండన సాధారణ శిక్ష. ఇందులో మళ్ళీ తక్కువ క్రూరమైన రూపాల నుండి అతి క్రూరమైన రూపాల దాకా నిర్దేశించబడ్డాయని గత అధ్యాయంలో చూశాము. అయితే వేరే ఏ హత్యకైనా మరణ దండన కాక ఇతర శిక్షలు వేయవచ్చునేమో గానీ స్త్రీలను, పిల్లలను, బ్రాహ్మణులను చంపిన వారికి (స్త్రీ బాల బ్రాహ్మణఘ్నులకు) తప్పనిసరిగా మరణదండన వేయాలని మనుస్మృతి అంటుంది. ఇక్కడ మళ్ళీ ఒక హేతుబద్ధమైన ఆలోచన వర్ణవ్యవస్థను కాపాడే ఉబలాటంతో కలగలిసిపోయింది. ఎదిగిన మగవాడు హత్య చేయడానికి పూనుకుంటే స్త్రీలు, పిల్లలు ఆత్మరక్షణ చేసుకోజాలరు. కాబట్టి అటువంటి హత్యకు మరణదండన తప్పనిసరిగా విధించాలనడంలో ఒక హేతుబద్ధమైన వాదన ఉంది. కానీ వారితో బ్రాహ్మణులను చేర్చడంలో హేతుబద్ధత ఏమీ లేదు. అది బ్రాహ్మణులను భౌతికంగా కాపాడడానికీ, బ్రాహ్మణులు చాలా పవిత్రులనే భావనను కాపాడడానికీ, తద్వారా మొత్తంగా వర్ణవ్యవస్థను కాపాడడానికీ ఉద్దేశించబడింది తప్ప వేరే కాదు.

**భౌతిక హింస :** ప్రాణం తీయకుండ గాయం కలిగించే హింసను మనుస్మృతి 'దండపారుష్యం' అంటుంది. దీనికి వేసే శిక్షలో భౌతిక దండన, జుర్మానా రెండూ ఉంటాయి. జుర్మానా పరిమాణం నేరంవల్ల కలిగిన గాయం తీవ్రతను బట్టి ఉంటుంది. బాధితుని గాయం పూర్తిగా మానేవరకు అయ్యే ఖర్చంతా దోషి భరించాలనీ ఆపైన రాజుగారి ఖజానాకు జుర్మానా చెల్లించాలనీ మనుస్మృతి అంటుంది. ఈ ఖర్చేకాక జుర్మానా కూడ గాయం తీవ్రతను బట్టి పెరుగుతుంది. కేవలం చర్మం చిట్లి రక్తంవస్తే జుర్మానా 100 పణములు. కండరాలు తెగితే జుర్మానా అందుకు కొన్ని రెట్లు. ఎముకలు విరిగితే ఆస్తి మొత్తం జప్తు చేసుకొని దేశబహిష్కరణ విధిస్తారు. ఈ శిక్షలు ఈ రోజు మనకు విపరీతంగా అనిపించినా, వాటిని నిర్ణయించడానికి ఉపయోగించిన ప్రమాణం హేతుబద్ధమైనదే.

అయితే జుర్మానాతోపాటు విధించే భౌతిక దండన దగ్గరికి వచ్చేటప్పటికి, శిక్షల వర్గీకరణలో హేతుబద్ధమైన ప్రమాణం పోయి వర్ణం ప్రధాన ప్రమాణం అవుతుంది. కొట్టినవాడి కులాన్నిబట్టి, దెబ్బలు తిన్నవాడి కులాన్నిబట్టి శిక్ష నిర్ణయం అవుతుంది. శూద్రుడు ద్విజుని గాయపరిస్తే ఏ శారీరక అంగంతో గాయపరుస్తాడో ఆ అంగాన్ని తెగ నరకడం మనువు నిర్దేశించే సాధారణ శిక్ష. గాయం నిజంగా కలిగించనక్కరలేదు. ప్రయత్నం చేసినా అదే శిక్ష. నేరం నిర్వచనంలోకి కులాన్ని తీసుకొస్తే ఏమవుతుందంటే అసలు నేరం అప్రధానం అయిపోయి కులాధిక్యతను వ్యతిరేకించడమే నేరం అవుతుంది. కొట్టడం, తన్నడం, ఉమ్మివేయడం నేరాలంటే అర్థం ఉంది. కానీ వాటికి శిక్షలు నిర్దేశించేటప్పుడు ఆ నేరాలు చేయడం కంటె తద్వారా వర్ణ ఆధిక్యతను ధిక్కరించడం ప్రధాన విషయం అయిపోవడంవల్ల నిజానికి నేరంగా భావించగల హింసాత్మక చర్య ఏదీ జరగక పోయినప్పటికీ వర్ణ ఆధిక్యతను ధిక్కరిస్తే చాలు అదే నేరం అయిపోతుంది. కాబట్టి ద్విజుడిని కొట్టిన శూద్రుడి చేయి నరికేయాలనీ, ద్విజుడిని తన్నిన శూద్రుని కాలు నరికేయాలనీ చెప్పినచోటనే ద్విజుడు కూర్చున్న ఆసనం మీద సమానస్థాయిలో శూద్రుడు కూర్చుంటే అతని పిర్రలు తెగనరికివేయాలని మనుస్మృతి అంటుంది. ఈ చర్యలో వర్ణ వ్యవస్థను ధిక్కరించడం తప్ప కొట్టడం తన్నడం వంటి నేరాలతో సమానమయిన హింస ఏదీ లేకపోయినా వీటినన్నిటినీ ఒకేచోట ప్రస్తావించడం తర్కరహితం అని కూడ ఆ స్మృతికారునికి తోచదు.

అదే స్మృతికారుడు మళ్ళీ మనుషులకు పశువులకు కలిగే గాయాలనే కాక చెట్లకూ పక్షులకూ చేసే హానిని కూడా శిక్షార్హమయిన నేరాలన్నాడు. వాటికి జుర్మానాలు నిర్దేశించాడు. పైగా ఈ నేరాలను చాలా సున్నితంగా వర్గీకరించాడు. పండ్లిచ్చే చెట్టును నరికేస్తే ఎక్కువ జుర్మానా, పూలిచ్చే చెట్టును నరికేస్తే అంతకంటే తక్కువ జుర్మానా. కేవలం నీడనిచ్చే చెట్టును నరికేస్తే ఇంకా తక్కువ జుర్మానా నిర్దేశించాడు. అయితే ఇక్కడ కూడ బ్రాహ్మణుల ప్రయోజనాలను మరచిపోలేదు. బ్రాహ్మణుల ఆశ్రమాలలోని చెట్టును నరికేస్తే దానికి ప్రత్యేకమయిన జుర్మానా పెట్టాడు.

**దూషణ :** ఒక వ్యక్తిని దూషించడం, నిందించడం, పరువు నష్టం కలిగించడం ఆధునిక నేరస్మృతిలాగ మనుస్మృతిలో కూడ నేరాలే. వీటిని మనువు 'వాక్ పారుష్యం' అన్నాడు. ఈ నేరాల విషయానికొచ్చేసరికి కులం తప్ప వేరే ప్రమాణమే లేదు. దూషించే వ్యక్తి కులం, దూషణకు గురయ్యే వ్యక్తి కులం నేరం తీవ్రతనూ శిక్షనూ నిర్ణయిస్తాయి. క్షత్రియుడు బ్రాహ్మడిని దూషిస్తే శిక్ష 100 పణముల జుర్మానా. దూషించినది శూద్రుడయితే మరణదండనే శిక్ష. బ్రాహ్మణుడు క్షత్రియుడిని దూషిస్తే శిక్ష 50 పణములు, వైశ్యుడిని దూషిస్తే 25 పణములు, శూద్రుడిని దూషిస్తే 12 పణములు మాత్రమే. దూషించిన వ్యక్తిదీ దూషించబడిన వ్యక్తిదీ ఒకే వర్ణం అయితే (అది ఏ వర్ణం అయినా) శిక్ష కేవలం 12 పణములే. దీనిని బట్టి చూస్తే దూషణవల్ల వ్యక్తికి కలిగిన బాధ లేక నష్టం కంటే వర్ణ ఆచారాలకు జరిగిన అపచారమే మనువు దృష్టిలో ప్రధానం అని అర్థం అవుతుంది. ఆ అపచారం వల్లనే అది నేరం అయినట్టుంది.

దూషించింది శూద్రుడయితే శిక్ష జుర్మానా కాదు. తీవ్రమయిన భౌతిక దండన దానికి శిక్ష. అంటే శూద్రులు అణిగిమణిగి పడి ఉండాలి అనే వర్ణ నిర్ణయాన్ని నేరస్మృతి ద్వారా సాధించడానికి మనుస్మృతి ప్రయత్నిస్తుంది. అగ్రవర్ణాల వారిపైన శూద్రుడు తిట్లు ప్రయోగిస్తే అతని నాలుక తెగగోయడం దానికి శిక్ష. (తిట్టింది బ్రాహ్మణుడినయితే మరణ దండన శిక్ష) శూద్రుడు అగ్రవర్ణాలవారిని కులం పేరుపెట్టి నిందిస్తే అతని నోట్లో కాలిన ఇనుప మేకు దూర్చి శిక్షించాలని మనుస్మృతి అంటుంది. శూద్రుడు అహంభావం కొద్దీ బ్రాహ్మణుడికి నీతులు చెప్పే సాహసంచేస్తే అతని నోట్లో, చెవులలో కాగుతున్న నూనె పోయాలని అంటుంది.

## 3. లైంగిక నేరాలు

ఒక స్త్రీని ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా లైంగికంగా లోబరచుకోవడానికి ఒక మగవాడు ప్రయత్నంచేస్తే అది నేరం అవుతుంది. ఇది అన్ని సమాజాలలో నిత్యం జరుగుతున్న నేరం. అన్ని సమాజాలు దీనిని నేరంగా గుర్తించాయి కానీ రకరకాల మినహాయింపులు పెట్టాయి. ఆధునిక భారత నేరస్మృతి సహితం ఆ స్త్రీ ఆ మగవాడి భార్య అయినట్టయితే ఆమెను బలాత్కారం చేయడం నేరం కాదని అంటుంది. ఆ భార్య ఒకవేళ కోర్టు ఆర్డర్ పొంది వేరుపడి వుంటున్నప్పటికీ ఆమెను రేప్ చేయడానికి ఆమె భర్తకు భారత శిక్షాస్మృతి కొంచెం హక్కు కల్పించింది. అటువంటి రేప్ సాధారణ రేప్ కంటె చిన్న నేరం అని ఐపిసి సెక్షన్ 376ఎ అంటుంది. సాధారణ రేప్‌కు కనీస శిక్ష 7 సంవత్సరాల ఖైదు కాగా, వేరుపడి బ్రతుకుతున్న భార్యను రేప్ చేస్తే గరిష్ఠ శిక్ష 2 సంవత్సరాలు ! వేరుపడకుండ తన ఇంట్లోనే వుంటున్న భార్యతో ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా లైంగిక క్రియ జరిపితే శిక్షే లేదు (ఆమె వయస్సు 15 కంటే తక్కువ అయితే తప్ప).

మగవాడికి తన భార్య శరీరంపైన, లైంగికతపైన యాజమాన్య అధికారం వుందన్న పితృస్వామ్య భావనను ఆధునిక సెక్యులర్ చట్టాలు సహితం ఈ విధంగా తమలో ఇముడ్చుకున్నాయి. దీనికి మరొక కోణం అడల్టరీకి (వివాహేతర లైంగిక సంబంధం) సంబంధించిన సెక్షన్ 497, 498లు. భర్త తన భార్యను ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా బలాత్కరించినా అది నేరం కాదన్న చట్టమే, ఒక మగవాడు మరొకడి భార్యతో ఆమె సమ్మతితోనే లైంగిక సంబంధం పెట్టుకొన్నా, దానికి ఆమె భర్త సమ్మతి లేకపోతే అది నేరం అని (సెక్షన్ 497) అంటుంది. భర్త విషయానికొచ్చేసరికి ఆమె సమ్మతి లేకపోయినా ఫరవాలేదు. పరాయి మగవాడి విషయంలో ఆమె సమ్మతి వున్నా సరిపోదు. సెక్షన్ 498 ఇంకొంచెం ముందుకు పోయి, ఒక వివాహిత స్త్రీతో లైంగిక సంబంధం పెట్టుకునే ఉద్దేశ్యంతో ఆమెను మైమరపించి ఆమె భర్త దరి నుండి తీసుకుపోవడం సహితం నేరం అని అంటుంది. భార్య శరీరానికీ లైంగికతకూ భర్త యజమాని అనే భావన ఆధునిక చట్టాలలో సహితం ఇంత బలంగా వుంది.

అడల్టరీ అనే చర్యను క్రిమినల్ చట్టాలలో నిర్వచించడం గమనార్హం. చట్టాలలో క్రిమినల్ చర్యలకూ సివిల్ నేరాలకూ ఒక తేడా వుంది. సివిల్ నేరం కేవలం బాధిత వ్యక్తికి నష్టం కలిగించే చర్యగా భావించబడుతుంది. క్రిమినల్ నేరాలు అందుకు భిన్నంగా కేవలం బాధితులకే కాక మొత్తంగా సమాజానికి నష్టం కలిగించే చర్యలుగా భావించబడతాయి. అందుకే వాటిని నిరోధించడం, విచారించి శిక్షించడం బాధితుల బాధ్యత కాదు, సమాజం బాధ్యత. ఈ తర్కాన్ని సెక్షన్ 497కు అన్వయిస్తే ఒక వివాహిత స్త్రీ అమె భర్త అనుమతి లేకుండ మరొకరితో లైంగిక సంబంధం పెట్టుకుంటే, తద్వారా ఆమె భర్త తన 'హక్కు'ను కోల్పోవడమే కాక, సామాజిక వ్యవస్థకే అన్యాయం జరిగిపోయిందని అర్థం చేసుకోవలసి వుంటుంది ! ఇది ఆధునిక లౌకిక చట్టాల వైఖరి.

స్త్రీ లైంగికతపైన ఆమె భర్తకు, ఆమె కుటుంబానికి, కులానికి, గ్రామానికి, సమాజానికి పెత్తనం కల్పించే పితృస్వామ్య వ్యవస్థకు సుదీర్ఘమైన చరిత్ర వుంది. అది అన్ని దేశాలలో అన్ని జాతులలో వుంది. భారతదేశంలో అది బ్రాహ్మణీయ వర్ణ వ్యవస్థతో ముడిపడి ఉంది. 'హైందవ ధర్మం'లో వర్ణ ధర్మాన్నీ, పితృస్వామ్యాన్నీ వేరు చేయడం కష్టం. పితృస్వామ్య భావజాలం వర్ణధర్మం పరిభాషలోనే వ్యక్తం అయింది.

నేరస్మృతికి స్త్రీ లైంగికతతో ఏం పని అని అడిగితే, స్త్రీ లైంగిక జీవితాన్ని నియంత్రించకపోతే వర్ణ సాంకర్యం జరిగిపోతుందని మనువు జవాబిస్తాడు. వర్ణసాంకర్యం జరిగితే ప్రపంచంలో పాపం పెరిగిపోతుంది. పాపం పెరిగిపోతే ప్రపంచం నాశనం అయిపోతుంది. మనువు భాష్యకారులలో ఒకడయిన కుల్లూక భట్టు ఇంకొంచెం స్పష్టంగా అంటాడు. 'వర్ణ సాంకర్యం జరిగితే కర్మకాండను ఆచరించలేము. ఎందుకంటే కర్మలు ఆచరించే అర్హత కలవాళ్ళ సంఖ్య తగ్గిపోతుంది. కర్మకాండ ఆచరించకపోతే వర్షాలు పడవు. వర్షాలు పడకపోతే సర్వనాశనం అవుతుంది. కాబట్టి వర్షాలు పడాలంటే భూమి సస్యశ్యామలంగా వుండాలంటే ఆడవాళ్ళందరూ 'పవిత్రంగా' వుండాలి.

కులవ్యవస్థ లేని హైందవేతర సమాజాలలో కూడా స్త్రీ శరీరంపైన మగవాళ్ళకూ సమాజానికీ ఇదే రకమైన పెత్తనం వుండింది. కాబట్టి భారతదేశ

చరిత్రలో పితృస్వామ్యానికి వర్ణవ్యవస్థను మూలంగా భావించలేము. అయితే పితృస్వామ్యం ఇక్కడ వర్ణవ్యవస్థలో పెనవేసుకుని వుండింది. పితృస్వామ్యానికి వర్ణ వ్యవస్థ భావజాలాన్ని కల్పించింది. పితృస్వామ్య భావాలు వర్ణ ధర్మం పరిభాషలో వ్యక్తం అయ్యాయి.

ఈ నేపథ్యంలో మనువు ఏ లైంగిక క్రియలను నేరాలుగా భావించాడో వాటికి ఏ రకమైన శిక్షలు నిర్దేశించాడో చూద్దాం.

తన భార్య కాని స్త్రీతో ఒక మగవాడు లైంగిక సంబంధం పెట్టుకోవడం నేరం అనేది (క్లుప్తంగా) మనువు అభిప్రాయం. అది ఆమె సమ్మతితో కావచ్చు. సమ్మతి లేకుండ కావచ్చు. ఏదయినా నేరమే. ఆధునిక నేరస్మృతిలో కూడా వివాహిత స్త్రీ విషయంలో ఆమె సమ్మతితో సంబంధం లేకుండ, ఆమె భర్త సమ్మతించకపోతే, అది నేరం అవుతుందని పైన చూశాం. మనువు దృష్టిలో ఆమె వివాహిత అయినా కాకున్నా, ఆమె సమ్మతించినా సమ్మతించకున్నా ఆమె భర్త 'అనుమతించినా' లేకున్నా అది నేరమే. అంతే కాదు లైంగిక సంబంధం అంటే భౌతిక సంయోగమే కానవసరంలేదు. ఆమె దస్తులు ముట్టుకోవడం, ఆమె పడకపైన కూర్చోవడం, శరీరాన్ని తాకడం, చివరికి అనవసరంగా పలకరించడం కూడా లైంగిక నేరమే. 'నా భార్యతో నువ్వు మాట్లాడవద్దు' అని ఆమె భర్త హెచ్చరించిన తరువాత ఆమెతో మాట్లాడితే, ఆ పలకరింపు అమాయకమయినదైనా అది నేరమే. నిర్జన ప్రదేశంలో ఒక స్త్రీ ఎదురయితే 'బాగున్నారా' అని పలకరించడం కూడ మనువు దృష్టిలో లైంగిక నేరమే. 'ఊరి బయట, అడవిలో, వాగు దగ్గర స్త్రీని పలకరించడం అక్రమ లైంగిక సంబంధం క్రిందికి వస్తుంది' అంటుంది మనుస్మృతి. మనుస్మృతి వ్యాఖ్యాతలలో ఒకడయిన మేధాతిథి ఇంకొంచెం ముందుకుపోయి ఒక స్త్రీ లేని సమయంలో సహితం ఆమె ఆభరణాలను, బట్టలను అవి ఆమెవని తెలిసి అనవసరంగా ముట్టుకుంటే, అది కూడా ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోవడంతో సమానం అంటాడు. మరీ ఇంత చాదస్తం ఎందుకని అడిగితే, మొగ్గలోనే తుంచేయకపోతే ఆ సంబంధం పెరిగి పెరిగి భౌతిక సంయోగానికి దారితీయవచ్చుననీ ఆ తరువాత వర్ణసాంకర్యాన్నీ, వినాశనాన్నీ ఆపలేమనీ చెప్తాడు.

## బ్రాహ్మణ ధర్మంలో ప్రజాస్వామ్యం

పై వివరణలో మగవాడు నేరం చేసేవాడిగా, స్త్రీ ఆ నేరానికి ఒక వస్తువుగా, ఆమె భర్త బాధితుడిగా కనిపిస్తాడు (భర్తతో పాటు ఆమె కుటుంబం, కులం, సమాజం, ధర్మం బాధితులు అవుతారు). ఇది కాకతాళీయం కాదు. ఈ నేరాల నిర్వచనంలోని భావజాలమే అట్లాంటిది. ఆధునిక నేరస్మృతిలో కూడా వివాహేతర లైంగిక సంబంధం పెట్టుకోవడం (సెక్షన్ 497) మగవాడు మాత్రమే చేయగల నేరం. ఈ నేరంలో బాధితుడు ఆ స్త్రీ భర్త. అతని భార్య శరీరంపైన, లైంగికతపైన అతనికి వున్న 'హక్కు'కు భంగం కలిగింది. ఆ హక్కును భంగపరచినవాడు అతని భార్యతో సంబంధం పెట్టుకొన్నవాడు. అతను నేరస్తుడు. ఈ ఘర్షణకు ఆమె ఇష్టయిష్టాలతో ఏమీ సంబంధం లేదు. ఆమె నిమిత్తమాత్రురాలు. స్త్రీపైన ఆమె భర్తకున్న హక్కును పరాయి మగవాళ్ళ దాడి నుండి కాపాడడం ఈ చట్టం లక్ష్యం. ఆమె ఈ ఘర్షణలో ఒక వస్తువు మాత్రమే. పరాయి మగవాడితో సంబంధానికి ఆమె సమ్మతించినా అది చెల్లదు. సమ్మతించే వ్యక్తిత్వాన్ని ఆమెకు నిరాకరించిన చట్టం, నేరంలో ఆమె దోషి కాదని ఔదార్యం చూపించింది. ఒక దొంగతనం కేసులో దొంగిలించబడిన నగ దోషి కానట్టే అడల్టరీ కేసులో స్త్రీ కూడా దోషి కాదు !

ఆధునిక చట్టానికే వున్న ఈ దృక్పథం మనువుకు కూడ వుండడంలో ఆశ్చర్యం లేదు. నిజానికి ఇది దాని కొనసాగింపే. అందువల్ల మనువు నేరస్మృతిలోని లైంగిక నేరాల నిర్వచనంలో కూడా నేరస్తుడు ఒక మగవాడయితే, బాధితుడు ఇంకొక మగవాడు (లేక పితృస్వామ్య సాంఘిక వ్యవస్థ). స్త్రీ ఆ నేరానికి ఒక వస్తువు మాత్రమే. అయితే కర్కోటకుడయిన మనువు ఆ స్త్రీకి అసలే శిక్ష వేయకుండ వుండలేదు. వివాహేతర లైంగిక సంబంధం పెట్టుకొన్న స్త్రీకి అతను భౌతిక దండన విధించడుగానీ ప్రాయశ్చిత్తం చేసుకోవాలంటాడు. చాంద్రాయన వ్రతం వంటివి ఆచరించాలంటాడు. అయితే ఆ స్త్రీ ఒకవేళ 'నా భర్త కంటే నేను గొప్పదానిని' లేదా 'నా వాళ్ళు గొప్పవాళ్ళు' అనే అతిశయ భావంతో పరాయి మగవాడితో సంబంధం పెట్టుకోవడం జరిగి వుంటే మట్టుకు, అటువంటి అతిశయాన్ని ప్రదర్శించే ఆడవాళ్ళకు వేసే అతి క్రూరమైన మరణదండనను ఆమెకు విధించాలంటాడు. అంటే ఆమెను సజీవంగా ఆకలిగొన్న కుక్కలకు వేయాలి.

లైంగిక నేరాల నిర్వచనంలో కాపాడబడేది నేరంలో భాగస్తురాలయిన స్త్రీ భర్త హక్కులే కాబట్టి, కొంతమంది స్త్రీలకు అది అసలు వర్తించదు. 'నటులు, గాయకులు, తార్పుడు గాళ్ళు' తమ భార్యలను తామే ఇతరుల దగ్గరకు పంపిస్తారు కాబట్టి అటువంటి స్త్రీలతో పరాయి మగవాళ్ళు పెట్టుకొనే వివాహేతర లైంగిక సంబంధంలో నేరమేమీ లేదని మనువు అంటాడు. అయితే అటువంటి భార్యలు మామూలుగా పరాయి పురుషుల దగ్గరకు పోతుంటారనేది ఆ చర్యను సమర్థించడానికి సరిపోదనీ, ప్రతి సందర్భంలోనూ నిజంగా అనుమతి తీసుకున్నారా లేదా అనేది చూడాలనీ మనువు జాగ్రత్త చెప్పాడు. అటువంటి స్త్రీలతోనయినా సరే, భర్త అనుమతి లేకుండ సంపర్కం పెట్టుకుంటే ఆ భర్త హక్కు ఆ మేరకు పోయినట్టే కాబట్టి కొంచెం ఫైన్ చెల్లించాలని మనువు అంటారు. ఏమాత్రం ఫైన్ చెల్లించనవసరం లేనిది 'మగదిక్కు' అసలే లేని స్త్రీల విషయంలో. వాళ్ళ విషయంలో హక్కులు కోల్పోయే మగవాడెవడూ వుండడు కదా ! మళ్ళీ ఒక కుటుంబంలో, కుటుంబ యజమాని సంరక్షణలో బ్రతికే వితంతువులకు ఇది వర్తించదు. ఎందుకంటే ఆ కుటుంబ ప్రతిష్ఠ, కుటుంబానికి ఆమెపైన వున్న అజమాయిషీ దెబ్బతింటాయి. ఇది నూటికి నూరు శాతం వర్తించేది (మనుస్మృతి ప్రకారం) ఎటువంటి మగదిక్కు లేని వ్యభిచారిణులకు, సన్యాసినులకు. వాళ్ళతో ఏ మగవాడు లైంగిక సంబంధం పెట్టుకున్నా అందులో నేరం లేదు. తర్కం కోసమైనా మనువు వ్యభిచారిణులనూ సన్యాసినులనూ ఒక గాటన కట్టడం ఆశ్చర్యం కలిగించవచ్చును. కానీ సన్యాసులను గొప్పగా గౌరవించిన ఈ బ్రాహ్మణ ధర్మశాస్త్రకారుడికి సన్యాసినులంటే పెద్దగా సదభిప్రాయం లేదు. వాళ్ళు తమ కామ వాంఛను కాషాయ వస్త్రాలలో దాచుకుంటారని ఆ మహానుభావుడి అభిప్రాయం.

లైంగిక నేరాలను మనువు ఎంత కఠోరంగా నిర్వచించాడో చూశాం. ఇష్టం లేని స్త్రీని బలాత్కారం చేయడమే కాదు, ఇష్టపూర్వకంగా లైంగిక సంబంధం పెట్టుకున్నా, ముట్టుకున్నా, మాట్లాడినా, పక్కన కూర్చున్నా, ఒంటరి ప్రదేశంలో పలకరింపుగా 'హలో' అన్నా నేరమేనన్నాడు. అంతేకాక, భౌతిక సంయోగం జరిగితే శిక్ష ఎంతో పై అన్ని నేరాలకూ అంతే శిక్ష అన్నాడు. దోషి బ్రాహ్మణుడయితే

తప్పు - పై నేరాలన్నింటికీ మరణ దండన శిక్ష అన్నాడు. తరువాతి కాలపు వ్యాఖ్యాతలను ఈ వర్ణ వివక్ష బాధ పెట్టలేదు కానీ మనువు కాఠిన్యత బాధపెట్టింది. అన్నింటికీ మరణ దండన విధించకూడదనీ జుర్మానాతో మొదలుపెట్టి అన్ని రకాల శిక్షలు విధించవచ్చుననీ అన్నారు. భౌతిక సంయోగం కూడా శూద్ర పురుషుడు బ్రాహ్మణ స్త్రీతో పెట్టుకుంటే మరణదండన తప్పనిసరిగా విధించాలి గానీ అగ్రకులాల మగవాళ్ళు కింది కులాల స్త్రీలతో వివాహేతర లైంగిక సంబంధం పెట్టుకుంటే అంతకంటే తక్కువ శిక్ష వేయవచ్చునని అన్నారు. వివాహేతర లైంగిక సంబంధంలో మగవాడి కులం పెరిగేకొద్దీ, స్త్రీ కులం తగ్గేకొద్దీ, శిక్ష తక్కువ అవుతుంది. బ్రాహ్మణుడు శూద్ర వివాహిత స్త్రీతో సంబంధం పెట్టుకుంటే అతి తక్కువ శిక్ష. మగవాడి కులం తగ్గి స్త్రీ కులం పెరిగేకొద్దీ శిక్ష పెరుగుతుంది. వివాహిత బ్రాహ్మణ స్త్రీతో సంబంధం పెట్టుకున్న శూద్రుడికి మరణ దండనే శిక్ష. మధ్యస్తంగా వుండే కేసులలో శిక్షలు రకరకాలు. ఉదాహరణకు క్షత్రియుడు వివాహిత అయిన బ్రాహ్మణ స్త్రీతో లైంగిక సంబంధం పెట్టుకుంటే అతను 1000 పణముల జుర్మానా చెల్లించడమే కాక, అతని తలను గాడిద మూత్రంలో తడిపి గొరుగుతారు. అదే ఆమె వేశ్య స్త్రీ అయితే 1000 పణముల జుర్మానాతో తప్పు తీరిపోతుంది. వైశ్యుడు బ్రాహ్మణ వివాహితతో సంబంధం పెట్టుకుంటే అతని ఆస్తి మొత్తం జప్తుచేసి 1 సంవత్సరం జైలులో పెడతారు. అదే ఆమె క్షత్రియ స్త్రీ అయితే 1000 పణముల జుర్మానాతో చెల్లు అయిపోతుంది.

లైంగిక సంబంధం వివాహిత స్త్రీతో కాక అవివాహితతో పెట్టుకుంటే నేరం తీవ్రత తగ్గుతుంది. ఇక్కడ కూడ శూద్రుడు బ్రాహ్మణ అవివాహితతో సంబంధం పెట్టుకుంటే క్షమించేది వుండదు. మరణదండనే మనువు శిక్ష. మొత్తం మీద కింది కులాలకు చెందిన మగవాళ్ళు అగ్రకులాల అవివాహిత స్త్రీలతో లైంగిక సంబంధం పెట్టుకుంటే శిక్ష అనుభవించవలసి వుంటుంది. కానీ ఇద్దరి కులం ఒకటే అయితే అమ్మాయి తండ్రికి కట్నం చెల్లించి పెళ్ళి చేసుకోవచ్చు. మగవాడి కులం ఎక్కువ, స్త్రీ కులం తక్కువ అయితే మనువు ఆమోదించడు కానీ మరీ సీరియస్ విషయంగా భావించడు. ధర్మం చూసీ చూడనట్టు పోతుంది. ఈ విధంగా అగ్రకులాల పురుషులు తమకంటె తక్కువ కులాలకు చెందిన స్త్రీలను 'ఉంపుడు

కత్తెలు'గా వుంచుకొనే సంప్రదాయాన్ని అన్ని విషయాలలో చాలా కఠోరంగా కనిపించే మనువు సహితం అనుమతిస్తాడు. వాళ్ళు వివాహిత స్త్రీలయితే ఆ సంబంధాన్ని క్షమించడు గానీ అవివాహితలయితే పోనీ లెమ్మంటాడు.

లైంగిక నేరాలలో శిక్ష తీవ్రతను ప్రధానంగా నిర్ణయించేది కులం కాగా, ఆ స్త్రీ 'పవిత్ర'తకు కూడా కొంత పాత్ర వుంటుంది. బ్రాహ్మణీయ భావజాలంలో వర్ణధర్మాన్నీ పితృస్వామ్య నియమాలనూ వేరుచేసి చూడడం కష్టం అని ఇదివరకే చెప్పాము. ఉదాహరణకు ఒక క్షత్రియ, లేక వైశ్య పురుషుడు వివాహిత బ్రాహ్మణ స్త్రీతో లైంగిక సంబంధం పెట్టుకుంటే కొంత జుర్మానా, కొంత భౌతిక దండన అనుభవించవలసి వుంటుందని పైన చెప్పాము. అయితే ఆ బ్రాహ్మణ స్త్రీ 'శీలవతి' కాకపోతే జుర్మానా సగం చెల్లిస్తే సరిపోతుంది. కానీ ఆమె అత్యంత 'శీలవతి'గా, 'పవిత్రురాలి'గా పేరు పొంది వుంటే ఆమెతో సంబంధం పెట్టుకున్న క్షత్రియ, లేక వైశ్య పురుషుడు శూద్రుడితో సమానంగా మరణ దండన అనుభవించవలసి వుంటుంది. వాడిని ఎండుగడ్డితో సజీవంగా దహనం చేయాలని మనుస్మృతి అంటుంది. (మరణ దండనను ఆదేశించి ఊరుకోకుండ, రకరకాల క్రూరమైన మరణశిక్షలను ఏకరువు పెట్టడం బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులు ప్రదర్శించే ఒక మానసిక వికారం.)

వివాహితులయినా అవివాహితులయినా, పరస్పర సమ్మతి లేకుండానయినా సమ్మతితోనయినా, లైంగిక సంపర్కం పెట్టుకున్నా లేక కేవలం సాన్నిహిత్యాన్ని కాంక్షించినా అది నేరమేనని భావించేటట్టయితే వివాహానికి ముందు ప్రేమించుకోవడం సహితం మనువు దృష్టిలో నేరం అనుకోవాలా? మగవాళ్ళ విషయంలో అది నేరమేనని మనువు అభిప్రాయం. ఎటొచ్చీ అగ్రకులాల పురుషులు (వివాహితులయినా కాకున్నా) క్రింది కులాల స్త్రీలతో సంబంధాన్ని కోరుకుంటే మట్టుకు పోనీలెమ్మంటాడు. ఇక్కడ అతను ఆమోదిస్తున్నది ప్రేమ అనే భావనను కాదు, కింది కులాల స్త్రీల శరీరాలపైన అగ్రకులాల మగవాళ్ళకుండే హక్కును. అంతే తప్ప వివాహానికి పూర్వం ఒక పురుషుడు ఒక స్త్రీని లైంగికంగా కాంక్షించడాన్ని మనువు ఆమోదించడు. పురుషుడి కులం తక్కువది, స్త్రీ కులం ఎక్కువది అయినట్టయితే మరణదండన; పురుషాంగం నరికి వేయడం మొదలయిన

శిక్షలుంటాయి. ఇద్దరిదీ ఒకే కులం అయినా, అతని కోరికకు ఆమె స్పందించినా ఆ ప్రేమ నేరమే. కొంచెం జుర్మానా చెల్లించవలసి వుంటుంది. ఆపై అతను ఆమె తండ్రికి కానుకలిచ్చి ఆమెను పెళ్ళిచేసుకోవచ్చు. కానీ ఇటువంటి సవర్ణీయుల ప్రేమ వ్యవహారంలో స్త్రీయే చొరవ తీసుకుంటే మట్టుకు మనువు ఆమోదిస్తాడు. వివాహానికి పూర్వం తన కులంలోని ఒక అవివాహితుడిని ఎంచుకొని ప్రేమించే హక్కు అమ్మాయిలకు మాత్రం మనువు ఇచ్చాడు. ఈ ఒక్క విషయంలో ఆ రాతి గుండె ఎందుకు కరిగిందో తెలీదు !

స్వలింగ సంపర్కాన్ని మనువు ఒక ప్రత్యేకమైన నేరంగా భావించాడని వేరే చెప్పనవసరం లేదు. అన్ని దేశాలలో అన్ని జాతులలో స్వలింగ సంపర్కం ఏదో ఒక మేరకు ఎప్పుడూ వుంది. అయినా దానిని నేరంగా, పాపకార్యంగా భావించడం అన్ని దేశాల సంప్రదాయక లైంగిక భావజాలంలో ఒక సామాన్య అంశం. మనువు స్త్రీలలో స్వలింగ సంపర్కానికే ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చాడు. బహుశా స్త్రీలు స్వలింగ లైంగిక సంతృప్తికి అలవాటు పడితే మగవాళ్ళ కంట్రోల్‌లో లేకుండా పోతారని భయపడ్డాడేమో ! మగవాళ్ళు స్వలింగ లైంగిక క్రియకు పాల్పడితే వారికి మనువు భౌతిక దండన విధించలేదు. తీవ్రమైన ప్రాయశ్చిత్తం మాత్రం చేసుకోవాలన్నాడు. కానీ స్త్రీలకు మట్టుకు భౌతిక దండన విధించాడు. అందులోనూ వివాహితులకూ అవివాహితులకూ తేడా చూశాడు. ఒక అవివాహిత స్త్రీ మరొక అవివాహిత స్త్రీతో లైంగిక సంబంధం పెట్టుకుంటే ఆమెకు 10 కొరడా దెబ్బలు వేసి 200 పణములు జుర్మానా వసూలు చేయాలన్నాడు. అదే ఒక వివాహిత స్త్రీ ఆ పనిచేస్తే వేళ్ళు తెగనరికి గుండు గొరిగి గాడిదమీద ఊరేగించాలన్నాడు. ఈ తేడా ఎందుకనేది మనువు వ్యాఖ్యాతలు వివరిస్తారు. స్వలింగ లైంగిక కాంక్ష వారి దృష్టిలో అసహజమయినది. సహజమైన పరలింగ సంపర్కానికి అవకాశం లేనివాళ్ళు స్వలింగ సంపర్కానికి ఆకర్షితులయితే కొంతవరకు క్షమించవచ్చు (అన్నం దొరకని వాళ్ళు ఆకలి తీర్చుకోవడానికి గడ్డి తింటే క్షమించినట్టు). కాబట్టి అవివాహితలు అటువంటి చర్యలకు పాల్పడితే తక్కువ శిక్షతో వదిలిపెట్టవచ్చు. కానీ వివాహిత అయివుండి తన లైంగిక కాంక్ష

తీర్చడానికి ఒక భర్త వున్న స్త్రీ స్వలింగ సంబంధానికి పూనుకుంటే అది క్షమించరాని నేరం అవుతుంది.

తోబుట్టువులు, సన్నిహిత రక్తసంబంధీకులు లైంగిక సంబంధం పెట్టుకోవడాన్ని అన్ని దేశాలలోనూ అన్ని మతాలలోనూ నిషిద్ధమే. ఈ రకమైన లైంగిక సంబంధాన్ని ఇంగ్లీషులో incest అంటారు. తెలుగులో సపిండ లైంగిక సంబంధం అనవచ్చునేమో. ఎందుకంటే సోదరీ సోదరుల లైంగిక సంబంధం, తల్లిదండ్రులూ పిల్లల లైంగిక సంబంధం ఇందులో ప్రధానమయినవి. ఆపైన ఏ రకమైన బాంధవ్యాన్ని ఈ నిషిద్ధ జాబితాలో చేరుస్తారనేది ఒక్కొక్క జాతిని బట్టి, దేశాన్ని బట్టి, మతాన్ని బట్టి వుంటుంది. ఉదాహరణకు మనుస్మృతి మేనరికాన్ని కూడ లైంగిక నిషేధాన్ని ఆకర్షించే సపిండ సంబంధాల సరసన చేర్చింది. కానీ మనుస్మృతిని శిరోధార్యంగా భావించే ద్రవిడ ప్రాంత బ్రాహ్మణులు సహితం మేనరికపు పెళ్ళిళ్ళు చేసుకున్నారు, చేసుకుంటున్నారు.

అయితే అన్ని సంస్కృతులకు సామాన్యమైన ఈ సపిండ లైంగిక నిషేధాన్ని బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులు వర్ణవ్యవస్థతో అనుసంధానం చేశారు. మనుస్మృతి ప్రకారం అన్నిటికంటే అభ్యంతరకరమైన సపిండ లైంగిక సంబంధం తల్లీకొడుకుల సంబంధం కాదు; తండ్రీ కూతుళ్ళ సంబంధం కూడా కాదు; గురుపత్నితో శిష్యుడు పెట్టుకొనే సంబంధం. గురుపత్నిని కాంక్షించడం, ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకోవడం (ఆమె సమ్మతితోనే అయినప్పటికీ) మనువు దృష్టిలో అన్ని రకాల లైంగిక నేరాలలోనికీ అతి తీవ్రమైన నేరం. ఈ నేరానికి మనువు తీవ్రమైన భౌతిక దండననూ అంతే తీవ్రమైన ప్రాయశ్చిత్తాన్నీ విధిస్తాడు. ఆయన సూచించే భౌతిక దండనలు మూడు. ఒకటి, వేడిగా కాల్చిన ఇనప మంచం మీద పడుకోబెట్టడం. రెండు, వేడిగా కాల్చిన ఇనుప స్త్రీ ఆకృతిని కౌగలించుకోవడం. మూడు, తన పురుషాంగాన్ని తానే తెగనరికి చేతిలో పట్టుకొని స్పృహ కోల్పోయేంత వరకు నైరుతి దిక్కుగా నడవడం.

రక్తసంబంధీకురాలు కాని గురుపత్నితో లైంగిక సంబంధం పెట్టుకోవడం ఇంత తీవ్రమైన నేరం ఎందుకు కావాలి? వేరే ఏదయినా లైంగిక నేరం (ఉదాహరణకు తల్లీ కొడుకుల లైంగిక సంబంధం) తీవ్రతను సూచించదలచుకున్నప్పుడు కూడా దానిని మనువు ఈ నేరంతో పోల్చి

'అటువంటిది' అంటాడు. దీనికి కారణాన్ని వర్ణవ్యవస్థ స్వభావంలో వెతకాలి. చతుర్వర్ణాలలో మొదటి మూడు వర్ణాలకు గురువు బ్రాహ్మణుడే అయివుంటాడు. శాస్త్రజ్ఞానం కలిగి వుండే అర్హత, ఆయా వర్ణాలకు ఉచితమైన జ్ఞానం అందించే అర్హత బ్రాహ్మణులకు మాత్రమే వుండేది. శాస్త్రజ్ఞానానికి సంబంధించి బ్రాహ్మణులకుండే ఈ గుత్తాధిపత్యం వర్ణ వ్యవస్థ సుస్థిరతకు అత్యవసరమైన అంశం. అయితే ఈ గుత్తాధిపత్యం సామాజిక ఆమోదం పొందాలంటే గురువు అయిన బ్రాహ్మణుని ప్రతిష్ఠ చెక్కుచెదరకుండా వుండాలి. ఆ ప్రతిష్ఠలో గురుపత్ని పాతివ్రత్యం అతి ముఖ్యమైన అంశం. అది దెబ్బతింటే గురువు ప్రతిష్ఠ దెబ్బ తింటుంది. గురువు ప్రతిష్ఠకు భరోసా లేకపోతే శాస్త్ర విద్య మీద బ్రాహ్మణులకుండే గుత్తాధిపత్యానికి పునాది పోతుంది. అందుచేత గురుపత్నితో శిష్యుడు లైంగిక సంబంధం పెట్టుకోవడం మహాపాపం. అది అన్ని రకాల లైంగిక నేరాలలోకి పెద్ద నేరం. సపిండ లైంగిక సంబంధాల జాబితాలో మొదటి స్థానంలో మనువు ఈ నేరాన్ని చేరుస్తాడు.

అయితే గురుపత్ని ఒకవేళ ముందే 'అపవిత్రురాలు' అయివుంటే ఇది పెద్ద నేరం కాదంటాడు. గురువుగారికి బ్రాహ్మణ స్త్రీలు, ఇతర సవర్ణ స్త్రీలే కాక ఒకవేళ ఒక అవర్ణ స్త్రీ కూడా భార్య అయివుంటే ఆ అవర్ణ స్త్రీతో శిష్యుడు లైంగిక సంబంధం పెట్టుకోవడం కూడా మనువు దృష్టిలో పెద్ద నేరం కాదు. ఆమెకెట్లాగూ 'పవిత్రత' అంటదు కదా ! కాబట్టి అపవిత్రత కూడా అంటదు. కాబట్టి ఆ మగవాడికి ప్రాయశ్చిత్తం చేస్తే సరిపోతుందంటాడు.

గురుపత్నితో కాక ఇతర సపిండ లైంగిక సంబంధాలకు మనువు విధించే శిక్ష కొంచెం తక్కువ తీవ్రమైనది. ఈ శిక్షలో భౌతిక దండన కంటే ప్రాయశ్చిత్తంపాలు ఎక్కువ. ఆ ప్రాయశ్చిత్తం కఠినమైనదే. ఉదాహరణకు చెట్టు బెరడును ధరించి గడ్డం, జుట్టు పెంచి ఒక సంవత్సరం అడవిలో ఒంటరిగా వ్రతం ఆచరించడం ఒక ప్రాయశ్చిత్తం. దీనిని ఆచరిస్తే వేరే శిక్ష వుండదు. ఆచరించడంలో విఫలం అయితే మట్టుకు రాజ్యాంగం యంత్రం రంగంలోకి దిగి భౌతిక శిక్షలు విధిస్తుంది. కాలిన ఇనుముతో స్త్రీ యోనిని పోలిన ముద్ర నుదుటి మీదవేసి ఆస్తి మొత్తం జప్తుచేసి సంఘ బహిష్కరణ చేయాలని మనువు అంటాడు.

ఇంత కఠోరమైన లైంగిక నియమాలు, నేరస్మృతి నిజంగా ఎప్పుడయినా అమలయ్యాయా అని పాఠకులకు సందేహం రావచ్చు. ఇంతగా ఏ సమాజాన్నయినా లైంగికంగా కట్టడి చేయడం బహుశా ఆచరణసాధ్యం కాని ఆలోచన. అయితే మొదట్లో చెప్పినట్టు, బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు ఆధునిక రాజ్యాంగ చట్టాల వంటివి కావు. ఆధునిక కాలంలో పీనల్‌కోడ్ అనేది రాజ్యాంగ యంత్రానికి శిరోధార్యం. దానిని అమలు చేయడం ఆధునిక రాజ్యాంగ యంత్రానికి వుండే ముఖ్యమైన కర్తవ్యాలలో ఒకటి. అలాగే మధ్యయుగాలలో కూడ ధర్మశాస్త్రాలలోని నియమాలను రాజులు తుచ తప్పకుండా అమలు చేయాలని, అమలు చేసిన వాడే ధర్మప్రభువు అని బ్రాహ్మణ శాస్త్రకారులు (ముఖ్యంగా మనుస్మృతి కర్త) భావించారు. అయితే రాజులందరూ ధర్మశాస్త్రాల నియమాలను ఆధునిక రాజ్యం తన శాసనాలను చూసే పద్ధతిలో చూడలేదు. తమ పరిపాలనకు తప్పనిసరి నియమాలుగా భావించలేదు. బ్రాహ్మణులను రంజింపజేసిన ధర్మపరిపాలకులూ వున్నారు. అందుకు భిన్నంగా కొంచెం ఉదారంగా పరిపాలించిన రాజులూ వున్నారు. బహుశా మనువు నేరస్మృతిని తన పీనల్‌కోడ్‌గా భావించి తుచ తప్పక అమలుచేసిన రాజు ఎవ్వడూ వుండి వుండడు. అంత కఠోరమైన పాలన మనువు వంటి శాడిస్టు ఊహలలో మాత్రమే సాధ్యం.

అయితే ఆ రోజులలో న్యాయ నిర్ణయం, ధర్మ నిర్ణయం కేవలం రాజ్యాంగయంత్రం చేతే జరగలేదు. సాంఘిక వ్యవస్థలో అనేక స్థాయిలలో జరిగింది. న్యాయనిర్ణయం దాకా పోనవసరం లేకుండ, సాంస్కృతిక నియంత్రణే మనుషుల ప్రవర్తనపైన (ఆనాడయినా ఈనాడయినా) ప్రత్యక్ష ప్రభావం వేస్తుంది. మనుషుల ప్రవర్తనను వ్యవస్థ గీసే లక్ష్మణరేఖ పరిధిలో అది వుంచుతుంది. ఆ నియంత్రణ విఫలమయినప్పుడు అధర్మం, నేరం, పాపం అనేవి ముందుకొస్తాయి. ఈ తీర్పు వివిధ స్థాయిలలో జరుగుతుంది. ప్రతి కుటుంబమూ ఒక న్యాయస్థానమే. ఆపైన కుల పెద్దల పంచాయితీలు, గ్రామ పెద్దల పంచాయితీలు, శాస్త్రాలు చదువుకున్న బ్రాహ్మణుల తీర్పులు, రాజాస్థానంలో జరిగే న్యాయనిర్ణయం వుంటాయి. ఈ రోజు కూడ అధికారిక న్యాయస్థానాలకు సమాంతరంగా అనేక సాంఘిక న్యాయస్థానాలున్నాయి. ఆ రోజులలో ఇవి మరీ ఎక్కువ. ఏ స్థాయిలో

జరిగే న్యాయ నిర్ణయమూ నూటికి నూరుపాళ్ళు మనువు నేరస్మృతిని అమలుచేసి ఉండకపోవచ్చు. అయితే నూటికి యాభైపాళ్ళు అమలు చేసినా అది కఠోరమైన సాంఘిక నీతే. అంతకంటే ముఖ్యం – అన్ని స్థాయిలలోనూ తప్పు ఒప్పు, నేరం అధర్మం అనే వాటికి సంబంధించిన విచక్షణను, నిర్వచనాన్ని , అవగాహనను మనునీతి బలంగా ప్రభావితం చేసింది. బహుశా సజీవంగా ఎండుగడ్డితో దహనం చేయడం వంటి శిక్షల కంటె ఈ అవగాహన, సాంస్కృతిక వివేచనే ముఖ్యమైనవి. సాంఘిక జీవితాన్ని ఇవి మనునీతికి అనుగుణంగా కట్టడి చేశాయి. ఈనాటికీ ఒక మేరకు చేస్తున్నాయి. కులం కట్టడికీ, లైంగిక నీతికీ సంబంధించి ఈనాటికీ కుల పంచాయితీలలోనూ, పెద్దమనుషుల తీర్మానాలలోనూ ఇచ్చే తీర్పులను పరిశీలిస్తే, పైన వివరించిన మనునీతి ఛాయలు బలంగా కనిపిస్తాయి. ఈ తీర్పులిచ్చే వాళ్ళెవరూ మనుధర్మశాస్త్రాన్ని చదివి వుండకపోవచ్చు. అసలు మనుస్మృతి అనేది ఒకటి వుందని వారికి తెలియకపోవచ్చు. కానీ ఆ ఆలోచనలు, అవి తలపెట్టిన సాంఘిక కట్టడి సామాజిక వ్యవస్థలో అంత బలంగా భాగం అయిపోయాయి.

అందుకే ప్రజాస్వామ్య జీవితాన్ని కాంక్షించేవారు ఈ రోజు కూడ వీటిని గురించి తెలుసుకోవలసిన అవసరం వుంది. సాంఘిక జీవితంలో మనునీతి అవశేషాలను క్షాళన చేయవలసిన అవసరం వుంది.

## II బ్రాహ్మణ ధర్మశాస్త్రాలలో రాజ్యాంగయంత్రం

ఏ సమాజంలోనయినా వ్యవస్థిత జీవితాన్నీ, దాని నిర్దిష్ట చట్రం అయిన ఆనాటి సాంఘిక ఆర్థిక వ్యవస్థనూ కాపాడడం రాజ్యాంగ యంత్రం నిర్వహించే ప్రధాన బాధ్యత. అందుకోసం రాజ్యం శాసనాలు చేస్తుంది. వాటిని బలప్రయోగంతో అమలు చేస్తుంది. ఇంకొకరకంగా చెప్పాలంటే సంఘ జీవితానికి సంబంధించిన ప్రమాణాలను ప్రకటించే అధికారం, వాటిని నిర్బంధంగా అమలుచేసే అధికారం  రాజ్యానికి వుంటాయి. వేరే ఎవ్వరికీ ఈ అధికారం వుండనే వుండదని కాదు. ఆధునిక రాజ్యానికున్న అధికార గుత్తాధిపత్యం మధ్య యుగాలలోనూ, ప్రాచీన కాలంలోనూ రాజ్యానికి లేదు. ఆనాడు సమాజంలో అధికార బాహుళ్యం వుండేది. కుటుంబంలో, గ్రామంలో, కులంలో, శ్రేణిలో,

తెగలో బహుళ అధికార కేంద్రాలుండేవి. ఆ అధికార కేంద్రాలకు కూడ ప్రామాణిక నియమాలను ప్రకటించే అధికారం, వాటిని నిర్బంధంగా అమలుచేసే అధికారం వుండేవి. వాటన్నిటిపైన ఒక తుది అధికార కేంద్రంగా రాజ్యం వుండేది. దీనినే అప్పటి సామాజిక తత్వవేత్తలు సిద్ధాంతీకరించారు. సంప్రదాయకంగా అమలవుతున్న సంఘ నియమాలనూ, వాటిపైన అజమాయిషీ చేసే పెద్దల అధికారాన్నీ రాజ్యం గౌరవించాలనేది బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు చెప్పే ముఖ్య విషయాలలో ఒకటి.

అయితే అన్ని దేశాలలోనూ కాలక్రమంలో బహుళ అధికార కేంద్రాలు క్షీణించి, రాజ్యమే ఏకైక అధికార కేంద్రం అయింది. ప్రామాణిక సంఘ జీవిత నియమాలను శాసనాల రూపంలో ప్రకటించి వాటిని బలప్రయోగంతో అమలుచేసే అధికారం రాజ్యానికే మిగిలింది. సమాజంలో వేరే ఆధిపత్య కేంద్రాలు లేనేలేవని కాదు. అవి బలప్రయోగానికి పాల్పడవనీ కాదు. ఉన్నాయనడానికి కుటుంబ వ్యవస్థ ప్రపంచవ్యాప్తమయిన ఒక ఉదాహరణ. పెట్టుబడిదారీ మార్కెట్ మరొక ఉదాహరణ. కులం మన దేశానికి సంబంధించిన ఇంకొక ఉదాహరణ. అయితే వాటి ఆధిపత్యం సాంస్కృతిక భావజాలం రూపంలోనూ సాంఘిక కట్టుబాట్ల రూపంలోనూ ఆర్థిక ఒత్తిడుల రూపంలోనూ అమలవుతుంది తప్ప వాటికి శాసనాలు చేసే అధికారం లేదు. ఆధునిక సమాజాలలో బలప్రయోగం పైన రాజ్యానికే గుత్తాధిపత్యం వుంది. రాజ్యం ఉపేక్షిస్తేనూ, ప్రత్యక్షంగా లేక పరోక్షంగా అనుమతిస్తేనూ మాత్రమే ఇతరులు చేయగలరు. ఈ ఉపేక్ష లేదా అనుమతికి సాంస్కృతిక సాధికారత వుంటుంది. అది ఆధిపత్య వర్గాలకు ఒకమేరకు లభ్యం అవుతూనే వుంటుంది. చట్టాలలోనూ చట్ట బాహ్యంగానూ లభ్యం అవుతుంది. అయితే ఆ ఆధిపత్యాలను పరిమితం చేసే బాధ్యత కూడ ఆధునిక రాజ్యాలపైన వుంటుంది. ఇది రాజ్యంపైన ప్రజాతంత్ర ఆకాంక్షలు పెట్టిన ఒత్తిడి ఫలితం.

సమాజంలో అధికార బాహుళ్యం క్షీణించి రాజ్యమే అధికార కేంద్రంగా మారడం ఒక చారిత్రక పరిణామం. దానికి దారితీసిన చారిత్రక పరిస్థితుల విశ్లేషణ ఇప్పటికి అప్రస్తుతం. అయితే వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకూ, వికాసానికీ ఈ బహుళ అధికార కేంద్రాలు ఆటంకంగా వున్నాయని గుర్తించి వాటి ప్రాబల్యాన్ని

తగ్గించడం కోసం రాజ్యం చేతిలోనే అధికారాన్నంతా కేంద్రీకరించి ఆ రాజ్యాధికారానికి కొన్ని ప్రామాణికమైన పరిమితులు పెట్టడం ఉచితం అనే ఆలోచన ఆ చారిత్రక క్రమంలో ముందుకొచ్చింది. ఆ పరిమితులే ఆధునిక రాజ్యాన్ని నియంత్రించే ప్రజాతంత్ర విలువలు. కాలక్రమంలో వివిధ ఉద్యమాల ఒత్తిడివల్ల, నిర్మాణాత్మక కృషివల్ల ఆ పరిమితులు మరింత పదును దేలాయి. ఈనాటి రాజ్యభావనకు వున్న పరిమితులు ఇవి :

1. రాజ్యం శాసనబద్ధమైన అధికారాన్ని మాత్రమే చలాయించాలి. చట్ట బాహ్యమైన అధికారం చెల్లదు.
2. ఆ శాసనాలు చట్టసభలు చేసినవయి వుండాలి. ఆ విధంగా అవి పరోక్షంగా ప్రజామోదం పొందినవి అయి వుండాలి.
3. చట్టసభలు చేసే శాసనాలు కూడా పౌరుల 'సహజ హక్కులకు' లేక 'ప్రాథమిక హక్కులకు' లోబడి వుండాలి.
4. చట్టాలను అమలు చేయడంలో నిష్పాక్షికంగా వ్యవహరించే అధికార యంత్రాంగం, చట్టాన్ని నిర్భయంగా అమలు చేయించే స్వతంత్ర న్యాయ వ్యవస్థ ఉండాలి.

రాజ్యానికి సంబంధించిన భావన ఇక్కడితో ఆగిపోలేదు. వ్యక్తికి చట్టం ఎంత స్వేచ్ఛ, స్వతంత్రం ఇచ్చినా వాటిని వాస్తవంలో అనుభవించడం సాధ్యం కావాలంటే కొంత కనీస ఆర్థిక స్తోమత, సాంఘిక స్థితిగతులు వుండాలి. చట్టం అనుమతించినా ఆర్థిక స్థితి దానికి అవకాశం ఇయ్యకపోవచ్చును. రెండూ అనుమతించినా సాంఘిక వ్యవస్థలోని కట్టుబాట్లు, నిర్బంధాలు అడ్డం రావచ్చును. వీటిని ప్రయత్నపూర్వకంగా తొలగించే ఒక పాజిటివ్ బాధ్యత కూడ పీడిత ప్రజల పోరాటాల నుండి పుట్టిన విలువలు, ఆకాంక్షల ఫలితంగా ఆధునిక కాలంలో రాజ్యానికి కట్టబెట్టబడింది. అంటే –

5. సమాజ నియమాలనూ, వ్యవస్థిత సంబంధాలనూ సంస్కరించి వ్యక్తుల మధ్య సమానత్వాన్నీ సమాన అవకాశాలనూ పెంచడం, ఆర్థికలేమిని తగ్గించి జీవన ప్రమాణాలు పెంచడం. అంటే రాజ్యానికి వుండే 'సంక్షేమ బాధ్యత'.

ఆధునిక సమాజంలో వ్యవస్థిత జీవితం పెట్టుబడిదారీ చట్రంలో సాగుతుంది. దానితోపాటు తత్పూర్వ కాలం నుండి సంక్రమించిన ఇతర సాంఘిక అసమాన సంబంధాలు వుంటాయి. రాజ్యం ఈ చట్రంలో వున్న వ్యవస్థిత జీవితాన్ని పదిలంగా కాపాడేటప్పుడు పైన పేర్కొన్న ప్రామాణిక నియమాలకు లోబడి వ్యవహరించాలనేది ఆధునిక రాజ్య భావన. ఈ నియమాలను మరింత సరళీకృతం చేసి, మార్పుకు రాజ్యం నుండి వచ్చే అవరోధాలను బలహీనపరిచే కృషి ఒక ముఖ్య ప్రజాతంత్ర కృషి. రాజ్యానికి సంబంధించినంత వరకు ఇది పౌరహక్కుల ఉద్యమం చేపట్టే ప్రధాన కృషి. ఆధునిక జీవితంలోని కొత్త, పాత అసమానతలను అధిగమించి సమానత్వంవైపు పురోగమించడానికి ఈ కృషి చాలా అవసరం.

ఈనాటి ప్రజాతంత్ర భావనకు చెందిన పై ప్రమాణాల వెలుగులో బ్రాహ్మణ ధర్మ శాస్త్రాలలోని రాజ్య వ్యవస్థను పరిశీలిస్తే అది దాదాపు అన్ని విషయాలలోనూ అప్రజాస్వామికంగా కనిపిస్తుందంటే ఎవరూ పెద్దగా ఆశ్చర్యపోకపోవచ్చు. అది ఏ నిర్దిష్ట రూపాలలో అప్రజాస్వామికం అనేదే ఆసక్తి కలిగించగల విషయం. సంక్షేమ భావన ఆనాడు ఎట్లాగూ లేదు. లేకపోగా బ్రాహ్మణీయ దృక్పథంలో అది 'ధర్మ విరుద్ధం' కాబట్టి అది వుండాలని ఎవరయినా అంటే వారు శిక్షార్హులు అవుతారు. ఇతర విషయాలలో కూడ బ్రాహ్మణీయ రాజ్య వ్యవస్థలో ప్రజాతంత్ర లక్షణాలు మృగ్యం. ఆ రాజ్యం శాసనాలను అనుసరించి పరిపాలించదు. అది ధర్మాన్ని అనుసరించి పరిపాలించాలి. ఆ ధర్మం ప్రజలు రూపొందించినది కాదు. అది బ్రాహ్మణులు కాంక్షించినది, బ్రాహ్మణులు రూపొందించినది. పోనీ ఆ ధర్మం సమాజంలోని మనుషుల సహజ హక్కులను గౌరవించే శాసనమా అంటే కాదు. అది సమానత్వాన్నీ, సమాన ప్రతిపత్తినీ ఏ రూపంలోనూ ఒప్పుకోని అసమ ధర్మం. పోనీ దానిని అమలుచేసే అధికార గణం ఆ వర్ణధర్మం పరిధిలోనయినా నిష్పాక్షికంగా వ్యవహరిస్తారా అంటే దానికి భరోసా లేదు. ఎందుకంటే వాళ్ళు 'ఉన్నత వంశాలకు' (అంటే అగ్రవర్ణాలకు అని వేరే చెప్పనవసరం లేదు) చెందినవారే అయి వుండాలి. పైగా వారిని నియమించేది, తీసేసేది రాజుగారి ఇష్టానుసారమే కాబట్టి ఆ పరిధిలో కూడ వారు స్వతంత్రంగా వ్యవహరిస్తారన్న నమ్మకంలేదు. పోనీ న్యాయవ్యవస్థయినా నిష్పాక్షికంగా న్యాయం చేస్తుందా అంటే అది చేసే

న్యాయమే ధర్మశాస్త్రాల న్యాయం. అంటే వర్ణ ధర్మ న్యాయం. ఆ పరిధిలో కూడ అది రాజుగారి ఇష్టాలకు అతీతంగా నడుచుకోజాలదు. ఎందుకంటే రాజదర్బారే దేశంలోని అత్యున్నత న్యాయస్థానం. రాజే దేశానికి చీఫ్ జస్టిస్.

ఇక్కడ మనం రెండు విషయాలను పరిశీలిస్తున్నాము. ఒకటి రాజ్యం నిర్వహించే పాలనా వ్యవహారాలలోనూ, న్యాయ వ్యవస్థలోనూ 'న్యాయం' ఎంత వుంది అని. అంటే అది సమాన హక్కులనూ, సమాన ప్రతిపత్తినీ ఏ మేరకు గుర్తించిందనే ప్రశ్న. రెండవది, తన వ్యవహారాల నిర్వహణకు రాజ్యం (అందులో భాగంగా న్యాయవ్యవస్థ) అనుసరించే పద్ధతులలోనూ, నిర్మాణంలోనూ నిష్పాక్షికతకు తావు ఎంత వుందనే ప్రశ్న. ప్రజాస్వామ్య భావనకు ఇవి రెండూ ముఖ్యమే. బ్రాహ్మణీయ సంస్కృతిలో మొదటి అంశం వర్ణధర్మ ప్రాపంచిక దృక్పథం చేత నిర్ణయించబడింది. రాజు ధర్మవర్తనుడు కావాలి. ధర్మాన్ని నిలబెట్టాలి. అంటే సకల పరిపాలనా వ్యవహారాలు, న్యాయవ్యవస్థ ప్రమాణాలు చాతుర్వర్ణ్యాన్ని అనుసరించి వుండాలి. సమానత్వం అనే భావనకు ఈ ధర్మంలో చోటు లేదు. అయితే దీనికి ప్రతిఘటన భారతీయ సమాజంలో తొలినాటి నుండి వుంది కాబట్టి వర్ణ ధర్మ కాఠిన్యాన్ని సవరించే అంశాలు కూడ అందులో అక్కడక్కడ కనిపిస్తాయి. ఇంక రాజ్య వ్యవహారాల నిర్వహణకూ, దానికి సంబంధించిన నిర్మాణాలకూ, పద్ధతులకూ వస్తే అందులో కేంద్రీకృత రాచరిక నియంతృత్వ లక్షణాలు ప్రధానం కాగా ఆ లక్షణాలను కొంతమేరకు పరిమితంచేసే నాగరికతా విలువలు కూడ కనిపిస్తాయి. అయితే ఇవి ఎక్కువభాగం రాజులు తమకు బుద్ధి పుడితే ఆచరించగల నైతిక ప్రమాణాల రూపంలో వున్నాయే తప్ప ఆ నైతిక ప్రమాణాలకు వ్యవస్థిత రూపం ఇచ్చే నిర్మాణసూత్రాల రూపంలో వున్నట్టు కనిపించదు. అంటే ఈ నాగరికతా విలువలు రాజులు పాటించవలసిన ఆదర్శాల రూపంలో నిర్వచించబడ్డాయే తప్ప రాజ్య వ్యవహారశైలిలో అనుల్లంఘనీయమైన నియమాలుగా వ్యవస్థీకరించబడలేదు. రాజు ఎల్లప్పుడూ నిష్పాక్షికంగా వ్యవహరించాలి అని చెప్పడం వేరు. రాజ్య వ్యవహారాల నిర్వహణ నిష్పాక్షికంగా వుండడం కోసం అనుల్లంఘనీయమయిన పద్ధతినీ, సూత్రాలనూ ప్రతిపాదించి అవి ఉల్లంఘించబడితే ఆ చర్య చెల్లుబాటు కాదనీ, దానికి ఎవరూ బద్ధులు

కారనీ శాసనం చేయడం వేరు. బ్రాహ్మణ ధర్మశాస్త్రాలలో మొదటి రూపంలో మాత్రమే మంచి అనేది ఏ మేరకయినా కనిపిస్తుంది.

మొత్తానికి ఈ ధర్మశాస్త్ర సాహిత్యంలోని రాజ్యవ్యవస్థలో ప్రజాతంత్ర లక్షణాలు చాలా స్వల్పంగా కనిపిస్తాయి. సమకాలీన (క్రీ.శ. తొలి శతాబ్దాల) పాశ్చాత్య, ప్రాచ్య రాజ్యాల పరిస్థితి ఇంతకంటే భిన్నంగా లేదు కాని భారత్ సమాజానికి గల ప్రత్యేక లక్షణమైన బ్రాహ్మణీయ వర్ణధర్మం తనకు స్వంతమైన అమానుషత్వాన్ని ఇక్కడి రాజ్యవ్యవస్థకు అంటించింది. ఆ రాజ్యవ్యవస్థ గురించి ఈరోజు తెలుసుకోవలసిన అవసరం ఏముందంటారేమో ! చరిత్ర అధ్యయనానికే కాక ఈనాటి ప్రజాతంత్ర కృషికి కూడ ఆ అవసరం వుంది. ఎందుకంటే రాజ్యవ్యవస్థ గురించి మన సమాజంలో ప్రచారంలో వున్న అభిప్రాయాలలో అలనాటి ధర్మశాస్త్రాల ప్రాపంచిక దృక్పథం అవ్యక్తంగానే అయినా గట్టిగా వుంది. మను ధర్మశాస్త్రం చదవని వాళ్ళు కూడా చాలామంది మనువులాగే మాట్లాడతారు. సాంస్కృతిక సంప్రదాయాల బలం అటువంటిది. సమకాలీన ప్రజాతంత్ర కృషి మనువునూ, యాజ్ఞవల్క్యుడినీ, కౌటిల్యుడినీ అడుగడుగునా ఎదుర్కుంటూనే వుంటుంది.

బ్రాహ్మణ ధర్మశాస్త్రాలలో రాజ్యాంగ యంత్రాంగానికి సంబంధించిన ఈ ఉపోద్ఘాతానికి ముగింపుగా ఇంకొక్క విషయం చెప్పి అసలు విషయానికి పోదాము. బ్రాహ్మణ ధార్మిక సాహిత్యాన్ని స్థూలంగా రెండుగా విభజించవచ్చును. మొదటివి క్రీస్తుపూర్వం రాసిన ధర్మసూత్రాలు. ఇవి వర్ణవ్యవస్థ సమాజంపైన ఆధిపత్యం నెలకొల్పుతున్న తొలిదశకు చెందినవి. ఇవి ఆపస్తంబ, బౌధాయన, గౌతమ, వశిష్ఠ ధర్మ సూత్రాలు. వీటిని క్లుప్తంగా 'సూత్రాలు' లేక 'సూత్ర సాహిత్యం' అంటారు. ఇవి రాసిన కాలంలో బ్రాహ్మణ్యం సామాజిక ఆధిపత్యం కోసం బౌద్ధంతో ఇంకా పోటీపడుతూ వుంది. అందువల్లనేనేమో ఈ సూత్ర సాహిత్యంలో వర్ణ మౌఢ్యం మరీ తీవ్రంగా కనిపించదు. రెండవ దశకు చెందిన ధర్మశాస్త్రాలు ఆ తరువాత రాయబడ్డాయి. కొన్ని క్రీస్తుపూర్వానికే చెంది వుండవచ్చునుకానీ ఎక్కువగా క్రీస్తు తరువాత కాలానికి చెందినవి. వీటి రచనా కాలంలో బ్రాహ్మణ్యం (కనీసం ఉత్తర భారతదేశంలో) తన ఆధిపత్యాన్ని గట్టిగా నెలకొల్పి సమాజాన్ని శాసించే స్థాయికి చేరింది. అందువల్ల ఈ ధర్మశాస్త్రాలలో వర్ణధర్మం పరిణతి చెందిన

సమగ్ర రూపంలో కనిపిస్తుంది. వీటిని 'స్మృతులు' అంటారు. ఇవి మను, యాజ్ఞవల్క్య, కాత్యాయన, నారద, విష్ణు, పరాశర స్మృతులు.

ఇవికాక బ్రాహ్మణీయ రాజనీతిని వివరించే మరి రెండు రచనలున్నాయి. ఒకటి కౌటిల్యుడి అర్థశాస్త్రం, రెండు మహాభారతంలోని శాంతిపర్వం. అర్థశాస్త్రం పైన వివరించిన రెండు దశలలో తొలిదశకు చెందినది. శాంతిపర్వం పరిణతి చెందిన బ్రాహ్మణీయ వ్యవస్థకు – రెండవ దశకు – ప్రతినిధి.

**1. రాజ్యం, రాజు, రాచరికం**

సమాజంలో ఏ వ్యవస్థ అయినా నిలవాలంటే దానికి ప్రజల దృష్టిలో కొంతయినా సాధికారత వుండాలి. దాని ఉనికికి సామాజిక ఆమోదం కొంతయినా వుండాలి. ఆ వ్యవస్థ సామాజిక జీవితానికి అవసరమైన ఒక ప్రయోజనాన్ని ఒనగూరుస్తుందన్న నమ్మకం సాధికారతకు ప్రాతిపదిక కాగలదు. ఈ నమ్మకం ఎల్లప్పుడూ ఒక భ్రమే కానవసరం లేదు. అది ఒక్కొక్కసారి హేతుబద్ధమైన నమ్మకం కావచ్చు. ఒక్కొక్కసారి ఆధిపత్య భావజాలం ప్రభావం కావచ్చు. తరచుగా ఇవి రెండూ కలిసే వుంటాయి. అవసరం ఒక మేరకు ఉంటే భావజాలం దానిని పెంచి చూపిస్తుంది. ఉదాహరణకు ప్రశాంతమయిన జీవితానికి భద్రత అవసరం. అయితే ఆ ప్రశాంతత చాటున అన్యాయం వుందని ఉద్యమిస్తే అది భద్రతకు భంగకరం కాబట్టి దానిని న్యాయం కోసం జరిగే ఆందోళనగా కాక 'అభద్రత'గా అర్థం చేసుకొని తిరస్కరించడం భద్రతను ఒక అవసరం స్థాయి నుండి భావజాలం స్థాయికి తీసుకొనిపోవడం అవుతుంది.

ఒక వ్యవస్థ తమకు ప్రయోజనకారి అనే విశ్వాసాన్ని సహేతుకంగానో, అహేతుకంగానో – ప్రజలలో కల్గించడం సాధ్యం కాకపోతే ఆ వ్యవస్థకు సాధికారత బయటి నుండి తెచ్చుకోవలసి వుంటుంది. రాజు దేవుడనీ, రాజ్యం దైవదత్తమైన అధికారమనీ, రాచరికం దివ్య లక్షణమనీ నమ్మింపజూసే ఆలోచనలు రాజ్యాంగ యంత్రానికి ఏ లౌకిక ప్రయోజనంతోనూ నిమిత్తం లేకుండ సాధికారతనూ, ప్రజామోదాన్నీ కల్పించే సాధనాలు. అన్ని సమాజాలలోనూ ప్రాచీన, మధ్య యుగాలలో ఈ ఆలోచన ఏదో ఒక రూపంలో ఉంది. బ్రాహ్మణీయ ధార్మిక సాహిత్యంలో ఈ ఆలోచన ఏ మేరకు వుందనేది పరిశోధకులలో వివాదాస్పద

విషయంగా వుంది. తొలినాటి సూత్ర సాహిత్యంలోనూ, కౌటిల్యుడి అర్థ శాస్త్రంలోనూ రాజుకూ, రాచరికానికీ దైవత్వం ఆపాదించే ఆలోచనలు లేవని పరిశోధకులు అంటారు. అప్పటికింకా బౌద్ధం ప్రభావం బలంగా వుండడం దీనికి కారణం కావచ్చునంటారు. ఆనాడు వర్తకం, వ్యవసాయం విస్తరిస్తూ సంపద పెరుగుతూ వున్న కారణంగా రాజ్యానికి లౌకిక ప్రయోజనం చూపించడం సాధ్యమయిందనేది ఇంకొక వాదన. కానీ మలినాటి స్మృతులలోనూ, మహాభారత శాంతిపర్వంలోనూ రాజుకు దైవత్వాన్ని అంటగట్టే సూత్రీకరణలు పుష్కలంగా వున్నాయి. వీటిని కేవలం అలంకారిక పదప్రయోగంగా అర్థం చేసుకోవాలనే పరిశోధకులు లేకపోలేదు కానీ ఒక పద్ధతి ప్రకారం ప్రతీ స్మృతికారుడూ ఆ రకమైన సూత్రీకరణలు చేసేటప్పుడు దానిని కేవలం అలంకారికంగా అర్థం చేసుకోవడం కష్టం. అది అప్పటి బ్రాహ్మణ ప్రాపంచిక దృక్పథంలో భాగమనే అనుకోవలసి వుంటుంది.

రాజు తన వివిధ కర్తవ్యాల నిర్వహణ నిమిత్తం ఇంద్రుడు, వాయువు, యముడు, సూర్యుడు, అగ్ని, వరుణుడు, చంద్రుడు, కుబేరుడు ఆదిగా గల దేవుళ్ళ ప్రతిరూపమయి వ్యవహరిస్తాడని మనువు అంటాడు. నారద స్మృతికారుడు ఆ లిస్టును కొంచెం కుదించి రాజుకు అగ్ని, ఇంద్రుడు, సోముడు, యముడు, కుబేరుడు అనే అయిదుగురు దేవుళ్ళ గుణాలు వున్నాయంటాడు. ఇంద్రుడే భువికి దిగివచ్చి రాజు రూపంలో ప్రజలకు దర్శనం ఇస్తాడని కాత్యాయనుడు అంటాడు. ఇంద్రుడు రాజు రూపంలో సింహాసనం అధిష్టిస్తాడని మహాభారత శాంతిపర్వం కూడ అంటుంది.

దేవుడంటే వున్న 'భయభక్తులను' రాజుపట్ల కలిగించడం ద్వారా రాజ్యాధికారానికి సాధికారత (పరిపాలించే అర్హత, విశ్వసనీయత, ఆమోదం, ప్రజల విశ్వాసాన్ని డిమాండ్ చేసే హక్కు) కలిగించడం ఈరకమైన సూత్రీకరణల లక్ష్యం. ఇది భ్రమలు పెట్టి, భయపెట్టి పాలించే గుణం. 'రాజువైపు చూడడం కష్టం కాబట్టి రాజు సూర్యుని వంటివాడు' అని అగ్ని పురాణం అంటుంది. నిజానికి రాజువైపు చూడడం కష్టమేమీ కాదు – ఎవరూ భయపెట్టకపోతే. 'రాజు సూర్యుని వంటివాడు' అనడంలో ఉద్దేశ్యం – రాజువైపు కన్నెత్తి చూసేవు జాగ్రత్త అని

హెచ్చరించడం. ఇంక రాజును ఎదిరించే ప్రసక్తి ఎక్కడుంటుంది? రాజ్యాధికారాన్ని ధిక్కరించడం సంగతి అటుంచుదాం. అది మనుషులు చలాయించే అధికారమనీ దాని మంచిచెడుల గురించి మనుషులు వివేచించగలరనీ అనుకోవడానికి సహితం ఇక్కడ చోటు లేదు.

రాజ్యాంగ యంత్రానికి సాధికారత కల్గించడానికి రాజుకు దైవత్వం ఆపాదించవలసి వచ్చిందంటే, రాజ్యాధికారం సమాజ శ్రేయస్సు కోసం అవసరం అనే ఆలోచన సరిపోలేదనుకోవాలి. ఆ శ్రేయస్సులో ఎప్పుడయినా నిజమైన శ్రేయస్సుతోబాటు సామాజిక శ్రేయస్సుగా చలామణి అయ్యే ఆధిపత్య వర్గాల ప్రయోజనాలు కూడ వుంటాయి. వాటిని సమాజ శ్రేయస్సుగా చూపించడానికి దేవుడు, ధర్మం అనే భావనలు అవసరం అవుతాయి. అయితే అది కూడ చాలకపోతే రాజే దేవుడు కాబట్టి ఏ శ్రేయస్సుతోనూ నిమిత్తం లేకుండ రాజాజ్ఞను శిరసావహించాలి అనవలసి వస్తుంది. ఇది నియంతృత్వ భావజాలానికి పరాకాష్ఠ. రాజు ప్రధానంగా చేయవలసిన పని దండ ప్రయోగం ద్వారా వర్ణవ్యవస్థను కాపాడడం అనే మనువు అభిప్రాయాన్ని దీనితోపాటు లెక్కలోకి తీసుకుంటే 'స్మృతులు' రాసేనాటికి వర్ణవ్యవస్థే సామాజిక జీవితాన్ని శాసించే స్థితి వచ్చిందనీ, దానికి సామాజిక ప్రయోజనం ఏమీ లేదు కాబట్టి దానిని బలప్రయోగంతో నిర్బంధంగా అమలుచేసే రాజును దేవుడితో సమానంచేసి చూపించడం తప్ప సాధికారతకు వేరే మార్గం లేకపోయిందని అర్థం చేసుకోవచ్చును. ఆనాటి నుండి ప్రభువులను ప్రశ్నించడం దేవుడిని ధిక్కరించడంతో సమానం అనే అప్రజాస్వామిక సంస్కృతి భారతదేశంలో బలంగా నిలిచిపోయింది.

రాజు దేవుడేననే నమ్మకం ప్రజలలో బలంగా కలిగించడానికే కాబోలు బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులు రాజు ధగద్ధగాయమానంగా అలంకరించుకోవాలని అన్నారు. విష్ణు, కాత్యాయన స్మృతులు మాత్రమేగాక మహాభారతంలోని శాంతిపర్వం కూడ రాజు వస్త్రధారణ దివ్యంగా వుండాలంటుంది.

రాజులేని రోజులలో సమాజంలో అరాచకం తాండవించేదనీ, అరాచకం వల్ల భీతిల్లిన ప్రజలకు ధైర్యం కలిగించడానికి దేవుడు రాజును సృష్టించి పంపించాడనీ మనువు అంటాడు. 'మీ భద్రత కోసం దేవుడు రాజును పంపిస్తే

మీరే ధిక్కరిస్తారా' అని ప్రశ్నించడానికిది పనికొస్తుంది. ధిక్కరించడం హక్కు కాకపోగా విశ్వాస ఘాతుకత్వం అవుతుంది. పైగా దేవుడిపట్ల విశ్వాస ఘాతుకత్వం! అంతకంటే పాపం వేరే ఏముంటుంది?

ధర్మం రాజు రూపంలో భూమిపైన తిరుగుతుందనీ దానికి వెయ్యి కళ్ళుంటాయనీ నారదస్మృతి అంటుంది. నమ్మేవాళ్ళను ఇది చాలా భయపెట్టగల ఆలోచన. వర్ణధర్మం కట్టుబాట్లను అతిక్రమించే వాళ్ళను ఒక కంట కనిపెట్టడానికి ఈ వెయ్యికళ్ళ సిఐడి సంచరిస్తుంటాడనే ఆలోచన చాలా బెదరగొట్టగలదు. చేతకాని మొగుడినయినా భార్య ఆరాధించవలసిందేనన్నట్టు చేతకాని రాజును సహితం ప్రజలు ఆరాధించవలసిందేనని కూడ నారదుడు అంటాడు. రాజాజ్ఞను ధిక్కరించే వాళ్ళు బ్రతకలేరని అంటాడు. నిప్పు జోలికిపోతే నీ కుటుంబం మొత్తాన్ని దహించి వేస్తాడు జాగ్రత్త అని మనువు దాపరికం లేకుండా బెదిరిస్తాడు.

ఇంత సంపూర్ణంగా దైవత్వం ఆపాదించబడ్డ ఈ రాజుగారి కర్తవ్యాలేమిటి? బ్రాహ్మణ ధర్మశాస్త్రాల ప్రకారం రాజ్యాంగ యంత్రం నిర్వహించవలసిన కర్తవ్యం ఏమిటి? స్మృతులు ఏకరువు పెట్టిన కర్తవ్యాలలో కొన్ని ఈ రోజు కూడ రాజ్యం కర్తవ్యాలుగానే భావించబడుతున్నాయి. అవి – రాజ్యం సరిహద్దులనూ సార్వభౌమత్వాన్నీ పొరుగు రాజ్యాల దాడుల నుండి కాపాడాలి. రాజ్యం లోపల జరిగే తిరుగుబాట్ల నుండి కూడ రాజ్యాన్ని కాపాడాలి. రాజ్యం లోపల శాంతిభద్రతలు నెలకొల్పాలి. అయితే తిరుగుబాట్లకూ అశాంతికీ అభద్రతకూ ఆనాడున్న నిర్వచనం చాలా కఠినమైనది. అందులో అభిప్రాయ స్వేచ్ఛకు, అసమ్మతి హక్కుకు రవ్వంత కూడ చోటులేదు. 'దుర్బుద్ధి గల వాళ్ళను, అసమ్మతి రేకెత్తించే వారిని, హింసకు పాల్పడేవారిని, రాజుపట్ల శత్రుభావం గల వాళ్ళను' రాజ్యం నుండి బహిష్కరించమని బృహస్పతి స్మృతి అంటుంది. రాజద్రోహం (సెడిషన్) అనే నేరం ఈనాటి నేరస్మృతిలో కూడ ఉంది కానీ దాని నిర్వచనం అభిప్రాయ స్వేచ్ఛ అనే ప్రాథమిక హక్కుకు లోబడి వుండక తప్పదు. బృహస్పతి స్మృతికి అటువంటి అడ్డంకులేవీ లేవు.

తిరుగుబాట్లనే కాక సాధారణ నేరాలను కూడ రాజ్యం అరికట్టాలి. దొంగల నుండి, మోసగాళ్ళ నుండి, హింస చేసేవాళ్ళ నుండి, లంచగొండ్ల నుండి, జూదరుల

నుండి, అక్రమ వర్తనులయిన వ్యక్తుల నుండి ప్రజలను రాజు కాపాడాలని ధర్మశాస్త్రాలు చెప్తాయి. ఇది ఈనాడు కూడ రాజ్యానికి ఉండే బాధ్యతే. ఈ బాధ్యత సహేతుకమైనదే కానీ ఇది అనేక సందర్భాలలో పేదలకు, నిరుద్యోగులకు, నిరాశ్రయులకు వ్యతిరేకంగా పని చేస్తుందనేది మనకు అనుభవపూర్వకంగా తెలుసు. అయితే ఈనాడు లేనిదీ ఆనాడు వున్నదీ ఏమిటంటే ఈ నేరాల నిర్వచనంలోనూ శిక్షల పరిమాణంలోనూ అడుగడుగునా కులం ప్రభావం వుండడం. మనువు ఇచ్చిన నేరాల నిర్వచనాన్నీ శిక్షల పరిమాణాన్నీ ఇదివరకే చూశాము. నేరం చేసిన వ్యక్తి కులాన్నిబట్టి, నేరానికి గురి అయిన వ్యక్తి కులాన్ని బట్టి నేరం స్వభావమే మారిపోతుంది. శిక్ష సైతం మారిపోతుంది.

అయితే ఇంత అసహ్యకరమైన వర్ణవివక్ష సరసనే కొన్ని మంచి ఆలోచనలు కనిపిస్తాయి. తమ వృత్తిలో అక్రమంగా ప్రవర్తించే వైద్యుల నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని మనువు అంటాడు. కరణాల నుండి, ఇతర రెవెన్యూ అధికారుల నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని యాజ్ఞవల్క్యుడు అంటాడు. వ్యాపారంలోనూ వర్తకంలోనూ మోసాన్నీ కల్తీనీ మను, విష్ణు, యాజ్ఞవల్క్య స్మృతులు నేరంగా గుర్తించాయి. ఒక్కొక్క రకమైన మోసానికీ కల్తీకీ ఎంతెంత జుర్మానా వేయాలో నిర్దేశించాయి. వినియోగ వస్తువుల ధరలనూ వర్తక లాభాలనూ నియంత్రించే కర్తవ్యం రాజ్యానికి ఉందని యాజ్ఞవల్క్యుడు అంటాడు. ఇది వైశ్యులపట్ల ఆ బ్రాహ్మణుడి ఈర్ష్యే కావచ్చుకానీ ప్రజలకు ఉపయోగపడే ఆలోచనే !

వ్యక్తుల స్వంత ఆస్తిని కాపాడే బాధ్యత కూడ ఈనాడున్నట్టే ఆనాటి రాజ్యానికి ఉండింది. దొంగిలించగల చరాస్తిని దొంగల బారి నుండి కాపాడడమేకాక, స్థిరాస్తిని దురాక్రమణదారుల బారినుండి కాపాడే బాధ్యత కూడ ధర్మశాస్త్రాలు రాజుపైన పెట్టాయి. ఎటొచ్చీ బ్రాహ్మణులకు మాత్రం ఇతరుల ఆస్తులను తమ అవసరాలకోసం వినియోగించుకునే హక్కు వుంటుంది. మైనర్లు తమ ఆస్తులను తాము కాపాడుకోలేరు కాబట్టి వారికి వయసు వచ్చేదాకా వారి ఆస్తులను రాజు కాపాడాలని – అంటే ట్రస్టీగా వ్యవహరించాలని – స్మృతికర్తలన్నారు. ఇది బాగానే ఉంది. స్త్రీలకు తమ వ్యవహారాలు చూసుకునే స్వతంత్రం, అవకాశం వుండవు కాబట్టి వారి ఆస్తులకు రాజు సంరక్షకుడిగా వ్యవహరించాలని మనువు అంటాడు.

స్త్రీల స్వాతంత్ర్యాన్ని ఒప్పుకోవడానికి ఎంతమాత్రం ఇష్టపడని ఆ 'రుషే' వాళ్ళకు ఈ రాయితీ ఇచ్చాడు. అయితే అక్కడ కూడ తన బుద్ధి చూపించుకున్నాడు. ఆ స్త్రీ 'శీలవతి' అయితేనే రాజు ఆమె ఆస్తిని సంరక్షించాలంటాడు. కాకపోయినట్టయితే రాజుకు ఆ బాధ్యత లేదు. ఆమెకు చేతనయితే ఆమే కాపాడుకోవాలి. లేకపోతే ఎవడయినా ఆమె ఆస్తిని కాజేయవచ్చు. రాజ్యం ఆ తరువాత వాడిని శిక్షిస్తుందేమో కానీ 'శీలవతి' అయిన స్త్రీ విషయంలో ఉన్నట్టు ఆమె ఆస్తికి ట్రస్టీగా వ్యవహరించే బాధ్యత రాజుకు లేదు. లైంగిక నియమాలను అతిక్రమిస్తే నీ ఆస్తికి భరోసా వుండదు సుమా అని మనువు స్త్రీలను బెదిరించ దలచుకున్నాడు.

రాజ్యాంగ యంత్రం మనుషుల ప్రాణాలనే కాక పశువుల ప్రాణాలను, పచ్చటి ప్రకృతిని కూడ కాపాడాలని స్మృతులు అంటాయి. వ్యవసాయానికీ, పాడికీ, రవాణాకూ ఉపయోగపడే ఆవు, ఎద్దు, ఒంటె, గుర్రం, ఏనుగు మొదలయిన జంతువులను చంపడం నేరమనీ ఆ నేరానికి పాల్పడితే ఒక కాలుగానీ చేయిగానీ తీసేయాలనీ విష్ణుస్మృతి అంటుంది. ఈ జంతువులను వేదకాలంలో క్రతువులలో బలియిచ్చిన బ్రాహ్మణులు స్మృతుల కాలానికి ఇంతగా మారారు. పశుపోషక సమాజం వ్యవసాయక సమాజంగా మారడం దీనికిగల ఆర్థిక నేపథ్యం కాగా, తాత్వికంగానూ, నైతికంగానూ ఇది బౌద్ధమత ప్రభావం వల్ల వచ్చిన మార్పని భావించవచ్చును.

అంతేకాక ఫలం ఇచ్చే చెట్లనూ, పూలుకాసే మొక్కలనూ తీగలనూ నరికితే జుర్మానా వేయాలని విష్ణుస్మృతి అంటుంది. కోతకొచ్చిన పంటను ధ్వంసం చేస్తే జుర్మానా వేయాలని మనువు అంటాడు. బ్రాహ్మణులు మాత్రం పూజాపునస్కారాలకు అవసరం అయిన ఫలపుష్పాలు (ఎవరి తోటలనుండయినా) ఫ్రీగా తీసుకోవచ్చును. పూజాపునస్కారాల కోసమే కాదు, ఆకలిగొన్న బ్రాహ్మణుడు చేలలో కంకులు కోసుకొని తినవచ్చుననీ, ఎవరికీ చెందని ఏ వస్తువునయినా బ్రాహ్మణుడు స్వంతం చేసుకోవచ్చుననీ స్మృతులకంటే చాలా పూర్వం ఆపస్తంబ ధర్మసూత్రమే చెప్పింది. ఇదంతా ఒకెత్తయితే వర్ణ వ్యవస్థను పదిలంగా కాపాడడం బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు రాజ్యాంగ యంత్రంపైన పెట్టిన ముఖ్య కర్తవ్యం. వర్ణ సాంకర్యం జరగకుండ

చూడడం రాజు ప్రధాన విధి అని మనువు అంటాడు. అవసరమైతే ఆ పని దండప్రయోగంతో చేయాలి. చతుర్వర్ణాలూ తమ తమ ధర్మాలను నిర్వర్తించేటట్టు ఒత్తిడి పెట్టడం రాజు కర్తవ్యం అని అంతకంటె పూర్వమే కౌటిల్యుడు అర్థశాస్త్రంలో అన్నాడు. అన్ని ధర్మశాస్త్రాలూ ఈమాటే అన్నాయి. రాజ్యానికి ఉండే బలప్రయోగ అధికారాన్ని వర్ణవ్యవస్థను అమలుచేయడం కోసం ప్రయోగించాలి. బలప్రయోగం జరపకుండ కేవలం  దైవసృష్టి అనే నమ్మకంతో దానిని నిలబెట్టడం సాధ్యం అవుతుందని బ్రాహ్మణులు ఎప్పుడూ విశ్వసించలేదు. మనుషులు పుట్టుకతోనే అసమానులనేది దైవనిర్ణయమేనని ఎంతగా చెప్పినా అది సంపూర్ణంగా జీర్ణం కావడం కష్టం. ఆ భావజాలానికి బలప్రయోగం కూడ తోడయితేనే అది నిలుస్తుంది. అందుకే రాజ్యం అంటేనే దండన అనే అభిప్రాయం హైందవ సమాజంలో చాలా బలంగా స్థిరపడింది. ఈనాడు రాజ్యం చేసే హింసకు సామాజిక ఆమోదం సులభంగా లభించడానికి ఈ సంస్కృతి దోహదం చేస్తున్నదనడానికి సందేహించనవసరం లేదు.

## 2. అధికార యంత్రాంగం, న్యాయవ్యవస్థ

బ్రాహ్మణ సిద్ధాంతకారుల దృష్టిలో రాజ్యం నిర్వర్తించవలసిన ప్రధాన కర్తవ్యాలేమిటో చూశాము. వర్ణవ్యవస్థను బలప్రయోగంతో కాపాడడం రాజ్యాంగ యంత్రానికి వుండే ప్రధాన కర్తవ్యమని ధర్మశాస్త్రకారులు భావించారు. తక్కిన కర్తవ్యాలు దీనికి అనుబంధంగా, దీని వెలుగులో జరగాలి. ఆ తక్కిన కర్తవ్యాలలో సహేతుకమైన విషయాలు ఏవీ లేవని కాదు. నాగరికత పురోగమన క్రమంలో అసమ వ్యవస్థలలోనుండే ప్రజాతంత్ర ఆకాంక్షలూ, సహేతుకమైన సంఘ జీవిత నియమాలూ పుడతాయి. అవి పీడిత ప్రజల ఆందోళనలలోనూ, పీడననూ అన్యాయాన్నీ తిరస్కరించే విమర్శనాత్మక కృషిలోనూ వ్యక్తం అవుతాయి. సంఘ జీవితానికి అవసరమైన హేతుబద్ధమైన ప్రమాణాల అన్వేషణలో వ్యక్తం అవుతాయి. ఆ విధంగా పీడన గర్భంలోనే అవి నాగరిక జీవితానికి అవసరమైన విలువలనూ, నియమాలనూ సూచిస్తాయి.

రాజ్యాంగ యంత్రానికి ఒక కర్తవ్యాన్ని నిర్దేశించిన తరువాత దానికి అనువయిన నిర్మాణాన్ని రూపొందించవలసి వుంటుంది. అంటే అధికార

యంత్రాంగాన్నీ న్యాయ వ్యవస్థనూ పైన వివరించిన కర్తవ్యాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలి. బ్రాహ్మణ ధర్మ శాస్త్రాలు ఆ పని ఏ విధంగా చేశాయో చూద్దాం. నిజానికి ఇందులోని ప్రధాన అంశాన్ని ఇప్పటికే చూశాం. దైవ సమానుడు, దైవాంశ సంభూతుడు అయిన రాజుకు సకల అధికారాలూ కట్టబెట్టి అతని నియంతృత్వ అధికారాన్నే పరిపాలనలో ప్రధాన అంశం చేశారు ధర్మశాస్త్రకారులు. ఇది ఒక్క భారతదేశానికే పరిమితమైన వింత కాదు కానీ, ఇక్కడి హైందవ సమాజానికి ఇది ఎందుకు ప్రత్యేకంగా అవసరమయిందో చూశాము. మనుషులను పుట్టుకతోనే అసమానులుగా వర్గీకరించే వర్ణధర్మాన్ని కాపాడడం రాజ్యాంగ యంత్రానికి వుండే ప్రధాన కర్తవ్యం అయినప్పుడు, దైవత్వం ఆపాదించబడ్డ హింసాత్మక నియంతృత్వం దాని ప్రధాన గుణం కాక తప్పదు. పాలితుల స్వచ్ఛంద సమ్మతి కోరే లౌకిక తర్కమయినా, ప్రయోజనాలయినా, భ్రమలయినా, భావజాలమయినా అందులో అప్రధానమే కాగలదు.

అయితే ఎంతటి నియంత అయినా ఒక్కడే పరిపాలించలేడు కాబట్టి అధికారాన్ని – అతని ఆజ్ఞలకు లోబడి – చలాయించే మందీ మార్బలం అవసరం అవుతారు. ఇందులో మంత్రులు, అధికార గణం, న్యాయమూర్తులు ప్రధానమైన వారు కాగా రాజ పురోహితుడు అందరి కంటే ప్రముఖపాత్ర వహిస్తాడు. రాజ పురోహితుడికి ప్రాముఖ్యం ఎందుకు వుండాలా అని సందేహం రావచ్చు. నిజానికి పురోహితుడి అవసరాన్ని ప్రస్తావించినప్పుడు ధర్మశాస్త్రాలు కర్మకాండ గురించే ప్రధానంగా చెప్తాయి. రాజయిన వాడు గృహస్తు ధర్మాలు నిర్వర్తించాలి. రాజధర్మాలు కూడ నిర్వర్తించాలి. బ్రాహ్మణ సంస్కృతిలో ఏ ధర్మాల నిర్వహణ అయినా కర్మకాండయుతంగా జరుగుతుంది. కర్మకాండ జరిపించడానికి బ్రాహ్మణుల అండ కావాలి. బ్రాహ్మణుల అవసరం లేకుండ బ్రతకలేని పరిస్థితి కల్పించడం బ్రాహ్మణ్యం ఆధిక్యాన్ని (తాత్విక రంగంలో), బ్రాహ్మణుల ఆధిక్యాన్ని (సామాజిక రంగంలో) నెలకొల్పడానికి ఉపయోగించిన ఒక సాధనం. కాబట్టి రాజు గృహస్తు ధర్మాల నిర్వహణలో భాగంగా జరగవలసిన గృహకర్మకాండల కోసం అతనికి ఒక పురోహితుడు అవసరమనీ, యోగ్యుడు, వేద పండితుడు అయిన రాజ పురోహితుడిని నియమించాలనీ ధర్మశాస్త్రాలు చెప్తాయి. అయితే గృహ ధర్మాల కోసమే కాక

రాజధర్మాల కోసం కూడ కర్మకాండ అవసరం అవుతుంది. యుద్ధాలలో గెలుపుకోసం, వర్షాల కోసం, పంటలు పండడం కోసం యజ్ఞాలు చేయవలసి వుంటుంది. దీనికోసం యజ్ఞాలు నిర్వహించే ఒక బ్రాహ్మణుడిని కూడా రాజు నియమించాలని ధర్మశాస్త్రాలు చెప్తాయి. ఈ బ్రాహ్మణుడిని రుత్విజుడు అంటారు.

అయితే ఈ బ్రాహ్మణుల పాత్ర – ముఖ్యంగా రాజ పురోహితుడి పాత్ర – ఇక్కడితో అయిపోదు. రాజ్య వ్యవహారాల నిర్వహణ శాస్త్రాల ప్రకారం జరగాలి. ఇదొక సూచన కాదు. ఒక కఠోరమైన నియమం. శాస్త్రాల ప్రకారం పరిపాలించని రాజుకు ఇహలోకంలోనూ, పరలోకంలోనూ పుట్టగతులుండవు. ఎంతో ఆత్మస్థైర్యంగల పాలకులు తప్ప ఇతరులు ఈ బెదిరింపుకు బాగా భయపడతారు. రాజుల కర్తవ్య నిర్వహణను వివరించేటప్పుడు ధర్మశాస్త్రాలు మధ్య మధ్యలో 'బ్రాహ్మణులను సంప్రదించి', 'శాస్త్రాలు చదువుకున్న సద్బ్రాహ్మణుల సలహాలు తీసుకొని' అంటుంటాయి. స్వతహాగా ఎంతటి పండితుడయినా, రాజయినా బ్రాహ్మణులను సంప్రదించకుండ పనిచేస్తే ఏం కొంప మునుగుతుందో అని భయపడతాడు. దీని ఫలితంగా, రాజ్య వ్యవహారాలపైన బ్రాహ్మణ్యం (ఒక తాత్విక దృక్పథంగా, సిద్ధాంతంగా) ఆధిపత్యం చలాయించడమే కాక బ్రాహ్మణులు (అధికార వర్గంలో ముఖ్యులుగా) వ్యక్తిగత ఆధిపత్యం చలాయించేవారు. బ్రాహ్మణుల వ్యక్తిగత ఆధిపత్యం లేకుండ బ్రాహ్మణ్యం ఒక సిద్ధాంతంగా, ఒక భావజాలంగా ఆధిపత్యం చలాయించగలదని ధర్మశాస్త్రకారులు నమ్మలేదు. ఎందుకంటే అది కనీసం క్షత్రియుడికి కూడ పూర్తి సమాన విలువ ఇచ్చే దృక్పథం కాదు.

'సలహాదారులుగా', 'సంప్రదించవలసిన' వారిగా అధికార గణంలో ప్రముఖ స్థానంలో వున్న బ్రాహ్మణ పండితులలో ముఖ్యుడు రాజ పురోహితుడు. ఈ విధంగా క్షత్రియులకు కేటాయించిన రాజ్యాధికారంలో ఒక భాగాన్ని బ్రాహ్మణులే చేజిక్కించుకున్నారు. మనకందరికీ రామాయణ మహాభారత గాథలు బాగా పరిచయం కాబట్టి, ఈ కథలలో కేవలం రాజ పురోహితులయిన వశిష్ట, విశ్వామిత్ర 'తదితర 'రుషుల'కుండే విపరీత ప్రాముఖ్యాన్ని ఇప్పుడు అర్థం చేసుకోవచ్చు.

అవ్యవస్థితంగా అధికారం చలాయించే ఈ బ్రాహ్మణ పండితులే కాక ఒక వ్యవస్థిత అధికార యంత్రాంగం కూడ రాజ్యపాలనకు అవసరం అని

ధర్మశాస్త్రాలు గుర్తించాయి. దీనిలో మంత్రిమండలి, అధికారులు, న్యాయమూర్తులు అని మూడు రకాలు. పరిపాలనా సౌలభ్యం కోసం రాజు మంత్రులను నియమించాలనీ, వారికి వివిధ శాఖలు కేటాయించాలనీ అర్థశాస్త్రంలో కౌటిల్యుడు అంటాడు. మంత్రుల సలహా తీసుకొని ఆయా శాఖల పరిపాలన నిర్వహించాలని తరువాతి కాలపు ధర్మశాస్త్రకారులు అంటారు. 'రాజు మంత్రులను నియమించాలి. ఆ మంత్రులందరినీ లేక వారిలో కొందరిని సంప్రదించి రాజ్య వ్యవహారాల నిర్వహణ చూసుకోవాలి. అంటే, వాళ్ళ అభిప్రాయాలు తెలుసుకొని, శాస్త్రకోవిదుడయిన రాజ పురోహితుడి సలహా పొంది తన వివేచన ప్రయోగించి పనిచేయాలి' అని యాజ్ఞవల్క్య స్మృతి అంటుంది.

'మంత్రి మండలి' అన్న మాట వాడుతున్నామంటే దానిని పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలోని కేబినెట్‌తో సమానంగా చూడకూడదు. మంత్రులకు తమ శాఖల విషయంలో స్వయం ప్రతిపత్తి ఉండాలని కానీ, రాజుకూ మంత్రులకూ కలిసి ఉమ్మడి అధికారం, సమిష్టి బాధ్యత వుండాలని కానీ బ్రాహ్మణ శాస్త్రకారులు భావించలేదు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కూడ సిద్ధాంతం ఏం చెప్పినా ఆచరణలో మంత్రులపైన అంతో యింతో నియంతృత్వం చలాయించడం ప్రధాన మంత్రులకు అలవాటే. కానీ ధర్మశాస్త్రాల భావనలో ఆ సిద్ధాంతం కూడ లేదు. మంత్రులు కేవలం రాజుకు సహాయకులు మాత్రమే. వాళ్ళకు స్వయం ప్రతిపత్తి ఎంతమాత్రం లేదు. రాజుకు నచ్చితేనే వాళ్ళ అభిప్రాయానికి విలువ. సలహాలు, సూచనలు ఇవ్వడం వరకే వాళ్ళ కర్తవ్యం. అసలు నిర్ణయం రాజుదే. ఇది ఏక వ్యక్తి నియంతృత్వమే. ఇంకా ఏమయినా నిజమైన అధికారముంటే అది మంత్రులకు కాక రాజ పురోహితుడికీ రాజాస్థానంలోని ఇతర బ్రాహ్మణ పండితులకూ వుంటుంది. 'శాస్త్రం ఒప్పుకోదు జాగ్రత్త' అని బెదిరించగలరు, 'శాస్త్రం చేయమంటుంది, ఆపైన నీ యిష్టం' అని హెచ్చరించగలరు.

అంతంత మాత్రం అధికారాలున్న ఈ మంత్రిమండలిలోనయినా బ్రాహ్మణేతరులకు ప్రవేశం వుండిందా? స్త్రీలకు ప్రవేశం వుండిందా? స్త్రీలకు మాత్రం ఎట్టి పరిస్థితిలోనూ లేదు. మంత్రిమండలిలో స్థానం సంగతి అటుంచి, అసలు మంత్రిమండలి సమావేశం జరిగేటప్పుడు అక్కడ స్త్రీలెవ్వరూ వుండడానికి

వీలులేదని మనువు అంటాడు. ఎందుకంటే మంత్రిమండలి వ్యవహారాలు రహస్యంగా వుండడం అవసరం అనీ, 'స్త్రీ నోట్లో రహస్యం దాగదు' అనీ అంటాడు. ఏ విషయంలోనయినా స్త్రీల గురించి అతి అల్పమైన అభిప్రాయం కావాలంటే మనువును అడగాలి. ఇంక మంత్రిమండలిలో స్త్రీలు ఎట్లా వుంటారు?

మగవాళ్ళలోనయినా బ్రాహ్మణేతరులు మంత్రులుగా వుండవచ్చునా? బ్రాహ్మణులు మాత్రమే మంత్రులు కావచ్చని కాత్యాయన స్మృతి అంటుంది. కౌటిల్యుడు, మనువు ఏమంటారంటే 'ఉన్నత వంశానికి చెందినవారు' మాత్రమే మంత్రులు కావడానికి అర్హులని. అంటే బ్రాహ్మణులతోపాటు క్షత్రియులు, బహుశా వైశ్యులు కూడ అర్హులని అనుకోవచ్చు. శూద్రులవి 'ఉన్నత వంశాలు' కావడానికి వీలులేదు కాబట్టి శూద్రులకు కౌటిల్యుడి ప్రకారం, మనువు ప్రకారం మంత్రులయ్యే అర్హత శూన్యం. బ్రాహ్మణేతర అగ్రవర్ణాల వాళ్ళు మంత్రులు కావచ్చునని మనువు ఒప్పుకున్నప్పటికీ, రాజ్యపాలనలో అతి ముఖ్యమైన విషయాలలో మాత్రం రాజు బ్రాహ్మణులయిన మంత్రులను మాత్రమే సంప్రదించాలని అంటాడు. యాజ్ఞవల్క్యుడు కూడ, మంత్రులుగా రాజు ఎవరిని నియమించినప్పటికీ రాజ పురోహితుడి సలహా మేరకు మాత్రమే చేయాలని అంటాడు. సారాంశంలో, రాజ్యాధికారం క్షత్రియ ధర్మం అని చతుర్వర్ణ సిద్ధాంతం చెప్పినప్పటికీ శాస్త్రాల పేరుతో ఆ క్షాత్ర ధర్మాన్ని బ్రాహ్మణులు చాలా భాగం తమ గుప్పిట్లోకి తీసుకున్నారని అర్థం అవుతుంది. అంటే బ్రాహ్మణ్యం కేవలం ఒక సిద్ధాంతంగానే కాక, చెప్పుకోదగ్గ మేరకు భౌతికంగా కూడా రాజ్యం చేసిందని అర్థం అవుతుంది. సంప్రదాయ హైందవ రాజ్య స్వభావాన్ని అర్థం చేసుకునేటప్పుడు ఇదొక ముఖ్య విషయం. దీనికి మరికొంత వివరణ దిగువ చూద్దాం.

మంత్రులే కాక రాజ్యంలో ఒక అధికార గణం కూడ వుంటారు. వీళ్ళు ఈ రోజుల్లోలాగా పరీక్షలు రాసి ఎంపికైనవారు కారు. అది కొంతమేరకయినా అధికారాన్ని విస్తృతం చేస్తుంది. ప్రాచీన చైనాలో ఈ వ్యవస్థ వుండింది. కానీ మన దగ్గర ధర్మశాస్త్రాల ప్రకారం రాజు అధికారులను నియమిస్తాడు. రాజ పురోహితుడిని సంప్రదించి నియమిస్తాడు. వాళ్ళకు బాధ్యతలు పంచుతాడు. ఎన్నిరకాల శాఖలకు అధికారులుండాలో బ్రాహ్మణ శాస్త్రాలు ఏకరవు పెడతాయి.

అది సామాజిక ఉత్పత్తిలోనూ, జీవన విధానంలోనూ ఆనాటికే నెలకొన్న వైవిధ్యాన్నీ, పరిణతినీ సూచిస్తుంది.

సంక్షేమ బాధ్యత ఆనాడు రాజ్యానికి లేదు కాబట్టి ప్రధాన అధికార శాఖలు రెవెన్యూ సేకరణకూ, సాంఘిక భద్రతకూ (అంటే పన్ను వసూలు, పోలీసు కర్తవ్యాలకు) సంబంధించినవి. వీటితోబాటు కొన్ని రకాల ఉత్పత్తి (ప్రధానంగా ఖనిజాల ఉత్పత్తి) రాజ్యం ఆధ్వర్యంలో జరిగేది. దానికి కూడ అధికారులుండేవారు. న్యాయశాఖను కూడ అధికార యంత్రాంగంలో భాగంగా నిర్వచించవచ్చునేమో. ఎందుకంటే ఈనాడున్నంత స్పష్టంగా ఆనాడు కార్య నిర్వాహక, న్యాయ శాఖలకు మధ్య భేదం పాటించబడలేదు. అయినప్పటికీ సౌలభ్యం కోసం న్యాయ వ్యవస్థను విడిగా చర్చిద్దాము.

రాజే అధికారులను నియమిస్తాడు కాబట్టి వాళ్ళ యోగ్యతకు రాజు విచక్షణే తప్ప వేరే భరోసా లేదు. రాజు తగిన విచక్షణ పాటించాలని ధర్మశాస్త్రాలు చెప్తాయి. ప్రభుత్వ అధికారి 'సాహసవంతుడు, నిజాయితీపరుడు, రాజుపట్ల విశ్వాసం గలవాడు, శత్రువుకు లొంగని వాడు, తన స్వంత భవిష్యత్తు గురించి ఆలోచన లేనివాడు, తెలివయినవాడు, యోగ్యుడు' అయి వుండాలని మహాభారతంలోని శాంతిపర్వం అంటుంది. ఇందులో 'రాజు పట్ల విశ్వాసం కలిగి వుండడం' అనే ఫ్యూడల్ గుణాన్ని మినహాయిస్తే మిగిలినవి మంచి లక్షణాలే, ప్రభుత్వ అధికారిలో వుండవలసిన గుణాలే. కానీ ఈ గుణాలు కలవాళ్ళు మాత్రమే ఎంపిక కాగలిగేటట్లు చూసే ఎంపిక విధానం ఏదీ లేదు. ఎంపిక రాజు ఇష్టమే. శాస్త్రాలు పెట్టే పరిమితులు, రాజ పురోహితుడి సలహాలు మినహా మంత్రుల ఎంపికలోనూ, అధికార్ల ఎంపికలోనూ రాజు స్వతంత్రుడు. అతని నియంతృత్వ అధికారానికి ఇదొక దృష్టాంతం. దుర్మార్గుడయిన రాజు దుర్మార్గులనే ఎంపికచేస్తే భరించడం తప్ప ప్రజలు చేయగలిగింది లేదు. మంత్రుల ఎంపికలోనూ, అధికార్ల నియామకంలోనూ కొంతవరకైనా ప్రజల పరోక్ష ప్రమేయం, హేతుబద్ధమైన ప్రమాణాలు వున్న ఆధునిక కాలంలోనే అధికార యంత్రాంగం దుర్మార్గాలను నివారించడం కష్టతరంగా వుంది. ఇంక దైవస్వరూపుడయిన రాజు, ఆయనగారి

పురోహితుడు కలిసి చేసే నియామకాలను భరించక తప్పని పరిస్థితిలో సామాజిక జీవితం ఎంత దుర్భరంగా వుండేదో !

ప్రభుత్వ అధికార్లకు ఇవి వుండి తీరాలి అని మహాభారతంలో ఏకరవు పెట్టిన పై లక్షణాలలో ప్రత్యక్షంగా వర్ణవివక్ష ప్రస్తావన లేదు. అయితే ఎవరి తెలివితేటలను, ఎవరి నిజాయితీని, వ్యక్తిత్వాన్ని గుర్తిస్తారనే విషయంలోనూ, ఎవరి విశ్వాసాన్ని నిజంగా నమ్ముతారన్న విషయంలోనూ వివక్షకు తావు వుంటుంది. శూద్రులపైన ఆ నమ్మకం వుండడం కష్టమే. అయితే పొరబాట్లకు తావు ఇవ్వకుండ, ముఖ్యమైన పదవులలో 'ఉన్నత వంశాలకు' చెందిన వారిని మాత్రమే నియమించాలని మనువు అంటాడు. రెవెన్యూ సేకరణ, ఖనిజాలు తదితర ఉత్పత్తుల నిర్వహణ, గిడ్డంగుల సంరక్షణలలో నియమితులయిన అధికారులు ఉన్నత వంశజులయి వుండాలని మనువు అభిప్రాయం. అంటే బ్రాహ్మణులు, క్షత్రియులు, మహా అయితే వైశ్యులు అయివుండాలని. ఇవికాక మిగిలిన శాఖలేమిటంటే పోలీసు విధులు, సెక్యూరిటీ విధులు; నేరస్తులను పట్టుకోవడం; అడవులు, తోటలు, చెరువులను కాపాడడం; శాంతిభద్రతల కోసం గస్తీ ఏర్పాటు చేయడం మొదలయినవి. ఈ శాఖలలో పదవులు 'ఉన్నత వంశజులు' కాని వారికి దక్కినా ఫరవాలేదని మనువు భావించినట్టున్నాడు.

రాజు ఇతర రాజుల ఆస్థానాలకు పంపించే రాయబారుల విషయంలో కూడ మనువు ఇదే జాగ్రత్త తీసుకుంటాడు. రాయబారి నిజాయితీపరుడయి వుండాలి. సకల విద్యలు తెలిసినవాడయి వుండాలి. యోగ్యుడయి వుండాలి. తెలివైన వాడయి వుండాలి. రాజుపట్ల విశ్వాసంతో నడుచుకోవాలి. ఎప్పుడు ఏమి చేయాలో ఎరిగి వుండాలి. సుందరాకారుడయి కూడా వుండాలి. ఇవన్నీ కాక 'ఉన్నత వంశం'లో పుట్టినవాడయి వుండాలి.

బ్రాహ్మణీయ రాజ్యాంగ యంత్రంలో గూఢచారి వ్యవస్థకు ముఖ్యపాత్ర వుంది. ప్రధానంగా బల ప్రయోగంపైన ఆధారపడే నియంతృత్వ రాజ్యమేదయినా గూఢచారి వ్యవస్థను బాగా అభివృద్ధి చేసుకోక తప్పదు. బ్రాహ్మణీయ రాజ్యం ప్రధానంగా దండన మీద ఆధారపడిందనీ, రాజునే మనువు దండంతో పోల్చాడనీ పైన చూశాము. దానికి తగినట్టు కౌటిల్యుడి అర్థశాస్త్రంతో మొదలుపెట్టి బ్రాహ్మణ

ధార్మిక సాహిత్యం రాజనీతిలో సిఐడిలకు సముచిత స్థానం ఇచ్చింది. చిల్లర సిఐడిలే కాక ఇద్దరు ప్రధాన 'ఇంటలిజెన్స్' అధికారులు వుండాలని కాత్యాయన స్మృతి అంటుంది. వీళ్ళు నేరాల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకొని రాజుకు 'రిపోర్ట్' చేస్తుండాలి. వీళ్ళను స్తోభకుడు, సూచకుడు అంటాడు కాత్యాయనుడు. స్తోభకుడు ప్రత్యేకించి వర్ణ ధర్మాన్ని ఎక్కడ, ఎవ్వరు అతిక్రమించినా, ధర్మశాస్త్రాల అతిక్రమణ ఎక్కడ జరిగినా తెలుసుకొని రాజుకు చెప్పాలి. వర్ణ ధర్మాన్ని కాపాడడం రాజు ముఖ్య కర్తవ్యం కాబట్టి రాజుకు ఆ సమాచారం చాలా అవసరం. లేకపోతే రాజుకు తెలియకుండ ధర్మవినాశనం జరిగిపోతూ వుండవచ్చు. సూచకుడనే వాడు శాస్త్ర ఉల్లంఘనాన్నే కాక ఇతర నేరాల గురించి కూడ ఎప్పటికప్పుడు రాజులకు తెలియజేస్తుంటాడు. ఒకడు ధార్మిక 'ఇంటలిజెన్స్' చీఫ్ కాగా రెండవ వాడు జనరల్ 'ఇంటలిజెన్స్' చీఫ్.

అధికార్లలో అవినీతి గురించి మాత్రం బ్రాహ్మణ శాస్త్రకారులకు మంచి పట్టింపే వుండింది. అవినీతిపరులను అధికార పదవుల నుండి తొలగించాలనీ, శిక్షించాలనీ, వాళ్ళ ఆస్తులు జప్తు చేసుకోవాలనీ మనువు, యాజ్ఞవల్క్యుడు, కాత్యాయనుడు అంటారు.

ఆఖరుగా న్యాయవ్యవస్థను గురించి మాట్లాడుకోవాలి. అప్పట్లో న్యాయవ్యవస్థ అంటే రాజ్యాంగ యంత్రంలో భాగంగా ఏర్పాటయిన న్యాయమూర్తుల కోర్టులు మాత్రమే కాదు. అప్పటికింకా అధికారం సంపూర్ణంగా రాజ్యం చేతిలో కేంద్రీకృతం కాలేదు. ఎక్కడికక్కడ సాంఘిక సంప్రదాయాలనూ ఆచారాలనూ అనుసరించి వివిధ సామాజిక బృందాల పెద్దలు చేసే న్యాయనిర్ణయాన్ని కూడ రాజ్యం గుర్తించేది. గుర్తించాలని ధర్మశాస్త్రాలు చెప్తాయి. వీటి పరిధిలో పరిష్కారం కాని సమస్యలు మాత్రమే అధికారిక న్యాయస్థానాల దగ్గరకు వచ్చేవి. వీటిలో అత్యున్నతమైనది రాజుగారి కోర్టు.

కుటుంబ సమస్యలు కుటుంబం స్థాయిలో, కులం సమస్యలు కులం స్థాయిలో, వర్తక లేక వృత్తికారుల సమస్యలు వారి శ్రేణుల స్థాయిలో, గ్రామ సమస్యలు గ్రామం స్థాయిలో ఆయా వ్యవస్థల పెద్దల ఆధ్వర్యంలో, వాటి సంప్రదాయాలనూ ఆచారాలనూ అనుసరించి పరిష్కారం కావాలని ధర్మశాస్త్రకారులు

అంటారు. ఒకవేళ ఏ స్థాయిలోనయినా న్యాయం ఏమిటి, శాస్త్రాలు ఏం చెప్పాయి అన్న సందేహం వస్తే స్థానిక న్యాయ సభలలో పరిష్కారం పొందాలి. ఈ న్యాయసభలలో 10 మంది శాస్త్ర పారంగతులయిన బ్రాహ్మణులు వుంటారని బృహస్పతి స్మృతి అంటుంది.

ఈ న్యాయవ్యవస్థ కుటుంబ వ్యవస్థనూ, కుల వ్యవస్థనూ – వెరసి వర్ణ ధర్మాన్ని – చాలా పదిలంగా కాపాడే ఏర్పాటు అని వివరించి చెప్పనవసరంలేదు. ఈ సంప్రదాయక వ్యవస్థలలో పరిష్కారం కాని సమస్యలు, శాస్త్రాల ప్రకారమే వీటి పరిధిలో లేని సమస్యలు మాత్రమే రాజ్యాంగ యంత్రంలో భాగమైన న్యాయమూర్తుల దగ్గరకు పోతాయి. వీరిలో అతి పెద్ద న్యాయమూర్తి రాజు. అత్యున్నత కోర్టు రాజు నిర్వహించే న్యాయస్థానమే.

ఈ వికేంద్రీకరణ తొలినాడు చాలా దూరం పోయింది. క్రీస్తు పూర్వం రాసిన ధర్మసూత్రాల నాటికి రాజాస్థానం కేవలం వర్ణధర్మ అతిక్రమణను విచారించే న్యాయస్థానంగా వుండేది. న్యాయమూర్తిగా రాజు చేపట్టే కేసులు వర్ణధర్మ నియమాలను ఉల్లంఘించిన ఘటనలు, అగ్రవర్ణాల పైన శూద్రులు దాడులకు పాల్పడిన ఘటనలు, అగ్రవర్ణ స్త్రీలతో శూద్రులు లైంగిక సంబంధం పెట్టుకున్న ఘటనలు అని ఆపస్తంబ ధర్మసూత్రం అంటుంది. అంటే రాజ్యం ప్రధాన కర్తవ్యమయిన వర్ణ ధర్మ సంరక్షణకు సంబంధించిన కేసులు మాత్రమే అప్పట్లో సుప్రీంకోర్టుకు వచ్చేవి. మిగిలిన కేసులన్నీ కుటుంబ పంచాయితీలలో, కుల పంచాయితీలలో, శ్రేణుల సభలలో, గ్రామ సభలలో ఆయా పెత్తందార్ల ఆధ్వర్యంలో పరిష్కారమయ్యేవి.

కానీ కాలక్రమంలో ఒక్కటొక్కటిగా ఇతర కేసులు కూడ రాజుగారి న్యాయస్థానానికి రాసాగాయి. మనువు కాలం నాటికి ఈ జాబితా చాలా పెరిగింది. వర్తకం, వ్యవసాయం విస్తరించిన క్రమంలో సంప్రదాయ వ్యవస్థల స్థానాన్ని ఒక మేరకు రాజ్యవ్యవస్థ ఆక్రమించింది. అయితే రెండిటి సైద్ధాంతిక ప్రాతిపదికా ఒక్కటే – హైందవ వర్ణ ధర్మం.

రాజు న్యాయస్థానం ఏ విధంగా వుంటుందో చూద్దాం. దీని వర్ణన అన్ని స్మృతుల లోనూ ఒకే విధంగా లేకపోయినా మొత్తం మీద ఒక చిత్రం గ్రహించవచ్చు.

రాజు న్యాయ నిర్ణయం ఒంటరిగా చేయడు. అతనితో 'మూడు వేదాలు చదువుకున్న పండితులు, పెద్దలు, సలహాదారులు' వుంటారు. వీరుకాక ప్రభుత్వ అధికారులైన న్యాయమూర్తులు వుంటారు. వారిలో ఒక ముఖ్య న్యాయమూర్తి వుంటాడు. న్యాయమూర్తులుగా బ్రాహ్మణులను మాత్రమే నియమించాలని అంటాడు కాత్యాయన స్మృతికారుడు. నారద స్మృతికారుడేమంటాడంటే ముఖ్య న్యాయమూర్తి పద్దెనిమిది న్యాయశాఖలు, వాటి ఎనిమిది వేల ఉపశాఖలు, సంప్రదాయ జ్ఞానం, వేద విజ్ఞానం తెలిసిన వాడయి వుండాలి. బ్రాహ్మణులు కాని వారికి ఇవన్నీ తెలిసి వుండే అవకాశం చాలా తక్కువ. అయితే ఒకవేళ ఈ లక్షణాలున్న బ్రాహ్మణుడు దొరకకపోతే ఇవన్నీ తెలిసిన క్షత్రియుడినయినా, వైశ్యుడినయినా రాజు ముఖ్య న్యాయమూర్తిగా నియమించవచ్చును కానీ ఎట్టి పరిస్థితిలోనూ శూద్రుడిని నియమించడానికి వీలులేదని కాత్యాయనుడంటాడు. అలాగే రాజు పక్కన కూర్చునే సలహాదారులలో ఒక క్షత్రియుడినీ, వైశ్యుడినీ తప్పక ఎంపిక చేసుకోవాలని కాత్యాయనుడంటాడు. రాజు ఒకరోజు ఏ కారణంగానయినా కోర్టుకు రాలేకపోతే తన స్థానంలో శాస్త్రపారంగతుడయిన బ్రాహ్మణుడిని నియమించాలని మనువు, కాత్యాయనుడు అంటారు. సాక్ష్యాలను మదింపు వేసేటప్పుడు వేద విజ్ఞానానికీ, మీమాంసకూ సంబంధించిన తర్క నియమాలనూ, రాజనీతికి సంబంధించిన తర్క నియమాలనూ ప్రయోగించాలని శాస్త్రకారులు అంటారు. ఆధునిక కోర్టులు అనుసరించే 'అప్రీషియేషన్ ఆఫ్ ఎవిడెన్స్' లౌకిక తర్కంపైన ఆధారపడి వుంటుంది.

మొత్తానికి అధికార యంత్రాంగం కంటె బహుశా ఎక్కువగా న్యాయవ్యవస్థ బ్రాహ్మణ్యం గుప్పిట్లోనే కాక బ్రాహ్మణుల గుప్పిట్లో వుండిందని చెప్పుకోవచ్చు. అది బ్రాహ్మణ వర్ణధర్మం ప్రకారమే న్యాయం చేయాలి. బ్రాహ్మణ న్యాయమూర్తులు, సలహాదారుల ద్వారా మాత్రమే న్యాయం చేయాలి. క్షత్రియులనూ, వైశ్యులనూ పూర్తిగా కాదనే స్థితిలో బ్రాహ్మణులు లేరు కాబట్టి సలహాదారులలో వాళ్ళను కూర్చోబెట్టమని కాత్యాయనుడు చెప్పాడని చూశాం. కానీ శూద్రులను ఎట్టి పరిస్థితిలోనూ తీసుకోవద్దని అన్నాడు.

అయితే ఈ వికృతమైన వ్యవస్థలో కూడ కొన్ని నాగరికమైన లక్షణాలు ప్రతిపాదించబడ్డాయి. ఒకటి, సాక్ష్యాలను మదింపు వేయడంలో సహాయపడడానికి ఒక 'జ్యూరీ' వుంటుంది. వీళ్ళు ఇరుపక్షాలు ప్రవేశపెట్టిన సాక్ష్యాన్ని బేరీజువేసి వాటి సత్యాసత్యాల గురించి ఒక అభిప్రాయానికి వచ్చి న్యాయమూర్తులకూ, రాజుగారికీ తెలియజేస్తారు. వ్యాజ్యం ఏ సామాజిక రంగానికి సంబంధించినదయితే ఈ జ్యూరర్లు కూడ అదే సామాజిక రంగం నుండి ఎంపిక చేయబడతారు. ఉదాహరణకు వ్యాజ్యం ఇద్దరు కంసాలి వాళ్ళ మధ్యనయితే జ్యూరర్లుగా కంసాలి వాళ్ళే ఎంపిక చేయబడతారు. వీళ్ళను ఎంపిక చేయడంలో నిష్పాక్షికంగా వ్యవహరించేటట్టయితే ఇది నిజానికి ఉపయోగకరమైన ఏర్పాటే. సామాజిక జీవితంతో ఏమీ సంబంధంలేని జడ్జీలకు అన్నీ తెలిసినట్టు నటించడం కంటె ఇది మేలే. ఆధునిక న్యాయవ్యవస్థలలో కూడ ఈ జ్యూరర్ల వ్యవస్థ కొన్నిచోట్ల వుంది. దాని మంచిచెడుల గురించి చాలా చర్చ జరుగుతూ వుంది. తగు జాగ్రత్తలు తీసుకునేటట్టయితే చెడు కంటే మంచే ఎక్కువ వుంటుంది.

ధర్మశాస్త్రాల న్యాయం వర్ణ వివక్షతో నిండినదే అయినా దానిని అమలు చేయడంలోనూ, అన్వయించడంలోనూ న్యాయస్థానాలు నిష్పాక్షికంగా వ్యవహరించాలని శాస్త్రకారులు అన్నారు. దోషిని శిక్షించకపోవడం ఎంత తప్పో నిర్దోషిని శిక్షించడం అంతే తప్పని అన్నారు. రాజుగానీ ఇతర న్యాయమూర్తులుగానీ న్యాయం చేయడంలో గాడి తప్పుతుంటే సభికులలో ఎవరైనా నిర్భయంగా వారిని నిలువరించాలనీ, ఆ పనిచేయడంవల్ల ఏ పాపం అంటదనీ కాత్యాయనుడు అంటాడు. జ్యూరర్లు రాజు కోరిన పద్ధతిలో సాక్ష్యాన్ని వ్యాఖ్యానించకూడదనీ న్యాయంగా వ్యాఖ్యానించాలనీ అప్పుడే వాళ్ళకు పాపం అంటకుండ వుంటుందనీ కూడ నారదస్మృతి అంటుంది.

న్యాయస్థానాలలో నిజం తేల్చడం కోసం చిత్రహింసలు ప్రయోగించే పద్ధతి కూడ వుండేది. ఈనాడు కూడ నేరపరిశోధనలో చిత్రహింసలకు ముఖ్య స్థానం వుందిగానీ చట్టం ఒప్పుకోదు. అవి చట్టబాహ్యంగా పోలీస్ స్టేషన్లలో అమలవుతుంటాయి. ఆ రోజులలో చిత్రహింసలు శాస్త్ర సిద్ధాంతంలో భాగమే. ఇతరత్రా వెలికి తీయలేని వాస్తవాలను హింసించి వెలికితీసే ఈ పద్ధతిని

శాస్త్రకారులు వేరేవిధంగా వ్యాఖ్యానించారు. మానవ శక్తితో తేల్చలేని విషయాలు దైవశక్తితో తేల్చడం అని దీనికి అర్థం చెప్పారు. అందుకే దీనిని సంస్కృతంలో 'దివ్యం' అంటారు. (ఇంగ్లీషులో ఆర్డియల్స్ అంటారు. ఒక్క ఇస్లామిక్ రాజ్యాలలో తప్ప తక్కిన అన్ని నాగరికతలలోనూ ఈ 'దివ్య' పద్ధతి నేర పరిశోధనలో అధికారికంగానే గుర్తింపు పొందింది). ఇరుపక్షాల మాటలలో ఏది సత్యమో తేల్చలేక పోయినప్పుడు కాల్చిన ఇనుపకడ్డీని నోట్లో పెట్టడం, నీళ్ళలో తలముంచడం మొదలయిన అనేక హింసా పద్ధతులు న్యాయమూర్తుల సమక్షంలోనే ప్రయోగిస్తారు. 'నీళ్ళు, నిప్పు' న్యాయ యంత్రాంగంలో భాగమేనని ధర్మశాస్త్రాలు చెప్పాయి. దేవుడు సత్యం వైపు వుంటాడు కాబట్టి నిజం చెప్పిన వ్యక్తికి ఈ హింసలవల్ల హాని జరగకుండా కాపాడతాడు. ఆ విధంగా నిజం బయటపడుతుంది. నిజానికి హింసకు భయపడి ఎవడో ఒకడు నిజమో అబద్ధమో ఒప్పేసుకుంటాడనుకోండి. దానికి వాళ్ళు చెప్పే సిద్ధాంతం మాత్రం ఇది. సాంఘికంగా వెనుకబడిన ప్రాంతాలలో ఈనాటికీ కుల పంచాయితీలలోనూ, గ్రామ పెద్దల పంచాయితీలలోనూ 'దివ్య' మార్గాన్ని అనుసరిస్తూనే వున్నారు. దానిని అనాగరికం అని అసహ్యించుకునే ముందు ఒకప్పుడు సకల శాస్త్రకోవిదులు ఆమోదించిన దివ్య మార్గమే ఇది అని జ్ఞాపకం వుంచుకోవడం మంచిది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే, దీనిలో కూడ బ్రాహ్మణ శాస్త్రకారులు బ్రాహ్మణులకు తేలికయిన హింసలు, ఇతరులకు కఠినమైన హింసలు ప్రతిపాదించారు. దేవుడు నిజంగా కాపాడతాడన్న నమ్మకం లేక కాబోలు !

## 3. ఉత్పత్తి వ్యవస్థ - ఆర్థిక జీవితం

సామాజిక ఆర్థిక వ్యవస్థనూ, వ్యవస్థిత జీవితాన్నీ నిలబెట్టడం, స్థిరీకరించడం, కాపాడడం, సాధికారంగా రూపకల్పన చేయడం రాజ్యాంగ యంత్రం ఎప్పుడయినా నిర్వహించే ముఖ్యపాత్రలలో ఒకటి. దీనికి అది అనుసరించే పద్ధతులు, పాటించే నియమాలు, చేసే ఆలోచన, అప్పటి నాగరికతా స్థాయికి, ప్రగతికి ఒక సూచిక. దానినుండి ఉత్పన్నమయ్యే విలువలు, ప్రమాణాలు సామాజిక మానవ సంబంధాల రూపకల్పనకు ఒక వివరమైన నమూనాను ఇస్తాయి. ఆ నమూనాను ప్రజాతంత్ర దృక్పథంతో వ్యాఖ్యానించుకుని అది మానవ

పురోగమనంలో ఏమయినా పాత్ర నిర్వహించగలదా, లేక పురోగమనానికి పూర్తిగా అవరోధమా అని విశ్లేషించుకోవచ్చు. మానవ జీవిత పునర్నిర్మాణంలో దానికేమయినా పాత్ర ఉండగలదా లేక మొత్తంగా తిరస్కరించవలసిందా అని విశ్లేషించుకోవచ్చు.

సామాజిక ఆర్థిక జీవితంలో ఎవరు ఏ పాత్ర నిర్వహించవచ్చుననేది వర్ణధర్మం ద్వారా నిర్దేశించాలని బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు భావించాయి. ఈ వర్ణధర్మ ఆచరణను కాపాడడం రాజ్యానికుండే ముఖ్య కర్తవ్యం. ఆ విధంగా ఆర్థిక జీవిత సంబంధాలనూ, ఉత్పత్తి వ్యవస్థనూ పరిరక్షించే రాజ్యాంగయంత్ర కర్తవ్యానికి వర్ణధర్మం ద్వారా బాట వేసింది బ్రాహ్మణీయ ధర్మం.

వర్ణధర్మం నమూనా యజుర్వేద కాలం నాటికే దాదాపు స్థిరపడింది. అంటే క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటికే అని అర్థం. సమాజాన్ని అది ద్విజులు - శూద్రులు అని విభజిస్తుంది. ద్విజులు అంటే బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు. ప్రకృతి మీద, సమాజంలోను హక్కులంటూ ఉండేది వీరికే. శూద్రులకు సేవచేసే బాధ్యత మాత్రమే వుంటుంది.

వేదాలు చదవడం, వైదిక కర్మకాండను ఆచరించడం, దానధర్మాలు చేయడం మొదటి మూడు వర్ణాల జీవన ధర్మం. మరి వారి జీవనం ఎట్లా గడవాలి అంటే ఒక్కొక్క వర్ణానికీ ఒక్కొక్క జీవన మార్గాన్ని సూచిస్తారు బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులు. ఇది ఒకే సమయంలో వారి హక్కు, వారి అధికారం, వారి సామాజిక హోదా, వారి సంపాదనా మార్గం. బ్రాహ్మణులు విద్యాబోధన చేస్తారు, ఇతరులు ఆచరించే కర్మకాండలో పౌరోహిత్యం నెరుపుతారు, దానధర్మాలు స్వీకరిస్తారు. ఇందులో మొదటి రెండూ పనులు అనుకుందాం. కానీ దానధర్మాలు స్వీకరించడం ఒక 'పని' కాదు. అది శ్రమలేని ఆదాయమార్గం మాత్రమే. దీనిని బ్రాహ్మణుల 'ధర్మం' అనడంలో ఉద్దేశ్యం బ్రాహ్మణులకు దానాలు ఇవ్వడం ఇతరుల ధర్మం అని చెప్పడం. అబ్రాహ్మణుడికి దానం ఇస్తే దానివల్ల దాత పొందే ప్రతిఫలం రెండు రెట్లు వుంటుంది కానీ శ్రోత్రియుడికి దానం ఇస్తే వచ్చే ఫలితం వెయ్యి రెట్లనీ, సకల వేదాలు తెలిసిన వాడికి ఇస్తే వచ్చే ఫలం అనంతం అనీ గౌతమ ధర్మసూత్రం అంటుంది.

క్షత్రియుల మాటకొస్తే, ద్విజులు కాబట్టి వాళ్ళు కూడ వేదం చదవొచ్చు, కర్మకాండ ఆచరించవచ్చు, దానధర్మాలు చేయవచ్చు కాని విద్యాబోధ చేయకూడదు, పౌరోహిత్యం చేయకూడదు, దానం స్వీకరించకూడదు. మరి క్షత్రియుల సామాజిక ధర్మం ఏమిటి – వాళ్ళ హక్కు, అధికారం, సంపాదనా మార్గం ఏమిటి అంటే యుద్ధాలు చేయడం, రాజ్యాన్ని పరిపాలించడం అని ఆపస్తంబుడూ, మనువూ అంటారు.

వైశ్యులు కూడా ద్విజులు కాబట్టి వాళ్ళు సహితం వేదాలు చదవొచ్చు. కర్మలు ఆచరించవచ్చు. దానధర్మాలు చేయవచ్చు. కానీ వాళ్ళు చేయకూడని పనుల జాబితా పెరుగుతుంది. వాళ్ళు విద్యాబోధ చేయకూడదు, పౌరోహిత్యం చేయకూడదు, దానాలు తీసుకోకూడదు, యుద్ధం చేయకూడదు, దేశాన్ని ఏల కూడదు. వర్ణవ్యవస్థ మెట్లు దిగేకొద్దీ చేయకూడని పనుల జాబితా పెరుగుతుంది. మరి వైశ్యులు ఏమి చేయవచ్చునంటే వ్యవసాయం, పశుపోషణ, వ్యాపారం అని ధర్మశాస్త్రాలు అంటాయి.

మరి శూద్రులు? శూద్రులు ద్విజులు కారు కాబట్టి పైన పేర్కొన్న అర్హతలు, హక్కులు, అధికారాలు, జీవన మార్గాలు వాళ్ళకు నిషిద్ధం. శూద్రులు ఎట్లా బ్రతకాలంటే అగ్రవర్ణాలకు సేవలు చేయడం ద్వారా అని శాస్త్రాలు చెప్తాయి. అందుకోసమే దేవుడు శూద్రులను సృష్టించాడంటాయి.

ఇక్కడ చెప్పుకోవలసిన విషయం ఏమిటంటే ఈ సాంఘిక ఆర్థిక జీవన నియమాలను తుచ తప్పక అమలు చేయించడం రాజ్యాంగ యంత్రానికి వుండే ప్రధాన కర్తవ్యం. సాంఘిక ఆర్థిక వ్యత్యాసాలు వుండడం భారతదేశం ప్రత్యేకత కాదు, హైందవ నాగరికతకున్న విశిష్టత కాదు. అన్ని దేశాలలో అన్ని కాలాలలో వుంది. ఈ వ్యత్యాసాలు అన్ని దేశాలలోనూ ఎక్కువ భాగం వంశపారంపర్యంగానే సంక్రమించాయి. అయితే ఇక్కడ అవి పుట్టుకతోనే సంక్రమించే తప్పనిసరి అయిన వర్ణధర్మాలు. ఈ వ్యత్యాసాలు ఏదో ఒక రూపంలో చట్టాలలో చోటు చేసుకోవడం, చట్టం పేరిట, న్యాయం పేరిట రాజ్యవ్యవస్థ చేత అమలు పరచబడడం అన్ని దేశాలలోనూ చూస్తాం. కానీ ఇక్కడ ఈ ధర్మమే ప్రధానమైన చట్టం. అదే మళ్ళీ అందరి పవిత్ర పారలౌకిక కర్తవ్యం. అదే లౌకిక నీతి. అదే దైవాజ్ఞ. దీనిని

అమలు పరచడం రాజుకూ, రాజ్య వ్యవస్థకూ, రాజ్యాంగ యంత్రానికీ వుండే ముఖ్య కర్తవ్యం. ఆర్థిక అవకాశాలలో హెచ్చుతగ్గులు అన్ని నాగరికతలలోనూ వున్నాయి. కానీ ఆర్థిక స్వేచ్ఛపైన పరిమితి (ఇది కూడ అన్ని నాగరికతలలోనూ కొంత మేరకు ఉన్నప్పటికీ) ఇంత సంపూర్ణంగా పెట్టిన దేశం మరొకటి ప్రపంచంలో లేదు. ఆస్తిలేని వాళ్ళు మరొకరి దగ్గర కూలి చేసుకొని బ్రతకక తప్పదు. ఇది అవకాశానికి సంబంధించిన విషయం. అయితే 'సవర్ణులకు సేవ చేయమని శూద్రులను నిర్బంధించవచ్చును. ఎందుకంటే బ్రాహ్మణులకు బానిసగా బ్రతకమనే స్వయంభువు (బ్రహ్మ) వాళ్ళను సృష్టించాడు' అని మనువు అంటాడు. ఇది గుణాత్మకంగానే భిన్నమైన స్థితి. తన వర్ణ ధర్మాన్ని కాదనకుండ పాటించే శూద్రుడు ఒక్కొక్క మెట్టుగా ఒక్కొక్క జన్మలో కొంచెం హెచ్చు కులంలో పుడతాడని ఆపస్తంబుడు అనగా, అందుకు భిన్నంగా ప్రవర్తించే శూద్రుడు చనిపోయిన తరువాత పురుగులను తినే ప్రేతంగా మారుతాడని మనువు అంటాడు. ఈ బెదిరింపు సరిపోతుందన్న నమ్మకం ఆ మహానుభావుడికి లేదు కాబట్టి రాజ్యవ్యవస్థ బల ప్రయోగంతో ఎవరికి కేటాయించిన సాంఘిక ఆర్థిక పాత్రను వారు నిర్వర్తించేటట్టు చూడాలని నొక్కి చెప్తాడు. అగ్రకులాల వృత్తులను ఆచరించే క్రింది కులాలవారి ఆస్తులను రాజు జప్తు చేసుకొని వారిని రాజ్యం నుండి బహిష్కరించాలని మనుధర్మ శాస్త్రం అంటుంది. లేకపోతే 'యాజమాన్యం అనే మాటకే అర్థం లేకుండ పోతుంది. పైవాళ్ళ స్థానాన్ని కింది వాళ్ళు ఆక్రమించుకుంటారు' అని ఆందోళన వ్యక్తం చేస్తాడు. నారద స్మృతికారుడు ఇంకొంచెం స్పష్టంగా, 'రాజు తగిన రూపంలో దండించకపోతే వైశ్యులు పనిచేయడం మానేస్తారు. శూద్రులు అందరినీ మించిపోతారు' అంటాడు. ఆర్థిక అసమానతలను కాపాడడంలో బ్రాహ్మణీయ రాజ్యానికుండే దండనాధికారానికి ఇంత స్పష్టమైన పాత్ర ఉండింది.

అయితే ఈ నియమాలను ఎంతవరకు వాస్తవంగా అమలు చేయగలిగారనేది వేరే ప్రశ్న. అమలు చేయడంలో వున్న ఒక సమస్యను గత ఆధ్యాయాలలో ప్రస్తావించాము. ఆధునిక రాజ్యాలే తమ చట్టాలను సంపూర్ణంగా అమలు చేయలేకున్నాయి. ఆధునిక రవాణా ప్రసార సాధనాలు అందుకు కావలసిన అవకాశం కల్పిస్తాయి. పైగా ఆధునిక రాజ్యాలకుండే ఆయుధ శక్తి ముందు

పౌరుల బలం చాలా అల్పమయినది. ప్రాచీనకాలం లోనూ, మధ్యయుగాలలోనూ రాజ్యానికి ఈ రెండు సౌకార్యాలూ లేవు.

ఇది సాధారణ సమస్య కాగా ఉత్పత్తి వ్యవస్థకు సంబంధించినంత వరకు వేరే సమస్యలున్నాయి. బ్రాహ్మణులు విద్యాబోధన చేసి, పౌరోహిత్యం చేసి, దానాలు స్వీకరించి పొట్టపోసుకోవాలని ధర్మశాస్త్రాలు చెప్తాయి. కానీ వీటితో పొట్టనిండని వాడు ఏంచేయాలి? ఏలడానికి రాజ్యాలు లేని క్షత్రియులు ఏం చేసి జీవనం సంపాదించుకోవాలి? అందరికీ ఎల్లవేళలా సైనికులుగా ఉద్యోగం దొరకక పోవచ్చు కదా? పశుపోషణ చేయడానికి పశువులు లేకపోతే, వ్యవసాయం చేయడానికి భూమి లేకపోతే, వ్యాపారం చేయడానికి పెట్టుబడి లేకపోతే వైశ్యుడేం తిని బ్రతకాలి?

కూలి దొరకకపోతే శూద్రులేం చేయాలని కూడ అడగొచ్చు. కాని బ్రాహ్మణ ధర్మ శాస్త్రకారులు ఆ ప్రశ్న వేసుకోలేదు. పై ప్రశ్నలు మాత్రం వేసుకున్నారు. ధర్మశాస్త్రాల ప్రకారం బ్రతకలేని సవర్ణులకు 'ఆపద్ధర్మం' పేరిట మినహాయింపులిచ్చారు. బ్రాహ్మణులు ఎవరి చేనిలో అయినా కంకులు ఏరుకొని తినవచ్చుననీ, ఎవరిదీ కాని వస్తువేదయినా స్వంతం చేసుకోవచ్చుననీ ఆపస్తంబ ధర్మసూత్రం అంటుంది. దానితో సరిపెట్టుకోలేకపోతే బ్రాహ్మణులు వైశ్యుల కులధర్మమైన 'వ్యవసాయం, వ్యాపారం' కూడ చేయవచ్చునని గౌతముడు అంటాడు. అయితే బ్రాహ్మణుడు శ్రమ మాత్రం చేయకూడదంటాడు. అంటే నాగలి పట్టకుండ వ్యవసాయం చేయవచ్చు, అంగట్లో కూర్చోకుండ వర్తకం చేయవచ్చునని ! అప్పుడు 'ధర్మం' దెబ్బతినకుండ బ్రాహ్మణుల బ్రతుకు గడుస్తుందంటాడు. బ్రాహ్మణులు వడ్డీ వ్యాపారం సహితం చేయవచ్చునని గౌతముడు అంటాడు.

క్షత్రియులకు కూడ ఇటువంటి 'ఆపద్ధర్మ' అవకాశాలు వర్తిస్తాయి. వారికిచ్చిన అవకాశం ఏమిటంటే వైశ్య ధర్మమయిన వ్యాపారాన్నీ, వ్యవసాయాన్నీ చేపట్టడం. బ్రాహ్మణులకున్నట్టు చేతికి మట్టి అంటకూడదన్న నియమం క్షత్రియులకు లేదు. వాళ్ళు యధేచ్ఛగా వైశ్యులలాగ బ్రతకవచ్చునని వశిష్టుడు అంటాడు.

ఈ విధంగా బ్రాహ్మణులు, క్షత్రియులు ఆపద్ధర్మం పేరిట వ్యవసాయ వ్యాపార రంగాలలోకి దిగి పోటీకి రావడం వల్లగానీ ఇతరత్రా గానీ తమ వర్ణధర్మం భుక్తికి సరిపోని వైశ్యులు ఏమి చేయాలి? వాళ్ళు శ్రమశక్తిని అమ్ముకొని – అంటే కూలి చేసుకొని – శూద్రులలాగ బ్రతకవచ్చునని గౌతముడంటాడు. కానీ ఈ విధంగా పైవాళ్ళు ఒక్కొక్కరూ ఆపద్ధర్మం పేరిట కిందివాళ్ళ వృత్తులలోకీ, జీవన విధానంలోకీ చొరబడుతుంటే శూద్రుల గతి ఏం కావాలి? వాళ్ళు మాత్రం తప్పక 'సవర్ణుల దగ్గర కూలి చేసుకొని బ్రతకడం' అనే తమ ధర్మాన్ని ఆచరించాలి. వారికి మినహాయింపు లేదని వశిష్ఠ, విష్ణు శాస్త్రకారులంటారు. అంటే చాలా కఠోరంగా కనిపించే వర్ణధర్మం కిందివాళ్ళ పట్ల ఉన్నంత కఠోరంగా పైవాళ్ళ పట్ల లేదు. పై వాళ్ళకు ఆపద్ధర్మం పేరిట మినహాయింపులిచ్చింది. కాని కిందివాళ్ళకు ఏ మినహాయింపూ లేదు. 'సవర్ణులకు సేవచేయడం అనే ఒకే ఒక్క ధర్మాన్ని బ్రహ్మ శూద్రులకు కేటాయించాడు' అని మనువు అంటాడు. దీనికి తిరుగులేదు. ఏకపక్షమైన ఈ కఠోర నియమాలను బలప్రయోగంతో అమలు చేయడం బ్రాహ్మణీయ రాజ్యాంగ యంత్రం కర్తవ్యం.

అయితే వర్ణధర్మ నియమాలను ఆర్థిక జీవితానికీ, ఉత్పత్తి రంగానికీ వర్తింపజేయడంలో ఇంకొక సమస్య వుంది. వర్ణధర్మం మార్పులేనిది. అది ఆది పురుషుడి సృష్టి, కాని ఆర్థిక జీవితం నిత్యం మారుతుంటుంది. కొత్తరకాల ఉత్పత్తులు పుడతాయి. కొత్త అవసరాలను కల్పిస్తాయి. కొత్త ఉత్పత్తి ప్రక్రియలు ముందుకొస్తాయి. శ్రమ విభజన ద్వారా ఉత్పత్తిలో వైవిధ్యం పెరుగుతుంది. ఈ మార్పులన్నీ ఉత్పత్తి రంగానికి సంబంధించినవి కాబట్టి ఇవి శూద్ర వర్ణాన్ని బలంగా ప్రభావితం చేశాయి. ఒక్క శూద్ర వర్ణం స్థానంలో అనేక శూద్ర కులాలు వచ్చాయి. వీళ్ళు అందరూ సవర్ణుల దగ్గర కూలి చేసుకొని బ్రతికే సేవకులు కారు. వ్యవసాయం విస్తరించిన క్రమంలో శూద్ర కూలీలు వ్యష్టిగానో సమిష్టిగానో భూమిపైన యాజమాన్యం పొందారు. భూమిలేని కూలీలను అడవులలోకి పంపించి అడవి నరికి వ్యవసాయం చేయమని ప్రోత్సహించడం మౌర్యుల కాలంలో రాజులు ఒక విధానంగానే అమలు చేశారు. వాళ్ళు ఆ తరువాత రైతులుగా స్థిరపడ్డారు. హైందవ రాజులు చుట్టుప్రక్కల వున్న ఆదివాసీ తెగలను జయించి తమ రాజ్యాలలో

కలుపుకున్న క్రమంలో అప్పటికే భూమిపైన ఏదో ఒక రూపంలో యాజమాన్యపు హక్కు వున్న పరాజితులు 'శూద్ర' వ్యవసాయదారులుగా హైందవ సమాజంలో వచ్చి చేరారు. వ్యవసాయేతర రంగాలలో కొత్తరకం ఉత్పత్తులనూ, కొత్త ఉత్పత్తి ప్రక్రియలనూ ఆవిష్కరించిన కార్మికులు కూలివాళ్ళుగా కాక స్వతంత్ర వృత్తికారులుగా తమ మనుగడను సాధించుకోవడం మొదలుపెట్టారు. గౌతమ ధర్మసూత్రంలోనే ఈ విషయానికి గుర్తింపు వుంది. శూద్రులు సవర్ణుల సేవకులుగానే కాక వృత్తి పనివారిగా కూడ బ్రతకవచ్చునని గౌతముడు అంటాడు. తరువాతి కాలంలో పెరుగుతున్న శ్రమ విభజన ఫలితంగా ఇది పెద్దఎత్తున జరిగి వుంటుంది.

అంటే వర్ణధర్మం శూద్రులకు ఇవ్వడానికి ఇష్టపడని మినహాయింపునూ స్వేచ్ఛనూ ఆర్థిక పురోగమనం కల్పించింది. మౌర్యుల కాలంలో మొదలయిన ఈ మార్పు గుప్తుల కాలం నాటికి చాలా దూరం పోయిందని చరిత్రకారులు భావిస్తారు. శూద్రులు అంటే కూలివాళ్ళు, బానిసలు, సేవకులు అన్న భావనపోయి 'వ్యవసాయదారులు, వృత్తిపనివారు' అనే అర్థం వచ్చింది. ప్రధానంగా కూలివాళ్ళయిన పంచముల ఆవిర్భావం ఈ దశలోనే జరిగింది. వైశ్యుల ధర్మం 'వ్యవసాయం, వర్తకం' అన్న భావనపోయి వైశ్యులు ప్రధానంగా వ్యాపారస్తులుగా మిగిలారు.

మౌర్యుల కాలం నుండి గుప్తుల కాలం దాకా ఈ మార్పు జరిగిందన్నాం కదా. ఇంకొక రకంగా చెప్పాలంటే తొలి ధర్మసూత్రాల నుండి చివరి ధర్మశాస్త్రాల దాకా అనవచ్చు. ఈ మార్పు ఫలితంగా శూద్రుల స్థితిగతులు మారడమేగాక సామాజిక సంపద చాలా పెరిగింది. పెరిగిన సామాజిక సంపదను క్షత్రియ బ్రాహ్మణ వర్ణాలకు చేరవేయడంలో రాజ్యాంగ యంత్రం నిర్వహించిన పాత్రను బ్రాహ్మణ ధార్మిక సాహిత్యంలో చూడవచ్చును. క్షత్రియ ధర్మంలోనూ బ్రాహ్మణ ధర్మంలోనూ మార్పు వచ్చినట్టు ధర్మశాస్త్రాలు ఎక్కడా చెప్పవు. వర్ణ ధర్మం అనాది అనీ మార్పుకు అతీతం అనీ నమ్మడం దాని సాధికారతకూ బలానికీ చాలా అవసరం. మార్పేమీ లేదంటూనే మార్పుకు చోటు కలిగించడం ధర్మశాస్త్రాల ప్రత్యేకత.

పరిపాలించడం, యుద్ధాలు చేయడం క్షత్రియ ధర్మాలు. వాళ్ళ పరిపాలన 'ప్రజలందరికీ భద్రతను' ఇస్తుంది కాబట్టి ప్రజలు పన్నుల రూపంలో ప్రతిఫలం ఇవ్వాలి. రాజ్యాంగ యంత్రం సేకరించే ఈ పన్నులే రాజులకూ రాజన్యులకూ సంపదను సమకూర్చిపెట్టాయి. వ్యవసాయం విస్తరించి ఉత్పత్తి వైవిధ్యమూ, సామర్థ్యమూ పెరిగిన క్రమంలో పన్నుల రూపంలో పాలకులు చాలా సంపదను చేజిక్కించుకున్నారు.

బ్రాహ్మణుల నుండి రాజ్యాంగం ఏ రకమైన పన్ను వసూలు చేయకూడదని ఆపస్తంబుడూ, వశిష్ఠుడూ, మనువూ స్పష్టం చేస్తారు. 'బ్రాహ్మణులు చేసే పుణ్యకార్యాలే రాజుకు వాళ్ళు చెల్లించే పన్ను. వాళ్ళ నుండి వేరే పన్ను వసూలు చేయనవసరం లేదు' అని విష్ణు ధర్మశాస్త్రం అంటుంది. 'ప్రజలు చేసే పుణ్యకార్యాలలోనూ పాపకార్యాలలోనూ ఆరవ భాగం రాజుకు చెందుతుంది' అని వశిష్ఠుడు అంటాడు. బ్రాహ్మణులు చేసేవన్నీ పుణ్యకార్యాలే కాబట్టి వాళ్ళు అదనంగా పన్నేమీ చెల్లించనవసరం లేదనుకోవాలి. పాపకార్యాలు చేసే వైశ్యులు, శూద్రులు మాత్రమే పన్ను చెల్లించాలి. వీళ్ళు చెల్లించే అదనపు సంపద మీదనే రాజు బ్రతుకుతాడు.

వ్యవసాయ ఉత్పత్తిలో ఆరవ వంతు రాజుకు పన్నుగా చెల్లించాలనేది ప్రాచీన కాలం నుండి వున్న నియమం. అది కాక పశువులు, పండ్లు, పూలు, మాంసం, బంగారం, వంటచెరకు, చివరకు గడ్డిలో కూడ వైశ్యులూ శూద్రులూ రాజుకు వాటా ఇవ్వాలి. గ్రామ ముఖ్యుడి ద్వారా ఇవన్నీ సమర్పించుకోవాలి. అన్నిటిలోనూ ఆరవవంతు వాటా రాజుకు చెందుతుంది కానీ పశుసంపదలోనూ, బంగారంలోనూ వచ్చిన పెరుగుదలలో 50వ వంతు రాజుకివ్వాలి. వృత్తి పని వాళ్ళు మట్టితో, రాతితో, వెదురుతో, తోలుతో చేసే వస్తువులలో కూడ ఆరవవంతు పన్ను రూపంలో రాజ్యానికి చెల్లించాలి. రాజులూ, రాజాస్థాన వాసులూ, అధికార గణం ఈ సంపదను అనుభవించేవారు. ఈ విధంగా వ్యవసాయం, వర్తకం, అన్నిరకాల శ్రమచేసే వైశ్య శూద్ర ప్రజానీకం నుండి పెద్ద మొత్తంలో అదనపు ఉత్పత్తిని రాజ్యాంగ యంత్రం ద్వారానే పాలకవర్గం సేకరించి అనుభవించేది. ఒక్క బ్రాహ్మణుల ఆస్తి తప్ప వేరే ఎవ్వరి ఆస్తినయినా రాజు స్వాధీనం చేసుకోవచ్చునని కూడ మహాభారత శాంతిపర్వం అంటుంది.

వ్యవసాయం అభివృద్ధి చెందే కొద్దీ భూమి ఒక ముఖ్య ఉత్పత్తి సాధనం అయింది. సంపద అయింది. బ్రాహ్మణులు రాజుల వద్దనుండి పెద్దయెత్తున భూదానాలు పొందసాగారు. భారతదేశంలో భూమిపైన వ్యక్తి యాజమాన్యం ఈ విధంగానే మొదలయిందని చాలామంది చరిత్రకారుల అభిప్రాయం. 'విద్యాబోధ, పౌరోహిత్యం, దానాలు స్వీకరించడం' అనే మూడు జీవన మార్గాలను ధర్మశాస్త్రాలు బ్రాహ్మణులకు నిర్దేశించాయని చెప్పాము. ఇప్పుడు దానం పేరిట పెద్దయెత్తున వాళ్ళు భూదానాలు పొందసాగారు. మారిన పరిస్థితులలో వర్ణధర్మాన్ని ఏమాత్రం మార్చనవసరం లేకుండ కొత్త సంపదను బ్రాహ్మణులు చేజిక్కించుకున్నారు. 'చేతికి మట్టి అంటకుండ వ్యవసాయం చేయవచ్చు'నని ఒక ఆపద్ధర్మంగా బ్రాహ్మణులకు ధర్మశాస్త్రాలు ఇచ్చిన అవకాశం ఈ విధంగా బ్రహ్మదేయాలు (అగ్రహారాలు) స్వీకరించి భూస్వాములు కావడానికి ఉపయోగపడింది. చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే ఈ భూదానాలు రాజ్యాంగయంత్రం ద్వారానే పొందారు. ధర్మశాస్త్రాల ప్రకారం రాజ్యంలోని భూమికంతా రాజే యజమాని అనే అభిప్రాయం కొంతమంది చరిత్రకారులు వ్యక్తం చేశారు. దానితో విభేదించేవారు కూడ వున్నారు. ఏది ఏమైనా నిరాటంకంగా భూదానాలు చేసే అధికారాన్ని రాజులు ప్రకటించుకున్నారు. భూదానాలు చేశారు. రాజుకు భూపతి, మహీపతి అని పేర్లు వచ్చాయి. దీనివల్ల మొట్టమొదట ప్రయోజనం పొందినది బ్రాహ్మణులు. ఆ తరువాత ఇతర ప్రభుత్వ అధికార్లకు కూడ జీతాల బదులు భూదానాలు ఇవ్వడం మొదలయింది. ఈ విధంగా దానం పొందిన భూమిలో అంతకుముందే కొందరు రైతులు సాగుచేసుకుంటూ ఉండవచ్చును. లేదా కొత్తగా సాగుదార్లను నియమించవచ్చును. ఈ రైతులు (కర్షకులు) సాగుదార్లుగా వుంటూ ఆ భూమిని దానం పొందిన యజమానికి (క్షేత్రస్వామికి) కౌలు చెల్లించాలి. వాళ్ళు ఎన్ని సంవత్సరాలుగా అప్పటికే ఆ నేలలో సాగుదార్లుగా వున్నా వారి హక్కు భూదానం పొందిన క్షేత్రస్వామి హక్కుకు అడ్డం రాదు. దానికి లోబడే వుంటుంది. ఒకరు ఒక వస్తువును నిరాటంకంగా పది సంవత్సరాలు అనుభవిస్తే అది వారిదే అయిపోతుందని కౌటిల్యుడూ, గౌతముడూ అంటారు. కానీ ఇది భూమికి వర్తించదని గౌతముడు స్పష్టం చేస్తాడు. వశిష్ఠుడు అన్నిరకాల భూమికీ మినహాయింపు ఇవ్వడు కానీ

బ్రాహ్మణులు దానం పొందిన శ్రోత్రియం భూములకు మినహాయింపు ఇస్తాడు. భూముల కాడికి - లేక శ్రోత్రియం భూముల కాడికి - వచ్చేసరికి బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులు ఏమంటారంటే భూమిని మూడుతరాలు గానీ అనుభవించి వుంటే నాలుగవ తరానికి యాజమాన్యం హక్కు లభిస్తుందని. దీనిని రుజువు చేయడం కష్టం కాబట్టి దీని అర్థం ఏమిటంటే రాజు దగ్గర భూదానం పట్టా పొందితే ఆ భూమిపైన ఎంతమంది రైతులు ఎంతకాలంగా శ్రమిస్తున్నా ఫరవాలేదు. యాజమాన్యం భూదానం పొందిన వాడిదే అవుతుంది.

ఈ విధంగా, మారిన ఆర్థిక పరిస్థితులలో క్షత్రియులూ బ్రాహ్మణులూ ఏకమై రాజ్యాంగ యంత్రాన్ని అడ్డం పెట్టుకొని అపూర్వంగా పెరిగిన సామాజిక సంపదను స్వంతం చేసుకున్నారు. ఈ దోపిడీని ధర్మశాస్త్రాలు సిద్ధాంతీకరించాయి.

క్షేత్రస్వామి-కర్షకుడు, కర్షకుడు- కూలీ అనే వర్గాల మధ్యనున్న వైరుధ్యాల విషయంలో కూడ ధర్మశాస్త్రాలు ఆధిపత్యవర్గాలకే అనుకూలంగా మాట్లాడతాయి. భూమిని కౌలుకు తీసుకున్న కర్షకుడు ఏ కారణం చేతనయినా సరే దానిని సాగు చేయనట్లయితే, ఒకవేళ సాగుచేసి వుంటే ఎంత ఫలం వచ్చేదో అంతమొత్తం భూస్వామికి చెల్లించాలని యాజ్ఞవల్క్యుడు, బృహస్పతి అంటారు. కూలివాడు కూలి డబ్బులు తీసుకొని పని సరిగ్గా చేయకపోతే అతను పని ముగించేంత వరకు నిర్బంధించాలనీ, జుర్మానా వసూలు చేయాలనీ కౌటిల్యుడు అంటాడు. పని అసలే చేయకపోతే కూలి డబ్బులు యజమానికి వెనక్కి ఇవ్వడమే కాక రాజుగారికి 100 పణముల జుర్మానా చెల్లించాలని విష్ణుస్మృతి అంటుంది. పశువుల కాపరి పశువులను సరిగ్గా కాయకపోతే కొరడా దెబ్బలు వేయాలని ఆపస్తంబుడు అంటాడు. 'పొగరుబోతుతనం'వల్ల పని ఎగ్గొట్టే కూలివాడు జీతం వదులుకోవడమే కాక జుర్మానా చెల్లించాలని మనువు అంటాడు. జీతం తీసుకొని పనిచేయని కూలివాడు తాను తీసుకున్న జీతానికి రెండు రెట్లు యజమానికి తిరిగి ఇవ్వాలని యాజ్ఞవల్క్యుడు అంటాడు. ఒప్పుకొన్న పనిలో కొంత భాగం చేయడంలో విఫలమైనా సరే మొత్తం జీతం వదులుకోవాలని బృహస్పతి అంటాడు. నౌకరు తాను మొదలుపెట్టిన పనిని పూర్తిచేయకపోతే రాజు యజమాని తరపున జోక్యం చేసుకొని బలప్రయోగంతో పూర్తి చేయించాలని కాత్యాయనుడు అంటాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులకు కూలివాళ్ళపైన బొత్తిగా దయలేదు.

మరి ఆస్తి సంబంధాల విషయంలో మెచ్చుకోదగ్గ అంశాలేవీ ధర్మశాస్త్రాలలో లేవా అంటే వున్నాయి. ఎవరి వస్తువయినా దొంగల పాలయితే, దానిని ప్రభుత్వం వెతికి ఇవ్వలేని పక్షంలో దాని మూల్యం చెల్లించి ఇవ్వాలని మనుధర్మశాస్త్రం అంటుంది. గ్రామాలనూ, పట్టణాలనూ సంరక్షించడం రాజ్యం ధర్మం కాబట్టి అందులో విఫలమైతే, దానివల్ల జరిగిన నష్టానికి పూర్తి పరిహారం రాజ్యమే కట్టి ఇవ్వాలని అంటుంది. తొలినాటి ఆపస్తంబ ధర్మసూత్రంలో ఇది ఆ కాపలాదార్ల వ్యక్తిగత బాధ్యత కాగా, మనువు కాలానికి రాజ్యం బాధ్యత అయింది. పోలీసుల వైఫల్యానికి ప్రభుత్వం ప్రజలకు నష్టపరిహారం కట్టివ్వాలనే సాధారణ సూత్రం ఈనాటికీ ఆహ్వానించదగ్గదే. ఒక్క ఆస్తి నష్టానికే కాక ఇతర విషయాలను కూడ దీనిని వర్తింపజేయగలిగితే (ఇప్పటి చట్టాలలో ఆస్తినష్టానికి సహితం ఈ నష్టపరిహార సూత్రం లేదు) అది మంచి మార్పే అవుతుంది.

## 4. స్త్రీల స్థితిగతులు

వర్ణాశ్రమ ధర్మం ప్రకారం స్త్రీల స్థానం కుటుంబానికే పరిమితం అయింది. కుటుంబం బయట నడిచే జీవితంలో స్త్రీకి స్థానం లేదు. స్థానం కోరుకోవడం 'అధర్మం'. అంటే దేవుడి కళ్ళకు పాపం, చట్టం కళ్ళకు శిక్షార్హం. సాంఘిక కట్టుబాట్లను ఏకసమయంలో దైవశాసనంగానూ రాజ్యాంగ చట్టంగానూ నిర్వచించి ఇహంలోనూ పరంలోనూ శిక్ష పడుతుందని బెదిరించడం హైందవ ధర్మభావనకు ఉండే ప్రత్యేక లక్షణమని ఇదివరకే వివరించి ఉన్నాము.

అయితే వాస్తవ జీవితంలో కుటుంబం బయట వృత్తులు నిర్వహించే స్త్రీలు ఎప్పుడూ ఉండే ఉంటారు. సామాజిక ఆర్థిక ఒత్తిడులు ధర్మశాస్త్రాల నియమాలకు లోబడి ఉండవు. అటువంటి పరిస్థితుల ఉనికిని గుర్తిస్తూనే, వాటికి విచిత్రమైన కుతర్కంతో వివరణ ఇవ్వడం బ్రాహ్మణ ధర్మశాస్త్రకారుల అలవాటు. శూద్రవర్ణాలకు చెందిన స్త్రీలు ఇంటి బయట కూలి చేస్తారు. సంతలలో సరుకులు అమ్ముతారు. వేశ్యల లైంగిక జీవితం కుటుంబ నియమాలకు విరుద్ధంగా ఉంటుంది. బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు వీటిని నిషేధించవు. ఆ శూద్రుల బ్రతుకే అధర్మమైనది కాబట్టి ఆ

వర్ణానికి చెందిన స్త్రీలు, వేశ్యావృత్తిలో ఉన్న స్త్రీలు 'ధర్మవిరుద్ధంగా' (అంటే స్త్రీలు బ్రతకకూడని విధంగా) బ్రతకడంలో ఆశ్చర్యం ఏమీ లేదని వివరిస్తారు. ఆ బ్రతుకు వాళ్ళకు అనుమతించబడుతుంది–అయితే వాళ్ళ హేయమైన అధర్మ జీవితంలో భాగంగా మాత్రమే. ఆ విధంగా కుటుంబం బయట బ్రతికే స్వేచ్ఛ లేక అవకాశం అగౌరవపరచబడతాయి. గౌరవనీయులైన స్త్రీలకు ఆ స్వేచ్ఛ, అవకాశం ఉండవు. అంటే గౌరవనీయులైన స్త్రీలు వాటిని కోరుకోకూడదు. కాబట్టి వాటిని కోరుకునే స్త్రీలు గౌరవనీయులు కారు.

ఉదాహరణకు హైందవ ధర్మశాస్త్రాలు గుర్తించే ఎనిమిది రకాల వివాహాలలో ఒక్క గాంధర్వ వివాహం మాత్రమే (ఈనాటి పరిభాషలో దీనిని ప్రేమ వివాహం అనవచ్చు) స్త్రీ పురుషులకు సమాన ప్రతిపత్తి ఇస్తుంది. దానికి ఒకవైపు (మగవాళ్ళు) బలాత్కారంగా చేసుకునే పెళ్ళిళ్ళు ('రాక్షస', 'పైశాచ' వివాహాలు), మరొకవైపు మగవాడు అమ్మాయి తండ్రికి డబ్బిచ్చి ఆమెను కొనుక్కునే పెళ్ళిళ్ళు ('అసుర' వివాహాలు), మగవాడికి కర్మకాండ నిర్వహణ కోసం, పుత్రప్రాప్తి కోసం, ఇతర ధార్మిక అవసరాల కోసం ఒక భార్య కావాలి కాబట్టి ఆ పాత్ర నిర్వహించే 'సహ ధర్మచారిణి'ని తెచ్చుకునే పెళ్ళిళ్ళు (బ్రహ్మ, ప్రజాపత్య, ఆర్ష, దైవ వివాహాలు) ఉన్నాయి. గాంధర్వం తప్ప తక్కిన వివాహ రూపాలన్నిటికీ మగవాడి అవసరం కేంద్రం. ఆ అవసరాన్ని బట్టి, దానిని అమలు చేసుకునే శక్తిసామర్థ్యాలను బట్టి ఆ వివాహ రూపాలు నిర్వచించబడ్డాయి. స్త్రీ పురుషులకు సమాన ప్రతిపత్తినిచ్చే గాంధర్వాన్ని కేవలం శూద్రులకు తగినదిగా ధర్మశాస్త్రాలు నిర్వచిస్తాయి. వాళ్ళు శూద్రులు కాబట్టి అటువంటి హీనపద్ధతులలో పెళ్ళిళ్ళు చేసుకోవచ్చునంటాయి. సేద్యగాళ్ళు, కూలివాళ్ళు మొదలయిన నికృష్ట జీవులకు గాంధర్వ వివాహం ఉచితమేనని మనువు, బౌధాయనుడు అంటారు. శూద్రులు గాంధర్వ వివాహం చేసుకుంటే 'వాళ్ళు శూద్రులు కాబట్టి చేసుకుంటారు' అని ధర్మశాస్త్రాలు అంటాయి. ద్విజులు చేసుకుంటే 'శూద్రులు చేసే పని చేశారు మీరు' అని ఈసడిస్తాయి.

అంటే మగవాడి అవసరం నుండి పుట్టే వివాహ రూపాలను తిరస్కరించి ఇద్దరి అవసరాలకూ సమాన ప్రతిపత్తి కల్పించే వివాహ రూపాన్ని ఆశ్రయించడం సాంఘికంగా (అప్పటి పాలక నీతి ప్రకారం) నికృష్టమైన పని అనీ నికృష్టజీవులు

ఆచరించే హీన ధర్మమనీ అగౌరవపరిచారు. అదే విధంగా శూద్రస్త్రీలు కుటుంబ సేవకు పరిమితం కాకుండ బయటకు పోయి పనిచేస్తే 'వాళ్ళు శూద్రులు కాబట్టి చేస్తారు' అనీ అగ్రవర్ణ స్త్రీ అదే పనిచేస్తే 'నువ్వు శూద్రులు చేసే పనిచేశావు' అనీ ధర్మశాస్త్రాలు దానిని అగౌరవపరుస్తాయి. అగ్రవర్ణ స్త్రీ తన గౌరవాన్ని కాపాడుకోవాలంటే హక్కులు వదులుకోవాలి. శూద్ర స్త్రీ సాంఘికంగా గౌరవం పొందాలంటే తన నికృష్ట జీవితానికి అనుమతించబడిన స్వేచ్ఛను వదులుకొని ఆర్యస్త్రీని బానిసత్వంలో అనుకరించాలి. మనం కోరుకునే హక్కులను సాంస్కృతికంగా, నైతికంగా అగౌరవపరచడం ఒక అణచివేత రూపం అని వేరే చెప్పనవసరం లేదు. స్త్రీలు ఆనాడైనా ఈనాడైనా ఎదుర్కొనే ముఖ్యమైన అణచివేత రూపాలలో ఇది ఒకటి. బ్రాహ్మణ ధర్మశాస్త్రాలు దీనిని సిద్ధాంతీకరించాయి. స్త్రీకి స్వేచ్ఛ, సమానత్వం కల్పించే లక్షణం ఏదయినా 'శూద్ర ధర్మమే.' (శూద్రుల బ్రతుకే అధర్మం కాబట్టి అదొక ధర్మమే కాదు). అట్లా అనడం ద్వారా ఆ స్వేచ్ఛనూ సమానత్వాన్నీ ద్విజులు ఆచరించినా శూద్రులు ఆచరించినా అది అధికార భావజాలంలో అగౌరవపరచబడింది. (దీని అర్థం శూద్ర స్త్రీలు స్వేచ్ఛగా సమానంగా ఉన్నారని కాదు. ఆ లక్షణం ఏ కొంచెం ఉన్నా అది శూద్ర లక్షణం అని ప్రకటించడం ద్వారా అధికారికంగా అగౌరవపరచబడిందని మాత్రమే).

వివాహానికి సంబంధించిన మగవాడి అవసరం బ్రాహ్మణీయ సిద్ధాంతంలో అతడి వర్ణాన్ని బట్టి నిర్వచించబడింది. ఏ వివాహరూపం ఏ వర్ణానికి ఉచితం అనేది ఈ అవసరాన్ని బట్టి వుంటుంది. బ్రాహ్మణ పురుషుడికి భార్య కావలసింది కర్మకాండ నిర్వహించడానికీ స్వర్గలోక ప్రాప్తికీ అవసరమైన కొడుకును కనడానికి. అందువల్ల బ్రాహ్మణులకు తగిన వివాహరూపాలు బ్రహ్మ, ప్రజాపత్య, ఆర్ష, దైవాలు. క్షత్రియుడికి కూడ ఇవి అనుమతించిన రూపాలే కానీ అతడికి మనువు రాక్షస వివాహ పద్ధతి కూడ అనుమతించాడు. నిజానికి రాక్షసం ఒక్క క్షత్రియులకు మాత్రమే అనుమతించబడింది. ఈ వివాహ పద్ధతిలో మగవాడు అమ్మాయిని ఆమె ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండ బలవంతంగా ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకోవచ్చు. మగవాడి 'మగతనానికి' స్త్రీపైన ప్రయోగించే హింస ఆనాడూ ఈనాడూ ఒక కొలబద్దగానే వుంది. ఆ 'మగతనం' క్షత్రియ వర్ణ ధర్మానికి తప్పనిసరి

అయిన లక్షణం కాబట్టి స్త్రీని బలాత్కారంగా అపహరించి పెళ్ళి చేసుకునే రాక్షస వివాహం క్షత్రియులకు ధర్మ వివాహమే అయింది.

సారాంశంలో, వర్ణ ధర్మం నుండి మగవాడికి పుట్టే అవసరాలు వివాహ రూపాలలో ధార్మికతకు ప్రాతిపదిక అయ్యాయి. స్త్రీ ఈ అవసరాలకు లోబడి ఒక సాధనంగా ఆ సంబంధంలోకి ప్రవేశిస్తుంది. దీనికి గల ఒకే ఒక మినహాయింపయిన ప్రేమ వివాహాన్ని ధర్మశాస్త్రకారులు నిషేధించలేదు కానీ, అది 'శూద్ర సంస్కృతి' అని ఈసడించారు. తద్వారా అగ్రవర్ణాలకు అది తగనిది అనే అభిప్రాయం కలిగించారు. ఆ పనిచేసే శూద్రులకు ఒక తక్కువ పని చేస్తున్నామన్న న్యూనతా భావాన్ని కల్గించారు.

కుటుంబ జీవితానికి మాత్రమే పరిమితం చేయబడిన స్త్రీ ఆ కుటుంబ జీవితంలో కూడ సంపూర్ణంగా మగవాడి నియంత్రణలోనే బ్రతకాలని ధర్మశాస్త్రాలు నిర్దేశించాయి. ఆ నియంత్రణకు అవసరమయిన నియమాలను ప్రకటించాయి. ఈ నియమాలు స్త్రీ లైంగిక జీవితంపైన, ఆర్థిక జీవితంపైన మగవాడి నియంత్రణను నెలకొల్పుతాయి. ఈ రెండు రకాల నియంత్రణలో ఏది ప్రధానం, ఏది దేనికి ప్రాతిపదిక, అసలు ఈ నియంత్రణను మగవాళ్లు నెలకొల్పడం వెనుకనున్న కారణాలేమిటి అనే విషయాల గురించి మార్క్సిజంలోనూ ఫెమినిజంలోనూ చాలా చర్చ జరుగుతూ వుంది. ఆ చర్చ వివరాలలోకి పోకుండ ఈ నియమాల స్వభావాన్నీ, అవి స్త్రీల హక్కులపైన పెట్టిన పరిమితులనూ, ప్రయోగించిన అణచివేతనూ క్లుప్తంగా పరిశీలిద్దాం.

స్త్రీకి స్వతంత్రంగా బ్రతికే అర్హత లేదనీ చిన్నతనంలో తండ్రి అదుపాజ్ఞలలో, పెద్దయినాక భర్త అదుపాజ్ఞలలో, ముసలితనంలో కొడుకుల అదుపాజ్ఞలలో బ్రతకాలనీ మనువు చెప్పిన సంగతి తెలిసిందే. మనువే కాదు, బౌధాయనుడు, యాజ్ఞవల్క్యుడు, వశిష్ఠుడు, విష్ణువు, నారదుడు కూడ ఈ మాటే అన్నారు. అయితే ఆ అదుపాజ్ఞలను అమలు చేసేటప్పుడు మగవాడు నిర్దయగా వుండకూడదనీ దయ చూపించాలనీ ధర్మశాస్త్రకారులు అంటారనుకోండి. కౌటిల్యుడయితే భార్యను భర్త 'చేతితోనయినా కర్రతోనయినా తాడుతోనయినా కొట్టడం తప్పు' అంటాడు కూడ. స్త్రీలను గౌరవించే కుటుంబమే సంతోషంగా, సంపన్నంగా వుంటుందని

మనువు, యాజ్ఞవల్క్యుడు కూడ అంటారు. పాపం చేసిన భార్యను సహితం మందలించాలి తప్ప విడిచి పెట్టకూడదని వశిష్ఠ స్మృతికారుడు అంటాడు.

అయితే ఇవి మినహాయింపులు. అసలు విషయం చూసిన తరువాతే మినహాయింపులను సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాము. అసలు విషయం ఈ ప్రపంచంలో స్త్రీల పాత్ర, స్థానం, 'ధర్మం' ఏమిటి, స్త్రీల స్వభావాన్ని గురించి ధర్మశాస్త్రకారుల అభిప్రాయం ఏమిటి అనేది. ఈ విషయాన్ని ధర్మశాస్త్రాలు స్పష్టంగానే ప్రకటించాయి.

స్త్రీకి స్వతంత్రంగా కర్మలను ఆచరించే అర్హత లేదని గౌతముడు అంటాడు. కర్మలు ఆచరించడంలో భర్తకు సహకరించడం ఆమె ముఖ్య ధర్మాలలో ఒకటి. బ్రాహ్మణీయ అవగాహనలో ఏ పని చేయాలన్నా ఏ లక్ష్యం సాధించాలన్నా కర్మకాండయుతంగా చేయాలి. కాబట్టి స్వతంత్రంగా కర్మలు ఆచరించే హక్కు లేకపోవడం స్త్రీని ఆ సంస్కృతిలో అశక్తురాలిని చేస్తుంది.

భర్తకు సేవచేయడం, భర్తకు ఉపయోగపడడం స్త్రీ ప్రధాన కర్తవ్యం. ఆమెను దేవుడు అందుకోసమే సృష్టించాడు. చివరికి ఆమె సౌందర్యం కూడ భర్త కోసమే. భర్త లేని సమయంలో ఆమె సరదాగా కాలక్షేపం చేయకూడదు. అలంకరించుకోకూడదు అని విష్ణు స్మృతికారుడు అంటాడు. భర్తపట్ల విధేయురాలయి వున్న స్త్రీకి మాత్రమే పరలోకం దక్కుతుందని కూడ ఆ స్మృతికారుడే అంటాడు. 'ధర్మాన్ని అతిక్రమిస్తే మోక్షం దక్కదు' అనేది బ్రాహ్మణీయ సంస్కృతి వర్ణ ధర్మ నియమాలను అమలు చేయడానికి ప్రయోగించిన సాధారణ హెచ్చరిక. స్త్రీల మాటలు నమ్మడానికి వీలులేదనీ, కాబట్టి న్యాయస్థానంలో స్త్రీల సాక్ష్యం చెల్లదనీ నారద స్మృతికారుడు అంటాడు. స్త్రీని పొరుగింటికి పోనీయకూడదనీ తలుపు దగ్గరా కిటికీ దగ్గరా నిలబడనీయకూడదనీ విష్ణువు అంటాడు. స్త్రీలను అదుపులో వుంచడం అన్ని కులాలకూ అత్యంత ప్రధానమైన కర్తవ్యమనీ ఎంత చేతకాని మగవాడయినా తన భార్యను తప్పనిసరిగా అదుపులో వుంచుకోవాలనీ మనువు అంటాడు.

స్త్రీని ఇంతగా మగవాడికి సేవచేసే కట్టుబానిసగా మార్చడం ఎందుకు అవసరం అయింది అనే విషయంలో విభిన్న అభిప్రాయాలు వున్నాయి. తన ఆస్తి

తనకు పుట్టిన వారికే సంక్రమించాలంటే భార్యను లైంగికంగా కట్టడి చేయడం మగవాడికి అవసరం అయిందనీ, స్త్రీ స్వేచ్ఛను పూర్తిగా హరించడానికి అదే కారణమనీ కొందరు అంటుండగా, మగవాడికి శారీరక మానసిక సేవల కోసం స్త్రీ ఒక బానిసగా అవసరం అయిందనీ, అందువల్లనే ఆమె స్వేచ్ఛ పూర్తిగా కోల్పోవలసి వచ్చిందనీ మరికొందరు వాదిస్తున్నారు. స్త్రీ చేసే శారీరక శ్రమఫలాన్ని ఖర్చులేకుండ పొందడానికి మగవాడికి ఈ అధికారం అవసరం అయిందన్న వాదన కూడ ఉంది. ఈ వాదాల తప్పొప్పుల సంగతి అటుంచి, ఇంతగా స్త్రీని మగవాళ్ళ అదుపాజ్ఞలలో వుంచుకోవడాన్ని సమర్థించుకోవడానికి బ్రాహ్మణ ధర్మశాస్త్రకారులు ఉపయోగించిన వాదనలను తెలుసుకుందాం.

ఎవరినయినా ఇంతగా అదుపు చేయడం అవసరమయిందంటే వాళ్ళు చాలా నీచులు, దుర్మార్గులు అయి వుండాలి. బ్రాహ్మణ ధర్మ శాస్త్రకారులకు స్త్రీల గురించి వుండే అభిప్రాయం అదే. స్త్రీది చపలచిత్తం అనీ దయలేని మనస్సనీ నిలకడ లేని స్వభావం అనీ మనువు అంటాడు. దుర్బుద్ధి, నీచమైన కాంక్షలు, అబద్ధాలు, ఈర్ష్యాసూయలు, అలంకార ప్రీతి, ఉక్రోషం స్త్రీ సహజమైన గుణాలని అంటాడు. అన్నిటినీ మించి లైంగిక విచ్చలవిడితనం స్త్రీకి వుండే సామాన్య గుణం అని మనువు, విష్ణువు అంటారు. మగవాళ్ళను ఆకర్షించి లోబరుచుకోవడం స్త్రీలకు సంతోషం కలిగించే విషయమనీ ఆ మగవాడు కుర్రవాడా కాడా అందగాడా కాడా అని చూసేపాటి విచక్షణ సహితం స్త్రీలకు వుండదనీ ఎంతటి జ్ఞానికైనా స్త్రీలవల్ల ప్రమాదమేననీ కూడ మనువు అంటాడు. స్త్రీని సంపూర్ణంగా భర్త అదుపులో వుంచుకోవాలని భావించడానికి గల సామాజిక కారణాలు ఏవోగాని సిద్ధాంతమైతే ఇది. అంతటి చపలచిత్తను కేవలం భౌతికంగా బలప్రయోగం చేసి అదుపులో వుంచుకోవడం కష్టం కాబట్టి ఆమెకు చేతినిండా పని కల్పించాలనీ ఇంటిని శుభ్రం చేయడం, ఇంటి వస్తువులనూ సంపదనూ భద్రపరచడం, పెద్దలకు సేవలు చేయడం, వ్రతాలూ పూజలూ ఆచరించడం, వంటచేయడం, అంట్లు తోమడం మొదలయిన పనులతో ఆమెను నిరంతరాయంగా 'బిజీ'గా వుంచాలనీ మనువు, బృహస్పతీ అంటారు. స్త్రీలచేత ఈ చాకిరీ చేయించడానికి అసలు

కారణం ఇది కాకపోవచ్చు. కానీ దానిని సమర్థించే సిద్ధాంతం ఇది. ఈ సిద్ధాంతం బ్రాహ్మణీయ ధర్మశాస్త్రకారులకు స్త్రీలపట్ల వుండే వైఖరిని సూచిస్తుంది.

స్త్రీ జీవితం కుటుంబానికే పరిమితమయిన చోట ఆమెకు ఆర్థికస్వేచ్ఛ ఏమయినా వుండాలంటే ఆస్తి హక్కు వుంటేనే అది సాధ్యం. కుటుంబ ఆస్తిలో ఆమెకు వాటా వుండాలి. ఇది బ్రాహ్మణీయ ధర్మంలో మొత్తంగా తిరస్కరించబడింది. తండ్రి ఆస్తిపైన కొడుకుకే తప్ప కూతురికి వారసత్వ హక్కులేదని అన్ని స్మృతులూ అంటాయి. 'కొడుకు' అంటే అతనికే పుట్టిన కొడుకు కానవసరం లేదు. యాజ్ఞవల్క్యుడి ప్రకారం వారసత్వ చట్టం 12 రకాల కొడుకులను గుర్తిస్తుంది. తనకూ తన భార్యకూ పుట్టిన కొడుకు, దత్తత తీసుకున్న కొడుకు, తన కోరిక మీద పరాయి మగవాడితో తన భార్య సంభోగించి కన్న కొడుకు, పెళ్ళిచేసుకున్నప్పుడే గర్భవతిగా వున్న భార్య ఆ తరువాత కన్నకొడుకు, డబ్బు పెట్టి కొనుక్కున్న కొడుకు మొదలయిన పన్నెండు రకాల పుత్రులను ధర్మశాస్త్రాలు గుర్తిస్తాయి. కూతుళ్ళే తప్ప కొడుకులు లేనివాడు ఒక కూతురిని ఎంపికచేసి 'ఈమెకు పుట్టబోయే కొడుకును నా కొడుకుతో సమానంగా గుర్తిస్తున్నాను' అని ప్రకటిస్తే ఆమెకు ఆ తరువాత పుట్టిన కొడుకు కూడ ఈ పన్నెండు రకాలలో ఒకడవుతాడు. కొడుకులలో ఇన్ని రకాలు ఎందుకు అవసరమంటే ఆస్తికి వారసుడు కావాలి. శ్రాద్ధ కర్మలు చేసేవాడు ('పిండం పెట్టేవాడు') కావాలి. పుత్రుడు లేకపోతే స్వర్గానికి పోవడం అసాధ్యమే కాక నరకం తథ్యం. 'నీ కొడుకులోనే నువ్వు మళ్లీ జీవిస్తావు. అదే నీ అమరత్వం' అని ఆపస్తంబ ధర్మసూత్రం అంటుంది. పుత్రుడు గల వాళ్ళకు పరలోకాలు ఎన్నయినా వున్నాయిగానీ పుత్రుడు లేని వాళ్ళకు ఒక్కటీ లేదని వశిష్ఠ స్మృతికారుడు అంటాడు. 'పుత్' అనే నరకం (పున్నామనరకం) నుండి కాపాడే వాడే పుత్రుడు అని విష్ణువూ బృహస్పతీ అంటారు. పుత్రుడు లేకపోతే 'పుత్' అనే నరకానికి పోవలసిందే.

అందువల్ల కొడుకును ఏదో ఒక రకంగా సంపాదించుకోవడం అవసరం. దాని కోసం లైంగిక నీతిని పక్కకుపెట్టి తన భార్యను వేరే వాడితో సంభోగించి కొడుకును కనమని కూడ పురమాయించవచ్చు.

ఈ విధంగా ఏదో ఒక రకంగా సంపాదించుకున్న కొడుకులకందరికీ ఆస్తివారసులుగా హక్కు వుంటుంది కానీ తనకూ తన భార్యకూ పుట్టిన కూతురికి మాత్రం వుండదు. భార్యకు అసలే వుండదు.

ఇన్ని రకాల కొడుకులలో ఒక్కరూ లేకపోతే అప్పుడేం అవుతుంది? ఈ విషయంలో కాలక్రమంలో కొంచెం మార్పు వచ్చినట్టు కనిపిస్తుంది. అర్థశాస్త్రంలో కౌటిల్యుడు ఏమంటాడంటే కొడుకు లేనివాడి ఆస్తి అతని తమ్ముళ్ళకూ ఇతర (మగ) సంబంధీకులకూ సంక్రమిస్తుందని. కూతుళ్ళకూ భార్యకూ మాత్రం రాదు. కానీ యాజ్ఞవల్క్యుడి కాలం నాటికి కొడుకు లేనివాడి ఆస్తి (అంటే 12 రకాల కొడుకులలో ఎవ్వడూ లేనివాడి ఆస్తి) భార్యకు, కూతుళ్ళకు సంక్రమిస్తుందనీ, వాళ్ళు కూడ లేకపోతేనే తమ్ముళ్ళకూ తమ్ముళ్ళ కొడుకులకూ ఆస్తి దక్కుతుందనీ అంటాడు. దాదాపు 500 సంవత్సరాల కాలంలో ఈ మాత్రం ప్రగతి వచ్చి అక్కడే ఆగిపోయింది.

పరలోక ప్రాప్తికోసం, ఇహలోకంలో ఆస్తిని వారసులుకు అందివ్వడం కోసం కొడుకులు ఎప్పుడయితే అత్యవసరం అయ్యారో వివాహేతర సంబంధాలలో పుట్టిన పిల్లలు ఎవరికి చెందుతారనే సమస్య వచ్చింది. తల్లి ఎవరో స్పష్టమే. కానీ వారసులు కావలసింది తల్లికి కాదు, తండ్రికి. ఒకడికి భార్య అయిన స్త్రీ మరొకడితో సంబంధం పెట్టుకొని కొడుకును కంటే ఆ కొడుకు ఆ యిద్దరు మగవాళ్ళలో ఎవరికి చెందుతాడు? ఎవరి ఆస్తికి వారసుడవుతాడు? ఎవరికి శ్రాద్ధంపెట్టి పున్నామ నరకం నుండి కాపాడగలుగుతాడు?

ఈ సమస్య కంటే దీనిని పరిష్కరించడానికి బ్రాహ్మణ శాస్త్రకారులు ఉపయోగించిన తర్కం ఆసక్తికరమైనది. వాళ్ళు స్త్రీ పురుష సంబంధాన్ని ఏ విధంగా అర్థం చేసుకున్నారో ఈ తర్కం చూపిస్తుంది. స్త్రీని పశువుతోనూ భూమితోనూ, ఆమె భర్తను పశువుల మంద యజమానితోనూ భూమి యజమానితోనూ పోల్చడం ద్వారా వాళ్ళు ఈ సమస్యను పరిష్కరించారు. ఒక మందకు చెందిన ఆడ పశువుతో మరొక మందకు చెందిన మగ పశువు సంభోగించడం వల్ల దూడ పుట్టిందనుకోండి అప్పుడు ఆ దూడ ఎవరికి చెందుతుంది? దానిని కన్న ఆడ

పశువు యజమానికే చెందుతుంది. ఆ మందకే చెందుతుంది. అదేవిధంగా ఒక స్త్రీ పరాయి పురుషుడి ద్వారా కొడుకును కంటే ఆ కొడుకు ఆమె యజమాని అయిన భర్తకే చెందుతాడు కానీ అతనికి భౌతికంగా తండ్రి అయిన వాడికి కాదని మనువు, నారదుడు అంటారు. ఒకరి పొలంలో మరొకరు విత్తనాలు వేస్తే దాని ఫలం పొలం యజమానికి దక్కుతుంది గానీ విత్తనం వేసిన వాడికి కాదు కదా అని అడుగుతారు. దీనిని క్షేత్ర బీజ న్యాయం అంటారు. భర్తకు భార్యపైన వుండే హక్కు భూస్వామికి భూమిపైన వుండే యాజమాన్య హక్కు లాంటిదేననే భావన ఈ తర్కానికి మూలం. అంటే ఆస్తిహక్కు వంటిదని అర్థం.

అయితే ఇద్దరు మగవాళ్ళ మధ్య ఒప్పందం ఫలితంగా ఒకరి భార్య ద్వారా మరొకరు కొడుకును కంటే ఆ కొడుకు ఇద్దరికీ దక్కుతాడనీ ఇద్దరి ఆస్తికీ వారసుడవుతాడనీ ఇద్దరికీ శ్రాద్ధం పెడతాడనీ బౌధాయనుడు అంటాడు. ఒకరు తన భూమిని మరొకరికి కౌలుకిచ్చి సాగుచేయించే ఒప్పందంతో దీనిని స్మృతికారులు పోలుస్తారు. అందువల్ల ఈ విధంగా పుట్టిన పిల్లలను క్షేత్రజులు అంటారు. భార్యపైన భర్తకు వుండే యాజమాన్యం ఆస్తిహక్కు వంటిది అనే భావన ఇక్కడ చాలా బలంగా కనిపిస్తుంది. కొడుకు కలగడం ముఖ్యం కాబట్టి ఇతర సందర్భాలలో తప్పనిసరి నియమాలుగా భావించే లైంగికనీతి సూత్రాలను పక్కనపెట్టి వ్యవహరించడాన్ని ధర్మశాస్త్రకారులే సమర్థిస్తారు. భర్తకోసం కొడుకును కనడానికి తనను మరొకడికి అప్పగిస్తే నోరుమూసుకుని పోవలసిన స్త్రీ అదే తన ఇష్టంకొద్దీ ఒకరితో సంబంధం పెట్టుకుంటే అది క్షమించరాని నేరం అవుతుంది. భర్తకు పిల్లలను కని ఇవ్వడం కోసమే భగవంతుడు స్త్రీని సృష్టించాడని నారద స్మృతికర్త స్పష్టం చేస్తాడు. అందువల్ల, ఒక స్త్రీ గనక పిల్లలను కనడం ఇష్టంలేక తనను తాను గొడ్రాలిని చేసుకుంటే ఆమె 'భ్రూణ హంతకి' అని ఊరిలో చాటింపు వేయించి ఇంటి నుండి వెళ్ళగొట్టాలని బౌధాయనుడు అంటాడు. పిల్లలు పుట్టని భార్యను భర్త 10వ సంవత్సరం దాకా చూసి విడిచిపెట్టవచ్చుననీ, కుమార్తెలు మాత్రమే పుడితే 12 ఏళ్ళు చూసి విడిచి పెట్టవచ్చుననీ, పుట్టిన పిల్లలందరూ చచ్చిపోతే భార్యను 15 ఏళ్ళు చూసి విడిచి పెట్టవచ్చుననీ కూడ

బౌధాయనుడు అంటాడు. (కానీ భార్య కొట్లాడే స్వభావం గలదయితే ఆలస్యం చేయకుండ విడిచిపెట్టమంటాడు.) కొడుకు పుట్టకపోతే కొన్నాళ్ళు చూసి రెండవ పెళ్ళి చేసుకొమ్మని కౌటిల్యుడు మగవాళ్ళకు అనుమతిస్తాడు. స్త్రీకి పాతివ్రత్యం తప్పనిసరి నియమం కాగా మగవాళ్ళకు బహుభార్యత్వాన్ని ఆమోదించడానికి ఇదొక కారణంగా శాస్త్రకారులు చెప్తారు. 'తన విద్యుక్త ధర్మాలు చేయడానికి భార్య సిద్ధంగా వుంటేనూ, మగ సంతానాన్ని కంటేనూ రెండవ పెళ్ళిచేసుకోవద్దు. లేకపోతే చేసుకొమ్మ'ని ఆపస్తంబుడు అంటాడు.

స్త్రీకి ఆస్తి హక్కు లేకుండా చేసినా ఆమె నేర్పుగా ఏదయినా వ్యాపారం ఇంట్లో వుంటూనే చేసుకొని సంపాదించుకోవచ్చు. ఆ విధంగా ఆర్థిక స్వాతంత్ర్యం సంపాదించుకోవచ్చు. కాని దీనికి కూడ బ్రాహ్మణ స్మృతికారులు అవకాశం లేకుండ చేశారు. భర్త లేక కొడుకు అనుమతి లేకుండా స్త్రీలు చేపట్టే అమ్మకము, కొనుగోలు, తనఖా, దానం మొదలయిన ఆస్తి సంబంధమైన లావాదేవీలేవీ చెల్లవని స్మృతికారులు అన్నారు. ఆమె కెవరయినా అప్పు ఇచ్చినా వారికి రాబట్టుకునే హక్కు వుండదని నారదుడూ కాత్యాయనుడూ అంటారు. ఆమె చెల్లించకపోతే భర్త దగ్గర వసూలు చేసుకోవచ్చుననే ధీమాతో ఎవడయినా స్త్రీకి అప్పుపెట్టగలడని గమనించిన నారదుడు, భార్య చేసిన అప్పులు తీర్చవలసిన బాధ్యత భర్తకు లేదన్నాడు. దీనికొక్కటే మినహాయింపు. భర్త కష్టాలలో వున్నప్పుడు అతని కోసం భార్య అప్పుచేస్తే ఆ అప్పుకు మాత్రమే భర్త పూచీ వుండవలసి వస్తుంది. కాబట్టి తనకోసంగా స్త్రీ ఎప్పటికీ అప్పు తెచ్చుకోలేదు. ద్రవ్య లావాదేవీలు పెట్టుకొని వ్యాపారం చేసి ఆస్తి సంపాదించుకోలేదు. నిజానికి స్త్రీకి అప్పు ఇయ్యకూడదన్న నియమం ధర్మశాస్త్రాలలో ఎక్కడా లేదు. కానీ ఇచ్చిన అప్పు వసూలు చేసుకునే హక్కులేదనీ, ఆమె భర్త ఆస్తిని పూచీగా భావించే అవకాశం లేదనీ అన్నాక ఇంక అప్పు ఎవరు ఇస్తారు? భర్త అవసరాల కోసం మాత్రమే ఆమె అప్పు పుట్టించగలదు. స్త్రీ పరాధీనతనూ అస్వతంత్రతనూ ధర్మశాస్త్రాలు ఈ విధంగా సంపూర్ణం చేశాయి.

గత అధ్యాయాలలో చెప్పినట్టు ఈ ధర్మశాస్త్రాల నియమాలన్నీ తుచ తప్పకుండా అమలయ్యాయని చెప్పలేము. రాజ్యాలు ఏలిన స్త్రీలూ వ్యాపారాలు

చేసిన స్త్రీలూ పండితులయిన స్త్రీలూ వున్నారు, వుండే వుంటారు. వాస్తవంలో సంపూర్ణంగా అమలయినా కాకున్నా ఈ శాస్త్ర నియమాలు సమాజానికి స్త్రీ పట్ల వుండే వైఖరిని నిర్ణయిస్తాయి. ఒక అధికారిక నీతిని నిర్ణయిస్తాయి. దాని ఫలితాన్ని స్త్రీలు ధర్మశాస్త్రాలు నిర్దిష్టంగా పేర్కొన్న విషయాలలోనే కాక ఇతర విషయాలలో కూడ అనుభవిస్తారు. ఈ నియమాన్ని అతిక్రమించినవారు ఆ సాంస్కృతిక వైఖరినీ అది కల్పించే వ్యక్తావ్యక్తమైన అవరోధాలనూ ఎదుర్కొని జీవించవలసి వుంటుంది. ఇది ధర్మశాస్త్రాలు సమాజాన్ని ఏలిన రోజులలోనే కాదు, వాటి స్థానంలో ఒక సెక్యులర్ రాజ్యాంగాన్ని రాసుకున్న ఈనాడు కూడ సత్యమే.

# పర్సనల్ చట్టాలు :
# ఏకీకరణ కాదు, ప్రజాస్వామీకరణ జరగాలి

ఉమ్మడి పౌరస్మృతి గురించి సుప్రీంకోర్టు ఏదో ఒకటి అనడం, ఆ తరువాత ఆ విషయమై కొంచెం చర్చ జరగడం, ఆపైన అందరూ దాని సంగతి మరిచిపోవడం చాలాకాలంగా దేశంలో జరుగుతూనే ఉంది.

రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలోని ఆర్టికల్ 44లో దేశానికొక ఉమ్మడి పౌరస్మృతి తయారుచేయాలని రాసి ఉన్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు కోపగించుకుంటున్నారంట. రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో ఇంకా చాలా విషయాలున్నాయి. అందరికీ పని కల్పించే మార్గం చూడమన్నారు, అందరికీ ఉపాధి అవకాశాలు ఉండేటట్టు చూడమన్నారు. స్త్రీ పురుషులకు సమానపనికి సమానవేతనం అందేటట్టు చూడమన్నారు, ప్రజారోగ్యాన్ని కాపాడమన్నారు, పిల్లలు పనివాళ్ళు కాకుండా చూడమన్నారు, న్యాయవ్యవస్థ అందరికీ అందుబాట్లో ఉండేటట్టు చూడమన్నారు, శ్రామికులందరికీ కనీస జీవన ప్రమాణాలు కల్పించే వేతనం అందేటట్టు చూడమన్నారు, పరిశ్రమల నిర్వహణలో కార్మికులకు స్థానం కల్పించమన్నారు, పిల్లలందరికీ ఉచిత విద్యా బోధన చేయమన్నారు, పశుపోషణను, వ్యవసాయాన్ని తగినరీతిలో అభివృద్ధి చేయమన్నారు, పర్యావరణాన్ని సంరక్షించమన్నారు.

ఇవన్నీ కూడా రాజ్యాంగ ఆదేశిక సూత్రాలలో ఉన్నాయి. ఈ పనులు ప్రభుత్వం చేయడం లేదని 1980లలో ఇదే సుప్రీంకోర్టు అప్పుడప్పుడు ఆవేశపడుతుండేది. ఆ తరువాత అది మానేసి ఉమ్మడి పౌరస్మృతిని రూపొందించడం లేదని ఆవేశపడడం మొదలుపెట్టారు.

రాజకీయాలలో సంక్షేమవాదం వెనకడుగువేసి హిందూత్వవాదం బలపడలేదా? అట్లాగే.

---

వీక్షణం పక్షపత్రిక, ఆగస్ట్ 1–15, 2003

అదీ యిదీ ఒకటేనని వ్యాఖ్యానించడం అతివాదంగా తోచవచ్చు. దానినొక కుట్రగా అర్థం చేసుకుంటే అతివాదమనే అనక తప్పదు. కానీ మన సుప్రీంకోర్టు అభిప్రాయాలు స్థూలంగా అప్పటి ప్రధాన రాజకీయ భావజాలానికి సమాంతరంగానే ఉన్నాయనేది వాస్తవం. నెహ్రూ కాలంలో ఉదార సంక్షేమ రాజ్య భావన సుప్రీంకోర్టు ప్రధాన భావజాలంగా ఉండింది. ఇందిరాగాంధీ కాలంలో ఇంకొంచెం వేడెక్కిన వామపక్ష ధోరణి మూలంగా ఉండింది. ఇప్పుడు ప్రపంచీకరణకు అనుకూలంగా వుంది. బ్రాహ్మణీయ భావజాలమూ బలపడుతున్నది. ఇందులో కుట్రల కోసం వెతకవలసిన అవసరం లేదు. ఏ సమాజంలోనైనా సామాజిక ఆర్థిక రంగాలలో పైభాగాన ఉన్నవారి భావాలు స్థూలంగా ఒకే మూసలో ఉండటం, ఒకే మూసలో మారుతుండటం ఆశ్చర్య పోవలసిన విషయం కాదు. దానికి మినహాయింపులుండవని గానీ, ఆ మినహాయింపుల వల్ల ఏ ప్రయోజనమూ ప్రజలకు లేదని గానీ అనుకోనంత కాలం ఈ సత్యాన్ని గుర్తించడం వల్ల వచ్చిన నష్టమూ ఏమీలేదు.

ఇక ఉమ్మడి పౌరస్మృతి గురించి మాట్లాడుకుందాం. 'పౌరస్మృతి' అనేది 'పర్సనల్ లా'కు వేరే పేరు. వివాహం, ఆస్తివారసత్వం, విడాకులు, దత్తత, భరణం మొదలైన విషయాలను 'పర్సనల్ లా' అంటారు. ఇవి ఆయా ప్రజల సంప్రదాయక ఆచారాలతో సన్నిహితంగా ముడిపడి ఉంటాయి. ఆచారాలలో మతం ప్రమేయం ఉండనే వుంటుంది.

దేశానికంతా ఒకే నేరస్మృతి, ఒకే 'సివిల్ లా' ఉన్నట్టు ఒకే 'పర్సనల్ లా' ఉండాలనీ, అప్పుడే దేశసమైక్యత పదిలంగా ఉంటుందనీ సుప్రీంకోర్టు జడ్జీలు అన్నారట. ఎందుకో మాత్రం చెప్పలేదు. మనం ఒక భాష మాట్లాడం, ఒక రకమైన తిండి తినం, ఒక రకమైన బట్టలు వేసుకోం. అయినా దేశ సమైక్యతకు నష్టం లేనప్పుడు పెళ్ళి, విడాకులు, ఆస్తివారసత్వం మొదలైన విషయాలలో భిన్నత్వం ఉంటే ఏమొచ్చింది?

'పర్సనల్ లా'లో భిన్నత్వాన్ని తొలగించాలని కాక, దానిని ప్రజాస్వామిక విలువల ప్రాతిపదికన ఆధునీకరించాలన్న ప్రయత్నం రకరకాల సంస్కర్తలు గడచిన వంద సంవత్సరాలలో చాలాసార్లు చేశారు. అంబేద్కర్

న్యాయశాఖామాత్యునిగా హిందూ పర్సనల్ చట్టాలను ఈ అర్థంలో ఆధునీకరించాలని ప్రయత్నం చేశాడు. సనాతన హిందువుల వ్యతిరేకత కారణంగా అది అరకొరగా సాగి ఆగిపోయింది. దానిని పూర్తిచేయాలని అనే బదులు హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు అందరికీ వర్తించే ఒకే ఒక పర్సనల్ లాను తయారు చేయాలని అంటున్నారు. ఇప్పటికే 'హిందువు' అన్న మాట కిందికి అనేక సంప్రదాయాలను తీసుకొచ్చేసి వాటి ప్రత్యేకతలను నాశనం చేశారు. బ్రాహ్మణీయ హిందూ సంస్కృతే 'హిందూ' ప్రజలందరి సంస్కృతీ అయింది. ముస్లింలలోనూ అదే జరిగింది. మతంరీత్యా ముస్లింలైనప్పటికీ వివాహం, విడాకులు, ఆస్తిహక్కులు మొదలైన విషయాలలో స్థానిక సంప్రదాయాలను ఆచరిస్తున్న వారందరినీ 1937 తరువాత షరియత్ చట్టం కిందికి తీసుకొచ్చేశారు.

బలవంతపు ఏకీకరణ కారణంగా కొంత ప్రజాస్వామిక లక్షణం గల సంప్రదాయాలు తమ ఉనికిని పోగొట్టుకొని ఇటు బ్రాహ్మణీయ హిందూ చట్టం కిందికో, అటు షరియత్ కిందికో వచ్చేశాయి. ఇప్పుడింక ఎవరిని ఉద్ధరించడానకి 'అందరికీ ఒకే పర్సనల్ చట్టం' అన్న నినాదం తీసుకొస్తున్నారు?

జరగవలసింది పర్సనల్ చట్టాల ప్రజాస్వామీకరణ. వాటి ఏకీకరణ కాదు. పర్సనల్ చట్టాలలోని సామాజిక అంశం స్త్రీ పురుష సంబంధాలు, వివాహం, విడాకులు, ఆస్తిహక్కులు– వీటన్నిటిలోనూ ప్రధానమైన ప్రశ్న స్త్రీలకూ పురుషులకూ సమాన హక్కులు కల్పిస్తున్నారా లేదా అనేది. అన్ని మత సంప్రదాయాలూ ఈ విషయంలో స్త్రీలకు అన్యాయం చేశాయనేది నిర్వివాదం. ఆయా మత సంప్రదాయాలలో కొంచెం ప్రజాస్వామిక స్వభావం గల ఉప సంప్రదాయాలేవైనా ఉండివుంటే వాటిని ప్రధాన సంప్రదాయంలోకి కలిపేసుకోవడం ద్వారా వాటి గొంతు నులిమేశారు.

ముందుగా ఒక్కొక్క 'పర్సనల్ చట్టం'లోని అప్రజాస్వామిక లక్షణాలను గుర్తించి తొలగించే ప్రయత్నం అవసరం. అది 'నిపుణులు' చేసే పని కాదు. దానికి రాజకీయ కార్యాచరణ కావాలి. ఆపైన భిన్నమైన పర్సనల్ చట్టాలలో భిన్న లక్షణాలుంటే ఉండనివ్వండి–వాటన్నిటినీ ఒకే మూసలోకి పోయవలసిన అవసరం ఏముంది? ఇస్లాంలో కొడుకుకు ఆస్తిపైన హక్కు తండ్రి చనిపోయేదాకా

రాదు. అప్పటిదాకా దానిని అనుభవించే హక్కు మాత్రమే కొడుకుకు వుంటుంది. హిందూ సంప్రదాయంలో మగపిల్లవాడు పుట్టిన క్షణమే పూర్వీకుల ఆస్తిలో వాటాదారుడవుతాడు. మైనారిటీ తీరగానే తన వాటా తీసుకొని వేరు పడవచ్చు. రెండు సంప్రదాయాల్లోనూ స్త్రీకి ఆస్తిపైన హక్కే లేదన్నది సామాన్య గుణం (ఇక్కడ 'ఉమ్మడి పౌరస్మృతి' మాత్రం ఇప్పటికే ఉంది). ఈ అప్రజాస్వామిక లక్షణాన్ని రెండు సంప్రదాయాల నుండీ తొలగించటం అవసరం గానీ, ఇతరత్రా వాటిలోని భిన్నత్వాన్ని తొలగించవలసిన అవసరం ఏముంది? ఇస్లాం వివాహ బంధాన్ని కేవలం ఒక సెక్యులర్ 'కాంట్రాక్ట్'గా భావిస్తుంది. హైందవం దానిని పవిత్ర బంధంగా భావిస్తుంది. రెండూ స్త్రీకి వైవాహిక జీవితంలో హింస నుండి రక్షణ కల్పించలేకపోయాయన్న చేదువాస్తవానికి పరిష్కారం కావాలి గానీ, వారి భావనను వీరో వీరి భావనలను వారో అంగీకరించవలసిన అవసరం ఏముంది?

# నిచ్చెనమెట్ల వర్ణధర్మం ప్రస్తావన ఎందుకుండదు?

బ్రాహ్మణ ధర్మాన్ని గురించీ, బ్రాహ్మణీయ సంస్కృతి గురించీ మన విద్యా వ్యవస్థకు వెలుపల చర్చ చాలానే జరుగుతున్నది గానీ, మన దేశ అధికారిక విద్యావ్యవస్థ వాటిని ఆ పేర్లు పెట్టి పిలవడానికి సహితం ఇప్పటికీ సిద్ధంగా లేదు – కాషాయీకరణ మొదలయిన తరువాతే కాదు, అంతకుముందు కూడ. ఈ మేరకు కాషాయీకరణ కొత్తగా జరుగుతున్నది కాదు, ఎప్పుడూ ఉన్నదే.

ఈ పుస్తకంలోని వ్యాసాల రచయితలు ముగ్గురూ అధికారిక విద్యావ్యవస్థలో అధ్యాపకులే కానీ ఈ రచనకు అందులో చోటెప్పుడు లభిస్తుందో ! అధికారిక విద్యావ్యవస్థ కులం అనేదొకటి ఉందని గుర్తిస్తుంది కాని దాని వికృత రూపాలలో ఒక్క అంటరానితనాన్ని మాత్రమే ఖండిస్తుంది. అయితే అదేదో ఎవరి ప్రమేయం లేకుండా ఊడిపడిన అవలక్షణమైనట్లు నటిస్తుంది. దేశ సంస్కృతి అంటూ సగౌరవంగా ప్రస్తుతించే అనేక సంప్రదాయాలతో అది సన్నిహితంగా ముడిపడి ఉన్న విషయం తెలియనట్టు ప్రవర్తిస్తుంది.

ఈ నటన సాగినంత కాలం మన చరిత్రనూ సమాజాన్నీ సంస్కృతినీ నిజాయితీగా విశ్లేషించుకోవడం సాధ్యంకాదు. నిజాయితీ కొరవడిన సామాజిక శాస్త్రం శాస్త్రమూ కాదు, అది మనకిచ్చేది విజ్ఞానమూ కాదు.

భారత ప్రభుత్వ సమాచార ప్రసారశాఖ 'భారతదేశపు సాంస్కృతిక వైతాళికులు' అనే శీర్షికన 125 మంది 'దార్శనికులు, తత్వవేత్తలు, సాహితీవేత్తలు, ద్రష్టలు, శాస్త్రవేత్తలు, ధర్మ ప్రచారకులు, నాటకకర్త'లను సగటు చదువరులకు పరిచయం చేసే గ్రంథమాలను ప్రచురించింది – అటల్‌బిహారీ ప్రధాన మంత్రిత్వంలో కాదు, అపరలౌకికవాది ఇందిరా గాంధీ కాలంలోనే. ఈ పుస్తకంలో విశ్లేషించిన నలుగురు – కౌటిల్యుడు, మనువు, వాత్స్యాయనుడు, భరతుడు –

ప్రాచీన భారత రాజకీయార్థిక నిర్మాణాలను ప్రతిబింబించిన రచనలు–మహిళల జీవితంకు ముందుమాట, రచించిన కాత్యాయని విద్మహే, తోట జ్యోతిరాణి, బుర్రరాములు, మార్చి 2005, వరంగల్

'వైతాళికుల' గురించేకాక మరొక్క 121 మంది గురించి కూడా దాదాపు ఇంతే నిడివిగల పరిచయ వ్యాసాలున్నాయి ఆ సంకలనంలో.

అవి చదివే 'సగటు చదువరి'కి ఈ దేశాన్ని గురించి కలిగే అభిప్రాయానికీ, ఈ పుస్తకం చదివేవారికి కలిగే అభిప్రాయానికీ హస్తిమశకాంతరం ఉంటుంది. అది నిజమయి ఇది అబద్ధమయి వుంటే ఏ సమస్యా ఉండేదికాదు. కాని అది అబద్ధం. ఇది నూటికి నూరుపాళ్ళు సత్యం కాకపోయినా సత్యాన్ని ఆవిష్కరించడానికి అవసరమైన విశ్లేషణా ప్రాతిపదికను గ్రహించిన ప్రయత్నం.

ఒక చారిత్రక వ్యక్తినీ, ఆ వ్యక్తి ఆలోచనలనూ అర్థం చేసుకోవాలంటే ఆ వ్యక్తి నమ్మిన ప్రాపంచిక దృక్పథాన్ని స్పష్టంగా మన ముందు ఉంచుకోవాలి. దానిని అతని కళ్ళతోనేకాక, ఆ దృక్పథం వ్యవస్థితం కావడంవల్ల స్వేచ్ఛ, జీవనం, విలువ, గుర్తింపు మొదలయిన హక్కులు కోల్పోయిన వారి కళ్ళతోనూ చూడాలి. ఆ పైన విశ్లేషణ మన విశ్లేషణా దృక్కోణాన్ని బట్టి సాగుతుంది. అందులో చర్చలకూ విభేదాలకూ ఎంతయినా అవకాశం ఉండవచ్చు.

ప్రభుత్వ ప్రచురణ ఈ సాంస్కృతిక వైతాళికుల గురించి ఏం చెప్తుంది? వారు అత్యంత ప్రాచీనులు. వేరే ఏ నాగరికతకూ తీసిపోనంత పూర్వకాలంలోనే మనం ఉన్నతస్థాయి ఆలోచనాపరులను కలిగివున్నాం అని. అంతవరకు కరెక్టే. ఎంత ప్రాచీనులు అని అడిగితే ప్రశ్నించే వాళ్ళెవరూ లేరనుకుంటే మన దేశభక్తులు వీరి కాలాన్ని బాగా వెనక్కి నెట్టేస్తారు గానీ, మొత్తానికి ఈ విషయంలో మనం పాశ్చాత్యుల ముందేకాదు, చైనావారి ముందూ, పశ్చిమాసియావారి ముందూ కూడా తలదించుకోనక్కరలేదు.

వారు విశ్లేషణా పటిమలోనూ, విషయాలను గ్రహించే శక్తిలోనూ, సమగ్ర దృష్టిలోనూ వేరెవ్వరికీ తీసిపోరని కూడా అంటారు. అది కూడా నిజమే. కౌటిల్యుడు పాలనా వ్యవస్థను విశ్లేషించేటప్పుడు అన్ని కోణాలనూ అసాధారణ సమగ్ర దృష్టితో ఆకళింపు చేసుకున్నాడనీ, మనువు వ్యాజ్యాలనూ న్యాయనిర్ణయ ప్రక్రియలనూ చాలా నిశితంగా వర్గీకరించాడనీ, భరతుడు జీవిత వస్తువుకూ దానిని వ్యక్తీకరించే అభినయానికీ అది ప్రేక్షకులలో కలిగించే అనుభూతికీ గల సంబంధాన్ని భావ – రస సిద్ధాంతం రూపంలో అసాధారణమైన నేర్పుతో వివరించాడనీ, లైంగిక

*నిచ్చెనమెట్ల వర్ణధర్మం ప్రస్తావన ఎందుకుండదు?*

అనుభవం ఎరుగని వాత్స్యాయనుడు ఆ అనుభవానికి సంబంధించిన అన్ని కోణాలనూ ఒక ఆధునిక సైంటిస్ట్‌లాగ విశ్లేషించాడనీ మెచ్చుకుంటారు. అభిమానులలో కొంచెం అతిశయోక్తి సహజం అని గుర్తించగలం కాబట్టి ఆ మేరకు ఈ అభిప్రాయాలను కొంచెం తగ్గించుకోవలసి ఉంటుందని అర్థం చేసుకుంటాం. అయినప్పటికీ ఇవి సత్యాలే.

ఇంకేం చెప్తారు? ఇంకేం చెప్పరు. ముఖ్యంగా ఈ వైతాళికుల ప్రాపంచిక దృక్పథాన్ని గురించి చెప్పరు. ఒకవేళ చెప్పినా దానిని వీలయినంత అస్పష్టంగా చెప్పి వదిలేస్తారు. మనిషికి జన్మనుబట్టి భిన్నమైన విలువను, హక్కులను, ప్రమాణాలను వర్తింపజేసే అమానవీయమైన నిచ్చెనమెట్ల వర్ణధర్మం వీరి విశ్లేషణా నైపుణ్యానికీ వాదనా పటిమకూ పునాది అని తెలియచేయరు.

ప్రభుత్వ సంకలనంలో మనువు గురించి రాసిన ప్రశాంత బిహారీ ముఖర్జీ అనే కలకత్తాకు చెందిన న్యాయకోవిదుడు, మనువు గొప్ప న్యాయసిద్ధాంతవేత్తే కాదు, గొప్ప సామాజిక తత్వవేత్త కూడా అంటాడు. రాజ్యం, న్యాయవ్యవస్థ, అవి అమలు చేయవలసిన ధర్మాల దగ్గర మనువు ఆగిపోలేదనీ సృష్టి స్వభావంతో మొదలుపెట్టి ఒక సమగ్రమైన చిత్రాన్ని ఇచ్చాడనీ అంటాడు. ఆత్మ పరమాత్మల గురించి, సత్వరజస్తమో గుణాల గురించి, కర్మవాసనల గురించి, జన్మపునర్జన్మల గురించి మనువు ఏం చెప్పాడో వివరిస్తాడు. ప్రపంచాన్ని సృష్టించిన బ్రహ్మ కాలచక్రాన్నీ, సకలలోకాలనూ, భూమ్యాకాశాలనూ సృష్టించి, ఆపైన పురుషుడినీ, స్త్రీనీ, కుటుంబాన్నీ, సమాజంలో సమతుల్యం నెలకొల్పే నాలుగు గుణాలనూ సృష్టించాడని మనువు వివరించాడని చెప్తాడు. ఆ గుణాలు బ్రాహ్మణులు ప్రాతినిధ్యం వహించే మేధస్సు, ఆధ్యాత్మిక గుణాలు; క్షత్రియులు ప్రాతినిధ్యం వహించే సంరక్షక సంహార గుణాలు; వైశ్యులు ప్రాతినిధ్యం వహించే ఉత్పత్తి, వర్తక గుణాలు; శూద్రులు ప్రాతినిధ్యం వహించే భౌతిక సేవా పరిచర్యల గుణాలు; అని వివరిస్తాడు. అక్కడితో ఆగక.

***"మనువు సామాజిక తత్త్వ దృక్పథంలోని చెప్పుకోదగ్గ విషయం – క్రమబద్ధమైన మానవ సమాజానికి తగిన బాధ్యతాయుతులయిన సభ్యులు తయారు కావడానికి జీవశాస్త్రాన్నీ జన్యుశాస్త్రాన్నీ ఆయన ఆశ్రయించిన వైనం. ఇది మను సంహితంలోని 10వ అధ్యాయంలో***

*కనిపిస్తుంది. సాంకర్యం మనిషి పునాది ధాతువులను ధ్వంసం చేస్తుందనీ, సమాజం, రాజ్యం పతనం కావడానికి గల ప్రధాన కారణాలలో అది ఒకటనీ మనువు నమ్మాడు.*

*...శరీరం, బుద్ధి, ప్రకృతి విధించిన పరిమితుల నుండి, లేమి నుండి విముక్తి మానవ సమాజం లక్ష్యం, రాజ్యం లక్ష్యం. మనిషయినా సమాజమైనా రాజ్యమయినా ఈ లక్ష్యానికి తోడ్పడినప్పుడే సార్థకం అవుతాయి. మను సంహితంలోని 12వ అధ్యాయంలోని విషయం ఇదే. సామాజిక వ్యవస్థను ఒక సాధనంగా ఉపయోగించుకొని, దానిని అధిగమించడం ద్వారా మనిషి నిజమైన స్వేచ్ఛనూ విముక్తినీ పొందడం దీని సారాంశం."*

అని అంటాడు. 'నాలుగు గుణాల సమతుల్యం' గల సామాజిక వ్యవస్థ స్వేచ్ఛకూ విముక్తికీ అవరోధం కాకపోగా అదే విముక్తికి సాధనం అనుకోవడంవల్ల, దానిని భ్రష్టు పట్టించగల సాంకర్యాన్ని గట్టిగా నిరోధించటం ముఖ్య కర్తవ్యం అనుకోవడంవల్ల ఏ సామాజిక ఫలితాలు సంభవించాయనే విశ్లేషణకు ఈ ప్రశంసలో చోటులేదు.

అందులో రెండవ అంశం ఈ పుస్తకంలోని వ్యాసాల ప్రధాన వస్తువు. 'సామాజిక సమతుల్యం' ప్రామాణికం అనుకోవడం సేవకూ పరిచర్యలకూ ప్రతినిధులుగా గుర్తించబడిన శూద్రులకూ, వారికంటె నికృష్టమైన బతుకులు బతికే అతిశూద్రులకూ గుదిబండకాగా, సాంకర్యం సమాజాన్నీ రాజ్యాన్నీ దిగజారుస్తుందని నమ్మే దృష్టి స్త్రీ లైంగికతపైన, వైయక్తిక స్వేచ్ఛపైన, వ్యక్తిత్వ స్వయంప్రతిపత్తిపైన పెను నియంత్రణ. ఒక స్త్రీ వేరే కులానికి చెందిన మగవాడితో కలవకుండ చూడాలంటే కేవలం ఆమె లైంగిక స్వేచ్ఛపైన నియంత్రణ పెడితే చాలదు. ఆమె ఎటు పోతుంది, ఎవరితో స్నేహం చేస్తుంది, ఏ జీవన మార్గాన్ని ఎంచుకుంటుంది, ఏం చదువుతుంది, ఏం ఆలోచిస్తుంది – అన్నిటినీ నియంత్రించాలి.

పితృస్వామ్యం అనే పెత్తందారీ సంబంధంలో స్త్రీ లైంగికతపైన నియంత్రణ ఒక ముఖ్య విషయం అనేది స్త్రీవాదం బలంగా నిరూపించిన విషయాలలో ఒకటి. అన్ని నాగరికతలలోనూ మగవాడు సార్వత్రికంగా అనుభవించే ఈ పెత్తనానికి గల కారణాల గురించి చాలా విశ్లేషణ జరిగింది. ఆస్తి తనకు పుట్టిన పిల్లలకే దక్కాలన్న కోరిక దగ్గరి నుండి, మానసిక అభద్రత దాకా అనేక కారణాలు

చర్చకు వచ్చాయి. అయితే హైందవ సమాజానికి వచ్చేసరికి సార్వత్రికమైన ఈ కారణాలకు వర్ణసాంకర్య భయాన్ని కూడా చేర్చాలి. చాతుర్వర్ణం పదిలంగా ఉండడం సంప్రదాయక హైందవ సమాజంలో అన్ని ఆలోచనలకూ తొలి ప్రమాణం. ఆ ఆలోచన రాజనీతి గురించి చేయొచ్చు. కళా సంస్కృతుల గురించి చేయొచ్చు. సుఖసంతోషాల గురించి చేయొచ్చు. దేనికయినా గీటురాయి వర్ణ వ్యవస్థ పదిలంగా ఉండాలన్న ఆరాటం. ఇది ఏక సమయంలో కింది కులాలమీద, స్త్రీలపైన సార్వత్రిక నిర్బంధంగా పనిచేసింది. పాశ్చాత్య దేశాలలో రేస్, జెండర్‌ల మధ్య గల సంబంధానికీ, భారతదేశంలో కులం, జెండర్‌ల మధ్య గల సంబంధానికీ పోలిక తేవడం తరచుగా జరుగుతుంది. అసలే పోలికలేదని కాదు గానీ ఒక బలమైన తేడా ఉంది. కులం, జెండర్‌ల విషయంలో అధికారిక సంస్కృతిని నిర్దేశించే తాత్త్విక మూలం బ్రాహ్మణీయ వర్ణధర్మం. అటువంటి మూలం పాశ్చాత్య సమాజంలో లేదు. భారతీయ సమాజానికి సంబంధించినంతవరకు వర్ణధర్మాన్ని ప్రస్తావించకుండ పురుషస్వామ్యం గురించి మాట్లాడలేము. లైంగిక అణచివేత గురించి మాట్లాడకుండ వర్ణ ఆధిక్యత గురించి మాట్లాడలేము.

విభిన్న సామాజిక జీవిత రంగాలకు సంబంధించి బ్రాహ్మణీయ సంస్కృతికి చెందిన నలుగురు ప్రముఖులు చేసిన రచనలలో ఈ సంబంధం ఏ విధంగా రూపుదిద్దుకుందో వివరణాత్మకంగా తెలియచేసే ఈ పుస్తకం అధికారిక విద్యావ్యవస్థలో ఇవ్వని విద్య చదువరులకు ఇస్తుందని ఆశిద్దాం.

# హిందూత్వం - విద్య

# చదువు గురించి మాట్లాడటమూ కుట్ర అవుతుందా?

అమర్త్యసేన్‌కు నోబెల్ బహుమతి ఇచ్చినప్పుడు విశ్వహిందూపరిషత్ వ్యతిరేకించడం మొదట్లో ఎవరికీ అంతుబట్టలేదు. సేన్ బాబ్రీ మసీదు కూల్చివేతను వ్యతిరేకించిన మాట వాస్తవమే. బహిరంగంగానే వ్యతిరేకించారు. భారతదేశ సంస్కృతిలోని బహుళత్వం ఒక గొప్ప లక్షణమనీ, దానిని ధ్వంసం చేయడాన్ని చూస్తూ సహించరాదనీ అన్నారు. బహుశా అందువల్లనే ఆయనకు నోబెల్ పురస్కారం లభించడం విశ్వహిందూపరిషత్‌కు కడుపుమంట కలిగించి ఉండవచ్చునని అప్పట్లో అనుకున్నాం. అంతకంటె లోతయిన కారణమేదైనా ఉండగలదని అనుకోలేదు.

కానీ ఈ మధ్య అశోక్‌సింఘాల్ సేన్‌కు నోబెల్ బహుమతి ఇవ్వడాన్ని క్రైస్తవుల కుట్రగా అభివర్ణించేసరికి మరొకసారి విస్మయం కలిగింది. ముస్లింలమీద దాడులను వ్యతిరేకించాడని వీరికి అతనిపై కోపం ఉంది లెమ్మనుకుంటుంటే మధ్యలో ఈ క్రైస్తవుల కుట్ర ఏమిటి? సేన్ క్రైస్తవుడు కాదు. మతం ప్రస్తావన వచ్చినప్పుడు తాను బుద్ధుడినీ, బౌద్ధాన్నీ అభిమానిస్తానని చెప్పుకున్నాడే తప్ప క్రైస్తవాన్ని కాదు. ఆయన భార్య క్రైస్తవ స్త్రీ అనా వీరి ఉద్దేశం? కానీ పేరునుబట్టి ఆమె యూదు మతానికి చెందిన స్త్రీ అయి ఉండాలి, క్రైస్తవం కాదు.

మొత్తానికి అశోక్‌సింఘాల్ ఆంతర్యమేమిటో అంతుబట్టలేదు. మధ్య యుగాల అవశేషాలుగా మిగిలిపోయిన వారి ఆలోచనలు మనకు అర్థంకావు లెమ్మని సర్ది చెప్పుకున్నాం. అదే పొరపాటు. సంఘ్‌పరివార్ ఆలోచనలు అవశేషాలు కావు. ఎంత ప్రాచీనమైనవో అంత ఆధునికమైనవి.

మాబోటి తెలివితక్కువ వాళ్ళ కోసం అశోక్ సింఘాల్ ఆలోచనలను ఈ మధ్యనే ఆచార్య గిరిరాజ్ కిశోర్ విడమరచి చెప్పాడు. సేన్ ప్రాథమిక విద్య గురించి పదే పదే మాట్లాడుతున్నాడు. విద్యావ్యాప్తికి ప్రభుత్వ విధానాలలో

---

ఆంధ్రప్రభ దినపత్రిక, 7, జనవరి, 1999

కేంద్రస్థానం ఉండాలంటున్నాడు. ఇది క్రైస్తవ మిషనరీలకు ఉపయోగపడే ఆలోచన కాబట్టే అతనికి నోబెల్ ప్రైజ్ ఇవ్వడం జరిగిందనీ, అందుకే దానిని క్రైస్తవ కుట్రగా సింఘాల్ అభివర్ణించాడనీ, అతనిని ఎవరూ అర్థం చేసుకోలేకపోయారనీ గిరిరాజ్ కిశోర్ వాపోయారు. పైగా, తనకు వచ్చిన నోబెల్ బహుమతిని మొత్తం ప్రాథమిక విద్యావ్యాప్తి కోసం వెచ్చిస్తానని కూడా అమర్త్యసేన్ అన్నాడట. ఆ డబ్బుతో క్రైస్తవ మిషనరీలు మరింత పేట్రేగి పోతాయని గిరిరాజ్ కిషోర్ హెచ్చరించాడు. విషయాన్ని ఇంత స్పష్టంగా విడమరచి చెప్పినందుకు ఆచార్యులవారికి ధన్యవాదాలు.

అమర్త్యసేన్ విద్యమీద ఖర్చుపెడతానని ప్రకటించిన మొత్తాన్ని క్రైస్తవ మిషనరీలే వాడుకుంటారని ఎందుకు భావించాలి, ఏ హైందవ సంస్థో వాడుకోవచ్చు గదా అని వారిని అడగనవసరం లేదు. మనకు స్వతహాగా అటువంటి ఆలోచనలు రావని వారికి తెలుసు. అందరికీ చదువు చెప్పేస్తే ప్రతీ ఎల్లిగాడూ ఎల్లక్కా పొగరుతో బలిసిపోయి నువ్వెంతో నేనూ అంతేనంటే కష్టం కాదూ? సేన్‌కు ఇచ్చిన నోబెల్ బహుమతితోపాటు మదర్ థెరిసాకు ఇచ్చిన పురస్కారాన్ని కూడా సింఘాల్‌గారు, గిరిరాజ్ కిశోర్‌గారు క్రైస్తవ కుట్రగా అభివర్ణించారు. మరి హైందవంలోనూ సన్యాసులకేం కొదవలేదు. వాళ్ళు తమ పొట్టకూటి గురించి, కొసరుగా మోక్షం గురించి ఆలోచిస్తారే తప్ప మదర్ థెరిసాలెందుకు కాలేకపోయారన్న ప్రశ్న వీరు వేసుకోరు.

అమర్త్యసేన్ గురించి సింఘాల్, గిరిరాజ్ కిశోర్‌లు చేసిన వ్యాఖ్యలు గుజరాత్‌లో క్రైస్తవ సంస్థలమీద దాడులు జరుగుతున్న నేపథ్యంలో ప్రచారం కావడం కాకతాళీయమే కావచ్చును గానీ రెండింటిమధ్య ఉన్న సంబంధాన్ని చూడడం అవసరం. విద్యావ్యాప్తి పేరిట క్రైస్తవులు మతమార్పిడి చేస్తున్నారనేది క్రైస్తవ సంస్థలమీద హిందూత్వ ఉన్మాదుల అభియోగం. అమర్త్యసేన్ విద్యకు ఇచ్చే ప్రాముఖ్యంవల్ల క్రైస్తవ మిషనరీల వ్యాప్తికి అతని ఆలోచనలు తోడ్పడతాయని అతనిపైన వీరి అభియోగం.

మరి వీరి నిజమైన అభియోగం మతమార్పిడిలు చేస్తున్నారనా లేక బడుగు జనానికి విద్య అందిస్తున్నారనా?

*చదువు గురించి మాట్లాడటమూ కుట్ర అవుతుందా?*

ప్రభుత్వం ఏ రకమైన ఆర్థికవిధాన రచన చేసినప్పటికీ, దానివల్ల ప్రయోజనం పొందడానికీ, దానిలో పాల్గొనడానికీ కావలసిన బలం పేదప్రజలకు ముందు కల్పించాలనీ, లేకపోతే ఆ విధాన రచన విఫలం కావడమే కాక పేదలు, ధనికుల మధ్య తేడాలు పెరిగిపోతాయనీ, దోపిడీ పీడనలు పెరిగిపోతాయనీ, హింస పెరిగిపోతుందనీ అమర్త్యసేన్ హెచ్చరిస్తాడు. పేదలకు 'బలం' చేకూర్చే విషయాలలో విద్య, వైద్యం, సాంఘిక సమానత్వం, భౌతిక వనరులు, ఆర్థికస్వేచ్ఛ, రాజకీయ ప్రజాస్వామ్యం మొదలయిన వాటిని ఆయన ప్రధానంగా లెక్కిస్తాడు. మామూలు రాజకీయ పరిభాషలో అమర్త్యసేన్ లెఫ్టిస్టు కాదు, 'రైటిస్టూ' కాదు. అంటే ప్రభుత్వరంగ ప్రాధాన్యతా లేక ప్రైవేట్‌రంగ ప్రాధాన్యతా అనేది ఆయన దృష్టిలో ముఖ్యమైన ప్రశ్న కాదు. ఈ ప్రశ్నలు అక్కరలేదంటాడని కాదు కానీ అంతకంటే ముఖ్యంగా, విధాన రచన ఏ రూపం తీసుకున్నప్పటికీ అందులో పాల్గొని ప్రయోజనం పొందడానికి కావలసిన 'బలం' ప్రజలకు కల్పిస్తున్నారా లేదా అనేది చూడాలంటాడు. దాని గురించి భారతదేశంలోని వామపక్షాలు సహితం ఎక్కువ ఆందోళన చేయడం లేదని, ఆర్‌టిసినీ, విద్యుత్ బోర్డునూ ప్రైవేట్‌పరం చేయడం తగునా లేదా మొదలయిన వివాదాలే ప్రధానం అయిపోయాయని ఆందోళన వ్యక్తంచేస్తాడు. ప్రజలకు శక్తిసంపదలు కల్పించే విధానాలు ముందు ఉంటే ఆ ప్రాతిపదికన మిగిలిన ప్రశ్నలకు నిర్దిష్టంగా జవాబు చెప్పుకో వచ్చునంటాడు.

ప్రజలకు 'బలం' కల్పించే విషయాలుగా ఆయన అయిదారు అంశాలను గుర్తిస్తాడు కానీ వాటిలో ఆయన ఎక్కువ నొక్కిచెప్పేది విద్యా వైద్య హక్కులు. కనీసమైన చదువు, ఆరోగ్యం లేని ప్రజలతో దేశాన్ని సరళీకరణవైపు నెట్టడం అసమానతనూ, హింసనూ పెంచుతుందని హెచ్చరిస్తాడు.

హిందూత్వవాదులు ఇక్కడే 'ప్రమాదాన్ని' పసిగట్టినట్టున్నారు. సరిగ్గా ఈ రెండు రంగాలలోనే క్రైస్తవ సంస్థలు భారతదేశంలో విశేషమైన కృషిచేసి ఉన్నాయి. స్వాతంత్ర్యం తరువాత విద్యా వైద్య రంగాలలోకి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రవేశించకముందు ఈ రంగాలలో ఎక్కువ సేవలు అందించింది క్రైస్తవ సంస్థలే. ఇదంతా మతమార్పిడి కోసమేనని దబాయించి ఎవరినీ ఒప్పించలేరు. మిషన్

స్కూళ్ళు, మిషన్ ఆస్పత్రులు అందిచ్చిన సేవలకూ, వారు సాధించిన మత మార్పిడికీ పొంతనే లేదు. 1950ల దాకా ఈ దేశంలోని మధ్యతరగతి (అన్ని మతాల వారు) ఎక్కువ భాగం మిషన్ స్కూళ్ళలోనే చదువుకున్నారు. మధ్యతరగతే కాక పేదలు కూడా మిషన్ ఆస్పత్రుల సేవలు పొందారు. కానీ మతమార్పిడి జరిగింది కొంచమే. ఈనాటికీ భారతదేశంలో క్రైస్తవుల జనాభా 2.3 శాతం మాత్రమే ఉంది. ఇది కూడా విద్యా వైద్య సేవలను 'ప్రలోభంగా' చూపించి సాధించినది కాదు. అదే నిజమైతే ఈ దేశంలోని అన్ని కులాలవారూ మతం మార్చుకుని ఉండాలి. కానీ మారింది అత్యధిక భాగం హైందవ సమాజంలో గౌరవం, గుర్తింపులేని దళితులూ, ఆదివాసులే. దానిని 'ప్రలోభం' అనలేము. హేతుబద్ధమైన నిర్ణయం అని గుర్తించక తప్పదు. మత స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా గుర్తించిన రాజ్యాంగం దళితులకు ఆ అవకాశం ఇచ్చింది. హైందవ సమాజం ఆ అవసరం కల్పించింది.

అయినా, అమర్త్యసేన్‌కు నోబెల్ బహుమతి వచ్చింది అనగానే ఆయన విద్యా వైద్య హక్కుల గురించి మాట్లాడతాడని గుర్తుతెచ్చుకొని, క్రైస్తవ సంస్థలు ఆ రంగాలలోనే కృషిచేసి ప్రజల ఆదరణ పొందాయని జ్ఞాపకం తెచ్చుకుని, ఇన్ని శతాబ్దాల తర్వాత కూడా 2.3 శాతం దాటని మత మార్పిడుల పేరు చెప్పి ఆందోళన చెందుతున్నట్టు ప్రకటిస్తున్న ఈ విశ్వహిందూ పరిషత్ నాయకుల ఆలోచనలు పుచ్చిపోయాయని ఛీత్కరించుకోవాలా? లేకపోతే వాళ్ళ నిజమైన అభ్యంతరం అప్పుడప్పుడు జరిగే మత మార్పిడుల గురించి కాదనీ, విద్య, ఆరోగ్యం, సాంఘిక సమానత్వం దళితులకు ఆదివాసులకు కల్పించే ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసాల గురించి అని అర్థం చేసుకోవాలా? అసలు ఎవరైనా విద్య గురించి, ఆరోగ్యం గురించి మాట్లాడితే సంతోషించాలా లేక ఏవో కుట్రలు ఊహించుకుని అభ్యంతరం తెలపాలా? అభ్యంతరం తెలిపే వారి మానసికస్థితి గురించి ఏమనుకోవాలి?

సమాజంలో ఒకరిద్దరి ఆలోచనలు పుచ్చిపోయినా మనసులు కుళ్ళిపోయినా బాధపడి ఊరుకోవచ్చు. కానీ వీళ్ళీ రోజు మన సమాజాన్ని ఏలుతున్నారు. ఒక చివర పార్లమెంటరీ ప్రజాస్వామ్య పరిభాష మాట్లాడే భారతీయ జనతాపార్టీ, మధ్యలో సంస్కృతి గురించి ఆధ్యాత్మికత గురించి ఉపన్యాసాలు ఇచ్చేవారు, అటు చివర కర్రలతో, రాళ్ళతో గూండాగిరీ చేసే దళ్‌లూ సేనలూ మంచ్‌లూ – ఈ పరివారం

చాలా పెద్దదే. ఒకరినడిగితే మాకేమీ తెలీదంటూ వేరేవాళ్ళు చేసే హింసాకాండకు జవాబు చెప్పకుండా తప్పించుకుంటారు. కానీ అది 'హిందువుల న్యాయమైన ఆగ్రహం' అనో మరొకటనో వెనువెంటనే సమర్థిస్తారు. గుజరాత్‌లో క్రైస్తవసంస్థల మీద జరుగుతున్న దాడుల విషయంలో ఇదే జరుగుతున్నదని అందరం చూస్తున్నాం.

ప్రస్తుతానికి అందరం నిస్సహాయంగా చూస్తున్నాం. మనం చూసేకొద్దీ ఈ పరివారం దేశంలోని అతి పెద్ద టెర్రరిస్టు బృందంగా తయారవుతున్నది. మిగిలిన టెర్రరిస్టు బృందాలు రహస్యంగా పనిచేస్తాయి. పోలీసుదాడులకూ, సైన్యం దాడులకూ గురవుతాయి. వారి పద్ధతుల మంచిచెడులు ఎలా ఉన్నా వారిలో కొందరి లక్ష్యాలలో ఆమోదనీయమైన అంశాలున్నాయి. కాని ఈ సంఘ్ పరివార్ టెర్రరిస్టులు బహిరంగంగా పనిచేసే టెర్రరిస్టులు. 'చట్ట బద్ధంగా' అధికారం చేపట్టిన టెర్రరిస్టులు. పోలీసులూ, సైన్యమూ వీరి అదుపులో ఉన్నాయి. వీరి లక్ష్యాలలో ఆమోదనీయమైనది ఏ కోశానా లేదు.

మరి ఈ టెర్రరిజాన్ని ఎన్నాళ్ళు సహిద్దాం?

# చరిత్ర పాఠాలపైన కాషాయం నీడ

భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాలలోనూ పాఠ్యాంశాలలోనూ జోక్యం చేసుకుని వాటిని తిరగరాసే ఉద్దేశ్యం ప్రకటించడం చాలామందికి ఆందోళన కలిగించింది. ముఖ్యంగా, మన దేశ చరిత్రకు సంబంధించిన పాఠ్యాంశాలను బిజెపి తన భావాలకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నది. ఈ విషయాన్ని ఆ పార్టీగానీ ఆ పార్టీ అభిమానులుగానీ రహస్యంగా ఉంచే ప్రయత్నమేమీ చేయటంలేదు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ దృక్పథానికి అనుకూలంగా పాఠ్యాంశాలను రూపొందించుకుందనీ అది యువతను శక్తిహీనం చేసిందనీ ఇప్పుడు తాము అధికారంలోకి వచ్చాము కాబట్టి ఆ పాఠ్యాంశాలను నిజమైన జాతీయవాదం పునాది మీద తిరగరాయబోతున్నామనీ బాహాటంగానే వారు అంటున్నారు.

స్కూలు పిల్లల పాఠ్యాంశాలనూ అందులో భారతదేశ చరిత్రకు సంబంధించిన విశ్లేషణనూ భారతీయ జనతాపార్టీ ప్రభుత్వం ఇంత సీరియస్‌గా తీసుకోవడం గమనించదగ్గ విషయం. మన దేశ చరిత్ర గురించి మనకుండే అవగాహన, 'మనము' ఎవరు అనే ప్రశ్నకు ఒక జవాబు ఇస్తుంది. 'మనము' ఎవరు అనే దానితోపాటు పరాయి వాళ్ళెవరు అనే ప్రశ్నకు కూడ ఒక జవాబునిస్తుంది.

ఈ రెండు ప్రశ్నలకూ తమదైన జవాబు ఇవ్వాలని బిజెపి పాలకులు భావిస్తున్నారు. ఆ జవాబు పాఠ్యపుస్తకాల ద్వారా పిల్లల మెదళ్ళలోకి ఎక్కాలి. పాఠ్యాంశాలలో చెప్పినదానిని ప్రామాణిక 'సత్యం'గా గుర్తించడం మన విద్యా వ్యవస్థ నేర్పింది కాబట్టి, ఆ విధంగా తలకెక్కిన అభిప్రాయాలు చాలా బలంగా నిలిచిపోతాయి.

ఇది బిజెపికే మొట్టమొదటిసారి వచ్చిన అభిప్రాయం కాదు. పాఠ్యాంశాల ద్వారా పిల్లల వ్యక్తిత్వాలను తీర్చిదిద్దాలనేది పాలకులు ఎప్పుడూ చేసే ఆలోచనే.

---

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, (PDSU), నేరుగా పుస్తకరూపంలో తీసుకొచ్చిన ప్రచురణ, డిసెంబర్ 1999, హైదరాబాద్

*చరిత్ర పాఠాలపైన కాషాయం నీడ*

ఈ దేశాన్ని చాలాకాలం ఏలిన కాంగ్రెస్ పాలకులు భారతదేశ చరిత్రకు, జాతీయోద్యమానికి, భవిష్యత్ ఆదర్శాలకు ఒక రకమైన వ్యాఖ్యనిచ్చే విద్యావ్యవస్థను రూపొందించారు. దాని ద్వారా తాము కోరుకునే స్వభావంగల యువతరాన్ని తయారుచేయాలని ఆశించారు. కొంతవరకు సాఫల్యం చెందారు కూడా. రేపు కమ్యూనిస్టులయినా మరొకరైనా అధికారానికొస్తే ఇదే పని చేస్తారు.

**మరి బిజెపి చేస్తే తప్పేముంది?**

ఇప్పటివరకు మన విద్యావ్యవస్థ ఎటువంటి భావజాలం, లేక ప్రాపంచిక దృక్పథం ప్రభావం లేని వట్టి సత్యాలను పిల్లలకు చెప్తున్నదనీ, ఇప్పుడు మొట్టమొదటిసారిగా పిల్లల మెదళ్ళను ఒక దృక్పథానికి అనుగుణంగా మలిచే ప్రయత్నం జరుగుతున్నదనీ ఎవరయినా అనుకుంటే తప్పే. బిజెపి మీద అదే ఫిర్యాదయితే ఆ ఫిర్యాదు అబద్ధం.

కానీ ఏ విద్యావ్యవస్థయినా ఒక రకమైన అభిప్రాయాలను విద్యార్థులకు కలిగించి ఒక రకమైన యువతరాన్ని రూపొందించే ప్రయత్నం చేస్తుందని గుర్తిస్తున్నామంటే అర్థం అన్ని ప్రయత్నాలూ ఒకటేనని కాదు. ఇక్కడ కనీసం మూడు విషయాలు చూడవలసి వుంటుంది.

1) ఫలాన విద్యా వ్యవస్థ నేర్పించాలని చూస్తున్న విలువలు ఎట్లాంటివి? ఆ విద్యా వ్యవస్థ ద్వారా రూపొందించాలని చూస్తున్న వ్యక్తిత్వాలు ఎట్లాంటివి? సమతనూ, సహనాన్నీ, సహకారాన్నీ పెంపొందించేవా? లేక ఆధిపత్యాన్నీ, ద్వేషాన్ని, స్వార్థాన్నీ పెంచేవా?

2) ఒక రకమైన ప్రాపంచిక దృక్పథాన్ని పిల్లలలో కల్పించే ప్రయత్నం చేస్తూ కూడా అందుకు భిన్నమైన వాటిని నిజాయితీగా వివరించి చెప్పి హేతుబద్ధమైన వివేచన ద్వారా మంచి చెడులు నిర్ణయించాలనుకునే తత్వాన్ని ఆ విద్యావ్యవస్థ ప్రోత్సహిస్తుందా? లేక ఏకైక సత్యంగా తమ అభిప్రాయాలు నేర్పించి మిగిలిన వాటిని తొక్కేయడమో లేక వక్రీకరించడమో చేస్తుందా?

3) తాను నమ్మే విలువలు, తాను చేసే వ్యాఖ్యలపట్ల ఆ విద్యావ్యవస్థ శాస్త్రీయ వైఖరిని కలిగి ఉంటుందా? అంటే వాటిని వాస్తవాల పరీక్షకు

నిలబెట్టడానికి సిద్ధపడుతుందా? లేకపోతే తనకు అనుకూలమైన వాస్తవాలను మాత్రమే చూపించి తక్కిన వాటిని చూపడానికి నిరాకరిస్తుందా?

బిజెపి పాలకులు విద్యావ్యవస్థలో తీసుకురావాలని చూస్తున్న మార్పులు పై మూడు కోణాలలో కూడా ఇప్పుడున్న దానిని మరింత వెనక్కి తీసుకుపోతాయి.

ఈ విషయాన్ని వివరంగా చూసే ముందు బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చీ రాగానే మొట్టమొదటి కార్యక్రమంగా దీనినే ఎందుకు చేపట్టిందో కొంచెం చూద్దాం. ఏ రాజకీయ పక్షమైనా తన ఆలోచనలకు అనుకూలమైన ప్రాపంచిక దృక్పథాన్ని సమాజంలో – ముఖ్యంగా యువతలో – కల్పించే ప్రయత్నం చేస్తుందని పైన చెప్పుకున్నాము. కానీ అన్ని రాజకీయ పక్షాలూ అదే మొదటిపనిగా పెట్టుకోవు. కమ్యూనిస్టు పార్టీలు అధికారానికి వచ్చిన రాష్ట్రాలలో భూ సంస్కరణల వంటి చర్యలకు మొదటి ప్రాధాన్యం యిచ్చాయి. దళిత బహుజన రాజకీయ పక్షాలు అధికారంలోకి వచ్చిన రాష్ట్రాలలో రిజర్వేషన్ల అమలు, దళిత బహుజన వర్గాల ప్రాతినిధ్యాన్ని వివిధ సామాజిక రాజకీయ రంగాలలో పెంచే చర్యలు మొదటి ప్రాధాన్యతగా చేపట్టాయి. మన చంద్రబాబు గ్లోబలైజేషన్ చర్యలకు మొదటి ప్రాధాన్యం యిస్తున్నాడు. భారతీయ జనతాపార్టీ పాలకులు అధికారంలోకి వచ్చీ రాగానే విద్యా వ్యవస్థమీద, అందులోనూ చరిత్ర పాఠ్య పుస్తకాల రూపకల్పన మీద ఎందుకు వివాదం లేవదీస్తున్నారు?

భారతీయ జనతాపార్టీ కేవలం రాజకీయ లక్ష్యాలు గల పార్టీ కాదు. అది హైందవ సంఘ్ పరివార్‌లో భాగం. సంఘ్ పరివార్ ఈ దేశాన్ని తాను నమ్మే హైందవ ధర్మం, సిద్ధాంతం ప్రాతిపదికన నిర్మించదలచుకుంది. ఈ దేశంలో ప్రతి వ్యక్తీ 'నేను' అనేదానిని హైందవ స్రవంతిలో భాగంగా నిర్వచించుకోవాలి. 'హిందూత్వం' అని పిలువబడే సామాజిక సంస్కృతి అందరి ఆలోచనలనూ వ్యక్తిత్వాలనూ తీర్చిదిద్దాలి. ఇది దేనికో సాధనం కాదు. ఇదే వారి లక్ష్యం. దీనికి వాళ్ళు విద్యారంగాన్ని, సాంస్కృతిక, ప్రసార రంగాలను ముఖ్య సాధనాలుగా ఎంచుకున్నారు. సంఘ్ పరివార్ అంటే ఖాకీ నిక్కర్లు వేసుకునే ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలేననుకోనక్కరలేదు. బిజెపికి వోట్లు వేసే వాళ్ళు మాత్రమే ననుకోనక్కరలేదు. సంఘ్ పరివార్ నిలబెట్టదలచుకున్న ప్రాపంచిక దృక్పథం

ఈ దేశంలో శతాబ్దాలుగా ఆధిపత్యం చలాయించిన దృక్పథం. దానిని నమ్మేవాళ్ళు హైందవ పెత్తందారీ కులాలలోనూ, కొంతమేరకు బిసి కులాలలోనూ కూడా చాలామంది ఉన్నారు. అది కేవలం వారి మెదళ్ళలో ఉన్న నమ్మకం కాదు. అది వారి నిత్యజీవిత ఆచరణలో భాగం. వారి వ్యక్తిత్వంలో భాగం. రాజకీయాలలో వారంతా బిజెపి వోటర్లే కానక్కరలేదు. కాంగ్రెస్ వోటర్లు కావచ్చు, తెలుగు దేశం వోటర్లు కావచ్చు. కొద్దిమంది కమ్యూనిస్టు వోటర్లు సహితం కావచ్చు. వీరిలో చాలామంది సాంఘికంగా బుద్ధిజీవుల వర్గానికి చెందినవారు కావడంవల్ల హైందవ ప్రాపంచిక దృక్పథాన్ని ప్రచారం చేసే సాధనాలుగా నిత్యం పనిచేస్తూనే ఉంటారు. రచయితలయినా పత్రికా విలేకరులయినా అధ్యాపకులయినా పాఠ్య పుస్తక రచయితలయినా కళాకారులయినా వీరు హిందూత్వ భావ ప్రచారానికి నిత్యం తమ జీవిత రంగాలలో తోడ్పడుతూనే వుంటారు.

అంతేకాక, నిర్మాణపరంగా కూడా విద్యారంగంలో సంఘ్ పరివార్ విశేషంగా ప్రవేశించింది. సరస్వతీ శిశు మందిరాలే కాకుండ అంతకంటే పెద్ద పిల్లల స్కూళ్ళు కూడా అనేకం నడుపుతున్నది. కేవలం పాఠాలు చెప్పినంత మాత్రాన పిల్లల ఆలోచనలను సంపూర్ణంగా మలచటం సాధ్యమా అని అడగవచ్చును. కానీ ఇవి ఇప్పటికే సమాజంలోనూ సామాజిక జీవితంలోనూ బలంగా వున్న ఆలోచనలని మరిచిపోకూడదు. ఆ పిల్లలు ఇప్పటికే తమ నిత్య జీవితంలో ఈ ఆలోచనలకు అలవాటుపడి వుంటారు. వాటిని పాఠశాలలో తిరిగి నేర్చుకోవడం కొత్త విషయాన్ని నేర్చుకోవడం కాదు. అప్పటికే తమ ఆలోచనలలో భాగమైన విషయాలకు, పాఠశాలలో నేర్చుకునేది ప్రామాణిక 'సత్యం' అన్న భావన ద్వారా మరింత బలం సమకూర్చుకుని పాత విషయాన్నే మరింత గట్టిగా, అధికారికంగా నేర్చుకోవడం మాత్రమే.

భారతీయ జనతాపార్టీ రాజకీయాలలో బలపడి అధికారం చేపట్టిన క్రమంలో, సంఘ్ పరివార్ ఇప్పటిదాకా పౌరసమాజంలో చేస్తున్న పనిని రాజ్యాధికారం ద్వారా కొనసాగించే అవకాశం వారికి దక్కింది. ఏ కొంచెం అధికారం తమ చేతిలోకి వచ్చినా దానిని ఇందుకోసం వారు వినియోగిస్తూనే ఉన్నారు.

ఒక దశాబ్దం కింద భారతీయ జనతా పార్టీ ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో అధికారం చేపట్టినప్పుడు పాఠ్యపుస్తకాలలోనూ పాఠ్యాంశాలలోనూ ప్రవేశపెట్టిన మార్పులు రేపు జాతీయ స్థాయిలో వీరు చేయబోయే ప్రయోగాలకో సూచిక. పాఠ్యాంశాలలో అన్నిటి కంటే చరిత్రకు వీరు ఎక్కువ ప్రాముఖ్యం ఇస్తారు. దానిని తిరగ రాసే ప్రయత్నం ఎక్కువ చేస్తారు.

హైందవ జీవన విధానం చాలా గొప్పది. ముస్లింలు రాక పూర్వం అది అనన్యమైన వైభవాన్ని అనుభవించింది. ముస్లింలు వచ్చి మన దేశాన్ని లోబరచుకోవడంతో ఆ హైందవ వైభవానికి తొలిగ్రహణం పట్టింది. తరువాత బ్రిటిష్ వాళ్ళు (క్రైస్తవులు) వచ్చి కేవలం భారతదేశాన్ని లోబరచుకోవడమే కాక హైందవ జీవన విధానం అనాగరికమైనదనీ మూఢాచారాలకు నిలయమనీ ప్రచారం చేయడం హైందవ వైభవానికి పట్టిన రెండవ గ్రహణం. స్వాతంత్ర్యం తరువాత దీని నుండి బయటపడే అవకాశం వచ్చి కూడా లౌకిక వాదం పేరిట వెయ్యేళ్ళ బానిసత్వాన్ని కొనసాగిస్తున్నాము. ఇదీ క్లుప్తంగా, వాళ్ళు ప్రచారం చేయదలచుకున్న చారిత్రక దృక్పథం.

ఇస్లాం, క్రైస్తవం 'విదేశీ మతాలు' కాబట్టి వాటిని అనుసరించే వారు హిందువుల హక్కులకు తల ఒగ్గాలని వీరు అంటారు. కాబట్టి, హైందవం పూర్తిగా స్వదేశీయమేనని వాదించడం వీరికి అవసరం. పరాయి వాళ్ళ నుండి భారతీయతను కాపాడుకోవడం వీరి రాజకీయాధికారంలో అత్యంత ముఖ్యమైన భావన. కానీ దాదాపు చరిత్రకారులందరూ వైదిక ఆర్యులు ఈ గడ్డకు చెందినవారు కారనీ, మధ్యఆసియా నుండి వలసవచ్చారనీ అంటారు. హైందవానికి మూలంగా హిందూత్వవాదులు భావించే వేదాలలో మొదటిదయిన ఋగ్వేదం ఈ నేలమీద రూపొందించినది కాదు. ఇరాన్‌లోనో అఫ్ఘానిస్తాన్‌లోనో అది జరిగింది. పంజాబు ప్రాంతానికి వచ్చిన ఆర్యులు ఋగ్వేదాన్ని తమతో తీసుకొచ్చారు. వారి హైందవం కూడా (ఈ అర్థంలో) విదేశీ మతమే అయితే ముస్లింలనూ క్రైస్తవులనూ తిట్టడం ఎట్లా? పరాయి ప్రభావాల నుంచి మనల్ని మనం కాపాడుకోవడమే జాతీయతకు నిర్వచనం అనే అభిప్రాయాన్ని నిలబెట్టుకోవడం ఎట్లా? కాబట్టి అన్ని చారిత్రక ఆధారాలకూ విరుద్ధంగా ఆర్యులు ఇక్కడివారేననీ ఎక్కడి నుండీ రాలేదనీ

వాదించాలి. ఐదేళ్ళ క్రితం ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలోని చరిత్ర పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టిన మార్పులలో ఇది ప్రముఖమైనది. ఆర్యులు మధ్యఆసియా నుండి వచ్చారనడానికి చరిత్రకారులు అనేక ఆధారాలు చూపించారు. భాష నుండి పురావస్తు అవశేషాల దాకా అనేక ప్రమాణాలు చూపించారు. వీటిలో దేనికీ జవాబు చెప్పకుండా, 'ఇదే నిజం' అని పిల్లల పాఠ్యపుస్తకాలలో తన అభిప్రాయాన్ని రాసి అచ్చువేసేయడం ద్వారా చరిత్ర తాను కోరుకున్నట్టు జరిగిందని సంఘ్‌పరివార్ నిరూపించాలని చూస్తున్నది.

వేదాలతోనే మన చరిత్ర, సంస్కృతి మొదలవుతాయని, సంస్కృత భాషే మన తొలి భాష అనే నమ్మకం కూడా హిందూత్వవాదుల దృక్పథానికి అవసరం. హరప్పా – మొహంజదారో నాగరికత అంతకంటే పూర్వమే ఉందనీ, అది 'ఆర్య' నాగరికత కాదనీ, వారి భాషకు సంస్కృతంతో గానీ సంస్కృతాన్ని పోలిన ఇండో యూరోపియన్ భాషతో గానీ పోలిక లేదని చరిత్రకారులు దాదాపు ఏకగ్రీవంగా నమ్ముతారు. హిందూత్వవాదులు తిరగ రాయదలచుకున్న చరిత్రలో హరప్పా నాగరికతను కూడా ఆర్యులకే అంటగడతారు.

రాబోయే రోజులలో ఈ విషయాన్ని గురించి చాలా వివాదం చెలరేగే అవకాశం ఉంది. కాబట్టి దీనిని ఇంకొంచెం వివరంగా తెలుసుకోవడం అవసరం. 'ఆర్య' శబ్దాన్ని ఒక 'జాతి'కి అంటగట్టడం హిందూత్వవాదులకు అవసరం. ఆ జాతి 'మన' పూర్వీకులు, వారే ఇక్కడ తొలి నాగరికతను రూపొందించారు. వారి భాష సంస్కృతం, వారి సాహిత్యం వేదసాహిత్యం, వారి జీవన విధానం హైందవం. ఇవన్నీ హిందుత్వవాదులు పునర్లిఖించదలచుకున్న చరిత్రకు కేంద్ర భావాలు. ఈ సుందరమైన నాగరికత ముస్లింల రాకతో ధ్వంసమై ఈ ప్రజలు బానిసత్వంలోకి పోయారనేది తరువాతి చరిత్రకు వారిచ్చే వ్యాఖ్య.

కానీ, చరిత్రకారుల దృష్టిలో 'ఆర్య' శబ్దం ఒక జాతిని సూచించేది కాదు. అది ఒక భాషను లేక ఒక భాషాకుటుంబాన్ని సూచించే మాట. ఈ భాషలను ఇండో – యూరోపియన్ భాషలు అంటారు. సంస్కృతంతో సహా అనేక యూరోపియన్ భాషలు ఈ కుటుంబానికి చెందినవి. వీటికి మూలమైన తొలి భాష ఒకటి ఉంటుందన్న అభిప్రాయం చరిత్రకారులలో ఉంది. ఆ భాష ఛాయలు

క్రీ.పూ. 1800 ప్రాంతంలో మొట్టమొదటిసారి పశ్చిమాసియాలో కనిపిస్తాయి. తరువాత ఇరాన్, అఫ్ఘానిస్తాన్‌లలో, సింధూనది ప్రాంతంలో ఆ భాష మాట్లాడే ప్రజలు కనిపిస్తారు.

అప్పటికే ఈ ప్రాంతమంతటా వేరే భాషలు మాట్లాడే ప్రజలున్నారు. వాళ్ళలో కొందరి నాగరికత ఈ 'ఆర్య' భాష మాట్లాడే నాగరికతకన్నా మెరుగయినదే. 'ఆర్య' భాష ఇరాన్ ప్రాంతంలో పర్షియన్ భాషగానూ, సింధూ గంగా నదుల ప్రాంతంలో సంస్కృతంగానూ (స్థానిక భాషల ప్రభావం వల్ల కొంత మార్పు చెంది) స్థిరపడింది. రుగ్వేదం సంస్కృతంలోని మొదటి సాహిత్యం. ఇది క్రీ.పూ. 1500–1000 సంవత్సరాల కాలానికి చెందినదనీ, దీనిని రూపకల్పన చేసినది ('రాసినది' అనలేము) ప్రస్తుత అఫ్ఘానిస్తాన్ ప్రాంతంలోననీ రొమిల్లా థాపర్ అంటారు. ఈ రుగ్వేద కాలపు సంస్కృతం తరువాతి కాలపు సంస్కృతం కంటే ప్రాచీన పర్షియన్‌కు సన్నిహితమైనది.

'ఆర్య' శబ్దం జాతిని కాక భాషను సూచించే మాటేననుకున్నా, ఆ భాష మాట్లాడే ప్రజలేమైనా పెద్దఎత్తున సింధూ – గంగా నదుల ప్రాంతానికి వలసవచ్చారా? వారి వలస ద్వారానే (ఆ క్రమంలో స్థానిక భాషలతో కలిసి ఒక రూపం తీసుకున్న) సంస్కృతం భాష ప్రచారమయ్యిందా? ఇటువంటి వలస జరిగిందనీ నిజానికి రెండు విడతలుగా 'ఆర్య' భాష మాట్లాడే ప్రజలు సింధూ–గంగానదుల ప్రాంతానికి వచ్చారనీ, అంతకు ముందు ఉన్న హరప్పా నాగరికతను వారు ధ్వంసం చేసారనీ నమ్మే చరిత్రకారులున్నారు. కోశాంబి వీరిలో ఒకరు. అయితే మనుషుల భౌతిక వలస కంటే భాష, దానితో సన్నిహితంగా ముడిపడిన కర్మకాండ వ్యాప్తి చెందడమే ఎక్కువ జరిగిందని భావించే చరిత్రకారులు కూడా వున్నారు. రొమిల్లా థాపర్ వీరిలో ఒకరు. అయితే 'ఆర్యుల' భౌతిక వలస జరిగిందని నమ్మే కోశాంబి సహితం వారుగానీ వారి భాషగానీ 'శుద్ధం'గా ఉండిపోలేదనీ, స్థానికులతోనూ వారి భాషాసంస్కృతులతోనూ కలగలిసి చాలా మార్పుకు లోనుకావడం జరిగిందనీ అంటారు.

మొత్తానికి 'ఆర్య' భాషా సంస్కృతుల రాక (లేక రూపకల్పన) కంటే పూర్వమే ఇక్కడ భాషలున్నాయి, సంస్కృతులున్నాయి. అవే స్థానికమైనవి. మన

భాషాసంస్కృతులలోని 'ఆర్య' అంశ బయటి నుండి వచ్చింది. అది మనుషుల వలస రూపంలోనే ప్రధానంగా వచ్చిందా లేదా సాంస్కృతిక విస్తరణే ప్రధానమా అన్న విషయం అటుంచి, అది బయటి నుండి వచ్చి స్థానిక భాషా సంస్కృతులతోనూ ప్రజలతోనూ మిళితమయింది. ఈ క్రమంలో మన హిందూత్వ వాదులు భారతీయ సంస్కృతి అని పిలుచుకునేది రూపొందింది. దేశ చిత్రపటం మీద భక్తి పెంచుకొని సరిహద్దులలో పుట్టిన సంస్కృతే 'భారతీయం' అనీ బయట పుట్టిన దానిని ఆదరించే ముస్లింలు, క్రైస్తవులు విదేశీ మానసపుత్రులనీ అనేటట్టయితే అది హైందవానికి కూడా వర్తిస్తుంది.

హిందూత్వ వాదులకు ఈ సంగతి తెలుసును కాబట్టే ఆర్యులు ఇక్కడి వారేనని వాదించడం వారికి అవసరమయింది. ఆ కోణం నుండి చరిత్ర పాఠాలను తిరగరాయడం అవసరం అయింది. పైగా 'మన' పూర్వీకులుగా వారు భావించే ఆర్యులను కేవలం భాషా సంస్కృతులను సూచించే సమాజంగా కాక ఒక 'జాతి'గా భావించుకోవడం వారికి అవసరం. గొప్ప విజ్ఞానవంతులు, ద్రష్టలు అయిన ఆర్యులు 'భారతజాతి' పూర్వీకులనీ, వారే ఇక్కడి తొలి నాగరికతను నిర్మించిన వారనీ హిందూత్వవాదులు నమ్ముతారు. ముస్లింల రాకతో ఆ నాగరికత పతనమయిందంటారు.

అయితే 'ఆర్యుల' రాకకు పూర్వం – కనీసం వెయ్యి సంవత్సరాల పూర్వం – సింధూనది లోయలోనూ పశ్చిమ ఆసియాలోని మెసపటోమియాలోనూ కూడా నాగరికతలున్నాయి. సింధు నాగరికత కేంద్రాలయిన హరప్పా, మొహంజదారోలు అప్పటికే పట్టణ నాగరికతలు. తరువాత వచ్చిన ఆర్య నాగరికత పశుపోషక సంచార నాగరికత కాబట్టి వారూ వీరు ఒకరేనని దబాయించడానికి వీలులేదు. హరప్పా వాసుల లిపిని ఇప్పటిదాకా ఎవరూ చదవలేకపోయారు గానీ దానిని 'ఆర్య' భాషగా భావించి చదివే ప్రయత్నాలకంటే ద్రవిడ భాషగా భావించి చదివే ప్రయత్నాలే కొంత ఎక్కువ సంతృప్తినివ్వగలుగుతున్నాయని రొమిల్లా థాపర్ అంటారు.

మొత్తానికి 'ఆర్యులు' అనేది ఒక 'జాతి' కాదు. అది భాషా సంస్కృతులను సూచించే మాట. ఆ భాషా సంస్కృతులు కలిగిన ప్రజల భౌతిక వలసల వల్ల

కావచ్చు, లేక ఇతర రూపాలలో జరిగిన వ్యాప్తివల్ల కావచ్చు (ఇవి రెండూ జరిగాయిగానీ ఏది ప్రధానం అనేది వివాదాస్పదంగా ఉంది) ఈ 'ఆర్య' అంశ క్రీ.పూ. 1500 ప్రాంతంలో సింధూనది ప్రాంతానికి చేరింది. సంస్కృత భాష, దానితో సన్నిహితంగా ముడిపడిన కర్మకాండ, పౌరోహిత్య ప్రాముఖ్యం, పశు పోషక జీవన విధానం దీని లక్షణాలు. అప్పటికే అనేక ఆర్యేతర భాషా సంస్కృతులు ఇక్కడ స్థిరపడి ఉన్నాయి. ఆ భాషలు సంస్కృతం లాగ ఇండో - యూరోపియన్ భాషా కుటుంబానికి చెందినవి కావు. ఆ సంస్కృతి వైదికం కాదు. ఆ భాషలు ద్రవిడపూర్వ భాషా కుటుంబానికీ, టిబెటో-బర్మన్ భాషా కుటుంబానికీ, ఆస్ట్రోఏషియాటిక్ భాషా కుటుంబానికీ చెందినవి. ప్రాదేశికతను బట్టి మన-తన నిర్ణయించేటట్టయితే ఈ ఆర్యేతర భాషలు, ఈ అవైదిక సంస్కృతే 'మనవి'. ఆర్య భాషా సంస్కృతులు, వాటి నుండి ఆవిర్భవించిన హైందవం పరాయివి. ఈ పరాయి జనం అత్యున్నతమైన స్థానిక ఆర్యేతర నాగరికత అయిన హరప్పా నాగరికతను బలప్రయోగంతో నాశనం చేశారని కోశాంబి వంటి చరిత్రకారులు నమ్ముతుండగా, హరప్పా నాగరికత పర్యావరణ మార్పులకు తట్టుకోలేక పతనం అయిందనీ అది ఆర్య ఆగమనం కంటే ముందే జరిగిందనీ రొమిలా థాపర్‌తో సహా తరువాతి చరిత్రకారులు నమ్ముతారు.

నిజానికి ప్రాదేశికతను బట్టే మన-తన అనేది నిర్ణయించనవసరం లేదు. ముస్లింలకు, క్రైస్తవులకు సమాన హక్కులు ఇవ్వడం ఇష్టంలేని హిందూత్వవాదులు తీసుకొచ్చిన వికృతమైన తర్కం ఇది. 'ఎక్కడినుండో వచ్చి ఇక్కడి ప్రజలతో మీరెంతో మేమంతే అంటారా?' అనేది మైనారిటీలకు వ్యతిరేకంగా వారు ప్రయోగించే వాదన. నిజానికి ఈనాడు ఈ దేశంలో ఉన్న ముస్లింలు, క్రైస్తవులు 'ఎక్కడినుండో' రాలేదు. వారంతా ఇక్కడివారే. ఈ సంగతి హిందూత్వవాదులకు తెలుసు. అయితే వారు కాకపోయినా వారు నమ్మే మతం 'పరాయి ప్రాంతాలకు' చెందినదే కదా. ఆ మతం ఇక్కడి ప్రజల మతంతో సమాన ప్రతిపత్తి ఎట్లా కోరుకుంటుంది? మసీదులో ప్రార్థనలు జరిగే టైంలో మసీదు ముందు బాజా భజంత్రీలు వాయించొద్దని ఇక్కడి ప్రజల సంస్కృతి పైన ఆంక్షలెట్లా పెడతారు? ఇక్కడి ప్రజల దేవుడయిన రాముడి గుడిని పరాయివాళ్ళు కూల్చేసి అక్కడే పరాయి

మత ప్రార్థనాస్థలాన్ని కడితే ఇక్కడి ప్రజలు దానిని లౌకికవాదం పేరిట భరించవలసిందేనా? ఇత్యాది ప్రశ్నలు హిందూత్వవాదులు చాలా ఉద్రేకంతో అడుగుతారు.

ఒక వేళ హైందవం ఈ గడ్డమీద ఆవిర్భవించిన మతమే అయినా ఇస్లాం, క్రైస్తవం సమాన హక్కులు కోరుకోవడంలో తప్పులేదు. అవి ఒకప్పుడు ఎక్కడో పుట్టి ఉండవచ్చును. కానీ ఇప్పుడు ఆ మతాలను అనుసరించే ప్రజలు కోట్ల సంఖ్యలో ఈ దేశవాసులలోనే ఉన్నారు. అవి పరాయి మతాలెట్లా అవుతాయి? ఈ రోజు అవి రెండూ మన దేశానికి (కూడా) చెందిన మతాలే. ఆ ప్రజలకు సమాన హక్కులు ఎట్లా నిరాకరిస్తారు?

నిరాకరించేటట్టయితే హైందవం మూలాలు కూడా బయటి నుండి వచ్చిన ఆర్య సంస్కృతిలో ఉన్నాయి కదా. ఆ కారణంగా తాము ముస్లింలకూ క్రైస్తవులకూ వర్తింపజేసే తర్కం హిందువులకు తెలుసును కాబట్టే చరిత్రను తిరగరాసి ఆర్యులు ఇక్కడివారేనని పాఠ్య పుస్తకాల చేత చెప్పించే ప్రయత్నం చేస్తున్నారు.

హైందవం ముస్లింల రాకకు పూర్వం చాలా ఉచ్ఛ స్థితిలో ఉండేదనీ ముస్లింలు వచ్చి హిందువులను బానిసలు చేసుకున్న క్రమంలోనే హైందవంలోకి నీచమయిన లక్షణాలు ప్రవేశించాయనీ కూడా వీళ్ళు అంటారు. అంతవరకు మనుషులను గుణాన్ని బట్టి వర్గీకరించిన వర్ణవ్యవస్థ ఉండిందనీ, ముస్లింరాజుల రాకవల్ల భారతీయ సంస్కృతి దెబ్బతిని కరుడుగట్టిన కులవ్యవస్థ ఏర్పడిందనీ, అప్పటి దాకా మగవాడి సహధర్మచారిణిగా గుర్తించబడిన స్త్రీ ఆ తరువాత మగవాడికి బానిస అయిందనీ కూడా అంటారు.

పది సంవత్సరాల క్రింద మధ్యప్రదేశ్‌లో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం ఒక చరిత్ర పాఠ్యగ్రంథాన్ని ప్రవేశపెట్టింది. దాని పేరు 'భారత్‌కీ సాంస్కృతిక్ విరాసత్'. అందులో ఈ విధంగా అన్నారు. 'గత వెయ్యి సంవత్సరాల చారిత్రక పరిస్థితుల కారణంగా తొలినాటి సాంస్కృతిక ఔదార్యాన్ని మన సమాజం కోల్పోయింది. దీనికి కారణం మన బలహీనత కాదు. సామాజిక రాజకీయ ఘటనలకిది సహజ పర్యవసానం.' ఇక్కడ 'వెయ్యి సంవత్సరాల చారిత్రక పరిస్థితులు' అనేది ముస్లిం రాజుల పాలనను సూచిస్తుందని వేరే చెప్పనవసరం

లేదు. 'ప్రాచీనకాలం ప్రధానంగా ఆధ్యాత్మిక యుగం. అది భారతదేశ స్వర్ణయుగం. ఆ తరువాత విదేశీ దాడులు మొదలయ్యాయి. ఈ విదేశీ దాడులు మన సాంస్కృతిక వ్యక్తిత్వాన్ని దెబ్బతీశాయి. మార్పుకు తావు ఉన్న వర్ణ వ్యవస్థ స్థానంలో కరుడుగట్టిన కులవ్యవస్థ వచ్చింది. స్త్రీలు స్వేచ్ఛను కోల్పోయారు. సహధర్మచారిణిగా వుండిన స్త్రీ దాసీ అయింది. సతీసహగమనాలు మొదలయ్యాయి... అంటరానితనం పాటించడం మొదలయింది. దాని ఫలితంగా సమాజంలో ఒక వర్గం క్రూరమైన అణచివేతకూ అసమానతకూ గురి అయింది' అని స్కూలు పిల్లలకోసం ఉద్దేశించిన ఈ పాఠ్యపుస్తకం అంటుంది.

హైందవ సంస్కృతి ఉన్నతమైన దశ నుండి నీచమైన దశకు పడిపోయింది అనడమే కాక, ఆ మార్పును 'ముస్లింల దాడులతో' ముడిపెట్టడం ఇంకా విచిత్రమైన విషయం. కులవ్యవస్థ గురించి చాలా క్రూరమైన, కఠినమైన నియమాలు పెట్టిన మనుస్మృతి ముస్లింరాజుల రాక కంటే చాలా పూర్వమే ప్రకటించబడింది. మనుస్మృతి క్రీ.పూ. 200 నుండి క్రీ.పూ. 500 మధ్యకాలానికి చెందినదని చరిత్రకారుల అంచనా. అప్పటికి ముస్లిం రాజులు భారతదేశానికి రావడం సంగతి అటుంచి ప్రవక్త మహమ్మదే పుట్టలేదు ! నిజానికి కుల నీతిని వివరంగా సూత్రీకరించిన స్మృతులు (ధర్మశాస్త్రాలు) అన్నీ మహమ్మదు పుట్టక ముందు (ఒకటి రెండు మినహాయింపులుంటే ఉండవచ్చును) రూప కల్పన చేసినవే. స్త్రీలను దాసీలుగా ప్రకటించినది కూడా ఈ స్మృతులే. వాటన్నింటిలోకీ మనుస్మృతి స్త్రీలపట్ల అతి క్రూరమైనది. అంటరానితనం మాటకొస్తే, క్రీస్తు పూర్వానికి (ఇంక మహమ్మదు సంగతి ఎందుకు !) చెందిన అర్థశాస్త్రంలోనూ ఆపస్తంబ ధర్మసూత్రం లోనూ ఇతర బ్రాహ్మణ సాహిత్యంలోనూ అంటరానితనం ప్రస్తావన ఉంది. చండాలురను చాలా ప్రాచీన కాలం నుండి కూడా అంటరానివారిగా చూశారు. యజుర్వేదంలోనే (అంటే మహమ్మదు పుట్టుకకు ఎంత లేదన్నా వెయ్యి సంవత్సరాలు పూర్వం) ఈ ప్రస్తావన ఉంది ! ఈ తప్పంతా 'ముస్లింల దాడుల'పైన పెట్టడం హాస్యాస్పదం. కోశాంబి విశ్లేషణలో అక్కడ అరేబియాలో ఇస్లాం ఆవిర్భవిస్తున్న సమయంలోనే ఇక్కడ హైందవ నాగరికతలోని పట్టణ నాగరికత అంతరించిపోయి గ్రామాలకు కుదించుకుపోయింది. అప్పటికే చాలా మూర్ఖంగా

ఉన్నది అంతకంతకూ మరింత మూర్ఖంగా తయారయింది. ఘజనీ, ఘోరి మహమ్మద్‌ల రాకకోసం కులవ్యవస్థ కాచుకోలేదు.

కాగా ఘజనీ, ఘోరి మహమ్మద్ దాడులను 'భారతదేశం'పైన 'ముస్లింల' దాడులుగా భావించడం ఎంతవరకు సబబు? ఈనాటి ఆఫ్ఘనిస్తాన్ ప్రాంతంలోని ఒక చిన్న రాజ్యాన్ని పరిపాలిస్తున్న ఒక రాజు ఈనాటి పంజాబు రాష్ట్రంలోని మరొక చిన్న రాజ్యంపైన వెయ్యేళ్ళ క్రితం చేసిన దాడిని 'భారతదేశం మీద ముస్లింల దాడి'గా వర్ణించడంలో అర్థమేమయినా ఉందా? ఈనాటి సరిహద్దులనూ సార్వభౌమత్వాన్నీ వెయ్యేళ్ళనాటి ఘటనలకు అన్వయించడం బొత్తిగా అచారిత్రకమైన వ్యాఖ్యానశైలి.

కానీ సంఘ్‌పరివార్ చారిత్రక దృక్కోణం అదే. ముస్లింలయిన రాజులు తమ రాజ్య విస్తరణలో భాగంగా ఈనాటి భారతదేశం సరిహద్దులోపల ఉన్న రాజ్యాలపైన చేసిన దాడులన్నీ భారతదేశం మీద పరమతస్తులయిన విదేశీ దుండగుల దాడులే. వారితో యుద్ధంచేసిన రాజులందరూ హిందూమతాన్నీ భారతదేశాన్నీ పరాయి దాడి నుండి కాపాడడానికి పోరాడిన దేశభక్తులే. ఇప్పుడు చరిత్ర పుస్తకాలలో ఈ విధంగా రాయడం లేదని వారికి కోపం. అది జాతీయ భావాలనూ దేశభక్తినీ మనలో ఎదగకుండా అడ్డం పడుతున్నదని ప్రస్తుత విద్యావ్యవస్థపైన వారి అభియోగం. చరిత్ర పాఠ్య పుస్తకాలను తిరగరాసి దేశభక్తి యుతమైన యువతను తయారుచేయాలన్నది వారి ఆకాంక్ష.

ఒకవేళ అట్లా వ్యాఖ్యానిస్తే మాత్రం తప్పేముంది అని అడగవచ్చు. అటువంటి వ్యాఖ్యానాలవల్ల దేశభక్తి నిండిన యువకులు తయారయితే మంచిదేకదా అనొచ్చు. కానీ సంఘ్ పరివార్ నమ్మే దేశభక్తి స్వభావాన్ని అర్థం చేసుకుంటే తప్ప ఈ సందేహం తీరదు. సంఘ్ పరివార్ వారి సరస్వతీ శిశు మందిరాలలో ఉపయోగించే పాఠ్యపుస్తకాలలో? ఈ క్రింది వాక్యాలు చూడండి.

*'వందలాదిగా దుర్మార్గులయిన రాక్షసులు మన దేశాన్ని ఆశగా చూశారు. పెద్ద పెద్ద సైన్యాలతో దోపిడీదారులు మన దేశం మీదికి వచ్చారు. కొంతమంది తాము ప్రపంచ విజేతలమని ప్రకటించుకుని వచ్చారు గానీ తోకముడిచి పారిపోక తప్పలేదు. కొందరు భారతదేశాన్నంతా పరిపాలించాలని ప్రయత్నం చేశారుగానీ దానికోసం జీవితాంతం పోరాటం*

*చేస్తూనే ఉండిపోయారు. వాళ్ళకు కంటి నిండా నిద్రపట్టలేదు పాపం. కొంతమంది హైందవ మతాన్ని పెకిలించి వేయాలని చూశారుగానీ వారే పెకిలించి వేయబడ్డారు. ఆ తరువాత ఒక చేతిలో కత్తి, ఒక చేతిలో ఖురాన్ పట్టుకున్న దుండగులు వచ్చారు. అనేక మంది హిందువుల మెడ మీద కత్తిపెట్టి ముస్లింలుగా మార్చారు. స్వాతంత్ర్యం కోసం జరిగిన ఈ పోరాటం ధర్మయుద్ధం రూపం తీసుకుంది. మతం కోసం అసంఖ్యాకులు బలిదానం ఇచ్చారు. మనం ఒక యుద్ధం తరువాత ఒక యుద్ధం గెలుస్తూపోయాము. మనం విదేశీ పాలకులను నిలబడనీయలేదు గానీ మన నుండి వేరయిపోయిన సోదరులను తిరిగి హిందువులుగా మార్చలేకపోయాము... ఈ వేలాది సంవత్సరాలలో లక్షలాది విదేశీయులు వచ్చారు. కానీ అందరూ అవమానకరమైన ఓటమి చవిచూశారు...కొందరిని మనం జీర్ణించుకున్నాము... మనం విడిపోయి ఉన్నప్పుడు మన వాళ్ళెవరో పరాయి వాళ్ళెవరో నిర్ణయించుకోలేకపోయాము. అప్పుడు వారిని జీర్ణం చేసుకోలేకపోయాము. ఏవో కొన్ని ఒత్తిడులవల్ల మన నుండి వేరయిపోయిన వారిని కూడా మనం జీర్ణించుకోలేక పోయాము. వారు ఈనాడు ముస్లింలు, క్రైస్తవులు...'*

రేపు వీళ్ళు తిరగరాయబోయే చరిత్ర పాఠ్యపుస్తకాలు ఈ విధంగా ఉండబోతాయి. ఇది దేశ ప్రజలను నిజంగా ప్రేమించే దేశభక్తి గొంతేనా? ఈ వాక్యాలలో 'మనము' అంటే ఎవరు? ముస్లింలు క్రైస్తవులు అందులో భాగం కారు. వాళ్ళనింకా 'జీర్ణం' చేసుకోవలసి ఉంది. ఈ చరిత్రలో ప్రజలంతా విదేశీ దుండగులపైన దేశభక్తియుతమైన పోరాటాలు చేస్తూనే వున్నారు. 'భారతదేశం' అనే భావన, సరిహద్దులతో సహా, ఎప్పటినుంచో ఉంది. దానిని మొత్తంగా కబళించాలని ప్రతీ విదేశీయుడు ఆశిస్తుండగా ఈ దేశాన్ని నిత్య రక్తదానంతో ప్రజలు కాపాడుకుంటున్నారు. ఇది వట్టి అబద్ధమే కాక అచారిత్రకం కూడా. ఇవ్వాళ్టి ఇండియా సరిహద్దులకు ఆవలనున్న వారు చాలామంది ఈవలనున్న రాజ్యాలను ఓడించగలిగారు. వాళ్ళనెవరూ తరిమికొట్టలేదు. వారు పెద్దరాజ్యాలే నెలకొల్పగలిగారు. అందువల్ల చెడే కాకుండా మంచి కూడా జరిగింది. భిన్న సంస్కృతుల నుండి స్వీకరించడానికి సిద్ధంగా ఉన్న సమాజాలు ఆ మేరకు నిండుగా ఎదుగుతాయి. అందువల్ల మన దేశం చాలానే ప్రయోజనం పొందింది. 'సాంకర్యం' అనే అసహ్యమైన బ్రాహ్మణీయ భావన తలనిండా ఎక్కించుకున్న వారికి ఇది రుచించకపోవచ్చు గాక.

వాళ్ళను ఇక్కడి ప్రజలు తరిమికొట్టారు అనడంలో అవాస్తవికతే కాక చారిత్రక అసంబద్ధత కూడా ఉంది. ఇవ్వాళ్టి ఇండియా చిత్రపటాన్ని ఎప్పటి

నుండో ప్రజలు 'మన దేశం'గా అనుకుంటున్నారనుకోవడం హాస్యాస్పదం. బ్రాహ్మణులలో ఎప్పటినుండో భరతభూమి, వేదభూమి, ఆర్యావర్తం మొదలయిన భావాలున్నాయి. వాళ్ళయినా దానికి భౌతికంగా ఈనాటి సరిహద్దులే ఇచ్చుకున్నారా అంటే అనుమానమే. ఇక ఇతర ప్రజలలో అటువంటి భావన వుండే అవకాశమే లేదు. ఎప్పటి మాటో ఎందుకు, ఈ రోజు గ్రామీణ ప్రజలు 'మన దేశం' అనే మాటకు రకరకాల అర్థాలు ఇచ్చుకుంటారు. ఒక్కొక్క ప్రాంతంలో ప్రజలు తమదిగా భావించే 'దేశానికి' ఒక్కొక్క ఊహాత్మక సరిహద్దు ఉంటుంది. పెద్ద నదుల సమీపంలో నివసించే ప్రజలకు ఆ నదికి ఈవలనున్నదే తమ 'దేశం'. కొండల దగ్గర ఉండేవారికి ఆ కొండలకు ఆవలనున్నది పరాయి దేశం. ఆదివాసీ ప్రజలు తమ తెగ నివసించే ప్రాంతాన్ని తమ 'దేశం'గా భావిస్తారు. 'దేశం' అనే మాటను ఆ అర్థంలోనే ప్రయోగిస్తారు.

దీనిని గుర్తించకుండా ఉండవలసిన అవసరం సంఘ్ పరివార్‌కు ఏముంది? ఇక్కడ వారి రాజకీయ లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. భారతదేశం ప్రపంచ రాజకీయాలలో ఒక పెత్తందారీ రాజ్యంగా తయారుకావాలి. ఇప్పుడు అమెరికా ఉన్నట్టు ప్రపంచంలో ఏ పెత్తందారీ రాజ్యమూ ఉండకూడదనుకునే వారు దేశభక్తి అనే భావనను దేశానికి భౌతిక బలసంపత్తిని కల్గించే భావనగా చూడరు. నిజానికి దేశభక్తి అనే భావనలోనే ఆ స్వభావం ఉందని దాన్ని అనుమానంగా చూస్తారు. కానీ భారతదేశం ఒక అగ్రరాజ్యం కావాలని కోరుకునే వారికి 'దేశభక్తి' ఒక శక్తివంతమైన సాధనం. ఏ దేశం మీదనయితే ప్రజలు అచంచలమైన మమేకతాభావం పెంచుకోవాలని వారు ఆశిస్తున్నారో, ఆ దేశం ఈ రోజు ఒక చారిత్రక క్రమంలో ఏర్పడినదే తప్ప ఎప్పటినుండో ఒక భౌతిక వాస్తవికతగా గానీ ఒక మానసిక భావనగా గానీ ఉన్నది కాదంటే వారికి నచ్చదు. అందుకు భిన్నంగా ఇదే 'దేశం' ఎప్పటి నుండో ఉందనీ, దానిపట్ల ప్రజలలో వీరభక్తి కూడా ఎప్పటినుండో ఉందనీ ప్రజలను నమ్మించడం వారి లక్ష్యానికి అవసరం. చరిత్రను తిరగరాయడానికి గల కారణాలలో ఇదొకటి.

హిందూత్వవాదుల సామాజిక లక్ష్యాన్నీ రాజకీయలక్ష్యాన్నీ కలిపి చూస్తే వారి మెదళ్ళలో ఉన్న భవిష్యత్ చిత్రాన్ని చూడగలుగుతాం. అది హైందవ సామాజిక

పునాది పైన నిలబడిన భారత అగ్రరాజ్యం. హైందవ సామాజిక పునాది అంటే మధ్యయుగాల నాటి కులవ్యవస్థే అనుకోనక్కరలేదు. పాతకాలపు కులవ్యవస్థ ప్రాతిపదికన ఆధునిక అగ్రరాజ్యాన్ని నిర్మించడం సాధ్యం కాదని వాళ్ళకు బాగానే తెలుసు. పైగా పెట్టుబడిదారీ వ్యవస్థ కల్పించగల సంపద వీళ్ళకెంత మాత్రం చేదు కాదు. అందుకే వాళ్ళకు గ్లోబలైజేషన్ కావాలి, దానికి అనువయిన ఆర్థిక సాంకేతిక వ్యవస్థలు, ప్రక్రియలు కావాలి. అక్కడ విదేశీ ద్వేషమేమీ లేదు. అయితే సాంఘిక జీవితం మాత్రం హైందవ విలువల ప్రాతిపదికన ఉండాలి. ఇవి చాలా చక్కగా అతుకుతాయి కూడా. సాంకేతిక ఆధునికత, నిచ్చెనమెట్ల హైందవ సామాజిక విలువలు, అగ్రరాజ్య హోదా – ఇదీ సంఘ్ పరివార్ ఊహించుకునే ఇండియా. వీరు ఆధ్యాత్మికత గురించి ఎంతగానయినా మాట్లాడనీ గాక, వీరి లక్ష్యం మాత్రం ఇదే.

దీనిని నిర్మించడానికి కావలసింది ద్వేషం, అసహనం, బలప్రయోగం, దౌర్జన్యం. ఆ విలువలు నిండిన దేశభక్తి, జాతీయత యువతలో పెంచాలి. అందువల్ల తాము తిరగ రాయాలనుకున్న చరిత్రలో ద్వేషాన్నే చూడాలి, అసహనాన్నీ మృగప్రాయమైన బలాన్నీ మాత్రమే చూడాలి. వీళ్ళు భారత్‌గా భావించే భూభాగానికి బయటి నుండి వచ్చిన వాళ్ళు కేవలం ద్వేషంతోనే వచ్చారు, అణచివేద్దామనే వచ్చారు. ఇక్కడి ప్రజలు వాళ్ళను ద్వేషంతోనే ఎదుర్కొన్నారు. బలప్రయోగంతోనే తరిమికొట్టారు. వాళ్ళు ఇక్కడి జీవితానికి ఇచ్చిందేమీ లేదు, పుచ్చుకున్నదీ లేదు. ఇక్కడి ప్రజలు వారికి ఇచ్చిందీ లేదు, వారి నుండి పుచ్చుకున్నదీ లేదు.

ఈ అవాస్తవికమైన చిత్రాన్ని యువతకు ఇవ్వడం సంఘ్‌పరివార్ లక్ష్యానికి కావలసిన ద్వేషాన్ని కలిగించడానికి అవసరం. అంటే ఇది అబద్ధమని తెలిసీ వారు ఇస్తున్నారని కాదు. వాళ్ళ మెదళ్ళలో ఈ వికారం నిండి ఉంది. ఇస్లాం వ్యాప్తి మెడమీద కత్తిపెట్టి చేసిన మతమార్పిడుల ద్వారా జరిగిందనేది ఇటువంటి అబద్ధాలలో ఒకటి. అది వినేకొద్దీ, నమ్మేకొద్దీ హిందువులుగా పుట్టిన యువకుల మెదళ్ళలో ద్వేషం నిండుతుంది. ముస్లింల మీద ద్వేషంగా మొదలయినది ఒక సాధారణ ద్వేషభావంగా మారగలదు, నిలిచిపోగలదు. దానిని సాధారణ ద్వేష భావంగా ఎప్పటికీ నిలబెట్టడం సంఘ్ పరివార్ లక్ష్యాలకు అవసరం. అందుకే

ముస్లింలపైన మొదలుపెట్టిన విద్వేష ప్రచారాన్ని క్రైస్తవం మీదికి తిప్పారు. మతపరమైన మైనారిటీలేకాక సామాజిక ఆర్థిక పీడనకు గురి అయిన ప్రజల ఆకాంక్షల మీద ఒక సార్వత్రిక నిరసనను హిందూత్వవాద ప్రచారం ఎప్పుడూ రాజేస్తూ ఉంటుంది.

మెడమీద కత్తిపెట్టి మతమార్పిడులు చేయాలని ప్రయత్నించిన ముస్లిం పాలకులూ ప్రముఖులూ మన దేశంలో లేకపోలేదు. అలాగే పాలకుల మతంలోకి మారితే ఏవో ప్రయోజనాలు వస్తాయన్న ప్రలోభంవల్ల జరిగిన మత మార్పిడులు సహితం లేకపోలేదు. కానీ ఈ విషయాన్ని పరిశోధన చేసిన చరిత్రకారులందరూ చెప్పేదేమిటంటే బలప్రయోగం కన్నా, ప్రలోభాల కన్నా ఇస్లాం వ్యాప్తికి ఎక్కువ దోహదం చేసింది సూఫీ ప్రచారకుల బోధనలు. మంత్ర తంత్రాలతో రోగాలు నయంచేస్తూ హితబోధ చేస్తూ పేదరికంలో బతుకుతూ దైవ భావనను ప్రజలలో ప్రచారం చేసిన ఈ 'పీర్'ల దర్గాలు దేశంలో ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాయి. ఎవరైనా లెక్కబెట్టారో లేదో తెలీదుగానీ మన దేశంలో మసీదుల కంటే దర్గాలే ఎక్కువనుకుంటాను. ఏ కట్టడంలేని 'దర్గా చెట్లు' బహుశా ఇంకా ఎక్కువేమో. ఇస్లాంను ప్రధానంగా ప్రచారం చేసిన పేద ఫకీర్ల హితబోధలకివి చిహ్నాలు. ఈ దర్గాలు, వాటిలో జరిగే పూజలు సనాతన ఇస్లాంకు నచ్చవు. వాటికి హిందువులు సహితం హాజరుకావడం బ్రాహ్మణీయ హైందవానికి అసలే నచ్చదు. అయినా అవి జరుగుతూనే ఉంటాయి. హిందువులు సహితం పెద్దసంఖ్యలో వాటికి హాజరవుతూనే ఉంటారు. ఈ దేశంలో బ్రాహ్మణ పండితులు, ముస్లిం ఇమాంలు మాత్రమే ఉంటే ఈ రెండు మతాల మధ్య ద్వేషం మాత్రమే ఉండేదేమో. పాకిస్తాన్‌లో చరిత్రను ఆ విధంగానే చెప్తున్నారు. సంఘ్ పరివార్ రేపు తిరగరాయబోయే చరిత్రలో కూడా ఆ విధంగానే చెప్తారు. సామాన్య ప్రజలలో మతద్వేషం లేదని కాదు గానీ వారిలో ఉన్నది ద్వేషం మాత్రమే కాదు. చరిత్రలో ఈ రెండు మతాల మధ్య ద్వేషం మాత్రమే ఉండిందంటూ చరిత్రను తిరగరాసే ప్రయత్నం అబద్ధపు ప్రయత్నమే కాగలదు. కష్టాలలో సేదదీర్చే రక్షకునిగా దేవుడిని చూపించే భావనే చరిత్రలో ఎప్పుడయినా వేగంగా ప్రచారం అయింది. అన్ని మతాలూ సామాన్య ప్రజలలో ఈ రకమైన దైవభావన ద్వారానే ఎక్కువ ప్రచారం పొందాయి. ఈ

భావనలో ద్వేషానికి చోటు తక్కువ. అయినప్పటికీ సామాన్య ప్రజలలో పరమత ద్వేష భావం లేకపోలేదు. దానికి గల కారణాలను విశ్లేషించడానికిది సందర్భంకాదు గానీ ద్వేషమే ఏకైక భావన కాదని గుర్తించడం అవసరం. ఈ విషయం గుర్తించడమే సంఘ్ పరివార్ చరిత్రకారులకు ఇష్టం లేదు.

మరీ మొరటుగా రాసిన సంఘ్ పరివార్ ప్రచురణలే కాదు, విషయ పాండిత్యానికి లోటులేని భారతీయ విద్యాభవన్ ప్రచురించిన 'భారత ప్రజల చరిత్ర, సంస్కృతి' అనే బహుళ సంపుటాల ఉద్గ్రంథం ఇచ్చే చారిత్రక అవగాహన కూడా ఇదే. ఇస్లాం, హైందవం ఎటువంటి సహజీవనం సాధ్యం కాని ఉత్తర దక్షిణ ధృవాలనే అభిప్రాయాన్ని చదువుకున్న వారిలో ప్రచారం చేయడంలో ఆ ప్రచురణ, దాని సంపాదకుడయిన ప్రముఖ చరిత్రకారుడు ఆర్.సి. మజుందార్ విడిగా రాసిన రచనలు విశేషమైన పాత్ర నిర్వహించాయి. ముస్లిం రాజుల పాలన భారత చరిత్రలో చీకటియుగమన్న అభిప్రాయం కూడా ఈ ప్రచురణల ద్వారా ప్రాచుర్యం పొందింది. ఇప్పటి పాఠ్యపుస్తకాలు ఈ దృక్పథాన్ని బోధించడం లేదని సంఘ్ పరివార్ అసంతృప్తి. దానిని సవరించాలన్నది వారి ఆరాటం. ఆ ఆరాటం ఫలితం ఏ విధంగా ఉంటుందో చూడాలంటే పాకిస్తాన్‌లో స్కూలు, కాలేజి పిల్లలకు చరిత్ర పాఠాలు ఏ విధంగా చెప్తున్నారో చూస్తే చాలునని ఒక చరిత్రకారుడు వ్యంగ్యంగా అన్నమాట అక్షర సత్యం. అక్కడ ఇదే అభిప్రాయాన్ని (రివర్స్‌లోనని వేరే చెప్పనవసరం లేదు) ఇప్పటికే అమలు చేస్తున్నారు.

కానీ నిజానికి బ్రాహ్మణ, ఇతర పెత్తందారీ కులాల సంగతేమో గానీ శ్రామిక కులాల వారికి ఇస్లాం పట్ల వ్యతిరేకత ఉండవలసిన అవసరమేమీ లేదు. లేకపోగా, ఇస్లాం వారిని బలంగా ఆకర్షించిన దాఖలాలున్నాయి. మగవాళ్ళ వరకు ఇస్లాం దేవుడి ముందు సమాన ప్రతిపత్తి కల్పిస్తుంది. హైందవ నిచ్చెనమెట్ల సమాజంలో దేవుడి ముందే (అంటే ధర్మం ముందే) మనుషులు అసమానులు. నిచ్చెన కింద మెట్ల మీద ఉన్నవారిని ఇస్లాం ఆకర్షించిందనడంలో సందేహంలేదు. ఎక్కువ భాగం ఆ ప్రజలే ముస్లింలయ్యారు. హైందవ చరిత్రకారులు ఇస్లాం ఆగమనం తదుపరి కాలాన్ని 'చీకటి యుగం' అంటే అనవచ్చును గానీ, ఈ ప్రజల జీవితాలకు మాత్రం అది వచ్చాకే కొంచెం వెలుగు వచ్చింది. మొదట

ఇస్లాం, తరువాత క్రైస్తవం కులం కారణంగా కరుడుగట్టిన హైందవ సామాజిక వ్యవస్థను కొంతమేరకైనా ప్రజాస్వామీకరించడానికి తోడ్పడ్డాయి. అది చీకటి యుగం ఎట్లా అవుతుందో ఆ మాట ప్రయోగించేవారే చెప్పాలి.

హైందవ కులవ్యవస్థ ప్రయోగించిన అణచివేతను కొంతమేరకైనా సడలించే పాత్ర ఇస్లాం నిర్వహించిందని ఈనాటి 'సెక్యులర్' పాఠ్యపుస్తకాలు సహితం అనలేక పోతున్నాయి. ఆ అభిప్రాయం ఇప్పటికీ చరిత్ర పరిశోధకులు మాత్రమే చదువుకునే పుస్తకాలకు పరిమితం అయి వుంది. ఈ ఒక్క విషయంలోనే కాదు, హిందూత్వ వాదుల దృక్పథంతో పోలిస్తే సెక్యులర్‌గానే కనిపించే ప్రస్తుత విద్యావ్యవస్థ ప్రాపంచిక అవగాహన ఏ విషయంలోనూ బ్రాహ్మణీయాన్ని బాహాటంగా విమర్శించదు, వ్యతిరేకించదు. అంటరానితనం వంటి మరీ తీవ్రమైన దురాచారాలను విమర్శించేవరకే అది పరిమితం అయింది. 'లౌకికత' పరిమితులే ఈ విధంగా ఉంటే ఇంక సంఘ్ పరివార్ దృక్పథం పాఠ్యపుస్తకాలను లోబరచుకుంటే ఏం జరుగుతుందో ఊహించడం కష్టం కాదు.

శ్రామిక కులాలలో కూడా వ్యవసాయదారుల కంటే చేతివృత్తుల వారు ఎక్కువగా ఇస్లాం వైపు ఆకర్షితులయ్యారు. దీనికి గల కారణమేమిటో పరిశోధించిన వారెవరైనా ఉన్నారేమో తెలీదు. అయితే 'ముస్లిం యుగం' అని దేన్నయితే హిందూత్వవాద చరిత్రకారులు పిలుస్తారో ఆ కాలంలో పట్టణప్రాంత వ్యవసాయేతర ఉత్పత్తిరంగంలో వచ్చిన అభివృద్ధితో దీనికేమైనా సంబంధం ఉండవచ్చు. బట్టలు, తివాచీలు, ఇతర నేత సంబంధమైన ఉత్పత్తులు, అద్దకాలు, గృహనిర్మాణం, గృహోపకరణాల ఉత్పత్తిలో ఢిల్లీ సుల్తాన్ల కాలం నుండి గణనీయమైన అభివృద్ధి వచ్చింది. పశ్చిమాసియా నుండి, ఇరాన్ నుండి కొత్త సాంకేతిక ప్రక్రియలు, ప్రయోగాలు దిగుమతి అయ్యాయి. పాలకులు ముస్లింలు కావడం వల్ల, వారికి ఆ ప్రాంతాలలో సంబంధాలుండడం వల్ల మన ఆర్థిక జీవితానికి ఈ మేలు జరిగింది. గృహనిర్మాణకళ నుండి సంగీతం, చిత్రలేఖనం దాకా అనేక రంగాలలో భిన్న సంప్రదాయాల కలయిక కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ద్వేషభావం వదలిపెట్టి చూడగలిగితే భిన్న సంప్రదాయాల కలయిక నాగరికతకు - కేవలం భౌతికంగానే కాదు, కళా సాంస్కృతిక రంగాలలోనూ, ఆలోచనలలోనూ చేయగల

మేలు కనిపిస్తుంది. మత, తాత్విక సంప్రదాయాలపైన కూడ ఈ ప్రభావం ఉంది. 12వ శతాబ్దం తరువాత వచ్చిన భక్తి ఉద్యమాలలో బ్రాహ్మణీయ ఆలోచనా రీతులపట్ల వ్యక్తమైన నిరసనపైన ఇస్లాం ప్రభావం ఉంది. సిక్కుమతం కొన్ని విషయాలలో హైందవానికి సన్నిహితమైనా దానిపైన ఇస్లాం ప్రభావం కూడా బలంగా ఉంది. ఆ రకంగా మనది అనేక సంప్రదాయాలు కలిసిన ప్రాంతం కావడం మన నాగరికతను సుసంపన్నం చేసింది. ఇదంతా 'చీకటి'గా కనిపించేవారి మానసిక వికారానికి సానుభూతి చూపగల ఔదార్యం మనలో కొరవడకూడదు గానీ ఆ వికారాన్ని పాఠ్యాంశాలలో చేర్చి పిల్లల మనసులు మెదళ్ళు పాడుచేస్తామంటే చూస్తూ ఊరుకోకూడదు.

పరిపాలనా వ్యవహారాలలో ఈనాటికీ కనిపించే కొన్ని మార్పులు ఢిల్లీ సుల్తాన్ల కాలంలోనూ, మొగలాయిల పాలనలోనూ వచ్చాయి. అది వట్టి 'చీకటి యుగం' కాదనడానికి ఇది కూడా ఒక నిదర్శనం. ఆధునిక 'సంక్షేమరాజ్యం' భావన ఉనికిలోకి వచ్చేదాకా రాజ్యానికి ప్రజలతో ప్రధానంగా రెండే సంబంధాలుండేవి. ఒకటి పన్నులు వసూలు చేయడం, రెండు శాంతిభద్రతలు నెలకొల్పడం. ఈ రెండు పనులూ, కొంత క్రమబద్ధంగా చేసిన రాజ్యం మంచిది, విచ్చలవిడిగా చేసిన రాజ్యం చెడ్డది. (అప్పుడప్పుడు చెరువులు తవ్వించిన, చెట్లు నాటించిన, రోడ్లు వేయించిన, సరాయిలు నిర్మించిన రాజ్యాలు లేకపోలేదుగానీ అవి అరుదయినవే).

పన్నుల వసూలుకూ శాంతిభద్రతల నిర్వహణకూ ఒక క్రమబద్ధమైన యంత్రాంగము, నియమాలు ఏవీ లేకుండా ఆ అధికారాన్ని రాజు తన సామంతులకు, జాగీర్దార్లకు, నాయకులకు అప్పగించడం, వాళ్ళు విచ్చలవిడిగా దానిని వినియోగించడం ఒక నమూనా కాగా, దాన్ని మొత్తం క్రమబద్ధం చేసి కొన్ని నియమాలననుసరించి అ అధికారాన్ని నిర్వహించడం రెండవ నమూనా. దీని కోసమే ఇంగ్లండ్‌లో 'మాగ్నాకార్టా' ప్రకటన జరిగింది. మన దేశంలో అటువంటి హక్కుల ప్రకటన జరగలేదుగానీ రాజ్యమే తనకుతాను ఒక క్రమబద్ధమైన నిర్మాణాన్ని రూపొందించుకుంది. మౌర్యులు ప్రాచీన కాలంలో ఈ ప్రయత్నం కొంత చేశారు గానీ అది తరువాత అంతరించిపోయింది. తిరిగి ఢిల్లీ

సుల్తాన్లలో ఒకడయిన ఫిరోజ్ తుగ్లక్ హయాంలో నిర్మాణయుతమైన పరిపాలనా వ్యవస్థ ఏర్పడి, షేర్‌షా, అక్బర్‌ల కాలంలో స్థిరమైన రూపం తీసుకుంది. బ్రిటిష్ వాళ్ళు దానిని పెద్దగా మార్పులు లేకుండా కొనసాగించి స్వతంత్ర భారతానికి అందించారు. ఈ పరిపాలనా వ్యవస్థ (ప్రధానంగా రెవెన్యూ, పోలీసు, న్యాయ యంత్రాంగాలు) ఎంతగా మన జీవితంలో భాగమయిపోయిందంటే దానికి సంబంధించి మనం తెలుగులో (తెలంగాణలోనే కాదు, ఆంధ్రలో కూడా) ఉపయోగించే మాటలన్నీ పర్షియన్ మూలంగల మాటలే. తాసీల్దారు, గుమాస్తా, శిస్తు, అమీన్, ఖర్చు, కిస్తు, తక్కావీ, ఖరీఫ్, రబీ, ఫసల్, మాఫీ ఇందుకు కొన్ని ఉదాహరణలు. చివరికి అచ్చ తెలుగు మాట అని చాలామంది అనుకునే 'రైతు' అనేది కూడా పర్షియన్ నుండి రెవెన్యూ యంత్రాంగం వ్యవహారభాష ద్వారా తెలుగులోకి దిగుమతి అయిన మాటే (వ్యవసాయదారుడికి అచ్చ తెలుగు మాట కాపు. అదిప్పుడు ఒక కులాన్ని సూచించే మాట అయింది). చెప్పవచ్చిందేమిటంటే హిందూస్తానీ సంగీతం నుండి తహశీలు ఆఫీసుదాకా, ఉర్దూభాష నుండి తివాచీ పరిశ్రమ దాకా 'చీకటి యుగం' అని పిలువబడే కాలంలో ఒక సంపన్నమైన మిశ్రమ సంస్కృతి రూపం తీసుకుంది. దానిని చూడలేక, ఒకదానితో ఒకటి కలువలేని - ఎడముఖం పెడముఖంగా మాత్రమే ఉండగల - భిన్న సంస్కృతులు పరస్పరం సంఘర్షించుకున్న చీకటి కాలంగా మాత్రమే ఆ కాలాన్ని ఆర్.సి.మజుందార్ వంటి విద్యావంతులయిన చరిత్రకారులే హిందూత్వవాద భావజాలం ప్రభావంలో భావించగలిగారంటే, ఇంక అర్ధ నిరక్షరాస్యులయిన ఖాకీ నిక్కరు మేధావుల చేతిలో పాఠ్యాంశాల భవితవ్యాన్ని పెడితే ఏం జరుగుతుందో ఊహించడానికే భయమవుతుంది.

వీర దేశభక్తిని సాధనంగా ఎంచుకున్న హిందూత్వ వాదానికి వీరుల చరిత్రలు అవసరం. చరిత్రలో వీరుల అన్వేషణ అవసరం. 'మన' వీరులను మరచిపోయి యువతను శక్తిహీనుల్నీ చేస్తున్నదని ప్రస్తుత విద్యావ్యవస్థపైన వారి అభియోగం. చరిత్ర నుండి ఆదర్శాలు ఎంచుకోవడంలో తప్పులేదు. యువతకు సరయిన విలువలు నేర్పడానికి అది అవసరం కూడా కావచ్చు. కానీ 'వీరులు' ఎందుకు కావాలి? ఒక భౌతిక శక్తిగా భారత దేశాన్ని తీర్చిదిద్దే లక్ష్యముంటేనే

కావాలి. మనది ఆధ్యాత్మిక సంస్కృతి అని చెప్పుకునే వారే చరిత్ర దగ్గరకొచ్చే సరికి 'వీరుల' అన్వేషణ చేయడం ఎందుకు?

ఆధ్యాత్మికత సంగతేమోగానీ మానవీయ విలువలు ప్రధానమనుకుంటే బుద్ధుడినీ, అశోకుడినీ, కబీర్‌నూ ఒక మేరకు గాంధీని కూడా ఆదర్శంగా తీసుకోవచ్చు. పీడనను వ్యతిరేకించే పోరాట స్ఫూర్తి ప్రధానమనుకుంటే అల్లూరి సీతారామరాజునూ, బిర్సా ముండానూ, భగత్‌సింగ్‌నూ తీసుకోవచ్చు. కానీ హిందూత్వవాదుల ఆదర్శ చారిత్రక వ్యక్తులు వీరెవ్వరూ కారు. వారికి 'వీరులు' కావాలి. అది కూడా ఒక పెడ అర్థంలో మాత్రమే. ముస్లిం రాజులపైన యుద్ధం చేసిన హిందూరాజులే ఆ 'వీరులు'. వెయ్యేళ్ళ చరిత్రను ముస్లింలపైన హిందువులు చేసిన విముక్తి పోరాటంగా వారు చిత్రీకరించదలుచుకున్నారు. కాబట్టి శివాజీ, రాణాప్రతాప్, శ్రీకృష్ణదేవరాయలు వగైరాలు వీరి 'వీరులు.' వీరంతా 'భారతదేశం' అనే దేశాన్ని భావించుకొని దానిని ముస్లిం పాలకుల నుండి 'విముక్తి' చేసే లక్ష్యాన్ని కలిగి ఉన్నారని నమ్మడం కష్టం. తాము హిందువులు, ఎదుటివారు ముస్లింలు అన్న స్పృహ వీరిలో లేదని కాదు. దానిని వారి రాజ్యాధికార పోరాటంలో వాడుకోలేదని కూడా కాదు. కానీ ఈనాటి హిందుత్వవాదుల దృక్కోణాన్ని వారికి అంటగట్టి, తమ రాజ్య విస్తరణ కోసమో రక్షణ కోసమో వారు చేసిన యుద్ధాలలో 'దేశ విముక్తి' లక్ష్యాన్ని చూడడం అచారిత్రకం. నిజానికి హిందూ రాజులూ ముస్లిం రాజులూ ఒకరితో ఒకరు చేతులు కలిపి ఇతర హిందూ రాజులపైన, ముస్లిం రాజులపైన యుద్ధాలు చేసిన సంఘటనలనేకం ఉన్నాయి.

మన-తన భావనకు హిందూ-ముస్లిం ప్రాతిపదిక ఆనాడు ఉండిన మాట వాస్తవమే. కానీ అదొక్కటే లేదు. ఈనాటికీ మన గ్రామాలలో ముస్లింలను అన్ని కులాలలో పాటు ఒక కులంగా చూస్తారు. మన-తన భావనలో కులానికి స్థానం వున్నట్టే హిందూ-ముస్లిం భావనకు కూడా ఉంది, ఉండింది. అంతకుమించి దానినే సాంఘిక వర్గీకరణకు కేంద్రం చేసి హైందవ వీరులను సృష్టించడం చరిత్రను సహేతుకంగా అర్థం చేసుకోవడానికీ పనికిరాదు, రేపటి జీవితాన్ని సరిగ్గా తీర్చిదిద్దుకోవడానికీ పనికి రాదు. హిందూత్వవాదుల ఆధిపత్యవాద అజెండాకేమైనా పనికొస్తుందేమో. అసలు భారతదేశ చరిత్రను హిందూ యుగం (క్రీ.శ. 11వ శతాబ్దం దాకా), ముస్లిం యుగం (అప్పటి నుండి బ్రిటిష్ పాలన

నెలకొనే దాకా), బ్రిటిష్ యుగం అని వర్గీకరించడమే అశాస్త్రీయమనీ, ముస్లిం రాజుల ఆగమనం అంతటి పునాది ప్రాయమైన మార్పేమీ తీసుకురాలేదనీ రొమిలా థాపర్ వంటి చరిత్రకారులు సవివరంగా వాదించి ఉన్నారు. ఆ వచ్చిన మార్పు కూడా పూర్తిగా చెడ్డది కాదు విధ్వంసకరమైనది కాదు. అని పైన చూశాం.

అన్ని రకాల అధ్యయనంలో చరిత్ర అధ్యయనానికొక ప్రత్యేకమైన స్థానం ఉంది. అది కావడానికి గతాన్ని గురించి చేసే అధ్యయనమేగానీ ప్రేరణ వర్తమానం నుండి, భవిష్యత్తు నుండి వస్తుంది. వర్తమానాన్నీ భవిష్యత్తునూ మనం ఏ రకంగా ప్రభావితం చేయదలచుకున్నామన్న దాన్ని బట్టి గతంవైపు చూసే మన దృష్టికోణం ఉంటుంది. దానికి తగిన విలువలనూ చారిత్రక ఆధారాలనూ ఆదర్శాలనూ చరిత్రలో మనం వెతుక్కుంటాము. ఆ కోణం నుండి చరిత్రను వ్యాఖ్యానించుకుంటాం. నిజాయితీగా వ్యవహరించదలుచుకుంటే ఏ భవిష్యత్తు ప్రయోజనాల కోసం మనం గతాన్ని అధ్యయనం చేస్తున్నామో ప్రకటించుకోవాలి.

దానితోబాటు అధ్యయన సంబంధమైన నిజాయితీ కూడా ఉండాలి. శాస్త్రీయ దృక్పథం ఉండాలి. మన దృష్టి కోణానికి (అది ఎంత గొప్పదయినా కానియ్యండి) పనికొచ్చే విషయాలనే కాక దానిని అబద్ధం చేయగల విషయాలను కూడా చూడాలి, విశ్లేషించాలి, అవసరమైతే ఆ వెలుగులో మన దృక్కోణాన్ని పునర్వ్యాఖ్యానించుకోవడానికి సిద్ధంగా ఉండాలి. అంతే కాక మనతో విభేదించే దృక్కోణాలను వక్రీకరించడమో తొక్కిపెట్టడమో కాకుండ సంవాదం ద్వారా వాటిని ఎదుర్కోవాలి. సంఘ్ పరివార్ తిరగ రాయదలచుకున్న చారిత్రక దృక్పథం విలువలు అమానవీయమైనవి, ప్రజాస్వామిక దృక్పథానికి అవాంఛనీయమైన భవిష్యత్ లక్ష్యం నుండి పుట్టినవి. అంతే కాక వారి అధ్యయన పద్ధతిలో శాస్త్రీయమైన నిజాయితీ శూన్యం.

దీనిపైన పోరాటమంటే హిందూత్వవాదుల సామాజిక రాజకీయలక్ష్యాలపైన పోరాటం. ఈ దేశాన్ని తమ వికృతమైన ఆలోచనల నమూనాలో పునర్నిర్మించాలన్న వారి ప్రయత్నం మీద పోరాటం. ఇప్పటికే ప్రజాతంత్ర ఉద్యమాల బలహీనతల వల్ల వారు తమ అజెండాను చాలా వేగంగా ముందుకు తీసుకుపోతున్నారు. దానిని అడ్డుకునే ప్రయత్నానికి సంఘటిత రూపం ఇవ్వడం అవసరం, సమగ్రమైన ఆలోచన పైన దానిని నిలబెట్టడం అవసరం.

# విద్య, విజ్ఞానం : హిందూత్వవాదుల దాడిని ఎదుర్కొనడానికి మనం సిద్ధమేనా?

విద్యారంగం ప్రాముఖ్యాన్ని గురించి ఎన్నడూ సరిగ్గా పట్టించుకోలేదని కమ్యూనిస్టులపైన తీవ్రమైన విమర్శ ఉంది. విద్యారంగంలో కమ్యూనిస్టులు కృషిచేయలేదని కాదు కానీ అధ్యాపకుల జీతాలు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, కాలేజీలలో సీట్లు మొదలయిన విషయాల గురించే ఎక్కువ ఆందోళన చేశారు తప్ప 'ఏం చదువు చెప్తున్నారు?' అనే ప్రశ్నపైన దృష్టిపెట్టింది చాలా తక్కువన్నది విమర్శ.

మన చదువుల గురించి వామపక్షాలకు ఒక అభిప్రాయం లేకపోలేదు. అవి 'అశాస్త్రీయం' అనే స్థూలమైన అభిప్రాయం ఉండింది, బహుశా ఇప్పటికీ ఉంది. మతం, చరిత్ర, సంస్కృతి, సాహిత్యం మొదలయిన అన్ని విషయాల గురించి మన పాఠ్య పుస్తకాలలో చెప్పే సంగతులన్నిటికీ స్థూలమైన 'అశాస్త్రీయం' అనే ఈ వ్యాఖ్యే జవాబయింది.

ప్రజల ప్రాపంచిక దృక్పథాన్ని తీర్చిదిద్దడంలో విద్యావ్యవస్థకు ఉండే ప్రముఖమైన పాత్రను వామపక్ష ఉద్యమాలు సరిగ్గా అర్థం చేసుకున్నట్టు కనిపించదు. ఈ మేరకు వారిపైన ఉన్న విమర్శ న్యాయమయినదే. మనం, మన దేశం, మన సమాజం, మన జాతి అనేవి ఎవరు, ఏమిటి, ఎటువంటివి అనే ప్రశ్నలకు ఒక జవాబునిచ్చి ఆ వెలుగులో వ్యక్తిత్వాలను తీర్చిదిద్దే సామాజిక శక్తులలో అతి ముఖ్యమైనది విద్యావ్యవస్థ. మనలో ప్రతీఒక్కరి దగ్గరా ఈ ప్రశ్నలకొక జవాబు ఉంటుంది. ఈ విషయాల గురించి ఒక అభిప్రాయం ఉంటుంది. అవి ఎక్కడి నుండి వచ్చాయని ఒకసారి తరచి చూసుకుంటే విద్యా వ్యవస్థే ప్రధానమైన జవాబుగా కనిపిస్తుంది. ఇంట్లో పెద్దలు నేర్పే ఆలోచనలు, అభిప్రాయాలకు అంతకంటె ఎక్కువపాత్ర లేదా అని అడగవచ్చు. ఒక్కొక్కరి విషయంలో ఉండవచ్చునేమో గానీ తల్లిదండ్రుల అభిప్రాయాలకూ టీచర్ అభిప్రాయాలకూ

---

APTF సావనీర్, డిసెంబర్ 16, 2000

మధ్య ఘర్షణ వస్తే టీచర్ మాటలనే పిల్లలు ఎక్కువ భాగం ప్రమాణంగా తీసుకుంటారనేది అందరూ ఎరిగిన విషయమే. సత్యానికి ప్రమాణమేమిటన్నది విద్యారంగమే నేర్పుతుంది కాబట్టి పాఠశాలలలో నేర్పే సత్యాలకు ప్రామాణికత ఎక్కువ.

ఇవన్నీ మధ్యతరగతికి వర్తిస్తాయి గానీ కార్మికవర్గానికి వర్తించవని నమ్మేవాళ్ళు ఇంకా ఉన్నారేమో నాకు తెలీదుగానీ, అందరికీ చదువు కావాలని ఒకపక్క కోరుకుంటూ ఇంకొక పక్క ఆ చదువు కేవలం అక్షరజ్ఞానం రూపంలో రాదనీ, ఒక వ్యవస్థిత ప్రాపంచిక దృక్పథంతో కలిసి వస్తుందనీ గుర్తించడానికి నిరాకరించడం విజ్ఞత అనిపించుకోదు. విద్యా వ్యవస్థకు పూర్తిగా వెలుపల ఉండే వాళ్ళకు పై చర్చ వర్తించకపోవచ్చునుగానీ ఎదుగుతున్న కొత్తతరంలో అటువంటి వాళ్ళు మైనారిటీయే.

ప్రామాణికమైన సిలబస్‌ను రూపొందించి, ప్రామాణికమైన పాఠ్యపుస్తకాలు రచించి అందరికీ ఒకే మూసలో చదువు చెప్పే విద్యా వ్యవస్థ 'మనము' అనే ఒక సమిష్టినీ, దానికొక స్వభావాన్నీ, ఒక గమ్యాన్నీ రూపొందిస్తుంది. అదొక దేశం కావచ్చు. ఒక జాతి జావచ్చు. వేరే ఏ సమూహమైనా కావచ్చు. అటువంటి సార్వజనీనమైన విద్యావ్యవస్థలేని రోజులలో వర్ణధర్మాన్ని ప్రచారం చేసిన ధార్మిక సాహిత్యం, తదనుబంధమైన సాంస్కృతిక ప్రక్రియలూ ఆచార సంప్రదాయాలూ ఆ పాత్ర నిర్వహించాయి. వాటి స్థానంలో ఒక సార్వజనీనమైన విద్యావ్యవస్థను ప్రవేశపెట్టి 'ఆధునిక, లౌకిక' భావాల ప్రాతిపదికన జాతినీ దేశాన్నీ నిర్వచించడం తమ లక్ష్యానికి సరైన సాధనం అని జాతీయ ఉద్యమంలోని ఆధునికవాదులు – వీరిలో కాంగ్రెస్ వారున్నారు, కాంగ్రెస్ అంటే గిట్టనివారూ ఉన్నారు – భావించారు. ఈ ఆధునికవాదులు ఏమంత ఆధునికులు కాని వారితో రాజీపడడం వల్ల, ఇతర కారణాల వల్ల ఆ ప్రయత్నం కుంటినడక నడుస్తున్నప్పటికీ ఒక మేరకు ఆ లక్ష్యానికి అనుగుణ్యమైన విద్యావ్యవస్థను వారు రూపొందించగలిగారు.

విద్యావ్యవస్థ ప్రాముఖ్యాన్ని వారితో సమానంగా గుర్తించిన హిందూత్వవాదులకు అందుకే ప్రస్తుత విద్యావ్యవస్థ అంటే అంత అసహనం. అది పూర్తిగా వారి ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందని కాదు. కానీ వారికి కావలసింది తమతో

రాజీపడే ఆధునికవాదం కాదు. అట్లాగని వారు కోరుకునేది మధ్యయుగాల వైదిక మతమూ కాదు. వారికేం కావాలో తరువాత చూద్దాముగానీ దానికి తగిన విద్యావ్యవస్థను రూపొందించుకోవాలన్న ఆరాటం మాత్రం వారిలో కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని ఇప్పుడందరికీ స్పష్టంగా ఉంది.

లిబరల్ ఆధునిక వాదులకూ హిందూత్వ వాదులకూ స్పష్టంగా అర్థమైన విద్యారంగం ప్రాముఖ్యత వామపక్షవాదులకు మాత్రం అర్థమయినట్టు కనిపించదు. వామపక్షాలు చదువుల 'ఇన్‌ఫ్రాస్ట్రక్చర్'కు ఇచ్చిన ప్రాముఖ్యం వాటి స్వభావానికీ సారాంశానికీ ఇవ్వలేదు– అశాస్త్రీయం అని అప్పుడప్పుడు విమర్శించడం తప్ప.

నిజానికి ఈ సారాంశంలోనూ స్వభావంలోనూ ముఖ్యమైనది శాస్త్రీయం – అశాస్త్రీయం అనే వర్గీకరణ కాదు. మానవీయం – అమానవీయం, ప్రజాస్వామికం – అప్రజాస్వామికం అనేవి ముఖ్యం. శాస్త్రీయమన్నా మానవీయమన్నా ఒకటేనని ఈ అణు యుగంలో ఎవరూ వాదించరనుకుంటాను. విద్య 'మనము' అనే సమిష్టిని ఏ విధంగా నిర్వచిస్తున్నది? దానిముందు ఏ గమ్యాన్ని ఉంచుతున్నది? దానిని ఏ దిశగా నడిపించే చైతన్యాన్ని కలిగిస్తున్నది?

విద్యావ్యవస్థనూ విద్యారంగాన్నీ హిందూత్వవాదులు ఈ కోణం నుండి చూశారు. కాబట్టే వాళ్ళు ఎక్కడ అవకాశముంటే అక్కడ స్కూళ్ళు పెట్టారు. తాము కోరుకునే పౌరులను తయారుచేయడానికి అవసరమైన భావాలను అభిప్రాయాలను పిల్లలకు నేర్పారు – (ముస్లిం ఛాందసవాదులు కూడ మదర్‌సాలను ఇదే రకంగా వాడుకున్నారు). వాళ్ళు విద్య నొక ఉద్యమంగా తీసుకున్నారు. అధికారానికి చాలా దూరం ఉన్న రోజులలో మొదలుపెట్టిన ఈ ఉద్యమాన్ని హిందూత్వ వాదులిప్పుడు అధికారానికి వచ్చిన తరువాత అధికారికంగా కొనసాగిస్తున్నారు.

వాళ్ళకేం కావాలి? మన సమాజాన్ని గురించి, దాని భవితవ్యాన్ని గురించి వాళ్ళు ఏ దృక్పథాన్ని చదువుల ద్వారా పిల్లలకు – తద్వారా రేపటి పెద్దలకు – నేర్పించదలచుకున్నారు? వాళ్ళు మనుధర్మాన్ని తిరిగి నెలకొల్పదలచుకున్నారని దళితవాదులు ఆరోపిస్తున్నారు. ఇందులో కొంత సత్యముందిగానీ దానిని సరిగ్గా అర్థం చేసుకోవాలి. హిందూత్వవాదుల అజెండాలో మనుధర్మం పునరుద్ధరణ ఒక అర్థంలో ప్రధానమయిన అంశమేగానీ అది దాని మధ్యయుగాల అర్థంలో

కాదు. ఈ విషయాన్ని దళితవాదులు స్పష్టంగా గుర్తిస్తున్నట్టు కనిపించదు. ఉదాహరణకు రాజ్యాంగ సమీక్ష గురించి హిందూత్వ వాదులు చేస్తున్న ప్రయత్నాన్ని విమర్శించే సందర్భంలో, అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఒక బ్రాహ్మణుడిచేత తిరగరాయించాలని వారు ప్రయత్నం చేస్తున్నారన్న విమర్శ దళితవాదుల నుండి ప్రముఖంగా వచ్చింది. అదే మన విమర్శ అయినట్టయితే దానిని హిందూత్వ వాదులు సులభంగా ఎదుర్కోగలరు. వెంకటాచలయ్య స్థానంలో ఒక దళిత న్యాయశాస్త్రవేత్తను – భావాలలో తమకు అనుకూలమైన వ్యక్తిని – కూర్చోబెట్టి దళితుడు రాసిన రాజ్యాంగాన్ని దళితునితోనే తిరగరాయిస్తున్నామని అనగలరు. హిందూత్వవాదుల వెంబడి దళిత బహుజన కులాలకు చెందిన వారు చాలామంది పోతున్నారని గుర్తించి కూడ (గ్రహం స్టెయిన్స్‌ను చంపింది ఆదివాసులేనని మరచిపోకూడదు) వారు మనుధర్మ పునరుద్ధరణ మధ్యయుగాల నమూనాలోనే చేయబోతున్నారన్నట్టు మాట్లాడడం దానిపై అవగాహనను ఏ మాత్రం పెంచదు. అట్లాగని వాళ్ళు కులాన్ని వదిలిపెట్టి వర్గాన్ని ప్రాతిపదిక చేసుకున్నారనుకోవడమూ సబబు కాదు.

మరయితే వారి నమూనా ఏమిటి? దానికి మనుధర్మంతో ఉన్న సంబంధం ఏమిటి? హైందవ ధర్మంలోని ఒక కీలకమైన భావనను వారు 'ఆధునిక' ప్రయోజనాల సాధనకు అనుకూలంగా మలచదలచుకున్నారు. ఈ 'ఆధునిక' ప్రయోజనాలలో 'జాతి ప్రయోజనం' ముఖ్యమైనది. 'జాతి' అనేది (ఇంగ్లీష్‌లో నేషన్) ఒక ఆధునిక భావన. ఆధునిక హిందూత్వవాదంలో అది కీలకమైన భావన. మనుధర్మంలోని 'ధర్మం' ఆర్య సమాజానికి సంబంధించిన భావన. దానిని జాతి అనే ఆధునిక భావనకు వర్తింపజేయడంతో ఆధునిక హిందూత్వవాదం మొదలవుతుంది. ఈ 'జాతి'లో ప్రతీ ఒక్కరికీ ఒక స్థానం ఉంటుంది. దానిని నిర్వచించేది కులం కావచ్చు, ఆర్థిక స్థితిగతులు కావచ్చు, ఉద్యోగం కావచ్చు, ఇల్లు కావచ్చు ఆ స్థానం నుండి పుట్టే ఒక కర్తవ్యం ఉంటుంది. ఆ కర్తవ్య నిర్వహణ 'జాతి'లోని ప్రతీ ఒక్కరి ధర్మం. ఏ మేరకయితే అందరూ ఆ కర్తవ్య నిర్వహణలో నిబద్ధులయి ఉంటారో ఆ మేరకు 'జాతి' బలంగా ఉంటుంది. మరింత బలంగా తయారవుతుంది. కర్తవ్య నిర్వహణకు హాని కలిగించే హక్కుల ఆకాంక్ష

'జాతి'కి నష్టకరం. 'జాతి'ని ప్రపంచంలో అగ్రశ్రేణికి తీసుకుపోవడం జాతి జనులందరి ధర్మం కాబట్టి కర్తవ్య పాలనకు అందరూ ప్రాధాన్యం ఇవ్వాలి.

హక్కులు కొరవడిన వారు ఈ దృక్పథాన్ని ఎందుకు ఆమోదిస్తారు? హక్కుల కోణం నుండే చూసినట్టయితే ఆమోదించరు. కానీ హక్కులు కొరవడినవారు ప్రపంచాన్ని హక్కుల కోణం నుండే చూస్తారనుకోవడం పొరబాటు. అపరిపూర్ణమయిన మానవ జీవితం– ఆ అపరిపూర్ణతకు మూలం వ్యక్తిగతం కావచ్చు, సామాజికం కావచ్చు – తనకంటె 'పెద్ద' దయిన మానవాతీత విషయంలో పరిపూర్ణతను వెతుక్కుంటుంది. ఇది ఏ తప్పుడు భావజాలం ప్రభావమూ కాదు, మనిషికి అత్యంత స్వాభావికమైన గుణం. నియంతలందరూ దీనిని నేర్పుగా వాడుకున్నవారే. ఆధునిక కాలంలో నియంతృత్వ రాజకీయాలు 'జాతి' అనే అతీతశక్తిని దీనికోసం చాలా విజయవంతంగా వాడుకున్నాయి. వీరిలో అతి క్రూరుడయిన హిట్లర్‌ను ఆధునిక హిందూత్వవాదానికి ఆదిపురుషుడయిన సావర్కర్ చాలా అభిమానించిన సంగతి తెలిసిందే.

శక్తివంతమయిన భారతజాతి – తమలో తాము మాట్లాడుకునేటప్పుడు హైందవజాతి – ఆధునిక హిందూత్వవాదుల లక్ష్యం. అది మధ్యయుగాల మనుధర్మ సమాజం రూపంలో ఉండదు. కానీ ఆ మను ధర్మానికి సంబంధించిన అతి కీలకమైన భావనను పైన వివరించినట్టు – తన ఆధునిక లక్ష్యానికి అనుగుణంగా అది వాడుకుంటుంది. అది 'ధర్మం' అనే యధాస్థితివాదాన్ని ఆలంబన చేసుకొని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ నుండి న్యూక్లియర్ హార్డ్‌వేర్ దాకా అన్ని విషయాలలోనూ ఆధునికమైన – శక్తివంతమైన – అగ్రరాజ్యంగా, లేక అగ్రజాతిగా మన సమాజాన్ని రూపొందించాలని చూస్తుంది.

దీన్ని లక్ష్యంగా స్వీకరించే యువతరాన్ని – దానికి అనుగుణంగా 'ధర్మం' అనే భావనకు హిందూత్వవాదులిచ్చే ఆధునిక వ్యాఖ్యానాన్ని అంతర్లీనం చేసుకున్న యువతరాన్ని – తయారుచేసే విద్యావ్యవస్థ వారికి కావాలి. కాంగ్రెస్ నమూనా ఉదార జాతీయవాదం నిర్మించిన విద్యావ్యవస్థలో ఎన్ని లోపాలున్నా అదీ ఇదీ ఒకటి కాదు. అయితే హిందూత్వవాద భావనలు మన సమాజంలో – ముఖ్యంగా బ్రాహ్మణులలోనూ, ఇతర పెత్తందారీ కులాలలోనూ – విస్తృతంగా ప్రాచుర్యం

పొంది ఉన్నాయి కాబట్టి ప్రస్తుత విద్యావ్యవస్థలోనే అవి చాపకింద నీరులాగ వ్యాపించి ఉన్నాయి. కానీ పూర్తిగా అదే నమూనాలో విద్యావ్యవస్థను రూపొందించే కర్తవ్యం ఇంకా ఆధునిక హిందూత్వవాదుల ముందే ఉంది.

ఇందులో చరిత్ర పాఠాలకు వారు ప్రాధాన్యం ఇవ్వడం వారి లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకున్నప్పుడు సహజం. జాతిపట్ల యువతరంలో ఆరాధనా భావన పెంచాలంటే ఈ జాతి ఒకప్పుడు చాలా గొప్పదనీ, పరాయి జాతులవారి కుట్రల వల్ల, దాడుల వల్ల, పెత్తనం వల్ల, సాంస్కృతిక 'సాంకర్యం' వల్ల తన పటిమను కోల్పోయిందనీ చెప్పాలి. వాస్తవికత పేరిటనో శాస్త్రీయత పేరిటనో బలహీనతలను సహితం ఎత్తి చూపడం, లౌకికవాదం పేరిటనో సహనం పేరిటనో 'సాంకర్యాన్ని' ఆహ్వానించడం జాతినీ జాతి భవితవ్యాన్నీ దెబ్బతీసే వైఖరులని నేర్పాలి. సామాజిక న్యాయం పేరిటనో సమసమాజం పేరిటనో 'మన' సంస్కృతిని కించపరచడం దుర్మార్గమని బోధించాలి.

అందుకోసమే చరిత్ర రచనపై, చరిత్ర పాఠ్యపుస్తకాలపైన వారు దాడి మొదలుపెట్టారు. నిజానికి ఈ 'పోరాటం' చాలాకాలంగా సాగుతున్నదే గానీ హిందూత్వవాదులది ఇప్పటి దాకా పైచేయి కాలేదు. భారతీయ విద్యాభవన్ ప్రచురణలేకాక, ప్రామాణిక చరిత్ర పాఠ్యపుస్తక రచయితలగా గుర్తింపు ఉన్న ఆర్. సి. మజుందార్ వంటి వారి రచనలు, తమను తాము సంఘ్‌పరివార్‌కు చెందినవారిగా భావించుకోకపోయినా – కాంగ్రెస్ జాతీయవాద వారసత్వంలో భాగంగా భావించినా – బ్రాహ్మణీయ ప్రాపంచిక దృక్పథాన్ని నిర్విమర్శగా దిగమింగిన ఇతర చరిత్రకారుల రచనలు లౌకిక, మానవీయ, శాస్త్రీయ చరిత్ర రచనతో యాభై ఏళ్ళేమొచ్చె దాదాపు 20వ శతాబ్దం తొలినాటి నుండి కూడ తలపడుతూనే ఉన్నాయి. కానీ ఇప్పుడు మొట్టమొదటిసారిగా హిందూత్వవాదానిది పైచేయి అయ్యే సూచనలున్నాయి.

అయితే ఈ పోరాటం చరిత్ర దగ్గర ఆగిపోదు. సాహిత్యం, తత్వశాస్త్రం, సంస్కృతి ఇతర 'మానవ శాస్త్రాలకు' (హ్యూమానిటీస్), సామాజిక శాస్త్రాలకు కూడ వ్యాపిస్తుంది. గణితంలో సహితం 'వేదగణితం' ఒకటి ఉందంటున్నారు

గానీ దానివల్ల గణిత శాస్త్ర అధ్యయనానికి వచ్చే తేడా కంటే చరిత్ర అధ్యయనానికి వచ్చేదే ఎక్కువ.

ఈ పోరాటంలో హిందూత్వవాదాన్ని ఎదుర్కొనడానికి అభ్యుదయ వాదులందరూ సిద్ధమేగానీ వారిని రాజకీయంగా ఎదుర్కుంటే చాలదు, పరిశోధనాత్మకంగా ఎదుర్కోవాలి, వైజ్ఞానికంగా ఎదుర్కోవాలి. దీనికి ప్రజాతంత్ర ఉద్యమాలు సిద్ధంగా ఉన్నాయా? నా ప్రశ్న సంకల్పాన్ని గురించి కాదు. ఆ విషయంలో సందేహం లేదు కానీ సామర్థ్యంలో సిద్ధమేనా?

# విద్య - భావజాలం

విద్యార్థులకు అందించే ఏ రకమైన విద్య ప్రజాస్వామికమవుతుంది? కొన్ని ప్రత్యేక పాఠశాలల్లో చదివిస్తేనే ప్రజాస్వామికమా? విద్య ఒక ప్రాపంచిక దృక్పథాన్ని కల్గిస్తుంది. మనకిష్టం ఉన్నా లేకున్నా విద్యను జ్ఞానంగా మాత్రమే అందించం. ఈ జ్ఞానాన్ని కొన్ని అభిప్రాయాలతో అందిస్తున్నాం. మంచీచెడూ – ఎక్కువా, తక్కువా – ఆదర్శవంతం అభ్యంతరకరం – నాగరికం అనాగరికం అనే అభిప్రాయాలతో అందిస్తున్నాం. అంటే చదువును ఒక ప్రాపంచిక దృక్పథంతో చెప్తున్నాం. లెక్కలు బాగా వస్తేనే విద్యార్థికి తెలివితేటలున్నట్టు చెప్పడం ఒక రకమైన భావజాలం. ఇది సత్యంకాదు. జ్ఞానాన్ని విలువలతో కలిపి అందించాలి.

పాఠ్యపుస్తకాల్లో ప్రపంచంలోని జ్ఞానమంతా ఉండదు. పాఠ్యపుస్తకాల ఎంపిక వెనుక ఒక భావజాలం ఉంది. ఒక ప్రాపంచిక దృక్పథం ఉంది. తెలుగులో నన్నయ రచనలు ఉండడానికి ఒక భావజాలం ఉంది. జానపద సాహిత్యం ఎంపిక చేయకపోవడానికో భావజాలం ఉంది. రాజులు ఎలా పరిపాలించారు? ఎలా సంపాదించారు? ఎలా రాజ్యాన్ని పోగొట్టుకొన్నారు? అనేది చెప్పాలను కొన్నారు కనుక చరిత్రలో అశోకుని గురించిన పాఠాలున్నాయి. ప్రజలు తమ జీవనోపాధుల్ని ఎట్లా తయారు చేసుకున్నారు? తమలోని సామర్థ్యం ఎట్లా అభివృద్ధి చేసుకున్నారు? ఎట్లా ధ్వంసం చేసుకున్నారు అనేదే చరిత్ర అనుకుంటే, దాన్ని విద్యార్థులకు తెలియజేయాలనుకుంటే పాఠ్యాంశాలు ఇంకో రకంగా ఉంటాయి. కనుక పాఠ్యాంశాల ఎంపికలో స్పష్టమైన భావజాలం ఉంటుంది.

విద్యారంగానికి సంబంధించిన భావజాలంపై ఒక సంఘర్షణ జరుగుతోంది. ఇటీవల చరిత్రను పునర్ వ్యాఖ్యానించి పిల్లలకు అందించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న చరిత్ర పాఠ్యాంశాల ఎంపికలో ఒక భావజాలం

---

APTF పత్రిక 'ఉపాధ్యాయ'లో అచ్చయిన ప్రసంగపాఠం, జనవరి, 2001

ఉంటే అంతకంటే భిన్నమైన భావజాలాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నం జరుగుతోంది. విద్యారంగంలో అగ్రవర్ణాల భావజాలం ఉంది. తాము కోరుకున్న భారతదేశాన్ని తయారుచేయడానికి తగిన పిల్లలను విద్యావ్యవస్థ ద్వారా తయారు చేయడానికి సంఘ్ పరివార్ చాలా స్పష్టంగా ప్రయత్నిస్తున్నది. అందుకే కేంద్రప్రభుత్వం ముఖ్యమైన హోమ్, మానవ వనరుల శాఖలను కరుడుకట్టిన ఆర్.ఎస్.ఎస్. వాళ్ళకు ఇచ్చింది. విద్యావ్యవస్థ ద్వారా మనం ఏ రకమైన భవిష్యత్తును కాంక్షిస్తామనే దానిని అనుసరించి గత చరిత్రను అర్థం చేసుకోవడం ఉంటుంది. ఉదాహరణకు దళిత ఉద్యమం దృష్టి నుండి చూసి భవిష్యత్తులో బ్రాహ్మణీయుల భావజాలం నుండి, అణచివేత నుండి విముక్తి కోరుకుంటే గత చరిత్రను బ్రాహ్మణీయుల ఆధిపత్యంలో నలిగిపోయిన చరిత్రగా అర్థం చేసుకుంటాం. అట్లే శ్రమదోపిడీలేని సమాజాన్ని కావాలనుకునే కమ్యూనిస్టులు గత చరిత్రను కొంతమంది సంపన్నులు సమాజంలోని అత్యధికుల శ్రమను దోచుకున్న చరిత్రగా అర్థం చేసుకొంటారు. ఇక సంఘ్‌పరివార్ దృష్టిలో శక్తివంతమైన హైందవజాతిని రూపొందించడానికి కొత్త పాలనా వ్యవస్థ, రాజకీయ, విద్యావ్యవస్థలు కావాలి.

వాళ్ళ దృష్టిలో శక్తివంతమైన హైందవజాతి గతంలో ఉండింది. అది విదేశీయుల్ని తరమికొట్టింది. భారతజాతిలోనే కొందరు పరాయివాళ్ళతో లాలూచీ పడడం వలన ముస్లింల, క్రైస్తవుల పరిపాలనలు వచ్చాయి. ఈ పాలన వలన హైందవ జాతి శక్తిని కోల్పోయింది. అంతే కాదు యోగ్యతను బట్టి, అర్హతనుబట్టి వర్ణ వ్యవస్థ ఉండేదని కూడా వారు పాఠ్యపుస్తకాలలోనే రాస్తున్నారు. ముస్లింలు వచ్చిన తర్వాత అది దిగజారిందని రాస్తున్నారు. ముస్లింలువస్తే హిందువులు ఎట్లా దిగజారుతారో చెప్పరు. ఇది ఏ రకమైన ఆధారాలు, తర్కం లేని వివేచన. 1200 ఏళ్ళ క్రితం శక్తి కోల్పోయిన హైందవజాతిని పునర్నిర్మించి ప్రపంచంలో అగ్రరాజ్యంగా తయారు చేయాలని వారి లక్ష్యం. ఈ లక్ష్యానికి తగిన విద్యావ్యవస్థను ఏర్పాటు చేసుకోలేదని, రాజ్యాంగం రాసుకోలేదని, రాజకీయ విలువలు ఏర్పాటు చేసుకోలేదని 50 ఏళ్ళ నుంచి విమర్శిస్తున్నారు. దేశంలోని ఇతర రాజకీయపక్షాలు తమ అభిప్రాయాలను ఈ 50 ఏళ్ళలో మార్చుకున్నా వీరు

మాత్రం మార్చుకోలేదు. ఎత్తుగడల రీత్యా ఈ అభిప్రాయాలను రకరకాల పద్ధతులలో వ్యక్తం చేయవచ్చు.

ఆధునిక భారతదేశ చరిత్రలోని జాతీయోద్యమ కాలాన్ని తీసుకొంటే వారి నైజం బైట పడుతుంది. ఈ కాలంలో బ్రిటిష్‌వారు వెళ్ళిపోయి రాజకీయంగా భారతదేశం స్వతంత్రం కావాలనే రాజకీయ పోరాటాలు, కులవ్యవస్థ, వర్ణవ్యవస్థ అంతం కావాలనే పోరాటాలు, స్త్రీలకు సమాన అవకాశాలు, సమాన ప్రతిపత్తి కావాలనే పోరాటాలు, జమీందారుల గుప్పిట్లో ఉన్న భూమిని భూమిలేని వారికి పంచాలనే పోరాటాలు, ఆదివాసుల భూపోరాటాలు, కార్మికుల పోరాటాలు ఎన్నో కన్పిస్తాయి. ఈ పోరాటాల్లో కాంగ్రెస్, కమ్యూనిస్టు, అంబేద్కర్, పెరియార్ అనుచరులు కన్పిస్తారు. ఎన్నడూ ఏ పోరాటాల్లో కన్పించని వారు సంఘ్‌పరివార్ వాళ్ళు. వీరు ఏ పేరుతో ఉన్నా పీడిత వర్గాల పోరాటాలకు మాత్రం వీరు మొదట్నుండి వ్యతిరేకం. అలాగే బ్రిటిష్ వ్యతిరేక జాతీయ రాజకీయ పోరాటాలకూ వీరు వ్యతిరేకమే. గత 50 ఏళ్ళుగా భారతదేశంలో జరిగిన పోరాటాల్లో అనేక రాజకీయ స్రవంతులు కన్పిస్తాయి కాని వీరు ఎక్కడా కన్పించరు. వీళ్ళ మూలం వేరు.

కాంగ్రెస్, కమ్యూనిస్టు, అంబేద్కర్, పెరియార్ అనుచరుల మూలాలు జాతీయోద్యమంలో కన్పిస్తాయి. వారి మధ్య అనేక తేడాలున్నా కొన్ని సామాన్య లక్షణాలున్నాయి. గతంలో మూర్ఖమైన రాచరిక పాలన ఉండి, పౌరోహిత్య మౌఢ్యం దేశాన్నేలింది. అది దేశాన్ని కరుడుగట్టిన మధ్యయుగాల సమాజంగా మార్చింది. అన్యాయాలు, శ్రమదోపిడీ సమాజంలో వెల్లివిరిసాయి అని నమ్మడమే కాక భవిష్యత్తులో ఆధునికమైన, ప్రజాస్వామికమైన సమాజాన్ని నిర్మించుకునే కామన్ ఆలోచన అన్ని రాజకీయ స్రవంతుల్లో కన్పిస్తుంది. ఆధునికతకు, ప్రజాస్వామ్యానికి ఇచ్చిన నిర్వచనాల్లో తేడాలున్నా, భవిష్యత్ భావనలో తేడాలున్నా కాంగ్రెస్, కమ్యూనిస్టు, అంబేద్కర్, పెరియార్, లోహియా వాదులెవరైనా సరే స్థూలంగా కాంక్షించేది ఆధునిక, ప్రజాస్వామ్య సమాజం. వీరందరిలోను ఉమ్మడిగా కుల అణచివేత, రాచరిక నియంతృత్వం, మతమౌఢ్యం, దోపిడీ పోవాలనే ఆకాంక్షే కన్పిస్తుంది. ఆధునిక ప్రజాస్వామ్య సమాజంగా దేశాన్ని మార్చడానికి తగిన

విలువల్ని బోధించాలనే అభిప్రాయం కన్పిస్తుంది. కాని ఈ విలువలకు గండికొట్టే ప్రయత్నాలు, తప్పుడు వ్యాఖ్యానాలు, ఆధునికత గర్భంలోనే సంప్రదాయాన్ని కాపాడే ప్రయత్నాలు, ప్రజాస్వామ్య గర్భంలోనే నియంతృత్వాన్ని కాపాడే ప్రయత్నాలు విద్యావ్యవస్థ ద్వారా అందించాలనేది సంఘ్ పరివార్ ప్రయత్నం. ప్రపంచాన్ని ఏలగల అగ్రరాజ్యంగా రూపొందడానికి, శక్తివంతమైన హైందవ జాతిని తయారుచేయడానికి అవసరమయ్యే ప్రాపంచిక దృక్పథాన్ని, భావజాలాన్ని పిల్లలకు అందివ్వాలని వారి ప్రయత్నం. ఇందుకోసం బ్రిటిష్ మానస పుత్రికగా ప్రస్తుత విద్యావ్యవస్థలను విమర్శిస్తూ చరిత్ర, సైన్సుపట్ల రకరకాల వ్యాఖ్యానాలు చేస్తున్నారు. చరిత్రలో వాస్తవంగా జరిగాయని చెప్తున్న విషయాలను కూడా కాదంటూ అవన్నీ పాశ్చాత్యులు, బ్రిటిష్‌వాళ్ళు, అమెరికావాళ్ళు చెప్పినవని కొట్టిపారేస్తున్నారు. ఏమైనా అంటే  విశ్వాసం ముఖ్యం, వివేచన కాదని దబాయించడం జరుగుతోంది.

విద్యాబోధన చేసేటపుడు మనం పరీక్ష పాసయ్యే జ్ఞానాన్ని మాత్రమే కల్పించడం లేదు. వాళ్ళ వ్యక్తిత్వాలను రూపొందిస్తున్నాం, వాళ్ళ ఆలోచనలు తయారు చేస్తున్నాం, మనుషులుగా రూపం ఇస్తున్నామనే అవగాహన అవసరం. విచారకరమేమిటంటే అధ్యాపక సంఘాలు, ఉద్యమాలు చదువు యొక్క ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కిచ్చిన ప్రాముఖ్యత చదువు యొక్క కంటెంట్‌కు ఇవ్వడంలేదు. విద్యను ప్రాథమిక హక్కుగా కుదించి వేయకుండా విద్య స్వేచ్ఛగా, చౌకగా అందుబాటులో ఉండేలా సమాన అవకాశాలు కల్పించాలి.

విద్య నైపుణ్యాలను మాత్రమే అభివృద్ధి చేయదు, వ్యక్తిత్వాన్ని నిర్మిస్తుందని సంఘ్ పరివార్ వాళ్ళు అంటున్నారు. వారి దృష్టిలో ప్రస్తుత విద్య బానిస వ్యక్తిత్వాన్ని తయారుచేస్తోందని  (అంటే ప్రజాస్వామ్యం, సామాజిక సంక్షేమం, లౌకికవాదం, సామాజిక న్యాయం పాశ్చాత్య భావాలని). బ్రాహ్మణీయ ఆధిక్యతను వ్యతిరేకించిన వారు ఆనాడు, ఈనాడూ ఉన్నారు. బుద్ధుని కాలం నుంచి సామాజిక న్యాయం, లౌకికత, ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూనే ఉన్నారు. మనం చాలా స్పష్టంగా విద్య ద్వారా వ్యక్తిత్వాలను తయారు చేస్తున్నామని, భవిష్యత్ తరాలను రూపొందిస్తున్నామని గుర్తించాలి. ఈ దృష్టితో పాఠ్య పుస్తకాల సిలబస్‌ను చూడాలి.

శాస్త్రీయం, అశాస్త్రీయం అనే వివేచన కంటె మానవీయత, ప్రజాస్వామ్య విలువల్ని ఏ మేరకు విద్య ద్వారా ఇవ్వగల్గుతున్నామని ఆలోచించాలి. జాతీయోద్యమ కాలంలో ప్రజాస్వామ్యం, కులనిర్మూలన, శ్రమదోపిడీ నుండి విముక్తి, సమతా సమాజం, సామాజిక సంక్షేమం మొదలైన ఆలోచనలు ముందుకొచ్చాయి. రకరకాల పీడిత పోరాటాల్లో ఇవి వ్యక్తమయ్యాయి. ప్రజాస్వామ్యానికి, మానవీయతకు అనుకూలమైన వ్యక్తిత్వాలను విద్య తయారు చేస్తోందా? ఎటువంటి ప్రాపంచిక దృక్పథం గల వ్యక్తులను విద్య తయారు చేస్తోంది? పాఠ్యపుస్తకాలలోని అంశాలు అందుకు తోడ్పడుతున్నాయా? లేకపోతే ఏ రకమైన మార్పులు సిలబస్‌లోను, విద్యావ్యవస్థలోను కోరాలి? అనే పట్టింపు తక్కువగా వుంది. దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఆధునికతకు విరుద్ధమైన అంశాల్ని సవరించే, సంస్కరించే మార్గాలు వెతకాలి. దానికి పోరాట రూపాలు వెతకాలి, సరియైన డిమాండ్లు ప్రభుత్వం ముందుపెట్టాలి. పాఠ్యపుస్తకాలు, సిలబస్‌లు రాసే పని ఏపిటియఫ్ లాంటి వాళ్ళకు రావాలంటే ఏం చేయాలి? సంక్షోభం వచ్చినప్పుడే సత్యాలు గుర్తించడం కాకుండా 50 ఏళ్ళ క్రితమే ఈ రకంగా ఆలోచిస్తే, ప్రాముఖ్యతనిస్తే పరిస్థితి వేరుగా ఉండేది.

సరైన రాజ్యాంగాన్ని రాసుకొని ఉంటే భారతదేశం అగ్రరాజ్యంగా తయారయ్యేదని ఆర్.ఎస్.ఎస్. సత్ సంగ్‌చాలక్ సుదర్శన్ అంటున్నారు. నిజంగా ప్రపంచాన్ని శాసించే 'దాదా'గా ఉండాలనే కోరిక భారతీయులకుందా? అది ఆర్.ఎస్.ఎస్. వారి కోరిక. వాళ్ళకు రాజ్యాంగంపట్ల వ్యతిరేకత బాగా ఉంది. రాజ్యాంగంలో లోపాలున్నాయని వారు అంటున్నారు. పౌరహక్కుల ఉద్యమకారులూ చాలా లోపాలు చూపిస్తున్నారు. ఏ లోపాలున్నా ఒక గమ్యాన్ని, లక్ష్యాన్ని రాజ్యాంగం దేశం ముందు పెట్టింది. సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా న్యాయబద్ధమైన పునాది నిర్మాణానికి కావలసిన సమాజ నిర్మాణం కోసం లక్ష్యాన్ని నిర్దేశించింది. అగ్రరాజ్యంగా రూపొందాలనే లక్ష్యం రాజ్యాంగంలో లేదు. ఆ గమ్యానికి, లక్ష్యానికి కావల్సిన అధికారాల్ని ప్రజలు ఇవ్వలేదు. భారత రాజ్యాంగం పెట్టుకున్న ఆ గమ్యం, లక్ష్యం పట్లనే సంఘ్‌పరివార్‌కు విమర్శ. అగ్రరాజ్యం అవాలని రాజ్యాంగంలో రాసుకొని ఉంటే ఈ రోజు అగ్రరాజ్యంగా తయారయ్యేవాళ్ళమని, అగ్రరాజ్యంగా తయారయ్యే విద్యావ్యవస్థ తయారు చేసుంటే పిల్లలందరు

అగ్రరాజ్యానికి తగిన పిల్లలయ్యేవారని అంటారు. మనకు కావాల్సింది అది కాదు. గోల్వాల్కర్ అభిప్రాయం ప్రకారం జాతి బలంగా ఉండాలంటే జాతి లోపల హక్కులు అడగొద్దు – అడిగితే జాతిని బలహీనపరుస్తున్నామని అంటారు. జాతిలోపల సమానత్వాన్ని అడిగినా అంతే. జాతి అఖండ రూపంలో ఉండాలి. అందుకు తగిన విద్యావ్యవస్థ, రాజ్యాంగం కావాలి. ప్రతి పిల్లవాడు బలప్రయోగం చేసి ప్రపంచాన్ని శాసించే హైందవజాతి నిర్మాణానికి తోడ్పడాలి. హిందువులు కానివారు కూడా తమను తాము హైందవులుగానే భావించుకోవాలి. దేవుడొక్కడే అని భావించేవారు తమ నమ్మకాన్ని వదులుకొని 30 కోట్ల దేవతలకు అదనంగా తమ దేవతను చేర్చుకోవాలి. దేశంలో సమానత్వం, హక్కులు, సామాజిక న్యాయం కావాలని మాట్లాడకూడదు. అదే వారి ఎజెండా.

అవకాశవాదంతో రాజకీయంగా, సామాజికంగా ఎప్పుడూ రాజీపడ కూడదు. మెతకవైఖరి అనుసరిస్తే వారి బలాన్ని ఎదుర్కోలేం. పాఠ్యపుస్తకాలు నేర్పే విలువలు ఏ ఆదర్శాలు నిలబెడతాయో, ఏ భవిష్యత్ సమాజాన్ని రూపొందిస్తాయో దానిలో భావజాలం ఎంతో ముడిపడి ఉంది. ఇప్పటిదాకా విద్యావవస్థ అప్రజాస్వామిక భావాలతో రాజీపడి ఉంది. ఈ విద్యా వ్యవస్థలోని కొద్దిపాటి ఆధునికత, ప్రజాస్వామ్యం భావాలను కూడా ఇప్పుడు పూర్తిగా క్షీణింప జేసే ప్రయత్నాలు మొదలయ్యాయి. రాబోయే కాలంలో ఇవి తీవ్రరూపాన్ని తీసుకోబోతాయి. దాన్ని వ్యతిరేకించడానికి అధ్యాపక ఉద్యమం బలంగా, గట్టిగా నిలబడాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.

# పాఠ్యాంశాలలో హిందూత్వవాదుల జోక్యాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి ?

సంఘ్‌పరివార్‌వారు పాఠ్యపుస్తకాలలో జోక్యం చేసుకోవడం భిన్న కారణాలవల్ల సమాజంలో ఆందోళన కలిగిస్తున్నది. ఆందోళన చెందుతున్న వారందరికీ ఇవన్నీ ఒకే ప్రాముఖ్యమున్నవి కాకపోవచ్చు.

శాస్త్రీయ ప్రమాణాల స్థానంలో జాతీయతను – అందులోనూ సంఘ్‌పరివార్ వారు విశ్వసించే సంకుచితమైన జాతీయతను – ప్రమాణంగా నిలబెట్టే ప్రయత్నం చేయడం కొంతమంది దృష్టిలో ప్రధానమైన విషయం కావచ్చు. ఉదాహరణకు ప్రాచీన భారతదేశంలో గణితశాస్త్రం గొప్పగా అభివృద్ధి చెందిందన్న అభిప్రాయాన్ని తీసుకుందాం. హిందూత్వవాదులు దీనిని బలంగా ప్రచారం చేస్తున్నారు. శాస్త్రీయ ప్రమాణాలను సవరించేటట్టయితే దీని తప్పొప్పులు తేల్చడం సులభమే. తమకు సమకాలికులయిన చాలా సంస్కృతుల కంటె, ప్రాచీన భారతీయులు గణితంలో ఎక్కువ ప్రగతే సాధించారు. చాలా కఠినమైన లెక్కలు చేయగలిగారు. ఒక్కొక్క లెక్కను ఏ విధంగా పరిష్కరించాలో తెలిపే శ్లోకాలు, పద్యాలు, ప్రాచీన, మధ్యయుగాల సాహిత్యంలో చాలా ఉన్నాయి. కానీ ఒక్కొక్క లెక్కను పరిష్కరించే పద్ధతిని కనుక్కొని, ఆ 'స్టెప్స్'ను ఒక పద్యం రూపంలో చెప్పడం వేరు. ఆ లెక్కను అమూర్తంగా నైరూప్యంగా (అబ్‌స్ట్రాక్ట్‌గా) ప్రతిపాదించి, సార్వజనీనమైన అమూర్త పరిష్కారాలు అన్వేషించడం వేరు. ఇందులో గ్రీకులు, తరువాతి కాలంలో అరబ్బులు సాధించిన ప్రగతి మనం సాధించలేక పోయాము.

శాస్త్రీయ ప్రమాణాలు ఈ విషయం చెప్తాయి. కానీ 'దేశభక్తి' ఒప్పుకోదు! దేశభక్తియుతంగా పాఠ్యాంశాలు తిరగరాయాలనే హిందూత్వవాదుల ఆరాటమూ ఒప్పుకోదు ! ఈ రకమైన అహేతుకమైన ప్రమాణాలు పిల్లలకు నేర్పించడం వారి ఆలోచనలను వక్రంగా మారుస్తుందని ఆందోళన చెందడం సబబే. సత్యానికి విశ్వాసం ప్రమాణమైతే, ఆ తరువాత ఆవేశం ప్రమాణం అవుతుంది. తదుపరి బలప్రయోగం దానికి రుజువు అవుతుంది !

---

APTF సావనీర్, ఫిబ్రవరి 2003

ఈ హైందవ 'జాతీయత' ప్రమాణాలతో మరొక సమస్య ఏమిటంటే, ఒకనాడు కొంత ప్రగతి సాధించిన భారతీయ పదార్థ విజ్ఞానం ఆ తరువాత ఎందుకు మూఢ నమ్మకాలలో కూరుకుపోయిందన్న ప్రశ్నకు అది జవాబు చెప్పజాలదు. 'విదేశీయులు' మనల్ని అణచివేయడం వల్ల అది జరిగిందనీ ఆ విదేశీయుల వారసులయిన భారతీయ ముస్లింలనూ క్రైస్తవులనూ అణచివేయడ మొక్కటే పూర్వవైభవాన్ని తిరిగి అందుకోవడానికి మార్గమనీ వారంటారు ! ఇది అర్థరహితమైన జవాబని – ఈ దేశానికి వచ్చిన విదేశీ సంస్కృతులన్నీ మన జ్ఞానాన్ని పెంచడానికి దోహదపడ్డాయని రుజువు చేయడం పెద్ద కష్టం కాదు. భారతీయ పదార్థ విజ్ఞానం మూఢ నమ్మకాలలో కూరుకుపోవడానికి గల నిజమైన కారణం విజ్ఞానం పైన బ్రాహ్మణులకు ఉన్న గుత్తాధిపత్యం అన్న దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ విశ్లేషణను ముందుకు తీసుకుపోవడంలోనే ఈ సమస్యకు జవాబు దొరుకుతుంది.

మరొక కోణం నుండి కూడా సంఘ్‌పరివార్ వారు పాఠ్యాంశాలతో ఆడుతున్న చెలగాటం పట్ల ఆందోళన చెందే అవకాశం ఉంది. భారతదేశ సంస్కృతికీ నాగరికతకూ ఉన్న బహుముఖత్వాన్నీ బహు మూలాలను చెరిపివేసి, అసలయిన 'భారతీయత' వైదిక హిందూత్వంలోనే ఉన్నదని చెప్పే హిందూత్వవాదుల ప్రాపంచిక దృక్పథం దేశంలో సహనాన్నీ సహజీవనాన్నీ ధ్వంసం చేసి, హైందవ ఆధిపత్యానికీ, హింసాత్మక సమాజ జీవనానికీ దారితీసే ప్రమాదం ఉంది. వారి ప్రాపంచిక దృక్పథాన్ని సత్యంగా నిలబెట్టడానికి వారు చరిత్రనూ సామాజిక వాస్తవాలనూ ఘోరంగా వక్రీకరిస్తున్నారు. ఈ దేశంలోని ముస్లిం పాలకులంతా 'జిహాదీ' లేననీ, వారి పాలనంతా హిందువుల మీద హింసేననీ, ఇస్లాం బలప్రయోగంతోనే వ్యాపించిందనీ, క్రైస్తవం వ్యాప్తి డబ్బు, ఉద్యోగాల వంటి ప్రలోభాలతోనే జరిగిందనీ, క్రైస్తవం ప్రభావంవల్లనే 'మనల్ని' మనం అసహ్యించుకోవడం నేర్చుకున్నామనీ, నిజానికి వర్ణవ్యవస్థ, బ్రాహ్మణీయ సంస్కృతి మొదలయినవి ఉన్నతమైన వ్యవస్థలనీ వారు తమ పుస్తకాలలో ఇప్పటిదాకా రాసుకుంటూ తమ సరస్వతీ శిశుమందిరాలలో బోధించుకుంటూ ఉన్న అబద్ధాలను అధికారికంగా పాఠ్యపుస్తకాలలో ప్రవేశపెట్టాలని వారు చేస్తున్న ప్రయత్నం మన

సామాజిక జీవితానికి చాలా నష్టం చేస్తుందనడంలో సందేహంలేదు. అయితే వీరి ప్రాపంచిక దృక్పథంలో తిరస్కారానికి గురవుతున్నది కేవలం ఇస్లాం, క్రైస్తవం మాత్రమేకాదు – ఈ గడ్డకే చెందిన బ్రాహ్మణేతర సంస్కృతీ సంప్రదాయాలన్నిటికీ అదే గతి పడుతుందన్న విషయం రావలసినంతగా చర్చకు రావడం లేదు !

ఈ రెండు ప్రధానమైన అభ్యంతరాలేకాక చిన్న చిన్న అభ్యంతరాలు కూడా ఉన్నట్టున్నాయి. తమను తాము హిందువులుగా భావించే వారిలో కూడా కొంత మందికి సంఘ్‌పరివార్ హైందవానికి ఇస్తున్న నిర్వచనం వికృతంగా కనిపిస్తున్న దాఖలాలున్నాయి. తాము నమ్మే హైందవం ఇది కాదనీ, ఈ వికృత వ్యాఖ్యానాన్నే హైందవంగా చలామణి చేయడం న్యాయం కాదనీ ఈ కోవకు చెందినవారు అంటున్నారు. ఇక వ్యాపార పారిశ్రామిక వర్గాలు, ప్రపంచీకరణ పక్షపాతులు వేరే కారణాలవల్ల ఆందోళన చెందుతున్నట్టున్నారు. హిందూత్వవాదులు సామాజిక చైతన్యాన్ని పిడివాద మతతత్వం వైపుగా మలిచేకొద్దీ పాశ్చాత్యులకు ఈ దేశం ఆకర్షణీయంగా కనిపించడం మానేస్తుందనీ, ఆ చైతన్యం హింసాత్మక ఘర్షణలకు దారితీసే కొద్దీ పెట్టుబడులు రావడం మానేస్తాయనీ ఈ వర్గాలు ఆందోళన చెందుతున్నట్టున్నాయి !

ఇన్ని కారణాలూ, బహుశా ఇంకొన్ని కారణాలూ ఉన్నాయి. అయితే పాఠ్య పుస్తకాలతోనూ పాఠ్యాంశాలతోనూ హిందూత్వవాదులు ఆడుతున్న చెలగాటానికి వీటన్నిటి కంటే లోతయిన అర్థం ఉంది. వీటన్నింటికంటె బలమైన వ్యతిరేకతను అది ఎదుర్కోవలసిన అవసరం ఉంది.

భారతదేశ భవిష్యత్తు గురించి హిందూత్వవాదులకు తమ స్వంత అజెండా ఎప్పటి నుండో ఉంది. ఆ అజెండాలో ప్రజాస్వామ్యం రవ్వంత కూడా లేదు. శక్తివంతమైన జాతి రాజ్యం, అఖండమైన హైందవ ఆధిపత్యం, స్థిరమైన నిచ్చెనమెట్ల వ్యవస్థ, పదిలమైన బ్రాహ్మణీయ సంస్కృతి – ఇదీ వారి ఆదర్శం. గ్లోబలైజేషన్‌కు అవసరమయిన సుస్థిరతకు ఈ ఆదర్శం చక్కగా పనికొస్తుంది కాబట్టి వారికిప్పుడు అంతర్జాతీయ వాతావరణమూ అనుకూలంగా ఉంది. సంఘ్‌పరివార్ అజెండా అమలు చేయడంవల్ల తలెత్తే ఘర్షణల కారణంగా పెట్టుబడుల రాక తగ్గిపోవడం అంటూ జరిగితే అది తాత్కాలికం మాత్రమే.

దేశ భవిష్యత్తుకు సంబంధించి మనకు ఏ అజెండా ఉన్నా, దానికి అనుగుణంగా దేశ యువతను మలచవలసిన అవసరం ఉందని ఎప్పటి నుండో – వామపక్షవాదుల కంటే బాగా – గుర్తించిన వారు హిందూత్వవాదులు, 'యువతను మలచటం' అంటే ఈ దేశాన్ని గురించి, ఈ సమాజాన్ని గురించి వారికి ఉండే అభిప్రాయాలను మలచడం. అందుకోసం పాఠ్యపుస్తకాలను, పాఠ్యాంశాలను తిరగరాయడం ఒక కార్యక్రమంగా పెట్టుకున్నారు.

మన దేశ భవిష్యత్తు ప్రజాస్వామికంగా, మానవీయంగా ఉండాలని కోరుకునే వారందరూ ఈ వికృతమైన రాజకీయ అజెండాను ఎదుర్కోవటం కోసం రాజకీయంగానే ఒక దగ్గరకు రావాలి. ఒకే పార్టీలోకి, ఒకే సంఘటనలోకి అందరూ రాలేకపోవచ్చు. కానీ భిన్నస్వరాలు ఉన్నప్పటికీ ఒక తాటి మీద నడిచే ఉద్యమంలో భాగం కావాలి. హిందూత్వవాదులు పాఠ్యాంశాలతో ఆడుతున్న ఆటలను ఎదుర్కొనే కర్తవ్యాన్ని ఇందులో భాగంగా అర్థం చేసుకోవాలి.

# లౌకిక ప్రజాస్వామిక విలువలు

మన రాష్ట్రంలో విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలు రెండూ చాలా కాలంగా నడుస్తున్నాయి. వివిధ పోకడలున్నప్పటికీ ప్రధానంగా లౌకిక ప్రజాస్వామిక విలువలను నమ్మిన ఉద్యమాలే వీటిలో ఎక్కువ. సమాజంలో లౌకిక ప్రజాస్వామిక విలువలుండాలనీ, సమసమాజ దిశగా సమాజం పయనించాలనీ, అందుకను గుణంగా విద్యావ్యవస్థ ఉండాలనీ విశ్వసించే విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలే ఇవన్నీ. ఉపాధ్యాయుల సర్వీసు సమస్యల గురించీ, రాజకీయనాయకుల, పెత్తందార్ల ఒత్తిళ్ళను అధిగమించటం గురించి, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ళు, పాఠ్యపుస్తకాలు, తదితర సమస్యల గురించి ఈ సంస్థలు శక్తివంతమైన ఉద్యమాలు నిర్వహించి, విజయం సాధించాయి. అయితే విద్యయొక్క సారం (Content) గురించి, పాఠ్యాంశాలలో బోధిస్తున్న విషయం గురించి, అందులోని నైతిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక స్వభావాన్ని గురించి బలమైన ఉద్యమాలు జరగలేదు...

ఈ మధ్యకాలంలో కొంత తగ్గినప్పటికీ దక్షిణ భారతదేశంలోని పాఠశాలల్లో, విశ్వవిద్యాలయాలలో లౌకిక ప్రజాస్వామిక భావాలు గల రాజకీయ శక్తుల ప్రాబల్యమే ఎక్కువగా ఉంటూ వచ్చింది. అయినా దాని ప్రభావం పాఠ్యాంశాల మీద చాలా తక్కువగా ఉంది.

ప్రజాస్వామ్యం, లౌకికత, సామాజిక న్యాయం అంటే ఏమిటి? ఈ పదాల నిర్వచనాలను కాంగ్రెస్ వాళ్ళకు వదిలివేశారు. వాళ్ళిచ్చిన నిర్వచనాలపై విమర్శలైతే చేశారు కాని, నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇవ్వడానికి ప్రయత్నించలేదు. ఆ నిర్వచనాలలో కొన్ని పాజిటివ్ అంశాలున్నప్పటికీ వాటిపైన లోతైన చర్చ జరగలేదు. ఆ నిర్వచనాలన్నిటినీ తిరస్కరించి, ప్రజాస్వామ్య వ్యతిరేక, లౌకిక వ్యతిరేక అజెండాతో సంఘ్‌పరివార్, బి.జె.పి.లు ముందుకు వచ్చి దేశానికి ఒక షాక్‌నిచ్చాయి. సంఘ్‌పరివార్ శక్తులు తమ అజెండాను అమలు చేయటానికి

APTF పత్రిక ఉపాధ్యాయలో అచ్చయిన ప్రసంగపాఠం, ఆగస్టు, 2004

ఏం చేయాలో సరిగ్గా గుర్తించారు. ఏ మాత్రం తటపటాయించకుండా పాఠ్యాంశాల దగ్గరే ప్రారంభించారు. ఏ మాత్రం అవకాశం వచ్చినా పాఠ్యాంశాలలో వాళ్ళ భావజాలాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ళు స్కాలర్‌షిప్‌లు రద్దు చేయలేదు. హాస్టళ్ళ సంఖ్య తగ్గిస్తామనలేదు. తమ సైద్ధాంతిక వ్యాప్తికి పాఠశాలలను, కళాశాలలను ఆలంబనగా చేసుకున్నారు. తాము కోరుకునే భావితరాలను రూపొందించటానికి, చిన్నారుల మెదళ్ళలో తమ ఆలోచనలను చొప్పించటానికి పాఠ్యాంశాలను తయారు చేస్తున్నారు. దానితో లౌకిక ప్రజాస్వామిక శక్తులలో ఆలోచన బయలుదేరింది. బి.జె.పి.ని పక్కకు నెట్టేశాం కదా, కాంగ్రెసు వచ్చింది చాలు, పాత పద్ధతులు తిరిగి వస్తాయి అనుకోకుండా భావితరాలకు ఏ విధమైన విద్యనందించాలి, రూపంలోను, సారంలోను విద్యాబోధన ఏ విధంగా ఉండాలో లౌకిక ప్రజాస్వామిక విలువలను పెంపొందించడానికి ఏం చేయాలో ఆలోచించాలి.

విద్య ప్రభావం విస్తృతంగా ఉంటుందని మనకు తెలుసు. చిన్న వయసులో నాటుకున్న భావాలు త్వరగా మారవు. విద్య ప్రభావం ఎలా ఉంటుందో, ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు దానిని ఎలా ఉపయోగించుకున్నారో గుజరాత్ అనుభవం మనకు తెలియచేస్తుంది. గుజరాత్‌లో జరిగిన దారుణాలపై పరిశీలనకు మేం వెళ్ళాం. ఆదివాసుల దగ్గర నుంచి కళాశాల విద్యార్థుల వరకు అందరూ ఒకే విధంగా స్పందించారు. భారతీయ సంస్కృతి గురించి, ముస్లిముల దాడుల గురించి వారు చిలకపలుకులు లాగా వల్లె వేస్తున్నారు. మీకీ విషయాలు ఎవరు చెప్పారని అడిగినప్పుడు మా మాష్టారు చెప్పారు అని ఆదివాసులు చెప్పారు. అనేక సంవత్సరాలుగా అధికారంలో ఉన్న సంఘ్‌పరివార్ శక్తులు తమకనుగుణమైన పాఠ్యాంశాలను బోధించటం వలన వారిపై ఆ ప్రభావం బలంగా ఉండి పోయింది. ఎన్నికలలో ఎవరు గెలిచినా పాలనా యంత్రాంగంలో ఆర్.ఎస్.ఎస్. శక్తులు చొచ్చుకొనిపోయి ఉన్నాయి. ఒక మూసలో విద్యారంగాన్ని అభివృద్ధి చేశారు. మత విద్వేషాలను రెచ్చగొట్టగలిగారు.

అందుకే లౌకిక ప్రజాస్వామిక విలువలను బోధించే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం అవసరం. లౌకికతకు, ప్రజాస్వామ్యానికి నిర్వచనాలే పరిమితంగా చెప్పబడ్డాయి. ఆ పరిమితమైన అర్థంలో కూడా లౌకికత అవసరం లేదంటున్నారు

వాళ్ళు. ఆ పరిమితులలో అయినా వాటిని కాపాడవలసిన  అవసరం ఉందని కొందరి అభిప్రాయం. కాని లౌకిక ప్రజాస్వామిక విలువలను సంపూర్ణంగా సాధించవలసి ఉందని మా అభిప్రాయం.

"ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు. ఎన్నికలలో గెలుపొందిన వారిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. రాజకీయాలంటే ఓట్లు అడగడం, ఓట్లు వేయించుకోవటం. ఇదే ప్రజాస్వామ్యం" అని చంద్రబాబు పదే పదే చెప్పాడు. ఇది చంద్రబాబు అభిప్రాయమే కాదు చాలామంది రాజకీయ నాయకుల అభిప్రాయం కూడా. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? నిర్వచించుకోవలసిన అవసరం ఉంది. అదే విధంగా లౌకికతను గురించి గాంధీజీ ఇలా అన్నారు – "అన్ని మతాల వాళ్ళు ప్రచారం చేసుకోవటానికి  ఇక్కడ సమాన అవకాశం ఉంది. ఈ దేశం ఒక మతానికి చెందినది కాదు. అన్ని మతాల వాళ్ళదీ."  ఇది లౌకికవాదంలో ఒక చిన్న అంశం మాత్రమే అయినా దీనినే ప్రధానం చేశారు. ఈ పరిమితమైన నిర్వచనానికి కూడా న్యాయం జరగటం లేదు. మతప్రచారం చేసుకొనే హక్కుతోపాటు ఒక మతంలో చేరే, చేర్చుకొనే హక్కును కూడా రాజ్యాంగం ప్రసాదించింది. అయినా తమిళనాడు ప్రభుత్వం మతమార్పిడిని నిషేధించింది. దీనిని కోర్టులు కూడా సమర్థించాయి. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు కూడా ఈ విధంగా నిరాకరింపబడుతున్నాయి. మత మార్పిడిపై నిషేధం ఎందుకంటే హిందూమతంలోకి ఎవరూ రాలేరు. ఎందుకంటే వస్తే ఏ కులంలో చేరతారు? అది సాధ్యంకాని విషయం. కాబట్టి హిందూమతం నుండి బయటకు పోకుండా చెయ్యాలి. రాజ్యాంగం ఏమి చెప్పినా వాళ్ళు చేయదలచుకున్నవి చేస్తున్నారు.

పాఠ్యాంశాల ద్వారా, పాఠ్యాంశాలకు పరిమితం కాని బోధన ద్వారా మనం ఏ విలువలను బోధించగలుగుతున్నాం? పరిమితార్థంలోనైనా లౌకిక ప్రజాస్వామిక భావాలను బోధించగలగుతున్నామా? లౌకిక ప్రజాస్వామిక విలువలను బలంగా పెంపొందించాలంటే చరిత్రను, సాహిత్యాన్ని ఆలంబనగా చేసుకోవాలి. వీటిని ఏ విధంగా బోధిస్తున్నాం, ఎలా వ్యాఖ్యానిస్తున్నామో పరిశీలించాలి. సాహిత్యం పేరు మీద బ్రాహ్మణీయ విలువలను బోధించటం జరుగుతోంది. ఒకటో రెండో మినహాయింపులు ఉండవచ్చు. ఈ విలువలకు లోబడిన పాఠ్యాంశాలే ప్రధానంగా

ఉంటున్నాయి. చరిత్ర రచన హైందవ జాతీయ కోణం నుంచి చేయటం సంఘ్‌పరివార్ మొదలుపెట్టక ముందు కూడా చరిత్ర రచన, ప్రజాస్వామిక, లౌకిక విలువలను పెంపొందించేదిగా జరగలేదు.

సంఘ్‌పరివార్ ఆలోచనల ప్రకారం "ఈ దేశ చరిత్ర ఆర్యులతో ప్రారంభమైంది. ఆర్యులు ఈ దేశంవాళ్ళే. బయట నుంచి రాలేదు." కాని ఆర్యులు బయట నుంచి వచ్చారన్నది వాస్తవం. వాస్తవంతో వాళ్ళకు పని లేదు. ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు పరాయివాళ్ళు కారు కాని వాళ్ళ ఆలోచనలు పరాయి దేశాలవి కనుక వాళ్ళను పరాయివాళ్ళు అని చెప్పాలి. మరి ఆర్యులు? చరిత్రకారుల ప్రకారం ఆర్యులు భారతదేశం వైపు వ్యాపించే క్రమంలో ఆఫ్ఘనిస్తాన్‌లో ఉండగా వ్రాయబడింది ఋగ్వేదం. కాని సంఘ్‌పరివార్ దానిని అంగీకరించదు. ఆర్యులకు పూర్వమే భారత ఉపఖండంలో ఒక సంస్కృతి ఉన్నది, నాగరికత ఉన్నది అనే విషయాన్ని కూడా ఆర్.ఎస్.ఎస్. అంగీకరించదు. వారి అభిప్రాయం ప్రకారం హైందవమతం అనాది మతం. దీనిని ప్రచారం చేసింది ఆర్యులు. ఆర్య సంస్కృతి, వేదాలు, హైందవ నాగరికత ఒకనాడు అద్భుతంగా వర్ధిల్లాయి. కులాలపైన, స్త్రీలపైన అణచివేత ఆనాడు లేదు. ముస్లింలు దాడులు చేసి, బ్రాహ్మణులను చంపుతూ, స్త్రీలపై అత్యాచారాలు చేస్తూ బలప్రయోగంతో ఇస్లాంను నెలకొల్పారు. అప్పటిదాకా భర్తతో సమానంగా ఉన్న స్త్రీ ముస్లిం దాడులకు భయపడి భర్త యొక్క రక్షణలో చేరి బానిసయ్యింది. గుణంరీత్యా వర్గీకరించబడిన వర్ణవ్యవస్థ అప్పుడే కులవ్యవస్థగా మారింది అని ఆర్.ఎస్.ఎస్.వాళ్ళు విశ్వసిస్తారు. హిందువులపై ముస్లింల ఆధిపత్యం కొనసాగుతూ ఉండగా క్రైస్తవులు వచ్చారు. వాళ్ళూ తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. వారిద్దరి ఆధిపత్యం నుండి దేశాన్ని బయటపడవేయటమే ఆర్.ఎస్.ఎస్. ప్రవచించే జాతీయవాదం. అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు అదే దాస్యాన్ని కొనసాగిస్తోంది. ఇదీ స్థూలంగా సంఘ్‌పరివార్ ఆలోచన.

మిత్రులారా ! మీరు మార్క్సును, అంబేద్కర్‌ను చదవకపోయినా పర్వాలేదు. కాని గోల్వాల్కర్‌ను చదవండి. దేశంలో ఏ ఆలోచనారీతి బలంగా వ్యాపిస్తున్నదో చూడండి. బి.జె.పి.కి వచ్చిన ఓట్లు మాత్రమే చూడొద్దు. లౌకికవాదం పేరుతో అధికారంలోనికి వచ్చిన యుపిఎ ప్రభుత్వంలో కూడా ఇద్దరు ఆర్.ఎస్.ఎస్.

వాళ్ళు ఉన్నారు. పైకి ఏమి చెప్పినా అంతరంగంలో మాత్రం కాషాయం నిండి ఉన్నవాళ్ళు ఈ దేశంలో చాలామంది ఉన్నారు. విశ్వవిద్యాలయాలలో అధికార యంత్రాంగంలో వ్యాపించి ఉన్నారు. అనేక జెండాల కింద ఉన్నారు. అనేక పదవులలో ఉన్నారు. వాళ్ళు ఎక్కడ ఉన్నా మనం వాళ్ళను గుర్తించగలగాలి. వాళ్ళ ఆలోచనారీతులను అర్థం చేసుకోగలగాలి. గోల్వాల్కర్ నుంచి నేటి దాకా సంఘ్‌పరివార్ ఆలోచనా ధోరణి ఏమీ మారలేదు. వాజ్‌పేయి మారాడని, మారుస్తాడనీ కొందరి అభిప్రాయం. ఇది పొరపాటు. టి.వి. ఛానెల్‌ను బట్టి, మాట్లాడే దేశాన్ని బట్టి ఏ విధంగా కావాలో ఆ విధంగా మాట్లాడగలిగే చాతుర్యం వాజ్‌పేయికి ఉంది.

ముస్లింలపై దాడులు చేయడం తప్పు అనే వారిలో కూడా ముస్లింలు మూర్ఖులు, అరబ్బులు దుర్మార్గులు అనే అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. ఈ భావాలు ప్రపంచంలోని బలమైన దేశాలవాళ్ళు విస్తృతంగా ప్రచారం చేయటం వలన వ్యాపించాయి. ఇండోనేషియా తరువాత అత్యధిక ముస్లిం జనాభాగల దేశం భారతదేశం. అందుకే హిందువులు వారితో కలసిమెలసి ఉండాలి. వారి చరిత్రను, సంస్కృతిని బోధించాలి. ప్రపంచంలో అత్యంత గొప్ప నాగరికత అరబ్బుల నాగరికత అని ఇంగ్లీషు చరిత్రకారులు కూడా ఒప్పుకుంటున్నారు. ప్రాచీన గ్రీకు సాహిత్యం, సైన్సులను అరబ్బీ భాషలోనికి ఎప్పుడో తర్జుమా చేశారు. ముస్లిం అంటే fundamentalist అంటున్నారు. సౌదీ తప్ప అరబ్బు దేశాలన్నీ లౌకికరాజ్యాలే. సద్దాం నియంతే. కాని లౌకికవాది. మత నియంత కాదు. ఇస్లాంలో స్త్రీలకున్న ఇబ్బందులను తొలగించి పురుషులతో సమానంగా జీవించే అవకాశాలు కల్పించాడు. ఈ అంశాలు మనం పాఠ్యాంశాలలో బోధిస్తే ముస్లింలను, ఇస్లాంను సరిగ్గా అర్థంచేసుకొని, నిజమైన లౌకికవాదులుగా రూపొందుతారు. లౌకికవాదాన్ని బోధించాలంటే మన దేశ చరిత్రతోపాటు ఆసియా చరిత్ర, ప్రపంచ చరిత్ర కూడా బోధించాలి.

మన దేశం లౌకికభావాలుగల దేశం అని చాలామంది అంటున్నారంటే కారణం వారి మంచితనమే కాని జ్ఞానంతో వచ్చిన అవగాహనతో కాదు. ఆర్.ఎస్.ఎస్. చెప్పినట్లుగానే చరిత్రను హిందూయుగం, ముస్లింయుగం అని

మన విద్యావ్యవస్థ అంతకు ముందునుంచే బోధిస్తోంది. ఘజనీయో, గోరీయో దాడిచేస్తే ముస్లింయుగం ప్రారంభమయినట్లా? (మెడమీద కత్తిబెట్టి బలవంతంగా మతమార్పిడి చేశారనే ప్రచారం కూడా ఉంది. కాని చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం బలప్రయోగం కంటే వ్యాపారమే మతవ్యాప్తికి తోడ్పడింది. వాస్తవానికి ఇస్లాం వ్యాప్తి వ్యాపారం వలన బాగా జరిగింది.) సిబిఎస్ఇ సిలబస్‌లో పర్యావరణం గురించి మంచి పాఠ్యాంశాలున్నాయి. అదే స్థాయిలో లౌకికవాదాన్ని చరిత్రను బోధించవలసిన అవసరం ఉంది.

భారతదేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం రెండూ ముడిపడి ఉన్నాయి. ఇతర దేశాలలో కాథలిక్ చర్చి అజమాయిషీ రాజ్యంపై బలంగా ఉండేది. ఆ దేశాలలో లౌకికవాదం అంటే రాజ్యాన్ని చర్చి ప్రభావం నుంచి బయటపడవేయడం. భారతదేశంలో లౌకికవాదం అంటే అన్ని మతాల సహజీవనం, రాజ్యానికి మతానికి సంబంధం లేకపోవటమే కాదు "మనిషికి ఆధ్యాత్మిక అవసరం ఉంటే మతం దానికే పరిమితం కావాలి. ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక జీవితంపై మతప్రమేయం ఉండరాదు." ఇది లౌకికవాద నిర్వచనం కాదా? దేశాన్ని బ్రాహ్మణీయ భావజాలం నుండి హైందవ భావజాలం నుండి బయటపడేయాలి.

'ధర్మం' అనే భావనే చాలా దుర్మార్గమయింది. దురదృష్టవశాత్తు దానిని ఇంగ్లీషులో Justice అని అంటున్నారు. Justice అంటే న్యాయం. ధర్మం అంటే ఈ సృష్టిలో లేదా ప్రపంచంలో ప్రతి వస్తువుకు ఒక స్థానం ఉంది. ఆ స్థానానికి కట్టుబడి ఉండటమే ధర్మం. ఈ భావన ఉన్నంతకాలం భారతదేశంలో ప్రజాస్వామ్యం రాదు. మనుషులందరూ ఒకటే, అందరూ సమానమే, అందరికీ సమానమైన అవకాశాలు ఉండాలి అనే భావనలు ప్రజాస్వామ్యానికి కీలకమైనవి. సరిగ్గా వాటికి వ్యతిరేకమైనది 'ధర్మం'. ఎవరి స్థానం వారికి ఉంటుంది. దానికి కట్టుబడి ఉండటమే 'ధర్మం'. ఈ భావనపై విమర్శ మన పాఠ్య గ్రంథాలలో లేదు. ముస్లింలు భారతదేశాన్ని పరిపాలించినా దేశ ప్రజలందరినీ ఇస్లాంలోకి మార్చలేదు. అత్యధికశాతం హిందువులుగానే ఉన్నారు. భారతదేశంలోకి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక అభివృద్ధిని ముస్లింలు తెచ్చారనేది వాస్తవం. ఈ విషయాలను విద్యార్థులకు బోధిస్తే పరమతసహనం కలుగుతుంది.

ఇది అందరి దేశం అనే అవగాహన పెరుగుతుంది. సామాజిక జీవితంపైన బ్రాహ్మణీయ, నిచ్చెనమెట్ల వ్యవస్థ, దాని విలువల ప్రభావాన్ని తొలగించాలి. పాఠ్యప్రణాళికలో వాటిని ఎలా ప్రవేశపెట్టాలో ఆలోచించాలి. ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు తమ సిద్ధాంతాలను ఇప్పటికే ప్రవేశపెట్టారు. గోల్వాల్కర్ శక్తివంతమైన హైందవ జాతిని తయారు చేయాలన్నారు. బి.జె.పి. మొన్న ఎన్నికలలో అదే చెప్పింది. జాతి బలోపేతం కావాలంటే అందరూ పాలకవర్గానికి లోబడి ఉండాలి. అలా ఉండకపోతే జాతి బలహీనపడుతుంది. హిట్లర్ ఆర్యజాతి సిద్ధాంతం కూడా అదే. "ఇల్లు కట్టుకోవాలంటే కింద కొన్ని ఇటుకలుండాలి. పైన కొన్ని ఇటుకు ఉండాలి. అన్ని ఇటుకలూ పైనే ఉండాలంటే ఇల్లు ఏమవుతుంది?" అని గోల్వాల్కర్ అన్నాడు. వాళ్ళు ఈ ఆలోచనారీతినే ప్రచారం చేస్తున్నారు. భారతదేశంలో లౌకికత, ప్రజాస్వామ్యం రెండూ విడదీయరానివి. రెండింటిని వ్యాపింప చేయడానికి ఉపాధ్యాయులు తమకుండే వెసులుబాటును వినియోగించుకోవాలి. తగిన సిలబస్ రూపకల్పనకు ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలు నడుం కట్టాలి.

# మైనారిటీలు-సంఘ్‌పరివార్

# హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం!

ప్రజలారా!

డిసెంబర్ 6వ తేదీన అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేసిన తరువాత లౌకికవాదాన్ని గురించి దేశంలో పెద్దఎత్తున చర్చ జరుగుతూ ఉంది. లౌకిక వాదాన్ని కాపాడుకుందాం రమ్మని అనేక పార్టీలు ప్రజలకు పిలుపునిస్తున్నాయి. ఉద్యమాలు చేపడదామంటున్నాయి. కాని భారతీయ జనతా పార్టీ మాత్రం ఇదంతా 'కుహనా లౌకికవాదం' అంటూ దుమ్మెత్తిపోస్తున్నది. లౌకికవాదం పేరిట మైనారిటీలను బుజ్జగిస్తున్నారనీ, హిందువులకు అన్యాయం జరిగిపోతున్నదనీ గగ్గోలు పెడుతూ వుంది. 'బుజ్జగించడం' అంటే అర్థం గాలీ, వెల్తురు లేని మురికి వాడలలో శాశ్వతంగా ఉంచటం కాబోలునని అత్యధికంగా పట్టణ పేదవర్గాలకు చెందిన ముస్లింలకు ఈ పాటికి అనుమానం వచ్చే ఉండాలి!

మన సామాజిక జీవితం, ఆర్థికజీవితం, రాజకీయ జీవితం మతం ప్రభావం నుండి బయటపడి ప్రజాస్వామ్య విలువలకు అనుగుణంగా రూపొందాలనేది లౌకికవాదం. ఒకప్పుడవి పూర్తిగా మతం ప్రభావంలో ఉండేవి. వర్ణాశ్రమ ధర్మం, పూజారుల పెత్తనం, కులమత ఆచారాలు, మత సంబంధమయిన నమ్మకాలు సామాజిక రాజకీయ జీవితాన్ని శాసించేవి. ఆ జీవితంలో ప్రజాస్వామ్యానికి తావు లేదు. ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ, ఒకరు పూజ్యులు, ఒకరు అంటరానివారు, ఒకరు స్వతంత్రులు, ఒకరు దాసులు అనేది మధ్యయుగాల సాంఘిక నీతి. దాని స్థానంలో ఆధునిక ప్రజాస్వామ్య విలువల ప్రాతిపదికమీద సామాజిక రాజకీయ జీవితాన్ని నిలబెట్టాలని భావిస్తుంది లౌకికవాదం. అదొక ఉన్నతమయిన ప్రజాస్వామ్య విలువ. లౌకికవాదం లేనిదే ప్రజాస్వామ్యం లేదు.

---

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (APCLC),
ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR), కలిసి ప్రచురించిన బుక్‌లెట్, 1993

'ముస్లిం దేశాలలో లౌకికవాదం లేనప్పుడు మనకు మట్టుకు ఎందుకు?' అని ఈ రోజు హిందూత్వవాదులు అంటున్నారు. ఇదొక తప్పుడు వాదన. ముస్లింలు మెజారిటీగా ఉన్న దేశాలన్నిటిలోనూ మత రాజ్యాలు లేవు. ఈజిప్టు, అల్బేనియా, అల్జీరియా, టర్కీ వంటి అనేక దేశాల ప్రశాసనం లౌకికమైనదే. సౌదీ అరేబియాను, పాకిస్తాన్‌ను మట్టుకే ఉదాహరణగా ఎందుకు తీసుకోవాలి? ప్రజాస్వామ్య విలువల విషయంలో మన కంటె వెనుకబడిన దేశాలను ఉదాహరణగా తీసుకొని మనం కూడ వాళ్లలాగ తయారు కావాలని కోరుకోవడం ఏ రకమైన దేశభక్తి? ఏ రకమయిన జాతీయత?

'కుహనా లౌకికవాదం' అంటూ బిజెపి చేస్తున్న విమర్శలో ప్రధాన అంశం 'మైనారిటీలను బుజ్జగిస్తున్నారు' అనేది. కాంగ్రెస్ ప్రభుత్వాలు వివిధ సందర్భాలలో వోట్ల కోసం మైనారిటీ మత ఛాందసులను బుజ్జగించడం జరిగిన మాట వాస్తవం. దానికి 'మైనారిటీల బుజ్జగింపు' అని పేరు పెట్టడం మట్టుకు దారుణమైన వక్రీకరణ. మైనారిటీలను మొత్తంగా బుజ్జగించింది ఎన్నడూ లేదు. ఆ పనే చేసి వుంటే ముస్లింలలోనే అందరికంటే ఎక్కువ పేదరికం, నిరుద్యోగం ఉండేవి కావు. 'మైనారిటీల బుజ్జగింపు'కు బిజెపి చూపించే ప్రధాన నిదర్శనం షాబానో కేసులో రాజీవ్‌గాంధీ సుప్రీంకోర్టు తీర్పును వమ్ముచేసి ముస్లిం మత ఛాందసులను మెప్పించేందుకు ముస్లిం స్త్రీని భర్త వదిలిపెడితే సి.ఆర్.పి.సి. ప్రకారం మనోవర్తి ఇవ్వనక్కరలేదని చట్టం చేయడం. దీనివల్ల నష్టపోయింది ముస్లిం స్త్రీలు. వాళ్లు మైనారిటీలో భాగం కాదా? ఈ చర్య 'మైనారిటీల బుజ్జగింపు' ఎట్లాగయింది? అంతేకాక, రాజీవ్‌గాంధీ కంటే 40 ఏళ్లు ముందు ఆయన తాతగారయిన జవహర్‌లాల్ నెహ్రూ హిందూమత ఛాందసులకు భయపడి హైందవ వ్యక్తిగత చట్టాన్ని సవరించి స్త్రీలకు కొన్ని హక్కులు కల్పించే హిందూకోడ్ బిల్‌కు శాసన రూపం ఇవ్వడానికి వెనకాడాడు. అప్పటి కేంద్ర న్యాయశాఖ మంత్రి అంబేద్కర్ దీనికి నిరసనగా రాజీనామా చేసాడు. బిజెపి నాయకులు దీనిని 'బుజ్జగింపుకు', 'కుహనా లౌకిక వాదానికి' నిదర్శనంగా ఎందుకు తీసుకోరు? కాంగ్రెస్ పార్టీ మత ఛాందసత్వాన్ని బుజ్జగించడం, లేదా దానితో లాలూచీ పడడం అనేక సందర్భాలలో జరిగింది, జరుగుతున్నది. బాబ్రీ మసీదులోకి కొందరు

రామభక్తాగ్రేసరులు 1949లో రామవిగ్రహాన్ని దొంగతనంగా ప్రవేశపెట్టి ఆ మసీదును కృత్రిమంగా 'వివాదాస్పదం' చేసినప్పుడు, విగ్రహాలను తొలగిస్తే హిందూ మతతత్త్వ శక్తులకు ఆగ్రహం వస్తుందని నెహ్రూ ప్రభుత్వం భయపడి మసీదుకు తాళం వేయించింది. రామపూజలు దొంగతనంగా సాగుతూనే ఉన్నా నిరోధించలేదు. ఇది హిందూ మతతత్వంతో లాలూచీ కాదా, 'బుజ్జగింపు' కాదా? లాలూచీలో భాగంగానే 1986లో రాజీవ్ గాంధీ మసీదు తాళాలు తీయించి పూజలు బహిరంగంగా సాగనిచ్చాడు. 1989లో శిలాన్యాసం అధికారికంగా ఆరంభం కానిచ్చారు. 1991లో 'వివాదాస్పద' స్థలంలో కరసేవ చేయనిచ్చారు. 1992లో మసీదును కూల్చనిచ్చారు. ఒక్క షాబానో ఉదంతాన్ని మట్టుకే లౌకిక వాదానికి మచ్చగా ఎందుకు భావించాలి?

అయితే బుజ్జగింపు గురించి హిందూత్వవాదులు చేస్తున్న వాదన షాబానో కేసు దాటి చాలా దూరం పోతున్నది. 'మైనారిటీ' అనే భావనే బుజ్జగింపని వాళ్లు వాదిస్తున్నారు. మైనారిటీలకు తమ సంస్కృతిని కాపాడుకోవడానికీ తమ సామాజిక ఆర్థిక వికాసం సాధించడానికీ ప్రత్యేకమయిన హక్కులు, సదుపాయాలు కల్పించడాన్ని బుజ్జగింపు అంటున్నారు. ఇది చాలా అప్రజాస్వామికమయిన వైఖరి. ఏ సమాజంలోనయినా మతం రీత్యా, భాష రీత్యా, సంస్కృతి రీత్యా మైనారిటీలయిన ప్రజలు ఉంటారు. వాళ్లకుండే ప్రత్యేకమయిన సమస్యలను గుర్తించడం, వారికి ప్రత్యేక హక్కులనూ ప్రతిపత్తినీ కల్పించడం కనీస ప్రజాస్వామ్య చర్య.

ఈ హిందూత్వవాదుల దుష్ప్రచారం హోరులో ప్రజలకు కొన్ని వాస్తవాలు తెలియడం లేదు. అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చివేసిన తరువాత పాకిస్తాన్‌లోనూ, బంగ్లాదేశ్‌లోనూ హిందూ దేవాలయాలను కూల్చివేయడం పట్ల ఆ దేశాలలోని ప్రముఖులు, మేధావులు చాలా ఆందోళన చేసారు. ఆ దేశాల ప్రభుత్వాలు ఆ దేవాలయాలను తిరిగి నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చాయి. హిందువులను ఆ దేశాలలో మైనారిటీగా గుర్తించబట్టే కదా ఇది జరిగింది?

'మైనారిటీ మెజారిటీ అన్న తేడా లేకుండా పౌరులందరినీ సమానంగా చూడాలి' అని హిందుత్వవాదులు చేస్తున్న వాదన చాలా ప్రమాదకరమయినది. సమానం కాని వారిని సమానంగా చూస్తే అసమానతలు పెరుగుతాయి తప్ప

తగ్గవు. తెలుగువాళ్లు పొరుగు రాష్ట్రాలలో మైనారిటీగా ఉన్నారు కాబట్టి ప్రత్యేకంగా తెలుగు స్కూళ్లు, ఇతర ప్రత్యేక వసతులు కోరుకుంటున్నారు. ఆ రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్నాయి. ఇంగ్లండ్‌లో, అమెరికాలో స్థిరపడిన భారతీయులు ఒక మైనారిటీగా ప్రత్యేక వసతులు కోరుకుంటున్నారు, పొందుతున్నారు. 'పౌరులంతా ఒకటే. అందరినీ ఒకే రకంగా చూడాలి' అనే వాదన సామాజిక జీవితంలో అన్ని రంగాలకూ విస్తరిస్తే ఆ వ్యవస్థ చాలా అప్రజాస్వామికంగా ఉంటుంది. బలహీనులకు, పీడితులకు చాలా అన్యాయం చేస్తుంది. వెనుకబడ్డ ప్రాంతాలు, అభివృద్ధి చెందిన ప్రాంతాలు అన్న ప్రాంతీయ తత్వం ఎందుకు? వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు ఎందుకు? స్త్రీలు పురుషులు అన్న తేడా ఎందుకు? స్త్రీలకు బస్సులలో వేరే సీట్లెందుకు? ప్రత్యేకమైన మహిళా కాలేజీలెందుకు? అగ్రకులాలు, వెనుకబడ్డ కులాలు అన్న తేడా ఎందుకు? వెనుకబడ్డ కులాలకు రిజర్వేషన్లెందుకు? వేరే స్కాలర్‌షిప్‌లు ఎందుకు? ఈ రకమయిన వాదనలు మనం తరచుగా వింటుంటాం. ఇవన్నీ కూడ మెజారిటీ మైనారిటీ అనే తేడా ఎందుకు అని ప్రశ్నించే హిందూత్వ దృక్పథంలో భాగమే. వోట్ల భయం వల్ల గట్టిగా అనడానికి ఈ రోజు భయపడుతుండవచ్చుగాక. ప్రజాస్వామిక దృక్పథం దీనికి పూర్తిగా భిన్నమైనది. దళితులకు, ఆదివాసులకు, స్త్రీలకు, వెనుకబడ్డ కులాలకు, అల్పసంఖ్యాక జాతులకు, మైనారిటీ మతస్తులకు, వెనుకబడ్డ ప్రాంతాలకు ప్రత్యేక ప్రతిపత్తిని ఒక హక్కుగా గుర్తించలేకపోతే అది ప్రజాస్వామ్యం కాదు, మెజారిటీ పాలన అనే ముసుగు తొడుక్కున్న నియంతృత్వం అవుతుంది. ఆ నియంతృత్వమే హిందూత్వ వాదుల సామాజిక రాజకీయ సిద్ధాంతం.

ఈ హిందూత్వ వాదులు 'భారతజాతి' అనే దాన్ని ఒక అఖండ పదార్థంగా భావించమంటారు. ఆ ప్రాతిపదిక మీద అందరూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని డిమాండ్ చేస్తారు. వివక్షకు గురయ్యేవారు వివక్షను మరచిపోవాలి. దోపిడీకి గురయ్యేవారు దోపిడీని మరచిపోవాలి. విభిన్న సంస్కృతులకు, మతాలకు, జాతులకు చెందినవారు ఆ భిన్నత్వాన్ని మరచిపోవాలి. అందరూ అన్నీ మరచిపోయి అఖండ జాతీయభావాన్ని పెంపొందించుకొని 'భారతజాతి'తో తాదాత్మ్యం చెందాలి. మమేకం కావాలి. తిరుగుబాటుకు,

*హిందూ మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం !*

పోరాటాలకే కాదు విభిన్న సంస్కృతులకు, విభిన్న ఆచారాలకు, విభిన్న ఆకాంక్షలకు దీనిలో తావులేదు. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే చట్టం అనేది వీళ్ల నినాదం. దానితో పాటు ఒకే దేవుడు (రాముడు), ఒకే భాష (హిందీ), ఒకే సంస్కృతి (వర్ణాశ్రమ ధర్మ సంస్కృతి) అని చెప్పుకోవచ్చు.

ఈ దృక్పథం కేవలం మైనారిటీలకే ప్రమాదకరమయినది కాదు. ఇది అన్ని ప్రజాస్వామ్య ఆకాంక్షలకూ ప్రమాదకరమయినది. ఒక్క హిందుత్వం మట్టుకే ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమా అని అడుగుతారేమో! ఏ మతోన్మాదమయినా ప్రమాదకరమే. కానీ భారతదేశంలో హిందూ మతతత్వం మట్టుకే రాజ్యాధికారానికి రాగలదు. రావడానికి ఒక్కొక్క మెట్టే పైకి ఎగబ్రాకుతూ ఉంది. అది రాజ్యాధికారానికి వస్తే హిందూ మతతత్వ విలువలే రాజ్యాంగ విలువలయ్యే ప్రమాదం ఉంది. రాజకీయ ఆర్థిక సామాజిక జీవితంలో హిందూ మతతత్వ విలువలే రాజ్యం చేసే ప్రమాదం ఉంది. అందుకే ఈ దాడి నుండి ప్రజాస్వామిక విలువలను కాపాడుకోవడం ఇవ్వాల్టి ముఖ్య కర్తవ్యాలలో ఒకటి. లౌకిక వాదం ఆ ప్రజాస్వామిక విలువలలో ఒకటి మాత్రమే.

## హిందూత్వ వాదుల సామాజిక ఆర్థిక రాజకీయ దృక్పథం

ఈ దృక్పథం ఏమాత్రం ప్రజాస్వామికమైనదో కొంచెం పరిశీలిద్దాం.

ఇంకా రాజ్యాధికారం చాలా దూరంలో ఉండగానే, రాజ్యాంగం నుండి 'లౌకిక' అనే మాటను తొలగించాలని బిజెపి నేతలు డిమాండ్ చేస్తున్నారు. 'మైనారిటీ' అనే మాటను తొలగించాలంటున్నారు. నియంతృత్వ రూపకల్పనలో ఇది తొలిమెట్టు. రాజ్యాధికారానికి చేరువ అయ్యే కొద్దీ ఒక్కొక్క ప్రజాస్వామిక విలువ మీద, హక్కు మీద దాడి మెట్టు మెట్టుగా పెరుగుతుందనడంలో సందేహం లేదు. దీనికి నిదర్శనం కావాలంటే ఎక్కడో వెతకనక్కరలేదు. విశ్వహిందూ పరిషత్ ఆర్ఎస్ఎస్‌ల ప్రవచనాలున్నాయి. తొలినాడు జనసంఘ్‌గా, తరువాత భారతీయ జనతా పార్టీగా దేశరాజకీయాలలో 'హిందూత్వం' నిర్వహించిన పాత్ర ఉంది.

సమసమాజం అనేది అణచివేతకు గురయ్యే అన్ని వర్గాల ప్రజల సామాన్య ఆకాంక్ష. భారతరాజకీయాలలో అన్ని పార్టీలూ కనీసం వోట్ల కోసం ఆ ఆదర్శాన్ని ప్రకటించుకున్నాయి. ఒక్క హిందుత్వవాదులు మట్టుకే ఇందుకు మినహాయింపు.

వాళ్ళకు తొలినుండి ఆ మాట అంటేనే వ్యతిరేకత. మధ్యలో కొన్నాళ్ళు గాంధేయ సోషలిజం తమ ఆదర్శం అని ప్రకటించుకున్నారు గానీ అది మింగుడు పడక తామే వదిలేసుకున్నారు. దానికి ప్రత్యామ్నాయంగా వాళ్లు చెప్పే 'సర్వేజనో సుఖినోభవంతు' అనేది ప్రజాస్వామిక ఆకాంక్ష కాదు. భిక్షగాడు కూడ భిక్షాటన తన పూర్వ కర్మ ఫలితంగా తనకు సంక్రమించిన ధర్మం అనుకుంటే సుఖంగానే ఉండవచ్చు. ఎవరి స్థానాన్ని వారు తమ కర్మఫలంగా స్వీకరించి సుఖంగా బ్రతకాలనే హిందూత్వ ఆదర్శం సమసమాజం అనే ప్రజాస్వామిక ఆదర్శానికి బద్ధశత్రువు.

కుల వ్యవస్థ అంతం కావాలనీ, అందులో భాగంగా కులవివక్షకు గురయిన షెడ్యూల్డు కులాలతో బాటు వెనుకబడ్డ కులాలకు కూడ రిజర్వేషన్లు ఒక హక్కుగా ఇవ్వాలనీ మండల్ కమిషన్ సందర్భంగా దేశంలోని ప్రజాతంత్రవాదులంతా వాదించారు. హిందూత్వ శక్తులు మట్టుకు తమ సంప్రదాయానికి అనుగుణంగా మండల్ కమిషన్‌ను వ్యతిరేకించాయి. వోట్లు పోతాయన్న భయంతో బిజెపి నాయకులు పైకి ఏం మాట్లాడినా మండల్ వ్యతిరేక ఆందోళనలో ఉత్తర భారతదేశంలో అగ్రభాగాన నిలబడింది అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కార్యకర్తలు. అసలు హిందూత్వం అంటేనే వర్ణాశ్రమ ధర్మం. క్రైస్తవ మతానికి చర్చి వెన్నెముక అయినట్లు హిందూత్వానికి కుల వ్యవస్థ వెన్నెముక. బిజెపి నాయకులు వోట్ల భయంతో జాగ్రత్తపడుతున్నారుగానీ వాళ్ల చుట్టూ ఉన్న హిందూత్వ వాదులు వర్ణాశ్రమ ధర్మాన్ని పునఃస్థాపిస్తామని ప్రతిజ్ఞలు చేస్తున్నారు. వర్ణాశ్రమ ధర్మానికి అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని తిరగరాయాలని సన్యాసులూ, సాధువులూ డిమాండ్ చేస్తున్నారు! 'పాకిస్తాన్‌లో లేని లౌకికవాదం మనకెందుకు?' అని హిందూత్వ వాదులు పదే పదే వేస్తున్న ప్రశ్న వెనకున్న దుర్బుద్ధి ఇది. సమాజంలో ప్రతి వ్యక్తి స్థానం పుట్టుకతో నిర్ణయం అవుతుందనీ, ఉచ్ఛనీచాలు అప్పుడే నిర్ణయమవుతాయనీ, ఎవరి స్థానానికి తగినట్టు వారు నడుచుకోవడం 'ధర్మం' అనీ హిందూత్వం చెపుతుంది. ఈ రోజు కార్మికులు, కూలీలు, స్త్రీలు, దళితులు, గిరిజనులు సమాజం తమ 'ధర్మం'గా నిర్దేశించిన దానికి వ్యతిరేకంగా తిరగబడుతున్నారు. వాళ్లకు హిందుత్వం చెప్పే జవాబు 'నోరు మూసుకొని పడి ఉండండి' అని. కారంచేడుతో మొదలుపెట్టి మన రాష్ట్రంలో అనేక సందర్భాలలో

దళితులపైన అగ్రకులాల దాడులు జరిగాయి. అన్ని రాజకీయ పార్టీలు ఒకసారి కాకపోతే ఒకసారయినా ఈ హత్యాకాండకు వ్యతిరేకంగా మాట్లాడాయి. ఎన్నడూ నోరు విప్పనిది ఈ హిందూత్వవాదులే. ఎన్నడూ దళితుల ఏ పోరాటంలోనూ పాల్గొననిది వీరే.

ఈశాన్య భారతంలోని నాగా మిజో తదితర ప్రజలు చారిత్రకంగా సాంస్కృతికంగా తక్కిన భారతీయుల కంటే చాలా భిన్నమయిన వాళ్లు. వాళ్ల ఇష్టానికి వ్యతిరేకంగా వాళ్లను బలవంతంగా భారతదేశంలోకి కలుపుకోవడం జరిగింది. 10 సంవత్సరాల తరువాత ఈ విషయాన్ని పునఃపరిశీలిస్తామని భారత ప్రభుత్వం 1947లో వారికి హామీ ఇచ్చింది. వాళ్ల సంస్కృతినీ జీవన విధానాన్నీ వాళ్ళ భూములనూ బయటివాళ్ళ దాడినుండి కాపాడడం కోసం రాజ్యాంగంలో వారికి ప్రత్యేక హక్కులు చేర్చడం జరిగింది. ఈ ప్రత్యేక సదుపాయాల చారిత్రక నేపథ్యాన్ని అర్థం చేసుకోకుండా దీనిని 'క్రైస్తవ మైనారిటీల బుజ్జగింపు' అని హిందూత్వవాదులు దుష్ప్రచారం చేస్తున్నారు. 10 సంవత్సరాల గడువు తీరిన తరువాత భారత ప్రభుత్వం తన హామీని నిలబెట్టుకోక పోయేసరికి నాగా తదితర జాతుల ప్రజలు స్వాతంత్ర్యం కోసం పోరాటం ప్రారంభించారు. వారిపైన భారత ప్రభుత్వం పాశవికమైన అణచివేత ప్రయోగించసాగింది. న్యాయమయిన ప్రజల ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా ఇదంతా 'క్రైస్తవ మిషనరీల కుట్ర' అని దుష్ప్రచారం చేస్తున్నారు హిందూత్వవాదులు. తమ నేలలో తాము స్వతంత్రంగా బ్రతకాలన్న ఆ ప్రజల ఆకాంక్షను దేశద్రోహంగా, దేశ విచ్ఛిన్నంగా, క్రైస్తవుల కుట్రగా ప్రచారం చేస్తున్నారు.

ఒక్క ఈశాన్య భారతంలోనే కాదు, దేశంలో ఎక్కడయినా ప్రజలు స్వయం ప్రతిపత్తి కోసం పోరాటం చేస్తే అదంతా దేశ భద్రతకు, సమగ్రతకు భంగకరమంటూ కఠినంగా అణచివేయాలని గగ్గోలు పెడుతున్నది ఈ హిందూత్వ శక్తులే. కశ్మీర్‌లో హిందూ దేవాలయాలను కూల్చేస్తే ఎవ్వరూ ఖండించలేదని వీరు ప్రశ్నిస్తున్నారు. ఒక మతస్తుల ప్రార్థనా స్థలాలను మరొకరు ధ్వంసం చేయడాన్ని ప్రజాస్వామిక వాదులు తప్పక వ్యతిరేకిస్తారు. అయితే కశ్మీర్ రాజకీయాల చరిత్రను, కశ్మీరీల ఆకాంక్షలను వక్రీకరించి చేసిన దుష్ప్రచారానికి

హిందూత్వ నాయకులు సంజాయిషీ చెప్తారా? కశ్మీరీలు ఇటు పాకిస్తాన్‌లోగానీ అటు భారతదేశంలో గానీ చేరకుండ స్వతంత్రంగా బ్రతకాలని దేశవిభజనప్పుడు కోరుకున్నది నిజం కాదా? ఆ కోరికను పై రెండు దేశాలూ గౌరవించలేదన్నది నిజం కాదా? ఆ పరిస్థితిలో పాకిస్థాన్ దాడికి తట్టుకోలేక కశ్మీరీలు గత్యంతరం లేక భారతదేశంలో చేరారనడం నిజం కాదా? బలవంతపు విలీనానికి షరతుగా వాళ్లు స్వయం ప్రతిపత్తిని కోరుకున్నారు. అదే ఆర్టికల్ 370గా రాజ్యాంగంలో చోటు చేసుకుంది. కొంతకాలం తరువాత భారతదేశంలో భాగంగా ఉంటారా లేక విడిపోతారా అనేది నిర్ణయించుకునే హక్కు కశ్మీరీలకు ఉంటుందని ఈ నేపథ్యంలోనే భారత ప్రభుత్వం ఒప్పుకుంది. ఈ నేపథ్యాన్ని చెప్పకుండ ఆర్టికల్ 370ని 'మైనారిటీల బుజ్జగింపు'కు ఉదాహరణగా హిందుత్వవాదులు ప్రచారం చేస్తున్నారు. తమ భవితవ్యాన్ని నిర్ణయించుకునే హక్కు తమకే ఉంటుందని కశ్మీరీలకు ఇచ్చిన హామీని భారత ప్రభుత్వం నిలుపుకోకుండ షేక్ అబ్దుల్లాను తప్పుడు అభియోగాలపైన అరెస్టు చేయడంతో కశ్మీరీలలో అసంతృప్తికి బీజం పడింది. అది ఈరోజు సాయుధ తిరుగుబాటు రూపం తీసుకుంది. ఈ చరిత్రను కప్పి పెట్టి కశ్మీర్‌లో జరుగుతున్నది ముస్లిం మతోన్మాదుల దేశద్రోహ పూరితమయిన కుట్ర అని హిందూత్వవాదులు కాలికి బలపం కట్టుకొని దేశమంతటా దుష్ప్రచారం చేస్తున్నారు.

ఈ పోరాటం ఆ పోరాటం అన్న తేడా లేకుండా ఏ ప్రజాపోరాటం మీదనయినా సరే ప్రభుత్వం నిర్బంధం ప్రయోగిస్తే మొట్టమొదట హర్షం వ్యక్తం చేసేది, సమర్థించేది ఈ హిందూత్వవాదులే. పోలీసు అత్యాచారాల గురించి దేశంలో ప్రజలంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నప్పటికీ తాము ఎన్నడూ ఆందోళన చేయకపోగా పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయకూడదని హితవు చెప్పే కార్యక్రమం పెట్టుకున్నది వీరే. పౌరహక్కులు, ప్రజాస్వామ్య హక్కులు అంటే మండిపడేది వీరే. ఈ రోజు నిషేధాలూ నిర్బంధాలూ తమ దాకా వచ్చేసరికి గుండెలు బాదుకుంటున్నారు గానీ గతంలో ఎన్నడూ ఎవరిమీద నిర్బంధాన్నీ ఖండించని వారెవరయినా దేశంలో ఉన్నారా అంటే అది ఈ హిందూత్వవాదులే. గతంలో ఎల్‌టిటిఇని, పీపుల్స్‌వార్ గ్రూపును, పంజాబు కశ్మీర్ ఈశాన్య భారత పోరాట

సంస్థలను ప్రభుత్వం నిషేధిస్తే అది తప్పు అనకపోగా ఇంకా ఇంకా అణచి వేయాలన్నది వీరే. ఆంధ్రప్రదేశ్‌లో అన్ని రాజకీయ పార్టీలు ఒకసారి కాకపోతే ఒకసారయినా నక్సలైట్లను కేవలం శాంతి భద్రతల సమస్యగా చూడకూడదనీ, ఎన్‌కౌంటర్లు పరిష్కారం కాదనీ అన్నారేమోగాని ఆ మాటలు ఎన్నడూ అననిది వీరే. ఇంకా ఇంకా చంపాలన్నది వీరే. బిజెపి వారి సభలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతి నిరాకరించేసరికి 'అన్ని రాజకీయ పార్టీలను సమంగా చూడాలి. కొందరికి మట్టుకు హక్కులు నిరాకరించకూడదు' అంటూ బిజెపి నాయకులు నిరసన దీక్షలు చేస్తున్నారు. వాళ్ల ఆవేదన న్యాయమయినదే. కాని నిన్నటిదాకా కొన్ని రాజకీయ పార్టీలకు 'తీవ్రవాదులు' అని పేరు పెట్టి హక్కులు నిరాకరిస్తే పూర్తిగా సమర్థించింది వీరే. వాళ్లకు ఏ హక్కులూ ఇవ్వవద్దని గగ్గోలు పెట్టిందీ వీరే. పౌర ప్రజాస్వామ్య హక్కుల విషయంలో ఈ హిందూత్వ వాదులది ఎంతటి ఫాసిస్టు దృక్పథమో చెప్పడం కోసం ఈ మాటలు అంటున్నాముగానీ వాళ్లపైనయినా ఎవరిపైనయినా ప్రభుత్వం నియంతృత్వ పద్ధతులలో అణచివేత ప్రయోగిస్తే సమర్థించడం మా అభిమతం కాదు.

నూతన ఆర్థిక విధానంతో పి.వి. నరసింహరావు ప్రభుత్వం ప్రజలకు ఉద్యోగాలు లేకుండ చేసి ధరలు పెంచేసి సాంఘిక సంక్షేమ వ్యయంపైన కోతపెట్టి కనీస జీవన హక్కులు ప్రజలకు లేకుండ చేస్తుంటే పార్లమెంటులోని అన్ని పార్టీలు అంతో యింతో విమర్శించాయి గానీ నూతన ఆర్థిక విధానానికి పార్లమెంటులో భరోసాగా నిలబడి 'నీ ఆర్థిక విధానం భేష్' అని పివికి కితాబులు ఇచ్చింది భారతీయ జనతా పార్టీయే. కనీస జీవన హక్కులకు భరోసా లేని ఆర్థిక విధానం ఈ హిందూత్వవాదుల ఆర్థిక విధానం. అదే ప్రపంచ బ్యాంకు ఆర్థిక విధానం. ప్రస్తుత బిజెపి జాతీయ నాయకులలో ఒకడయిన జయ్ దుబాషి చాలా కాలంగా బిజెపి ఆర్థిక సిద్ధాంతాన్ని తన రచనలలో ప్రచారం చేస్తున్నాడు. కొన్ని తెలుగు పత్రికలు కూడ వాటిని ప్రచురించాయి. ఆ విధానాలు ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు అద్దం పడతాయి. కార్మికులకు ఉద్యోగభద్రత ఉండకూడదు. ధరలపైన ప్రభుత్వం అదుపు పెట్టకూడదు. పేదలు వినియోగించే వస్తువులకు సబ్సిడీలు ఇవ్వకూడదు. వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక రాయితీలు

ఇవ్వకూడదు. సమానత్వం, సంక్షేమం, సమతుల్యం మొదలయిన ఆదర్శాలు ఆర్థిక వ్యవస్థను బలహీన పరుస్తాయి. కాబట్టి వాటిని విడిచిపెట్టాలి. ఇదీ హిందూత్వ ఆర్థిక సిద్ధాంతం.

ఇదంతా కేవలం మైనారిటీల సమస్యా? పైన చెప్పిన హిందూత్వవాదుల రాజకీయ సామాజిక ఆర్థిక దృక్పథం వల్ల నష్టపోయేది కేవలం క్రైస్తవులు, ముస్లింలు, సిక్కులా? లేకపోతే పీడనకూ అణచివేతకూ అసమానతకూ గురయ్యే ప్రజలందరికీ ఈ హిందూత్వం శత్రువా? కొంచెం ఆలోచించమని విజ్ఞప్తి చేస్తున్నాం.

## కోర్టులు - ప్రభుత్వం - పోలీసులు

రాజ్యాధికారం కోసం ఎగబ్రాకుతున్న హిందూ మతోన్మాదానికి రాజ్యాంగ యంత్రానికి చెందిన ఒక్కొక్క శాఖ ఎంతగా సహకరిస్తున్నదో చూస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం, కోర్టులు, పోలీసులు, యావత్ పాలనా యంత్రాంగం హిందూత్వంతో లాలూచీ పడ్డాయి.

భారత న్యాయవ్యవస్థ గతంలో ఒకసారి ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ప్రకటించినప్పుడు ఆమెకు పూర్తిగా తలొగ్గి ప్రజాస్వామ్య హక్కుల విధ్వంసానికి లజ్జాకరంగా సహకరించింది. ఇప్పుడు రెండవసారి ఆ పని చేసింది. హిందూ మతోన్మాదానికి పాదాక్రాంతం అయింది.

బాబ్రీ మసీదు పైన రామభక్తులు సృష్టించిన వివాదమే కృత్రిమమయినది. ఏమయితేనేం, వివాదమంటూ పుట్టిన తరువాత అది పరిష్కారమయ్యేంతవరకు ఆ స్థలానికి ఏమీ నష్టం కలగకుండ కాపాడడం అధికార యంత్రాంగం కర్తవ్యం, కోర్టుల కర్తవ్యం. ఈ సంగతి తెలియడానికి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వైదుష్యం అక్కరలేదు. ప్రతీ తాసీల్దారుకూ తెలుసు. అయినా మసీదును కాపాడడం పి.వి. నరసింహరావు ప్రభుత్వానికీ భారత సుప్రీంకోర్టుకూ సాధ్యం కాలేదంటే దానిని చేతకానితనం అనాలా లేక లాలూచీగా గుర్తించాలా?

డిసెంబరు 6న కరసేవ చేస్తామని హిందూమత సంస్థలు ప్రకటించగానే బాబ్రీ మసీదు చుట్టూ కర్ఫ్యూపెట్టి ఎవ్వరినీ రానివ్వకుండ కట్టుదిట్టం చేయవలసి ఉండింది. పోలీసుల అనుమతి లేకుండ ఏ పార్టీ అయినా సభలూ ప్రదర్శనలూ

తలపెడితే ఆ పని చేయడం లేదా? దాని బదులు కరసేవకులను లక్షల సంఖ్యలో మసీదు దగ్గరకు రానివ్వడం ఎందుకు? రాకుండ నిరోధించమని అధికార యంత్రాంగాన్ని ఆదేశించకుండ, రాబోయే వాళ్లు భజనలే తప్ప ఇంకేమీ చేయరన్న హామీని సుప్రీంకోర్టు హిందూమత సంస్థల నుండి కోరడం ఎందుకు? చట్టమన్నా, కోర్టులన్నా తమకు గౌరవం లేదని పదే పదే ప్రకటించిన వాళ్ల అబద్ధపు వాంగ్మూలాలను సుప్రీంకోర్టు విశ్వసించడం ఎందుకు? మసీదు కూల్చివేసిన తరువాత అక్కడే దానిని పునర్నిర్మించమని ప్రభుత్వానికి ఆదేశం ఇవ్వకుండ, బాబరు రాకకు పూర్వం అక్కడ రామాలయం ఉండిందా లేదా అన్న నిజనిర్ధారణకు ఇప్పుడు సుప్రీంకోర్టు పూనుకోవడం ఎందుకు? 1947లో ఏ పవిత్ర స్థలం ఎట్లుండిందో దానిని అట్లే కాపాడాలనే బిల్లును కేంద్రప్రభుత్వం ఈ మధ్యనే ప్రతిపాదించింది. ఇప్పుడు ప్రభుత్వం, సుప్రీంకోర్టు అందుకు భిన్నంగా చరిత్రను తవ్వడం ఎందుకు? ఆర్టికల్ 143 క్రింద సుప్రీంకోర్టు చేయగల నిజనిర్ధారణ వర్తమాన విషయాల గురించే తప్ప అయిదు శతాబ్దాల నాటి చారిత్రక విషయాల గురించి కాదని నిపుణులు అంటున్న సంగతి సుప్రీంకోర్టుకు తెలియదా? రామాయణంలో చెప్పిన అయోధ్య ఈ అయోధ్యేననడానికి, బాబ్రీ మసీదున్నచోటనే రాముడు పుట్టాడనడానికి, బాబర్ రాకకు పూర్వం అక్కడొక రామాలయం ఉందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని ప్రాచీన మధ్యయుగాల భారత చరిత్రలో నిష్ణాతులయిన వారు అంటున్నారు. వాళ్లకంటే ఎక్కువ నైపుణ్యం తమకుందని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు భావిస్తున్నారా? ఒకవేళ ఉందనుకొన్నా ఇటువంటి విచారణలు ఎన్ని చేపడతారు? దేవాలయాలు కూల్చి మసీదులు కట్టిన సంగతి బాగా ప్రచారమయింది కానీ బౌద్ధజైన విహారాలనూ, స్థూపాలనూ, ఆలయాలనూ కూల్చి హైందవ ఆలయాలు కట్టిన సంగతి? శైవులు, వైష్ణవులు పరస్పరం ఆలయాలు కూల్చి తమ ఇష్టదైవం ఆలయాలు కట్టుకొన్న సంగతి? పోచమ్మ, మైసమ్మ, గంగమ్మ, నూకాలమ్మ మొదలయిన గ్రామదేవతల పూజశిలలు అని పిలువబడే బండరాళ్లను ఆక్రమించుకుని వాటిని శివుడు రాముడు వెంకటేశ్వరుడు ఆంజనేయుడు దుర్గ మొదలయిన హైందవ దేవతల ఆలయాలుగా ఈనాటికీ మారుస్తున్న సంగతి? ఇప్పుడు ఈ చరిత్రనంతా తవ్వి ఏ దేవతకు ఆ ఆలయాన్ని

తిరిగి ఇప్పించే భారీ ప్రణాళిక చేపట్టటం దేశ తక్షణ అవసరమా? చేపడితే హిందూత్వ వాదులు ఊరుకుంటారా? సుప్రీంకోర్టు ఒక్కొక్క పునాదినీ తవ్వి పాత గుళ్ల శకలాలు బయటికి తీస్తుందా?

అలహాబాద్ హైకోర్టు విన్యాసాలు మరీ చిత్రంగా ఉన్నాయి. కనీసం మసీదును కూల్చిన తరువాతైనా ఆ దుండగులను దూరం ఉంచవలసింది పోయి ఇప్పుడు అక్కడ ఒక రామమందిరాన్ని అలహాబాద్ హైకోర్టే తయారు చేయించింది. లేకపోతే, అక్కడ నమాజు చేసుకుంటామని ముస్లింలు అడిగితే అనుమతి నిరాకరించి రామవిగ్రహం దర్శనానికి మట్టుకు హైకోర్టు అనుమతి ఇవ్వడంలో అర్థం ఏమిటి? వివాదానికి ఇరుపక్షాలుగా ఉన్న వ్యక్తులలో ఒకరు దౌర్జన్యానికి దిగగానే వివాదంలో వాళ్లే గెలిచినట్లవుతుందనే తాజా న్యాయసూత్రాన్ని అలహాబాద్ హైకోర్టు ప్రతిపాదిస్తున్నదా? దీనిని కొత్తగా ప్రతిపాదించనవసరం లేదు. అటవీ న్యాయం అని దీనినే అంటారు. అటవీ న్యాయం నాగరిక సమాజానికి పనికి రాదను కోవడం వల్లనే ఈ కోర్టులు పుట్టాయి. అటువంటి కోర్టు రాజ్యాంగం పేరిట అటవీ న్యాయాన్ని ప్రతిపాదించడం బహు గొప్ప విషయం. పైగా ఈ ఘనకార్యం చేయడానికి అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తులు అనుసరించిన పద్ధతిని కూడ ప్రజలు తెలుసుకోవాలి. తాము రాజ్యాంగం లోపల ఉన్న అధికరణాలనే కాక రాజ్యాంగం తొలి ప్రతి అట్టమీద జవహర్ లాల్ నెహ్రూ గారు బోస్ అనే చిత్రకారుని చేత గీయించిన చిత్రాలను కూడ (భారతీయ చరిత్రకూ, సంస్కృతికీ చెందినవి) లెక్కలోకి తీసుకున్నామనీ ఆ చిత్రాలలో రామునిది ఒకటి ఉందనీ ఇద్దరు జడ్జీల బెంచి వ్యాఖ్యానించింది ! నల్లగౌన్లు తీసేసి ఖాకీ నిక్కర్లు వేసుకుని రాష్ట్రీయ స్వయం సేవక సంఘంలో చేరరాదా అని మేము ఆ న్యాయమూర్తులకు సలహా ఇస్తే అది కోర్టు ధిక్కారం అవుతుంది కాబోలు! అయినా ఆ చిత్రాలలో రాముడే కాదు, అక్బరు, టిప్పుసుల్తాన్ కూడా ఉన్నారంట. మరి వాళ్ల సంగతేమిటి?

డిసెంబర్ 6 తరువాత ప్రధానమంత్రి పి.వి. నరసింహరావు హిందూ మతతత్వ శక్తులపైన విరుచుకు పడుతున్నాడు. లౌకిక వాదానికి ప్రమాదం ఏర్పడిందనీ దానిని కాపాడడానికి ప్రజలంతా తన వెనుక రావాలనీ పిలుపు ఇస్తున్నాడు. మతతత్వ పార్టీలను తన ప్రభుత్వం సహించదనీ వాటిని నిషేధించి

నిర్బంధించి అణచి వేస్తామనీ హామీలు ఇస్తున్నాడు. కానీ నిజానికి పి.వి. ప్రభుత్వం తొలినుండి హిందూమత సంస్థలతో రాజీపడబట్టే పరిస్థితి ఇక్కడిదాకా వచ్చింది. దానికి సంజాయిషీ చెప్పుకోకుండా లౌకికవాదాన్ని కాపాడడానికి తనకు నిర్బంద అధికారాలు కావాలని ఆయన కోరుకోవడంలో అర్థం లేదు. హిందూత్వవాదుల కమండలానికి పి.వి. నరసింహరావు లాఠీ జవాబు కాదు. రెండింటికీ ప్రజాతంత్ర చైతన్యమే జవాబు. మతసంస్థల నిషేధం ద్వారా, బిజెపి ప్రభుత్వాల రద్దు ద్వారా, పి.వి. తన పాపాలు కడిగేసుకొని గొప్ప లౌకికవాద సంరక్షకునిగా ముందుకు వస్తున్నాడు. పనిలో పనిగా రాజ్యాంగ యంత్రానికి ఉండే నియంతృత్వ అధికారాలకు ఆమోదం కోరుకుంటున్నాడు. నియంతృత్వ అధికారాలు లేకపోతే ప్రజాస్వామ్యాన్ని కాపాడలేమనే వికృతమయిన వాదన చేస్తున్నాడు. మతోన్మాదుల పైన కోపంతో దీనికి మద్దతు ఇవ్వడం ప్రజలకే ప్రమాదకరం. అయినా, సాయిబాబా నుండి కంచి శంకరాచార్యుని దాకా ప్రతి స్వామీజీకి ప్రతి సన్యాసికి మొక్కి దేశ సమస్యలకు పరిష్కారం చెప్పమని అడుక్కుంటున్న పి.వి. నరసింహరావు లౌకికవాదాన్ని ఏమని కాపాడుతాడు? 'అణిచేస్తాన'ని కేకలు వేయడమే గానీ హిందూ మతతత్వాన్ని నిజంగా అణిచే ఉద్దేశ్యం ఉందా? బెయిలు అడగడానికి నిరాకరించిన అద్వానీ, జోషీలకు ప్రభుత్వమే రిమాండ్ పొడిగింపు అడగకుండ ఉచితంగా బెయిలు ప్రసాదించలేదా?

రాజ్యాంగ యంత్రం హిందూ మతోన్మాదానికి ఎంతగా లొంగిపోయిందనడానికి పోలీసుల పాత్ర కూడా చక్కటి తార్కాణం. డిసెంబర్ 6వ తేదీన మసీదును కూలుస్తున్న వారిని నిరోధించడానికి అక్కడ కాపలా పెట్టిన రాష్ట్ర పారా మిలిటరీ బలగమయిన పిఎసి జవాన్లు ప్రయత్నం కూడ చేయలేదు. గతంలో ఉత్తరప్రదేశ్‌లో మత ఘర్షణలు జరిగినప్పుడల్లా ముస్లింలను ఏరి చంపిన ఘనత సంపాదించిన ఈ బలగం మసీదును ఎందుకు కాపాడుతుంది? సిఆర్‌పిని కూడ అక్కడ కాపలా పెట్టారు గానీ కచ్చితమయిన ఆదేశాలు లేక వాళ్లు కూడ వేలు మెదపలేదు. విధ్వంసం యధేచ్ఛగా సాగిపోయింది. ప్రభుత్వం దుండగులను తరువాతయినా అరెస్టు చేయకుండ స్పెషల్ రైళ్లు వేసి ఇళ్లకు పంపించింది.

ఆ తరువాత మట్టుకు దేశవ్యాప్తంగా పోలీసులు విజృంభించారు. మసీదు కూల్చివేత పట్ల కోపోద్రిక్తులయిన ముస్లింలు ఎక్కడ బయటికి వచ్చినా వాళ్లమీద

బలప్రయోగం చేసారు. వారం రోజులలో దేశవ్యాప్తంగా జరిగిన 'అల్లర్ల'లో పోలీసులు చేసిన అల్లరే ఎక్కువ. చనిపోయిన 1200 మందిలో అధికులు పోలీసు కాల్పులకు చనిపోయారు. వారిలో అధికులు ముస్లింలే. హైదరాబాద్‌లో నయితే భద్రతా దళాలు రోడ్డుమీద కవాతు చేస్తూ సందులలోకి తుపాకులు గురిపెట్టి విచక్షణా రహితంగా కాల్పులు జరిపి పసిపిల్లలను సహితం చంపారు. మొదటి దఫా అల్లర్లు చల్లారిన తరువాత రెండవ దఫా బొంబాయి, అహ్మదాబాద్‌లలో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. ఒక్క బొంబాయిలోనే 700 మందికి పైగా చనిపోయారు. ఈ ఘర్షణలలో ముస్లిం మతస్తులయిన కొందరు గూండా ముఠానాయకుల ప్రమేయం కూడ ఉన్నప్పటికీ ప్రధానంగా మారణకాండకు పాల్పడింది శివసేన. సాయుధులయిన శివసేన మూకలు బొంబాయి మురికివాడలలో రక్తపాతం సృష్టిస్తుంటే పోలీసులకు కాళ్లు చేతులు ఆడలేదు. చూస్తూ ఊరుకున్నారు. బాధితులను పరామర్శించడానికి బొంబాయి వెళ్లిన ప్రధానమంత్రికి శివసేనను నిందించడానికి ధైర్యం చాలలేదు. రెండు వారాల పాటు శివసేన ఫాసిస్టు మూకలు సృష్టించిన బీభత్సాన్ని బొంబాయి నగరవాసులు ఎప్పటికీ మరచిపోరు. "హిందూత్వం' ఇట్లాగే విజృంభిస్తూపోతే దేశం ఇంకెంత రక్తపాతాన్ని చూడనుందో. హిందూ మతోన్మాదం వల్ల రాగల దీర్ఘకాల ఫలితాలు అట్లాగుంచి సమీప భవిష్యత్తులో దేశం చాలా రక్తపాతాన్నీ మారణకాండనూ పాశవిక క్రూరత్వాన్నీ చవిచూడనుంది.

## ముగింపు

పెరుగుతున్న హిందూ మతోన్మాదం కేవలం మైనారిటీలకే ప్రమాదకారి కాదు. ప్రజాస్వామ్య విలువలకూ ప్రజాస్వామ్య హక్కులకూ ప్రమాదకారి. అది కేవలం ముస్లింలకూ, క్రైస్తవులకూ, సిక్కులకూ, ఇతర మైనారిటీలకూ శత్రువు కాదు. పీడనకూ అణచివేతకూ గురయ్యే ప్రజలందరికీ శత్రువు. హిందూ ఫాసిజం మనల్ని కబళించే ముందే ప్రజాతంత్ర విలువలను సంరక్షించుకోవడం కోసం, అందులో భాగంగా లౌకికవాదాన్ని సంరక్షించుకోవడం కోసం ఐక్యమవుదాం. హిందూ మతోన్మాదానికి జవాబు మరొక మతోన్మాదం కాదు, ప్రభుత్వ నియంతృత్వమూ కాదు. ప్రజాతంత్ర చైతన్యమే దానికి జవాబు.

# క్రైస్తవం పైన దాడులను వ్యతిరేకిద్దాం

ముస్లింల వంతు అయింది. ఇప్పుడు క్రైస్తవుల వంతు వచ్చింది.

ఉత్తర భారతదేశంలో, ముఖ్యంగా బిజెపి బలంగా ఉన్న రాష్ట్రాలలో క్రైస్తవులపైన దాడులు ఒక పరంపరగా జరుగుతున్నాయి. కొన్ని దాడులు సాధారణ గూండాలు, రౌడీలు చేయగా కొన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు చేస్తున్నారు.

చెప్పుకోదగ్గ విషయం ఏమిటంటే 'సంఘ్ పరివార్' కార్యకర్తలు చేస్తున్న దాడులనే కాక రౌడీ మూకలు చేస్తున్న అకృత్యాలను కూడా 'హిందువుల న్యాయమైన ఆగ్రహం' పేరిట సంఘ్ పరివార్ నాయకత్వం వెనకేసుకొస్తున్నది. క్రైస్తవ మిషనరీలు సంఘసేవ పేరిట రకరకాల ప్రలోభాలు చూపించి హిందువులను క్రైస్తవులుగా మారుస్తున్నారనీ దానికి ఆగ్రహించిన హిందువులు ఈ దాడులకు పాల్పడుతున్నారనీ విశ్వహిందూ పరిషత్ నాయకులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

జాబువా రేప్ ఘటనను సహితం 'ప్రేం' అనే ముద్దు పేరున్న విశ్వహిందూ పరిషత్ నాయకుడు బిఎల్ శర్మ ఇదే విధంగా సమర్థిస్తూ మాట్లాడడం అద్వానీని సహితం ఇబ్బంది పెట్టింది. దేనికీ సులభంగా సిగ్గుపడని అద్వానీ, శర్మ వ్యాఖ్యను తాను ఖండించకపోయినా దానిని వెనక్కి తీసుకుంటే బాగుంటుందని విశ్వహిందూ పరిషత్‌కు సూచించాడంటే సంఘ్ పరివార్ దురహంకారం ఎక్కడిదాకా పోయిందో అర్థం అవుతుంది.

జాబువా జిల్లా (మధ్యప్రదేశ్) లోని భండారియా గ్రామంలోని క్రైస్తవుల కాన్వెంట్‌పైన సెప్టెంబర్ 22-23 తేదీల మధ్యరాత్రి 10 లేక 15 మంది దుండగులు దాడి చేసి కాన్వెంట్ తలుపులు పగలకొట్టి నలుగురు క్రైస్తవ సన్యాసినులను (నన్స్) బలవంతంగా బయటకు గుంజుకుపోయి రేప్ చేశారు.

ఇటువంటి ఘటనలు జరగడం కొత్త కాదు. దానికి ఒక పార్టీనో ఒక సంస్థనో తప్పు పట్టలేం. అయితే విశ్వహిందూ పరిషత్ నాయకుడు శర్మ ఈ

---

మానవహక్కుల వేదిక కరపత్రం, 25.10.1998

దౌర్జన్యాన్ని 'హిందువుల న్యాయమైన ఆగ్రహంలో భాగంగా జరిగిన చర్య' అని సమర్థించినప్పుడు, సంఘ్ పరివార్ అనాగరికతను అసహ్యించుకోకుండా ఉండలేము. ప్రత్యక్షంగా వారి ఆధ్వర్యంలో జరిగిన ఇతర దాడులను జ్ఞాపకం చేసుకోకుండా ఉండలేము.

మార్చి 4వ తేదీన గుజరాత్‌లోని బరోడా నగరంలో జరుగుతున్న ఏసు మహోత్సవంపైన విశ్వహిందూ పరిషత్‌కూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్‌కూ చెందిన 200 మంది కార్యకర్తలు దాడిచేసి మైకులు విరగ్గొట్టి వేదికకు నిప్పుపెట్టి వేదికపైన ఉన్నవారిని కొట్టారు.

మే 28 న అహ్మదాబాద్‌లోని సెయింట్ మేరీ స్కూలుపైన బజరంగ్‌దళ్ కార్యకర్తలు దాడి చేసి విధ్వంసం సృష్టించారు.

గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఐపి మిషన్ స్కూలుపై బజరంగ్‌దళ్, ఎబివిపి కార్యకర్తలు దాడిచేసి విద్యార్థుల చేతుల నుంచి 300 బైబిల్ ప్రతులు గుంజుకొని తగలబెట్టారు.

మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా నందూఘర్‌లో కేథలిక్ హెల్త్ అసోసియేషన్ నడుపుతున్న 'శ్రుతి' అనే స్వచ్ఛంద సంస్థపైన ఆర్ఎస్ఎస్ అనుబంధ సంస్థ అయిన జన కళ్యాణ్ సమితి కార్యకర్తలు దాడిచేసి ఫాదర్ జీవేంద్ర జాదవ్, సిస్టర్ మేరీలను రాళ్లతో కర్రలతో కొట్టారు.

అదే రాష్ట్రంలోని అంబర్నాథ్‌లో మే 11 నాడు శివసేన కార్యకర్తలు ఒక హైస్కూలులో జరుగుతున్న మీటింగ్‌పైన దాడి చేసి ఫాదర్ నెవిస్‌ను ఇనపరాడ్లతో కొట్టి మైక్‌సెట్, లైట్లు విరగ్గొట్టారు.

పంజాబులోనూ ఇటువంటి దాడులు జరిగాయి. గత సంవత్సరం అక్టోబర్ 25న లూధియానాలోనూ, ఈ సంవత్సరం మార్చి 31న జలంధర్‌లోనూ క్రైస్తవ సమావేశాలపైన విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు దాడులు చేశారు. మనుషులను కొట్టారు. మైక్‌లు, స్పీకర్లు, లైట్లను పగలగొట్టారు.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ పట్టణంలోనూ మార్చి 16 నాడు ఇటువంటి దాడే జరిగింది. అసెంబ్లీ ఆఫ్ బిలీవర్స్ అనే క్రైస్తవ సంస్థ ఆధ్వర్యంలో మార్చి 16 నుండి 3 రోజులపాటు అక్కడొక సదస్సు జరగవలసి ఉండింది. అది మొదలు

కాకముందే బజరంగ్‌దళ్ కార్యకర్తలు సమావేశ స్థలంపైన దాడిచేసి రాళ్లు విసిరి నిర్వాహకులను తరిమేసి వేదికకు నిప్పంటించి తగలబెట్టారు.

సంఘ్‌పరివార్ ప్రత్యక్షంగా పాల్గొన్న ఈ ఘటనలేకాక ఎవరో గూండాలు, రౌడీలు చర్చిల మీద, కాన్వెంట్‌ల మీద దాడులు చేసి హత్య, రేప్ వంటి ఘాతుకాలకు పాల్పడిన ఘటనలు కూడా గత అయిదు సంవత్సరాలలో 17 జరిగాయని క్రైస్తవ సంస్థలు అంటున్నాయి. వీటికి హిందూత్వవాద సంస్థలు ప్రత్యక్షంగా బాధ్యులయినా కాకున్నా ఆ దృక్పథం గల బిజెపి, శివసేన అధికారంలో ఉన్న రాష్ట్రాలలో అధికార యంత్రాంగం మైనారిటీల రక్షణ విషయంలో అనుసరిస్తున్న వైఖరి ఈ దాడులకు దోహదం చేస్తున్నది. సంఘ్‌పరివార్ పెద్దలు క్రైస్తవ వ్యతిరేక విద్వేషాన్ని రెచ్చగొట్టుతుండడం వీధి రౌడీలకూ గూండాలకూ పరోక్షంగా ప్రోత్సాహకంగా వుంది.

## ఈ దాడులు దేనికి?

సంఘ్‌పరివార్ తాను చేస్తున్న దాడులకూ విష ప్రచారానికీ గల కారణాన్ని దాచిపెట్టుకోవడం లేదు. క్రైస్తవ సంస్థలు సంఘసేవను అడ్డం పెట్టుకొని మత మార్పిడి చేస్తున్నాయనేది వారి ప్రధాన అభియోగం. ఇది తమ ఇల్లు చక్కబెట్టుకోలేక పరులను నిందించడం తప్ప వేరే ఏమీ కాదు.

సంఘ్‌పరివార్ దృష్టిలో క్రైస్తవం విదేశీ మతం. క్రైస్తవులు విదేశీయులు. వాళ్లను ఇక్కడినుండి తరిమేయడానికి చేస్తున్న 'ఉద్యమానికి' బజరంగ్‌దళ్ రెండవ క్విట్ ఇండియా ఉద్యమం అని పేరు పెట్టింది. ఇంతకంటే హాస్యాస్పదమైన వ్యాఖ్య వేరే ఏదీ వుండదు. క్రీస్తు చనిపోయిన కొద్ది కాలానికే క్రైస్తవం భారతదేశంలోకి ప్రవేశించింది. దాదాపు 2000 సంవత్సరాలుగా ఇక్కడ ఆ మతం వుంది. ఈ రోజు ఇక్కడున్న క్రైస్తవులంతా (క్రైస్తవ ప్రజలే కాదు, సంఘ్ పరివార్ చేతిలో దెబ్బలు తింటున్న ప్రచారకులు కూడ) ఈ గడ్డకు చెందిన వారే తప్ప ఏ అర్థంలోనూ విదేశీయులు కారు. నిజానికి క్రైస్తవులలో అధికభాగం దళితులు, ఆదివాసులు కాబట్టి ఎప్పుడో జరిగిన చరిత్రను బట్టి దేశంలో కొంతమందిని మూలవాసులుగానూ కొంతమందిని విదేశీయులుగానూ విభజించదలచుకుంటే ఆర్య

సంతతిగా తమను తాము భావించే హైందవ ఆధిపత్యకులాల కంటే, క్రైస్తవులే అసలయిన మూలవాసులు అవుతారు.

ఎవరి ఇష్టమొచ్చిన మతం వారు అనుసరించవచ్చుననేది భారత రాజ్యాంగం 25వ అధికరణంలోని ప్రాథమిక హక్కు. అనుసరించడమే కాదు, ప్రచారం చేసుకోవడం కూడ అధికరణ 25 ప్రకారం ప్రాథమిక హక్కే. పాశ్చాత్య దేశాలలోనూ ఇటువంటి స్వేచ్ఛ ఉంది. దానిని అనుసరించి, అక్కడ నివాసం ఏర్పరచుకున్న హిందువులు (అత్యధిక భాగం ఆధిపత్యకులాలకు చెందినవారే) గుళ్ళు కట్టుకుంటున్నారు. హైందవ మతప్రచారం చేసుకుంటున్నారు. మరి ఇక్కడి క్రైస్తవులు అదే పని చేస్తే తప్పేముంది?

తప్పుందని అనలేరు కాబట్టి హిందుత్వవాదులొక కొత్త వాదన తీసుకొస్తున్నారు. భిన్న మతాల తాత్విక సిద్ధాంతాలను అర్థం చేసుకొని మతం మార్చుకుంటే ఫరవాలేదుగానీ ప్రలోభాలకు లోనయి మతం మార్చుకోవడం తప్పని వాదిస్తున్నారు. క్రైస్తవమిషనరీలు ప్రజలను ప్రలోభపెట్టి క్రైస్తవంలో చేర్చు కుంటున్నారని నింద వేస్తున్నారు.

కాని మతమంటే కేవలం తాత్విక భావాలు కాదు. ప్రతీ మతంలోనూ ఒక జీవనవిధానం ఇమిడి వుంటుంది. హైందవం మతం కాదనీ అదొక జీవన విధానమనీ హిందూత్వవాదులు వేరే సందర్భంలో గొప్పలు చెప్పుకుంటారు. మరి హైందవ జీవన విధానంలో అణచివేయబడ్డవారు, వెలి వెయ్యబడ్డవారు వేరే మతంలోకి పోతే తప్పేముంది? అక్కడ ఎక్కువ ఆత్మగౌరవం దొరుకుతుందని నమ్మితే తప్పేముంది? వారికి ఆత్మగౌరవం ఇవ్వడమే వారిని ప్రలోభ పెట్టడమా? భారత దేశంలో ప్రధానంగా దళితులు, ఆదివాసులే క్రైస్తవంవైపు ఆకర్షించబడడానికి ఇదే కారణం కాదా? వాళ్లనసలు హిందువులెప్పుడయినా హిందువులుగా భావించారా?

నిజానికి ఈ రోజు క్రైస్తవ మత సంస్థలు మత మార్పిడి చేస్తున్నది తక్కువే. ఇన్ని సంవత్సరాల తరువాత కూడా దేశ జనాభాలో క్రైస్తవులు 2.3 శాతం మాత్రమే వున్నారు. ఎక్కువ భాగం క్రైస్తవ సంస్థలు విద్యా వైద్య రంగాలలో సమాజానికి సేవ చేస్తున్నాయి. ఒక్క క్రైస్తవులకే కాదు, ఈ సేవలు అందరికీ

అందిస్తున్నాయి. దీనిని సమాజ సేవగా గుర్తించకుండా ఉండడం మూర్ఖులకు మాత్రమే సాధ్యం. మతమార్పిడి చేసిన చోట కూడ హైందవ సమాజం వెలివేసిన దళితులకు ఆత్మగౌరవం అందించడంతో పాటు కొంత చదువు నేర్పించి వారి సామాజిక ప్రతిపత్తిని కొద్దిగానయినా పెంచారు. ఇది సమాజ సేవ కాక ఏమవుతుందో హిందూత్వవాదులే చెప్పాలి.

కారణాలు ఏవి చెప్పుకున్నా ఈ దాడులు బిజెపి హిడెన్ అజెండాలో భాగం, సంఘ్‌పరివార్ బహిరంగ అజెండాలో భాగం. ఈ నేల మీద హైందవ ఆధిపత్యం నెలకొల్పడం వారి అజెండాలోని ముఖ్య అంశం. దాని కోసం ముస్లింల పైన దాడులతో మొదలుపెట్టారు. ఇప్పుడు క్రైస్తవుల పైన దాడులతో కొనసాగిస్తున్నారు. ఇది దళితుల పైన దాడి కూడ. దేశంలో భిన్న సంస్కృతులు కలిసిమెలిసి సహజీవనం చేయాలనీ, తమ జీవితాలు ఏ మతంలో బాగుంటే ఆ మతంలోకి మారడానికి ప్రజలకు – ముఖ్యంగా అణగారిన కులాలకు – స్వేచ్ఛ ఉండాలనీ నమ్మేవాళ్లందరూ ఈ దాడులను, దుష్ప్రచారాన్ని వ్యతిరేకించాలనీ, దాడులకు గురి అవుతున్న క్రైస్తవ మత ప్రచారకులకూ సేవకులకూ అండగా నిలబడాలనీ పిలుపునిస్తున్నాం.

# ముంబయిలో ఆ రోజు

డిసెంబర్ 6 మళ్ళీ వచ్చింది బాబ్రీమసీదు కూల్చివేతనూ ఆ తరువాతి పరిణామాలనూ జ్ఞాపకానికి తెచ్చింది.

ఆ పరిణామాలలో అతి భయంకరమైనది ముంబయిలో జరిగిన ఊచకోత. బాబ్రీ మసీదు కూల్చివేత గురించి విన్న ముంబయి ముస్లింలు 1992 డిసెంబర్ 7–10 తేదీల మధ్య ముంబయి నగరంలో సృష్టించిన అల్లరి ఒకెత్తయితే, దానికి ప్రతీకారంగా 1993 జనవరి 6–10 తేదీల మధ్య శివసేన మూకలు నగర పోలీసుల సహకారంతో సృష్టించిన బీభత్సం దానికి పదిరెట్లు ఎక్కువ.

ఈ అల్లర్లపై న్యాయవిచారణ జరిపిన శ్రీకృష్ణ కమిషన్ తన నివేదిక సమర్పించే సమయం వచ్చేసరికి శివసేనే ఆ రాష్ట్రంలో అధికారానికి వచ్చి కూర్చుంది. శివసేన–బిజెపి పాలకులకు శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఎంత మాత్రం నచ్చలేదు. 'అది హిందూ వ్యతిరేక నివేదిక. దానిని ఆమోదించడానికి నేనేమైనా పాకిస్తాన్ ప్రధాన మంత్రినా?' అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి అన్నాడు. కానీ వాళ్ళ దురదృష్టమేమిటంటే ఆ నివేదిక రూపొందించిన న్యాయమూర్తి ముస్లిం కాదు. పోనీ కమ్యూనిస్టు కాదు, నాస్తికుడూ కాదు. జస్టిస్ శ్రీకృష్ణ ప్రతిరోజూ పూజలు చేసే బ్రాహ్మణుడు. అయితే నిజాయితీగల న్యాయమూర్తి కాబట్టి తన కళ్ళముందు కనిపించిన వాస్తవాలను కప్పిపెట్టే ప్రయత్నం చేయకుండా ఉన్నదున్నట్లు నివేదికలో పొందుపరిచాడు.

1992–93లో జరిగిన అల్లర్లపైన నివేదికను ఆయన 1998లో సమర్పించాడు. పోలీసులపైన, శివసేన తదితర సంఘ్ పరివార్ సంస్థలపైన స్పష్టమైన అభియోగాలు పెట్టాడు. అవన్నీ ఇప్పుడు చెప్పుకొని ఏం ప్రయోజన మంటే, అప్పట్లో కేవలం కొన్ని రాష్ట్రాలలో అధికారంలో ఉన్న హిందూత్వవాదులిప్పుడు దేశంలోనే అధికారంలో ఉన్నారు. ఇతర పార్టీలకూ వీరికీ ఒక తేడా ఏమిటంటే వీళ్ళ ఆలోచనారీతికి ఉండే ప్రభావాన్ని వీళ్ళకొచ్చే వోట్లను బట్టి అంచనా

---

ప్రజాతంత్ర వారపత్రిక, 13.12.1998

వేయలేము. అధికార యంత్రాంగంలోనూ మేధావులలోనూ అది చాలా లోతుగా పాకిపోయింది. దాని దుష్ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి ఎన్నికల విశ్లేషణ సరిపోదు. అన్ని సామాజిక రంగాలలోనూ దానిని విశ్లేషించాలి.

1992 డిసెంబర్ – 1993 జనవరి నాటి ముంబాయి అల్లర్లలో ఆ నగర పోలీసు యంత్రాంగం శివసేనతో చేతులు కలిపిన వైనం చూస్తే ఈ విషయం స్పష్టంగా అర్థం అవుతుంది. ఈ మిలాఖత్‌ను సవివరంగా చూపించడం జస్టిస్ శ్రీకృష్ణ చేసిన గొప్ప మేలు. హిందుత్వవాదుల ఆలోచనా రీతిని వ్యతిరేకించే ప్రజాతంత్ర ఉద్యమాల ముందు ఎంత కష్టతరమైన బాధ్యత ఉందో ఈ నివేదిక చెప్పకనే చెప్తుంది.

కొన్ని వివరాలను పునశ్చరణ చేసుకోవడం కంటే డిసెంబర్ 6ను జ్ఞాపకం చేసుకోవడానికి మేలయిన మార్గమేదీ లేదు.

'శివసేన బీభత్సమే ప్రజలకు రక్ష' (Shiv Sena's terror is public safety) అనేది ఆనాడు ముంబయి నగర వీధులలో మార్మోగిన నినాదం. శివసేన కార్యకర్తలు ఈ నినాదం ఇచ్చుకుంటూ ఊరేగింపులు తీశారు. ఊరేగింపుల గురించి ఎప్పటికప్పుడు రిపోర్టు తయారుచేసిన ఇంటెలిజెన్స్ పోలీసులు ఈ నినాదాన్ని ఉన్నదున్నట్టే రాసారు. కానీ శ్రీకృష్ణ కమిషన్ విచారణ మొదలయ్యేసరికి పోలీసు పెద్దలు 'బీభత్సం' అన్న మాటను చెరిపేసి దాని స్థానంలో 'దర్శనం' అన్న మాటను (మరాఠీ భాషలో ఈ రెండూ దగ్గరగా ఉంటాయి) రాసిపెట్టారు. ఇలా రిపోర్టులను దిద్దిన సంగతి గ్రహించిన జస్టిస్ శ్రీకృష్ణ ఈ విషయాన్ని తన నివేదికలో రెండు చోట్ల ప్రస్తావించారు.

నివేదికలో పదే పదే ప్రస్తావించిన విషయం మరొకటి ఉంది. హిందువుల గుంపులూ, ముస్లింల గుంపులూ దొమ్మీకి దిగిన ఘటనలలో ఎంతమందికి గాయాలయ్యాయి, ఎవరి ఆస్తులెంత నాశనం అయ్యాయి అనేది లెక్కతీస్తే నష్టపోయిన వారిలో హిందువులూ ముస్లింలూ కూడా ఉంటారు. కానీ ఆ దొమ్మీలను అదుపుచేయడానికి పోలీసులు తీసుకున్న చర్యలలో గాయపడిన వారిని, చనిపోయిన వారిని చూస్తే ఎక్కువ భాగం ముస్లింలే ఉంటారు. కేవలం ముస్లింలే అల్లరి చేసినట్లు, పోలీసులు వారిని అదుపుచేసినట్టు అనిపిస్తుంది. దీనినిబట్టి ఇరు పక్షాలూ దొమ్మీకి దిగినచోట పోలీసులు తమ బలప్రయోగాన్నంతా ముస్లింల మీదనే కేంద్రీకరించారని అర్థమవుతుందని జస్టిస్ శ్రీకృష్ణ అంటారు.

చర్య తీసుకున్నప్పుడు కూడా ముస్లింలపైన అయితే నేరుగా కాల్పులు జరిపి చాలా ప్రాణాలు తీశారుగానీ హిందువుల దగ్గరికొచ్చేసరికి చాలా సందర్భాలలో గాలిలోకి మాత్రమే కాల్పులు జరిపారని జస్టిస్ శ్రీకృష్ణ చాలా ఉదాహరణలిచ్చి వివరిస్తారు.

శివసేనవారు అల్లర్లకు జనాన్ని సమీకరించడానికి ఉపయోగించిన సాధనం 'మహాఆరతి' అనే సంబరం. ముంబయి నగరమంతటా కర్ఫ్యూ ఉన్నా కూడా డిసెంబర్ – జనవరి నెలల్లో ఈ మహాఆరతులు నిరాఘాటంగా సాగుతూనే ఉ న్నాయి. ప్రతీ మహాఆరతిలోనూ శివసేన, బిజెపి నాయకులు ఉద్రేకపూరితమైన ఉపన్యాసాలు ఇవ్వడం, తంతు ముగిసిన తరువాత తిరిగిపోయే జనం ముస్లింల ఇళ్ళపైన, దుకాణాలపైన దాడులకు పాల్పడడం రివాజుగా జరిగింది. కానీ ఏ ఒక్కరోజు కూడ మహాఆరతులను అరికట్టడానికి పోలీసులు ప్రయత్నం చేయలేదు. ఎందుకు చేయలేదని విచారణ సందర్భంగా జస్టిస్ శ్రీకృష్ణ పోలీస్ అధికారులను అడిగితే 'అవి కేవలం మతపరమైన కార్యక్రమాలు కాబట్టి ఆపలేదు' అని జవాబు చెప్పారు. ప్రతీ మహాఆరతి తరువాత ముస్లింలపైన దాడులు జరుగుతూనే ఉ న్నప్పటికీ పోలీసులలో ఈ అభిప్రాయం మారలేదు.

ముస్లింలపైన దాడులు జరిగిన అనేక సంఘటనలలో బాధితులు స్థానిక శివసేన కార్యకర్తలను దోషులుగా పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదులిచ్చారు. కానీ ఏ ఒక్క కేసులోనూ పోలీసులు ఆ నిందితులను అరెస్టు చేయలేదు. ఎందుకని అని విచారణ సమయంలో జస్టిస్ శ్రీకృష్ణ పోలీస్ అధికార్లను ప్రశ్నిస్తే, ఎసిపి, డిసిపి స్థాయి పోలీసు అధికారులు సహితం 'వాళ్ళను అరెస్టు చేస్తే అల్లర్లవుతాయని చేయలేదు' అని, 'అసలే బాగాలేని పరిస్థితి మరింత దిగజారుతుందని భయపడి అరెస్టు చేయలేదు, అని జవాబు చెప్పారు. అంతేకాదు, నిందితుల పేర్లు – ఇంటి పేరు, నివాస స్థలంతో సహా–బాధితులు ఇచ్చిన కేసులతోపాటు అత్యధిక భాగం కేసులు కొంత కాలానికి 'అంతుచిక్కని' కేసులుగా మూసివేయబడ్డాయి. శివసేన కార్యకర్తలను అరెస్టు చేస్తే 'ముంబయి తగలబడుతుంది' అని అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రే భయం, అశక్తత వ్యక్తం చేశాడంటే శివసేన టెర్రర్ ఎంతటిదో

అర్థమవుతుంది. 'అయినప్పటికీ ముంబయి తగలబడకుండా తప్పించుకోలేదు కదా' అని జస్టిస్ శ్రీకృష్ణ వ్యంగ్యంగా చేసిన వ్యాఖ్యలో ఔచిత్యం ఉంది.

తమ మీద జరుగుతున్న దాడి గురించి పోలీసులకు చెప్పి రక్షణ పొందుదామని ప్రయత్నం చేసిన ముస్లింలకు అనేక సందర్భాలలో చాలా చేదు అనుభవం ఎదురయింది. నిజానికి ముస్లింలపైన జరిగిన అనేక దాడులు పోలీస్ స్టేషన్లకూ పోలీస్ పికెట్‌లకూ కేవలం ఫర్లాంగు, రెండు ఫర్లాంగుల దూరంలో జరిగాయి. భయపడి పోలీసులకు ఫోన్‌చేసిన ముస్లింలకు 'పాకిస్తాన్‌కు పోరాదా, ఇక్కడుంటే ప్రమాదం కదా' అని, 'ఒక ముస్లిం చచ్చిపోతే ఒక పీడ తగ్గినట్టే'నని జవాబు లభించింది. జస్టిస్ శ్రీకృష్ణ పేర్లు, పోలీస్ స్టేషన్‌తో సహా ఇటువంటి అనేక ఘటనలు నమోదు చేశారు. 'ఈ నివేదికను ఆమోదించడానికి నేనేం పాకిస్తాన్ ప్రధానమంత్రినా' అని మనోహర్ జోషి చేసిన వ్యాఖ్యకూ పోలీసుల వ్యాఖ్యలకూ ఉన్న పోలిక కాకతాళీయం కాదు. మతాన్నీ జాతినీ ప్రాతిపదిక చేసుకున్న ఫాసిస్టులు కేవలం అధికార పీఠాన్ని చేజిక్కించుకోవడం ద్వారా తమ ఆధిక్యతను నెలకొల్పరనీ, అన్ని సామాజిక రంగాలనూ అదుపులోకి తీసుకుంటారనీ ఫాసిజం చరిత్ర తెలుపుతుంది. పార్టీలతోనూ పార్టీ సిద్ధాంతాలతోనూ ప్రమేయం లేకుండ నడుచుకోవాల్సిన పోలీసు యంత్రాంగం, బ్యూరోక్రసీ క్రమంగా హిందూత్వవాదం ప్రభావంలోకిపోతూ ఉన్నాయి. విద్యారంగాన్ని ఆక్రమించుకోవడానికీ చరిత్ర పరిశోధన పైన ఆధిక్యత నెలకొల్పడానికీ వాళ్ళు చేస్తున్న ప్రయత్నాలు చూస్తూనే ఉన్నాం. ఇదంతా ఆయా వ్యవస్థల వెలుపలి నుండే చేస్తున్నారనుకోనక్కరలేదు. హిందుత్వవాద భావజాలాన్ని నమ్మేవారు అన్ని రంగాలలోనూ ఉన్నారు. లోపలి నుండి వాళ్ళు, బయటి నుండి సంఘ్ పరివార్ సంస్థలు సకల సామాజిక జీవిత రంగాలనూ లోబరుచుకునే పని చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యానికీ సమతకూ నష్టకరమని నమ్మేవారు అన్ని రంగాలలోనూ ఈ ప్రయత్నాలను ఎదుర్కోవాలి. ఈ కర్తవ్యాన్ని గుర్తుచేయడానికి శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఉపయోగపడితే ఆ న్యాయమూర్తి కృషి సఫలం అయినట్టే.

# సంఘ్ పరివార్‌పై అవగాహనాలోపం ఎవరికీ లేదు

ఒకటి రెండు సంఘటనలు పట్టుకొని నిజానిజాలు వెల్లడి కాకుండానే చోటా లీడర్లు, గల్లీ నాయకులతో సహా అందరూ సంఘ్‌పరివార్ మీద దుమ్మెత్తి పోస్తున్నారంటూ ఎస్.వి.ఎస్. ఎస్. ప్రభాకర్ రాసిన వ్యాసం నుండి ఒక్క విషయం మాత్రం స్పష్టంగా అర్థమవుతుంది. నాస్తికులు, కమ్యూనిస్టులు, లౌకికవాదులు, దళితవాదులు సంఘ్‌పరివార్‌ను మొదటినుండి వ్యతిరేకిస్తున్నారు కానీ ఎప్పుడూ లేనిది ఇప్పుడు ఒకటి రెండు నెలలుగా తమను తాము హిందువులుగా భావించుకునే వారు, భక్తితో దేవాలయాలలో పూజలు చేసేవారు సహితం పెద్దసంఖ్యలో సంఘ్‌పరివార్‌ను ఏవగించుకుంటున్నారు. మొదటికే మోసం వచ్చేటట్టుందన్న ఆందోళన సంఘ్‌పరివార్‌ను పట్టుకున్నట్టుంది. కొంచెం 'పబ్లిక్ రిలేషన్స్' మెరుగుపరుచుకోవలసిన అవసరం ఉందని వారు భావిస్తున్నట్టున్నారు. ప్రభాకర్‌గారి వ్యాసం ఈ ఆందోళన ఫలితమే అయి ఉండాలి.

దేశ జనాభాలో 2.3 శాతం మాత్రమే ఉన్న క్రైస్తవులపైన కక్ష గట్టడం, వారి ప్రార్థనా సమావేశాలపైన దాడి చేయడం, మత గ్రంథాలను దహనం చేయడం, చర్చిలను కూలగొట్టడం, నిరాయుధులయిన ప్రచారకులపైన భౌతికదాడులకు పాల్పడడం, మూడు దశాబ్దాలకు పైగా కుష్టు రోగులకు సేవలు చేసిన మిషనరీని సజీవంగా దహనం చేయడం, అతనితో పాటు ముక్కుపచ్చలారని ఇద్దరు పసిపిల్లలను సహితం హతమార్చడం – కనీస నాగరికత ఉన్న వారెవరూ సహించగల చర్యలు కావు. మాబోటి వాళ్లు విమర్శిస్తే నాస్తికులనీ కమ్యూనిస్టులనీ కుహనా లౌకికవాదులనీ తీసిపారేయొచ్చు. కానీ సంవత్సరానికొకసారి తిరుపతికి పోయి గుండు కొట్టుకొని వచ్చే సాధారణ హిందువులు సహితం ఛ ఛ అనే పరిస్థితి వచ్చింది. బాబ్రీ మసీదును కూల్చినప్పుడు సహితం అసహ్యించుకోని వాళ్లు చాలామంది ఇప్పుడు సంఘ్‌పరివార్‌ను అసహ్యించుకుంటున్నారు. తమ

వార్త దినపత్రిక, ఫిబ్రవరి 11, 1999

ప్రాణాలు అర్పించి ఈ దేశం కళ్లు తెరిపించిన ఆస్ట్రేలియన్లు గ్రహం స్టెయిన్స్, ఫిలిప్ తిమోతీలకూ, తన వారిని కోల్పోయి కూడా ఈ హంతకుల ద్వేషం నిండిన మెదళ్లకు ఎప్పటికీ అర్థం కాని మానవత్వం ప్రదర్శించిన గ్లాడిస్ స్టెయిన్స్‌కూ ఈ దేశ భవితవ్యం తరఫున ధన్యవాదాలు. మత కలహాలపైన ప్రభుత్వం జరిపించిన న్యాయవిచారణ నివేదికను తెప్పించుకున్న అప్పటి హోంమంత్రి ఇంద్రజిత్ గుప్తా వాటిలో సంఘ్‌పరివార్ హస్తం లేదని పార్లమెంట్‌లో చెప్పారనడం చాలా ఆశ్చర్యం కలిగించే విషయం. ఇంద్రజిత్ గుప్తా ఏ నివేదికలు చూసారో, ఏం ప్రకటించారో గానీ అధిక భాగం నివేదికలు సంఘ్‌పరివార్‌ను స్పష్టంగా తప్పుపట్టాయి.

"భివాండిలో మత విద్వేషాన్ని పతాక స్థాయికి తీసుకుపోయిన ఘనత రాష్ట్రీయ ఉత్సవ మండల్‌కు దక్కుతుంది. ఈ సంస్థ నాయకులు, కార్యకర్తలలో మెజారిటీ జనసంఘ్‌కు చెందినవారు లేక జనసంఘ్ అనుయాయులు. మిగిలిన వాళ్లు శివసేనకు చెందినవారు" అని మహారాష్ట్రలోని భివాండి, జల్‌గాంలలో జరిగిన మత ఘర్షణల గురించి న్యాయవిచారణ జరిపిన జస్టిస్ డి.పి.మాధవ్ కమిషన్ 1970లో సమర్పించిన నివేదికలో పేర్కొంది.

"తెల్లిచ్చేరిలో హిందువులూ ముస్లింలూ శతాబ్దాలుగా సోదరభావంతో బతుకుతున్నారు. ఆర్.ఎస్.ఎస్, జనసంఘ్‌లు అక్కడ తమ శాఖలు ప్రారంభించిన తరువాతే పరిస్థితి మారింది. వాళ్ల ముస్లిం వ్యతిరేక ప్రచారం, దాని ఫలితంగా ముస్లింలీగ్‌ను ఆశ్రయించిన ముస్లింల స్పందన ఇక్కడ జరిగిన అల్లర్లకు భూమిక ఏర్పరిచాయి. మహ్మద్ అనే వ్యక్తిపైన దాడి చేసినవారు నీ ప్రాణం దక్కించుకో దలచుకుంటే రామ, రామ అంటూ ఇంటి చుట్టూ మూడుసార్లు తిరుగు అని అతని చేత బలవంతంగా ఆ పని చేయించారు. అతనయితే చేసాడు గానీ భారతదేశంలోని 7 కోట్ల ముస్లింలూ మతసామరస్యాన్నీ శాంతినీ కాపాడడానికి ఆ పని చేయాలని ఆశించడం తగదు. ఆర్ఎస్ఎస్‌కు ఉండే ఈ వైఖరి వల్ల ముస్లింలు తమ మతానికి చెందిన మతోన్మాద సంస్థల నీడన చేరడం మాత్రమే జరుగుతుంది" అని కేరళ రాష్ట్రంలోని తెల్లిచ్చేరిలో జరిగిన మత ఘర్షణల గురించి న్యాయవిచారణ జరిపిన జస్టిస్ జోసఫ్ విద్యాతిల్ 1971లో సమర్పించిన నివేదికలో అన్నారు.

"ఇక్కడ ఇంటెలిజెన్స్ వైఫల్యం, హింసను అదుపు చేయడంలో వైఫల్యం మాత్రమే కాదు, దొమ్మీలో ఆర్ఎస్ఎస్, జనసంఘ్ నాయకులు చురుగ్గా పాల్గొన్నారన్న వాస్తవాన్ని న్యాయవిచారణ కమిషన్ కళ్లకు కనిపించకుండ దాచిపెట్టే ఉద్దేశపూర్వకమైన ప్రయత్నం కూడా కనిపిస్తుంది" అని అహమ్మదాబాద్‌లో జరిగిన మత ఘర్షణల గురించి న్యాయవిచారణ జరిపిన జస్టిస్ జగన్మోహన్‌రెడ్డి 1969లో సమర్పించిన నివేదికలో అన్నారు.

"ఆర్ఎస్ఎస్ హిందువుల హక్కులుగా తాను భావించే వాటిని మైనారిటీల నుండి కాపాడే రక్షకుడి పాత్రలో తనను తాను భావించుకుంటున్నది. దుందుడుకు వైఖరిని, దాడిచేసే వైఖరిని అవలంబిస్తున్నది. మతపరమైన హింసను రెచ్చగొట్టడంలో ఆర్ఎస్ఎస్ ఒక పద్ధతిని అవలంబిస్తుంది. (ఎ) క్రైస్తవులు దేశభక్తులు కారంటూ ప్రచారం చేయడం ద్వారా మెజారిటీ మతస్తులలో విద్వేష భావాలు రెచ్చగొట్టడం (బి) మైనారిటీల జనాభా పెరిగిపోతున్నదనీ హిందువుల జనాభా తగ్గిపోతున్నదనీ ప్రచారం చేయడం ద్వారా హిందువులలో అభద్రతాభావాన్ని పెంచడం (సి) పాలనా యంత్రాంగంలోకి చొరబడి పోలీసు, ప్రభుత్వ యంత్రాంగాలలో మతతత్వాన్ని పెంపొందించడం (డి) మెజారిటీ మతానికి చెందిన యువకులకు కత్తులు కటారులు ఉపయోగించడంలో తర్ఫీదు ఇవ్వడం (ఇ) ప్రతీ చిన్న సంఘటనకూ మతం రంగు పులుముతూ ప్రచారం చేయడం ద్వారా మతతత్వ భావాలను పెంచడం, వదంతులు ప్రచారం చేయడం ద్వారా భిన్న మతాలకు చెందిన వారి మధ్య ఎడాన్ని పెంచడం" అని తమిళనాడులో హిందువులకూ క్రైస్తవులకూ మధ్య జరిగిన ఘర్షణ గురించి న్యాయవిచారణ జరిపిన జస్టిస్ వేణుగోపాల్ 1982లో సమర్పించిన నివేదికలో అన్నారు.

"ముస్లింల ఊరేగింపు ఏ దారిగుండా పోవాలన్న వివాదం సంయుక్త బజరంగ్ బలి అఖాడ సమితి అనే సంస్థకు చెందిన వ్యక్తుల వల్ల తీవ్రరూపం తీసుకుంది. వీరికి ఆర్ఎస్ఎస్‌తో సంస్థాగత సంబంధాలున్నాయి. వీరు మతోన్మాదాన్ని రెచ్చగొట్టడానికి కరపత్రాలు వేసారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకారమే జరిగింది. పోలీసులూ హోంగార్డులూ అధిక భాగం హిందూ మతవాద సంస్థలకు మద్దతు ఇయ్యబోతారని అప్పటికే సర్వే జరిపి నిర్ధారించుకోవడం

జరిగింది" అని బీహార్ రాష్ట్రంలోని జంషెడ్‌పూర్‌లో జరిగిన మత ఘర్షణలపైన విచారణ జరిపిన కమిషన్ 1979 ఏప్రిల్‌లో సమర్పించిన తన నివేదికలో పేర్కొంది. 1980లలో బీహార్‌లోని భాగల్పూర్‌లో, ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, మొరదాబాద్‌లలో జరిగిన మత ఘర్షణల కథ కూడా అంతే. వాటిపైన ప్రభుత్వం న్యాయవిచారణ జరిపించలేదు కాబట్టి ఉటంకించడానికి న్యాయవిచారణ కమిషన్ నివేదికలు లేవు గానీ హక్కుల సంఘాలు రూపొందించిన నివేదికలు ఈ విషయమే వెల్లడించాయి. అన్నిటినీ తలదన్నేది 1992-93లలో ముంబాయి నగరంలో జరిగిన హింసాకాండ గురించి జస్టిస్ శ్రీకృష్ణ సమర్పించిన నివేదిక. ఆ హింసాకాండలో సంఘ్‌పరివార్ ప్రధానంగా శివసేన, తరువాత విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ పాత్రల గురించి జస్టిస్ శ్రీకృష్ణ బయటపెట్టిన వాస్తవాలను వివరించాలంటే రెండు మూడు వాక్యాలు సరిపోవు. "ఈ నివేదికను ఆమోదించడానికి నేనేం పాకిస్తాన్ ప్రధానమంత్రిని కాను" అని మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్‌జోషి అనడాన్ని బట్టి ఆ నివేదికలో వారి పరివారాన్ని గురించి ఏమేముందో ఊహించుకోవచ్చు.

ఇవేవీ తెలియకుండానే ఇంద్రజిత్ గుప్తా పార్లమెంట్‌లో ఆ ప్రకటన చేసారా? లేక ఇది కూడా సంఘ్ పరివార్‌కు బాగా అలవాటయిన అబద్ధపు వదంతుల ప్రచారంలో భాగమా?

సంఘ్ పరివార్ మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ శాఖలలో అంటరానితనాన్ని పాటించకపోవడాన్ని చూసి అంబేద్కర్ సహితం మెచ్చుకున్నాడని ప్రభాకర్ అంటున్నారు. వర్ణాశ్రమ ధర్మ భావనను భుజానికెత్తుకొని ప్రచారం చేసిన ఆర్ఎస్ఎస్, హిందూ మహాసభల గురించి అంబేద్కర్‌కు ఏ అభిప్రాయం ఉండిందో వివరించడానికి చాలా ఉదాహరణలియ్యవచ్చును. ఈ విషయంలో హిందూత్వవాదుల కంటె ఉదార స్వభావం గల కాంగ్రెస్‌వాదులనే ఆయన క్షమించలేదు. అయితే అంటరానితనాన్నీ వెలివేతనూ అధిగమించి సమాజంలో సమాన ప్రతిపత్తినీ గౌరవాన్నీ పొందాలన్న దళిత కులాల కాంక్షను సంఘ్‌పరివార్ ఆదరిస్తున్నట్టు చెప్పుకోవడమే ప్రభాకర్‌గారి ఉద్దేశమయితే, క్రైస్తవులపైన ఈ రోజు జరుగుతున్న దాడులకు ఏం సమాధానం చెప్తారు? ఈ దాడులు పైకి

చూడడానికి క్రైస్తవంపైన దాడులుగానీ, నిజానికవి దళితుల స్వయం నిర్ణయాధికారంపైన జరుగుతున్న దాడులు కావా? దేశంలో క్రైస్తవుల సంఖ్య పెరిగిపోతున్నదని హిందూత్వవాదులు భయపడుతున్నారని భావించలేము.

రెండు శతాబ్దాల 'మతమార్పిడుల' తరువాత కూడా అది రెండు శాతం దాటలేదు. దళితులు, ఆదివాసులు హైందవ సమాజం అదుపు నుండి బయటపడుతున్నారని వీరు భయపడుతున్నారు. దళితులను హిందువులు ఏ రోజూ హైందవ సమాజంలో భాగంగా భావించలేదు. అయినా వారు ఒక వెలివేసిన వర్గంగా హైందవ సమాజం వెలుపల ఉండాలి. ఆ స్థితి నుండి దళితులు బయటపడనిదే వారికి విముక్తి లేదని నమ్మిన వారిలో అంబేద్కర్ ఒకరు. ఇది ఒక్క దళితులూ ఆదివాసులకే కాదు, స్త్రీలకు కూడా వర్తిస్తుంది.

'ఫైర్' సినిమాపైన సంఘ్‌పరివార్ చేసిన దాడికి కారణం కూడా ఇదే కాదా? తాము ఏ విధంగా బతకదలచుకున్నదీ ఏ జీవిత విలువలను ఎంచుకునేదీ తామే నిర్ణయించుకుంటామన్న స్వేచ్ఛను స్త్రీలు ప్రకటించుకోవడం దుస్సహమయింది. అంతే తప్ప అశ్లీలమూ కాదు, మరేదీ కాదు. దళితులయినా ఆదివాసులయినా స్త్రీలయినా హైందవ సమాజం అమలుచేసే వ్యవస్థిత నియమాల అదుపు నుండి బయటకు పోవడానికి వీలు లేదు. బలప్రయోగంతో బయటకు పోకుండ ఆపుతారు. ఇదే సంఘ్‌పరివార్ అజెండాలో కేంద్ర విషయం. భౌగోళికంగా 'అఖండ భారత్' లాగ సామాజికంగా 'అఖండ హైందవ సమాజం' వారి లక్ష్యం. ఈ లక్ష్యాన్ని వాళ్లు బెదిరింపులతో, బలప్రయోగంతో సాధించదలచుకున్నారు. హైందవ సమాజ నియమాలూ విలువలూ అత్యున్నతమైనవై ఉన్నా, ఈ బలవంతాన్నీ బలప్రయోగాన్నీ సహించలేము. కానీ అవి అసమాన విలువలు, నిచ్చెనమెట్ల ఆధిపత్య విలువలు. వీటిని బలప్రయోగంతో నిలబెట్టడానికి క్రమశిక్షణ చాలా అవసరం కావచ్చు. అటువంటి క్రమశిక్షణను గొప్పగా చెప్పుకోనవసరంలేదు. నాజీలకు క్రమశిక్షణ లేదని ఎవ్వరూ ఎక్కడా అన్నట్టు నాకు జ్ఞాపకం లేదు. నాజీల క్రమశిక్షణను చూసి వారిని తొందరపడి అభినందించి ఆ తరువాత పశ్చాత్తాపపడిన వారు చాలామంది ఉన్నారు.

# 'కమల'* వికసనంలో ఎవరి చేయి ఎంత?

'ఇంత అనూహ్యమైన ఎన్నికలను గతంలో ఎప్పుడూ చూడలేదు' అన్న మాట ఈ మధ్య చాలామంది నోళ్లలో విన్నాం.

భవిష్యత్తులో చూడబోమని ప్రకటించే సాహసం ఎవరూ చేయడం లేదనుకోండి. మన రాజకీయాలు ఒక జారుడుబండ మీదుగా కిందికి జారుతున్నాయి. కాబట్టి రేపటి పతనం ఇంకా తీవ్రంగా ఉండబోతుందని మనకు ప్రతీ రోజూ తెలుసును.

నాయకులు, పార్టీలు ఒకరిమీద ఒకరు ఇష్టమొచ్చిన ఆరోపణలు చేసుకోవడం రోజూ చూస్తున్నాం, వింటున్నాం. మామూలుగా పార్టీల కిందిస్థాయి కార్యకర్తలు తిట్టుకునే తిట్లు ప్రధానమంత్రులు, ప్రధానమంత్రులు కాగోరేవారు ప్రయోగిస్తున్నారు.

బతుకు భారంగా తయారయిన సగటు భారతీయులకిది టిక్కెట్‌లేని వినోదం అయిపోయింది. ఏరోజుకారోజు ఇది ఫ్రీయేగానీ నిజానికి చాలా ఖరీదయిన వినోదం అని పత్రికలు అప్పుడప్పుడు సంపాదకీయాలు రాస్తుంటాయి. వాళ్లు రోజుకొక యాభై పంక్తులో వంద పంక్తులో గంభీరంగా రాయాలి కాబట్టి రాస్తున్నారు లెమ్మని సరిపెట్టుకుంటున్నాము.

కొన్ని నిందలను అర్థం చేసుకోవడం సహితం కష్టంగా ఉంది. ఒక పక్క కార్గిల్ యుద్ధం జరుగుతుండగా వాజ్‌పేయి ప్రభుత్వం పాకిస్తాన్ నుండి చక్కెర దిగుమతి చేసుకుందని సోనియాగాంధీ ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఆరోపణ చేస్తున్నది. చక్కెరే కాదు, వేరే చాలా సరుకులు కూడా ఆ రెండు మూడు నెలల కాలంలో ఇటూ అటూ కూడ దిగుమతి అయి ఉంటాయి. అయితే ఏమంట?

పాకిస్తాన్ కాశ్మీర్‌లో వేర్పాటువాదాన్ని రెచ్చగొడుతున్నది కాబట్టి, వేర్పాటువాదులకు తుపాకులు, తర్ఫీదు ఇస్తున్నది కాబట్టి పాకిస్తాన్ క్రికెట్ టీం

---

ఆంధ్రప్రభ దినపత్రిక, సెప్టెంబరు 30, 1999

* అశ్వినీ శరీన్ అనే జర్నలిస్టు వేశ్యా విపణిలో కొనుక్కొచ్చిన యువతి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ వ్యాపారంపై ఆయన వరస కథనాలెన్నో రాశారు. అప్పట్లో ఇది చాలా పెద్ద సంచలనం.

ఇండియాకు రాకూడదని ఆ మధ్య శివసేన ఉన్మాదులు గొడవచేస్తే అది అనాగరికమైన వైఖరి అంటూ కాంగ్రెస్‌వారితో సహా అందరూ వారిని తిట్టారు. దానికీ సోనియాగాంధీ చేస్తున్న ఆరోపణకూ తేడా ఏమిటో మాబోటి మందబుద్ధులకు అర్థంకావడం కష్టం.

మనం దిగుమతి చేసుకున్న చక్కెర పాకిస్తాన్ ప్రధానమంత్రి సొంత బంధువుల ఫ్యాక్టరీలలో తయారయిందనీ దానిని మనం కొనుక్కోవడం నవాజ్‌షరీఫ్‌కు ప్రయోజనం కల్గించిందనీ అంటున్నారు. కావచ్చు. పాకిస్తానీలు మన తోబుట్టువులే కాబట్టి మనలాగే ఆ దేశ ఆర్థిక వ్యవస్థ కూడ రాజకీయ నాయకులు, వారి బంధువుల కనుసన్నలలో నడుస్తుంది. ఎటొచ్చీ అది మన కంటె చిన్నదేశం కాబట్టి, కొన్ని విషయాలలో మన కంటె వెనుకబడిన దేశం కాబట్టి, ఈ విషయం అక్కడ మరీ కొట్టొచ్చినట్టు కనబడవచ్చు.

సోనియాగాంధీ విదేశీయురాలు కాబట్టి ఆమె దేశభక్తిని విశ్వసించలేమన్న బిజెపి ప్రచారానికి ఈ నింద సోనియా గాంధీ కనిపెట్టిన జవాబన్నట్టుంది. ఆమె జాతీయత ఈ ఎన్నికల సందర్భంగా జరుగుతున్న అత్యంత అనవసరమైన చర్చ. దానికి జవాబుగా ఆమె వేసిన నింద అంతే అనవసరమైనది.

మన రాష్ట్రంలో పార్టీలు తెలుగులో తిట్టుకుంటున్నాయి కాబట్టి మరీ అసహ్యంగా ఉంది. పత్రికల ముందు, టివిల ముందు మాట్లాడేటప్పుడు మర్యాదకోసం కత్తిరించక తప్పని మాటలను సముచితస్థానంలో అతికించుకొని ఎడిట్ చేసుకుంటే మన దగ్గర సాగుతున్న రాజకీయ సంవాదం వీధిరౌడీల కొట్లాటకేమాత్రం తీసిపోదు. దమ్మిడీకి కొరగాని నాయకుల పరస్పర దూషణను ప్రజాస్వామ్యం పేరిట భరించక తప్పడం లేదు తెలుగు ప్రజలకు. మన దేశంలో ప్రజలకు ప్రజాస్వామ్యమంటే ఎన్నడయినా అసహ్యం ఏర్పడితే దానికి బాధ్యులు నక్సలైట్లు కారు, ఏ తీవ్రవాదులూ కారు. ప్రజాస్వామ్యాన్ని నిండుగా వాడుకుని దానవల్ల అందరికంటె ఎక్కువ ప్రయోజనం పొందిన నాయకులే బాధ్యులవుతారు. కానీ ఆ దుర్దినం వస్తే దానిని వాడుకొని మళ్లీ ప్రయోజనం పొందడానికి ఈ నాయకులే తయారుగా ఉంటారు.

## *'కమల' వికసనంలో ఎవరి చేయి ఎంత?*

అయితే అర్థరహితమైన నిందలతో దూషణతో నిండిన ప్రస్తుత ఎన్నికలు రాజకీయంగా సామాజికంగా అర్థరహితమైనవి కావు. రాజకీయపార్టీల, నాయకుల చవకబారు అవకాశవాదం ఎంత హేయంగా అనిపించినా దాని చాటున దీర్ఘకాలికంగా నష్టకరమైన ఒక పరిణామం జరుగుతున్నదని గుర్తించక తప్పదు. అది హిందూత్వవాదుల రాజకీయ వ్యాప్తి. వారి స్వంత ప్రయాసతో ప్రవేశించడం సాధ్యంకాని ప్రాంతాలలోకి ఇతర రాజకీయశక్తుల అవకాశవాదాన్ని వాడుకొని వారు నెమ్మదిగా వ్యాపించ గలుగుతున్నారు. ఒకసారి ప్రవేశం దొరికిన తరువాత తలుపులు తెరిచి దారి చూపించిన వారు ఒకవేళ పశ్చాత్తాపపడినా ప్రయోజనం ఉండదు.

అంతేకాక ఇతర పార్టీల చవుకబారు ప్రేలాపనలతో విసిగిపోయిన ప్రజలకు హిందూత్వవాదుల 'క్రమశిక్షణ' ఆకర్షణీయంగా కనిపించినా ఆశ్చర్యపోనక్కరలేదు. వాళ్లేమంత క్రమశిక్షణతో నడుచుకోవడం లేదని గుజరాత్‌నూ ఉత్తరప్రదేశ్‌నూ ఉదాహరణగా చూపించి పెద్దగా ప్రయోజనం లేదు. సాపేక్షంగా వారు మెరుగుగానే కనిపిస్తారు. అంతేకాక, రోజుకొక అందమైన అబద్ధం చెప్పే ఇతర నాయకులతోనూ, పార్టీలతోనూ పోలిస్తే నిక్కచ్చిగా అందవిహీనమైన మాటలు చెప్పే హిందూత్వవాదులలో ఒక వికృతమైన ఆకర్షణ ఉండగలదు. ఒకరోజు లౌకికవాదులుగా, మరొకరోజు మతవాదులమిత్రులుగా అవతారమెత్తే ఆయా పార్టీలతో పోలిస్తే 'అవును మేము పూర్తి మెజారిటీతో అధికారంలోకి వస్తే మైనారిటీలు గియ్‌నారిటీలు అంటూ హక్కులు కల్పించడం మానేస్తాం' అనేవారే నికార్సయిన మనుషులుగా కనిపిస్తారు. జర్మనీలో హిట్లర్, ఇటలీలో ముసోలినీ ప్రజాదరణ పొందడానికి ఆనాటి సగటు రాజకీయ నాయకుల జుగుప్సాకరమైన లేకితనం ఒక ముఖ్యకారణమని ఆనాటి యూరప్ చరిత్రను అధ్యయనం చేసిన వారందరికీ తెలుసును. వారి అల్పత్వంతో పోలిస్తే హిట్లర్, ముసోలినీల కఠినమైన మాటలలో గాంభీర్యం, దృఢత్వం కనిపించాయి. దానిని పాశవికమైన క్రూరత్వంగా గుర్తించడానికి ప్రజలకు కొంత సమయం పట్టింది. అప్పటికి చేయగలిగిందేమీ లేకుండింది.

పై రెండు రకాలుగానూ హిందూత్వవాదులు ప్రయోజనం పొందుతున్నారు. దేశ రాజకీయాలలోని దిగజారుడు చూసి వారు లోలోపల చాలా సంతోషిస్తూ ఉండాలి. ద్రవిడ రాజకీయాల ప్రాబల్యం చాలా బలంగా ఉన్న తమిళనాట హిందూత్వవాదానికి నిలువనీడ దొరకదనుకున్నాం. మొదట జయలలిత ఒక వాకిలి, ఇప్పుడు కరుణానిధి రెండవ వాకిలి తెరిచారు. తెలంగాణలో రజాకార్ల దుర్మార్గాల వల్ల ఆనాటినుండి కొంత పట్టు ఉన్న ప్రాంతాలను దాటి తెలుగునాట హిందూత్వవాదం వ్యాపించలేదనుకున్నాం. చంద్రబాబు ఆ అవకాశం కల్పించాడు. బిజెపికి వోట్లు రావడం అసాధ్యమనుకున్న పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీ, ఆ స్థాయిలో కాకున్నా బిజెపి ఇప్పట్లో అంతగా బలపడడం కష్టమనుకున్న కర్నాటకలో రామకృష్ణ హెగ్డే (ఏ ప్రత్యేకమైన అర్హతా లేకున్నా పత్రికలు పనిగట్టుకొని ఇమేజ్ పెంచిన రాజకీయ నాయకులలో ఈయన ముఖ్యుడు) హిందూత్వవాద రాజకీయాలకు వాకిళ్లు తెరిచారు. ఒక్క కేరళ మాత్రమే మినహాయింపుగా మిగిలింది. కానీ మినహాయింపుగానే ఉండిపోతుందన్న నమ్మకమేదీ లేదు.

కొన్ని సంవత్సరాల తరువాత వెనక్కి తిరిగి చూసుకొని ఈ దశకాన్ని సమీక్షించుకునే రోజు వచ్చినప్పుడు ఇదే ప్రధాన విషయంగా కనిపిస్తుంది. వారి వారి ప్రయోజనాల కోసం లౌకికవాదులుగా చలామణి అయ్యే రాజకీయ నాయకులూ, పార్టీలూ హిందూత్వవాదుల రాజకీయ పురోగమనానికి దారి సుగమం చేసిన వైనం ఈ దశాబ్దపు రాజకీయాల సారాంశంగా ఆనాడు కనిపించక తప్పదు. అయోధ్యలో బాబ్రీమసీదు కూల్చివేతకు సహకరించిన పి.వి. నరసింహారావుతో మొదలుపెట్టి జార్జి ఫెర్నాండెజ్, నితీష్‌కుమార్, కాన్షీరాం, మాయావతి, మమతాబెనర్జీ, జయలలిత, చంద్రబాబు, కరుణానిధి, హెగ్డే, రాంవిలాస్ పాశ్వాన్, శరద్‌యాదవ్, ఫరూక్ అబ్దుల్లా – వీరెవ్వరూ హిందూత్వవాదులుగా తమను తాము ఎన్నడూ చెప్పుకోలేదు. లౌకికవాదులుగానే రాజకీయాలలో చలామణి అవుతూ వచ్చారు. కొందరి విషయంలో వారు ఏపాటి లౌకికవాదులన్న సందేహం ఉండవచ్చును గానీ మిగిలిన వాళ్లు మతవాదానికీ, బ్రాహ్మణీయ భావజాలానికీ అవకాశవాదం అటువైపు నెట్టకపోతే – దూరంగా ఉన్నవారే. కానీ తమ తాత్కాలిక

అవకాశవాదం వల్ల హిందూత్వవాదుల ఆధిక్యతకు మెట్టు మెట్టుగా వీరు సహకరిస్తున్నారు.

ఇతరత్రా తమ అవినీతి, అధికార దాహాల వల్ల ఆ పార్టీలు హిందూత్వ వాదుల 'క్రమశిక్షణ', లక్ష్యనిబద్ధత, అభిప్రాయాలలో దృఢత్వం మొదలైన గుణాల పట్ల – అధికారం చలాయించిన క్రమంలో అవి ఎంత బలహీనమైనప్పటికీ – సమాజంలో ఆకర్షణ కూడ పెంచారు.

హిందూత్వవాద రాజకీయాలకు వేరే పునాది లేకపోలేదు. ఈ 50 ఏళ్లలో ఈ దేశంలో పీడిత ప్రజాసమూహాలు – కూలీలు, కార్మికులు, స్త్రీలు, దళితులు, ఆదివాసులు, మైనారిటీలు సాధించుకున్న హక్కుల పట్ల పెత్తందారీ శక్తులు పెంచుకున్న నిరసన హిందూత్వవాద రాజకీయాల సామాజికపునాది. అది 'దృఢమైన', 'క్రమశిక్షణ' గల పునాది. ఇక్కడొక మసీదు, అక్కడొక చర్చి కూల్చడంతో వారు చేయగల హాని తీరిపోలేదు.

సాధారణ పరిస్థితులలో ఇంతటి అప్రజాస్వామిక స్వభావంగల రాజకీయాలకు ఒక మోతాదును మించి ప్రజాదరణ లభించడం సాధ్యపడేది కాదు కానీ తక్కిన రాజకీయశక్తులన్నీ కలిసి ఆ పరిస్థితిని అయాచితంగా కల్పిస్తున్నాయి.

బహుశా మొన్నటి ఎన్నికలను, ప్రస్తుత రాజకీయాలను నిజంగా అసహ్యించుకోవలసింది ఇందుకోసం. కేవలం అబద్ధాలు, రౌడీయిజం, అవినీతి, గూండాయిజం పెరిగాయని కాదు.

# పోప్‌ను ఏమడుగుతారు? ఏం చెప్తాడు?

ఏ మతం ద్వారానయినా దేవుడిని చేరవచ్చునని దాదాపు 35 ఏళ్ళ క్రితమే కేథలిక్ చర్చి అధికారికంగా ప్రకటించింది. ఆ మత ఉన్నతాధికారి అయిన పోప్ ప్రకటించారు. క్రైస్తవంలో మాత్రమే మోక్షం ఉందన్న అభిప్రాయాన్ని అక్కడితో వారు అధికారికంగా వదులుకున్నట్టే.

మత సహనం హైందవానికి ఉండే ప్రత్యేక లక్షణమని మన హిందూత్వ వాదులు అంటుంటారు. అదేమోగానీ, ఏ మాత్రం మతసహనం ప్రదర్శించని హిందూత్వవాదులు ఆ మాట అనడం కొంచెం ఎబ్బెట్టుగా అనిపిస్తుంది. హైందవంలో సహనం ఎక్కువని, లౌకికత సహజ గుణమని, అది ప్రజాస్వామ్యానికి అనుకూలమైన మతమని ఈ విలువలపట్ల ఏ మాత్రం గౌరవం లేని వాళ్ళే ఎక్కువగా ప్రకటిస్తుంటారు.

పోప్ భారతదేశానికి వచ్చినంత మాత్రాన క్రైస్తవం ఎక్కడ బలపడి పోతుందోనని ఆందోళన చెందేవారు పరమత సహనం తమ సొత్తని గొప్పలు చెప్పుకోవడం ఎందుకు? క్రీస్తు చనిపోయిన కొద్ది సంవత్సరాలకే క్రైస్తవం ఈ నేల మీద అడుగుపెట్టింది. పాశ్చాత్య దేశాల వర్తకులూ పాలనాధికారులూ ఈ దేశాన్ని లోబరచుకున్న క్రమంలో క్రైస్తవంవైపు మత మార్పిడులు కొంత వేగం పుంజుకున్నాయి.

అయినప్పటికీ ఈనాటికీ దేశంలో క్రైస్తవుల సంఖ్య 2.5 శాతం మించలేదు. రాబోయే రోజులలో ఇంతకంటే పెద్దగా ఎక్కువ కాబోదు. ఎప్పటికయినా భారత దేశంలో క్రైస్తవుల సంఖ్య 3 లేక 4 శాతం మించబోదని ఖచ్చితంగా చెప్పవచ్చు.

మరి ఈ మహాభాగ్యానికి, సహనం మా సొత్తని చెప్పుకునే వారు ఇంత అసహనం ప్రదర్శించడం ఎందుకు? పోప్ ఇక్కడికొస్తే ఏవో ప్రశ్నలకు జవాబు

---

ప్రజాతంత్ర వారపత్రిక, 6.11.1999

చెప్పాలంట. చెప్పడానికి ఒప్పుకోకపోతే ఆయనను రానివ్వరంట. 'పోప్ వంటి ప్రముఖ అతిథిని రానివ్వమనడం సరయినది కాదం'టూ అదే సమయంలో అతనిని ప్రశ్నించడం, నిలదీయడం న్యాయమేనని దేశాన్ని ఏలుతున్న బిజెపివారు తమ మిలిటెంట్ సోదరులను వారించినట్టే వారించి వారి చర్యలను సమర్థిస్తున్నారు.

మన అయ్యగార్లూ ఆచార్యులూ ఊరికే అమెరికాకూ ఇంగ్లాండ్‌కూ పోయి వస్తూంటారు. షికాగో నుండి లండన్ దాకా అక్కడున్న ప్రవాస భారతీయులు కట్టించిన గుళ్ళల్లోనూ మత సమాజాలలోనూ ఉపన్యసిస్తుంటారు. వాళ్ళను అటకాయించిన వారూ, హెచ్చరించిన వారూ ఎవరూ లేరు. దీనిని అక్కడి వాళ్ళ ఔదార్యమని మనం అనుకోవడం లేదు. మన గొప్పదనమనే అనుకుంటున్నాం. మనం ఎంత గొప్పవాళ్ళము కాకపోతే వాళ్ళు మనచేత మాట్లాడించుకొని మరీ వింటారనుకుంటున్నాము. వివేకానందుడిని అమెరికా వాళ్ళు తామే పిలిపించుకొని హైందవం గురించి చెప్పించుకొని భేషుగ్గా ఉందని మెచ్చుకుంటే ఆనాటి నుండి ఈనాటి దాకా దానిని వివేకానందుడి గొప్పదనమనే అనుకున్నాముగానీ వారి సహనశీలమనుకోలేదు.

పోప్ వస్తే వచ్చాడు గానీ వీళ్ళడిగే ప్రశ్నలకు జవాబు చెప్పాలంట. లేకపోతే మర్యాద దక్కదంట. విశ్వహిందూపరిషత్ ప్రదర్శిస్తున్న ఈ దాదాగిరీకి 'చర్చ' అని వారి బిజెపి మిత్రులు పేరుపెట్టి సమర్థిస్తున్నారు. గ్రహం స్టెయిన్స్‌ను చంపేసి 'మత మార్పిడులు ఆగాలి' అని హిందూత్వవాద హంతకులు అంటే, 'అవును మత మార్పిడులపైన చర్చ జరగాల్సిందే'నని హిందూత్వవాద పాలకులు నిన్నగాక మొన్న అనలేదా?

ఇంతకూ ఏమిటి వీళ్ళడగదలచుకున్న ప్రశ్నలు? దేశంలో క్రైస్తవ ప్రచారకులు మత మార్పిడిలు ఎందుకు చేస్తున్నారో చెప్పాలంట, ఈశాన్య రాష్ట్రాలలో వేర్పాటు ఉద్యమాలను చర్చి ఎందుకు సమర్థిస్తున్నదో చెప్పాలంట. మత మార్పిడులు పెద్దగా జరుగుతున్నది లేదుగానీ జరుగుతున్నమేరకు వాటికి ఆకర్షితులవుతున్నది దళితులు, ఆదివాసులు. ఈశాన్య రాష్ట్రాలలోని ప్రజలు కూడా ఆదివాసులే. కాబట్టి ఈ దేశంలోని దళితులు, ఆదివాసులు ఈ సమాజంలోనూ

ఈ దేశంలోనూ ఎందుకు ఇమడలేకపోతున్నారో ఎక్కడ నుండో వచ్చిన పోప్ చెప్పాలంట !

దళితులకు హైందవంతో ఉండేది ఒక వికృతమైన సంబంధం. ఒక విషయం తాను నిరాకరించే దాని ద్వారా తనను తాను నిర్వచించుకోవడం అప్పుడప్పుడు జరుగుతుంటుంది (చీకటి అంటే వెలుతురు లేనిచోటు , లేక స్థితి అని నిర్వచించినట్టు). హైందవం తాను వెలివేసిన దళితుల ద్వారా తనను తాను నిర్వచించుకుంటుంది. దాని ఉనికికి దళితులు అవసరం, వారి వెలివేత అవసరం. కానీ దళితులకు హైందవంతో ఏమవసరం ఉంది? అంటరానితనం ఏదో ఒక మేరకు పాటిస్తూనే ఉన్నా, పాటించడం తప్పని ఒప్పుకుంటున్నాం. మీరింక అన్నీ మరిచిపోయి మిమ్మల్ని మీరు హిందువులుగా భావించి మాతో ఉండండి అని హిందువులు అంటే దళితులు ఎందుకు ఒప్పుకోవాలి? ఒప్పుకుంటే అది వారి దయ అని హిందువులు సంతోషించాలి గానీ ఒప్పుకోకుండ తమకు సూత్ర ప్రాయంగా దేవుని ముందు సమాన హోదా కల్పించే మతంలోకి పోతామంటే దానికి ఎవరినో సమాధానం, సంజాయిషీ అడగడంలో అర్థమేమయినా ఉందా? ఒక్కరోజు కూడ అంటరానితనానికి వ్యతిరేకంగా ఒక ఉద్యమంగానీ పోరాటంగానీ చేయని హిందూత్వవాదులకు – దళితులు క్రైస్తవంలోకి ఎందుకు పోతున్నారో చెప్పమంటూ కేథలిక్‌ల పోప్‌ను ప్రశ్నించే అర్హత ఎక్కడిది?

ఆదివాసులు అసలు ఏ అర్థంలోనూ హిందువులు కారు. వారు క్రైస్తవంలోకి పోతే క్రైస్తవులు పెరుగుతారుగానీ హిందువులు తగ్గరు. హిందువులు కానివాళ్ళు క్రైస్తవంలోకి పోవడానికి వీలులేదంటూ వారిని శాసించడానికి వీరెవరు? ఆదివాసులు తమ ఆదివాసీ పూజలకే పరిమితమైనంత కాలం వారి దేవుళ్ళను బ్రాహ్మణీకరించి వారిని హైందవ సాంస్కృతిక ఆధిపత్యం కింద ఉంచుకోవచ్చును. వారు క్రైస్తవమో ఇస్లాం మతమో పుచ్చుకుంటే అది సాధ్యం కాదు. ఇదే హిందూత్వ వాదుల ఘోష అయితే అది వారి సమస్య. దానికి పోప్ ఎందుకు జవాబు చెప్పాలి?

ఇక ఈశాన్య రాష్ట్రాల పోరాటాలను క్రైస్తవంతో ముడిపెట్టడం కంటే తెలివితక్కువతనం వేరే ఏమీ ఉండదు. ఒకవేళ ఏమైనా సంబంధం ఉందనుకున్నా

*పోప్‌ను ఏమడుగుతారు? ఏం చెప్తాడు?*

దానికి పోప్ జవాబు చెప్పలేదు. ఎందుకంటే వేర్పాటువాద పోరాటంలో అగ్రభాగాన ఉన్న నాగాలాండ్ ప్రజలు బాప్టిస్టులు, కేథలిక్‌లు కారు. విశ్వహిందూపరిషత్ చేష్టలకు పోప్ ఏ మాత్రం జవాబు చెప్పగలడో బాప్టిస్టుల చర్యలకు అంతకంటే ఎక్కువ చెప్పలేడు.

కాగా, ఈశాన్య రాష్ట్రాలలోని వేర్పాటువాద పోరాటాలకు మతంతో ఏమైనా సంబంధముంటే అది చాలా పరోక్షమైనదే. నాగా, మెయితీ, ఖాసీ, గారో తదితర జాతులు చారిత్రకంగా, సాంస్కృతికంగా ఏ రోజూ తక్కిన భారతదేశంలో భాగం కారు. బ్రిటిష్‌వారు కృత్రిమంగా నిర్వచించిన ఇండియాకు మనం భారత్ అని పేరు పెట్టుకొని దాని చిత్రపటం మీద మమకారం పెంచుకొని దానిని దేశభక్తి అని ముద్దుగా పిలుచుకుంటున్నాం. దానిని కాదనే వాళ్ళను దేశద్రోహులు, వేర్పాటు వాదులు అంటున్నాం. ఇది మన సమస్యే తప్ప వేరెవ్వరిదీ కాదు. దానికి విశ్వ హిందూ పరిషత్ నాయకులు పోప్‌ను అడిగేదేముంది? ఆయన చెప్పేదేముంటుంది

# జాతి ఆకాంక్ష కాదు మానవతకు అవమానం

తన అసలు రంగు దాచుకోవడం అటల్‌జీకి సాధ్యం కావడం లేదు.

ఆయనను దేశ ప్రధానమంత్రిగా భారతీయ జనతాపార్టీవారు ప్రతిపాదించిన నాటి నుండి ఒక ప్రహసనం చూస్తున్నాం.

అటల్‌బీహారీ వాజ్‌పేయి హిందూత్వవాదులలో 'ఉదారవాది' అనీ, అద్వానీ వంటి కరడుగట్టిన హిందూత్వవాదులకూ ఆయనకూ చాలా తేడా ఉందనీ మనల్ని వారు నమ్మమంటూ వచ్చారు. నమ్మదలచుకున్నవారు నమ్ముతున్నారు. దానికి తగిన మాటలు అటల్‌జీ అప్పుడప్పుడు మాట్లాడుతుంటారు. కానీ సంఘ్‌పరివార్ మాతృసంస్థ అయిన ఆర్‌ఎస్‌ఎస్ పట్ల తన విధేయతను ఆయన పదే పదే ప్రకటించుకుని జాగ్రత్త పడుతుంటాడు. ఆర్‌ఎస్‌ఎస్‌కే కాదు నిన్న మొన్న పుట్టిన బజరంగ్‌దళ్‌కు కూడా ఆయన విధేయుడని బాబ్రీమసీదు కూల్చివేత వార్షికదినాన ఆయన అన్నమాటలు, మరుసటి రోజు దానికిచ్చిన వివరణ మనకు చెప్తున్నాయి.

ఆ మాటల సందర్భాన్ని ఒకసారి గుర్తు చేసుకుని ఆ మాటల భావాన్ని ఆ తరువాత చర్చించుకుందాం. బాబ్రీమసీదు కూల్చివేత కేసులో సిబిఐ చార్జిషీటు పెట్టిన కారణంగా ఎల్.కె. అద్వానీ, ఉమాభారతి, మురళీమనోహర్ జోషిలు కేంద్ర కేబినెట్ నుండి రాజీనామా చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి.

నేరమయమయిన రాజకీయాలలో చార్జిషీటు పెట్టడానికీ పెట్టకపోవడానికీ ఉన్న తేడా స్వల్పమే కాబట్టి 'చార్జిషీటు పెట్టినంత మాత్రాన మా వాళ్లు రాజీనామా చేయనక్కరలే'దని వాజ్‌పేయి దబాయించి ఊరుకుని ఉంటే సగటు భారత రాజకీయవేత్త నైజాన్ని ప్రదర్శించాడనుకుని ప్రజలు ఊరుకుందురేమో.

కానీ వాజ్‌పేయి అక్కడితో ఆగలేదు. 'ఆ ముగ్గురూ నేరం చేయలేదు' అని దబాయించి కూడా ఊరుకోలేదు. 'బాబ్రీమసీదు కూల్చివేత నేరమే కాదు, అది జాతి మనోభీష్టం' అన్నాడు.

---

మావన హక్కుల వేదిక (HRF) కరపత్రం, డిసెంబర్ 2000

**జాతి ఆకాంక్ష కాదు మానవతకు అవమానం**

అది ఏ జాతి మనోభీష్టం? హిందువులందరి మనోభీష్టం కూడా కాదు. తమను తాము హిందువులుగా భావించుకునేవారిలో కూడా చాలామంది ఆ మసీదు కూల్చివేత గొప్ప పని అనుకోలేదు. అందులో రామభక్తులూ ఉన్నారు, అక్కడ ఒకప్పుడొక రామాలయం ఉండిందని నమ్మేవారూ ఉన్నారు. చరిత్రలో ఎప్పుడో జరిగిందో లేదో తెలియని విషయాన్ని ఆధారం చేసుకుని విద్వేషాలు రెచ్చగొట్టడం భిన్నమతాలూ సంప్రదాయాలూ కలిసి బతకాల్సిన భారత ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్న ఇంగితం ఉన్నవారెవ్వరూ బాబ్రీమసీదు కూల్చివేతను హర్షించలేదు. హర్షించకపోగా భిన్న సంప్రదాయాల సహజీవనానికి గొడ్డలిపెట్టు వంటి చర్యగా దానిని గుర్తించారు.

మన దేశంలోని భిన్న మతాలకు చెందిన ప్రార్థనా స్థలాలనొక్కొక్క దానినీ తీసుకొని వాటి చరిత్ర తవ్వుకుంటూ పోతే ఏదో ఒక దశలో ఒక భిన్న ప్రార్థనా సంప్రదాయానికి చెందిన పూజాస్థలాన్ని నయానోభయానో ఆక్రమించుకొని, లేక తమ పూజా సంప్రదాయంలోకి కలిపేసుకొని కట్టినవే బహుశా ఎక్కువ ఉంటాయని గుర్తిస్తాం. ఇప్పుడు ఆ తొలినాటి పూజా స్థలాలన్నిటినీ పునరుద్ధరించే కార్యక్రమం పెట్టుకుంటే మన సమాజంలో సామరస్యం, సహజీవనం సాధ్యం అవుతాయా? కావని మెజారిటీ ప్రజలకు తెలుసును కాబట్టే బాబ్రీమసీదు కూల్చివేతను అధికభాగం ప్రజలు హర్షించలేదు. బాబ్రీమసీదు ఉన్నచోట ఒకప్పుడు రామాలయం ఉండిందని నమ్మితే కూడా పై ప్రశ్న వేసుకోక తప్పదు, పై సమాధానం చెప్పుకోక తప్పదు. కానీ నిజానికక్కడ ఒక రామాలయం ఉండిందని భావించడానికి ఆధారాలున్నాయని సంఘ్‌పరివార్‌కు చెందిన చరిత్రకారులు తప్ప వేరే చరిత్రకారులెవ్వరూ ఒప్పుకోవడం లేదు.

అదట్లా ఉంచి, యాభై ఏళ్లనాడు సంఘ్‌పరివార్‌వారు ఆ మసీదులోకి దొంగతనంగా కొన్ని విగ్రహాలను చొప్పించడం ద్వారా ప్రారంభమైన ఈ కృత్రిమ 'వివాదానికి' వాజ్‌పేయి చెప్పిన పరిష్కారం ఆయన మనోభావాలను మరింత తేటతెల్లం చేసింది. 'ఆయనేం అన్నాడు? హిందువులు, ముస్లింలు ఒక చోట కూర్చుని పరిష్కారం చేసుకోవాలనే కదా అన్నాడు?' అని ఆయన అభిమానులు దబాయించే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన అన్నది అది కాదు. డిసెంబర్ 6వ

తేదీన మాట్లాడుతూ 'బాబ్రీమసీదు కూల్చివేతలో నేరం ఏముంది? అదొక జాతీయ భావవ్యక్తీకరణ. అదింకా పూర్తికాలేదు' అన్నాడు. మరుసటి రోజు ఆ అభిప్రాయాన్ని వివరిస్తూ, అది ఏ విధంగా పూర్తి కాగలదో చెప్పాడు. 'కోర్టు తీర్పు రామాలయానికి అనుకూలంగా రావచ్చు, లేదా ముస్లింలు హిందువుల ఆకాంక్షను మన్నించి అక్కడ వారిని రామాలయం కట్టుకోనియ్యవచ్చు. వారికి మసీదు కట్టుకోవడానికి హిందువులు వేరే ఎక్కడయినా జాగా చూపించవచ్చు' అన్నాడు. హిందువులూ ముస్లింలూ కలిసి కూర్చుని మాట్లాడుకొని పరిష్కరించుకోవడం అంటే అర్థం ఇది! ఇంకొకరకంగా చెప్పాలంటే కోర్టు తీర్పయినా రామాలయానికి అనుకూలంగా రావాలి, లేదా ముస్లింలు కోర్టులో గెలిచినా రామాలయం నిర్మాణానికి తల ఒగ్గాలి, లేదా...

లేదా ఏం జరుగుతుందో వాజ్‌పేయి చెప్పనక్కర్లేదు. విశ్వహిందూపరిషత్ నాయకులు ఆయనగారి ప్రకటనకు స్పందిస్తూ వెంటనే చెప్పారు. రేపు రానున్న జనవరి మాసం నుండి అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ఉద్యమం మొదలు పెడతామని అన్నారు. ఇంక వారికీ అటల్ బీహారీ వాజ్‌పేయికీ తేడా ఎక్కడుంది? ఒకరి మనసులోని మాటలు మరొకరు నోటితో చెప్పారు. ఒకరి మాటలలోని ఖాళీలను మరొకరు తమ ప్రతినలతో పూరిస్తారు.

వాజ్‌పేయి కవి అనీ సాహిత్య విలువలు ఎరిగిన వ్యక్తి అనీ అంటారు. కానీ ఏ మాత్రం సున్నితమెరిగిన వ్యక్తి అయినా ఈ మాటలు మాట్లాడడానికి రంజాన్ ఇఫ్తార్ విందును ఎంచుకోడు. అందులోనూ తన కేబినెట్ సహచరుడయిన ఒక ముస్లిం మంత్రి ఇచ్చిన ఇఫ్తార్ విందును ఎంచుకోడు. హిందువులలో సంఘ్‌పరివార్ ఉన్మాదులున్నట్టే ముస్లింలలోనూ మతోన్మాదులున్నారు. కానీ బాబ్రీమసీదు కూల్చివేత వారిని మాత్రమే కలవరపెట్టలేదు. మతోన్మాదానికి దూరంగా ఉండే ముస్లింలను కూడా కలవరపెట్టింది. మైనారిటీ మతస్థుల సంప్రదాయాలకూ మత ఆచారాలకూ రక్షణ కల్పించే లౌకికవాద సూత్రమేదైతే భారత రాజ్యాంగంలో ఉందో అది ఆనాడు ధ్వంసమయిందని భావించారు. ముస్లింలు మాత్రమే కాదు, ప్రజాస్వామికవాదులందరూ అదే విధంగా భావించారు.

**జాతి ఆకాంక్ష కాదు మానవతకు అవమానం**

దేశానికే అవమానకరమయిన ఆ ఘటనకు సంకేతమైన డిసెంబర్ 6 నాడు ఒక ముస్లిం మంత్రి ఇచ్చిన రంజాన్ ఇఫ్తార్ విందులో పాల్గొంటూ అయోధ్యలో రామాలయ నిర్మాణాన్ని జాతి ఆకాంక్షగా వర్ణిస్తూ ముస్లింలు దానికి ఒప్పుకొని మసీదు కట్టుకోవడానికి వేరే ఎక్కడైనా జాగా అడుక్కోవడమే దానికి పరిష్కారమని ప్రకటించే వ్యక్తిని ప్రధానమంత్రిగా ఆదరించడం సంగతి అటుంచి, మనిషిగా గౌరవించడం సాధ్యమా?

వోట్లు వేయని జనం సంగతి అటుంచి, వేసిన వారిలో సహితం మెజారిటీ వీరికి వోటు వేయలేదు. అయినప్పటికీ రకరకాల అవకాశవాదులను వెనకేసుకొని ఈ హిందూత్వ ఉన్మాదులు గద్దెనెక్కారు. ప్రజాస్వామ్యాన్ని అవమానపరిచే తమ రాజకీయనీతికి జాతి ఆకాంక్ష అని పేరు పెట్టి 'ఉదారవాది' అన్న ముఖోటా తగిలించిన వాజ్‌పేయుని ద్వారా దానిని పలికిస్తున్నారు.

ఈ ప్రహసనానికి ఎంతకాలం ప్రేక్షకులుగా ఉంటామన్నదే మనం నిర్ణయించుకోవలసిన విషయం.

# హిందూత్వవాదుల లక్ష్యమేమిటి?

విసిగిస్తూ ఉంటే 'వాళ్ళ ఇష్టమే కానీ లెమ్మ'ని ఒప్పేసుకుంటారని మన హిందూత్వవాద సోదరుల ఆశ. అయోధ్య విషయంలో ఇప్పటికే దేశంలో చాలా మంది ఈ 'మూడ్'లోకి వచ్చారు ముస్లింలతో సహా. విచిత్రమేమిటంటే ఒకదాని తర్వాత మరొక స్థలాన్ని గురించి ఏదో ఒక వివాదం లేవదీస్తుంటే వాళ్ళపట్ల మెతక వైఖరి ప్రదర్శించడం మంచిది కాదన్న అభిప్రాయానికి రావడానికి బదులు మొదటి డిమాండ్ ఒప్పేసుకుంటే మిగిలినవి లేవదీసేవారు కారని విజ్ఞులు సహితం అనుకుంటున్నారు.

పురావస్తు శాఖ అధీనంలో ఉన్న ముస్లిం సాంప్రదాయానికి చెందిన పర్యాటక స్థలాలలో ముస్లింలను నమాజు చేసుకోనిస్తారు కదా ! హైందవ సాంప్రదాయానికి చెందిన పర్యాటక స్థలాలలో హిందువులను పూజలు ఎందుకు చేసుకోనివ్వరు? అని ఈ మధ్య సంఘ్ పరివార్ నాయకులొక కొత్త ప్రశ్న లేవదీశారు.

ప్రశ్న అడిగే పద్ధతి ఎట్లాగుంటుందంటే అది నిజమేనని వినేవాళ్ళు అనుకోవాలి. ఆ తరువాత అందులోని అభియోగం న్యాయమైనదే అనుకోవాలి. కానీ తాజ్‌మహల్‌లో నమాజు చేయనిచ్చినట్లే అనేక 'హైందవ' పర్యాటక కేంద్రాలలో హిందూ పూజలు చేసుకోనిస్తారు. కొన్నిచోట్ల (ఉదాహరణకు మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలంపురంలో) పురావస్తు పర్యాటక కేంద్రంలో గుడీ ఉంది దర్గా కూడా ఉంది. జరుపుకోనివ్వనిది వివాదం ఉన్నచోట్ల మాత్రమే. అది కూడా కేవలం శాంతి సామరస్యాల కోసమే తప్ప 'కుహనా లౌకిక వాదం' ఫలితంగా కాదు. ఇవి నిజానికి అందరికీ కొంచెం ఆలోచిస్తే గుర్తుకొచ్చే విషయాలే. రామప్ప నుండి హంపి దాకా హిందూ పూజలు జరిగే పర్యాటక స్థలాలు అందరూ చూసే ఉంటారు. కాని నిర్భీతిగా దబాయిస్తుంటే మన మెరిగిన విషయాలే మరిచిపోతాము.

---

ప్రజాతంత్ర వారపత్రిక, 24.12.2000

*హిందూత్వవాదుల లక్ష్యమేమిటి?*

అయోధ్య విషయంలో 'విసిగించి ఒప్పించే' మార్గాన్ని హిందూత్వవాదులు చాలా నేర్పుగా అమలు చేస్తున్నారు. వచ్చే జనవరి నుండి మళ్ళీ 'కరసేవ మొదలు పెడతాం' అని అకస్మాత్తుగా ఒకడు ప్రకటిస్తాడు. 'విగ్రహాలూ రాళ్ళూ చేరవేస్తున్నాం' అని ఇంకొకడు ప్రకటిస్తాడు. 'ఉత్తరప్రదేశ్‌లో రెడ్ అలర్ట్' అనీ 'జనం గుండెలలో ఉద్రిక్తత' అనీ పత్రికలు రాస్తాయి. 'ఈ ఒక్కటి ఒప్పేసుకుంటే పోలేదా' అనుకునేటట్టు చేస్తారు.

అంతలో ఢిల్లీలో కుతుబ్‌మినార్ గురించి కొత్త వివాదం వేరొక సంఘ పరివార్ సంస్థ లేవదీస్తుంది. అక్కడ పూజలో, యజ్ఞమో చేస్తామని బయలు దేరుతారు. పోలీసులు నిషేధాజ్ఞలు ప్రకటించారనీ కుతుబ్‌మినార్ పరిసరాలలో కర్ఫ్యూ వాతావరణం నెలకొనిందనీ పత్రికలు రాస్తాయి.

'రామాలయం కట్టుకోనిచ్చేస్తే ఇట్లా ఎక్కడ పడితే అక్కడ వివాదాలు లేవదీయటం మానేస్తారేమో కదా' అని సగటు ప్రజలు అనుకునేటట్టు చేస్తారు.

వాళ్ళేదీ మానుకోరు. వాళ్ళకు కావలసింది నిజానికి గుళ్ళు కాదు, కూల్చి వేసిన పవిత్ర స్థలాల పునరాక్రమణా కాదు. వాళ్ళకు కావలసింది హిందూ సమాజంలో అసహనం పెరగడం. వాళ్ళకు కావలసింది హిందూ సమాజంలో విద్వేష సంస్కృతి పెరగడం.

అసహనం, ద్వేషం నిండిన మనుషులు ప్రజాస్వామ్యానికి శత్రువులుగా మారతారు. నియంతలను ఆరాధిస్తారు, ఆహ్వానిస్తారు. జర్మనీలోనూ ఇటలీలోనూ ఫాసిజం రాజ్యం చేసిన అన్ని దేశాలలోనూ ఫాసిస్టు రాజకీయాలు ప్రజలలో ఏదో ఒక మైనారిటీ జాతిపట్ల, మతస్తులపట్ల ద్వేషాన్నీ అసహనాన్నీ రెచ్చగొట్టడం ద్వారానే ఉనికిలోకి వచ్చాయి, వ్యాపించాయి. మైనారిటీ జాతులపట్ల, మతస్తుల పట్ల ఇతర ప్రజలలో వ్యతిరేకత రేకెత్తించడానికి వారు చరిత్ర నుండి ఎంపిక చేసుకున్న ఘటనలలో ఎంతో కొంత సత్యముంటే ఉండవచ్చును కూడా. యూదులలో చాలా మంది వ్యాపారస్తులు – అందులోను వడ్డీ వ్యాపారస్తులు – కావడం వల్ల వారికి వ్యతిరేకంగా ద్వేషం రేకెత్తించడానికి కావలసిన సామాజిక వాతావరణం నాజీలకు దొరకడం పెద్ద కష్టం కాలేదు. ఆ సంఘటనలకు సంబంధించిన తప్పొప్పుల వివేచనలో జనం కూరుకుపోయిన కొద్దీ ఫాసిస్టుల విద్వేష అజెండా కళ్ళకు కనిపించకుండా పోయే ప్రమాదం ఉంది.

పాకిస్తాన్ కశ్మీర్‌లోకి మిలిటెంట్ మతవాదులను పంపించడం లేదా? పంపిస్తున్నది. ఈ దేశాన్ని ఏలిన ముస్లిం నవాబులు, సుల్తానులలో హైందవ మత చిహ్నాలపట్ల అసహనం ప్రదర్శించిన వారు లేరా? ఉన్నారు. గుళ్ళను కూల్చి, విగ్రహాల ముక్కులు, చెవులు తెగనరికి తమ విశ్వాసాల గాఢతను ప్రదర్శించుకున్న వారు లేరా? ఉన్నారు.

అందువల్ల పాకిస్తాన్‌ను క్రికెట్ మ్యాచ్‌ల కోసం మన దేశానికి ఆహ్వానించ వద్దని, విధ్వంసమైన హైందవ మత చిహ్నాలను బలప్రయోగంతో పునరుద్ధరిద్దామని హిందూత్వవాదులు అన్నప్పుడు స్పందన లభిస్తుంది. అయోధ్యలో బాబ్రీ మసీదును కూల్చేసిన స్థలంలో రామాలయాన్ని కట్టడం 'జాతి ఆకాంక్ష' అని వాజ్‌పేయి అన్నా, ముస్లింలకు ఓటుహక్కు ఉన్నంతకాలం వారిని మంచి చేసుకోవడం కోసం కుహనా లౌకికవాద రాజకీయాలు సజీవంగా ఉంటాయి కాబట్టి వారికి ఓటు హక్కు తీసివేయాలని బాల్ థాకరే అన్నా కూడా స్పందించే వాళ్ళు ఉంటారు.

వీటికి తర్కబద్ధంగా జవాబు చెప్పగలము. చెప్పడం అవసరం కూడా. కానీ చెప్పేటప్పుడు తర్కాన్నీ తర్కశూన్యాన్నీ దాటిపోయే లక్ష్యమొకటి ఈ నిర్ణయాలు, ప్రకటనల వెనక ఉందని గుర్తించడం అవసరం. పాకిస్తాన్‌తో మన వాళ్ళు క్రికెట్ ఆడినా, ఆడకున్నా కాశ్మీర్ సమస్య పరిష్కారం ఒక్క అంగుళం కూడా ముందుకు పోదని భారతీయ జనతా పార్టీకి మాత్రం తెలియదా? అయినా ఆ నిర్ణయం తీసుకున్నారంటే కారణం ద్వేషాన్ని, అసహనాన్ని వారు జాతి లక్షణం చేయదల్చు కోవడం తప్ప వేరే ఏమీ కాదు. జైన, బౌద్ధ పవిత్ర స్థలాలను ఆక్రమించుకొని శివాలయాలు, వైష్ణవ ఆలయాలు కట్టిన హైందవ రాజులు, చక్రవర్తులు చాలా మంది ఉన్నారు. కాబట్టి అయోధ్య రామాలయ తర్కం హిందువులను కూడా ఇబ్బంది పెట్టగలదని వీరికి తెలియదా? నిజానికి ఈ తర్కం ఒక్క ఆదివాసులను తప్ప అందరినీ ఇబ్బంది పెట్టగలదు. దేశంలో ఏ పవిత్ర స్థలం తీసుకున్నా హిందూ, బౌద్ధ, జైన, ముస్లిం, క్రైస్తవ – నూటికి తొంభై కాకపోతే ఎనభై శాతం ఒక నాటి ఆదివాసి పూజా స్థలాల్లో కట్టినవే.

ఈ తర్కానికి సంఘ్ పరివార్ యోధుల దగ్గర జవాబు లేదు గాని, తర్కం ఏ గుడినీ కూల్చదని, బౌద్ధులు, జైనులు, ఆదివాసులు ఆ పనిచేసే స్థితిలో లేరని

వారికి తెలుసును. నిజానికి ఆ ధైర్యం ఉండబట్టే ఒక్కొక్క మసీదు గురించి ఇంత గొడవ చేస్తున్నారు. ద్వేషాన్ని విపరీతంగా ఆరాధించే వారిలో మెజారిటీ వ్యక్తిగతంగా పిరికివాళ్ళు.

అయితే ఎన్ని మసీదులు కూల్చగలరు, ఎన్ని గుళ్ళు కట్టగలరు అన్న లెక్కలతో నిమిత్తంలేని ప్రయోజనం ఒకటి ఆ గొడవ నుండి వారు పుష్కలంగా పోగు చేసుకుంటున్నారు. అది తమ ఫాసిస్టు అజెండాకు తగిన సమాజంగా– ద్వేషం, అసహనం, అనుమానం నిండిన సమాజంగా ఇండియాను మార్చడం. మనం మసీదులు, గుళ్ళు లెక్కపెట్టుకుంటూ ఈ విషయం మరచిపోతే కష్టం. రాబోయే 20 ఏళ్ళలో వీళ్ళు బాబ్రీ మసీదు లాగా ఇంకొక మసీదును కూల్చలేకపోవచ్చు. కుతుబ్‌మినార్‌ను గుడిగా మార్చలేకపోవచ్చు. కానీ తమ దీర్ఘకాలిక అజెండాకు తగిన సమాజాన్ని మాత్రం వాళ్ళు విజయవంతంగా తయారు చేసుకుంటున్నారు. ఏ రాజకీయమైనా తన నమూనాలో మనుషులను తయారు చేసుకోగలిగినప్పుడే నిలబడుతుంది, గెలుస్తుంది. ఆ విషయంలో సంఘ్ పరివార్ ఫాసిస్టులు కొద్ది కొద్ది గానే కావచ్చును గానీ కచ్చితంగా పురోగమిస్తున్నారు. ఆ సంగతి గమనిస్తున్నామా?

# ముల్లా మహమ్మద్ ఉమర్‌కు సలాములు

మితిమీరిన మూర్ఖత్వంవల్ల ఒక్కొక్కసారి కొన్ని ప్రయోజనాలుంటాయి. దానిని అందరూ ఖండిస్తారు కాబట్టి, అప్పటివరకు ఒక సామాన్య ప్రాతిపదిక లేని కారణంగా పరస్పర దూషణగా సాగిన సంభాషణ సంవాదంగా మారే అవకాశం ఏర్పడుతుంది. 'మీ ప్రమాణాలు మేము ఒప్పుకోము కాబట్టి మీకు మేము జవాబు చెప్పనక్కర్లేదు' అనే వాళ్ళు తమకే తెలియకుండా ఒక సామాన్య ప్రమాణాన్ని ఒప్పేసుకుంటారు కాబట్టి రేపు ఆ మాట మళ్ళీ అనలేరు.

బాబ్రీ మసీదును కూల్చివేసినప్పుడు, క్రైస్తవ పూజా స్థలాలను తగలబెట్టి నప్పుడు, బైబిల్ గ్రంథాలను కాల్చేసినప్పుడు 'ఇది అనాగరికం' అని అభిశంసిస్తే అది హిందువుల సెంటిమెంట్లకు సంబంధించిన విషయమని, జాతి ఆకాంక్ష అని విదేశీయులూ లౌకికవాదులూ నిర్దేశించే ప్రమాణాలను తాము ఆమోదించమని మన హిందూత్వవాద పార్టీలన్నీ అన్నాయి. 'సార్వజనీన ప్రమాణాలను మేము అంగీకరించము' అని ప్రకటించడం సంవాదాన్ని తప్పించుకోవడానికీ, మన ప్రవర్తనకు ఎవరికీ జవాబు చెప్పకుండా ఉండటానికీ సులభమైన మార్గం. సార్వజనీనమని ప్రకటించుకునే ప్రమాణాలన్నీ నిజానికి సార్వజనీనం కాక పోవచ్చును. కాబట్టి అన్ని ప్రమాణాలను విమర్శనాత్మకంగా చూడాలన్న న్యాయమైన అభ్యంతరాన్ని ఈ తప్పుడు ప్రయోజనం కోసం అన్ని రకాల 'పునాదివాదులు' వక్రీకరించి వాడుకుంటూ ఉంటారు. మన సంఘ్‌పరివార్ గుంపు అందులో ప్రథములు.

ఈ వైఖరి అహేతుకం అని వారి చేతనే చెప్పించడానికి తాలిబన్ల అతి మూర్ఖత్వం పనికొచ్చింది. ఆఫ్ఘనిస్తాన్‌లో బౌద్ధ విగ్రహాల విధ్వంసాన్ని గురించి వార్తలు రావడం మొదలయినప్పటి నుండి మన దగ్గర అందరికంటే ఎక్కువగా హిందూత్వవాదులు దానిని ఖండిస్తున్నారు. ఖండించే క్రమంలో తమకే తెలియకుండా సార్వజనీన ప్రమాణాలను ఉటంకించే 'ట్రాప్'లో పడిపోతున్నారు.

---

ప్రజాతంత్ర వారపత్రిక, 17.3.2001

'ఈ చర్య ఆఫ్ఘన్ ప్రజల సెంటిమెంట్లకు వ్యతిరేకం' అనడం లేదు. 'ఇది అనాగరికం' అంటున్నారు. 'ఇది ఆఫ్ఘన్ జాతి ఆకాంక్షలకు విరుద్ధమైన చర్య' అనడం లేదు, 'ఇది మానవ సాంస్కృతిక వారసత్వాన్ని విధ్వంసం చేసే చర్య' అంటున్నారు.

వాళ్ళ భాషలోనే ముల్లా మహమ్మద్ ఉమర్ జవాబు చెప్తే ఏమంటారు? అతను ఆఫ్ఘన్ సంస్కృతి ఇస్లామిక్ సంస్కృతేనంటాడు. ప్రవక్త మహమ్మదు పుట్టక ముందే ఆఫ్ఘనిస్తాన్‌లో ఒక అభివృద్ధి చెందిన నాగరికత ఉందని ఒప్పుకోడు. ఆ సంస్కృతి చిహ్నాలు ఆఫ్ఘనీ జాతీయతలో భాగమేనంటే ఒప్పుకోడు. ఆ సంస్కృతి, ఆ చిహ్నాలు ఇస్లామీకరణ చెందితేనే వాటిని ఆఫ్ఘనీ సంస్కృతిలో భాగంగా చూస్తానంటాడు. ఇస్లామీకరణ చెందలేని వాటిని దేశం నుండి తరిమేస్తానంటాడు. విగ్రహాలు ఎట్టి పరిస్థితిలోనూ ఇస్లామీకరణ చెందజాలవు కాబట్టి వాటిని ధ్వంసం చేస్తానంటాడు.

ఇదంతా ఎక్కడో విన్నట్టు లేదూ? ఏమంటారు సుదర్శన్‌జీ ! ఎప్పుడో మీ నోట పలికినట్టు లేదూ?

తాలిబన్‌ల ఘాతుకాన్ని గంభీరంగా ఖండించిన దేశాలలో చైనా కూడా ఒకటి. చైనా టిబెట్‌లో యాభై ఏళ్ళుగా బౌద్ధమత చిహ్నాలనూ సంస్థలనూ తొక్కి పెట్టడానికి చేస్తున్న ప్రయత్నం స్వల్పం కాదు. టిబెటన్ జాతీయవాదం తలెత్తకుండా ఉండాలంటే ఆ జాతీయతా భావనలో విడదీయరాని భాగమైన బౌద్ధమత చిహ్నాలనూ సంస్థలనూ తొక్కిపెట్టడం అవసరమని చైనా గుర్తించింది. కొంత బలప్రయోగంతో, కొంత నక్కజిత్తులతో ఆ పని చేస్తున్నది. 'మానవ జాతి వారసత్వం' అని ఆఫ్ఘనిస్తాన్‌లోని బౌద్ధ విగ్రహాలను అభివర్ణించడానికి ఏ మాటయితే అందరూ ప్రయోగిస్తున్నారో ఆ మాట వర్తించే కట్టడాలనేకం టిబెట్‌లో నిరాదరణకు గురయి నాశనం అయ్యాయి. 'సాంస్కృతిక విప్లవ' కాలంలోనయితే ప్రత్యక్ష దాడులతోనే నాశనం అయ్యాయి.

బౌద్ధానికి ప్రతినిధులుగా తాలిబన్‌ను గట్టిగా తిట్టిన వారిలో శ్రీలంక పాలకులు ఉన్నారు. ఆ దేశంలో మాత్రం సింహళ భాష, బౌద్ధమతం తప్ప వేరే ఏ సంప్రదాయమూ తమ జాతీయతలో భాగం కాదని, వేరే ఏ సాంస్కృతిక వారసత్వాన్నీ తమ సంస్కృతిలో భాగంగా గుర్తించమనీ గొడవ పెడుతున్న

సింహళీయ అతివాదులను కాదనడం వారికి సాధ్యం కావడం లేదు. తమిళ భాషకు గానీ హైందవ మతానికి గానీ సింహళంతో బౌద్ధంతో సమాన ప్రతిపత్తి కల్పించి బతకగల రాజకీయ పార్టీ శ్రీలంకలో లేదు.

వీటిని తాలిబన్‌ల దుశ్చర్యలతో సమానంచేసి చూడటం న్యాయం కాదంటారు. కాదని నేను కూడా ఒప్పుకుంటాను. అవమానవీయమైన, అనాగరికమైన చర్యలలోనూ హెచ్చుతగ్గులుంటాయనీ ఆ తేడాలను తృణీకరించకూడదనీ అంటేనూ ఒప్పుకుంటాను.

కానీ ఇక్కడుండేది కేవలం హెచ్చుతగ్గుల తేడా కాదు. ఇతరులు తమ అనాగరికతకొక ఆకర్షణీయమైన పేరు పెట్టుకుంటున్నారు. తాలిబన్లకు చేతకాకనో ఏమీ దొరకకనో అవసరమనుకోకనో గానీ తమ మూర్ఖత్వానికి వాళ్ళు రాజకీయంగా ఆమోదనీయమైన పేరేదీ పెట్టుకోవడం లేదు. చైనా టిబెట్‌లో ప్రజల విశ్వాసాలపైన చేసిన దౌర్జన్యానికి భూస్వామ్య వ్యతిరేక పోరాటం అని పేరు పెట్టుకుంది. శ్రీలంక తన సమాజంలోని తమిళులకు సమాన హక్కులను నిరాకరించడాన్ని భారత విస్తరణ వాదంపైన పోరాటంగా అభివర్ణించుకునింది. ఆ పనిచేయని తాలిబన్‌ల అతి మూర్ఖత్వం వీరందరూ చూపించే సుందరమైన కారణాల వెనుక దాగి ఉన్న అనాగరిక వైఖరుల గురించి మాట్లాడుకోవడానికి మనకు అవకాశం కల్పించింది. అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలలోకి యూరప్ నుండి వలసపోయి స్థిరపడిన తెల్లవాళ్ళు స్థానికులయిన ఆదివాసులను తీవ్రమైన బలప్రయోగంతో అణచివేశారు. భౌతికంగా వారిని మట్టు బెట్టడమేకాక వారి నాగరికతా చిహ్నాలను నామరూపాలు లేకుండా ధ్వంసం చేశారు. అవి కూడా ఆఫ్ఘనిస్తాన్‌లోని బౌద్ధ విగ్రహాల లాగా మానవ సాంస్కృతిక వారసత్వానికి చెందినవే.

ఈ రోజు అమెరికాలోనూ ఆస్ట్రేలియాలోనూ ఉన్న తెల్లవాళ్ళు తమ తాత ముత్తాతలు చేసిన దౌర్జన్యాన్ని చర్చించుకుంటున్న మాట వాస్తవమే. అందరూ కాకున్నా కొందరు దానిని దౌర్జన్యంగా గుర్తిస్తున్న మాట కూడా వాస్తవమే. ఇప్పుడొప్పుకుంటే వారికి పోయిందేమీ లేదని సినికల్‌గా అనొచ్చునేమో గానీ ఒప్పుకునే సంస్కారం కొంతమందయినా ప్రదర్శిస్తున్నారని గుర్తించక తప్పదు. కానీ తమ తాత ముత్తాతలు తాలిబన్‌ల వంటి వారేనని ఆ దేశాల తెల్ల జాతీయులు

**ముల్లా మహమ్మద్ ఉమర్‌కు సలాములు**

– ఇవాళ తాలిబన్‌లను పురుగుల లాగా చూస్తున్నవారు – ఒప్పుకునే రోజు వస్తుందా? తాలిబన్‌ల అనాగరిక చర్య ఈ ప్రశ్నను వారి ముందు నిక్కచ్చిగా నిలబెట్టింది కదా?

అందుకే ముల్లా మహమ్మద్ ఉమర్‌కు నా సలాములు. వారికి శాంతి అగుగాక.

# అయోధ్యలో ఏ కరసేవా జరగనక్కరలేదు... జరగనివ్వొద్దు

దేశం యావత్తు విశ్వహిందూ పరిషత్ ముందు మోకరిల్లి వున్న అనుభూతి కొద్దిరోజులుగా కలుగుతున్నది.

వాళ్లేదో గొప్ప పని చేసినందుకు కాదు. దౌర్జన్యం దయచేసి చేయొద్దని అడుక్కునేందుకు. కోర్టు తీర్పుకు దయచేసి కట్టుబడి ఉండండి ప్లీజ్ అని అర్థించేందుకు.

అరుంధతీరాయ్‌కి ఒక సంవత్సర కాలంలో రెండుసార్లు కోర్టు ధిక్కారం నోటీసు ఇచ్చి ఒకసారి జైలుకు పంపించిన న్యాయస్థానాలకు, సంఘ్ పరివార్ సంత్‌లకూ ఆచార్యులకూ అయ్యగార్లకూ నోటీసు ఇవ్వడానికి మాత్రం చేతులాడడం లేదు.

నిజానికి మేధాపాట్కర్ గానీ, అరుంధతీరాయ్ గానీ నర్మదా నిర్వాసితుల సమస్యలపైన న్యాయస్థానాలు తీర్పు ఇవ్వజాలవనలేదు. న్యాయంగా ఇమ్మని మాత్రమే అడిగారు. ఆదివాసుల సమస్యలు కోర్టులకూ చట్టానికీ అతీతమైనవని అనలేదు. వాటిని చట్టం తనలో ఇముడ్చుకోవాలని మాత్రమే కోరారు.

ఈ ఆచార్యులూ అయ్యగార్లూ? ఒకసారి కాదు రెండుసార్లు కాదు వేలసార్లు అన్నారు – అయోధ్య సమస్యపైన కోర్టులు తీర్పు చెప్పలేవనీ, చెప్పినా అది తమకు అనుకూలంగా ఉంటే తప్ప తాము కట్టుబడి ఉండమనీ. 'ఒద్దొద్దు, అంతమాట అనొద్దు, కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని చెప్పండి' అంటూ వాజ్‌పేయి వంటివారు రాయబారానికి ఒక శంకరాచార్యుడినే పంపినా సంఘ్‌పరివార్ ఆచార్యులూ అయ్యగార్లూ మరింత బిగుసుకుపోయి బెట్టు చేస్తున్నారు. కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటామని ఒకరోజు, ఉండమని ఒకరోజూ పొంతనలేని ప్రకటనలు చేస్తున్నారు. తుచ్ఛమైన లౌకిక ప్రభుత్వం తరఫున వచ్చిన శంకరాచార్యుడు శంకరాచార్యుడే కాదని మరొక శంకరాచార్యుడి చేత చెప్పిస్తున్నారు.

---

మానవహక్కుల వేదిక కరపత్రం, 2002

## *అయోధ్యలో ఏ కరసేవా జరగనక్కరలేదు...జరగనివ్వొద్దు*

ఒక శంకరాచార్యుడిని మరొక శంకరాచార్యుడు తుచ్ఛుడనుకుంటే మనకు పోయిందేమీ లేదుగానీ, లౌకిక సంస్థలన్నీ ఈ బ్రాహ్మణ అహంకార ప్రదర్శన ముందు మోకరిల్లిన వైనం ప్రజాస్వామ్యానికి అవమానకరం. ఈ మధ్య ఎడాపెడా కోర్టు ధిక్కారం నోటీసులు జారీ చేస్తున్న కోర్టులయినా హూంకరిస్తాయేమోనని చూస్తే వాటి నోరూ పడిపోయినట్టుంది. ఇంకా ఏమైనా అంటే మాకు నోటీసు జారీ చేస్తారుగానీ ఆచార్య గిరిరాజ్ కిషోర్‌కూ, బాల్‌థాకరేకీ మాత్రం చేయరు.

నిజానికి వాళ్లు కోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటారా లేదా అనేది అంత ముఖ్యమైన విషయం కాదు. ఎందుకంటే వాళ్లు చెప్తున్న అర్థంలో కాకున్నా ఇది నిజానికి న్యాయస్థానాలు తీర్చగల తగవు కాదు. ఆ భూభాగం ఏ వ్యక్తికి లేక మతానికి లేక సంస్థకు చెందుతుందన్న విషయం మాత్రమే కోర్టు ముందు ఉంది. అది ఎవరికి చెందినా అక్కడ రామాలయం కట్టడం సబబా అన్న ప్రశ్న మనం ఎంచుకునే రాజకీయ విలువలకు సంబంధించిన ప్రశ్న. రాముడనేవాడు అక్కడ పుట్టాడని హిందువులు నమ్ముతున్నారా లేదా, ఆ 'సెంటిమెంట్' అక్కడ గుడి కట్టి తీరాలని శాసిస్తున్నదా లేదా అన్నది కూడా కాదు ప్రశ్న. మన దేశం భిన్నమతాలూ జాతులూ కలిసి పరస్పర గౌరవంతో సహజీవనం చేసే సమాజంగా రూపొందాలని కోరుకుంటున్నామా, లేదా సంఖ్యాబలం ఉండి రౌడీయిజం చేయగలవారు ప్రకటించుకునే 'సెంటిమెంట్ల'కు తక్కిన వారంతా లోబడి బతికే ఫాసిస్టు సమాజం ఇక్కడ నెలకొనాలనుకుంటున్నామా అన్నది ప్రశ్న.

ఈ ప్రశ్నకు సంఘ్‌పరివార్ సమాధానం స్పష్టంగానే ఉంది. మరి మన సమాధానం?

వాళ్లను ఎట్లాగయినా బుజ్జగించి, బుదగరించి ఈసారికి శిలాన్యాస్ కార్యక్రమం వాయిదా వేసుకొమ్మని వేడుకుందామా? బాబ్రీమసీదు ఒకనాడు నిలబడి ఉన్న 'వివాదాస్పద' స్థలాన్ని మినహాయించి తక్కిన స్థలాన్ని వారికి అప్పగిస్తే తప్పేముంది అందామా? అక్కడ వాళ్ళను మార్చి 15న పూజలు చేసుకోనిచ్చేస్తే ప్రస్తుతానికి సంక్షోభం చల్లారుతుందని ఆశించే బలహీనతకు లోనవుదామా? ప్రభుత్వం ఇప్పుడు ఆ నిర్ణయానికే వచ్చినట్టుంది. మనం ఒప్పుకుందామా?

వీళ్ళు ఈ రోజు కొంచెం ఇస్తే రేపు ఇంకొంచెం అడిగే బాపతు తప్ప అన్యాయమైన తమ లక్ష్యాన్ని వదులుకునే బాపతు కాదు. అయినా, ఈ రోజు ఒక సంఘ్‌పరివార్ సంస్థ 'ఇక్కడితో మేము సంతృప్తి చెందుతాము' అని మొహమాటానికో దేనికో ప్రకటించినా రేపు దానిని అతిక్రమించడానికి ఇంకొకటి పుడుతుంది. 'మేము ఏ హామీ ఇయ్యలేదు కదా' అంటుంది.

భారతీయ జనతా పార్టీ పేరు మీద చేయలేని పనులు ఆర్ఎస్ఎస్ పేరుమీద, ఆర్ఎస్ఎస్ పేరుమీద చేయలేని పనులు విశ్వహిందూ పరిషత్ పేరుమీద, విశ్వహిందూ పరిషత్ చేయలేని పనులు బజరంగ్‌దళ్ పేరుమీద, బజరంగ్‌దళ్ పేరుమీద చేయలేని పనులు హిందూ వాహిని పేరుమీద.... రోజుకొక సంస్థను పుట్టించి పాతవాటి 'మర్యాద' నిలుపుకుంటూ కొత్త దౌర్జన్యాలు చేయడం అద్వానీ రథయాత్ర కాలంనుండి మనం చూడడం లేదా?

హైందవం పేరుమీద వీళ్లు చేస్తున్న ఆగడాలనూ, వీళ్లు దేశంలో నిలబెట్టదలచుకున్న సంస్కృతినీ తమను తాము హిందువులుగా భావించుకునే వారిలో మెజారిటీ సహితం సమర్థిస్తున్న దాఖలాలు లేవు. అదే నిజమైతే వీరి రామభక్తి ప్రదర్శనకు కేంద్రమైన ఉత్తరప్రదేశ్‌లో బిజెపికి ఉన్న అధికారం ఊడిపోయేది కాదు. బిజెపినీ, హిందూత్వవాదాన్నీ నిర్ద్వంద్వంగా వ్యతిరేకించే విషయంలో (వేరే ఏ విషయంలో ఎన్ని లోపాలున్నా) నిక్కచ్చిగా నిలబడే ములాయంసింగ్‌కు అత్యధిక సీట్లు వచ్చేవి కావు. అయినా వీధి రౌడీల బలం, దానికి పాలకుల అండ ఉన్నవారికి ప్రజాబలం ఎందుకు?

ప్రజాబలం కావలసింది ప్రజాస్వామ్యానికి. భారతదేశాన్ని భిన్న మతాలు, సంస్కృతుల కలయికగా నిలబెట్టాలనీ, అన్ని మతాలూ సంస్కృతులలోని అప్రజాస్వామిక సంప్రదాయాలను తొలగించి ప్రజాస్వామ్య సంస్కృతిని నిలబెట్టాలనీ విశ్వసించే వారంతా ఒకటి కావాలి. ఈ ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రజలలో బలంగా ప్రచారం చేయాలి.

దురదృష్టవశాత్తు, దౌర్జన్యానికి దౌర్జన్యమే జవాబనే తప్పుడు విశ్వాసంతో గోద్రా దారుణకాండకు ముస్లింల రక్షకులుగా తమను తాము భావించుకునేవారు పాల్పడ్డారు. ఒకవేళ ముస్లింల బాగే వారు కోరుకున్నా, వేరే ఏ మంచిచెడులూ చూడమని వాదించినా, దేశంలో మారుమూల ఊర్లలో కొద్ది కుటుంబాలుగా బతికే ముస్లింలను ప్రతీకార హింసకు బలిచేయడం తప్ప వారు సాధించేదేమీ లేదు.

## *అయోధ్యలో ఏ కరసేవా జరగనక్కరలేదు...జరగనివ్వొద్దు*

గుజరాత్ వంటి రాష్ట్రాలలో ముస్లింలనసలు దేశ పౌరులుగానే చూడడానికి ఇష్టపడని అధికార యంత్రాంగం ఉన్నచోట బిక్కుబిక్కుమంటూ బతికే ముస్లిం కుటుంబాలకు ఈ రక్షకులు, జిహాదీలు కల్పించే రక్షణ ఏమిటి? ఏమీ లేదనేది గోధ్రా దౌర్జన్యకాండ తరువాత ఒక వారంరోజులపాటు ఆ రాష్ట్రంలో జరిగిన అమానుషమైన మారణకాండ సూచిస్తుంది. కొంతమంది నిరాయుధులను చంపి, మరికొంతమందిని బలిపశువుల్ని చేయడం తప్ప మెజారిటీ పేరుమీద నడిచే దౌర్జన్యానికి మైనారిటీ పేరుమీద నడిచే దౌర్జన్యం జవాబని నమ్మేవారు సైతం సాధించేదీ సాధించిందీ ఏమీలేదు.

ఇటువంటి దుస్సాహసాలను నిర్ద్వంద్వంగా వ్యతిరేకిస్తూ, సంఘ్‌పరివార్ ఫాసిజం నుండి మన సమాజాన్ని కాపాడుకోవడం కోసం విస్తృత ప్రజా చైతన్యాన్ని పెంపొందించాలి. ఇది కేవలం మైనారిటీల సమస్య కాదనీ, ప్రజాస్వామ్యాన్ని సామాజిక రాజకీయ వ్యవస్థలలో కాపాడుకోవడానికి ఈ కృషి అవసరమనీ గుర్తించాలి. ఇదే శక్తులు మండల్ కమిషన్‌ను వ్యతిరేకించిన సంగతి, రాజస్థాన్‌లో 'సతి'ని సమర్థించిన సంగతి, 19వ శతాబ్దపు వారణాసిలో వితంతువుల వాస్తవ జీవిత పరిస్థితులపైన దీపా మెహతా తీయతలపెట్టిన సినిమాను బలప్రయోగంతో అడ్డుకున్న సంగతి, 'పోటో'ను దేశంపైన బలవంతంగా రుద్దిన సంగతి, పాకిస్తాన్ ఆటగాళ్లూ పాటగాళ్లూ ఇండియాకు వస్తే ఆటస్థలాన్నీ పాటస్థలాన్నీ పేల్చేస్తామని బెదిరించి ఆపించిన సంగతి, అనవసరంగా అణుబాంబు పేల్చి భారత – పాకిస్తాన్‌ల సంబంధాలను మరింత వేడి ఎక్కించిన సంగతి, కాంగ్రెస్ వారు పదేళ్ల కింద సరళీకరణ విధానాలు ప్రవేశపెట్టినప్పుడు 'యాభై ఏళ్ళ నుండి మేము చెప్తున్నది మీరిప్పుడు కాపీ కొడుతున్నారు' అన్న సంగతి – మరచిపోకూడదు.

మార్చి 15న అయోధ్యలో ఏమీ జరగనక్కరలేదు, ఏమీ జరగనివ్వకూడదు. రాముడి మీద నిజంగా భక్తి ఉన్నవారు ఎవరి ఇళ్ళలో, ఎవరి ఊళ్ళలో వారు ఆ దేవుడిని పూజించుకోవచ్చు. రాముడికి గుడిలేని ఊరేది, గ్రామమేది ఈ దేశంలో? పండితులు, సంత్‌లు, శంకరాచార్యుల కంటే సగటు భారతీయులకు ఎక్కువ విజ్ఞత ఉందనే మేము నమ్ముతున్నాం. తలా ఒక చెయ్యివేసి కరసేవ చేయదలచుకుంటే సంఘ విధ్వంసక కార్యక్రమాల బదులు నిర్మాణాత్మక కార్యక్రమాలూ, ప్రజలను మంచికోసం సంఘటితపరిచే పనులూ చాలా ఉన్నాయి. ఈ విషయం ప్రకటించి మనం మన విజ్ఞతను చాటుకుందాం.

# సంఘ్ పరివార్‌ను గట్టిగా ఎదుర్కోవడం అవసరం

సంఘ్ పరివార్‌ను దేశంలో ప్రజాస్వామ్యానికి ప్రధాన శత్రువుగా ప్రకటించే రోజు వచ్చింది. సిద్ధాంతరీత్యా ఈ అభిప్రాయం హక్కుల ఉద్యమంలో పనిచేసే వారిలో చాలా మందికి ముందునుండి వుంది. కానీ ఇప్పుడు వారి ఆచరణతో వారే ఈ సత్యాన్ని ప్రకటిస్తున్నారు.

దేశంలో విశాల భూభాగాన్ని వారి రౌడీమూకలిప్పుడు నిరాఘాటంగా ఏలుతున్నాయి. అన్ని నాగరికతా నియమాలకు విరుద్ధంగా, అన్ని ప్రజాస్వామిక విలువలకు వ్యతిరేకంగా ఏలుతున్నాయి. వేరే ఎవరైనా ఈ సాహసం చేస్తే పోలీసు కాల్పులనూ తెల్లబట్టల సమాజం విమర్శనూ ఎదుర్కోవలసి వస్తుంది. కానీ ఈ కాషాయం రౌడీలమీద లాఠీలు, తుపాకులు ఎక్కుపెట్టడానికి పోలీసులకూ పారామిలిటరీకీ చేతులు రావడం లేదు. మేధావులు అని పిలవబడే వారిలో వీరిని విమర్శించేవారు కొద్దిమందైతే వీరి రౌడీయిజాన్ని సమర్థిస్తూ మాట్లాడేవారే ఎక్కువయ్యారు. ప్రభుత్వాలు వీరివైన రాష్ట్రాలలోనే కాదు, కాని రాష్ట్రాలలో కూడ వీరి ఆగడాలు యథేచ్ఛగా సాగుతున్నాయంటే వీరిపట్ల 'సాఫ్ట్‌కార్నర్' అధికారగణంలోనూ మర్యాదస్తుల 'సభ్య సమాజం'లోనూ ఎంతగా పెరిగిందో అర్థం అవుతుంది.

అయినా, అధికారగణం వీరిని అణచివేయడం ఈ దౌర్జన్యానికి పరిష్కారం అని మేము భావించడం లేదు. ప్రజలు ప్రజాస్వామ్య స్ఫూర్తితో వీరి అనాగరిక ఆలోచనా రీతినీ, నడవడికనూ తిరస్కరించడం అవసరం. నిజానికి ఒక దశాబ్ద కాలంగా ద్వేషాన్ని రెచ్చగొట్టీ రెచ్చగొట్టీ వీళ్ళు సాధించిన 'ప్రజాబలం' స్వల్పమేగానీ, అధికార యంత్రాంగం సహాయ సహకారాల వల్ల వీరు విచ్చలవిడిగా చెలరేగగలుగు తున్నారు. వీరికున్న కొద్దిపాటి బలాన్నీ, అధికార యంత్రాంగం అందిస్తున్న సహకారాన్నీ కలిపి ఎదుర్కొనే ప్రజాస్వామిక శక్తిని మనం పెంపొందించుకోవడం అవసరం.

---

మానవహక్కుల వేదిక ఐదవ బులెటిన్ సంపాదకీయం, 26.3.2002.

## *సంఘ్ పరివార్‌ను గట్టిగా ఎదుర్కోవడం అవసరం*

తాలిబన్లు ఆఫ్ఘనిస్తాన్‌లో బుద్ధుడి విగ్రహాలనొక పథకం ప్రకారం పేల్చేసినందుకు నాగరికతను ప్రేమించే వాళ్లంతా అసహ్యించుకోగా, తగుదునమ్మా అంటూ అద్వానీ వంటి వారు కూడా మనతో గొంతు కలిపారు. విగ్రహాలను పనిగట్టుకొని పేల్చివేయడం అనాగరికమైతే, మనుషులను సజీవంగా దహనం చేయడాన్ని ఏమనాలి? ఒకరిని కాదు, ఇద్దరిని కాదు, కనీసం వెయ్యి మందిని గుజరాత్‌లో నిస్సహాయులను చేసి పోలీసులు చోద్యం చూస్తుండగా నరికి చంపారు. తగలబెట్టి చంపారు. అధికారం తమ చేతిలో వుండడాన్ని ఆసరా చేసుకొని తాము రక్షించవలసిన పౌరులను తమ వారి చేతనే ఊచకోత కోసి చంపించారు.

రెండేళ్ల కింద ఆగస్ట్ 28న హైదరాబాద్‌లో ఏం జరిగిందో జ్ఞాపకం వుంది కదా? ప్రజలందరికీ – వర్గాలతో నిమిత్తం లేకుండ – ఆందోళన కలిగించిన కరెంటు చార్జీల పెంపుదలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు ఊరేగింపు తీస్తే వారిని అసెంబ్లీ దరిదాపులకు రానీయకుండ బ్యారికేడ్లు కట్టి ఆపారు. బ్యారికేడ్లు దాటి ముందుకొస్తారేమోనన్న అనుమానం వచ్చిన క్షణం కాల్పులు జరిపారు. లాఠీలతో కొట్టారు. నలుగురిని చంపారు.

ఇంకా కొంతకాలం ముందు నాగపూర్‌లో ఒక ఆదివాసీ తెగకు చెందినవారు అసెంబ్లీ సమావేశం జరుగుతుండగా ఊరేగింపు తీసారు. తమ తెగపేరు ఎస్.టి జాబితా నుండి తీసేయడాన్ని నిరసిస్తూ ముఖ్యమంత్రికి విజ్ఞాపన పత్రం సమర్పించే ఉద్దేశ్యంతో ఊరేగింపు తీశారు. అధికార యంత్రాంగం అసెంబ్లీకి ఒకటి రెండు కిలోమీటర్ల దూరాన బ్యారికేడ్లు కట్టింది. బ్యారికేడ్ల దగ్గరికి గుంపుగా వచ్చిన ఆదివాసులను నిలువరించారు. వెనుక నుండి జనం తోసుకురావడం వల్ల బ్యారికేడ్ల దగ్గర తొక్కిసలాట జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేసి జనాన్ని చెదరగొట్టి తొక్కిసలాటను తీవ్రతరం చేశారు. ఆ రోజు కనీసం వంద మంది చనిపోయారు.

ఇటువంటి ఘటనలు – ఇన్ని ప్రాణాలు అన్ని సందర్భాలలోనూ పోకపోవచ్చునుగాక – సుపరిచితమే. అసెంబ్లీ లేక పార్లమెంటు దరిదాపులకు ఊరేగింపు తీయడం సాధ్యంకాదని మనకందరికీ తెలుసును. కానీ మొన్న ఒరిస్సా రాజధాని భువనేశ్వర్‌లో ఏమయింది? అసెంబ్లీలో ఎవరో ఒక ఎమ్మెల్యే సంఘ్‌పరివార్‌ను విమర్శిస్తూ మాట్లాడాడని చెప్పి సంఘ్‌పరివార్ గూండాల మూక

అసెంబ్లీపైన దాడిచేసి బీభత్సం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి వున్నట్టు, నాగపూర్ అసెంబ్లీకి వున్నట్టు, ఒరిస్సా అసెంబ్లీకి కూడ సెక్యూరిటీ వుంది. సాయుధ పోలీసు పహారా వుంది. అసెంబ్లీ దరిదాపులలో ఎవరూ ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించడానికి వీలులేదన్న నియమం వుంది. అదేదీ సంఘ్‌పరివార్ దాదాగిరీకి అడ్డం రాలేదు. అడ్డం రావద్దని ఎవరైనా ఆదేశం ఇచ్చారో, లేక హిందూత్వం పేరు మీద జరిగే దౌర్జన్యానికి పెరిగిన ఆమోదం ఆపిందో తెలీదు.

బెంగుళూరు సమావేశంలో ఆర్ఎస్ఎస్ అధినేతలు ముస్లింలను బెదిరించిన విషయం చర్చకొచ్చింది గానీ వారికి బలం వున్న ప్రాంతంలో ఇది చాలా కాలంగా మౌనంగా సాగుతూనే వుంది. 'మా కాళ్లమీద పడితేనే మీరు క్షేమంగా వుంటారు' అన్న సంకేతం ముస్లింలకు వారి నుండి ఎప్పుడో అందింది. మహారాష్ట్రలో ముస్లింలు ఎక్కువగా నివసించే ప్రాంతాలలో వాళ్లే శివసేనకు ఓట్లువేసి బాల్‌థాకరే అపార్థం చేసుకోకుండా జాగ్రత్తపడుతూ 'క్షేమంగా' బతుకుతున్నారు.

ఈ మాత్రం దాదాగిరీ వేరే ఎవ్వరూ చేయలేక కాదు. వృత్తి రౌడీలకు అవకాశం ఇస్తే ఇంతకంటె సమర్థంగా చేయగలరు. వీరికి సాగుతున్నది కాబట్టి రెచ్చిపోయి చేస్తున్నారు. సాగుతుండడానికి గల రాజకీయ కారణాన్ని గుర్తించడం సులభమే, విమర్శించడమూ సులభమే. సంఘ్ పరివార్ రాజకీయ ముఖమైన బిజెపి కేంద్రంలో అధికారంలో వుంది. ఆ పార్టీతో కేంద్రంలో చెలిమి వున్న పార్టీలు ఇక్కడొక రాష్ట్రాన్నీ అక్కడొక రాష్ట్రాన్నీ ఏలుతున్నాయి. అటువంటి వారిని ఏమనడానికీ అధికార యంత్రాంగానికి చేతులాడవు.

కానీ అంతకంటే లోతయిన కారణమూ వుంది. భారతదేశం లౌకికవాదాన్నీ ప్రజాస్వామ్యాన్నీ ఎంచుకోవడం వల్ల 'హిందువులకు' ఏదో అన్యాయం జరిగిపోయిందని నమ్మేవాళ్లు ఈ దేశంలో ఇప్పుడు చాలామంది వున్నారు. వారంతా కాషాయాంబరధారులూ కాదు, ఖాకీ నిక్కరు యోధులూ కాదు. ఇతరత్రా ఆధునికులుగా కనిపించే వారిలో చాలామంది ఈ రకమైన అభిప్రాయాలు కలిగి వున్నారు. వాళ్లు పాకిస్తాన్‌నూ సౌదీ అరేబియానూ చూసి నిట్టూర్పులు విడుస్తుంటారు. ఇస్లాం పేరు మీద నడిచే అతివాదాన్ని గట్టిగా ఎదుర్కొంటున్న ఇండోనేషియా, టర్కీ, ఈజిప్టు వంటి ముస్లిం మెజారిటీ దేశాలను వారు చూడరు.

వారు ఇండియాను పోల్చుకొని బాధపడేది పాకిస్తాన్‌తో, సౌదీ అరేబియాతో, ఇరాన్‌తో మాత్రమే.

ఇంతదూరం పోయేవారు ఎక్కువ మంది లేకపోవచ్చును గానీ, లౌకికవాదాన్ని భారత్ ఎంచుకోవడం వల్ల 'దెబ్బతిన్న' హిందువుల ప్రయోజనాలు బజరంగ్‌దళ్ రూపంలోనూ, విశ్వహిందూ పరిషత్ రూపంలోనూ, ఆర్ఎస్ఎస్ రూపంలోనూ 'కాపాడబడటం' సానుభూతితో 'అర్థం చేసుకోవలసిన' విషయం అని నమ్మేవారు చాలామంది తయారయ్యారు. వీరు అధికార యంత్రాంగంలో వున్నారు. ప్రొఫెసర్లలో వున్నారు. పత్రికా సంపాదకులలోనూ వున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఎదుర్కోవలసింది ఈ మెతక వైఖరిని. లౌకికవాదాన్ని భారత్ ఒక విధానంగా ఎంచుకోవడం వల్ల దేశానికి చాలా మేలే జరిగింది తప్ప నష్టం జరగలేదు. కేవలం ముస్లింలకూ క్రైస్తవులకే కాదు, 'హిందువులు' అని పిలవబడే వారిలో మెజారిటీకి – స్త్రీలకు, దళిత బహుజన కులాలకూ కూడా మేలే జరిగింది. అదే లేకపోతే ఆ ప్రజానీకమంతా కూడా సంప్రదాయక హైందవ సంస్కృతి పిడికిట్లో నలుగుతుండేవారు. కొంతమేరకైనా ఆ అణచివేత నుండి బయట పడగలిగారంటే లౌకికవాద స్ఫూర్తితో రాజ్యాంగం సమానతా హక్కులూ అవకాశాలూ ఇవ్వడమే దానికి కారణం. ఇంకా సంపూర్ణంగా ఆ హక్కులకూ అవకాశాలకూ – ముఖ్యంగా స్త్రీల విషయంలో – వ్యవస్థిత రూపం ఇవ్వలేదన్నది ఫిర్యాదవుతుంది గానీ ఆ మాత్రం సమానతా అవకాశాలు వుండడం 'హిందువులకు నష్టకరం' అనేది అర్థరహితమయిన ఫిర్యాదు. ఇస్లాం పేరుమీద లౌకికవాదాన్ని తిరస్కరించిన దేశాలలో ప్రధానంగా నష్టపోయింది ముస్లిం స్త్రీలే కదా?

'హిందువులు' నష్టపోయారు, 'హిందువుల' ప్రయోజనాలు దెబ్బతిన్నాయి మొదలయిన ఫిర్యాదులలో 'హిందువులు' అంటే అర్థం హైందవ పెత్తందారీ కులాలు, అందులోనూ మగవాళ్లు అని. ఈ విషయాన్ని స్పష్టంగా అర్థం చేసుకున్నప్పుడు హిందూత్వవాదుల ఆగడాల పట్ల చాలామంది అనాలోచితంగా ప్రదర్శిస్తున్న మెతక వైఖరికి సహేతుకమైన కారణమేమీ లేకపోగా, అది ముస్లింలకూ, క్రైస్తవులకే కాక ఈ దేశంలోని అత్యధిక మెజారిటీ ప్రజానీకానికి హానికరం అని గుర్తించగలుగుతాం.

# హిందూత్వవాదుల ద్వేషం ఎవరి మీద?

మహమ్మద్ ఇల్యాస్ హుసేన్ సిభాయి గుజరాత్‌లోని పంచ్‌మహల్స్ జిల్లాలోని లూనావాడ్ గ్రామ నివాసి. మార్చి నెలలో జరిగిన నరమేధంలో విపరీతంగా హింస చవిచూసిన గ్రామాలలో లూనావాడ్ ఒకటి. ఆ ఊరి పరిసరాలలో 15 మసీదులను హిందూత్వవాద మూకలు ధ్వంసం చేసాయి. ఆ ఊరిలోని శరణార్థుల శిబిరంలో పరిసర గ్రామాల ముస్లింలు 1200 మంది ఉన్నారు. ఆ ఊరి కబ్రస్తాన్‌లో 14 శవాలు పూడ్చారు.

మహమ్మద్ సిభాయి వృత్తిరీత్యా లెక్కల పంతులు. అయితే అతనికి సంస్కృతమంటే చాలా ఇష్టం. సంస్కృతంలో 'ఆచార్య' పట్టా పొందాడు. సంస్కృతం పాఠాలు బోధించేవాడు. హిందూ పురాణాలు, ఇతర సంస్కృత సాహిత్య గ్రంథాలతో నిండిన గ్రంథాలయాన్ని కూడా నెలకొల్పాడు. సులభంగా దొరకని అనేక ప్రాచీన సంస్కృత గ్రంథాలు అందులో ఉండేవి.

ఈ సంగతి లూనావాడ్‌లోనే కాక ఆ ప్రాంతమంతటా కూడ అందరికీ తెలుసును. అయితే ముస్లింలకు సంబంధించిన ఏ నివాసాన్నీ నిర్మాణాన్నీ ఉండనివ్వొద్దని నిర్ణయించుకున్న సంఘ్ పరివార్ మూకలు మహమ్మద్ సిభాయి ఇంటిపైన కూడా దాడి చేసారు. అతను తప్పించుకొని పారిపోగా, అతని సంస్కృత గ్రంథాలయాన్ని అవశేషం లేకుండా తగలబెట్టారు.

అహమ్మదాబాద్‌కు చెందిన ఎహసాన్ జాఫ్రి ఒకప్పుడు సిపిఐలోనూ ఆ తరువాత సిపిఐ(ఎం) లోనూ ఉన్నాడు. 1969 లో ఆ నగరంలో పెద్దఎత్తున మత ఘర్షణలు జరిగిన తరువాత తన రక్షణ కోసం కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అయితే కమ్యూనిస్టు అన్న ముద్ర అతనిని వదలలేదు. వదిలించుకోవాలని అతను అనుకోలేదు. వామపక్ష భావాలు గల లౌకికవాదిగానే ఉండిపోయాడు. సనాతన ముస్లింలు అతనిని అనుమానంగానే చూసారు. 'ముస్లింలు సనాతనవాదుల పిడికిట్లో నుంచి బయటపడి లౌకిక రాజకీయాలలోకి రావాలన్నదే మన కోరికయితే

వార్త దినపత్రిక, 21.5.2002

జాఫ్రీని మించిన నాయకుడు దొరకడు' అని గుజరాత్‌లో ఇప్పటికింకా మతిస్థిమితం కోల్పోని వారంతా అంటారు.

ఫిబ్రవరి 28న మాజీ ఎం.పి. అయిన జాఫ్రిని సంఘ్ పరివార్ మూకలు అతిక్రూరంగా చంపారు. చమన్‌పురాలోని గుల్బర్గ్ సొసైటీలోని అతని ఇంటిపైన పెద్ద గుంపు దాడి చేసింది. అతనిని బయటకు లాగి చేతివేళ్లు తెగనరికి బట్టలు ఊడదీసి గుండ్రంగా పరుగెత్తించి కత్తులతో నరికి రోడ్డు మీద ఈడ్చుకుపోయి మంటలలో పడేసి హతమార్చారు. అతనెవరో, అతని ఆలోచనలెట్లాంటివో అతనిని హతమార్చిన వారికి బాగానే తెలుసు. అతను కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ పార్లమెంటు సభ్యుడు. అతనిని చంపిన వారు స్థానిక సంఘ్‌పరివార్ కార్యకర్తలు. అపరిచితులు కారు, అతని గురించి తెలియనివారు కారు.

జె.ఎస్. బందూక్‌వాలా బరోడా నగరానికి చెందిన మేధావి. పి.యు.సి.ఎల్ (పౌరహక్కుల ప్రజాసంఘం) గుజరాత్ రాష్ట్ర కమిటీ సభ్యుడు. చాలా చదువుకున్న వాడు, ఆధునికుడు, లౌకికవాది. దేశంలో మత ఘర్షణల వాతావరణం తగ్గడానికి ఉపయోగపడేటట్టయితే ముస్లింలు బాబ్రీమసీదును వదులుకోవడమే ఉచితం అని బహిరంగంగా ప్రకటించిన వ్యక్తి. ప్రకటించి బాబ్రీమసీదు యాక్షన్ కమిటీకి కోపం తెప్పించిన వ్యక్తి. ఫిబ్రవరి 28న అతని ఇంటి బయట ఉన్న అతని కారును సంఘ్ పరివార్ మూకలు తగలబెట్టగా, బందూక్‌వాలా స్థానిక బిజెపి కార్పొరేటర్ ఇంటికి వెళ్ళి 'నేనెటువంటివాడినో మీకు తెలుసు - ఇదేం పని?' అని అడిగాడు. 'అప్పుడే ఏం చూసావు- అసలు సంగతి రేపు ఉంది. తప్పించుకోగలిగితే తప్పించుకో' అని ఆ మహానుభావుడు అన్నాడు. తన భావాల గురించి, వ్యక్తిత్వాన్ని గురించి ఆత్మవిశ్వాసం ఉన్న బందూక్‌వాలా ఎక్కడికీ పోలేదు. అయితే మరుసటి రోజు ఆయన బెదిరించినట్టుగానే తల్వార్లు, త్రిశూలాలతో పెద్ద గుంపు అతని ఇంటిమీదికి వచ్చింది. అతనూ, అతని భార్యా, కూతురూ తలుపులు లోపలినుండి గడియబెట్టి పెరటిగోడ దూకి పక్కన ఉన్న హిందూ కుటుంబం ఇంట్లోకి పోయారు. వాళ్లు లైట్లు ఆపేసి ఎవరూ లేనట్టు అభిప్రాయం కలిగించి ఆ రాత్రంతా బిక్కు బిక్కుమంటూ గడిపారు. బందూక్‌వాలా ఇంటిమీద దాడిచేసిన మూక కొన్ని గంటలసేపు ఆ ఇంటిని లూటీచేసి ఆ తరువాత మొత్తం

తగలబెట్టి బుగ్గిచేసి వెళ్లిపోయారు. భారత ప్రజాస్వామ్యంమీద ఆ దెబ్బతో విశ్వాసం కోల్పోయిన బందూక్‌వాలా ఇండియా వదిలిపెట్టి సకుటుంబంగా వెళ్లిపోయాడు– పాకిస్తాన్‌కు కాదు అమెరికాకు.

సబర్‌కాంత జిల్లాలో రామాయణ్–మహాభారత్ అన్న పేరుగల ముస్లిం శరణార్థుల శిబిరం ఒకటి ఉంది. ముస్లింల శిబిరానికి అదేం పేరని ఆశ్చర్యపోతున్నారా? ఆ శిబిరంలోని శరణార్థులు రెండు గ్రామాలకు చెందినవారు. అవి రెండూ ముస్లింలు అత్యధికంగా నివసించే గ్రామాలు. ఒక దానిపేరు రామాయణ్, ఒకదానిపేరు మహాభారత్. ఈ పేర్ల వెనుక ఒక కథ ఉంది. ఇవి రెండూ ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలు. ఒక ప్రాజెక్టు కింద మునిగిపోతున్న రెండు గ్రామాల ప్రజలకు పునరావాసం కల్పిస్తూ రెండు కొత్త గ్రామాలు నిర్మించారు. కొత్త గ్రామాలకు పాత పేర్లే ఎందుకు పెట్టుకోవాలి, కొత్తవి పెట్టుకుందాం అని నిర్వాసితులు భావించారు. వారికి పునరావాసం కల్పించే క్రమంలో వారితో కలిసి మెలిసి తిరిగిన ఒక ప్రభుత్వ అధికారి ఆ ఊర్లకు రామాయణ్, మహాభారత్ అని పేర్లు పెడదాం అని సూచించాడు. దానికి కారణం ఏమిటంటే, అధికంగా ముస్లింలయిన ఆ గ్రామస్తులు టీవీలో ప్రసారమయ్యే హిందూ పురాణగాథల సీరియల్స్ పట్ల చాలా ఆసక్తి చూపడం అతను గమనించి ఉన్నాడు. అతను నవ్వుతూ చేసిన ఈ సూచనను ఆ గ్రామస్తులు సరదాగానే స్వీకరించారు. రామాయణ్, మహాభారత్ అనే ముస్లిం గ్రామాలు ఆ విధంగా పుట్టాయి. ఈ సంవత్సరం మార్చి నెలలో ముస్లింల ఆవాసాలను హిందూత్వవాద మూకలు అగ్నికి ఆహుతి చేసిన క్రమంలో ఈ రెండు గ్రామాలను కూడా తగలబెట్టగా, మళ్ళీ నిర్వాసితులైన ఆ వందలాది ముస్లిం కుటుంబాలు బరోడా తాలూకాలోని సిబ్లా గ్రామంవద్ద శరణార్థుల శిబిరం ఏర్పరచుకుని దానికి కూడా మళ్ళీ 'రామాయణ్– మహాభారత్' అనే పేరు పెట్టుకున్నారు.

మహమ్మద్ హసన్ జౌహర్ అహ్మదాబాద్‌కు చెందిన ఒక ఐటి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్. ఒకప్పుడతను దేశంలోని బ్యాంకింగ్ రంగంలో అత్యున్నత పదవులు నిర్వహించాడు. ప్రస్తుతం ఒక స్వంత ఐటి సంస్థ పెట్టుకున్నాడు. అతను నిజానికి హైదరాబాద్ పాతబస్తీకి చెందినవాడు. పదహారేళ్లుగా అహమ్మదాబాద్‌లో

ఉంటున్నాడు. గుజరాతీ ముస్లిం స్త్రీని పెళ్లి చేసుకున్నాడు. భార్యాభర్తలిద్దరూ ఆలోచనలలో చాలా ఆధునికులు. 'సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ రేషనల్ థాట్' అనే హేతువాద సంస్థ నడుపుతారు. వారి కుమారుడికి ప్రవక్త మహమ్మద్‌కు పూర్వమైన పశ్చిమ ఆసియా సంప్రదాయానికి చెందిన 'అరస్తు' అనే పేరు పెట్టుకున్నారు. ముస్లింలుగా కాక ప్రపంచ పౌరులుగా బతకాలన్న కాంక్షతో ఎప్పుడూ ముస్లిమేతరుల మధ్యనే బతికేవారు. కానీ అహమ్మదాబాద్‌లో మత ఘర్షణలు జరిగినప్పుడు హిందూ ప్రాంతాలలో హిందువుల మధ్య బతికే ముస్లింలను పొడిచి చంపడం వారు చూస్తున్నారు. ఇది కాకతాళీయంగా జరగడం లేదనీ ఉద్దేశపూర్వకంగా జరుగుతున్నదనీ అర్థం చేసుకున్నారు. కొద్దికొద్దిగా ముస్లింలు నివసించే కాలనీలకు దగ్గరగా రాసాగారు. 1993లో మతఘర్షణలు జరిగినప్పుడు జౌహర్ కారుమీద 'మియాను నరుకుతాం' అని రాసారు. మొన్నటి మార్చి 1వ తేదీన కత్తులూ త్రిశూలాలూ పట్టుకున్న మూక అతని కార్యాలయంపైన దాడిచేయగా తృటిలో తప్పించుకున్నాడు. అతని పక్క కార్యాలయంలోని అతని మేనమామ వరస అయిన ముసలాయన కత్తిపోట్లకు గురయి చనిపోయాడు. తనను పరిహసించిన లౌకికవాద విశ్వాసాన్ని వదిలిపెట్టి తాను పరిహసించిన సనాతనవాదం సరసన పాతబస్తీలో ఇల్లు తీసుకొని ఉందామని ఇప్పుడు జౌహర్ బాధపడుతూ నిర్ణయించుకున్నాడు.

గుజరాత్ ఐఎఎస్ కేడర్‌కు చెందిన ఇద్దరు చిన్ననాటి మిత్రులు రిటైర్ అయిన తరువాత పక్కపక్క అపార్టుమెంట్లు కొనుక్కుని శేషజీవితం గడుపుదామనుకున్నారు. వారిలో ఒకరు హిందువు, ఒకరు ముస్లిం. అయితే వారు ఎంత ప్రయత్నం చేసినా ఒకే బిల్డింగ్‌లో ఇద్దరికీ ఫ్లాట్లు అమ్మడానికి ఏ బిల్డరూ ఒప్పుకోలేదు. హిందూ బిల్డర్లు, బిల్డింగ్ సొసైటీలూ ముస్లింలకు ఫ్లాట్లు అమ్మరు. ముస్లింలవి కొత్త సొసైటీలు లేవు. ఆరునెలలు చెప్పులరిగేలా మిత్రులిద్దరూ అహమ్మదాబాద్ మొత్తం తిరిగారు. మేము ఐఎఎస్ ఆఫీసర్లం. మా హోదా చూసయినా అమ్మరా? అని అడిగారు. 'మాకేం అభ్యంతరం లేదు. కానీ వాళ్లతో గొడవెవరు పెట్టుకుంటారు చెప్పండి' అని బిల్డర్లూ సొసైటీలూ సాకులు చెప్పాయి. 'వాళ్ళు' అంటే గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా మార్చుకున్న హిందూత్వవాదులు.

చివరికి విసిగిపోయిన ఆ బాల్యమిత్రులిద్దరూ, 'మన నగరానికి ఏం గతి పట్టింది చూడండి' అని పత్రికలకు జంటగా ఒక ఉత్తరం రాసి తమ ప్రయత్నం విరమించుకున్నారు. ఆ ఉత్తరాన్ని ఆంగ్ల పత్రికలే తప్ప ఏ గుజరాతీ పత్రికా ప్రచురించలేదు.

హిందూత్వవాదుల కోపం ఎవరిమీద? వారికి ఏం కావాలి? మాట్లాడితే జిహాద్ గురించి, ముస్లిం మతవాదం గురించి ఆవేశపడతారుగానీ వాళ్లు నిజంగా సహించలేనిది ముస్లింలనే, ముస్లిం మతవాదాన్ని కాదు. వాళ్లు వ్యతిరేకించేది ముస్లిం మతవాదాన్నయితే ముస్లింలలో ఆధునికులను వారు ఆదరించాలి. ఉదారవాదులనూ లౌకికవాదులనూ స్నేహితులుగా భావించాలి. హిందువులతో కలిసిమెలిసి బతికే వారిని గౌరవించాలి. అప్పుడు ఒక ఎహసాన్ జాఫ్రి, ఒక బందూక్‌వాలా, ఒక మహమ్మద్ హసన్ జౌహర్ వారి దాడులకు గురయ్యే వారు కారు. కానీ హిందూత్వవాదులు ఈ దేశంలో ముస్లింలు ఉండడాన్నే సహించలేరు. అందుకే హిందువులతో ముస్లింలు కలవడం వారికి ఇష్టముండదు. హిందూ ముస్లిం వివాహాలను వారు అసలే సహించరు (గుజరాత్‌లో అటువంటి జంటలను హతమార్చడం, బలవంతంగా వేరుచేయడం జరిగింది). లౌకికవాదులు, ఆధునిక వాదులు, కమ్యూనిస్టులు అయిన ముస్లింలను వారు అసలే సహించరు. ఎందుకంటే వారిని ఎందుకు ద్వేషిస్తున్నారో చెప్పలేరు కాబట్టి.

ముస్లింలు సనాతనవాదం పిడికిలి నుండి బయట పడాలని హిందూత్వ వాదులు కోరుకోరు. వారంతా సనాతనవాదులుగానే ఉండి హిందూత్వవాదుల ద్వేషాన్ని సహేతుకమైనదిగా రుజువు చేయాలని కోరుకుంటారు.

గుజరాత్ నేర్పిన పాఠాలలో ఇదొకటి.

# ఏది పాకిస్తాన్ కుట్ర?

మీరు గుజరాత్‌కు ఏ నిజ నిర్ధారణ కమిటీలో భాగంగా పోకపోయినా, యథాలాపంగా ఆ రాష్ట్రంలో పర్యటించినా ఎక్కడబడితే అక్కడ తగలబడిపోయిన నిర్మాణాలు కనిపిస్తాయి. అందులో నివాసాలు, హోటళ్ళు, దుకాణాలు వుంటాయి.

తగలబడిన హోటళ్ళు, దుకాణాల మసిబారిన బోర్డులు చూసినప్పుడు, ఇవి ముస్లింలకు చెందినవని వాటిని తగలబెట్టిన వారికి ఎట్లా తెలిసిందని మీకు అనుమానం వస్తుంది. ఎందుకంటే వాటికి 'ముస్లిం' పేర్లు వుండవు. సర్వోదయ, అశీశ్, ఆశీర్వాద్, పంకజ్, తులసి మొదలయిన పేర్లు వుంటాయి.

హిందూత్వవాద మూకల భయానికి ముస్లింలు తమ వ్యాపార సంస్థలకు 'హిందూ' పేర్లు పెట్టుకున్నారని మీరు అనుకోవచ్చు. కొన్ని సందర్భాలలో అది నిజమే కావచ్చును గానీ అసలు కారణం అది కాదు.

గుజరాతీ ముస్లింల మాతృభాష గుజరాతీయే. వాళ్ళెవ్వరికీ ఉర్దూ రాదు. చదువుకున్న వారయితే హిందీ వస్తుంది. మనం వాళ్ళు ముస్లింలు కదా అని కొంచెం ఉర్దూ కలిసిన హిందీలో మాట్లాడినా, వాళ్ళు స్వచ్ఛమైన హిందీలోనే జవాబు ఇస్తారు.

కాబట్టి అశీశ్, ఆశీర్వాద్ మొదలయినవి 'హిందూ' పేర్లు కావు. గుజరాతీ భాషా పదాలు. అయితే 'సర్వోదయ' అన్న పేరు ముస్లింల వ్యాపార సంస్థలకే ఎక్కువ వుండడం వెనుక ఒక రాజకీయ కారణం వుండవచ్చు. గాంధీ అన్నా గాంధీ భావాలన్నా గుజరాత్‌లో ముస్లింలకే తప్ప హిందువులకు పెద్దగా సదభిప్రాయం లేదు. ఈ రోజేకాదు – అంటే హిందూత్వవాదులు గుజరాత్‌ను తమ ప్రయోగశాలగా మార్చుకున్న తర్వాతే కాదు, తొలినాటి నుండి కూడా. దేశ మంతటికీ గాంధీపట్ల అతి తక్కువ గౌరవం వుండేది గుజరాత్‌లో. 'గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీ కూడా పటేల్ కాంగ్రెసే తప్ప గాంధీ కాంగ్రెస్ కాదు' అని ఆ రాష్ట్రంలో ఇంకా మిగిలి వున్న ఒకరిద్దరు మానవ హక్కుల కార్యకర్తలు అంటారు.

---

ప్రజాతంత్ర వారపత్రిక, 26.5.2002

ఈ కారణంగా, ఆ రాష్ట్రంలో సర్వోదయ అన్న పేరు గల తగలబడిపోయిన హోటళ్ళు, దుకాణాలు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తాయి. ఆ దృశ్యాన్ని జీర్ణించుకోవడానికి కొంత సమయం పడుతుంది గానీ గుజరాత్ సమాజానికి పట్టిన దుర్గతికి ఆ దృశ్యం సరైన సంకేతమే.

సంఘ్ పరివార్ కార్యకర్తలలోనే కాక, సాధారణ హిందువులలో సహితం కళ్ళకు పొరలు కప్పిన గుడ్డి ద్వేషం ఆ దుర్గతిలోని ప్రధాన అంశం. ద్వేషంవల్ల నశించిన వివేచన వికృత హింసాకాండ రూపంలోనే కాక మనల్ని అవాక్కులను చేయగల కుతర్కం రూపంలోనూ సాక్షాత్కరిస్తుంది. మీ ఊరి ముస్లింలు ఏం తప్పు చేశారని ప్రశ్నిస్తే అప్పుడెప్పుడో సోమనాథ్ దేవాలయం మీద దాడి జరిపిన గజనీ మహ్మద్ గురించి, ఒసామా బిన్ లాడెన్ గురించి, జిహాద్ గురించి, హిజ్బుల్ ముజాహిదీన్ గురించి, పాకిస్తాన్ గురించి ఇంకా అనేక అసందర్భమైన విషయాల గురించి మాట్లాడతారు. వాటికీ మీ ఊరి ముస్లింలకూ ఏమిటి సంబంధం అని మనం రెట్టించే ప్రయత్నం ఏ కొంచెం చేసినా విపరీతంగా ఆవేశపడిపోతారు. కోపంతో ఊగిపోతారు. ఆ ఆగ్రహాన్ని చూడాలే తప్ప చెప్తే నమ్మరు.

'ముస్లిం' అనేది ఇప్పుడొక అఖండ పదార్థం అయిపోయింది. అందువల్ల ఎవరో ఎక్కడో ఎప్పుడో చేసిన పాపాలకు, లేదా చేశారని సంఘ్ పరివార్ భావించే పాపాలకు మన ఊరి దర్జీ, మన స్కూటర్ మెకానిక్కు జవాబు చెప్పాలి. ప్రశ్నలకు కాదు, తల్వార్లకు, త్రిశూలాలకు జవాబు చెప్పాలి.

దీనిని గ్రహించే రాజకీయ జ్ఞానం వున్నవారూ లేనివారు కూడా గుజరాతీ ముస్లింలలో వున్నారు. ఆ జ్ఞానంలేని వారి విస్మయం వర్ణనాతీతం. అదంతా నిజమే కావచ్చు. కానీ నేనేం చేశాను? అన్న ప్రశ్న వారి చూపులలో ఇప్పుడు స్థిరపడిపోయింది. అది పోదు. ఎందుకంటే వారు తమ ఇల్లూ వాకిలీ పోగొట్టుకున్నారు, వ్యాపారాలూ ఆస్తులూ పోగొట్టుకున్నారు, తమ కళ్ళముందే నరికి చంపిన తమ ఆప్తులను పోగొట్టుకున్నారు. తన పిల్లలు, తన కంటె చిన్న వాళ్ళయిన ఇరుగు పొరుగు యువకులూ చూస్తున్నారని తెలిసి ఏడుపు బిగపట్టుకొని జరిగిన విషయాలు చెప్తూ వస్తున్న మధ్యవయస్కుడయిన ఒక రైతు మన కళ్ళలోని సానుభూతి చూసి కాబోలు ఇంక బిగపట్టలేక ఒక్కసారిగా గొల్లుమని ఏడుస్తూ, 'ఇది నా జన్మభూమి – నన్ను పొమ్మంటే ఎక్కడికి పోవాలి? నేను జాతీయ గీతం

పాడలేదా? జెండా ఎగరేయలేదా' అని చేతులలో ముఖం దాచుకొని విలపించినప్పుడు బాధ కంటే విస్మయం అతనిని ఎక్కువగా దహించివేస్తున్నదని అర్థమవుతుంది.

ఈ మూర్ఖమైన ద్వేషం తనకు కావలసిన సాకులను తానే కల్పించు కుంటుంది. ఇప్పుడు గుజరాత్‌లో మీరు ఏ హిందువునైనా అడగండి ఈ అల్లర్లు ఇంకెంత కాలం సాగుతాయని. 'పాకిస్తాన్ అల్లర్లను ఆగనివ్వదు' అని జవాబు చెప్తారు. మొదటిసారి ఆ జవాబు విన్నప్పుడు మన శ్రవణేంద్రియాన్ని శంకిస్తాం. చచ్చింది, చస్తున్నది ముస్లింలయితే అల్లర్లను పాకిస్తాన్ ఆగనివ్వకపోవడమేమిటని ఆశ్చర్యపోతాము. ఆ జవాబు అర్థం కావడానికి కొంచెం సమయం పడుతుంది. గోధ్రాలో రైలుమీద దాడి పాకిస్తాన్ చేయించిందనీ, ఆ దాడికి హిందువులు ఆగ్రహించి రెచ్చిపోతారని తెలిసే చేయించిందనీ, ఆ ఆగ్రహానికి ఆపైన ప్రతీకారం తీర్చుకుంటుందనీ, అందుకోసం మందినీ పైసలనూ గుజరాత్‌కు పంపించడం మొదలుపెట్టిందనీ దాని భావం. అత్యంత కిరాతకంగా ముస్లింలను మూకుమ్మడిగా వధించిన వారు సహితం తాము చేసిన హింసతో సహా ఇదంతా పాకిస్తాన్ చేస్తున్న కుట్ర అనీ ఈ అగ్గి ఆరిపోకుండా పాకిస్తాన్ రగిలిస్తూనే ఉంటుందనీ నమ్ముతూ మరింత హింసకు పాల్పడుతూ అదంతా కూడా పాకిస్తాన్ కుట్రేనని సమర్థించు కుంటూ...

ఢిల్లీలో అద్వానీ దీనికి తగినట్టే మాట్లాడుతుంటాడు. గుజరాత్‌లోని శరణార్థుల శిబిరాలలో పాకిస్తాన్ ఏజెంట్లూ టెర్రరిస్టులూ ప్రవేశిస్తున్నారనే హెచ్చరికలు రెండు రోజులకొకసారి చేస్తుంటాడు. హోంశాఖ ఎటువంటి అరెస్టులు కోరుకుంటే అటువంటి అరెస్టులు చేసిపెట్టడంలో నేర్పరులయిన ఢిల్లీ పోలీసులు, గుజరాత్‌కు పోవడానికి తయారయి వున్న లష్కర్-ఇ-తయ్యిబా మిలిటెంట్లను వెనువెంటనే చాంద్‌నీ చౌక్‌లో అరెస్టుచేసి వారి 'కుట్రలను భగ్నం చేస్తారు'. ఇంక గుజరాత్‌లోని హిందూత్వవాదుల 'మూడ్' గురించి చెప్పేదేముంది? ఇదంతా పాకిస్తాన్ కుట్ర అని మేము ముందే చెప్పలేదా అని వారు రెట్టించిన ఉత్సాహంతో ముస్లింలపైన ద్వేషం పెంచుకుని 'పాకిస్తాన్ కుట్ర'లో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్నారు. ముస్లింలు శరణార్థుల శిబిరాల నుండి తిరిగి ఇళ్ళకు (కాలిపోయిన ఇళ్ళకే అయినా) పోవడం అసాధ్యం చేస్తున్నారు. ఇంకా మిగిలిపోయిన ఇళ్ళేమయినా వుంటే తగలబెడుతున్నారు. ఒంటరిగా ముస్లిమెవరైనా దొరికితే నరికి చంపుతున్నారు...

# ఇంకెక్కడా మరొక గుజరాత్ కాకుండ చూడడం ప్రజాతంత్ర ఉద్యమాల కర్తవ్యం

'మహారాష్ట్ర రాజస్థాన్ మరొక గుజరాత్ కావడానికి రెడీగా ఉన్నాయి'. ఈ మాటలంటున్నది తెలిసీ తెలియక మాట్లాడే రాజకీయ వ్యాఖ్యాతలు కాదు. ఆ రాష్ట్రాలలో ప్రజలతో, ప్రజా ఉద్యమాలతో సన్నిహిత సంబంధం ఉన్న హక్కుల ఉద్యమకారులు.

ఈ భయానికి గల ఒక కోణాన్ని అర్థం చేసుకోవడం పెద్ద కష్టం కాదు. మహారాష్ట్రలో శివసేన ప్రాబల్యం తెలియనిది కాదు. 1992-93లలో బొంబాయి నగరంలో ముస్లింలపైన శివసేన నిర్వహించిన ఊచకోతను మనం మరచిపోలేదు. ఆ మారణకాండ గురించి శివసేన తన అభిప్రాయం మార్చుకున్న దాఖలాలు లేవు. నిజానికి మొన్న గుజరాత్‌లో మారణకాండ మొదలుకాగానే అది మహారాష్ట్రలో కూడా ఎందుకు జరగలేదన్న చర్చ ప్రస్తుతానికి అనవసరంగానీ, శివసేన తన నైజాన్ని మార్చుకోవడం మాత్రం దానికి కారణం కాదు.

రాజస్థాన్‌లోనూ సంఘ్‌పరివార్ ప్రాబల్యం చాలా ఉంది. అయోధ్యలో వాళ్ళు కట్టదలచుకున్న రామాలయం విడిభాగాలు రాజస్థాన్‌లోనే తయారవుతున్నాయి. ఆ రాష్ట్రంలో బజరంగ్‌దళ్ 40 లక్షల 'త్రిశూలాలు' పంచిందని ముఖ్యమంత్రి అశోక్ గెహలాట్ పత్రికా ముఖంగా ప్రకటించాడు. ఆయన కాంగ్రెస్ మనిషి కాబట్టి ఇందులో సగం అతిశయోక్తి ఉందనుకున్నా ఈ త్రిశూల సంతర్పణం చిన్న విషయం కాదు.

'త్రిశూలాలు' అంటే శైవ క్షేత్రాల దగ్గర కనిపించే సన్యాసుల చేతిలో ఉండే పనికిమాలిన కడ్డీలు అనుకునేరు. బజరంగ్‌దళ్ పంచే త్రిశూలాలు పిడి బాకుల సైజులో ఉండే దృఢమైన ఆయుధాలు. దానిని త్రిశూలం అనే కంటే మూడు మొనలు గల పిడిబాకు అనడం ఉచితంగా ఉంటుంది. దానికి త్రిశూలం అని పేరుపెట్టడం వెనక ఒక తెలివైన ఆలోచన ఉండవచ్చు. సిక్కులు కిర్పాన్

---

ప్రజాపంథా వారపత్రిక, 1.6.2002

ధరించటం నేరం కానట్టు హిందువులు త్రిశూలం ధరించటం నేరం కాదని దబాయించడం సాధ్యమే.

అయితే ఈ సమస్యను శివసేన, బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్, ఆర్ఎస్ఎస్, బిజెపిల వ్యాప్తికీ, వాళ్ళ కుతంత్రాలకూ సంబంధించిన విషయంగా చూసినంత కాలం మనం సమస్య మూలాలలోకి పోనట్టే. ఆ చర్చ మనకు ఆందోళన కలిగించవచ్చును గానీ మనల్ని సిద్ధాంతపరంగా ఇబ్బంది పెట్టదు. నిజమైన సమస్య ఏమిటంటే సాధారణ హిందూ ప్రజానీకం ముస్లిం వ్యతిరేక ఉన్మాదంలో పెద్దఎత్తున భాగస్వాములు కావటం.

ఇక్కడ 'హిందువు' అన్న మాటలో దళితులను, బీసీలను కూడా కలిపి ప్రయోగిస్తున్నాను. వాళ్ళు హిందువులు కారు అని మన సంతృప్తి కోసం మనం ప్రకటించుకుంటే సరిపోదు. వాళ్ళను హిందువులు కాకుండ చేసే రాజకీయ కృషి అవసరం. చాతుర్వర్ణ్యాన్ని మనకు మనం విశ్లేషించి చెప్పుకొని దాని స్వభావాన్ని బట్టి దళితులు, బీసీలు హిందువులు కారు అని నిర్ధారించుకోవడం మన ఆత్మసంతృప్తికి మాత్రమే పనికొస్తుంది. హైందవ సిద్ధాంతం, ప్రాపంచిక దృక్పథం బ్రాహ్మణులకు, బనియాలకు తప్ప వేరే ఎవ్వరికీ మేలు చేయదని ఇతర కులాలకు నేర్పే రాజకీయ కృషి లేనిదే ఈ సిద్ధాంత విశ్లేషణవల్ల ప్రయోజనమేమీ ఉండదు. ఆ కృషి శూద్ర అగ్రకులాల దగ్గర ఫలితం ఇయ్యకపోవచ్చును గానీ దళితులు, పెద్దగా బ్రాహ్మణీకరణ చెందని బీసీ కులాల దగ్గర ఫలితం ఇయ్యగలదు. కానీ ఆ కృషి జరగాలి.

హిందువులుగా తమను తాము భావించే జనం చాలా పెద్దసంఖ్యలో గుజరాత్ మారణకాండలో పాల్గొన్నారనడానికి పోలీసు ఎఫ్ఐఆర్‌లే సాక్ష్యం. బాధితులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లే కాదు, సంఘ్‌పరివార్‌కు అనుకూలంగా వ్యవహరించారన్న అప్రతిష్ఠ పొందిన పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లు సహితం ఈ విషయాన్ని చూపుతాయి. అహమ్మదాబాద్ నగరంలో విపరీతమైన హింసాకాండను చవిచూసిన రెండు ప్రాంతాలలోనూ దుండగుల సంఖ్య 15 వేలకు పైగా ఉండిందని పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్లు చెప్తున్నాయి. 100కు పైగా ముస్లింలను నరికి, ముక్కలుగా కోసి తగలబెట్టిన నరోడ్‌గాం, నరోడా పాటియాల మారణకాండ గురించి దాఖలయిన 5 ఎఫ్ఐఆర్‌లలో ఒక

దానిలో ఫిర్యాది అయిన ఎస్ఐ సోలాంకి కథనం ప్రకారం దుండగులు 15000-17000 మధ్యలో ఉన్నారు. మేఘానినగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చమన్‌పురా ప్రాంతంలోని గుల్బర్గ సొసైటీ బిల్డింగ్ పైన దాడి చేసి కాంగ్రెస్ మాజీ ఎం.పి. ఎహసాన్ జాఫ్రిని అతి క్రూరంగా చంపడంతో పాటు దాదాపు 70 మందిని నరికి దహనం చేసిన ఘటనలో 20,000 నుండి 25,000 మంది పాల్గొన్నట్టు రెండు ఎఫ్ఐఆర్‌లలో ఒకటి దాఖలు చేసిన సీనియర్ ఇన్స్‌పెక్టర్ కె.జి. ఎర్డా అంటాడు. జిల్లాలలో (ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలయిన పంచ్ మహల్స్, దాహోడ్, సబర్‌కాంటా, బరోడా (రూరల్) జిల్లాలలో) కూడా ఒక్కొక్క ఘటనలోనూ 5000 నుండి 10,000 మంది పాల్గొన్నారని పోలీసులే అంటున్నారు.

సంఘ్‌పరివార్ సంస్థలకు ఈ మోతాదులో సభ్యత్వం ఉందని వారు కూడా చెప్పుకోరు. వారి సభ్యులు కాని చాలామంది జనం ఈ హింసాకాండలో పాల్గొన్నారు. ముస్లింల పట్ల సాధారణ హిందూ ప్రజానీకంలో ఇంత ద్వేషం ఎక్కడి నుండి వచ్చింది? విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ వంటి సంస్థలు ప్రజలను - ముఖ్యంగా ఆదివాసులను, దళితులను - 'తప్పుదోవ' పట్టించారనీ 'బ్రెయిన్‌వాష్' చేశారనీ వామపక్ష భావాలు గల విశ్లేషకులు అంటున్నారు. సంఘ్‌పరివార్ సంస్థలు చాలా 'కృషి' చేసిన మాట వాస్తవమే. కానీ ఒకరు తప్పుదోవ పట్టిస్తే తోవ తప్పిపోవడానికీ, ఒకరు బ్రెయిన్‌వాష్ చేస్తే తమ మెదళ్ళు అప్పగించి కూర్చోవడానికీ మనుషులు తోలుబొమ్మలు కాదు, మరబొమ్మలు కాదు. మరయితే సంఘ్‌పరివార్ ప్రయత్నం గుజరాత్‌లో ఎందుకు సఫలం అయిందో చూడడం అవసరం.

దళితులకూ ఆదివాసులకూ 'మీరూ హిందువులే' నన్న గుర్తింపు విశ్వహిందూ పరిషత్ బలంగా కల్గించింది. హైందవ సమాజంలో ఆ ప్రజలకు ఉండే నీచమైన స్థానాన్ని ఏ మాత్రం సంస్కరించకుండ, బజరంగ్‌దళ్ కార్యకలాపాలలో వారిని భాగస్వాములు చేయడం ద్వారా వారికి 'హిందువు' అన్న ఐడెంటిటీ కల్పించింది. ఆదివాసీ ప్రాంతాలలో వినాయకుడి విగ్రహాలు ఉచితంగా పంచి గణేశ్ భజనలు నేర్పించింది. హైందవ మిలిటెన్సీకి సంకేతంగా మారిన త్రిశూలాలు విరివిగా పంచింది. కొత్తగా చదువుకొని సమాజాన్ని గురించి ఆలోచించడం మొదలుపెట్టిన

మొదటితరం దళితులకూ ఆదివాసులకూ 'నేనెవరిని?' అన్న ప్రశ్నకు విశ్వహిందూ పరిషత్ జవాబు ఇచ్చింది. ఒక దళిత ఉద్యమమయినా, వేరే ఏ ప్రజాతంత్ర ఉద్యమమైనా గుజరాత్‌లో అభివృద్ధి చెంది ఉంటే, అన్యాయానికి గురయి న్యాయాన్ని కోరుకుంటున్న వర్గంగా వారికి ఒక 'రెబెల్' గుర్తింపును ఇయ్యగలిగి ఉండేవి. అవేవీ లేని చోట విశ్వహిందూ పరిషత్ 'హిందువు' అన్న విశాలమైన గుర్తింపులో వారిని భాగం చేయగలిగింది. హైందవంలో వారి స్థానాన్ని సంస్కరించి వారిని కలుపుకునే బదులు, ద్వేషించడానికి ఒక ముస్లింను నిలబెట్టి ఆ ద్వేషం ప్రాతిపదికన కలుపుకునింది. నువ్వు హిందువు, భారతదేశం నీ దేశం, ఈ ముస్లిం దేశద్రోహి, పాకిస్తాన్ అభిమాని, పాకిస్తాన్ టెర్రరిస్టు దేశం, భారతదేశాన్ని టెర్రరిజంతోనూ సీమాంతర ఉగ్రవాదంతోనూ పీడిస్తున్న శత్రుదేశం, ఈ ముస్లింను ద్వేషించు, అంతమొందించు, నీ దేశాన్ని కాపాడుకో – ఇదీ సంఘ్‌పరివార్ సగటు గుజరాతీలకు – ఆదివాసులు, దళితులతో సహా – పదే పదే ఇస్తున్న సందేశం. మనుషులను ప్రేమ, వివేచనే కాదు. ద్వేషం కూడా ఐక్యం చేయగలదు. ప్రేమకంటే, వివేచన కంటే ద్వేషమే సులభంగా ఐక్యం చేయగలదని నేనంటే నేను మానవ నైజాన్ని కించపరుస్తున్నానని నాపైన దాడి చేస్తారేమోగానీ, ద్వేషం కూడా ఐక్యం చేయగలదని ఒప్పుకుంటారనుకుంటాను. గుజరాత్ వీధులలో ముస్లింలను ఊచకోత కోయడానికి, వాళ్ళ ఇళ్ళు దుకాణాలు అగ్నికి ఆహుతి చేయడానికి వేలాదిగా కదలి వచ్చిన భిన్న స్థితిగతులు, భిన్న ప్రయోజనాలు, భిన్న అవసరాలు గల జనం దీనికి నిదర్శనం.

వీళ్ళెవ్వరితోనయినా మీరు మాట్లాడండి, వాళ్ళు స్థానిక ముస్లింల మీద ఏ ఫిర్యాదు చేయరు. చర్చ నేరుగా పాకిస్తాన్ మీదికి పోతుంది. ఇంకా ఎక్కడెక్కడికో పోతుంది. వెయ్యేళ్ళ కింద గజనీ మహమ్మదు సోమనాథ్ దేవాలయాన్ని ధ్వంసం చేసాడంటారు. నాలుగు వందల ఏళ్ళ కింద బాబర్ అయోధ్యలో రామాలయాన్ని ధ్వంసం చేశాడంటారు. ఆ తరువాత ఔరంగజేబు ఇంకేదో చేశాడంటారు, సెప్టెంబర్ 11 అంటారు, డిసెంబర్ 23 అంటారు, కాశ్మీర్‌లో ఆత్మాహుతి దళాలు అంటారు, ఇంకా ఏదేదో అంటారు. వీటికీ మీ ఊరిలో మీరు మెడ తెగనరికి దుకాణం కాలబెట్టిన హాజీమియాకూ ఏమిటి సంబంధం అన్న ప్రశ్న మనల్ని అడగనివ్వరు. అడిగితే కుహనా లౌకికవాదం అంటూ మన మీద విరుచుకుపడతారు.

ఇదేదో గుజరాత్ ప్రత్యేకత అనుకుంటే పొరబాటే. మన దేశంలో చదువుకున్న హిందువులందరి ('వీళ్ళు హిందువులు కారు' అని మనం సిద్ధాంతీకరిస్తున్న వారితో సహా) మనసులోనూ పైపొర తొలగిస్తే లోపల కనిపించే చిత్రం ఇదే. కులం పెరిగేకొద్దీ మరికొంచెం తీవ్రంగా ఉండవచ్చునంతే. వేరే ఏ ప్రజాతంత్ర ఉద్యమాలూ లేని చోట సంఘ్‌పరివార్ పై పొరను సులభంగానే తొలగించగలిగింది. 'ముస్లింలకు బాగా అయింది చావనీ' అని మన రాష్ట్రంలో కూడా మనచుట్టూ ఉన్న వారు చాలామంది అన్నారు.

ఈ ద్వేషాన్ని పోగొట్టే లోతయిన రాజకీయ కృషి అవసరం. ఇది కేవలం ఉపన్యాసాలతో రాదు, ప్రజలను ఆర్గనైజ్ చేసే క్రమంలో జరగాలి. గుజరాత్‌లో సంఘ్ పరివార్‌కు దొరికిన ఖాళీ జాగా దొరకనివ్వకూడదు. ప్రజలను ప్రజాతంత్ర లక్ష్యాలతో ఆర్గనైజ్ చేసే క్రమంలో 'హిందువు' అన్న మాటకు సంఘ్‌పరివార్ ఇస్తున్న వ్యాఖ్యానంలోని అబద్ధాన్ని ఆచరణాత్మకంగా తెలియజెప్పాలి. లౌకికవాదం కేవలం ముస్లింలకూ,క్రైస్తవులకే కాదు, 'హిందువులు' అని సంఘ్‌పరివార్ పిలిచే వారిలో మెజారిటీకి – స్త్రీలకు, దళితులకు, బీసీలకు, ఆదివాసులకు – అవసరం అని, అదే లేకపోతే ఆ ప్రజలకు సంప్రదాయం నుండి ఈ మాత్రం విముక్తి కూడా లభించేది కాదనీ వివరించాలి. ఈ దేశంలో లౌకికవాదం అక్కరలేని వాళ్ళే ఒక మైనారిటీ అనీ లౌకికవాదం అవసరమైనవాళ్ళే మెజారిటీ అని చెప్పాలి. మనుషులు ఐక్యం కావలసింది అన్యాయం చేయడానికి కాదనీ అన్యాయాన్ని ధిక్కరించడానికనీ చెప్పాలి. భారతదేశ చరిత్ర గురించి సంఘ్‌పరివార్ ఇస్తున్న వ్యాఖ్యానాన్ని సోదాహరణంగా తిప్పికొట్టాలి. 'ముస్లిం' అనే దానిని ఒక అఖండ సామాజిక పదార్థంగా మార్చి ఎవరెవరో చేసిన తప్పులకు (అవన్నీ తప్పులా కాదా అన్న సంగతి అటుంచి) ముస్లింలందరినీ బాధ్యులు చేయడం అన్యాయం అని వివరించాలి.

ఇవన్నీ ప్రజలను తమ సామాజిక ఆర్థిక స్థితిగతులనూ హక్కులనూ మెరుగుపరచుకోవడానికి సంఘటితపరచే క్రమంలో చేయాలి. ఒక ప్రత్యేకమైన రాజకీయ కృషిగా ఈ ప్రయత్నం చేయకపోతే దేశమంతా ఒక గుజరాత్ కాకుండా ఆపడం కష్టం.

# అశోక్ గెహ్లాట్‌కు అభినందనలు

ఇన్నాళ్ళకు దేశంలో ఒక ప్రభుత్వానికి ధైర్యమొచ్చింది. చేయరాని పని చేయడానికి కాదు, చేయవలసిన పని చేయడానికి. విశ్వహిందూ పరిషత్ వారి త్రిశూల సమారాధనను దేశవ్యాప్తంగా ఎప్పుడో నిషేధించవలసింది – ఇప్పుడు కనీసం ఒక రాష్ట్ర ప్రభుత్వం ఆ చొరవ తీసుకుంది. అందుకు రాజస్థాన్ ప్రభుత్వాన్ని అభినందించక తప్పదు.

దీనిని సహితం సంఘ్ పరివార్ తన ప్రచారం కోసం వాడుకుంటుంది. సందేహమేమీ లేదు. జైలు నుండి బయటికొచ్చిన తొగాడియా ఇప్పటికే ఆ పని మొదలుపెట్టాడు. హిందువులకు అన్యాయం జరిగిపోయిందనీ (హిందువులంతా హత్యలు చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నట్టు), ఎవరేమన్నా హిందువులు పవిత్ర చిహ్నంగా భావించే త్రిశూలాల పంపకం మానేది లేదనీ ఇప్పటికే ప్రకటించాడు.

రాజస్థాన్ సరిహద్దులు దాటే వరకు కొంచెం జాగ్రత్తగా మాట్లాడతాడు (ఎందుకంటే అసహాయుల మీద దాదాగిరీ చేయడంలో ఆనందం పొందే ఈ బాపతు మనుషులంతా స్వతహాగా పిరికి వాళ్ళు) కాని తనను తీస్‌మార్ ఖాన్‌గా గుర్తించి గౌరవించే గుజరాత్‌లోకి ప్రవేశించినదే తడవు అతని ఆవేశమంతా కట్టలు తెంచు కుంటుంది. అతను ఇవ్వబోయే ఉపన్యాసాన్ని ఊహించుకోవచ్చు.

'హిందుస్తాన్‌లో హిందువులు – త్రిశూలాలు పట్టుకొని తిరగకూడదంట ఛీఛీ – ఇది జాతికే సిగ్గుచేటు... అదే ముస్లింలయితే? వాళ్ళు మదరసాలలో జిహాద్ పాఠాలు నేర్చుకోవచ్చు. ఇళ్ళల్లో ఒసామాబిన్ లాడెన్ ఫోటోలూ సద్దాం హుస్సేన్ ఫోటోలూ పెట్టుకోవచ్చు. నలుగురిని పెళ్ళి చేసుకోవచ్చు. గంపెడు పిల్లల్ని కనొచ్చు... ఇంకా ఇంకా... కుడి నించి ఎడమకు రాయొచ్చు, మీసం తీసేసి గడ్డం పెట్టుకోవచ్చు... ఏమైనా చేయవచ్చు...' అంటూ ఊగిపోతాడు రేపు ఈ పాటికి.

---

ప్రజాతంత్ర వారపత్రిక, 28.4.2003

నేను మరీ వెక్కిరిస్తున్నాననుకోవద్దు. తొగాడియా ఆ మధ్య అనంతపురంలో, కడపలో, కర్నూలులో ఇచ్చిన ఉపన్యాసాలు విన్న భాగ్యం మీకు కలిగి ఉండక పోవచ్చు. నేను వినలేదు గానీ ఆ ఉపన్యాసాల పూర్తి పాఠం టేప్ చేసి ట్రాన్స్ క్రైబ్ చేయగా చదివాను. అందులో ఇంతకంటె గొప్ప తర్కమేమీ లేదు.

సాధారణ మానవులు ఈ విధంగా మాట్లాడడానికి సిగ్గుపడతారు. సిగ్గుపడక పోయినా చట్టానికి భయపడతారు. ఈ సంఘ్ పరివార్ బాపతుకు సిగ్గు స్వతహాగా లేదు. భయం మాటకొస్తే, వాళ్ళు పెద్దగా సాహసవంతులేమీ కాదుగానీ వాళ్ళను అంటుకోవడానికి చట్టమే భయపడుతున్నది. చట్టం కలవాడి చుట్టం అని కమ్యూనిస్టులు అంటుంటారు. అది కొంతవరకు నిజమేగానీ అంతకంటే ఎక్కువ నిజమేమిటంటే అది అధికారానికి చుట్టం. ప్రస్తుతం దేశాన్ని సంఘ్ పరివార్ సంస్థలు, వారితో లాలూచీ పడినవారు ఏలుతున్నారు. వారిని వ్యతిరేకిస్తున్నానని చెప్పుకునే  కాంగ్రెస్ పార్టీ 'హిందువుల వోట్లు' పోకుండ ఆ పనిచేయాలన్న ఆరాటంతో తన కాళ్ళకు తానే బంధం వేసుకుంది.

అందువల్ల, ఇందులో పావువంతు రెచ్చగొట్టే మాటలు మాట్లాడే వారెవరినైనా లిస్టు తయారుచేసి కాల్చిపారేయడానికి క్షణం తటపటాయించని పోలీసు యంత్రాంగం, ఈ తొగాడియాలపైన, బాల్ థాకరేలపైన, గిరిరాజ్ కిశోర్‌లపైన, గడ్డాలకు రక్తం పూసుకొని తిరుగుతున్న రామచంద్ర పరమహంస వంటి స్వాములపైన సాధారణ నేర చట్టం కింద కేసులు నమోదు చేయడానికి సహితం సిద్ధంగా లేదు.

వీరికి కావలసింది అదే. వీళ్ళను వర్ణించడానికి ఇంగ్లీష్‌లో సరయిన మాట ఉంది. Bully అంటారు. దానికి తెలుగులో సరయిన అనువాదం లేదు. నిస్సహాయులపైన దాదాగిరీ చేస్తూ బతికే బాపతు అని దాని అర్థం. ఏడవ తరగతి నాలుగుసార్లు ఫెయిలై తనకంటె నాలుగేళ్ళు చిన్నపిల్లల పక్కన కూర్చొని వాళ్ళకు చాకులూ, బ్లేడ్లూ చూపించి బెదిరించి వారిచేత సేవలు చేయించుకుంటూ మహదానందం పొందే కుర్రవాడ్ని చూసే ఉంటారు కదా? అందరి జీవితంలోనూ అటువంటి వారు ఒకసారయినా తారసపడతారు. మన సంఘ్ పరివార్ దేశ

భక్తులు సరిగ్గా ఆ బాపతు. వాళ్ళను నిజంగా ఎదిరించే వాళ్ళు కనిపిస్తే తోకలు ముడుచుకొని కాదు, స్వచ్ఛందంగా కత్తిరించుకొని పారిపోతారు. ప్రస్తుతం పోలీసులు తమ చుట్టాలు కాబట్టి ద్వేషాన్ని యథేచ్ఛగా ప్రచారం చేస్తూ అది రగిలించిన హింసాజ్వాలల చుట్టూ కేరింతలు కొడుతూ ఉన్మత్త ఆనందం పొందుతున్నారు.

లేదు, హిందుస్థాన్‌లో హిందువులు పవిత్ర చిహ్నంగా భావించే త్రిశూలం పైన నిషేధం లేదు, ఉండకూడదు. పిడి బాకుకు త్రిశూలం అని పేరుపెట్టి సెంటిమెంట్ పేరిట మారణాయుధాలు పంపిణీ చేసే కుయుక్తి మీద మాత్రం నిషేధం ఉంటుంది, ఉండి తీరాలి. దేశంలోని శైవ క్షేత్రాలలో సన్యాసులనేకమంది త్రిశూలాలు పట్టుకొని తిరుగుతుంటారు. కొంతమంది పల్చటి త్రిశూలాలను బుగ్గలలోనూ ముక్కుపుటాలలోనూ గుచ్చి నిద్రాహారాలు మాని సంచరిస్తుంటారు. వారిని భక్తిభావంతో స్వాములుగా కొలిచేవారూ ఉన్నారు. వెర్రిబాగులవారిగా భావించే వారూ ఉన్నారు. కానీ వారిని ఎవరూ హంతకులని భావించరు, వారి వద్దనున్న త్రిశూలాన్ని మారణాయుధమనీ భావించరు.

విశ్వహిందూ పరిషత్ పంచుతున్న త్రిశూలాలు ఇవి కావు. మూడు మొనలున్న ఉక్కు పిడిబాకులు. వాటిని పట్టుకొని తిరగడం నేరం కాదంటే చాకులూ కత్తులూ పట్టుకొని తిరగడం కూడా నేరం కాదు. ఈ 'త్రిశూలాలను' గత సంవత్సరం గుజరాత్‌లో జరిగిన మారణకాండలో విరివిగా వాడారు కాబట్టి అవి పవిత్ర చిహ్నాలు కావనీ మారణాయుధాలనీ ఇప్పుడందరికీ తెలుసును. వాటిని పంచడాన్నీ పట్టుకు తిరగడాన్నీ నిషేధించడానికి ఏదో ఒక రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవలసి ఉండింది. 'సాహసించి' ఆ పని చేసినందుకే అశోక్ గెహలాట్ ప్రభుత్వాన్ని అభినందించడం.

ఇక్కడొక విషయం స్పష్టం చేయడం అవసరం. సంఘ్ పరివార్ ఆయుధ సామగ్రినే కాక వారి అభిప్రాయాలనూ ఆలోచనలనూ కూడా నిషేధించాలని వాదించే వారు ఉన్నారు. మొన్న తొగాడియా అనంతపురంలో, కర్నూలులో, కడపలో జరిపిన సభలను జరగనివ్వొద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన వారూ ఉన్నారు. ఆయుధాలపైన నిషేధానికీ అభిప్రాయాలపై నిషేధానికీ తేడా చూడలేక

పోవడం తెలివితక్కువతనం. విద్వేషాన్నీ హింసనూ ప్రేరేపించే ప్రవచనాలను చట్టం ఎట్లాగూ నిషేధించిందిగానీ మొత్తంగా ఒక అభిప్రాయాన్నే నిషేధించాలన్న ఆలోచన సరయినది కాదు. నిషేధిస్తే ఆలోచనలు అంతరించిపోవు. రహస్య జీవితంలోకి పోతాయి. అవి చెడ్డ ఆలోచనలయితే సామాజిక చైతన్యానికి ఒక పుండుగా మారతాయి. మంచి ఆలోచనలకే తప్ప చెడ్డ ఆలోచనలకు స్వేచ్ఛ ఉండకూడదన్న అభిప్రాయం సగటు మనుషులకు ఆకర్షణీయంగానే తోచవచ్చును గానీ, ఏది మంచి ఏది చెడ్డ అన్న ప్రశ్న దాని వెనువెంటనే వస్తుంది. దీనికి జవాబు అంతిమంగా ప్రజలే చెప్పాలి కాబట్టి అన్ని అభిప్రాయాలూ తెలుసుకునే స్వేచ్ఛ ప్రజలకుండాలి.

మనం తప్పు అనుకునే ఆలోచనలను నిషేధించమని ప్రభుత్వాన్ని కోరే బదులు, వాటిని తర్కబద్ధంగా ఎదుర్కొంటూ వాటికి వ్యతిరేకమైన ఆలోచనలను విస్తృతంగా ప్రజలలో ప్రచారంలో పెట్టాలి. సంఘ్ పరివార్ వంటి సంస్థలు చేస్తున్న విష ప్రచారానికి వ్యతిరేకంగా ఇటువంటి కౌంటర్ – ప్రచారం జరగవలసిన అవసరం చాలా ఉంది. ద్వేషాన్నీ హింసనూ ప్రేరేపించే ఉపన్యాసాల పైన క్రిమినల్ కేసులు పెట్టి వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేయడం ఎంత ముఖ్యమో, లౌకికవాదం, ప్రజాస్వామ్యం, మైనారిటీల హక్కులు మొదలయిన విషయాలతో మొదలుపెట్టి భారతదేశ చరిత్ర, భవితవ్యాలదాకా అన్నిటి గురించి వారు మాట్లాడుతున్న మాటలనూ, చేస్తున్న వ్యాఖ్యలనూ సవివరంగా, హేతుబద్ధంగా తిప్పికొడుతూ పెద్దఎత్తున ప్రచారం చేయడం అంతకంటె ముఖ్యమని గుర్తించడం అవసరం.

# గుజరాత్‌లో అన్నికేసులూ బెస్ట్ బేకరీ కేసులే కాబోతాయా?

ముద్దాయిలు బాధితులనూ సాక్షులనూ బెదిరించి శిక్ష నుండి తప్పించుకోవడం కొత్త విషయం కాదు. బెస్ట్ బేకరీ కేసుకు ముందు ఎన్నడూ జరగనిదీ కాదు.

మరయితే బెస్ట్ బేకరీ కేసు గురించి ఇంత ఆందోళన ఎందుకు?

అది మామూలు హత్య అయి వుంటే ఇంత ఆందోళన జరిగేది కాదు. క్రిమినల్ కేసులలో ఇది ఎప్పుడూ ఉండేదేలే అని మరచిపోతారు. కానీ అది మామూలు హత్య కాదు. అధికార బలం, అధికార యంత్రాంగం అండ ఉన్న దుండగులు నిస్సహాయులయిన ఒక ప్రజావర్గంపైన కొన్ని వారాలపాటు జరిపిన మారణకాండలో భాగంగా జరిగిన అనేక మూకుమ్మడి హత్యలలో ఒకటి బెస్ట్ బేకరీ హత్యాకాండ. అదే అధికార బలం, అదే అధికార యంత్రాంగం అండ ఇప్పుడు సాక్షులను హంతకులే వాళ్ళ ఇంటి నుండి కోర్టుకు తీసుకొచ్చి అబద్ధం చెప్పించి మళ్ళీ ఇంటికి సాగనంపే వికారమైన ప్రహసనాన్ని రచించింది. అందుకే ఇంత ఆందోళన.

మొన్న కోర్టులో 'ఏం జరగలేదు' అని చెప్పిన షేక్ జాహిదా హబీబుల్లా సరిగ్గా ఒక సంవత్సరం క్రితం పత్రికల వాళ్ళకూ జాతీయ మానవహక్కుల కమీషన్‌కూ సిటిజన్స్ ట్రిబ్యునల్‌కూ ఏం చెప్పిందో ఒకసారి జ్ఞాపకం చేసుకోవడం ఉచితంగా వుంటుంది. బెస్ట్ బేకరీ బరోడాలోని హనుమాన్ టేక్రీలో ఉంది (ఉండింది అనడం ఉచితంగా వుంటుంది). హనుమాన్ టేక్రీలో అప్పటికి ముస్లిం కుటుంబాలు కొన్నే ఉండేవి. వారిలో ఒకరు బెస్ట్ బేకరీ యజమానులు. అంతకుముందు నుండి అక్కడ ఉంటున్న ముస్లిం కుటుంబాలు గోద్రా మారణకాండ జరిగిన రోజు ఆ ప్రాంతాన్ని వదలిపెట్టి వెళ్ళిపోగా బెస్ట్ బేకరీ కుటుంబం మాత్రం ఉండిపోయింది. దానికి కారణం జయంతి బతీజా

---

ప్రజాపంథా వారపత్రిక, 15.7.2003

'చాయ్‌వాలా' అనే స్థానిక పెద్దమనిషి 'మీకేంకాద'ని వాళ్ళకిచ్చిన హామీ. అతనిని నమ్మి అక్కడే ఉండిపోయిన ఆ కుటుంబాన్ని అతనే పక్కన ఉండి మూకుమ్మడిగా చంపించాడు.

మార్చి 1వ తేదీ రాత్రి 8 గంటలప్పుడు ఆ పెద్దమనిషి, అతనితోపాటు 500-700 మంది స్థానికులు బెస్ట్ బేకరీపైన త్రిశూలాలతో, పెట్రోల్ బాంబులతో దాడి చేశారు. బేకరీ బయట ఉన్న మూడు లారీల కలపను తగలబెట్టారు. పెట్రోలు బాంబులు వేసి అందరినీ చంపుతామని ఆస్తి దోచుకుంటామని కేకలు వేశారు. షేక్ కుటుంబం, వారి పనివారు (అందులో ముగ్గురు హిందువులు) మొత్తం 30 మంది దాకా ఆ బిల్డింగ్‌లో చిక్కుకున్నారు. సహాయం కోసం వారు పానీగేట్ పోలీస్‌స్టేషన్‌కు ఫోన్‌చేయగా ఇదిగో వస్తున్నాం అన్నారు పోలీసులు. ఒక గంట తరువాత ఒక జీపు వచ్చి బిల్డింగ్ చుట్టూ మూగి అల్లరి చేస్తున్న జనం దగ్గర ఒక నిమిషం ఆగి వెళ్ళిపోయింది.

ఆ తరువాత హత్యాకాండ మొదలయింది. బిల్డింగ్ మొదటి అంతస్తులోని స్టోర్ రూంను, పనివారి గదిని లూటీచేసి ఎనిమిది మందిని సజీవంగా దహనం చేశారు. మేడ మీద గూమిగూడిన వారిమీదికి గుంపుగా వచ్చారు. జాహిదా తల్లి చేతులు జోడించి ప్రాధేయపడింది. ఆమెను పక్కకు తోసేసి ఆమె కొడుకులిద్దరినీ ఆమె కళ్ళముందే సజీవంగా దహనం చేసి చంపారు. బేకరీ పనివారయిన ముగ్గురు హిందువుల కడుపులు కోసి మంటలలో విసిరి చంపారు. మొత్తం 14 మందిని నరికి కాల్చి హతమార్చారు.

హంతకులు స్థానికులే. వారి నాయకులు బాధితులకు పరిచితులే. హనుమాన్ టేక్రీ అధికంగా దిగువ, మధ్యతరగతి హిందువులు నివసించే ప్రాంతం. గుంపంతా అక్కడి నుండే వచ్చారు. వారి నాయకులు జయంతీ బతీజా చాయ్‌వాలా, అతని కొడుకులు, వాహేష్ సున్నా పెయింటర్, సంజయ్ ఠక్కర్, సంతోష్ ఠక్కర్, జగ్దీష్ రద్దీవాలా, దినేష్ బేకరీవాలాలు.

తమ ఉదాసీన వైఖరి ద్వారా మారణకాండకు ప్రత్యక్షంగా సహకరించిన పోలీసులు ఆ తరువాత జరిగిన ఆందోళన కారణంగా కేసు నమోదు చేశారు. కానీ విచారణ ఘడియ దగ్గరపడేసరికి 'నోరు మూసుకుంటారా? ఇంకొక దఫా

చావు చూడదలచుకున్నారా?' అని స్థానిక హిందూత్వవాదులు ఆ కుటుంబంలో మిగిలివున్న వారిని బెదిరించి లోబరుచుకున్నారు. జయంతి బతీజాయే తమను కాపాడాడనీ, అతనే సమయానికి రాకుంటే అందరూ చచ్చిపోదుమనీ షేక్ జాహిదా స్వయంగా కోర్టులో సాక్ష్యం చెప్పింది. స్థానిక బిజెపి ఎం.ఎల్.ఏ. ఆమెను ఇంటినుండి కోర్టుకు, మళ్ళీ కోర్టు నుండి ఇంటికి సాగనంపాడు.

గుజరాత్ మారణకాండలో ఇది తీర్పుకొచ్చిన మొదటి కేసు. దీనికంటే కూడా ఘోరమయిన ఘటనలు అహ్మదాబాద్ నగరంలోనూ, ఇతర జిల్లాల గ్రామీణ ప్రాంతాలలోనూ జరిగాయి. వాటిలో విశ్వహిందూ పరిషత్ నాయకుల ప్రత్యక్ష భాగస్వామ్యమూ ఉండింది. మరి వాటి గతి ఇంతకంటే భిన్నంగా ఉండబోతుందా? మూకుమ్మడిగా ముస్లింలను తన వారిచేత చంపించిన నరేంద్రమోడి ప్రభుత్వం బాధితులనూ, సాక్షులనూ హంతకులు బెదిరించి లోబరచుకోకుండా అడ్డుకుంటుందా?

చోద్యంచూస్తూ నవ్వుకుంటుంది. బెస్ట్ బేకరీ కేసులో అదే జరిగింది. గుజరాత్ మారణకాండను అందరూ మరచిపోయారు లెమ్మని భావించి జరగవలసింది గోప్యంగా జరిపించేశారు. అంతా సజావుగా జరిగిపోయిందని అనుకుంటున్న తరుణంలో పత్రికలు బెస్ట్ బేకరీ తీర్పుకు బాగా ప్రాచుర్యం ఇచ్చాయి. దేశమంతా నిరసన వ్యక్తమయింది.

ఆ కేసును అన్యాయం నుండి రక్షించడం ఇప్పుడంత సులభంకాదు. గుజరాత్ హైకోర్టు తలచుకుంటే 'రీట్రయల్' (పునర్విచారణ) ఆదేశించగలదు. అయితే ఒకసారి అబద్ధం చెప్పిన సాక్షులను (ఎంత సకారణంగానయినా సరే) రెండవ విచారణలో నమ్మవచ్చునా అనేది ఒక పెద్ద న్యాయశాస్త్ర సమస్య కాబోతుంది.

అదెలాగున్నా ఇంకా జరగనున్న కేసులలోనయినా బెస్ట్ బేకరీ ప్రహసనం పునరావృతం కాకుండా చూసుకోవడం అవసరం. ఈ పని ఎవరు చేయాలి? న్యాయంగా అయితే గుజరాత్ ప్రభుత్వం చేయాలి, కానీ వారు చేయరు. వారు చేయకపోతే కేంద్ర ప్రభుత్వం ఆదేశించి చేయించవచ్చు. కానీ వారూ చేయరు. అందులో వారిద్దరూ కూడా భాగస్వాములు కాబట్టి ఆ చొరవ వారు తీసుకోరు.

ప్రజా సంఘాలు, ఉద్యమాలు ఈ పని చేపట్టవలసి ఉంటుందని చెప్పడం సులభమే. కానీ గుజరాత్‌లో అటువంటివి ఉండి ఉంటే నిరుటి మారణకాండకు కొంతయినా ప్రతిఘటన ఉండేది. ఏ రకమైన ప్రజాతంత్ర ఉద్యమాలూ గుజరాత్‌లో లేకపోవడం నిరుడు బయటపడిన చేదు సత్యం.

అయితే ఇప్పుడు పరిస్థితి కొంచెం మెరుగుపడిన దాఖలాలు కనిపిస్తున్నాయి. కిందటి సంవత్సరం అచేతనంగా ఉండిపోయిన గుజరాతీ అభ్యుదయశక్తులు ఇప్పుడు కొంచెం కదులుతున్నారు. పెద్ద ప్రజాఉద్యమాలు నిర్మించడం ఇప్పట్లో జరగకపోయినా నిరసన ఉద్యమాలూ బాధితులకు అండగా నిలబడే కార్యక్రమాలూ సాధ్యమయ్యే దాఖలాలు కనిపిస్తున్నాయి. చిన్న చిన్న ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, పియుసిఎల్ వంటి హక్కుల సంఘాలు మరొక బెస్ట్ బేకరీ జరగకుండా ఆడ్డుకోవడానికి ముందుకొస్తున్నాయి. వారికి బయటి నుండి చేయగల సహాయం స్వల్పమే అయినప్పటికీ, కనీసం నిరుడు జరిగిన మారణకాండ మరుగున పడిపోకుండా ఉంచగలిగితే ఆ మేరకు వారి కృషికి తోడ్పడిన వారమవుతాము.

# సంఘ్ పరివార్ పైన పోరు

ఎన్నికలలో ఎవరు గెలిచినా ఒకటే కావచ్చును గానీ కొంతమంది ఓడిపోవడం మాత్రం సమాజ క్షేమానికి అవసరం.

నాలుగు రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకుగాను భారతీయ జనతా పార్టీ మూడింటిలో గెలవడం చాలా ఆందోళన కలిగించే విషయం. ప్రజలు ఖాకీ నిక్కర్ల రాజకీయాల వైపు మొగ్గు చూపుతున్నారని దీని నుండి గ్రహించడం సరియైనది కాకపోవచ్చు. అయిదేళ్ళ కాంగ్రెస్ పాలనతో విసిగిపోయి ప్రధాన ప్రతిపక్షానికి ఓట్లు వేసి ఉండవచ్చు. తిరిగి అయిదేళ్ళ తరువాత కాంగ్రెస్‌కే వేయవచ్చు.

సమస్య అది కాదు. కాంగ్రెస్ వాళ్లలాగ అయిదు సంవత్సరాల పాలనలో సంఘ్‌పరివార్ పాలకులు డబ్బులు తిని ఊరుకోక తాము కోరుకునే మూసలో సమాజాన్ని తయారు చేయడానికి అధికారాన్ని వినియోగించుకుంటారు, దుర్వినియోగం చేస్తారు కూడా. అయిదేళ్ల కాంగ్రెస్ పాలన తరువాత, అయిదేళ్ళ తెలుగుదేశం పాలన తరువాత ఆ పార్టీల ప్రాపంచిక దృక్పథం (అటువంటిదేమైనా ఉంటే) సమాజంలో పెరగదు. మనుషుల మెదళ్లు అయిదేళ్ల తరువాత కూడా ఎట్లున్నవి అట్లే ఉంటాయి.

సంఘ్ పరివార్ పాలన అటువంటిది కాదు. అయిదేళ్ల పాలన తరువాత వారి విషం మరికొన్ని వేల మెదళ్లలోకి ఎక్కి ఉంటుంది. మనుషుల ఆలోచనలు మరికొంత వికృతంగా తయారయి ఉంటాయి. వాళ్ల నిజమయిన అజెండా అదే, ఈ లోపల కాంగ్రెస్ వారిలాగ వారిలో కూడా కొందరు డబ్బులు దండు కుంటుంటారు, కొందరు తమ ఆశ్రితుల దుష్ట ప్రయోజనాలు ఒనగూరుస్తుతుంటారు, కొందరు (అరుణ్‌శౌరి లాంటివారు) మంచిపనో చెడ్డపనో రాత్రింబవళ్లు కష్టపడి చేసేస్తుంటారు కూడా. కానీ అదేదీ వారి అసలు అజెండా కాదు. నెమ్మదిగా నరనరాన దేశ ప్రజలలో గోల్వాల్కర్ విషాన్ని ఎక్కించడం వారి అసలు అజెండా.

---

ప్రజాతంత్ర వారపత్రిక, 8.12.2003

మన దగ్గర ఎన్నికలింకా ప్రకటించకుండానే బద్దం బాల్‌రెడ్డి పాత బస్తీలో గుజరాత్ ఘనత గురించి ప్రచారం మొదలు పెట్టాడంట. పాత బస్తీలోని సిక్కులను ముస్లింలకు వ్యతిరేకంగా తిప్పే ప్రయత్నం చేస్తున్నాడంట. ఈ మాటలు అంటున్నది ఒవైసీ సోదరులయితే లెక్క చేయకపోవచ్చు. కానీ బాధ్యతగల ముస్లిం సంస్కర్తలు, సామాజిక కార్యకర్తలు అంటున్నారు.

కిందటి సంవత్సరం వేసవిలో గుజరాత్‌లో మారణకాండ జరిగినప్పుడు 'రాజస్థాన్ మరొక గుజరాత్ కావడానికి సిద్ధంగా ఉంది' అని ఆ రాష్ట్రానికి చెందిన పౌరహక్కుల మిత్రులు అన్నారు. గుజరాత్‌కూ రాజస్థాన్‌కూ సుదీర్ఘమైన సరిహద్దు ఉంది. ఆ సరిహద్దు వెంబడి నిరుడు గుజరాత్‌లో హింస జరిగింది. అందులో సంఘ్ పరివార్ కాల్బలంగా పాల్గొన్నది. ఎక్కువగా బిల్లు తెగకు చెందిన ఆదివాసులు. సరిహద్దుకు అవతల రాజస్థాన్‌లోనూ ఆ ప్రజలే ఉన్నారు. అక్కడ కూడ సంఘ్ పరివార్ సంస్థ వనవాసీ కళ్యాణ్ సమితి ఆదివాసులను కాషాయ రాజకీయాలవైపు లాగడానికి ప్రయత్నం చేస్తున్నది. కాని ఆ రాష్ట్ర ప్రభుత్వం వారికి అనుకూలంగా లేకపోవడం వల్ల ఆ ప్రయత్నం వారి కోరిక మేరకు సాగలేదు. అశోక్ గెహలాట్ త్రిశూలాల పంపిణీ కార్యక్రమాన్ని నిరోధించే ప్రయత్నం గట్టిగానే చేసాడు. ఇప్పుడింక వారిని ఆపేది ఎవరు?

ఎన్నికలలో గెలుపు ఓటముల గురించి టీవీలలో, పత్రికలలో బరువయిన విశ్లేషణ చేస్తుంటారు. విశ్లేషణే వృత్తిగా కలవారు సమాజంలో ఉన్నంత కాలం విషయాన్ని మించిన విశ్లేషణ చేయకుండ ఆపలేం. కానీ నిజానికి మన దేశంలో ఎన్నికల గెలుపు ఓటములకు (ఎప్పుడో తప్ప) అంత లోతయిన కారణాలేవీ ఉండవు. దిగ్విజయ్ సింగ్ చంద్రబాబు నమూనా 'సంస్కర్త' కావాలని ఆశించాడు. అందువల్ల అతను ఓడిపోయాడందామంటే రేపు చంద్రబాబు ఇక్కడ ఒకవేళ గెలిస్తే దానికి ఏం కారణం చెప్పుకుంటాం? దిగ్విజయ్ సింగ్ దళితుల అభివృద్ధి కాంక్షను గుర్తించి గౌరవించాడని దళిత మేధావులలో అతనిని అభినందించే వారున్నారు. అయినప్పటికీ అతనికంటే ఉమాభారతికే మధ్యప్రదేశ్‌లో ప్రజాదరణ ఎక్కువ ఉందని ఆశ్చర్యపోవాలా, లేక అందువల్లనే అగ్రకులాలు కుట్ర చేసి అతనిని ఓడించారనుకోవాలా అంటే ఈ జవాబయినా ఆ జవాబయినా జరిగిపోయిన ఘటనకు మనకు నచ్చిన కారణం చెప్పుకోవడమే అవుతుంది తప్ప హేతుబద్ధమైన వివేచన కాదు, విశ్లేషణ కాదు.

## సంఘ్ పరివార్ పైన పోరు

ఈ మధ్య కాలంలో అభ్యుదయవాదుల విశ్లేషణలలో దర్శనమిచ్చే కారణం ఎన్నికలలో నిజంగానే ఫలితం ఇచ్చిన ఏకైక సందర్భం ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో దళిత – బహుజన రాజకీయాలు బిజెపి ఎదుగుదలను ఆపిన వైనం. 'సంఘ్ పరివార్ రాజకీయాలు మన రాజకీయాలు కావు' అన్న సందేశాన్ని దళిత బహుజన ప్రజానీకంలోకి బలంగా పంపించగలగడం నిజంగానే ఫలితం ఇచ్చింది. వేరే ఏ ప్రయత్నమూ ఆ ఫలితాన్ని ఇచ్చేది కాదు. అదే జరగకపోతే ఉత్తరప్రదేశ్, బీహార్‌లు కూడా సంఘ్ పరివార్ జేబులో ఉన్నట్టయితే, దేశం పరిస్థితి ఈపాటికి ఎంత ఘోరంగా ఉండేదో?

దురదృష్టమేమిటంటే ప్రస్తుత తరంలో దళిత బహుజన రాజకీయాలు అవినీతిమయమయిన రాజకీయ వ్యవస్థలో అంతర్భాగంగా ఎదుగుతున్నాయి. రాజకీయ వాతావరణం మొత్తం కలుషితమయి ఉన్నప్పుడు కొత్తగా ఎదుగుతున్న రాజకీయ శక్తులు దానినే ప్రమాణంగా ఎంచుకోవడం కొంతమేరకు అర్థం చేసుకోగల విషయమే కావచ్చును గానీ అది నిస్సందేహంగా దురదృష్టకరం. 'మావాళ్లు కూడ మీ అంత నిర్లజ్జగా అవినీతికీ ఆశ్రిత పక్షపాతానికీ పాల్పడగలరు చూడండి' అని అగ్రకులాల అవినీతిని సవాలు చేసి సంతోషించే దళిత బహుజన మేధావులు ఉండడం మరీ దురదృష్టకరం.

ఈ కారణంగా ఉత్తరప్రదేశ్ – బీహార్‌లలో మొదలయిన దళిత – బహుజన ప్రతిఘటన అవినీతికీ అధికార దాహానికీ బలయి, అందులో ఒక వర్గం కాకపోతే ఒక వర్గం తన మనుగడ కోసం సంఘ్ పరివార్‌తో చేతులు కలుపుతున్నది. దీనితో తిరిగి పుంజుకునే అవకాశం కాషాయవాదులకు లభించింది.

అదెట్లాగున్నా, సంఘ్ పరివార్ రాజకీయాలను లౌకికవాదం అనే అమూర్తమైన విలువతో ప్రతిఘటించడం కన్నా, మైనారిటీలకు ప్రమాదకరం అనే నినాదంతో ఎదుర్కోవడం కన్నా, హైందవ సమాజంగా గుర్తించబడే సమాజంలోనే మెజారిటీ ప్రజలకది శత్రువని గుర్తించి ప్రతిఘటించినప్పుడే దానిని నిలువరించడం సాధ్యం అన్న ప్రాథమిక రాజకీయ సత్యాన్ని ఉత్తరప్రదేశ్ – బీహార్‌లు నేర్పాయి. అది దేశంలో అన్ని చోట్లా మాయావతి – ములాయం – లాలూ యాదవ్‌ల నమూనాతోనే ఉండవలసిన అవసరం లేదు. అయితే నమూనా ఏదయినా రేపటి రాజకీయాలలో ఈ ఎరుక ఒక ప్రధాన అంశం కావలసి ఉంది.

# దేశాన్ని 'వెలిగించ'డానికి తగలబెట్టడమూ ఒక మార్గమే

అతి నీచమైన విద్వేష రాజకీయాల నుండి మధ్యతరగతిని ఆకర్షించే 'అభివృద్ధి' ప్రేలాపన దాకా ఒక పెద్ద వారధి నిర్మించి దానిపైన అధికార శిఖరాలకు పరుగులు పెడదామన్న ఆలోచన భారతీయ జనతాపార్టీ నాయకులలో స్పష్టంగానే కనిపిస్తున్నది. వాళ్ళు గుజరాత్‌లో పచ్చి ద్వేషాన్ని ప్రచారం చేసి గెలిచారు. ఆ తరువాత జరిగిన మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికలలో ట్యూన్ మార్చి 'అభివృద్ధి' గురించి మాట్లాడి గెలిచారని పత్రికలు మనకు చెప్తున్నాయి. ఊరికే చెప్పడం కాదు, అదేదో గొప్ప ఎత్తుగడ అయినట్టు పొగిడాయి కూడా. భారతీయ జనతాపార్టీ జనసంఘ్‌గా ఉన్న రోజులలో సహితం వారిలో 'మంచి'ని చూడాలన్న ఆరాటం మధ్యతరగతిలో చాలా ఉండింది. ఇప్పుడది నిండుగా వికసించింది.

నిన్నటి రోజు ద్వేషాన్ని పక్కనపెట్టి అభివృద్ధిపాట పాడినవారు రేపు అభివృద్ధికి గోలీమారో అని చెప్పి తిరిగి ద్వేషాన్ని ప్రచారం చేసే ఎన్నికల ఎత్తుగడ అనుసరించగలరు. మొన్న హైదరాబాద్‌లో జరిగిన ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశంలో బిజెపి నుడికారం మారిపోయిందనిపించే ప్రకటనలు, వ్యాఖ్యలు ఒక పక్కన వెలువడుతుండగా లాల్‌కిషన్ అద్వానీ ఏమీ మారలేదని స్పష్టంచేస్తూ ఉపన్యసించాడు. గుళ్ళు గోపురాల సంగతి మరిచిపోలేదని హామీ యిచ్చాడు.

అయినా ఓట్ల చాపల్యం భారతీయ జనతాపార్టీ నాయకులను 'తప్పుదోవ' పట్టించే ప్రమాదముందని భావించిన విశ్వహిందూ పరిషత్ నేతలు దాదాపు అదే సమయంలో హైదరాబాద్‌లో తమ కార్యవర్గ సమావేశమో, మరొకటో నిర్వహించుకొని చెక్కుచెదరని హిందూత్వ విషాన్ని కక్కారు. ఈ దేశంలో హిందువులను కాపాడే పార్టీ ఒక్కటి కూడ లేదన్న సవాలును బిజెపికి హెచ్చరికగా ప్రకటించారు. భారతీయ జనతాపార్టీ లాగే విశ్వహిందూ పరిషత్ కూడా ఆర్ఎస్ఎస్

---

వీక్షణం పక్షపత్రిక, ఫిబ్రవరి 1–15, 2004

కనుసన్నలలో నడుచుకుంటుందని గుర్తుంచుకుంటే మనం విన్నది భిన్నస్వరాలు కాదనీ అంతా కలిసి ఒకే స్వరం వినిపిస్తున్నారనీ అర్థం చేసుకోగలుగుతాం.

కానీ తేడా చూడడానికి కంకణం కట్టుకున్న మేధావివర్గ మొకటి ఈ దేశంలో ఉంది. వాజ్‌పేయి భారతీయ జనతాపార్టీ గమ్యాన్ని మార్చేసాడనీ, అభివృద్ధి అజెండాను స్థిరంగా నిలబెట్టేశాడనీ కలకత్తా నుండి ప్రచురితమయ్యే టెలిగ్రాఫ్ దినపత్రిక సంపాదకీయమే రాసేసింది. శరీరంలో ఏ అవయవమయినా పనిచేస్తున్నదా అని అనుమానం వేసే ఆ వృద్ధుడి గుణగణాల మీద వారికి నిజంగా అంత విశ్వాసముందనుకోవాలా, లేక నమ్మదలచుకున్నది నమ్ముతున్నారా?

భారతీయ జనతాపార్టీ సారథ్యంలో ఇండియాకు అంతర్జాతీయ రంగంలో కొత్త గుర్తింపు, గౌరవం లభించాయనీ, చైనా గురించి మాట్లాడుకున్న స్వరంతో ఇప్పుడు ఇండియా గురించి మాట్లాడుకుంటున్నారనీ, ఇండియా "వెలిగి పోతున్న"దనీ కార్యవర్గ సమావేశాని కొచ్చిన బిజెపి నాయకులన్నారు. అది వెలుగే అయితే, దానిని సాధించడం ఘనతే అయితే దానికి వాజ్‌పేయికి ఎంత కితాబు ఇవ్వాలో పి.వి. నరసింహారావుకు, మన్మోహన్‌సింగ్‌కు కూడా అంతే ఇవ్వాలి.

భారతదేశపు 'మధ్యతరగతి మార్కెట్' విశ్లేషకులు చెప్పుకునేంత ఆకర్షణీయంగా విదేశీయులకు కనిపించకపోయినప్పటికీ మన పాలకులు ప్రపంచబ్యాంకు ఆర్థిక సంస్కరణల పంథాలో ప్రయాణించడం మొదలుపెట్టిన నాటి నుండి పాశ్చాత్యుల ఆకలి గొన్న కళ్ళకు ఇండియా కొంచెం కొత్తగా కనిపిస్తున్న మాట సత్యమే. ఐటి రంగంలోనూ మొత్తంగా కమ్యూనికేషన్ రంగంలోనూ ఇండియన్లకు కొంత గుర్తింపు లభించిన మాటా సత్యమే. భారతీయులెవరయినా వెలిగిపోతుంటే అది ఈ వర్గమేనని చెప్పుకోవచ్చు. అయితే ప్రవాస భారతీయుల సదస్సులు జరిపి ఈ వెలుగును ప్రదర్శించుకోవడం తప్ప దీనికి – ఇదొక గొప్ప విషయమని అనుకున్నా – భారతీయ జనతా పార్టీ ప్రత్యేకంగా చేసిందేమీ లేదు.

పాకిస్తాన్‌తో స్నేహసంబంధాలు మెరుగుపడే వాతావరణం నెలకొల్పిన ఘనతా తమదేనని వీరు చాటింపు వేసుకుంటున్నారు. వారు పాడుచేసిన దానిని వారే బాగుచేస్తున్నారు తప్ప కొత్తగా చేసిందేమీ లేదు. వేరే ఏ పార్టీ అయినా చేస్తే వీరే అడ్డం పడుదురు. పాకిస్తాన్‌తో బస్సు, రైలు, విమానాలు రద్దు చేసింది వీరి

ప్రభుత్వమే. వాటిని చాలా ఆలస్యంగా పునరుద్ధరించి అది కూడ అపూర్వమైన ఘనకార్యమేనంటే ఎట్లా? ఇక చర్చల మాటకొస్తే ఈ రెండు దేశాలనూ చర్చల వైపు నెట్టింది అమెరికా అనేది అందరూ ఎరిగిన రహస్యమే. ఇస్లామాబాద్ ప్రకటన వెలువడిననాడే అమెరికా అంత మాట అనేసింది. అదేమీ లేదని మనవాళ్ళు తెలిపిన అభ్యంతరానికి అమెరికా జవాబు సహితం చెప్పలేదు. పాకిస్తాన్‌లోని సరిహద్దువద్ద భారత్ ఏడు లక్షల సైన్యాన్ని మోహరించి ఏ క్షణమైనా యుద్ధానికి పాల్పడవచ్చునన్న వాతావరణాన్ని కల్పించి సంవత్సరంన్నర కాలేదు. అంతలోనే మన పాలకుల మనసు నిజంగా మారిపోయి, శాశ్వతమైన శాంతికి వారు మనస్ఫూర్తిగా కృషిచేస్తున్నారని నమ్మాలా? పాకిస్తాన్‌ను ఎప్పటికయినా జయించి భారత్‌లో కలుపుకోవడం అనే లక్ష్యాన్ని వీరు తమ శాఖలలో దశాబ్దాలుగా నూరిపోస్తున్నారు. దానిని వదులుకున్నామని ఒక్క మాట చెప్పమనండి చూద్దాం.

బయట దేశాన్ని వెలిగింప చేస్తున్నారట, ఆ 'విజయాన్ని' చెప్పుకొని ఇంట్లో ఎన్నికలకు దిగుతారట. దేశం లోపల ఏం చేస్తున్నారో ఒకసారి గమనించండి. ద్వేషాన్ని వ్యాపింపచేయడం దేశం లోపల వీరి ప్రధాన అజెండా. ముస్లింల పట్ల ద్వేషం, క్రైస్తవుల పట్ల ద్వేషం, అభ్యుదయం పట్ల ద్వేషం, స్వేచ్ఛ పట్ల ద్వేషం, భిన్నత్వం పట్ల ద్వేషం – ఇదీ వీరి అజెండా. దానిని అమలుచేయడం ఆపారేమో ఒకసారి అడగండి.

ఎన్నికలను ఆహ్వానిస్తూ సంఘ్‌పరివార్ రాజకీయ ముఖం అయిన భారతీయ జనతా పార్టీ నాయకులు చేసిన ప్రకటనలలో, వ్యాఖ్యలలో ఆ పార్టీ నాయకత్వాన సాధించిన ఆర్థికరంగ అభివృద్ధి, ఇండియా 'ఇమేజ్'ను అంతర్జాతీయంగా పెంచిన వైనం, ఇస్లామాబాద్ ప్రకటన మొదలైన విషయాలు మాత్రమే ఉన్నాయి. వారి పరివారంలోని ఇతర సోదరులు సాధించిన 'విజయాల' ప్రస్తావన లేదు. ఆ పరివారంలో తేళ్ళు, జెర్రులూ ఉన్నాయి. వాటి నుండి తాము దూరం అయినట్టు మాటవరసకు కూడ బిజెపి నాయకులు ఎన్నడూ అనలేదు. అనకపోగా, బిజెపికి సంపూర్ణ మెజారిటీ లభించినప్పుడు తమ అసలు అజెండా అమలు చేస్తామనీ దానిని వదిలిపెట్టలేదనీ  వారు పదే పదే ప్రకటిస్తున్నారు కూడా. ఆ 'అసలు అజెండా' బజరంగ్‌దళ్ అజెండా, విశ్వహిందూ పరిషత్ అజెండా,

ఆర్ఎస్ఎస్ అజెండా. దానిని అమలు చేసిన గుజరాత్‌ను దేశానికే నమూనాగా బిజెపి నాయకులు అలుపెరగకుండా కీర్తించిన సంగతి మనం మరచిపోకూడదు. బిజెపి ఎక్కడ అధికారంలో ఉన్నా అక్కడంతా తమ పరివారంలోని విషపురుగులను స్వేచ్ఛగా సంచరించనిస్తుంది. వారు చేసే విధ్వంసాన్ని చూసీచూడనట్టు పొమ్మని తన అదుపులోని పోలీసు యంత్రాంగాన్ని ఆదేశిస్తుంది. వారు చేసే దైనందిన విద్వేషవ్యాప్తి యథేచ్ఛగా సాగనిస్తాడేగానీ ఎప్పుడయినా మీరు అన్యాయమైన పనిచేస్తున్నారని ఢిల్లీలోని వారి ప్రధాన ముఖోటా ఆవేదన వ్యక్తం చేస్తాడా? విశ్రాంతి కోసం కేరళకో కన్యాకుమారికో పోయినప్పుడు ఒక కవిత రాసి దేశంమీద వదులుతాడు. దాన్ని పట్టుకొని చూసావా బెజెపి మారిపోయింది అంటూ మీడియా విశ్లేషకులు, మేధావులు సంబరపడిపోతుంటారు.

కానీ జరిగేది జరుగుతూనే ఉంటుంది. గుజరాత్, రాజస్థాన్‌ల నుండి ఒరిస్సాదాకా ఆదివాసులలో ద్వేష రాజకీయాలను వ్యాపింపజేయడంలో ప్రధాన పాత్ర వహించిన వనవాసీ కళ్యాణ్ పరిషత్ అనే సంఘ్ పరివార్ సంస్థ ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీలోకి కూడ ఈ మధ్యనే ప్రవేశించిన సంగతి ఎంతమంది గమనించారు? మొన్నటిదాకా రాజకీయంగా అమాయకులయిన ఎన్‌జివోలుగా వ్యవహరించిన వారు ఇప్పుడు వారికి అండగా నిలబడ్డారు. సదస్సులూ, కార్యక్రమాలూ చేపడుతున్నారు. ప్రస్తుతం ఆదివాసుల హక్కుల గురించే మాట్లాడుతున్నారు కాని కొంచెం బలం పుంజుకున్న తరువాత క్రైస్తవ మిషనరీలపైన ద్వేష ప్రచారం ప్రారంభిస్తారు. ఆగ్రహమే తప్ప ద్వేషం ఎరుగని ఆదివాసీ సంస్కృతికి ద్వేషం నేర్పిస్తారు. ఆ ద్వేషం క్రైస్తవం దగ్గర ఆగదు. దానిని సంఘ్‌పరివార్ రాజకీయాల కొక సాధారణ ఆయుధంగా మలచుకుంటారు. అంతా జరుగుతూనే ఉంటుంది. భారతీయ జనతా పార్టీకి ఎక్కడ అధికారం ఉంటే అక్కడ దాని గొడుగుకింద ఇదంతా భద్రంగా సాగిస్తుంటుంది. తనకు స్వంతంగా అధికారం లేనిచోట మిత్రపక్షాల అధికారాన్ని (అది తెలుగుదేశం కావచ్చు, అన్నాడిఎంకె కావచ్చు) అందుకోసం వాడుకుంటుంది. కానీ బిజెపి మాత్రం ఈ అజెండా గురించి మాట్లాడడం మానేసి 'ఇండియా వెలిగిపోతోంది' అంటూ ప్రవాసం మీద కన్నున్న మధ్యతరగతిని ఆకర్షించే ప్రవచనాలకు తన ప్రచారంలో పెద్దపీట వేస్తుంది.

'చూసావా, వాళ్ళు మారిపోయారు' అని మీడియా పెద్దలు విశ్లేషిస్తుంటారు. మీడియానూ మధ్యతరగతినీ ఆకర్షించడానికి ముఖోటీల చమత్కారి వాజ్‌పేయి, ఎవరికీ హాని చేయడనిపించే ప్రమోద్ మహాజన్, ఇప్పుడే ఇంగ్లండ్ నుండి దిగొచ్చినట్టు కనిపించే జస్వంత్‌సింగ్, పిల్లలకు బిస్కట్లు కొనిచ్చే పక్కింటి మామయ్యలాంటి వెంకయ్య నాయుడు వంటివాళ్ళు చాలామంది ఉన్నారు. వీళ్ళంతా దారాసింగ్‌నూ ప్రవీణ్ తొగాడియాను సమర్థిస్తూ మాట్లాడినప్పుడు వీళ్ళలోని విషయం బయటపడుతుంటుంది గానీ మామూలుగా వీళ్ళు ఇండియాను 'వెలిగింప'జేసే పెద్దమనుషులుగానే చెలామణి అవుతుంటారు. అయినా దేశాన్ని తగలబెట్టడం కూడ వెలిగింపజేసే ఒక మార్గమే కదా !

# భాజపా 'విజన్' - మతోన్మాద ఫాసిజానికి ముసుగు

రాజకీయవాదులు మాట్లాడే మాటలను ఉన్నదున్నట్లు అర్థం చేసుకునేటట్టయితే ఏమీ అర్థంకాని స్థితి వస్తుంది. ముందు చెప్పినవీ వెనుక చెప్పినవీ పైన చెప్పినవీ లోన చెప్పినవీ అధికారికంగా చెప్పినవీ అనధికారికంగా చెప్పినవీ అన్నీ కలిపి అర్థం చేసుకోకపోతే ఏమీ అర్థం చేసుకోలేము.

అయోధ్య గురించి బి.జె.పి. వారి విజన్ పత్రంలోనూ, దాని విడుదల సందర్భంగానూ చెప్పిన విషయాలొకసారి చూడండి.

'అయోధ్య విషయంలో అందరూ కోర్టు తీర్పుకు కట్టుబడి ఉండటమే ఉత్తమం.'

'ఆ సమస్య హిందువులకూ ముస్లింలకూ మధ్య చర్చల ద్వారా పరిష్కారం కావడం సరయినది.'

'అయోధ్యలో రామాలయం కడతాం. రామజన్మస్థలంలోనే కడతాం. దేశంలో మత సామరస్యానికి ఆది చాలా బలాన్ని ఇస్తుంది.'

ఈ మూడు ప్రకటనలూ విన్నాము, వింటున్నాము కదా? అక్కడే రామాలయం కట్టడానికి కోర్టు తీర్పు అనుకూలించకపోతే ఏమవుతుంది? కోర్టు తీర్పు హిందువులకు గానీ, ముస్లింలకుగానీ (ఇద్దరికీ గానీ) నచ్చకపోతే ఏమవుతుంది? అక్కడే రామాలయం కట్టాలన్న ఒప్పందం చర్చలలో కుదరకపోతే ఏమవుతుంది?

అందువల్ల ఈ ప్రకటనలు అసంబద్ధమైనవనే నిర్ణయానికి మీరు వస్తున్నారా? దయచేసి ఆ పొరబాటు చేయొద్దు. హిందూత్వ వాదులలో చాలా లోపాలున్నాయిగానీ తర్కలోపం లేదు. వారి తర్కాన్ని మీరు అర్థం చేసుకోవాలంటే పై మూడు వాక్యాలను కింది నుండి మీదికి చదవండి. రామాలయం అక్కడే కట్టాలి. దానికి ముస్లింలు చర్చలలో ఒప్పుకోవాలి. అప్పుడే వారిపైన దాడులు

---

వీక్షణం పక్షపత్రిక, ఏప్రిల్ 1-15, 2004

ఆగుతాయి. ఈ రాజీని కోర్టు ముందు పెట్టాలి. కోర్టు తన తీర్పులో దానికి ఆమోదముద్ర వేయాలి. (లాయర్లు దీనిని కాంప్రమైజ్ డిక్రీ అంటారు)

ఇప్పుడు ఏ అసంబద్ధతా లేకుండా స్పష్టంగా అర్థం అయింది కదా? కోర్టు తీర్పుకే అందరూ కట్టుబడి ఉండాలంటే అర్థం కోర్టు తన బుద్ధికి తోచిన రాజీ ప్రతిపాదించవచ్చునని కాదు. బయట జరిగే రాజీని కోర్టు ఆమోదించాలని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని అర్థం. రాజీ చర్చలతో అది పరిష్కారం కావాలంటే అర్థం ముస్లింలు తమ బుద్ధికి తోచిన రాజీ ఫార్ములాను ప్రతిపాదించవచ్చునని కాదు. అక్కడే రామాలయం కట్టాలన్న రాజీకే ఒప్పుకోవాలని అర్థం.

ఇప్పుడంతా ఖుల్లాగా అర్థం అయింది కదా?

ఇక్కడ తార్కిక అసంబద్ధత లేదుగానీ నైతిక అసంబద్ధత దండిగా ఉంది. చర్చలు, రాజీ అంటూ పరిష్కారం నేను ముందే నిర్ణయిస్తాననడం, కోర్టు తీర్పే శిరోధార్యం అంటూ మేము బయట కుదిర్చే రాజీకే కోర్టు ఆమోదముద్ర వేయాలనడం నైతికంగా అసంబద్ధమైన ప్రవచనాలు. అందులో అసంబద్ధత కనిపించకపోవడం సంఘ్‌పరివార్ దృష్టికోణంలోని విలక్షణత. వారి బుద్ధే అటువంటిది.

భారతీయ జనతాపార్టీ వారి 'విజన్'లోని అన్ని విషయాలను ఈ విధంగా తర్జుమా చేసుకొని అర్థం చేసుకోవాలి. తర్జుమా చేసుకోవడానికి మనకో నిఘంటువు కావాలి. ఆ నిఘంటువు గోల్వాల్కర్ సాహిత్యం. వీరి ప్రతీ వాక్యాన్నీ వారి మాటలలోకి అనువదించుకున్నప్పుడే స్పష్టత వస్తుంది.

భారతదేశాన్ని 2020 నాటికి ఒక అగ్రరాజ్యం (గ్రేట్‌పవర్, సూపర్‌పవర్ అనేవి వారు వాడుతున్న పదాలు) చేయాలన్నది బి.జె.పి. 'విజన్'లోని ఒక ముఖ్య అంశం. గోల్వాల్కర్ ఆలోచనా విధానంలో ఇది కేంద్ర బిందువు. నిన్నటి దాకా భారత రాజకీయాలలో అగ్రరాజ్యం అనేది ఒక చెడ్డమాట. ఆర్ఎస్ఎస్ శాఖలలో తప్ప వేరే ఎక్కడా దానినొక గౌరవనీయమైన భావనగా ఎవరూ అనుకోలేదు. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్ యుద్ధాల తరువాత సాధారణ మనుషులు కూడా అగ్రరాజ్యం అనే మాటను అసహ్యించుకుంటున్నారు. ప్రపంచంలో అగ్రరాజ్యాలనేవి లేకుండా

ఎట్లా చేయాలనేది సాధారణ ప్రజాతంత్ర స్పృహ ఉన్న వారందరినీ కదిలిస్తున్న విషయం కాగా, మనము సైతం ఒక అగ్రరాజ్యం అవుదామన్న 'విజన్'ను బి.జె.పి. ప్రతిపాదిస్తున్నది. అధికారాన్ని ఆరాధించే గుణం సంఘ్ పరివార్ నరనరాలలోనూ వ్యాపించి వున్న ఒక వికారమైన లక్షణం. వాళ్ళ గురువులు హిట్లర్‌ను ఊరికే ఆరాధించలేదు. అక్కడి నుండే భారత్ ఒక అగ్రరాజ్యం కావాలన్న కాంక్ష పుట్టింది. గోల్వాల్కర్ రచనలలో అది పదే పదే వ్యక్తమవుతుంది. ఇప్పుడు మన దౌర్భాగ్యం కొద్దీ మనల్ని ఇంకొంతకాలం ఏలబోయేవారు దానిని దేశానికే 'విజన్' చేసేశారు.

మైనారిటీల విషయంలోనూ ఈ 'విజన్'లో దాడులు, మారణకాండ ఇక మీద జరగబోవన్న హామీ ఏదీ లేకపోగా, ముస్లింలు గతాన్ని మరచిపోవలసిన సమయం ఆసన్నమైందని అద్వానీ పదే పదే అంటున్నాడు ('రికన్సిలేషన్'కు సిద్ధం కావాలన్నది ఆయన వాడుతున్న మాట). దేశంలో ఎనభైరెండు శాతం ప్రజల (అంటే హిందువుల) మనోభావాలను లెక్కచేయకుండా పాలనసాగే రోజులు పోయాయనీ, పద్దెనిమిది శాతాన్నే పౌరులుగా భావించే కాలం గడచిపోయిందనీ వ్యాఖ్యానిస్తున్నాడు. మైనారిటీలకు విద్య, ఆర్థిక పురోగతి కల్పిస్తామన్న 'విజన్' హామీని ఈ అర్థరహిత ప్రేలాపనతో కలిపి అర్థం చేసుకోవాలి. గుజరాత్‌ను, బాబ్రీమసీదును, గ్రహం స్టెయిన్స్‌ను మైనారిటీలు మరచిపోవాలి. తమ మీద ప్రత్యేకమైన దృష్టి పెట్టడం అవసరం అన్న ప్రజాతంత్ర రాజకీయ డిమాండ్‌ను విడిచిపెట్టాలి. అద్వానీ చెబుతున్నట్టు హిందువులు–ముస్లింలు అన్న తేడాను మరచిపోవాలి. (మరచిపోవలసింది ముస్లింలే, హిందువులు కాదు – హిందువులు కూడా హిందూ అన్న భావనను మరచిపోవాలని ఒక ఆర్ఎస్ఎస్ నాయకుడు అనగలడా? అపచారం ! అపచారం !) అప్పుడు వారి విద్య, ఆర్థిక పురోభివృద్ధులకు ప్రభుత్వం చేయూతనిస్తుంది.

ఆర్థిక రంగంలో – దేశంలోని నగరాలను ప్రపంచంలోని ప్రధాన నగరాలను తలపింప చేసేటట్టు తీర్చిదిద్దుతామన్నదీ, మరొక హరిత విప్లవం సాధిస్తామన్నదీ, చిన్న తరహా పారిశ్రామిక రంగాన్ని ప్రత్యేకంగా అభివృద్ధి చేస్తామన్నదీ ప్రధానంగా ఇచ్చిన హామీలు. ఇవి ఇప్పటికే మొదలయ్యాయి కాబట్టి వీటి భావమేమిటో అనుభవపూర్వకంగా చెప్పవచ్చు.

హైదరాబాద్‌ను సింగపూర్ నమూనాలో మార్చడానికి చంద్రబాబు మొదలుపెట్టిన ప్రయత్నం, దాని ఫలితాన్ని ఈ నగర వాసులందరం చూస్తున్నాం. అప్పుడప్పుడు నగరానికి వచ్చిపోయే వారికి పెరిగిన రోడ్ల వెడల్పూ, వీధికొక్క ఫ్లైఓవరూ, కళ్ళు మిరుమిట్లు గొలిపే లైట్లూ దీనికి సంకేతాలుగా కనిపించవచ్చును గానీ ఇక్కడుండే వారికి దీని అసలు భావం గుడిసెల కూల్చివేత అని తెలుసును. 'కర్మన్‌ఘాట్'కు పోతావా, కూకట్‌పల్లికి పోతావా' అన్నది ఈ నగర అభివృద్ధి నినాదం. తాతల కాలం నుండి ఇక్కడే ఉంటున్నాం. ఇక్కడే ఇళ్ళపట్టాలు ఇవ్వండి అని అడిగిన వారందరితోనూ నగరం మధ్యభాగానికి ఇరవై కిలోమీటర్ల దూరాన ఉన్న ఈ రెండు ప్రాంతాల పేర్లు చెప్పి ఇక్కడో అక్కడో స్థిరపడతామని ఒప్పుకుంటే వెంటనే పట్టా ఇచ్చి వెళ్ళగొట్టేస్తామని దయగల కలెక్టర్లు ఇక్కడ అయిదేళ్ళుగా అంటున్నారు.

ఇక రెండవ హరిత విప్లవం – ఇది మొదటి హరిత విప్లవం కంటే చాలా భిన్నంగా ఉండబోతుంది. నిజానికి ఇదేమంత 'హరితంగా' ఉండబోదు. యూరప్‌లో మార్కెట్ ఉన్న పూతోటలూ రొయ్యల చెరువులూ వ్యాపార ప్రయోజనం ఉన్న కలప మొక్కలూ వర్ధిల్లబోతాయి. మొదటి హరిత విప్లవంలో ఎన్ని లోపాలున్నా అది ఆహారం కొరతను కొంత తగ్గించింది. వ్యవసాయ కార్మికులకు కొంత పని కల్పించింది. రేపు రాబోయే 'మరొక్క హరిత విప్లవం' ఈ రెండు సమస్యలనూ పెంచబోతుంది. ప్రపంచ వాణిజ్య సంస్థ కట్టుబాట్లను తిరస్కరించి మరొక్క హరిత విప్లవం గురించి మాట్లాడితే దాని నుండి ఏమైనా ప్రయోజనం ఆశించి ఉండవచ్చునేమో గానీ ఈ 'విజన్'లో మన 'అసలు' పాలకుల గురించి ఒక్క ముక్కా లేదు. సోనియాగాంధీ జన్మస్థలం తప్ప వేరే ఏ విదేశీ విషయం ప్రస్తావనా లేదు ! వీరు తీసుకురాబోయే హరిత విప్లవం గ్రామీణ ప్రాంతాలలో ఆకలిని పెంచబోతుంది.

కశ్మీర్ విషయానికొచ్చేసరికి ఆర్టికల్ 370ని రద్దు చేయాలి అన్న నినాదాన్ని విడిచిపెట్టి, టెర్రరిజం ప్రస్తుతం ప్రధాన సమస్య అన్నారని ఈ 'విజన్'ను వ్యాఖ్యానించిన వారంతా గుర్తించారు. దానికి కారణం స్పష్టమే. హురియత్ కాన్ఫరెన్స్‌తో చర్చలు బి.జె.పి. వారు కొత్తగా తగిలించుకున్న శాంతిదూతలు

వేషానికి చాలా అవసరం. ఢిల్లీతో బేషరతు చర్చలకు ఒప్పుకున్నందుకు హురియత్ కాన్ఫరెన్స్ ఇప్పటికే కశ్మీర్‌లో సగం పరువు పోగొట్టుకుంది. ఢిల్లీ పాలకులు ఆర్టికల్ 370ని రద్దు చేస్తామన్న ప్రకటనను పునరుద్ఘాటించినట్టయితే మిగిలిన పరువు పోతుందన్న భయానికి హురియత్ నేతలు చర్చలకు తెగతెంపులు చేసేసుకోగలరు. అప్పుడు శాంతి వేషం ఏమయిపోవాలి?

ప్రజాఉద్యమాల నుండి వస్తున్న ఒకే ఒక డిమాండును ఈ 'విజన్' నేరుగా ప్రస్తావించింది. అది కూడా తిరస్కరించడానికే ప్రస్తావించింది. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించాలన్న అతిముఖ్యమయిన డిమాండ్‌ను ప్రస్తావిస్తూ, దాని బదులు ఎస్‌సి, ఎస్టీలకు ఎక్కువ ఉద్యోగాలు ఇచ్చే సంస్థలకు పన్నులలో తగ్గింపులు ఇచ్చే ఆలోచన చేద్దామని అంటుంది. అక్కడికేదో అందరూ పన్నులు కట్టేస్తున్నట్టు, మన పాలకులు సేకరించేస్తున్నట్టు! అయినా ఒక హక్కుగా కల్పించమని అడిగితే, దయతో ఇచ్చే వాటికి నేను రాయితీ ఇస్తాననడం ఏం జవాబు?

బి.జె.పి. తన విజన్‌ను ప్రకటించిందంటే రెండు విషయాలలో ఏమైనా విధానపరమైన మార్పు ఉందేమోనని వెతకడం సహజం. ఒకటి వారి అధికార భావజాలమైన సాంస్కృతిక జాతీయవాదాన్ని (అంటే నువ్వు ఏ దేవుడినైనా కొలుచుకో, కాని హైందవ సంప్రదాయం జాతి వారసత్వమని ఒప్పుకో) ఏమైనా మార్చుకున్నారా అనేది, రెండు ఆర్థిక సంస్కరణల గురించి ఏమైనా పునరాలోచన చేస్తున్నారా అనేది. ఈ రెండు విషయాలలోనూ ఏమీ తేడా లేదనేది వారి విజన్ సారాంశాన్ని చదివినా స్పష్టం అవుతుంది.

# ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరితీయాలి?

ఇష్టమొచ్చిన పనిచేసేసి, 'ప్రజలు కోరుకుంటున్నారు కాబట్టి చేశాను' అనడం తెలిసిందే. ఈ మధ్య న్యాయస్థానాలు కూడా కఠినమైన శిక్షలు వేసి 'ప్రజలు కోరుకుంటున్నారు' అనడం మొదలుపెట్టాయి. గాయపడ్డ భారత ప్రజల మానసిక ఆవేదనకు ఉపశమనం లభించాలంటే మహమ్మద్ ఆఫ్జల్‌ను ఉరితీయవలసిందేనని సుప్రీంకోర్టు ప్రకటించి అఫ్జల్‌కు కింది కోర్టు విధించిన మరణశిక్షను ధృవీకరించింది.

ఇది అర్థంలేని వాదన. భారత ప్రజల మనోభావాలు సుప్రీంకోర్టుకు ఎట్లా తెలుసన్న ప్రశ్నను పక్కన పెడదాం. అసలు అఫ్జల్ మీద ఉన్న నేరారోపణ ఏమిటో, దానికి మద్దతుగా ఏపాటి సాక్ష్యాలు పోలీసులు సేకరించారో భారత ప్రజానీకానికి తెలుసా? తెలియనప్పుడు అతనికి ఏ శిక్ష వేయాలన్న చర్చకు 'భారత ప్రజల' మనోభావాలతో ఏం సంబంధం ఉండగలదు? సగటు భారత పౌరులు మహమ్మద్ అఫ్జల్ ప్రత్యక్షంగా పార్లమెంట్‌పైన జరిగిన దాడిలో పాల్గొన్నాడనో, లేదా తానే వెనకుండి కుట్రపన్ని నడిపించాడనో అనుకుంటుండవచ్చు. ఇది నిజంకాదని సుప్రీంకోర్టుకు తెలుసును.

13 డిసెంబర్ 2001నాడు పార్లమెంట్‌పైన జరిగిన దాడిలో పాల్గొన్న వారందరూ అక్కడికక్కడే ఎదురు కాల్పులలో మరణించారు. ఆ తరువాత నేర విచారణ ఎదుర్కొన్న మహమ్మద్ అఫ్జల్, షౌకత్ హుస్సేన్ గురు, ఎస్.ఏ.ఆర్. గిలానీ, అఫ్సాన్ గురులు దాడి జరిగిన సమయంలో అక్కడ ఉండి పాల్గొన్నారన్నది కాదు పోలీసుల అభియోగం – చనిపోయిన ఐదుగురు, ఈ నలుగురు, పాకిస్తాన్‌లో ఉన్న ఘాజీబాబా, మౌలానా మసూద్ అజర్, అబు జిహాదీ, తారిక్ అహమ్మద్ అనే వాళ్ళంతా ఈ నేరానికి కుట్ర చేశారనీ, ఆ కుట్ర ఫలితమే చనిపోయిన ఐదుగురు చేసిన దాడి అనీ అభియోగం. వీరందరూ పాకిస్తాన్ కేంద్రంగా గల

---

వీక్షణం మాసపత్రిక, డిసెంబర్ 2006

***ఎవరికి సంకేతాలు పంపడానికి అఫ్జల్‌ను ఉరితీయాలి?***

జైష్–ఇ–మహమ్మద్ అనే సాయుధ మతవాద సంస్థ సభ్యులనేది పోలీసు కథనం.

పార్లమెంట్‌పైన దాడి జైష్–ఇ–మహమ్మద్ పనేనని ఆరోపించడమే కాక, ప్రసార మాధ్యమాలలో విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కేసు విచారణ సమయంలో దీనికి ఆధారంగా ఏ ఒక్క సాక్ష్యం చూపించలేదు. విశ్వసనీయ సాక్ష్యం కాదు. ఎటువంటి సాక్ష్యమైనా ఆవగింజంత కూడ చూపించలేదు. పాకిస్తాన్‌కు చెందిన జైష్–ఇ–మహమ్మద్ నాయకులు ఘాజీబాబా, మౌలానా మసూద్ అజర్‌లతో నేర విచారణ ఎదుర్కొన్న నలుగురికీ సంబంధాలు ఉన్నాయన్న సాక్ష్యమేమైనా ప్రవేశపెట్టారా అంటే అదీలేదు. ఉన్న సాక్ష్యమంతా ఏమిటంటే చనిపోయిన అయిదుగురి వద్దా, మహమ్మద్ అఫ్జల్ వద్ద స్వాధీనం చేసుకున్నట్టు చెప్తున్న సెల్‌ఫోన్‌ల ద్వారా పాకిస్తాన్‌కు, సౌదీ అరేబియాకు చాలాసార్లు ఫోన్లు చేసినట్టు చూపించే ఆధారాలు. ఆ ఫోన్‌లు ఆ దేశాలలో ఎవరికి చేశారన్న ఆధారాలు ఏమీ లేవు. పాకిస్తాన్‌లో జైష్–ఇ–మహమ్మద్ కార్యకర్తలే కాక కొన్ని కోట్ల మంది వేరే ప్రజలున్నారు. భారతదేశవాసులకూ వారికీ సంబంధ బాంధవ్యాలున్నాయి. కాబట్టి ఎవరినైనా పట్టుకొని నీ సెల్‌ఫోన్ ద్వారా నువ్వు డజన్‌సార్లు పాకిస్తాన్‌లో ఎవరితోనో మాట్లాడావంటే దానితో రుజువయ్యేదేమీ లేదు.

పోనీ దాడిచేసి చనిపోయిన అయిదుగురు జైష్–ఇ–మహమ్మద్ కార్యకర్తలన్న ఆధారాలేవయినా ఉన్నాయా అంటే వారి ఊరూ పేరూ కూడా తెలియదు. వారి పొడిపేర్లు మాత్రమే తెలుసు. ఒకరి పేరు మహమ్మద్ అంట. ప్రపంచంలో ప్రతీ రెండవ ముస్లిం పురుషుడి పేరూ మహమ్మదే. మరిద్దరు రాజా, రాణా. ఇవి ముస్లింల పేర్లే కానక్కరలేదు. మిగిలిన ఇద్దరూ హంజు, హైదర్. ముందు పేరూ వెనక పేరూ ఊరి పేరూ తెలీదు. ఏ సంస్థకు చెందినవారో తెలీదు. ఏ దేశస్తులో తెలీదు.

కాబట్టి పార్లమెంట్‌పైన దాడి జైష్–ఇ–మహమ్మద్ పని అనడానికి ఆవగింజంత సాక్ష్యం కూడా లేదు. విశ్వసనీయమైన సాక్ష్యం కాదు, ఏ సాక్ష్యమూ లేదు.

ఇక మిగిలింది కుట్ర. అఫ్జల్ తదితరులు చనిపోయిన అయిదుగురు అనామకులతో కలిసి పార్లమెంట్‌పైన దాడి చేయడానికి కుట్ర చేశారనడానికి ఏం ఆధారాలు చూపించారు? కుట్ర అంటే అర్థం ఉద్దేశ్యం, అంగీకారం అని న్యాయ సిద్ధాంతం అంటుంది. కుట్రదారులందరికీ ఫలానా (నిర్దిష్టమైన) లక్ష్యం సాధించాలన్న ఉద్దేశ్యం ఉండాలి. దాని సాధన కోసం పనిచేయాలన్న అంగీకారం ఉండాలి.

అఫ్జల్ తదితరులకు పార్లమెంట్‌పైన దాడి జరపాలన్న లక్ష్యం ఉన్నట్టుగానీ, చనిపోయిన అయిదుగురికి అటువంటి లక్ష్యం ఉండిందన్న విషయం తెలిసినట్టు గానీ ఏ సాక్ష్యమూ లేదు. విశ్వసనీయమైన సాక్ష్యం లేదనడం లేదని మళ్ళీ చెప్పాలి. అసలు ఏ సాక్ష్యమూ లేదు.

ఉన్న సాక్ష్యమేమిటి? పోలీసులు అఫ్జల్ అద్దెకు తీసుకుని నివసిస్తున్న గది మీద దాడి చేసినప్పుడు అక్కడ పేలుడు పదార్థాలు దొరికాయని సాక్ష్యం ప్రవేశపెట్టారు. పేలుడు పదార్థాలను అనుమతి లేకుండా కలిగి ఉండటం నేరమేగాని, వాటిని పార్లమెంట్‌పైన దాడి చేయడానికి కుట్రలో భాగంగా అఫ్జల్ తెచ్చిపెట్టుకున్నాడని నమ్మడానికి ఆధారమేమీ లేదు. దాడిలో చనిపోయిన మహమ్మద్ అని పేరు పెట్టబడ్డ అనామకుడు దాడికి కొద్ది సమయం ముందు తన సెల్‌ఫోన్ ద్వారా అఫ్జల్‌తో సంభాషించాడనీ, అతని దగ్గర దొరికిన ఒక కాగితం మీద అఫ్జల్ సెల్‌ఫోన్ నెంబర్ ఉందనీ ఆధారాలు చూపించారు. అఫ్జల్ కొందరు వ్యక్తులతో తిరుగుతుండగా చూశామనీ, ఆ వ్యక్తులు పార్లమెంట్‌పైన దాడి చేసిన వారనీ, వారి శవాల ఫోటోలను బట్టి గుర్తుపట్టామనీ కొందరు సాక్షులు చెప్పారు. అయితే ఈ రకమైన ఫోటో గుర్తింపు విశ్వసనీయమైనది కాదని కర్తార్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు ప్రకటించింది. శవం ఫోటో సంగతి పక్కన పెట్టండి, బతికున్నప్పటి ఫోటో ద్వారా మనిషిని గుర్తుపట్టే సాక్ష్యం సహితం విశ్వసనీయం కాదని సుప్రీంకోర్టు అన్నది. ఫోటో గుర్తింపును సాక్ష్యంగా పరిగణించడాన్ని అనుమతించే 'టాడా' చట్టంలోని సెక్షన్ 22 చెల్లదని సుప్రీంకోర్టు కొట్టేసింది.

పోనీ ఈ సాక్ష్యమంతా నమ్మినా తేలేది ఏమిటంటే పార్లమెంట్‌పైన దాడి చేసిన వ్యక్తులతో అఫ్జల్‌కు సంబంధం ఉండింది; వాళ్ళతని సహాయం

తీసుకున్నారు; అతను వారికి సహాయం చేశాడు. అంతమాత్రం చేత వారి నిర్దిష్ట లక్ష్యం (పార్లమెంట్‌పైన దాడి చేసి పార్లమెంట్ సభ్యులను, కేంద్ర మంత్రివర్గ సభ్యులను హతమార్చాలన్న లక్ష్యం) అతనికి తెలుసనీ అతను దానికోసం పనిచేశాడనీ నిర్ధారించగలమా? కామన్ సెన్స్ ప్రకారం చూసినా అటువంటి లక్ష్యం గలవాళ్ళు తమకు సహాయం అందిచ్చిన వారందరికీ తమ కార్యక్రమమంతా చెప్పరు. వారికి ఎంత తెలియాలో అంతే చెప్తారు. రహస్య సంస్థల పని తీరే అంత.

తన రాజకీయ లక్ష్యంలో భాగంగా ఒకరిని చంపడానికి పూనుకున్న ఒక రాజకీయ కార్యకర్తకు ఆ పనిచేయడానికి మోటార్ సైకిల్ అవసరమయిందనుకోండి. ఒక గంట కోసం మోటార్ సైకిల్ ఇప్పించమని తన రాజకీయాల పట్ల సానుభూతి గల వ్యక్తిని అడిగాడనుకోండి, అతను ఇప్పిస్తాడు. ఇతను దాని మీద పోయి హత్యచేసి బండి వాపస్ ఇచ్చేస్తాడు. బండి ఇప్పించిన వ్యక్తి ఆ హత్యకు కుట్రదారుడని సాధారణ ఆలోచనారీతి ఒప్పుకోదు, చట్టమూ ఒప్పుకోదు. అఫ్జల్‌కు వ్యతిరేకంగా పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యమంతా నమ్మినా అతని పాత్ర ఇంతకంటే ఎక్కువని నిర్ధారించడానికి ఏ ఆధారమూ లేదు. అతనికి శిక్ష అంటూ వేస్తే అనుమతి లేకుండా పేలుడు పదార్థాలు కలిగి ఉన్నందున శిక్ష వేయాలి. దానికి పేలుడు పదార్థాల చట్టం కింద శిక్ష ఐదు సంవత్సరాల నుండి జీవిత ఖైదు దాకా ఉండగలదు. ఆ నేరానికి జీవితఖైదు సాధారణంగా వేయరు. మరణదండన  వేసే అవకాశం అసలే లేదు.

వాళ్ళ లక్ష్యాలు తెలియకుండా అఫ్జల్ వాళ్ళకు సహాయం ఎందుకు చేస్తాడు? అన్న సందేహం రావచ్చు. కశ్మీరీల గురించి ఏమాత్రం తెలిసినా అటువంటి సందేహం రావడానికి ఆస్కారం లేదు. కశ్మీర్ కోసం భారత్ పదిహేడు సంవత్సరాలుగా చేస్తున్న యుద్ధంలో అరవైవేలకు పైగా ప్రాణాలు పోయాయి. భారత సైనిక జవాన్ల ప్రాణాలు కొన్ని, కశ్మీర్ పండిట్ల ప్రాణాలు కొన్ని కాగా అత్యధిక భాగం అఫ్జల్, షౌకత్, గిలానీ, అఫ్సాన్‌ల వంటి సాధారణ కశ్మీరీల ప్రాణాలే పోయాయి. చంపింది భారత ప్రశాసనమైనా,  మిలిటెంట్లయినా చనిపోయింది కశ్మీరీలే.

విధ్వంసమూ చాలా జరిగింది. అఫ్జల్ బారాముల్లాలోని సొపోర్‌కు చెందినవాడు. అది ఆపిల్ వ్యాపారానికి కేంద్రం. వాణిజ్య కేంద్రమైన సొపోర్ చాలా అందమైన ఊరు. కానీ అది మిలిటెన్సీకి కూడ కేంద్రం. భారత సైన్యం ఆ ఊరిని మూడుసార్లు దాదాపు సంపూర్ణంగా అగ్నికి ఆహుతి చేసింది. సొపోర్‌నే కాదు, కశ్మీర్ లోయలో అనేక గ్రామాలను, పట్టణాలను తగలబెట్టడం, నివాస స్థలాలను పేల్చివేయడం గత పదిహేడు సంవత్సరాలుగా జరిగింది. అటు మిలిటెంట్లు కూడ క్రమేపీ మరింత క్రూరంగా ప్రవర్తిస్తున్నారు. భారత ప్రభుత్వం పైన తాము చేస్తున్న పోరాటంలో సాధారణ పౌరుల ప్రాణాలు తీయడానికి వాళ్ళివాళ వెనకాడటం లేదు.

తప్పెవరిది ఉన్నా, ఎందరిది ఉన్నా ఈ స్థితికి ప్రాథమిక బాధ్యత భారత ప్రభుత్వానిదే అన్న సగటు కశ్మీరీల అభిప్రాయాన్ని తప్పుపట్టటం కష్టం. ఇక అఫ్జల్ మాటకొస్తే అతను కొంతకాలం మిలిటెంట్‌గా ఉండి ఆ తరువాత లొంగిపోయి, కొంతకాలం సరెండర్డ్ మిలిటెంట్‌గా ఉండి, స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌తో పనిచేసి, ఆద్యంతం విపరీతంగా హింస అనుభవించాడు. అటువంటి వాళ్ళ దగ్గరికి ఎవరైనా వచ్చి భారత ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నాం అని చెప్తే, వివరాలు అడగకుండ వారు ఏ సహాయం అడిగితే ఆ సహాయం ఇవ్వడం ఆశ్చర్యం కలిగించవలసిన విషయం కాదు.

ఈ సామాజిక, చారిత్రక విషయాలు కాకున్నా, చట్టపరమైన విషయాలు న్యాయమూర్తులకు అర్థంకాక పోలేదు. వాళ్ళకు న్యాయ సిద్ధాంత పరిజ్ఞానం లేదని అనడం లేదు. ఆ పరిధిలోనే వివేచించినంత వరకు సహేతుకంగానే వ్యవహరించారు. ఇది 'పోటా' కింద పెట్టిన కేసు కాబట్టి ముద్దాయిలు పోలీసులకిచ్చిన ఒప్పుకోలును వాళ్ళు సాక్ష్యంగా స్వీకరించి ఉండవచ్చును. ట్రిబ్యునల్ కోర్టు అలానే చేసింది. కాని హైకోర్టు, సుప్రీంకోర్టు ఆ ఒప్పుకోళ్ళను తిరస్కరించాయి. 'పోలీసులు ఒప్పుకోళ్ళు ఏ విధంగా తీసుకుంటారో మాకు తెలియక పోలేదులే' అని సుప్రీంకోర్టు చిన్న చురక కూడ వేసింది.

కానీ ఇటువంటి కేసులలో ఎక్కడో రాజకీయం ప్రవేశిస్తుంది. న్యాయస్థానాలు న్యాయనిర్ణయం చేయడం ఆపేసి ఏవో రాజకీయ కర్తవ్యాలు

మీద వేసుకుంటాయి. 'భారత ప్రజల మనోభావాలు' అన్నారు గానీ న్యాయస్థానాలు స్పందించింది దానికి కూడ కాదు. పాకిస్తాన్‌కు, ఇస్లాం పేరు మీద హింస చేసే సంస్థలకు ఏదో సందేశం పంపడం అవసరం అని భావించారు. 'భారతదేశం ప్రజాస్వామ్యమని కదా మీకంతా ఇంత చులకన? ఇక్కడేం చేసినా సాగుతుందని కదా మీ అభిప్రాయం? ఆ ప్రజాస్వామ్య చిహ్నమైన పార్లమెంట్‌పైనే దాడిచేసి భారత్‌ను వెక్కిరిద్దామనుకున్నారా? మీ వాడిని ఉరితీస్తాం చూడండి. మేము చేతకాని వాళ్ళం కామని రుజువు చేస్తాం చూడండి'.

ఇదీ న్యాయస్థానాలతో సహా అన్నీ తెలిసిన, తెలిసి ఉండవలసిన భారతీయుల వైఖరి. దానికి ఏ పాపం ఎరుగని వాడు కాకున్నా, మరీ అంత పాపం ఎరుగని అఫ్జల్ బలి కావలసిందేనా అన్నది మనం వేసుకోవలసిన ప్రశ్న. ఇంకొంచెం ముందుకుపోయి, ఆ కొంచెం పాపం కూడ అతనిదా లేక అతనిని బోనెక్కించిన భారత సర్కార్‌దా అన్న ప్రశ్న కూడ మనం వేసుకోవలసిందే. కానీ దీనికి భారత్‌లో ఎంతమంది సిద్ధంగా ఉన్నారు?

(కేసులో సాక్ష్యాధారాలు ఏమున్నాయో, ఏం లేవో నేనెట్లా చెప్పగలుగుతున్నానని నా అభిప్రాయాలతో విభేదించే వారెవరైనా ప్రశ్నించగలరు. సుప్రీంకోర్టు తీర్పు ఎక్కడయినా దొరుకుతుంది. దానిని ఎవరైనా చదవవచ్చు. కానీ నేను దాని మీద మాత్రమే ఆధారపడలేదు. షౌకత్ హుస్సేన్ గురుకు ట్రయల్ కోర్టులో న్యాయవాదిగా ఉన్న నిత్యారామకృష్ణన్ సీనియర్ న్యాయవాదిగా సహాయం చేయమని కన్నబిరాన్ గారిని కోరారు. కన్నబిరాన్ గారు విచారణ పూర్తయిన అనంతరం కేసు కాగితాలన్నీ నాకిచ్చి షౌకత్ తరఫున వాదనలు తయారు చేయమని అడిగారు. ఆ విధంగా సాక్ష్యాలు మొత్తం చూసే అవకాశం నాకు కలిగింది.)

# తిరుమలలో మతరాజ్యం కావాలా ?

తిరుమల కొండ మీద అన్యమత ప్రచారం జరగకూడదన్న డిమాండ్‌తో నడుస్తున్న 'ఉద్యమం' వార్తలు పత్రికలలో చూస్తున్నాం. మొదట్లో ఇదేదో ఉబుసుపోకకు పెట్టిన డిమాండో యథాలాపంగా లేవదీసిన డిమాండో అనుకున్నారుగానీ ఈ డిమాండు పదేపదే వినపడడమేకాక మరికొన్ని దీనితో కలిసి మీడియా సహకారంతో పెద్ద ప్రచారం రూపమే తీసుకుంది. తిరుమలలో అన్యమత ప్రచారం జరగకూడదట, అక్కడ లౌకిక పరిపాలన ఉండకూడదట, తిరుమల గుడికి లభించే ఆదాయమంతా హిందూమత ప్రచారానికే వాడాలట.

ఇవి రాజ్యాంగబద్ధమైన డిమాండ్లా అన్న ప్రశ్న కొంచెం సేపు పక్కన పెడదాం. దేవుడు తమ జేబులో ఉన్నాడనుకునే వాళ్లు క్షుద్రమానవులు తయారు చేసిన గ్రంథాలను గౌరవించరు. వాటి ప్రామాణికతను అంగీకరించరు. నిజానికి ఇప్పటికే తిరుమలలో ఒక స్థానిక సంస్థ అనేది లేకపోవడం, ఎన్నికయిన పాలనా సంస్థ లేకపోవడం రాజ్యాంగ విరుద్ధం. 1993 లో రాజ్యాంగాన్ని 73, 74వ సవరణల ద్వారా మార్చిన తరువాత దేశంలో ఎక్కడా కూడా స్థానిక సంస్థలు లేకపోవడం, ఎన్నికైన స్థానిక పాలనాయంత్రాంగం లేకపోవడం జరగడానికి వీలులేదు. పెద్ద ఊరయితే మునిసిపాలిటీ ఉండాలి, చిన్న ఊరయితే పంచాయితీ ఉండాలి. పంచాయితీకి తగినంత జనాభా లేనట్లయితే పక్కనున్న ఏదైనా గ్రామ పంచాయితీలో భాగం చేయాలి. అంతే తప్ప స్థానిక సంస్థ ఏదీలేని మానవ ఆవాసం ఉండడానికి వీలులేదు.

పోనీలెండి, క్షుద్రమానవులు రాసిన క్షుద్ర గ్రంథాల గురించి ఎందుకుగానీ సాధారణ మానవులకు ఉండే భక్తి భావన గురించే మాట్లాడుకుందాం. ఇది నా దేవుడికి ప్రత్యేకం, వేరే దేవుళ్లు ఇక్కడికి రావద్దు అని మామూలు మనుషులు అభ్యంతరపెట్టిన సందర్భాలు చాలా తక్కువ. అందుకు విరుద్ధంగా, ఒకే స్థలంలో

---

ప్రజాతంత్ర వారపత్రిక, 22.4.2007

భిన్న మతస్తుల ప్రార్థనా స్థలాలు పక్కపక్కన ఉండడం అనేక చోట్ల చూస్తాం. ఇజ్రాయిల్‌లోని జెరూసలం దీనికి ప్రఖ్యాతమైన ఉదాహరణగానీ ఆ నగరం సంకుచిత జాతి రాజకీయాలలో చిక్కుకొని ఉండడం వల్ల అది సగటు బహుళ ప్రార్థనా స్థలాలకు ఉదాహరణ కాదు. మన దేశంలో మసీదులు లేక దర్గాలు, హిందూదేవాలయాలు ఒకదాని నొకటి ఆనుకొని ఉన్న చోట్లు వేల సంఖ్యలో ఉన్నాయి (మన రాష్ట్రంలో అలంపురం ఒక ప్రముఖ ఉదాహరణ). ఈ ప్రార్థనాస్థలాల సహజీవనం ప్రశాంతంగా జరుగుతుంటుంది. చర్చిలు దళితవాడలలో ఉండడం వల్లగానీ లేకపోతే మూడూ సహజీవనం చేసేవే. ఇస్లాం, క్రైస్తవం ఒకదాని నొకటి ఒరుసుకొని ఉండే మధ్యఆసియా, ఉత్తర ఆఫ్రికాలలో మసీదులు, చర్చిలు ఇదే విధంగా సహజీవనం చేస్తున్నాయి.

కొత్తగా ఒక మతానికి చెందినవారు అధికారానికి వచ్చినప్పుడు ఓడిపోయినవారి మతవిశ్వాసాల పట్ల తమ తృణీకార భావనను ప్రదర్శించే అహంభావ ప్రదర్శనలో భాగంగానే వారి ప్రార్థనాస్థలాలను ధ్వంసం చేసి లేక అటకాయించి తమ ప్రార్థనా మందిరాలు అక్కడే కట్టుకున్నారని అర్థం చేసుకోవడం జరుగుతుంటుంది. ఇటువంటి అహంభావ ప్రదర్శన చరిత్రలో చాలానే ఉందిగానీ ఒకేచోట అందరూ వచ్చి తమ తమ ప్రార్థనా మందిరాలు కట్టుకోవడానికి అంతకంటే లోతయిన కారణం వుంది. ఒక స్థలంలో ప్రార్థనా మందిరం ఉంటే ఆ స్థలానికే పవిత్రత ఆపాదించబడుతుంది. నిజానికి తరచుగా మందిరం కంటే ఆ స్థలమే పవిత్రమైనది. స్థలం నుండే మందిరానికి పవిత్రత సంక్రమిస్తుంది. అది ఒక దేవుడు వెలిసిన చోటు, ఒక గొప్ప భక్తుడు సమాధి అయిన చోటు, లేక ఒక అద్భుతం జరిగిన చోటు, అందువల్ల ఆ తర్వాత వచ్చినవారు అక్కడే తమ ప్రార్థనా మందిరాలు కట్టుకోవాలని చూస్తారు. ఆ స్థలానికి ఆపాదించబడ్డ పవిత్రతే వారిని ఆకర్షిస్తుంది. అంతేకాక తమ దేవతకు మందిరం అక్కడే కడితే ఆ దేవతకు లేక మతానికి ఆకర్షణా పెరుగుతుంది.

ప్రముఖ హిందూ దేవాలయాలయిన తిరుమల, భద్రాచలం, పూరి వంటివి ఆదివాసుల పవిత్రక్షేత్రాల వద్దే నిర్మించడం వెనుక ఆదివాసీ సమాజంపైన హైందవ సమాజం నెలకొల్పిన ఆధిపత్యమేకాక ఈ సార్వజనీన వాస్తవమూ ఉంది. బౌద్ధులు

తమ ఆరామాలను, విహారాలను అమ్మదేవతల పూజాస్థలాల దగ్గరే కట్టారని డి.డి. కోశాంబి వివరంగా రుజువుచేశారు. ఇస్లాం మతం స్థలాలకూ ప్రదేశాలకూ పవిత్రతను ఆపాదించడాన్ని అంగీకరించదుగానీ, ఆ మతాన్ని అనుసరించే మనుషులు అందరి లాంటి వాళ్ళే కాబట్టి వారు అదే విధంగా ప్రవర్తించారు.

పవిత్రత మందిరానికే కాదు స్థలానికీ చెందుతుందని – ప్రాథమికంగా స్థలానికే చెందుతుందని – మామూలు మనుషులు భావించబట్టే మత స్థలాల సహజీవనం సహజమైన విషయంగా వారికి తోచింది. ఎవరైనా ప్రార్థనా మందిరాలను పవిత్ర స్థలాలలోనే కట్టుకుంటారు మరి, సర్దుకోక చేసేది ఏముంది?

స్థలానికే కాదు, సంవత్సరంలో రుతువులకూ, దినంలో వేళలకూ కూడ అన్ని సంస్కృతులోనూ పవిత్రత ఆపాదించబడింది. మత సిద్ధాంతాలు ఏమన్నా సామాన్య మానవులు ఈ పవిత్రతా భావనను అనుసరిస్తారు. సంధ్యా సమయానికి అటువంటి పవిత్రత అన్ని సంస్కృతులలోనూ వుంది. హైదరాబాద్‌లాగా హిందువులు, ముస్లింలు పెద్దసంఖ్యలో సహజీవనం చేసే ఊళ్లలో తెల్లవారుజామున నిద్రలేచే అలవాటున్నవాళ్ళు ఒకవైపు నుండి అజాన్ పిలుపునూ, మరోవైపు నుండి గుడి గంటలనూ భజన పాటలనూ వింటూ దినచర్యకు ఉపక్రమిస్తారు. అందరికీ ఉదయం పవిత్రమే మరి, సర్దుకోక చేసేది ఏముంది? ఒకరికి మాత్రమే రిజర్వ్ అయిన పవిత్రతకు మానవ సామాజిక జీవితంలో చోటిప్పుడు లేదు. మనుషుల ఆలోచనలలోనూ లేదు. రాజకీయ వాతావరణం అనుకూలిస్తున్నది కదా అని ఈ చారిత్రక నైజానికి విరుద్ధంగా అల్లరి చేయడమేనా?

రాజ్యాంగం వంటి తుచ్ఛమైన గ్రంథాలతో వీరికి పని లేదు. అదేమయినా వేదవ్యాసుడు రాసిందా యాజ్ఞవల్క్యుడు వ్యాఖ్యానించిందా! తమ విశ్వాసాలకు భిన్నంగా నడిచిన చరిత్రతోనూ పనిలేదు. మ్లేచ్ఛులకు తప్ప వీరికెప్పుడయినా చరిత్ర పట్టిందా. పోనీ తమలాంటి డిమాండ్లే అందరూ పెట్టగలరన్న ఇంగితం ఉండనక్కరలేదా? తిరుమల హిందువులకు అత్యంత పవిత్రస్థలం కాబట్టి అక్కడ అన్యమత ప్రచారం జరగడానికి వీలులేదట. మరి హైదరాబాద్‌లోని మక్కామసీద్ ముస్లింలకు చాలా పవిత్రమైనది కాబట్టి దాని కనుచూపు మేరల్లో గుడిగంటలు, హిందూదేవుళ్ల స్తోత్రాలు వినపడడానికి వీలులేదని ముస్లింలు వాదిస్తే, క్రైస్తవులు

అదే విధంగా మెదక్ లాంటి పెద్ద చర్చిలున్న చోట ఆ పరిసరాలలో ఎక్కడా అన్యమత ప్రార్థనలూ స్తోత్రాలూ వినపడడానికి వీలులేదంటే?

మతాలలో శాఖలూ ఈ రకమైన డిమాండ్లు పెడితే? ఆర్‌సిఎం చర్చిల పరిధిలో బాప్టిస్టు ప్రచారం జరగడానికి వీలు లేదనీ, శైవక్షేత్రంలో విష్ణు సహస్రనామం వినపడడానికి వీలులేదనీ, సున్నీల మసీదుకు షియాల అజాన్ వినబడడానికి వీలులేదని అంటే?

వీళ్ల డిమాండులకు అర్థం తిరుమల ఒక చిన్నపాటి మత రాజ్యం కావాలని. తిరుమలతో సమానంగా పవిత్రమైన పూజాస్థలాలు, ప్రార్థనా స్థలాలు అనేకం ఉన్నాయి దేశంలో. అన్ని మతాల వారివీ ఉన్నాయి. అన్ని మతరాజ్యాలను సెక్యులర్ భారత రాజ్యం కడుపులో ఏర్పరచడం అసాధ్యం, అవాంఛనీయం. ఈ తిరుమల ఉద్యమకారులు ఎక్కడి వారో నాకు తెలియదుగానీ నేను చిన్నప్పుడు హైస్కూలు చదువు సగం తిరుపతిలో చదివాను. అప్పట్లో తిరుపతిలోని ముస్లింలు, క్రైస్తవులు చాలామంది తమ ఇరుగు పొరుగు హిందువులలాగ తిరుమలకు పోయి ప్రార్థన చేసుకొని వచ్చేవారు. అది వింత అని వారికీ తోచలేదు. వారి ఇరుగు పొరుగుకూ తోచలేదు. వారు ఇస్లాంనూ క్రైస్తవాన్నీ వదులుకొని పోలేదు. వాటిని ఆచరిస్తూనే పోయారు. ఒక ప్రార్థనా స్థలానికి చెందిన పవిత్రత ఒక మతానికి రిజర్వ్ కాలేదన్న సాధారణ మానవ భావన ఆనాడు అన్ని మతాలవారిలోనూ ఉండింది. ఈ రోజు వారు తిరుమలకు పోరు, పోయినా వీరు రానీయరు. ఇప్పుడు తిరుమల ఉద్యమకారులు దీనిని మరింత దూరం తీసుకుపోయి ఒక చిన్న పాటి హిందూసౌదీ అరేబియాను ఏడు కొండల మీద నెలకొల్పుతారా లేదా వెనకటి రోజులలాగా ముస్లింలూ క్రైస్తవులూ కూడ తిరుమలను ఒక పవిత్ర క్షేత్రంగా గుర్తించే రోజులు తిరిగి రావడానికేమైనా కృషి చేస్తారా? ఎవరి ప్రచారం, ఎవరి ప్రార్థనలు వారు చేసుకుంటూ వాటి వెనుక అందరూ పంచుకునే అనుభూతి ఏదో ఉందని సాధారణ ప్రజలకు ఇప్పటికీ ఉన్న భావనను స్వీకరించే ప్రయత్నం చేస్తారా?

ఇవి ఒక నాస్తికుడు అడగవలసిన ప్రశ్నలు కావేమోగానీ ఏదో గొప్ప ఆధ్యాత్మికతకు వారసులుగా తమను తాము కీర్తించుకునే వారు సంకుచితత్వాన్ని బిగ్గరగా ప్రదర్శిస్తున్నప్పుడు ఎవరో ఒకరు అడగాలి కాబట్టి అడుగుతున్నాను.

# హిందుత్వ అజెండాలో ఆదివాసులు

వాళ్ల నాయకులు కొందరు టీవీల ముందు గంభీరంగా కనిపిస్తారు. దేశ పాలనా విధానాల గురించి తమ ఆలోచనలను ప్రకటిస్తారు. తాము అధికారానికి వస్తే ఏయే విషయాలలో ఎంత మేలు చేయబోయేదీ గొప్ప విజ్ఞత గలవారిలాగ చెప్తారు. మరి కొందరు నాయకులు బహిరంగ వేదికలెక్కి చంపుతాం, నరుకుతాం అని కేకలు వేస్తారు. అయినా వారిని పోలీసులు అరెస్టు చేయరు. వారి సభలకెప్పుడూ అనుమతి నిరాకరించరు. మరి కొందరు పల్లెలలో పరమతస్థులపైన దాడులు చేస్తారు. ప్రార్థనా స్థలాలను  కూలుస్తారు, కాలుస్తారు. అడ్డమొచ్చిన వారిని నరుకుతారు, తగలబెడతారు.

అయినప్పటికీ వారిది గౌరవనీయమైన రాజకీయపక్షంగానే భావించ బడుతుంది. వారి ప్రధాని అభ్యర్థిని వారు ముందుగానే ప్రకటించడం అభినందించబడుతుంది. వారి పాదయాత్రలు, జాతాలు నిర్విఘ్నంగా సాగుతుంటాయి. వారి గుర్తింపు ఎప్పుడూ రద్దు కాదు. ఎన్నికల ప్రచారం నుంచి సాయుధ వీధి రౌడీయిజం దాకా అన్నీ ఏకసమయంలో సాగుతుంటాయి. 'అవును, మేమే చంపాము' అని ప్రకటించి మరీ చంపినా వారిని అరెస్టు చేయరు. నిషేధాల ఛాయ కూడ వారి దరికి రాదు. తమ రాజకీయ లక్ష్యాల సాధనకోసం హింసా మార్గాన్ని ఎంచుకోవాలన్న నిర్ణయంం ఇతరులకు ఇంత సులభం కాదు. నిర్ణయం తీసుకున్నప్పటి నుంచి రహస్య జీవితంలోకి పోవాలి. దాక్కొని పనిచేసే స్థావరాలు వెతుక్కోవాలి. ధైర్యంగా సహాయం చేసే వారిని అన్వేషించాలి. పోలీసుల వేధింపులూ అరెస్టులూ చిత్రహింసలూ ఎన్‌కౌంటర్లూ ఎదుర్కోవాలి.

వీరికి మాత్రం ఆ సమస్య లేదు. తామే అధికారంలో ఉంటూ కూడ ప్రత్యర్థి సామాజిక వర్గాల పైన హింసాత్మక దాడులు చేయగలరు. అప్పుడే ఇంకా బాగా చేయగలరు. అయితే దేశంలో అధిక సంఖ్యాకులు  ఆరాధించే దేవుళ్ల పేరు

---

ఆంధ్రజ్యోతి దినపత్రిక, 24.9.2008

మీద వీరి రాజకీయం నడుస్తుంది కాబట్టి వీరి అగడాలకు అడ్డుకట్ట వేసే ధైర్యం వీరు అధికారంలో లేని కాలంలోనూ, లేని రాష్ట్రాల లోనూ కూడ పాలనా యంత్రాంగం చేయడం లేదు. రాముడి పేరు మీద వినాయకుడి పేరు మీద నడిచే రాజకీయ హింసను ముఖాముఖీ ఎదుర్కొంటే ఆ దేవుళ్ల భక్తులు దూరం అవుతారేమోనని వైరి రాజకీయ పక్షాలు వెనకాడుతున్నాయి. వారి వోట్ల సంగతేమోగాని భారతదేశాన్ని నాగరిక దేశంగా చెప్పుకోవడానికి సందేహించే రోజులు దగ్గరి కొచ్చాయి.

ఈ దౌర్జన్యంలో ఒక పద్ధతి ఉందన్న విషయం ఎంతమంది గ్రహించారో తెలీదు. హిందూ రాష్ట్రాన్ని మీది నుంచి నిర్మించడం కష్టమయితే కింది నుంచి నిర్మించాలన్న వ్యూహం ఇందులో ఉంది. మీది నుంచి నిర్మించడానికి రాజ్యాంగం ఆటంకం. దానిని సమీక్షించాలన్న ప్రతిపాదన పెట్టి మొదటి మెట్టుగా తమ వారు కాని వారితో కమిటీ వేసి ఒక సమీక్ష చేయించారు. ఈ సారి అధికారానికి వస్తే ఆ సమీక్షను సమీక్షించడానికి వేరొక కమిటీ వేస్తారేమో చూడాలి. అయినా ఇది చాలా సమయం తీసుకుంటుంది. దానికి ప్రత్యామ్నాయం కింది నుంచి అమలు చేయడం. మత స్వేచ్ఛ రాజ్యాంగంలో ఉంటే ఉండనివ్వండి. జై శ్రీరాం అనకపోతే బతకనివ్వరన్న భయం అన్య మతస్తులలో కలిగిస్తే సరి. ఒక్క మత స్వేచ్ఛే కాదు, అన్ని రకాల భావప్రకటనా స్వేచ్ఛ ఒక హక్కేనని రాజ్యాంగంలో రాసి ఉండవచ్చు. కానీ తమకు నచ్చని భావాలు వ్యక్తం చేస్తే 'దేశద్రోహులు' అని పేరు పెట్టి గుంపును పోగుచేసి పోలీసులు చూస్తుండగానే రోడ్లో నరుకుతారని భయం కలిగిస్తే సరి. ఈ స్థితిని చేరుకున్న ప్రాంతాలు దేశంలోని ఉత్తర, పశ్చిమ భాగాలలో ఇప్పటికే చాలా వున్నాయి. ఒకసారి జాబితాలో చేరిన ప్రదేశాలు బయటికి పోవడం కష్టం. దీనిలోకి కొత్తవి చేరుతుంటాయి. ఈ దుస్థితి ఉత్తర భారతం నుంచి క్రమంగా కిందికి పాకి మన సరిహద్దు సమీపానికొచ్చింది.

ఒరిస్సాలోని కంధమాల్ జిల్లా మన సరిహద్దు కెంతో దూరంలో లేదు. ఆ రాష్ట్రంలో తొమ్మిదేళ్లుగా అధికారం పంచుకొని చలాయిస్తున్న బిజెపి పాలనలో ఒక్క కంధమాల్ జిల్లాలోనే కాదు, ఆ రాష్ట్రంలోని అటవీ ప్రాంతాలంతటా క్రైస్తవాన్ని నమ్మడానికీ ఆచరించడానికీ వీలులేని పరిస్థితి ఏర్పడింది. చర్చిల దహనం,

క్రైస్తవుల ఇళ్ల దహనం అడపా దడపా కొన్నేళ్లుగా జరుగుతున్న ఘటనలే. గడచిన నెల రోజుల ఘటనలు పత్రికల కెక్కడానికి కారణం పరిమాణంలోని హెచ్చుదల మాత్రమే. ఆగస్ట్ నెల చివరి వారంలో కొన్ని వందల – బహుశా వేల – ఇళ్లు, చర్చిలు, స్కూళ్లు తగలబెట్టి 27 వేల మందిని క్యాంపుల పాలుచేశారు. చాలామందిని హతమార్చారు. ఆగస్ట్ 23 రాత్రి విహెచ్‌పి నాయకుడు లక్ష్మణానంద సరస్వతిని జాలస్‌పేటలో మావోయిస్టులు చంపారు. చంపింది మావోయిస్టులేనని పోలీసులన్నారు. ఆ తరువాత మావోయిస్టులూ ప్రకటించారు. కాని లక్ష్మణానందను చంపింది మావోయిస్టులు కారనీ, క్రైస్తవులేననీ, మావోయిస్టులు మత ఘర్షణలలో జోక్యం చేసుకోరనీ విహెచ్‌పి అంటూ వచ్చింది. బహుశా మావోయిస్టులు చేసిన ఒక హత్య వారి పని కాదని హిందుత్వవాదులు ప్రచారం చేసిన ఏకైక ఉదంతం ఇదే కావచ్చు.

ఈ ఔదార్యానికి కారణం స్పష్టమే. హత్య మావోయిస్టులే చేశారని ఒప్పుకుంటే క్రైస్తవుల పైన చేస్తున్న దాడులకు బహానా ఉండదు. క్రైస్తవులే చేశారంటే ఆ తరువాత జరిగిన హింస యావత్తు లక్ష్మణానంద చేసిన సంఘ సేవ వల్ల ప్రయోజనం పొందిన ఆదివాసుల ధర్మాగ్రహం ఫలితమేనని ప్రచారం చేసుకోవచ్చు. చేసుకుంటున్నారు కూడ. కానీ క్రైస్తవ మిషనరీలు చేసిన సేవలే లక్ష్మణానంద కూడ చేశాడని చెప్పి వాళ్లను దుర్మార్గులనడంలో అర్థం కనిపించదు. లక్ష్మణానంద ఆదివాసుల కోసం ఆశ్రమ పాఠశాలలు నెలకొల్పాడనీ, మంచి బతుకు నేర్పించాడనీ, తాగుడు మానుకొమ్మన్నాడనీ, శుభ్రత అలవరచాడనీ అంటున్నారు. క్రైస్తవ మిషనరీలు కూడా అదే పని చేశారు మరి. వాళ్లు మత వ్యాప్తి కోసం చేశారంటే ఈయనా అందుకోసమే చేశాడు మరి. మిషనరీలు ప్రధానంగా హైందవ సమాజానికి అంటరానివారైన దళితులలో మత వ్యాప్తి చేపట్టగా విశ్వహిందూ పరిషత్ ప్రధానంగా ఆదివాసులలో మత వ్యాప్తి చేపట్టింది. ఆదివాసులు హిందువులన్న తప్పుడు అభిప్రాయం వల్ల వీరు చేసిందీ అదేనన్న విషయం చూడలేకపోతే అది మన తప్పు. ఆదివాసులు హిందువులు కారు. క్రైస్తవులు కారు. వారిలో ఏ మత వ్యాప్తి జరిగినా అది మత మార్పిడే. అదనంగా లక్ష్మణానంద ఆధ్వర్యంలో క్రైస్తవం పుచ్చుకున్న దళితులను 'శుద్ధి' కార్యక్రమం

ద్వారా వెనక్కి తెచ్చే యత్నమూ జరిగింది. వారు ఆవు పేడతో కలిసిన నీళ్ళు తాగాలి, బైబిల్‌ను చింపేయాలి, ఇంకెప్పుడైనా చర్చికి పోతే చచ్చిపోయినట్టేనని ఒట్టు పెట్టుకోవాలి. దీనికి 'పునరాగమనం' (ఘర్ వాపసీ) అని పేరు పెట్టినప్పటికీ ఇదీ మత మార్పిడీయే. ఒకటే తేడా – క్రైస్తవ మిషనరీలు బలవంతం చేసి మతం మార్చలేదు. కాని పునరాగమనం అని పిలువబడిన మత మార్పిడి తరచుగా హింసాత్మక రూపం తీసుకుంది. ఇప్పుడు అతి క్రూరమైన రూపం తీసుకుంటున్నది. నిజానికి హిందూధర్మ వ్యాప్తిని సాధించడం కంటే క్రైస్తవ మత వ్యాప్తిని నిరోధించడం లక్ష్మణానంద చేపట్టిన కార్యక్రమాల ముఖ్య లక్ష్యం. అదే ఘర్షణకు దారి తీసింది. ఈ అణచివేతను వ్యతిరేకించే ప్రజాతంత్ర రాజకీయ కార్యాచరణను చేపట్టే బదులు లక్ష్మణానందను హతమార్చడం ఏ పాటి విజ్ఞతతో చేసిన పని అని మావోయిస్టులు భావిస్తున్నారో తెలియదు గానీ, విశ్వహిందూ పరిషత్ దానిని అవకాశంగా తీసుకొని క్రైస్తవులపైన దాడిని ముమ్మరం చేసింది.

ఆగస్ట్ 24వ తేదీన లక్ష్మణానంద మృతదేహాన్ని జాలస్‌పేట నుంచి అతను తొలుత ఆశ్రమ పాఠాల నెలకొల్పిన చౌకాపడ వరకు ఊరేగింపుగా తీసుకుపోయారు. నేరుగా పోకుండా క్రైస్తవులు ఎక్కువగా ఉండే మార్గాన్ని ఎంచుకున్నారు. దారి పొడవునా కొంత విధ్వంసం చేసుకుంటూ పోయారు గానీ అసలు హింస తిరుగు ప్రయాణంలో జరిగింది. 25వ తేదీన అతని అంత్యక్రియలకు ప్రవీణ్ తొగాడియా హాజరయి అతని మామూలు పద్ధతిలో హింసను రెచ్చగొట్టే ఉపన్యాసం ఇచ్చాడు. అక్కడి నుంచి తిరిగిపోతూ ఒక పద్ధతి ప్రకారం క్రైస్తవ గృహాలనూ చర్చిలనూ విద్యా సంస్థలనూ దహనం చేస్తూ ధ్వంసం చేస్తూ పోయారు. వారి చేతులలో కత్తులు, పెట్రోలు, తుపాకులు ఉన్నాయి. అప్పటికి జిల్లా అంతటా కర్ఫ్యూ అమలులో ఉంది. కాని కర్ఫ్యూ బాధితులను సంఘటితం కాకుండ ఆపిందే తప్ప దుండగులకు అడ్డం రాలేదు. వారు కర్ఫ్యూలోనే చేయవలసిందంతా చేశారు. ఇవ్వాళ్టికీ ఇది కొనసాగుతూనే ఉంది. మొన్నటి 18వ తేదీన రైకియా బ్లాక్‌లో రహదారి పక్కన ఉన్న అనేక గ్రామాలలో క్రైస్తవుల ఇళ్ళు, చర్చిలు తగలపెట్టారు. జనాన్ని అడవులలోకి తరిమారు. నిజానికి తలదాచుకోవడానికి చుట్టూ అడవి ఉండబట్టి బతికిపోయారు. అయినప్పటికీ 29 మంది చనిపోయారు. ఇది రాష్ట్ర ప్రభుత్వం లెక్క. 50 మందికి పైగా చనిపోయారని బాధితులు అంటున్నారు.

చాలా క్రూరంగా చంపారు. కొందరిని తగలబడుతున్న ఇళ్ళలో పడేసి చంపారు. కొందరిని కాళ్ళు నరికి ఆ తరువాత మెడ నరికి చంపారు. హత్యాకాండలో ఆదివాసులు పెద్దఎత్తున పాల్గొన్నారని చెప్తున్నారుగానీ అడవి ప్రాంతంలో స్థిరపడిన సవర్ణ హిందువులూ ఇందులో పాల్గొన్నారని మాత్రం చెప్పడం లేదు. ఆదివాసులకూ దళితులకూ మధ్యనున్న ఆర్థిక – సామాజిక వైరుధ్యాలను కొంతమంది వేలెత్తి చూపి, అవే హింసాకాండకు అసలు కారణం అంటున్నారు. ఆదివాసులకూ దళితులకూ కొన్ని వైరుధ్యాలున్న మాట వాస్తవమే. దళితులలో – ముఖ్యంగా క్రైస్తవులలో – చదువు స్థాయి సాపేక్షంగా ఎక్కువే. చిన్నా చితక వ్యాపారాలు చేసే వారూ ఎక్కువే. ఆదివాసుల భూములను దళితులు స్వంతం చేసుకున్న ఉదంతాలూ ఉన్నాయి. అయితే ఈ వైరుధ్యాలు క్రైస్తవ దళితులతోనే కాదు క్రైస్తవం పుచ్చుకోని దళితులతోనూ ఉన్నాయి. సవర్ణ హిందువులతో ఇంకా ఎక్కువ ఉన్నాయి.

కాబట్టి అసలు విషయం ఆ వైరుధ్యాలు కాదు. ప్రజా వర్గాల మధ్య అనేక వైరుధ్యాలు ఉంటాయి. వాటిని వాడుకొని తాము అణచదలచుకున్న వర్గానికి వ్యతిరేకంగా మరొక వర్గాన్ని సాయుధం చేసి దాడులు చేయించడం హిందుత్వ వాదుల వ్యూహం. పోలీసులు ప్రేక్షక పాత్ర వహిస్తారు. మీడియా వారి పాటే పాడుతుంది. ఈ వ్యూహం లక్ష్యం ఆ ప్రజావర్గాల మధ్య న్యాయాన్ని సాధించడం కాదు, తమ రాజకీయ లక్ష్యాన్ని సాధించడం. ప్రత్యేకించి, తమ వ్యూహానికి ఆదివాసులు పనికొచ్చినప్పుడు వారికి సహజమైన మిలిటెన్సీని హిందుత్వవాదులు చాలా క్రూరంగా వాడుకుంటున్నారు. గుజరాత్ మారణకాండలో ఆదివాసీ ప్రాంతాలలో ఇది చూశాం. ఛత్తీస్‌గఢ్‌లో సల్వా జుడుం రూపంలో చూశాం. ఇప్పుడు కంధమాల్‌లో చూస్తున్నాం.

ఆదివాసులు తమ కోసం తాము చేసుకున్న పోరాటాలలో ఇందులో పదో వంతు మిలిటెన్సీని ప్రదర్శించినా ప్రభుత్వాలు అతి క్రూరంగా అణచివేశాయి. హిందుత్వవాదుల అజెండాలో చిక్కుకొని ఏ ప్రజావర్గాలకూ మేలు చేయని విధ్వంసానికి పాల్పడినప్పుడు మాత్రం హిందుత్వవాదులతో ఒకటైన పాలనా యంత్రాంగాలు వారి హింసాకాండను అనుమతిస్తున్నాయి. ఇది ఆదివాసుల మేలు కోరేవారు ఆందోళన చెందవలసిన విషయం.

# సంఘ్‌పరివార్ హింసాకాండను వ్యతిరేకిద్దాం రండి

ఒరిస్సా రాష్ట్రంలోని కంధమాల్ జిల్లాలోనూ దానిని ఆనుకొని ఉన్న ఇతర జిల్లాల లోనూ ఆగస్ట్ 24వ తేదీన మొదలయి ఈనాటికీ ఆగకుండ క్రైస్తవులపై జరుగుతున్న దాడులలో 41 మంది (ప్రభుత్వ లెక్కల ప్రకారం) చనిపోయారు. దాడులు మొదలయిన వారం రోజులలోనే 24,000 మంది తమ ఊర్లు వదిలిపెట్టి ప్రభుత్వము, క్రైస్తవ సంస్థలు నిర్వహిస్తున్న శిబిరాలను చేరారు. సరయిన లెక్కలు లేవుగానీ ప్రస్తుతం 40 నుండి 50 వేలమంది దాకా జిల్లా బయట ఎక్కడో ఒకచోట తలదాచుకొని ఉండవచ్చునని అంచనా. తగలబడిన, ధ్వంసమైన క్రైస్తవుల ఇళ్ళు, ప్రార్థనా స్థలాలు వేల సంఖ్యలో ఉంటాయి.

దాడి చేసినవారు బజరంగ్‌దళ్ నాయకత్వంలో సమీకరించబడ్డ ప్రజలు. అధిక భాగం కంధ లేక కంధో (మన దగ్గర కోందు) తెగకు చెందిన ఆదివాసులు. అయితే వారితోబాటు హైందవ అగ్రకులాలకు, బిసిలకు చెందినవారూ ఉన్నారు. దాడికి గురయిన వారంతా క్రైస్తవులే. అందులో అధికభాగం పాణోలనే దళితకులానికి చెందినవారు. తక్కినవారు మళ్ళీ కోందులే – అయితే క్రైస్తవ కోందులు.

దాడి ఎందుకు జరిగింది? బజరంగ్‌దళ్, దాని రాజకీయ సంరక్షకులయిన భారతీయ జనతాపార్టీ రెండు కారణాలు చెప్తున్నారు. లక్ష్మణానంద సరస్వతి అనే స్వామీజీని క్రైస్తవులు హత్యచేసిన కారణంగా, ఆయన చేసిన సంఘసేవా కార్యక్రమాలవల్ల ప్రయోజనం పొందిన ఆదివాసులు క్రైస్తవులపైన ప్రతీకారం తీర్చుకున్నారనేది ఒక కారణం. ఎస్‌టిలు అయిన కోందులు ఎస్.సిలయిన పాణోల కుతంత్రాలవల్ల నష్టపోయారు. ఆ వైరుధ్యం కారణంగా వారు పాణోలపైన తిరుగుబాటు చేశారు. క్రైస్తవులయిన పాణోలు క్రైస్తవ మిషనరీలకు అడ్డ

---

మానవ హక్కుల వేదిక (HRF) కరపత్రం, 7.11.2008

తగులుతున్న 'స్వామీజీ'ని చంపటం ఈ తిరుగుబాటుకు ప్రేరణ ఇచ్చింది. ఇది రెండవ కారణం. ఇది నిజమా?

పాణోలపైన కోందుల తిరుగుబాటు అన్న వాదనే మొదట తీసుకుంటే, దాడులు కేవలం క్రైస్తవం పుచ్చుకున్న పాణోలపైనే జరిగాయి. ఇతర పాణోలపైన జరగలేదు. అంతేకాక క్రైస్తవులుగా మారిన కోందులపైన కూడ జరిగాయి. కాబట్టి ఇది క్రైస్తవులపైన దాడే తప్ప పాణోలపైన తిరుగుబాటు కాదు.

'స్వామీజీ'ని చంపినందుకే క్రైస్తవులపై దాడులు చేశారా? కానీ స్వామీజీని చంపింది క్రైస్తవులు కాదే, మావోయిస్టులు. ఆ విషయం మావోయిస్టులు వెంటనే ప్రకటించారు. ఎందుకు చంపారో వివరిస్తూ కరపత్రమూ వేశారు. అయినప్పటికీ క్రైస్తవులపైన దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. 'స్వామీజీ' అనుయాయుల సంగతేమోగానీ సంఘ్‌పరివార్ సంస్థలు మాత్రం చంపింది మావోయిస్టులు కారనీ, మావోయిస్టులే చెప్పినా నమ్మేది లేదనీ, క్రైస్తవ మిషనరీలే చంపారనీ ఇవాల్టి దాకా అంటున్నారు. మావోయిస్టులను విమర్శించడంలో మామూలుగా అందరికంటే ముందుండే సంఘ్‌పరివార్ వారు ఇట్లా అంటున్నారంటే చంపింది క్రైస్తవులేనని నమ్మడంలో వారికి ఏదో ప్రయోజనం ఇమిడి ఉందనుకోవాలి. ఆ ప్రయోజనం ఏమిటంటే ఆ హత్యను కారణంగా చూపించి క్రైస్తవులపైన దాడులు చేయడం, ఆ దాడులను సమర్థించుకోవడం.

మూడు వారాల తర్వాత కర్నాటక రాష్ట్రంలోని మూడు పశ్చిమ జిల్లాలలో సెప్టెంబర్ 14వ తేదీన ఒకే సమయంలో 17 వేరు వేరు చర్చిలపైన దాడులు జరిగాయి. విధ్వంసం చేశారు. పాస్టర్లను తీవ్రంగా కొట్టారు. కొన్ని చర్చిలను పూర్తిగా నేలమట్టం చేశారు. అన్ని చోట్లా ముఖాలకు ముసుగులేసుకున్న వ్యక్తులు అయిదారు మోటార్ సైకిళ్ళపైన వెళ్ళి దాడిచేశారు. జై బజరంగ్‌బలి అనీ భారత్ మాతాకీ జై అని నినాదాలు ఇచ్చారు. దాడి చేసింది బజరంగ్‌దళ్ కార్యకర్తలే ననటంలో సందేహం లేదు. దీనినెవరూ కాదనడమూ లేదు.

ఈ దాడులు ఎందుకు జరిగినట్టు? 'న్యూ లైఫ్' అనే క్రైస్తవ సంస్థ హైందవ దేవతలను కించపరిచే ప్రచురణ తెచ్చిందనీ, మనసు గాయపడిన హిందువులు దాడి చేశారనీ సంఘ్ పరివార్ వ్యాఖ్యానం. ఒక మతం వారు మరొక మతాన్ని

విమర్శించేటపుడు కించపరిచే వ్యాఖ్యలు, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం అనుచితం అనడంలో సందేహం అక్కరలేదు. అయితే ఆ తప్పు చేసింది న్యూలైఫ్ అనే చర్చి కాగా దాడి చేసింది వారి మీద మాత్రమే కాదు. కాథొలిక్, బాప్టిస్టు, సిఎస్ఐ., పెంతెకోస్తు, సకల క్రైస్తవ శాఖల చర్చిలపైనా దాడి చేశారు. చర్చిలపైనే కాదు, మంగుళూరు పట్టణంలో క్రైస్తవ సన్యాసినులు బాహ్య ప్రపంచానికి శాశ్వతంగా దూరమై దైవ ధ్యానంలో కాలం గడిపే అడోరేషన్ సెంటర్‌పై కూడా దాడి జరిపారు. న్యూలైఫ్ వారు ప్రచారం చేశారని చెప్తున్న ప్రచురణ వారిదేనా, వారు దానిని ఉపయోగించి ప్రచారం చేసినట్టు ఫిర్యాదులేవయినా ఉన్నాయా అని స్థానిక ఐ.జి.ని ప్రశ్నిస్తే ఫిర్యాదులేవీ లేవనీ, ఆ ప్రచురణ ఎవరిదన్న విషయం ఇంకా పరిశోధనలో ఉందనీ అంటున్నారు. పోనీ అన్నీ వారు చెప్పినట్టే అనుకొన్నా మనుసు దెబ్బతిన్న హిందూ ప్రజలు వారంతట వారు ఒకే రోజు ఒకే ఘడియలో దక్షిణ కన్నడ, ఉడిపి, చిక్‌మగళూరు అనే మూడు వేరు వేరు జిల్లాలలో 17 చర్చిలపైన దాడులు చేశారనడం నమ్మదగ్గ విషయమేనా? న్యూలైఫ్ అనే సంస్థ కొంతకాలంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టి నడుపుతుండగా, దానివల్ల మనసు గాయపడ్డ హిందువులు రాష్ట్రంలో యెడ్యూరప్ప ప్రభుత్వం ఏర్పడేదాకా ఎందుకాగినట్టో !

ఒక పద్ధతి ప్రకారం బజరంగ్‌దళ్ చేసిన దాడికి ఇది కూడా ఒక సాకేనని అర్థం అవుతుంది.

ఒరిస్సాకు తిరిగి వద్దాం. లక్ష్మణానంద సరస్వతి సంస్కర్త అనీ, ఆదివాసులకు చదువు చెప్పే పాఠశాలలు నెలకొల్పాడనీ, శుభ్రంగా ఆరోగ్యంగా బతకడానికి కావలసిన నియమాలు నేర్పాడనీ అంటున్నారు.క్రైస్తవ మిషనరీలూ అదేపని చేశారు మరి. వారిని తప్పుపట్టడం ఎందుకు? వారు ప్రజలను ఆకర్షించి క్రైస్తవంలోకి చేర్చుకోవటం కోసం సేవా కార్యక్రమాలు చేపట్టారని వారిపైన ఆరోపణ. లక్ష్మణానందకూ అదే వర్తిస్తుంది మరి. ఆదివాసులకు మంచి బతుకు నేర్పుతూ వారిలో హిందూమత వ్యాప్తికోసం ఆయన కృషి చేశాడు. హిందూ దేవుళ్ళ పూజలు ప్రవేశపెట్టాడు. బొట్లుపెట్టి జంధ్యంవేసి స్నానం చేయించి మాంసాహారాన్ని (ప్రత్యేకించి గోమాంసాన్ని) తినబోమని ప్రతిజ్ఞ చేయించాడు.

క్రైస్తవ మిషనరీలు దళితులను క్రైస్తవంలోకి తీసుకుపోతే మతమార్పిడి అయినప్పుడు, లక్ష్మణానంద ఆదివాసులలో హైందవాన్ని వ్యాపింపజేస్తే అది మతమార్పిడి ఎందుకు కాదు? ఆదివాసులు హిందువులు కారని సామాజిక పరిశోధనలే కాదు, చట్టాలు కూడ అంటాయి. మరి మతమార్పిడి క్రైస్తవ మిషనరీల విషయంలో తప్పయితే లక్ష్మణానంద చేసినప్పుడు తప్పెందుకు కాదు? ఈయన చేసింది ఒప్పయితే వారు చేసింది ఒప్పెందుకు కాదు?

ఈ మేరకు లక్ష్మణానంద సరస్వతికీ క్రైస్తవ మిషనరీలకూ తేడా ఏమీ లేదు. అయితే వారు చేయని పని అదనంగా ఈయనొకటి చేశాడు. క్రైస్తవం ఉనికినీ వ్యాప్తినీ బలప్రయోగంతో అడ్డుకోవడం ఒక కార్యక్రమంగా తీసుకొన్నాడు. 1971లో ఆయన కంధమాల్ జిల్లాలో తన కార్యకలాపాలు మొదలుపెట్టిన తరువాత క్రైస్తవులపైన తాను హైందవీకరించిన ఆదివాసులను రెచ్చగొట్టడం ఒకపనిగా పెట్టుకున్నాడు. దానికోసం కోందులకూ పాణోలకూ మధ్యనున్న వైరుధ్యాన్ని నిర్మొహమాటంగా వాడుకున్నాడు. ఈ మధ్య కాలంలో ప్రతీ సంవత్సరం గుడ్‌ఫ్రైడే, క్రిస్మస్ సంబరాలను అడ్డుకోవడం ఆయన అనుయాయులు తప్పనిసరిగా చేస్తున్నారు. పండగ దగ్గరికొచ్చినప్పుడు ఏదో ఒక అల్లరి చేస్తారు. పండగ సంబరాలు జరుపుకోవాలన్న ఉత్సాహాన్ని భయంతో కప్పేస్తారు. 2007 క్రిస్మస్ వేడుకలప్పుడు దరింగబాడీ బ్లాక్‌లోని బ్రాహ్మణిగావ్‌లో అక్కరకురాని వివాదం లేవదీసి జిల్లా వ్యాప్తంగా క్రైస్తవులపైన దాడులు చేశారు. ఒకపక్క ఈ పనులు చేస్తూ, తమతో సఖ్యత కోరుకున్నట్టయితే క్రైస్తవాన్ని విడిచిపెట్టి వెనక్కిరావాలని బలవంతం చేస్తున్నారు. ఈ 'ఘర్‌వాపసీ' (పునరాగమనం) కోసం లక్ష్మణానంద ఒక కర్మకాండను కూడ రూపొందించాడు. ఆవుపేడతో కలిపిన నీళ్ళు తాగాలి, గుండు గీయించుకొని స్నానం చేసి గుడిలో దండం పెట్టుకొని బైబిల్‌ను చింపేసి ఇంకెప్పుడయినా చర్చికిపోతే చచ్చిపోయినట్లేనని రాసివ్వాలి. ఇప్పుడు కంధమాల్ జిల్లా నుండి పారిపోయి వచ్చిన క్రైస్తవులు వెనక్కిపోయి తమ ఊర్లలో బతకదలచుకుంటే ఈ కర్మకాండను ఆచరించి హిందువులుగా మారాలన్నది బజరంగ్‌దళ్ పెడుతున్న షరతు. బిజెపి భాగస్వామిగా ఉన్న ఆ రాష్ట్ర ప్రభుత్వం ఈ దుర్మార్గాన్ని ఉపేక్షించడమేకాక, కాలిపోయిన, కూలిపోయిన ఇళ్ళు తిరిగి

కట్టుకోవడానికి సహాయం అందియ్యడం మాత్రమే తమ పని అనీ, వాళ్ళు ఆ తరువాత పోయి ఊర్లో ఉండవలసిందేననీ ఒత్తిడి పెడుతున్నది. వారిని బలి పశువులుగా అలంకరించి బజరంగ్‌దళ్‌కు అప్పగిస్తున్నది. దళితులను ఎన్నడూ హిందూ సమాజంలో భాగంగా చూడనివారు, అంటరానితనానికీ వెలివేతకూ జవాబుగా దళితులు ఎంచుకున్న క్రైస్తవ మతం నుండి వారిని బలవంతంగా వెనక్కి రప్పించడం ఒక గొప్ప కార్యక్రమంగా పెట్టుకున్నారు.

బలవంతపు మత మార్పిడులు, ప్రలోభాలు అంటూ వారు ప్రచారం చేసు కొంటున్నారు గానీ ఆ మేరకు ఒక్క కేసు లేదు, ఒక్క ఫిర్యాదు లేదు. ఇది భారత దేశాన్ని హిందూ దేశంగా, భారత రాజ్యాన్ని హిందూ రాష్ట్రంగా తయారు చేయడానికొక కుట్ర తప్ప వేరే ఏమీ కాదని ప్రజలు గుర్తించాలి. అమాయకులయిన ఆదివాసులనూ, ఇతర అణగారిన వర్గాలనూ దీనికి పావులుగా వారు ఉపయోగించుకుంటున్నారు. ఇది ఒరిస్సాలో మాత్రమే కాదు, ఇతర ప్రాంతాల లోనూ జరుగుతున్నది. ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుం సృష్టికర్త కాంగ్రెస్ నాయకుడు కావచ్చును గానీ దాని పోషకులు, దానిని ప్రభుత్వం చేతిలో సాధనంగా మలచుకున్నవారు ఆ రాష్ట్ర బిజెపి పాలకులు. మావోయిస్టుల అనుయాయులయిన ఆదివాసులకూ వారి రాజకీయ ప్రత్యర్థులయిన ఆదివాసులకూ మధ్యనున్న వైరుధ్యాన్ని వాడుకొని, ప్రత్యర్థి వర్గానికి ఆయుధాలిచ్చి, చంపే లైసెన్స్ ఇచ్చి బీభత్సకాండ సృష్టించారు. గుజరాత్‌లోని ఆదివాసీ ప్రాంతాలలో కిరాణా వర్తకులయిన బోహ్రా ముస్లింలపట్ల కిరాణా కొట్లో అప్పులు చేయకపోతే గడవని పేదలకుండే నిరసనను వాడుకొని ముస్లిం షాపులు లూటీ చేయించారు, తగలబెట్టించారు. కంధమాల్‌లో ఎస్‌టిలకూ వారి కంటే చదువులో కొంత మెరుగుగా ఉన్న ఎస్‌సిలకూ వైరుధ్యాలున్నాయి. క్రైస్తవ సంస్థలు తమ స్కూళ్ళనూ, ఆస్పత్రులనూ క్రైస్తవులకే ఎక్కడా పరిమితం చేయకపోయినప్పటికీ క్రైస్తవులయిన వారిలో చదువుపట్ల ఆసక్తి పెరగడం, చదువులో ప్రవేశం మెరుగుపడడం మామూలే. చదువుతో వచ్చిన తెలివి తేటలతో ఆదివాసుల భూములను పాణోలు స్వంతం చేసుకున్న ఘటనలు, దొంగ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందిన ఘటనలూ కొన్ని లేకపోలేదు. ప్రజా శ్రేయస్సు కోరేవారెవరయినా అణగారిన వర్గాల మధ్యనున్న

ఈ వైరుధ్యానికి చట్టపరమైన పరిష్కారమో, రాజీమార్గమో ఎంచుకుంటారు. కానీ సంఘ్‌పరివార్ అజెండా ప్రజా శ్రేయస్సు కాదు, సమాజంపైన తమ ఆధిపత్యం. అందువల్ల ఆ వైరుధ్యాన్ని వాడుకొని ఈ రక్తపాతం సృష్టించారు.

వారి లక్ష్యమైన హిందూ రాష్ట్రానికి అర్థం కేవలం మత రాజ్యం కాదు. కరుడుగట్టిన నిచ్చెనమెట్ల సమాజాన్ని రూపొందించి ఇండియాను సైనిక అగ్రరాజ్యంగా మలచడం. మనుధర్మాన్నీ పెట్టుబడిదారీ ధర్మాన్నీ రంగరించిన అసమ సమాజాన్ని నెలకొల్పి ప్రపంచంలో అగ్రరాజ్యంగా వెలుగొందడం. వికృతమైన ఈ లక్ష్యం దిశగా సాగుతున్న సంఘ్‌పరివార్ హింసాకాండను వ్యతిరేకించడానికి ప్రజాతంత్ర వాదులంతా ముందుకు రావాలని పిలుపునిస్తున్నాం.

# ఆదివాసీ సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలను తిరస్కరిద్దాం

**ఆదివాసీ ప్రజలారా ! ఆలోచనాపరులారా !**

చాలా ఆందోళన కలిగించే కరపత్రం ఒకటి ఈ మధ్య భద్రాచలం ఏజెన్సీలో ప్రత్యక్షమయింది. దీనిని ప్రచురించిన సంస్థ పేరు 'జనజాతి సురక్షామంచ్' (గిరిజన సంరక్షణ సమితి – ఆంధ్రప్రదేశ్) అట. క్రైస్తవమతం పుచ్చుకున్న ఆదివాసులకు ఎస్‌టి రిజర్వేషన్ హక్కు వర్తింపజేయకూడదనేది ఈ కరపత్రం సారాంశం. ఇది ఆదివాసులను క్రైస్తవులు, క్రైస్తవేతరులుగా విభజించి అంతర్గత వైషమ్యాలకు కారణం అవుతుందనడంలో సందేహంలేదు.

ఆదివాసుల ఐక్యత అత్యవసరమయిన ప్రస్తుత స్థితిలో ఈ వైషమ్యాన్ని రాజేయడానికి పూనుకున్న ఈ 'మంచ్' వెనక ఉన్నదెవరు? ఒక పక్క పోలవరం ప్రాజెక్టు, మరో పక్క సింగరేణి ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాలోని 12 మండలాలలో ఆదివాసుల జీవితాలను కల్లోలమయం చేస్తున్నాయి. వాటిని ఎదుర్కొనడానికి కావలసిన సంకల్పం, ఐక్యత వివిధ కారణాలవల్ల ఇప్పటికే కొరవడ్డాయి. ఐక్యతను మరింత బలంగా పెంపొందించవలసిన ఈ దశలో మతం ప్రాతిపదికన ఆదివాసులను చీల్చి అనైక్యతను పెంపొందిస్తున్న వీరెవరు?

ఎస్‌టి రిజర్వేషన్లలో 70 శాతాన్ని క్రైస్తవం పుచ్చుకున్న 18 శాతం మంది పొందుతున్నారనీ, 82 శాతంగా ఉన్న 'అసలైన వెనుకబడ్డ బీద గిరిజనులు' 30 శాతం రిజర్వేషన్ మాత్రమే పొందుతున్నారనీ ఈ కరపత్రంలో అన్నారు. ఇవి ఎవరు తీసిన లెక్కలు? ఏ ప్రాంతానికి చెందినవి? ఏ జిల్లాకు చెందినవి? ఎప్పుడు తీసినవి? అసలు సత్యం ఏమిటంటే ఆదివాసీ ప్రజలకు ఉమ్మడిగా ఇచ్చిన రిజర్వేషన్ హక్కులో సింహభాగం ఏజెన్సీ ప్రాంతాలకు వెలుపల నివసించే తెగలు, వెలుపలి నుండి ఏజెన్సీలోకి ఈ మధ్యకాలంలో ప్రవేశించిన తెగలు పొందుతుండగా అనాదిగా ఏజెన్సీలో ఉంటున్న ఆదివాసులు చాలా తక్కువగా పొందుతున్నారు.

---

మానవ హక్కుల వేదిక (HRF) కరపత్రం, 28.6.2009

దీనికి మతంతో ఏమీ సంబంధంలేదు. ఈ కారణంగా ఎస్‌టి రిజర్వేషన్‌ను వర్గీకరించాలని ఏజెన్సీలో నివసిస్తున్న ఆదివాసులు ఎప్పటినుండో డిమాండ్ చేస్తున్నారు. అది ఎవరి మీదా ద్వేషంతో చేస్తున్న డిమాండ్ కాదు. న్యాయం కోసం చేస్తున్నది. పైగా అది ఏజెన్సీ ఆదివాసుల ఐక్యతను బలపరిచే డిమాండు. వారి సంఘటిత శక్తిని పెంచే డిమాండు. దాని స్థానంలో ఐక్యతను బలహీనపరిచే ఈ డిమాండు ఎవరి ప్రయోజనాల కోసం తీసుకొస్తున్నారు?

మతం మార్చుకున్నా ఆదివాసులు ఆదివాసులుగానే గుర్తించబడతారని రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 కింద రాష్ట్రపతి జారీ చేసిన ఆదేశం చెప్తున్న సంగతి ఈ కరపత్రం వేసిన 'మంచ్'కు తెలుసు. అయితే ఆ ఆదేశాన్ని సవరించాలన్నది వీరి కోరిక. 'సుప్రీంకోర్టు చెప్పినా' ప్రభుత్వాలు సవరించడం లేదని అన్నారు. ఇది అబద్ధం. సుప్రీంకోర్టు ఎప్పుడు చెప్పింది? ఏ తీర్పులో చెప్పింది? అసలు రాష్ట్రపతి ఆదేశాన్ని సవరించమని ఆదేశించే అధికారం సుప్రీంకోర్టుకు లేదే. అధికారం లేని ఈ పని సుప్రీంకోర్టు ఎందుకు చేస్తుంది?

'హరిజనుల్లో మతం మారితే ఎస్‌సి జాబితా నుండి తొలగించివేస్తారు. మరి గిరిజనులకు అలా ఎందుకు లేదు?' అని ఈ కరపత్రం ప్రశ్నిస్తుంది. దళితులు ఏ మతానికి మారినా ఎస్‌సి రిజర్వేషన్ కోల్పోరు. బౌద్ధం, సిక్కు, జైన మతాలకు మారితే ఎస్‌సిలుగానే కొనసాగుతారు. క్రైస్తవం, ఇస్లాం పుచ్చుకుంటేనే ఎస్‌సి హోదా కోల్పోతారు. ఈ వివక్ష అన్యాయమనీ, దళిత క్రైస్తవులనూ దళిత ముస్లింలనూ కూడ ఎస్‌సిలుగా గుర్తించాలనీ ఇవ్వాళ దళిత సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజాతంత్ర శక్తులు సమర్థిస్తున్నాయి. దానికి విరుద్ధంగా ఆ వివక్షను ఆదివాసులలో ప్రవేశపెట్టాలని కోరడం ఏమిటి?

'మతం మారిన గిరిజనులు అటు అల్పసంఖ్యాకుల (మైనారిటీల) పేర, ఇటు గిరిజనుల పేర రెండు రకాల ప్రభుత్వ సౌకర్యాలు పొందుతున్నారు' అని ఈ కరపత్రం అంటుంది. మైనారిటీలుగా వారు పొందుతున్న 'ప్రభుత్వ సౌకర్యాలు' ఏమిటి? ఒక్కటైనా చెప్పగలరా? మైనారిటీలకు మైనారిటీలుగా భారతదేశంలో ఉన్న హక్కు ఒక్కటే. అది తమ సంస్కృతినీ, సంప్రదాయాలనూ కాపాడుకునే

హక్కు, తమ స్వంత విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకునే హక్కు. అయినా క్రైస్తవులెక్కడా కేవలం క్రైస్తవుల కోసమే విద్యాసంస్థలు ఏర్పాటు చేసుకోలేదు. క్రైస్తవ విద్యాసంస్థలలో అందరికీ ఎప్పుడూ సమానంగా ప్రవేశం ఉంది.

'గిరిజనుల మౌలిక విశ్వాసాలను, సంస్కృతిని, పరంపరాగత ఆచార వ్యవహారాలను పరిరక్షించి నిలపడమే తమ లక్ష్యం' అని ఈ కరపత్రం వేసిన వారు అంటున్నారు. అది గౌరవించదగ్గ ఆలోచనే. ఒకపక్క ప్రాజెక్టులు, గనులు, పరిశ్రమల కోసం భూసేకరణ, మరొకపక్క గిరిజనేతరుల భూమి దాహం ఆదివాసుల ఉనికిపైన పెద్దెత్తున దాడి చేస్తున్నప్పుడు ఆదివాసులు ఒక్కటిగా నిలబడి ప్రతిఘటించాలంటే తమ సాంస్కృతిక గుర్తింపునూ ప్రత్యేకతనూ కాపాడుకోవడం చాలా అవసరం. అయితే దీనికి క్రైస్తవ మతమార్పిడి ఒక్కటే విరోధి ఎందుకయింది? ఆదివాసుల 'పరంపరాగత ఆచార వ్యవహారాలకు' వ్యతిరేకంగా ఎన్ని హైందవ ఆచారాలూ, ఆలోచనలూ ఇవాళ ఆదివాసుల సంస్కృతిలోకి ప్రవేశించలేదు? పట్టణాలలో ఉద్యోగరీత్యా ఉంటున్న ఆదివాసులు పెళ్ళిళ్ళు, పండగలు ఆదివాసుల ఆచారం ప్రకారం కాక హైందవ సంస్కృతిని అనుసరించి చేసుకోవడం లేదా? ఇవాళ్టి ఆదివాసీ యువతరానికి హైందవ పురాణాలతో ఉన్న పరిచయం ఆదివాసీ గాథలతో ఉందా? ఇంకొంచెం చదువుకొని పెద్ద ఊర్లలో ఉంటున్నవారు పాశ్చాత్య సాంస్కృతిక రీతులకు లోనుకావడం లేదా? ఒక్క క్రైస్తవ మతమార్పిడినే ఎందుకు వేలెత్తి చూపాలి? భద్రాచలం హైందవ పుణ్యక్షేత్రం కాబట్టి ఆ ఊరినీ దానిచుట్టూ 10 కిలోమీటర్ల ప్రాంతాన్నీ ఏజెన్సీ చట్టాల పరిధి నుండి తొలగించాలని ఆ ఊరిలోని గిరిజనేతరులు చేస్తున్న డిమాండు ఆదివాసీ ప్రజల ఉనికిపైన, అస్తిత్వంపైన దాడికాదా? దాని గురించి ఈ 'మంచ్' ఏమంటుంది?

ఆదివాసీ ప్రజల ఐక్యత నిమిత్తం ఆదివాసీ సంస్కృతిపైన ఉన్న అన్ని అన్య ప్రభావాలనూ తిరస్కరించడానికి ఎవరైనా సూత్రబద్ధంగా కృషిచేసినట్టయితే, దాని సాధ్యాసాధ్యాల గురించి ఎంత సందేహం ఉన్నా ఆ కృషిని ఆదివాసీ ప్రజల మేలు కోరేవారందరూ గౌరవిస్తారు. కానీ ఒక్క క్రైస్తవాన్ని వేరుచేసి దానిపైన దాడిచేసే వైఖరిని హర్షించలేము.

ఎవరో తెలిసో తెలియకో ఒక కరపత్రం వేస్తే దాని గురించి ఇంత చర్చ ఎందుకుంటారేమో. ఇది తెలిసో తెలియకో వేసిన కరపత్రం కాదు. ఆదివాసీ సమాజాన్ని తమ అదుపులోకి తెచ్చుకోవడం కోసం దానిని రెండు వర్గాలుగా చీల్చి ఘర్షణలు పెట్టి హింసను రెచ్చగొట్టే అజెండా మన దేశంలో చాలాచోట్ల ఇప్పటికే అమలవుతున్నది. దీని వెనక ఉన్నది ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్‌లే. ఛత్తీస్‌గఢ్‌లో అది సల్వాజుడుం రూపం తీసుకుంది. దానిని మొదలుపెట్టింది కాంగ్రెస్ నాయకుడయినా అది ఆ రాష్ట్ర బిజెపి ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న విషయం తెలిసిందే. బిజెపి నాయకుడు వెంకయ్య నాయుడు మొన్నటి ఎన్నికలప్పుడు దేశంలో వారి కూటమిగాని అధికారంలోకి వచ్చినట్టయితే సల్వాజుడుంను ఆంధ్రప్రదేశ్‌లోనూ ఏర్పాటు చేస్తామన్నాడు. అది జరిగినట్టయితే ఎంత చేటు చేయగలదో భద్రాచలం ప్రాంతవాసులకు తెలుసు. ఎందుకంటే సల్వాజుడుం బాధితులు పెద్ద సంఖ్యలో భద్రాచలం డివిజన్‌కు వలస వచ్చి చావలేక బతుకుతున్న దీనస్థితిలో జీవితం వెళ్ళదీస్తున్నారు. ఒరిస్సా రాష్ట్రం కంధమాల్ జిల్లాలో అదే అజెండా వేరొక రూపంలో అమలయింది. ఆదివాసులను దళిత క్రైస్తవులపైకి రెచ్చగొట్టి అమానుషంగా దాడులు చేయించారు. అధికారిక లెక్కల ప్రకారమే 39 ప్రాణాలు పోయాయి, వేలమంది బలవంతంగా నిర్వాసితులయ్యారు.

ఆ అజెండా మరొక రూపంలో భద్రాచలంలో అమలు కావాలని మనం కోరుకుంటున్నామా? ఆదివాసీ సమాజం క్రైస్తవులు-క్రైస్తవేతరులు అంటూ రెండుగా చీలి ఘర్షించుకోవాలని కాంక్షిస్తున్నామా? ఆదివాసులలో ఈ సంఘర్షణ ఎవరికి మేలు చేస్తుంది? ఎల్‌టిఆర్ చట్టాన్ని సవరించాలని డిమాండ్ చేస్తున్న గిరిజనేతరులకు, ఆదివాసీ ప్రాంతాన్ని బలవంతంగా ఖాళీచేసి ఓపెన్‌కాస్ట్ బొగ్గుగనులు విస్తారంగా నెలకొల్పాలని చూస్తున్న సింగరేణి బొగ్గు గనుల కంపెనీకి, ఏడు ఏజెన్సీ మండలాలను ముంచి కింది ప్రాంతానికి నీళ్ళిచ్చే పోలవరం డ్యాం కడుతున్న ప్రభుత్వానికి తప్ప ఆదివాసులకేమైనా మేలు చేస్తుందా?

ఆలోచించమనీ, విచ్ఛిన్నకరమైన ఇటువంటి ప్రయత్నాలను తిరస్కరించమనీ ఆదివాసీ ప్రజానీకానికి మేము విజ్ఞప్తి చేస్తున్నాం.

**కె. బాలగోపాల్** (1952–2009) ప్రముఖ న్యాయవాది, మానవ హక్కుల వేదిక నాయకులు, రచయిత, వ్యాసకర్త.

భారతదేశంలో మతతత్వంపై ఆయన ఆలోచనల కూర్పు ఈ పుస్తకం.

“హైందవం గర్వంగా ప్రకటించుకునే విప్లవ సంప్రదాయమేమీ లేదు. అందువల్ల ‘హిందూత్వం’ పరమత ద్వేషంమీద మాత్రమే మనగలదు.”

“హైందవం ఏ రోజు ఏ రకమయిన విప్లవ పాత్రనూ నిర్వహించలేదు. అది ఆది నుండీ కూడా పాలకవర్గాల మతమే.”